భారతదేశమున

# బ్రిటిష్ రాజ్యతంత్ర యుగము

అను

# బ్రిటిష్ ఇండియా చరిత్ర

"ఈ ప్రమాణములు ప్రోగుచేయుటకు శ్రీ దిగవల్లి శివరావుగారి కెన్నియో యేండ్లు పట్టియుండును వీరిందుల కెన్నియో గ్రంథములు చదివియుందురు. తేనెపెర పెట్టుటకు తేనెటీఁగ కెంత కాలము పట్టునో అది యెన్నెన్ని పూలబడి తిరుగాడునో యెవరి కేమిపట్టె? ఎవరికిని తేనెపెరమీఁదనే పెరపెర. అట్టి తేనెపెర ఈ గ్రంథము."

[ శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి పీఠిక ]

దిగవల్లి వేంకట శివరావు

బెజవాడ

అన్నిహక్కులు గ్రంథకర్తవి

ప్రథమ ముద్రణము 2-10-1938

T
954.03
VSS B

University of Hyderabad
LIBRARY
Acc. No. 28919
Dated 29-8-87
Hyderabad - 500 134.

వెల రు 1-8-0

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల

బెజవాడ

ఓం

# పరిచయము

చరిత్రకారుఁడు సత్యశిల్పి. అతఁడు వాస్తవచరిత్రనే చిత్రించును. ఉన్నదున్నటులుగా చెప్పునదే చరిత్ర. అందు కల్లగాని కపటముగాని ఉండదు.

చరిత్రకారుఁ డనృతవాదిగాని పక్షపాతిగాని కాఁడు. అతఁ డట్టివాఁ డగునేని అతని జాతియంతయు అనృతమునఁబడి నీచజాతిగా మాఱును.

హిందూదేశము తెల్లవారిచేతులలోఁ బడెను. వారు తమ జయగీతములు పాడుకొనుచు నల్లవారిచేఁ గూడ పాడించు కొనిరి.

తెల్లవారు దొరలు, నల్లవారు బానిసలు. తెల్లవారు గురువులు, నల్లవారు శిష్యులు. తెల్లవారు గ్రంథకర్తలు, నల్లవారు అనువాదకులు.

చిన్ననాఁడు బడిలో నేను దేశచరిత్ర చదివితిని. హిందువులు నీచులనియు, తురకలు రాక్షసులనియు, తెల్లవారు దేవతలనియు నా కొక అభిప్రాయము కలిగెను. ఆ కాలమున నా తోడిబాలకు లందఱును ఈ చదువే చదివిరి.

"ఈ యేఁబది యేండ్లలో పుట్టిన దేశచరిత్రలకంటె నూఱు నూటయేఁబది యేండ్లకు మున్ను పుట్టిన దేశచరిత్రలలో ఏ యొండురెండో తక్క తక్కినవన్నియు పక్షపాతము లేని వనియు సమగ్రమయినవనియు సుప్రసిద్ధ చరిత్రకర్తలగు ఎడ్వర్డ్ థాంప్సన్, జి. టి. గారట్టులు వ్రాసిరి.

అసత్యము దాఁగదుగద. సత్యము లన్నియు పుంఖాను పుంఖములుగా బయటఁబడుచున్నవి. విశేషించి ఆంగ్లేయుల నోటినుండియే యివి వెలువడుచున్నవి. అట్టి సత్యముల పుట్టయే ఈ "బ్రిటిష్ రాజ్యతంత్రయుగము!"

ఈ ప్రమాణములు ప్రోవుచేయుటకు శ్రీ దిగవల్లి శివరావుగారి కెన్నియో యేండ్లు పట్టియుండును. వీ రిందుల కెన్నియో గ్రంథములు చదివియుందురు. తేనెపెర పెట్టుటకు తేనెటీఁగ కెంతకాలము పట్టునో అది యెన్నెన్ని పూలబడి తిరుగాడునో యెవరికేమిపట్టె? ఎవరికిని తేనెపెరమీఁదనే పెరపెర. అట్టి తేనెపెర ఈ గ్రంథము.

కుంఫిణీవారు హిందూదేశమును స్వాహాచేయువఱకును ఇచట పలువురు రాజులు నక్షత్రములవలె వెదఁజల్లఁబడినట్లుండిరి. వీర లందఱతోడను వీరి ప్రజలతోడను వీరి ధనముతోడను గల సంబంధమే యీ గ్రంథము. కావున నిది కలగూరగంపవలెను కప్పల తక్కెడవలెను ఉండక తప్పదు.

ఇచట నొక్కొక్క రాజున కొక్కొక్క చరిత్రయు ఒకొక్క దేశమున కొక్కొక్క రాజనీతియుకలదు. ఇట్టి రాజులు పలువురు. ఇట్టి నీతులు పెక్కు. ఇట్టి హిందూదేశచరిత్ర యొక మహారణ్యము. శ్రీ దిగవల్లి శివరావుగారు దివ్వెబూని ఈ యరణ్యమున నడచుచు నడుమ నడుమ మనకు పూవులను కాయలను పండ్లను గోసియిచ్చి మనలను నడిపించుచు తీసికొనిపోవుచున్నారు.

మన కందఱకును సామాన్యముగా—'తెల్లవారు కాలిడకముం దిచట నెందరు రాజులుండిరి ? ఇచట ఏలుబడి ఎటులున్నది ? ఇచటి ప్రజ యెట్టిది ? ఇది యడవి దేశమా అన్యమా ? ఇంగ్లీషువారు భుజబలముననే హిందూదేశమును జయించిరా ? తెల్లవారు కొల్లగొట్టిన ధనరాశి ఎచట మూల్గుచున్నది ? మ్యూటినీలు ఏలవచ్చెను? కిరస్తానీమత మెటులు చొచ్చెను ? అని యిటులు ప్రశ్నలనంతముగా తోఁచును. వీనికన్నిటికీ పుస్తకమున సరియగు ప్రత్యుత్తరములు మనము పడయఁగలము. ఇవికాక పంచాయతీల వినాశనము, బ్రిటిష్ వారి న్యాయవిచారణ, నూజవీడు అయోధ్య హైదరాబాదా బాకీలు, భూస్వామిత్వము, జమీందారీ రైతువారీ పద్ధతులు, శిస్తులు, మిషనరీలు, గాజుల లక్ష్మీనరుసుగారు జాన్ బ్రూస్ నార్టను, ఉద్యోగములు, కాంగ్రెసు మొదలగు వజ్రశకలము లెన్నియోగనులనుండి యెత్తఁబడి ఇందు ఉల్లేఖింపఁబడినవి. 'కాసటబసలే చదివి గాథలు త్రివ్వ తెనుంగువారికి' ఈ గ్రంథము ప్రామాణికమే కాక అభిరుచికిగూడ కాణాచి.

అమృతాంజనముతోఁ గాని కాఫీతోఁగాని పనిలేకుండ ఒకగుక్కలో ఈ చరిత్రము నంతయు చదువఁగలిగించిన శ్రీ దిగవల్లి శివరావుగారు అభినందనీయులు.

బెజవాడ,<br>ది 28—9—38.

వేలూరి శివరామశాస్త్రి.

# BIBLIOGRAPHY


The History of British India. (10 Vols.) 1858 —James Mill
The History of British Empire in India. (6 Vols.) 1841
Fifth Report. —Edward Thornton
The Indian Empire. (3 Vols.) —Montgomery Martin
A History of British India. —Sir W. W. Hunter
The History of Hindusthan. (3 Vols.) 1803 -Alexander Dow
The History of India. —Marshman
History of India. (2 Vols.) 1893 —Keene
Comprehensive History of India. (1865) —Beveridge
The Empire in India (1864) —Major Evans Bell
Retrospects and Prospects of Indian Policy (1868) ,,
A History of Military Transactions in Indosthan from the year 1745 (3 Vols) 1861. —Robert Orme
The History of India as told by its own historians —Sir H. M. Elliot & J. Dowson
The Rise of British Power in the East 1887 —Elphinstone
The Company and the Crown —Hovell Thurlow.
Empire in Asia, How we came by it; A Book of Confessions —W. M. Torrens
Reform Pamphlets.
The Oxford History of India. —Vincent A. Smith
A History of British India. —P. E. Roberts
Rise of Christian Power in India. —Major B. D. Basu
Consolidation of Christian Power in India. ,,
India under the British Crown. ,,
Rise and Fulfilment of British Rule in India. —Edward Thompson and G. T. Garratt
British Expansion in India. — Anderson and Subedar
The Imperial Gazetteer of India. (Vols. I to IV)
A Constitutional History of India. —Prof. A. B Keith
Speeches and Documents on Indian Policy. (Vols. I & II) ,,
Collected Works. —Edmund Burke
Impeachment of Warren Hastings. —Edmund Burke
The Law of Civilisation and Decay. —Brooks Adams
Annals of the East India Company. (3 Vols.) —John Bruce
Plans for British India. —J. Bruce

Outlines of English Industries. —Cunningham & McArthur
History of the Afghans. (1838) —G. P. Ferrier
Life of Clive. —Malcolm
Considerations on Indian Affairs. (1772) — William Bolts
The Making of British India. —Muir
View of the Rise of the English Government in Bengal.
Bishop Heber's Journal. [—H. Verelst
Political and Military Transactions in India. —Prinsep
Speeches (1878) —John Bright
History of British India. (2 Vols. 1859) —Ludlow
Thoughts on the policy of the crown towards India. „
Essay on Clive. —Macaulay
Essay on Warren Hastings. —Macaulay
Rise of the Mahratta Power. — M. G. Ranade
History of the Mahrattas. —Grant Duff
Mughal Administration. —J. N. Sarcar
History of the Great Mughals. —Kennedy
Sher Shah. —K. Quanungo
A Memoir of Central India. — Sir John Malcolm
History of Bengal. —Captain Stewart
Administration of Justice under the Muslim Rule.
Rulers of India series. [—Wahed Hussain
India under Early British Rule. —Romesh Chunder Dutt
The Economic History of India. „
The Victorian Age. „
Private Journal of Moira (Lord Hastings)
Wellesley Correspondence. —Garwood
War with Tippu. — Major Edward Moor
Narrative of War with Tippu Sultan. —Dirom
England's Quest of Eastern Trade. —Foster
The first Englishmen in India. —R. C. Locke
Vestiges of Old Madras. —H D. Love
Echoes from Old Calcutta. —H. E. Busteed
Life of Sir Thomas Munro. (3 Vols) 1831 —G. R. Gleig
India: its administration and progress. —Sir John Strachey
Diary of Ananda Ranga Pillai .(12 Vols)
Private Letters of Marquess of Dalhousie. —J. G. A. Baird
The Marquis of Dalhousie's Administration of British India.
—Sir Edwin Arnold

The story of my life. —Meadows Taylor
The History of the Indian Mutiny. —Charles Ball
My Diary in India. —Sir Howard Russell
History of the Indian Mutiny. —Kaye and Malleson
The Indian Mutiny of 1857. —Col. G. B. Malleson
The Expansion of England. — J. R. Seeley
The New Spirit in India. —H. W. Nevinson
India. —Keir Hardy
New India. —Sir Henry Cotton
Prosperous British India. —Sir. W. Digby
Lord Curzon, a failure. —C. J. O'Donnel
Recollections. —Lord Morley
The Awakening of India. —Ramsay Macdonald
Young India. —Lala Lajpat Rai
Unhappy India. "
England's debt to India. "
Forty one years in India. —Lord Roberts
A Nation in the Making. —Surendranath Bannerjee
An Indian Diary. —E. S. Montague
An authentic account of the condition of the Ryot-submitted to the Secretary to the Board of Control (1854.)
Indian Nation Builders. (3 Vols.) [—John Bruce Norton
Mahatma Letters. —A. P. Sinnet
Letters of Madame H. P. Blavatsky to A. P. Sinnet.
How India Wrought for Freedom. —Dr. Annie Besant
Indian National Evolution. — A. C. Muzumdar
History of the Indian National Congress. —Dr. Pattabhi.
Life and Experiences of a Bengali Chemist.—Dr. P. C. Ray
Speeches and Writings of Gokhale; Lokamanya Tilak. Naoroji; Surendranath Bannerjee; & Mahatma Gandhi.
Presidential Addresses of the Indian National Congress.
Biographies of Eminent Indians —G. A. Natesan & Co.
Eminent Orientalists "
Biographies (in Telugu)- Ch. Lakshmi Narasimham garu.
The Modern Review.

# విషయసూచిక.

## ప్రథమభాగము

## ఇంగ్లీషు దొరతనము : చారిత్రక సమీక్ష

## 1600—1937

### మొదటి ప్రకరణము


**బ్రిటిష్‌యుగమునకు పూర్వమునాటి భారతదేశస్థితి** 1-20

I మహమ్మదీయ యుగమునాటి ఔన్నత్యము 1-6

ఫిరోజిషా (1351-94) నాటి భారతదేశస్థితి 2

నికోలో కోంటీ (1420) బార్బోసాల వర్ణనలు 2-3

మహమ్మదు బిన్ తోగ్లక్ (1340-50) నాటిస్థితి 3

బేబరు చక్రవర్తి చూచిన సంగతులు 3

విజయనగరము, మధురానగరము, మలబారులను
దర్శించిన పాశ్చాత్యుల వర్ణనలు 4

షర్రా పరిపాలన - పోర్చుగీసు వర్తకులు (1497)
చూచినకల్లికోట 5

17 వ శతాబ్దిలో బెర్నియరుచూచిన భారతదేశము 6

II కృష్ణదేవరాయల విజయనగర సామ్రాజ్యము 6-9

III మొగల్‌సామ్రాజ్యము 9-16

మొగల్ చక్రవర్తుల విభవము; అక్బరు, షాజహాన్
ఔరంగజేబుల ధర్మము; న్యాయపరిపాలన 11-16

IV మహారాష్ట్రపరిపాలన ప్రాశస్త్యము 16

V మొగల్ సామ్రాజ్యాస్తమయము 18-20

రెండవ ప్రకరణము


**బ్రిటిషు ఇండియా నిర్మాణము** **21-49**

I బ్రిటీష్‌వారీదేశము నాక్రమించిన విధము 21-25
అంగ్లేయులకు రాజ్యకాంక్ష ఎప్పుడుకలిగెను? 21-22
అంగ్లేయులీదేశమును భుజబలమున జయించిరా? 22-23
రాజ్యాక్రమణములోని రాజ్యతంత్రము 23-25

II "బ్రిటిష్‌ఇండియా" నిర్మాణచరిత్ర 26-49

తంజావూరు కథ 27
కర్ణాటకనవాబు కథ 27-29
అంగ్లరాజ్యాధిపత్యమున అయోధ్యకర్ణాటకముల దుర్గతి 30-31

III మైసూరు 32-35
IV వంగరాష్ట్రము 35-38
V అయోధ్య 38-40
VI మహారాష్ట్రరాజ్యములు 40-44
VII పశ్చిమోత్తరపరగణా 45-46
VIII భరతపురము 46-48
బ్రిటీష్‌వారి వశమైన దేశముయొక్క స్థితి. 48-49


మూడవ ప్రకరణము


**స్వతంత్రరాజులు సామంతులగుట** **50-71**

I స్వదేశసంస్థానముల సమస్య - పరిణామము 50-56
కంపెనీవారి ఆశ్రయింపు పద్ధతి; స్వసంరక్షణపద్ధతి. 51

ఫ్రెంచియుద్ధములందు పరస్పర సహాయ సంధి 52-53
శాశ్వత మధ్యస్థరాజ్య నిర్మాణము. 54-55
మొగల్ చక్రవర్తి సార్వభౌమత్వము. 55
II వెల్లస్లీ పన్నినకుతంత్రములు 56-61
టిప్పు సుల్తానుకు వెల్లస్లీ వ్రాసిన లేఖ. 59-61
III హేస్టింగ్సునాటికి వచ్చిన మార్పులు 61-65
రాజులవర్జా-పరిపాలన-రెసిడెంట్ల అధికారము.
సంధి షరతులలో మార్పులు. 64-65
IV సిపాయి విప్లవమునాటి సంస్థానములస్థితి 66-69
V జాతీయోద్యమము - సంస్థానాధీశులు 69-71

## నాలుగవ ప్రకరణము

**బ్రిటిషు ప్రభుత్వతత్వము 72-89**
I మహమ్మదీయ - ఇంగ్లీషు ప్రభుత్వములు 72-75
II బ్రిటీషుపరిపాలన - భారతీయులు 75-82
ఇంగ్లీషు దొరతనమున నేటీవులకుద్యోగములు-
సర్ తామస్ మన్రో చెప్పిన మాటలు. 75-76
మహమ్మదీయపాలనలో హిందూఉద్యోగులు. 77-79
దొరల వైఖరిలో మార్పు. 79-80
మన్రో స్ట్రాచీలు చెప్పిన మాటలు. 80-82
III పూర్వపు గ్రామపంచాయతీల వినాశనము 82-85
దీనినిగూర్చి మన్రో చెప్పినమాట 83-84
ఇంగ్లీషు జిల్లా అధికారి పరిపాలన 84-85
IV బ్రిటిష్ న్యాయవిచారణ 85-88
ఆంగ్ల పద్ధతియొక్క స్వభావము 85-86
ఇంగ్లీషు కోర్టులు-హేస్టింగ్సు అభిప్రాయము 86-87

V జలాధారములు 88-89
మహమ్మదీయ పరిపాలనలో వ్యవసాయాభివృద్ధి. 88-89
ఇంగ్లీషువారి ఉపేక్షనుగూర్చిన దొరల వర్ణనము. 89

ఐదవ ప్రకరణము

**భారతదేశమువలన ఇంగ్లాండు బాగుపడిన విధము 90-103**
I భారత దేశవర్తకము;-బంగారు - ప్రవాహము 90-96
ఐరోపా దేశమునుండి బంగారు మీదేశమునకే వచ్చుచుండుట. అనాటి వర్తకలాభములు 90-91
అనాటి ఇంగ్లాండు ఐరోపాల ఆర్థిక దుస్థితి. 91-92
1757 మొదలు ఇంగ్లండువారు భారతదేశ ధనమును దోచుకొనుట. 92-94
ఈ దోపిడిసొమ్మే ఇగ్లాండుకు మూలధనము 94-95
కంపెనీపరిపాలనలో భారతదేశము దారిద్ర్యమునబడగా ఇంగ్లాండు బాగుపడుట. 95-96
II క్లైవు వారన్ హేస్టింగ్సులు చూపిన దారి 96-99
యుద్ధములందు దోపిడి, ఇతరవిధములగు కొల్ల. 97-99
III సిపాయిల విప్లవానంతరపు పద్ధతులు 99-101
IV భారత దేశప్రభుత్వము - చిత్రమైనఖర్చులు 101-103

ఆరవ ప్రకరణము

**ఇంగ్లీషు దొరతనము 104-123**
I తిరుగుబాటుల నణచుటలో క్రూరవిధానములు 104-106
II ఆంగ్లేయుల నిరంకుశత్వము; కులతత్వము 107-115
ఇంగ్లీషు ఉద్యోగుల అహంభావము 107-108
ప్రభుత్వయంత్ర శాఖలు - తెల్లదొరలు 109-112

ప్రభుత్వపద్ధతి; ప్రజలదుస్థితి. 113-115
III ఇంగ్లీషుదొరతనము గట్టిచేసికొనుట 115-118
సైన్యము, నిర్బంధశాసనములు, వలస, సామ్రాజ్య తత్వము. ,,
IV విడదీసి పాలించు రాజ్యతంత్రము 119-123
హిందూ మహమ్మదీయుల పూర్వ మైత్రి. 120
మహమ్మదీయ పరిపాలనమున హిందువులు. 121
నేటి హిందూమహమ్మదీయ మిత్రభేదము. 122-123

## ఏడవ ప్రకరణము

**మర్యాదలలో మార్పులు** **123-135**
I ఇంగ్లీషుదొరల వైఖరి 123-131
మొగలుచక్రవర్తి పట్ల ప్రజలపట్ల దొరలు మొదట చూపిన మర్యాదలు. 123-129
తరువాత దొరల వైఖరిలో వచ్చినమార్పులు, దీనినిగూర్చి డల్ హౌసీ వ్రాసిన లేఖ. 129-131
II దొరల జీవితవిధానము 131-133
ఆహారవిహారములు- త్రాగుడు-వ్యభిచారము. లంచగొండితనము-ఋణములు. ,,
III దేశపరిపాలనమున క్రైస్తవమత పక్షపాతము, 133-135
క్రైస్తవమత బోధకుల పలుకుబడి-మిషనరీలు అధికారులుకలసిచేయు అన్యాయములు. 133-134
న్యాయవిచారణలోని అన్యాయములు. 134-135

## ద్వితీయభాగము

## ఇంగ్లీషుదొరతనము : కంపెనీరాజ్యము

## 1600 - 1857

### మొదటి ప్రకరణము

**ఇంగ్లీషు వర్తకసంఘము** **136-149**

I ఐరోపావర్తకులు ఇండియాకు వచ్చుట 136-144

పోర్చుగీసువారు - డచ్చివారు - ఫ్రెంచివారు. 137

ఆంగ్లేయ వర్తక కంపెనీ చరిత్ర. 138-144

II రీజెంటు వజ్రముకథ 144-145

III రాజ్యతంత్ర ప్రారంభము 145-147

IV ఫ్రెంచివారపజయముపొందుటకు కారణము 147-149

### రెండవ ప్రకరణము

**క్లైవు చూపినదారి** **149-172**

I లాభసంపాదన పద్ధతి 149-155

సురాజ్‌ద్దౌలాపట్ల క్లైవు చేసిన ద్రోహము. 150-151

క్లైవు చేసినఫోర్జరీ-మీర్జాఫరుతో కుట్ర. 151

క్లైవుపొందిన లాభము. 151-154

దివానీగిరి. 154

మీర్ఖాసీమువల్ల సొమ్ము పుచ్చుకొనుట. 154-155

II అన్యాయపు వ్యాపారము; ప్రజాపీడనము 155-161

మీర్ఖాసీము దొరలవలనపొందిన బాధలు-
దొరల మోసములు - అక్రమములు. 156-158

దొరల అన్యాయములు-బోల్ట్సువర్ణనము. 158-160

మీర్ఖాసీమును తొలగించుట-మీర్జాఫరు కీలుబొమ్మ 161

III క్లైవుయొక్క రెండవ పరిపాలననాటిస్థితి 162-165
అరాజకము-కల్లోలము-లంచగొండితనము. 162
దళారీవర్తకుల చర్యలనుగూర్చి క్లైవులేఖలు. 163-165
IV క్లైవుతరువాత స్థితిగతులు 166-172
క్లైవు లోపాయికారీ భాగస్వామ్యము. 166
1772 నాటి కంపెనీవర్తకుల అన్యాయము 167-168
ఈవిధానములోని అనర్థకములు. 169-170
వంగరాష్ట్రమున ఘోరమైన కఱవు. 171-172

## మూడవ ప్రకరణము

**వారన్ హేస్టింగ్సు ఘనకార్యములు 172-181**
I రాజకీయ సంస్కరణములు 172-174
II కుటిల రాజ్యనీతి 174-178
కంపెనీ ఖజానా నిండించుట. 175
రోహిలఖండమును దోపిడి చేయించుట. 175-176
నందకుమారు నురిదీయించుట. 176-177
అయోధ్యరాణులను పీడించుట. 177-178
III వారన్ హేస్టింగ్సు చర్యల విచారణ 178-181
బర్కు నేరారోపణ-వారన్ హేస్టింగ్సువిడుదల. ,,

## నాలుగవ ప్రకరణము

**దొరల వడ్డీవ్యాపారము 181-193**
I దొరలు అవలంబించిన పద్ధతులు 181-183
II ఆర్కాటునవాబు బాకీలు 183-188
ఋణదాత బెన్‌ఫీల్డు. మద్రాసు గవర్నరుగతి. 184-186
అవినీతిపరులగు దొరలు. 186-187

III నూజివీడు జమీందారు బాకీలు. 188-189
IV అయోధ్యనవాబు బాకీలు 190-192
V హైదరాబాదు నైజాంగారి బాకీలు 192-193

ఐదవ ప్రకరణము

**ఆంగ్ల గవర్నరు జనరలుల దొరతనము** **193-215**
I కారన్‌వాలీసు 193-196
II వెల్లస్లీ 196-200
III హేస్టింగ్సు 200-202
IV ఉదారరాజ్యనీతిజ్ఞులు 202-205
మనోరేఖ. 204-205
V విలియం బెంటింక్ 205-208
VI డల్‌హౌసీవరకు గల రాజ్యనీతి 208-209
VII డల్‌హౌసీ ప్రైవేటులేఖలు - రాజనీతి 210-215

ఆరవ ప్రకరణము

**రాజ్యాంగ నిర్మాణము** **215-240**
I తూర్పుఇండియావర్తక కంపెనీ కథ 215-220
II దివానీగిరీ - దొరతనము 220-222
1767 సం॥ కంపెనీ పట్టాచట్టము. 222-223
1773 సం॥ రెగ్యులేటింగు అక్టు. 224-227
1784 సం॥ కంపెనీచట్టము. 227-229
III 1797 వ సం॥ కంపెనీ సన్నదుచట్టము 229-232
IV 1813 వ సం॥ కంపెనీ సన్నదుచట్టము 232-237

V 1833 వ సం|| కంపెనీ రాజ్యాంగచట్టము 237-240
1853 వ సం|| కంపెనీ పట్టాచట్టము. 240

## ఏడవ ప్రకరణము

**భూమిశిస్తుల నిర్ణయము: వసూలు 241-259**
I కర్షకులస్థితిగతులు 241-246
మొగలాయి పరిస్థితులు. 241-242
ఇంగ్లీషు ప్రభుత్వ పద్ధతులు. 242-243
భూస్వామిత్వము. 244
కోర్టు వ్యాజ్యములు-దారిద్ర్యము-ఋణగ్రస్తత. 245-246
II భూమిశిస్తుల చరిత్ర 246-255
జమీందారీపద్ధతి- రైత్వారీపద్ధతి. 247
శిస్తుల నిర్ణయము, వసూలు. 248-251
శిస్తులరేట్లు - కరవులు. 251-252
రైత్వారీ శిస్తులవసూలులోని చిత్రహింసలు-
మద్రాసు టార్చర్ కమిటీ విచారణ 253-254
III రివిన్యూ పరిపాలన 255-259
మద్రాసు ఉదాహరణము. 255
జిల్లా-తాలూకా-గ్రామపరిపాలన. 255-256
రివిన్యూపరిపాలనలోని అన్యాయములు. 256-259

## ఎనిమిదవ ప్రకరణము

**సివిల్ క్రిమినల్ న్యాయవిచారణ 259-275**
I ఇంగ్లీషుకంపెనీ న్యాయవిచారణ పద్ధతి 259-263
మొదటిరోజులలోని స్థితి; రిగ్యులేటింగు అక్టు
స్థాపించిన అంగ్లధర్మశాస్త్ర పద్ధతులు. ,,

II కారన్ వాలిసుచేసినసంస్కరణములు 263-268
సంస్కరణముల తబ్సీలు. 263-264
వ్యాజ్యములపిచ్చు, కోర్టులలోని కష్టములు. 264-266
పోలీసుల తెలివితేటలు - నీతినియమములు 266-267
దొరల దౌర్జన్యములు - కలెక్టరుల పరిపాలన. 267-268
III న్యాయవిచారణ - 1813 నాటి లోపములు 269-271
IV 1833 నాటి సంస్కరణములు 271-273
లాకమిషనర్, లా మెంబర్, మెకాలే-శాస్త్ర
ధర్మముల క్రోడీకరణము- వానిస్వభావము. ,,
V సర్ తామస్ మన్రో-మద్రాసు సంస్కరణములు 273-275
1816 నాటి మద్రాసు రెగ్యులేషనులు. 273-274
బొంబాయిలో ఎల్ఫిన్ స్టన్ పరిపాలన. 274

తొమ్మిదవ ప్రకరణము

**ఇంగ్లీషు చదువులు 275-279**
I పూర్వపు పంచాయితీలు; వీధిబళ్ళు 275-276
ప్రజల అక్షరజ్ఞానము 276-277
II ప్రాతసంస్థల వినాశనము; క్రొత్తచదువులు 277-278
III దొరల నిజోద్దేశము - వైజ్ఞానిక దాస్యము 278-279
చాకబారు నేటివు నౌకర్ల సృష్టింపు. 279

పదియవ ప్రకరణము

**కంపెనీ పరిపాలనయొక్క ఫలితములు 280-288**

I ఇంగ్లాండులోని రిఫారంసొసైటీ ప్రచురణ 280-288
1833 మొదలు 1853 వరకు కంపెనీ పరిపాలనలో దేశశాంతి - ప్రభుత్వ వ్యయము - ప్రజోపయుక్తములగు పనులు - వాని విలువ - పన్నులపద్ధతి. 280-282
II దేశప్రజల అభివృద్ధి 282-284
శిస్తులపద్ధతి, కోర్టుల న్యాయవిచారణ-పోలీసు 282-283
విద్యాపద్ధతి. 284
ఉద్యోగములలో పక్షపాతము. 284-285
III దేశప్రజల అసంతృప్తి; ఆందోళనము 286-288
ఆంగ్లేయుల ఉపేక్షాభావము. 287-288

పదునొకండవ ప్రకరణము

**దేశోద్ధరణ ప్రయత్నములు 288-316**

I మహానుభావులగు దొరలు 288-291
బర్కు, బ్రైట్, బ్రాడ్లా, హ్యూము గార్లు. 289-290
II రాజా రామమోహనరాయలు 291-293
III పత్రికాప్రచురణము - హరిశ్చంద్రముఖర్జీ 293-295
IV వంగరాష్ట్రమున క్రిస్టోదాస్‌పాల్ 295-298
V చెన్నపట్టణమున లక్ష్మీనరసు సెట్టిగారు 298-316
క్రిసెంటుపత్రిక - చెన్నపట్టణ స్వదేశసంఘము. 299-300
స్వధర్మరక్షణము- రాజకీయాందోళనము. 300-302

మిషనరీల యోగడములు-దొరలఅన్యాయములు 303-304
శిస్తులవసూలులోని అన్యాయములు. 305-306
లక్ష్మీనర్సు - జాన్ బ్రూస్ నార్టన్ గార్ల నివేదికలు. (1852-1854) 306-309
లక్ష్మీనర్సుగారి రాజ్యనీతి. 310-311
లక్ష్మీనర్సుగారి దేశసేవ. 312-314
చరిత్రరచన - వైజ్ఞానిక పారతంత్ర్యము. 315-316

## పండ్రెండవ ప్రకరణము

**భారతదేశ స్వాతంత్ర్య విప్లవము** **316-336**

I కంపెనీ పరిపాలన పట్ల అసంతృప్తి 316-324

దేశీయరాజులందు, ప్రజలందు అసంతృప్తి. 316-318
(పీష్వా) నానాసాహెబుకు జరిగిన అన్యాయము. 319
అజీముల్లాఖాన్ సీమకు రాయబారము. 319-320
ఝాన్సీరాణికి జరిగిన అన్యాయము. 321
సిపాయి విప్లవమునకు ముఖ్యకారణములు. 322-323
పార్లమెంటువారి ఉపేక్ష. 323 324

II విప్లవవ్యూహములు 324-325

విప్లవము విఫలమగుట. 326
దొరల యత్యాచారములు. 327-328

III ఇంగ్లీషువారు కన్నులు తెరచుట 328-331

సంస్కరణములను గూర్చిన వాగ్దానములు.

IV విక్టోరియారాజ్ఞి ప్రకటన 331-336

## తృతీయభాగము

# ఇంగ్లీషు దొరతనము : సామ్రాజ్యతత్త్వము

## 1858 - 1937

### మొదటి ప్రకరణము

**జాతీయ చైతన్యము** **337-352**

I నవీన దాస్యశృంఖలములు 337-340

ఆంగ్లప్రభుత్వము చేసిన కట్టుదిట్టములు -

ఆర్థిక పద్ధతి - సివిల్ క్రిమినల్ వ్యవహారములు. 337-338

ప్రభుత్వోద్యోగుల నిబంధనలు. 339

నిరోధక శాసనములు. 339-340

II రాజకీయపరిజ్ఞానము 340-345

విద్యాభివృద్ధి-పత్రికాప్రచురణ-రాజకీయసభలు 340-341

సురేంద్రనాథ బెనర్జి - తిలకు మహారాజా. 341-345

III కాంగ్రెసు మూలపురుషుడగు ఏ. ఓ. హ్యూము 345-349

IV విజ్ఞానవికాసము - దివ్యజ్ఞాన సమాజము 349-352

### రెండవ ప్రకరణము

**వందేమాతరం** **353-374**

I కాంగ్రెసు ప్రచారము - ప్రభుత్వాచర్యలు 353-354

రాజద్రోహమునకు లోకమాన్య తిలకు శిక్షింపబడుట.

II కర్జను చేసిన ఉపకారములు 357-361

III "వందేమాతరం" - సూరతుకాంగ్రెస్ 361-364

వందేమాతరం - గోఖలేగారు-భారతదేశమున

మొదట లాటీచార్జి 363-364

IV ఆంధ్రదేశమున వందేమాతరోద్యమము 364-370

V దారుణవాదము. (టెర్రరిజం) 370-374

వంగరాష్ట్ర యువకుల విప్లవోద్యమము 370-371

ప్రభుత్వ నిర్బంధ విధానములు, అరవిందఘోషు

తిలకు; లజపతిరాయి; అజితసింగులప్రవాసము 371-373

## మూడవ ప్రకరణము

**హోంరూల్ స్వరాజ్యోద్యమము** **374-380**

I రాజకీయ పరిస్థితులు 374-375

II బ్రిటిష్ సామ్రాజ్యము 375-376

III అనీబిసెంటుగారి హోంరూలు ఉద్యమము 376-377

IV ఐరోపాసంగ్రామ ఫలితములు 377-378

V రాజ్యాంగ సంస్కరణల వాగ్దానము 378-380

## నాలుగవ ప్రకరణము

**ఖూనీభాగ్** **380-391**

I రౌలటుబిల్లులు 380-382

II ఖూనీబాగ్ (జలియన్‌వాలాబాగ్) 382-384

III 'మార్షల్‌లా' - అక్రమములు 384-388

IV సహాయనిరాకరణము 388-391

## ఐదవ ప్రకరణము

**మాంటేగూ సంస్కరణముల నాటకము** **391-399**

I రాజ్యాంగ విధానములోని లోపములు 391-392

నిరంకుశ కేంద్రపరిపాలన. 392-394

శాసనసభకు పరిపాలక వర్గమునకు సంఘర్షణ. 394-395

II రాష్ట్రీయ పరిపాలకవర్గము 395-397

III కాంగ్రెస్ స్వరాజ్యపక్షము 397-399

## ఆఱవ ప్రకరణము

**గాంధీ సత్యాగ్రహము - ఇర్విన్ సంధి** **399-412**

I అధినివేశస్వరాజ్యము 399-402

ప్రపంచ పరిస్థితులు- సామ్రాజ్య పరిస్థితులు- భారతదేశ ప్రజలకాశలుగొల్పుట ప్రభుత్వ వాగ్దానములు.

II సైమన్ కమిటీభాగవతము 402-405

III పూర్ణస్వరాజ్య ప్రకటన; ఉప్పుసత్యాగ్రహము 405-408

IV మొదటి రౌండుటేబిల్ సభ 408-410

V గాంధీ ఇర్విన్‌సంధి 411-412

## ఏడవ ప్రకరణము

**కాంగ్రెసు అజ్ఞాతవాసము** **412-417**

I ఇంగ్లాండులో కన్సర్వేటివు ప్రభుత్వము 412

II విల్లింగ్డన్ దొరతనము 413-414

III కాంగ్రెసు పరువు ప్రతిష్ఠలు-గాంధీమహాత్ముడు 414-15
IV నిర్బంధవిధానము - సత్యాగ్రహము 415-16
V కాంగ్రెస్ నణచుటకు విల్లింగ్డన్ జరిపినచర్యలు 416-17

ఎనిమిదవ ప్రకరణము

**కాంగ్రెసు ప్రభుత్వోదయము** **417-426**
I కాంగ్రెసు నేల అణచివేయవలసివచ్చెను? 417-419
II కాంగ్రెస్ పలుకుబడి 419-422
బీహారుభూకంపము 419-420
కేంద్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ విజయము. 420-421
కాంగ్రెసు సువర్ణోత్సవము. 422-423
III నూతన రాజ్యాంగము-కాంగ్రెసు 423-425
కాంగ్రెసు ఎన్నికల పరిణామము. 424-425
IV కాంగ్రెస్ ప్రభుత్వోదయము 425-426

బ్రిటిష్ రాజ్యతంత్రయుగము

**సంవత్సరములవారీ చరిత్ర** **427-440**

భా ర త దే శ ము న

# బ్రిటిష్ రాజ్యతంత్రయుగము

## ప్రథమ భాగము:

## ఇంగ్లీషు దొరతనము – చారిత్రక సమీక్ష

## 1600—1937

### మొదటి ప్రకరణము

### బ్రిటీషు యుగమునకు పూర్వమునాటి భారతదేశ స్థితి.

### I

భారతదేశమున బ్రిటీషు ప్రభుత్వము స్థాపింపబడక పూర్వ మీదేశ మధోగతిలో నుండెననియు, ఆ ఘోర దుస్థితి నుండి తామీదేశము నుద్ధరించితిమనియు, బ్రిటిషుసామ్రాజ్య తత్వవాదులు పలుకుచుందురు; బ్రిటిషువా రీదేశమున కాలిడు నప్పటి కీదేశస్థితి యెట్లుండెను? పదునారవ శతాబ్దిలో భారత దేశమున మొగలాయి చక్రవర్తులేలిన సామ్రాజ్యము ప్రపంచమున చాల సుప్రసిద్ధమైనది. ఐరోపాఖండమున నే రాజుక్రింద నందరు ప్రజలు లేరు. ఏ ప్రభుత్వమునకును నంత రాబడిలేదు. ఐరోపాలోని జగత్ప్రసిద్ధకట్టడములను జూచిన విదేశీయులు గూడ హిందూస్థానమునందలి చక్రవర్తులు నిర్మించిన సుందర హర్మ్యములనుజూచి ముగ్ధులైపోవుచుండిరి. ఐరోపాసామ్రాజ్య

ముల విభవములనెరిగినవారు కూడ ఢిల్లీసింహాసనము చుట్టు నానాదుండిన యలంకారములను పరివారమునుజూచి ముక్కుల పై వ్రేళ్ళిడికొనుచుండిరి. ఆనాడు మొగలాయి చక్రవర్తుల ఫర్మానాలు పొందిన రాజప్రతినిధుల పరిపాలనమున ఫ్రెంచి దేశపురాజుక్రిందగాని జర్మనీ చక్రవర్తి పరిపాలనమునగాని యుండినంతమంది ప్రజలుండిరి. వారి రాబడులును వారివానితో సమానములైనవే.

బ్రిటిషుప్రభుత్వము స్థాపింపబడక పూర్వము పదు నాల్గు పదునారవ శతాబ్దములనాటి హిందూదేశస్థితిని ఆంగ్ల చరిత్ర కారుడగు ఎల్ఫిన్‌స్టన్ వర్ణించియున్నాడు: "ఫిరోజిషా యొక్క చరిత్రకారుడు (1351-1394) ఆనాటిరైతు లనుభ వించు సౌఖ్యమునుగూర్చియు, నాటి గృహములు, అందలి గృహోపకరణములు, వస్తుజాలమును గూర్చియు, నాటి స్త్రీలు వెండిబంగారు నగలు విరివిగా నుపయోగించుటను గూర్చియు, చిత్రవర్ణనలెన్నో చేసినాడు. ఇతని కతిశయోక్తు లన్న ప్రీతియేగాని, ఇత డనేక సంగతులుచెప్పుచు రైతుల ఇండ్లనంటి యొక్కొక్క చిన్నతోట యుండెననియు వివరిం చుట చూడగా నాటి ప్రజలు సౌఖ్య మనుభవించుచుండిరను టకు సందియములేదు. ఆనాడు ప్రజాపీడన మనునది యూవంత యైన నున్నట్లు గానరాదు."*

నాటి భారతదేశము ఔన్నత్యస్థితిలో నుండెనని 1420 లో దేశములో తిరిగి చూచిన 'నికోలోకోంటీ' చెప్పుచున్నాడు. గుజరాతులోను, గంగాతీరమునను జూచినవిశేషము లిత డుత్సా

హాముతో వర్ణించినాడు. చక్కని యుద్యానవనములుగల పట్టణములు సుప్రసిద్ధములైన నాలుగు గొప్పనగరములు 'మారజియా' చేరులోపల నితడు చూచినాడు. ఈనగరము ధన కనక వస్తు వాహనములతోను నవరత్నములతోను నిండి యుండెనని వర్ణించియున్నాడు. 16 వ శతాబ్దప్రారంభమున దేశమును జూచిన బార్బోసా, బర్తెమాలు లీ సంగతులు నిజమని నుడువుచున్నారు.

బార్బోసా, క్యాంబేనగరమును వర్ణించుచు అదిచక్కని నగరమనియు, అదిఫలవంతమైన దేశమనియు, వివిధజాతుల వర్తకులతోను, పారిశ్రామికులతోను, వస్తునిర్మాతలతోను నిండియుండెననియు వ్రాసినాడు. 1340-1350 మధ్య మహమ్మద్ బిన్ తుగ్లకునాటి ప్రజాపీడన కాలమున దేశమును దర్శించిన ఇబిన్ బటూట్యాకూడ, ఆనాడు తాను జూచిన జనసంకీర్ణములైన మహానగరములు వర్ణించి దేశము అశాంతిలో మునుగక పూర్వముండిన ఔన్నత్యమును సూచించినాడు.

పదునారవ శతాబ్దియారంభమున నేటి పాశ్చాత్యులవలెనే భారతదేశముపట్ల సానుభూతిలేని బేబరుచక్రవర్తి ఈ భారతదేశము చాలధనవంతమగు గొప్ప దేశమనియు, నిది వెండి బంగారులతో తులదూగుచున్నదనియు వర్ణించి, దీని జనబాహుళ్యమును వివిధవృత్తులందు పరిశ్రమలందు జీవించు అసంఖ్యాకపారిశ్రామికులను జూచి యచ్చెరువందినాడు. బేబరుచక్రవర్తి అనేక జలాశయములను నీటివసరులను నిర్మించినాడు. క్రొత్త ఫలజాతులు వేయించినాడు.

మహమ్మదీయుల వశముగాకుండ ఇంకను హిందూ రాజుల వశముననే యున్న దేశభాగ మింతకన్న తక్కువ భాగ్యవంతముగ లేదు. విజయనగరసామ్రాజ్యమును దర్శించినవా రెల్లరు దాని విభవమునుజూచి యాశ్చర్యపడుచుండిరి. ఢిల్లీ కనోజినగరములతో సరిపోలు నానగరవిభవము, ఆరాజుల యఖండ వైభవము, శిల్పపోషణ, కవిపోషణ, సైనిక బలములు, కోలఃవుకూటములు, స్త్రీపురుషులు ఆభరణములు ధరించుట, వారిసౌభాగ్యము, నగరములోనిశిల్పము, విరివియగు వర్తకము, ధనరాసులుగల యంగళ్ళను (1420-21) ఇటాలియను వాడగు నికోలోకోంటీ, 1522 లో పోర్చుగీసువాడగు పేయసును, ఉన్నిజ (1535-37) మధ్యను, పెర్షియా రాయబారి అబ్దుల్ రజాక్ (1443-44) మధ్యను వర్ణించినారు. ఆకాలమున జనసంకీర్ణములగు నితర మహానగరములుగూడ పేర్కొనబడియున్నవి. 'ఇబిన్‌బటూ్యటా'దక్షిణదేశములో అప్పుడే మహమ్మదీయులు జయించిన మధురానగరమును వర్ణించియున్నాడు. అది ఢిల్లీ నగరమువలె నుండెనట. ఈ గ్రంథకర్తయే తాను రెండు నెలలు మలబారులో ప్రయాణముచేయగా సాగులోలేని భూమి కనపడలేదన్నాడు. గృహస్థులందరికిని తోటలు, దొడ్లు, ఆవరణములు నుండెనట. నాటి రేవుపట్టణములు కన్నులపండువుగ నుండెను. తూర్పుపడమటి సముద్రతీరములనుండిన రేవుపట్టణములెల్ల మహానగరములుగ నుండెను. ప్రపంచములోని అన్ని దేశములనుండియు వర్తకులిచ్చుటకివచ్చి నెలకొనుచుండిరి. అరేబియా, ఆఫ్రికా, పెర్షియా, చైనాలతో వర్తకము విరివిగా

సాగుచుండెను. ఇదిగాక దేశములో నాటువర్తకము విరివిగా జరుగుచుండెను.

షర్షా దేశములోని రాజబాటలనెల్ల బాగుచేసెను. కాని ఇతనికి రెండువంద లేండ్లక్రిందట దేశమును చూచిన ఇబిన్ బటూ్యటా హిందువుల పరిపాలనలో నుండిన మలబారులోని బాటలెల్ల బాటసారుల కుపయోగకరముగా చెట్లనీడలతోను, అచ్చటచ్చట విశ్రాంతిగృహములతోను, నూతులతోను చాల సౌఖ్యముగా నుండెనని వర్ణించియున్నాడు.

బేబరుచక్రవర్తి యీ దేశమునకు వచ్చి చూచిన నాటికి రివిన్యూ ఆదాయము వసూలుచేయు ఉద్యోగులు, వర్తకులు, పనివారు అందరును హిందువులుగ నుండిరని అతడే వ్రాసినాడు. (Erskine's Baber -232).

పోర్చుగీసువారు 1497 లో భారతదేశమునకు వచ్చిరి. వారి ముఖ్యోద్దేశమువ్యాపారలాభములార్జించుట.ఆనాటిపశ్చిమ దేశముల వ్యాపార మెల్ల కళ్ళికోటలోనే నెలకొని యుండెను. అచ్చటినుండి పెర్షియను జలసంధినుండి కన్‌స్టాంటినోపిలుకుగాని జెడ్డానుండి సూయజు ఆలగ్జాండ్రాలద్వారాగాని జర్గుచుండెను. అచ్చట వెనీసువర్తకులు భారతదేశ సరకులనెల్ల ఐరోపారేవుల కెగుమతి చేయుచుండిరి. ఆనాడు కళ్ళికోట ఒక అంతర్జాతీయ రేవుపట్టణముగ నుండెను. అచ్చట నొక (సీజను) వ్యాపార తరుణములో 1500 నౌకలు వచ్చి పోవుచుండెను. వివిధమతముల వారి కిచ్చట మతస్వేచ్ఛ యుండెను.

17 వ శతాబ్దములో బెవర్నియరు భారతదేశమంతట తిరిగి చూచి చాలకుగ్రామములందు సైతము ధాన్యములు, పిండి, వెన్న, పాలు, చిక్కుడుకాయలు, ఇతర కూరగాయలు, పంచదార, ఇతరమిఠాయిలు పుష్కలముగా దొరుకుచుండెనని వ్రాసినాడు. దీనివలన రైతులస్థితి యెంత బాగుండెనో గ్రామ జీవన మెంత సుభిక్షముగా నుండెనో తెలియగలదు.

కృష్ణదేవరాయలసామ్రాజ్యము కన్యాకుమారియగ్రము మొదలు కృష్ణా తుంగభద్రానదులవరకు వ్యాపించెను. వారి పలుకుబడి తూర్పున కటకమువరకు పడమర సాల్సెటి వరకు నుండెను. ఈ విజయనగర సామ్రాజ్యము పోర్చుగీసు వర్తకమువలన చాల లాభము పొందెను. పన్నులేకుండా వర్త కముచేసికొనుటకును, కోటయొకటి కట్టుకొనుటకును పోర్చు గీసువారికి కృష్ణదేవరాయ లనుజ్ఞనిచ్చెను. ఆకాలమున విజయ నగరము ప్రపంచములోని నానావాణిజ్యము చేయు వివిధ జా తులవారితో నిండి ఒక అంతర్జాతీయ పట్టణమువలె నుండెను. ఈజిప్టు పారశీకము మొదలగుతురుష్క దేశ రాజులతో వర్తక సంబంధముండెను. సమస్తసరకులలోను విదేశీయవ్యాపారము జరుగుచుండెను. ఏనుగుల గుర్రముల వ్యాపారమును పోర్చు గీసువర్తకులు విరివిగా జరుపుచుండిరి. ఆసామ్రాజ్యమున 300 రేవుపట్టణములుండెను. విజయనగరమున ఒక్కొక్క సరకు కొక్కొక బజారుండెను. పుష్పములరాసులు రత్నరాసులు గల అంగళ్ళుండెను. ఆనగరములో చిత్రలేఖనము, శిల్పము, లోహ కళలు, శిలానిర్మాణములు, చెక్కడము, దంతపుబనులు,

సంగీతసాహిత్యములు విరివిగానుండెను. ఇటువంటి మహాపట్టణ మును ఇంతవరకెవ్వరు ప్రపంచములో నింకొకచోట కనివిని యుండలేదని అబ్దుల్ రజాకు వర్ణించియున్నాడు.

కృష్ణదేవరాయలు తన సామ్రాజ్యమును తన సామంత మండలేశ్వరులక్రింద విభజించెను. వీరు తనకు రమారమి పది లక్షల సైన్య మంపునట్లు కట్టడిచేసెను. రైతులనుండి పంటలో అరవవంతు మాత్రమే మండలాధిపతులు పన్నుగా వసూలు చేసి దానిలో విజయనగర చక్రవర్తికి సగమువంతు చెల్లించు నట్లు బందోబస్తు చేసెను. పంటలకు, సరకులకు సరసమయిన ధరలు నిర్ణయించి పన్నులు రొక్కరూపముగా వసూలుచేయు నట్లు ఆజ్ఞాపించెను. పోర్చుగీసు ఇంజనీయర్ల సహాయమున పెద్ద పెద్ద చెఱువులు త్రవ్వించియు, ఆనకట్టలను కట్టించియు వ్యవ సాయ మభివృద్ధి గావించెను.

కృష్ణదేవరాయల రాజ్యాదాయము 1300 లక్షల బం గారు వరహాలని 16వ శతాబ్దములోని ఒకవిదేశీయ బాటసారి అంచనా వేసినాడు. ఆసామ్రాజ్యముయొక్క సైనికబలములు చాలమంచి శిక్షణమందియుండి లక్షలకొలది సైనికులెల్లప్పుడు యుద్ధసన్నద్ధులుగానుండిరని చూచినవారు వర్ణించినారు. విజ యనగర సామ్రాజ్యము పూర్వహిందూసంప్రదాయముల ప్రకారము పరిపాలింపబడుచుండెను. సర్వమతములపట్ల సహ నము చూపబడుచుండినను, రాజులు హిందూమతావలంబులై నేటి మైసూరువలె మతధర్మములపట్లను, గురుపరంపరపట్లను భక్తిచూపుచుండిరి. విద్యారణ్య గురుపరంపరపట్ల మర్యాద

జరుపబడుచుండెను. సామ్రాజ్యముయొక్క కేంద్రపరిపాలన చక్రవర్తి స్వయముగానే జరుపును. ఇరువదిమంది మంత్రులు, 9 మంది ముఖ్యదండనాథులు, పదునొకండుమంది సామంతులు నుండిరి. యుద్ధమంత్రి, న్యాయపరిపాలన మంత్రి, కోశమంత్రి మున్నగువారి క్రింద వివిధశాఖల కార్యదర్శులు నేటి డిపార్టు మెంటల్ సెక్రటరీలవలె నుండిరి. ఈ ప్రభుత్వము రాష్ట్రీయ మండలాధిపతుల పరిపాలనను కనిపెట్టి చూచుచుండెను. 200 మంది సామంతమండలేశ్వరులు చక్రవర్తికి కప్పములు కట్టు చుండిరి. గవర్నరులవంటి మండలేశ్వరులకు సాలుకు 3 లక్షల ఆదాయమునుండి 15 వేలవరకు ఆయాపదవియొక్క గౌరవ మును బట్టియుండెను.

స్థానికపరిపాలన కేవలము గ్రామపంచాయతులద్వారా జరుగుచుండెను. 1565 నాటికి సామ్రాజ్యమున 12600 గ్రామములుండెనని శిలాశాసనములవలన తెలియుచున్నది. ప్రతిగ్రామముయొక్క భూస్వామిత్వపద్ధతి ఆ గ్రామసంఘము యొక్క అధికారముక్రిందనే యుండెను. గ్రామ సంఘమునకు సభ్యులు అధికారులు వేరుగానుండిరి. ఈ గ్రామసంఘముల వారే భూవిషయిక వివాదలను పరిష్కరించుచుండిరి. దుర్మా ర్గములుచేసిన ఉద్యోగుల భూములు వశముచేసికొనుచుండిరి. గ్రామోద్యోగుల తగాదాలు పరిష్కరించుచుండిరి. పల్లపు నీటి సాగుకు, నీటివసరులకు రోడ్లకు కట్టడములకు ప్రత్యేకో ద్యోగులుండిరి. గ్రామోద్యోగులపైన 'పారుపత్యగారు' లన బడు అధికారులు నాడులనాయకుల అధికారము క్రిందనుండి

గ్రామములపైన పైపెత్తనము కలిగియుండిరి. ఈ నాయకుల పైన 'కార్యకర్త'యను సామ్రాజ్యాధికారియే పైపెత్తనము వహించును. దక్షిణమున మధురలో మాత్రము 'పాళెగారు' లను సైనికనాయకులొక క్రొత్తపద్ధతిస్వపరిపాలన స్థాపించిరి. 72 పాళెముల పాళెగార్లు సైనికాధికారులుగనుండి నేరగాం డ్రను, కొండజాతులను, విదేశీయులను అదుపులో నుంచిరి. వారు దేశాదాయములో మూడింట రెండువంతులు తీసికొని మూడవవంతు నాయకులకు పంపుచుండిరి.

అక్బరునాటి మొగలుసామ్రాజ్య విభవము జగత్ప్రసిద్ధము. ఈచక్రవర్తి ఎంతగొప్పరణశూరుడో అంతగొప్ప పరిపాలకుడు. అతనివిజ్ఞానసంపద, సర్వమతసహనము, ఔదార్యము, దాతృత్వము క్షమ, ధైర్యసాహసములు వర్ణనాతీతములు. అతడు న్యాయవిచారణలో అగ్నిప్రమాణ పరీక్ష మొదలగు క్రూరపద్ధతులు.జంతువధ,బలి,యుక్తవయస్సురాకపూర్వము వివాహము జేయుటను నిషేధించెను. మహమ్మదీయులతో పాటు హిందువులకు సమానముగా నుద్యోగము లిచ్చెను. యాత్రికుల పైన తలపన్ను తీసివేసెను. యుద్ధమునబట్టుకున్నవారిని బానిసలుగ జేయుపద్ధతి నిషేధించెను. షర్షాప్రారంభించిన ఆర్థికద్రవ్య సంస్కరణలు పూర్తిచేసెను. భూములనెల్ల కొలిపించి పంటలనుబట్టి తరములనిర్ణయించెను. ధాన్యపుశిస్తును రొఖ్ఖసిస్తుగా మార్చి రైతుకేది వీలుగనున్న ఆ ప్రకారము శిస్తుచెల్లింప వీలు కలుగజేసెను. బాధకరములగు అనేక పన్నులను రుసుములను తీసివేసెను. దీనివలన ప్రభుత్వమునకు ప్రజలు చెల్లించు

సొమ్ములో చాలసొమ్ము తగ్గెను. ఇటాలియను బాటసారి పీటో్రడెల్‌వల్లె 1623లో నిట్లు వా్రసినాడు. "సాధారణముగా ప్రజలందరు మర్యాదగా జీవించుచున్నారు. దేశములో మంచి సంరక్షణ కలదు. రాజు అనవసరముగు నేరారోపణములుచేసి ప్రజాపీడన చేయడు. ఎవరైన సుఖముగా సంపద ననుభవించుటను జూచి వారిని పీడింపడు." (Reform Pamphlet)

అక్బరు మనుమడగు షాజహాను పరిపాలన మొగలాయి సామ్రాజ్యచరిత్రయం దుత్కృష్టమైనది. దేశము సుభిక్షము ముగానుండి శాంతిని సత్పరిపాలనము ననుభవించెను. 1615లో సర్ తామస్‌రో మొగలుదర్బారుకు ఆంగ్లరాయబారిగావచ్చి అచ్చటి మహావైభవముల జూచి ముగ్ధుడై పోయినాడు. నాటి చక్రవర్తి జహాంగీరు శిబిరమున రెండు ఎకరముల ప్రదేశము, పట్టుజరీ తివాచీలతో పరుపబడియుండెను. విలువగల చాందినీలు కట్టబడియుండెను. నవరత్న ఖచితమై ప్రపంచమున కనివిని యెరుగని నెమలిసింహాసనమును నిర్మింపజేసిన షాజహాను సింహాసనమున నధిష్ఠించిన నాటి అఖండవిభవమును జూచిన టెవర్నియరు షాజహాను తన పట్టాభిషేకమప్పుడు నవరత్నములు బంగారునాణెములతో తులాభారము తూగి వానిని జనమధ్యమున వెదజల్లెనని చెప్పుటయేగాక ఈ చక్రవర్తి కేవలము సామాన్యుడగు రాజువలెగాక తన కుటుంబమును ప్రేమతో దిద్దుకొను తండ్రివలెనే పరిపాలించెనని వర్ణించినాడు. కందహారు దండయాత్రకు తక్కిన యుద్ధములకు గావలసిన సొమ్మెల్ల ఖర్చుచేయగా షాజహాను చనిపోవు

నాటికి 24000000 పౌనుల రొఖ్ఖమును ఇంకను బంగారు వెండి కడ్డీలును జవాహిరీయు మొగలు ఖజానాలో నిలువయుండెను. ఔరంగజేబు చనిపోవునాటి కెంత ఖర్చు అయిపోయినను నాదర్‌షా ఢిల్లీప్రాంతమునుండి 1757 లో ఎంతసొమ్ము కొల్లగొని తీసికొనిపోయిననుకూడ దేశ మింకను భాగ్యవంతముగనే యుండెను. నాడు దేశపరిపాలనముగూడ చాల కట్టుదిట్టముగ జరుగుచుండెను.

మొగలాయి చక్రవర్తియగు అక్బరుకాలమున నా సామ్రాజ్యము వివిధ సుభాలు (రాష్ట్రములు)గా విభజింపబడి ఒక్కొక్కసుభా కొక్కొక్క గవర్నరు నియమింపబడెను. ఇతని కా రాష్ట్రములో పూర్తియైన సివిలు మిలిటరీ అధికారము లన్నియు నుండెను. దేశములో ముందుగా భూములను కొలచి (పయిమాషి) సర్వే చేయించి భూమిపైన యకరమున కింత పండినదని నిర్ణయించి దీనినిబట్టి శిస్తుతరము నిర్ణయింపబడెను. అక్బరుకాలమున మొదట నిది ప్రతిసాలున జరుపబడెను. తరువాత నిది 10 సంవత్సరముల కొకమారు జరుగుచుండెను. స్థానికజిల్లా రివిన్యూ వసూలు అధికారిని అమల్‌గుజా రని వ్యవహరించిరి. ఈ అధికారికి బ్రిటిషు జిల్లాకలెక్టరు జిల్లా మేజస్ట్రీటుకుండిన పోలీసు నేరవిచారణ అధికారము లుండెను. ఈ యుద్యోగికి నేటి కలెక్టరుతో చాల పోలికలు గలవు. ఇతడు రైతుబాంధవుడుగ ప్రవర్తింపవలెనని ఉత్తరువు లుండెను. దురవస్థలోనున్న రైతులకు ఋణము లివ్వవలసిన బాధ్యతయు నితనికి కలదు. స్థానికబొక్కస మితని యధీన

మున నుండెను. ఎప్పటికప్పుడు సొమ్ము ఇరసాలు చేయుచుండ వలెను. ప్రతినెల ప్రజల స్థితిగతులను విశేషములను ధర లనుగూర్చి ఒక నివేదిక పంపవలెను. అక్బరుకాలమున గ్రామములయొక్క పరిపాలన న్యాయవిచారణ పూర్వము వలెనే పంచాయితీలే జరుపుచుండెను. ప్రతిపట్టణమున నొక "కొత్వాలు" అనబడు మేజస్ట్రీటుండెను. ఇతడు పోలీసు అధి కారిగానుండి పరిపాలనావ్యవహారములన్నియు జరిగించును. పట్టణములకు బయట దేశములో క్రమమగు పోలీసు ఫౌజు లేదుకాని గ్రామములకు వంశపారంపర్యముగా కావలివా రుండిరి. ఈ మేజస్ట్రీటులేగాక న్యాయవిచారణకొరకు "మీర్ అదల్" అనబడు న్యాయాధిపతియుండెను. ఇతడు న్యాయ విచారణలో తీర్పుచెప్పు అధికారి. మహమ్మదీయ ధర్మాధి కారియగు ఖాజీకూడ ఒక న్యాయాధికారియేగాని ఇతడు ధర్మశాస్త్రము జెప్పి వ్యాజ్యము నడిపించును. "నేనే అన్యా యము చేసినగూడా నేను దానినిగూర్చి న్యాయవిచారణ చేసితీరెదను" అని అక్బరుచక్రవర్తి పలికియుండెను. అక్బరు చక్రవర్తి న్యాయవిచారణ చేయుటకొరకు ప్రతిదినము ఉద యము 9 గంట లైనతరువాత దౌలతుఖానా యను కొలువు కూటమున కూర్చుండి దావాలను అప్పీళ్ళను విని పరిష్కరిం చును. ఆసమయమున నాయన సమక్షమున కెల్లరు వెళ్ళ వచ్చును. ఒక్కొక్కప్పు డీ న్యాయసభ సాయంత్రముగూడ జరుగును. మధ్యవా రెవ్వరివలన నెట్టి యాటంకము లేకుండా అర్జీలను స్వయముగా స్వీకరించుట కొర కాయన దౌలతు

ఖానాలోనికి తెరచియుండు కిటికీదగ్గరకు తరచుగావచ్చి నిలుచుండును. అర్జీల నాయన స్వయముగా విచారించి తీర్మానించును.

షాజహాను ఔరంగజేబులు బుధవారమునాడు సామాన్యదర్బారు మానివేసి సభలో పరివేష్టించి న్యాయవిచారణ జేయుచుండిరి. దర్శనగవాక్షమునుండి తిన్నగా దివానీఖాస్ మందిరమునకు ఉదయము 8 గంటలకు చక్రవర్తి వచ్చును. న్యాయోద్యోగులు, ఖాజీలు, "అదళ్ళు" అనున్యాయాధిపతులు, ముఫ్టీలు, ఉలేమాలు, న్యాయశాస్త్రజ్ఞులు "దరోగా-ఈ-అదాలత్" అనబడు కోర్టుల పెత్తనదారుడు, కొత్వాలు అనబడు పట్టణపోలీసు అధికారియు తప్ప సామాన్యసభాసదుల నామందిరమునకు రానీయరు. న్యాయాధికారి ఫిర్యాదీల నొక్కొకరినే చక్రవర్తికెఱుకపరుపగా నాయన శాంతచిత్తుడై వారి మనవులను విచారించి శాస్త్రధర్మమును తెలిసికొని తీర్పు చెప్పును. (J. N. Sarkar-Mughal Administration quoted by Wahed Hussain 38–40). జహంగీరు చక్రవర్తియొక్క కొలువుకూటమున ముఖ్యముగా నెన్నదగినది, మనవిదారులు తమ అర్జీలను నిర్భయముగా చక్రవర్తికి అందచేయుటకొరకు ఆగ్రా కోటయొక్క షా బురుజుకు కట్టబడిన బంగారు గొలుసు గంటలు. దీని రెండవకొన నదీతీరమున నొకశిలాస్తంభముకు గట్టబడియుండును. మనవి దారులు తమ అర్జీల నాగొలుసుకు గట్టినచో సేవకులయొక్క ఆటంకము లేకుండా ఆ గొలుసు పైకిలాగి చక్రవర్తి స్వయముగా చిత్తగించుచుండును. నిష్పక్ష

పాతముగ న్యాయము ప్రసాదించుట చక్రవర్తి కంత ప్రీతి. షాజహాను చక్రవర్తి కేవలము తన ప్రజలను కన్నతండ్రి వలెనే యాదరించి న్యాయపరిపాలన చేయుచుండెను. సాష్టాంగ దండప్రణామము చేయుట నితడు మాన్పించి ప్రతి బుధవార మును అర్జీలను స్వయముగా వినుచుండెను. (Eliot- History of India Vol VII. P. 170–3) ఔరంగజేబు చక్రవర్తి రాజ్యాధికారము సౌఖ్యముకొరకు కాదనియు ప్రజాక్షేమము కొరకే యనియు నిశ్చయించి నిష్పక్షపాతముగు న్యాయవిచా రణ చేయుచుండెను. దర్శనమందిరమున శాంతవదనముతో దినమునకు రెండు మూడుసార్లు వచ్చి నిలిచి మనవుల చిత్త గించును. ప్రజలు నిర్భయముగా తమబాధ లాయనకు జెప్పు కొనుచు న్యాయము పొందుచుండిరని ఇలియట్ తన చరిత్రలో వ్రాసినాడు. (Vol. VII. 158) "ఈచక్రవర్తి చాల తెలివైన వాడు. రాజుయొక్క యధికారము ప్రజల యభివృద్ధిపైన నాధారపడి యుండునని ఇత డెరుగును. తన ప్రభుత్వము యొక్క క్షేమము నాలోచించి యితడు ప్రజాపీడనమును సహింపక తన పరిపాలన చక్కగా జరుగుచున్నదో లేదో అని కనిపెట్టుచుండెను. వ్యవసాయమును వాణిజ్యమును ప్రోత్స హించుచుండెను. ఆయన వరిపాలనలో ప్రతిచోటను ఆస్తికి రక్షణయుండెను. పూర్వపరిపాలనమునందు కన్న గూడా న్యాయవిచారణ ప్రజలకు సులభసాధ్యము గావించెను. దావాలు త్వరలో పరిష్కరించునట్లు చేసెను. ఈయన కాల మున ఉరిశిక్షయే గానరాదు. తనకు వ్యతిరేకముగా తన

సోదరుల పక్షము వహించినవారిని కూడా ఆయుధవిసర్జన చేయగానే ఇతడు క్షమించుచుండెను. (History of India - Alexander Dow) తన సింహాసనమునకు ముప్పము కలుగునట్లు చరించిన బందుగులయెడల తప్ప తక్కినవా రందరిపట్ల నితడు చాల ఉదారుడుగ నుండెను. శిక్షించుటయన్న అతని కిష్టములేదు. పుర్రెలతో విజయస్తంభములు నిర్మించుట, జనవధలుచేయుట, మొగలువంశ పరిపాలన ప్రారంభదినములందువలె క్రూరకృత్యములుచేయుట యితనికిష్టములేకుండెను. (Kennedy: History of the Great Moghals)

కేవలము మొగలు చక్రవర్తులేగాక ఆకాలమునాటి సుబేదారులుకూడా నిష్పక్షపాతముగా న్యాయవిచారణ చేయుచుండిరి. వంగరాష్ట్రిన బాబు ముర్షిద్‌కూలీఖాను ధర్మపరిపాలనకొరకై తనకొమారుడుచేసిన నేరమునకతని కురిశిక్ష విధించెను. తనక్రింది యుద్యోగులన్యాయము చేసినట్లు తెలిసినచో తాను పునర్విచారణచేయును. ఎంతదరిద్రుడైనను ఆయనవలన న్యాయము పొందగలుగుచుండెను. ( Stewart: History of Bengal )

విజయనగర సామ్రాజ్యమునను మొగలు సామ్రాజ్యమునను గూడ ప్రజలు శాంతిభద్రతలు గలిగి సుఖముగా నుండిరి. ఆకాలమున వ్యాజ్యములు వివాదలు హెచ్చుగా లేకపోవుటకు కారణము ఆనాటి ప్రజలకు నేటివలె కోర్టు వ్యాజ్యములయందు దానక్తి లేక పోవుటయె. న్యాయశాస్త్రము యొక్క గుంటచిక్కులు, అందలి జూదరితనమును వారెరుగరు.

ఆదినములలో దేశము బలమైన ప్రభుత్వముక్రింద శాంతిభద్ర తలతో సుభిక్షముగనుండెను. సాధారణ వివాదలును, కులకక్షలును గ్రామపంచాయతులవలననే పరిష్కరింపబడు చుండెను. గ్రామ ప్రజలపైన వానికి గొప్ప పలుకుబడియుండెను. గ్రామ స్వపరిపాలనా స్వాతంత్ర్యమునకు మొగలు ప్రభుత్వమెట్టి భంగము కలిగింపలేదుసరికదా దానినింకను ప్రోత్సహించి గ్రామ వ్యవహారములన్నియు పంచాయతీకే వశముచేసియుండెను. (Administration of Justice under Muslim Rule: Wahed Hussain P. 46)

భారతదేశమున నింగ్లీషుకోర్టులు వృద్ధియైనకొలదియు అబద్ధపు సాక్ష్యములు అందువలన న్యాయపరిపాలనలో కలుగు అన్యాయములు వృద్ధిజెందెనని చరిత్రకారులు చెప్పుచున్నారని జాన్‌బ్రైట్ ఉపన్యాసములందు చెప్పినాడు. (Vol. II. P. 42.)

బొంబాయిరాజధాని ఇంగ్లీషువారిచేతిలో పడునాటికచ్చట మహారాష్ట్రపరిపాలనావిధాన మమలులో నుండెను. విజయనగర సామ్రాజ్యాధీశుల ఆంధ్రపరిపాలనా పద్ధతులనే శ్రీఛత్రపతిశివాజీయు నాయన తరువాత పరిపాలించిన పీష్వాలును అవలంబించిరి. (Tilak's speeches 31—3—18 Gokhale Hall) అష్టప్రధానుల ప్రభుత్వమని యాత్యంత ప్రఖ్యాతిగాంచిన పరిపాలనా విధానము నాంధ్రసామ్రాజ్యము నుండియె గ్రహించిరి.

ఈ మహారాష్ట్ర పరిపాలనను ధ్వంసము జేసినది ఎల్‌ఫిన్‌స్టన్ అను నాంగ్లేయరాజ్యతంత్రజ్ఞుడు. మహారాష్ట్రపద్ధతుల

నెల్ల రూపుమాపిన పిదప నితడే మరల నాంగ్లేయప్రభుత్వ కంపెనీక్రింద నా రాష్ట్రమునకు కమీషనరుగ నియమింపబడెను. తన పరిపాలనలో నితడు కొంత ఉదారభావమును జూపి ఆంగ్ల విద్యాపద్ధతులు స్థాపించి దేశీయుల కాంగ్లపరిపాలనపై భక్తి గలిగించుటకు ప్రయత్నించినాడు. ఇతడు వ్రాసిన సంగతులను బట్టియే పీష్వాలకాలమునాటి పరిపాలన ఎంతచక్కగా నుండెనో తెలియగలదు. పీష్వాప్రభుత్వకాలమున పునహా యొకమహా నగరము. ఇంతటి గొప్పనగరమున గూడ నొక్క బందిపో టయిన జరిగియుండలేదన్నచో దేశ మెంత శాంతిసౌఖ్యముల ననుభవించుచుండెనో తెలియగలదు. మద్యపానము పూర్తిగా నిషేధింపబడెను. నేటి రివిన్యూపరిపాలనలో ప్రసిద్ధిజెందిన జమాబందీ పద్ధతిని మొట్టమొదట స్థాపించినవాడు నానాఫర్న వీసు అను మహారాష్ట్ర పరిపాలకుడే! దానినే తరువాత బ్రిటిష్ పరిపాలకు లవలంబించిరి. రాజ్యపరిపాలనకు సంబంధించిన లెక్కలు, ఆదాయవ్యయపట్టికలు, జమాఖర్చు లెక్కలు మొదలగునవి తయారు చేయుపద్ధతులు గూడ నాకాలముననే ప్రారంభింపబడినవి. నానాఫర్నవీసుచే నియమింపబడిన గూఢచార్లు పోలీసుభటులు, ఏసర్దారు ఎప్పుడే మనుష్యునితో ఏమి మాట్లాడినది గూడా ఆయనకు తెలియబరచుచుండిరి. అయితే దేశభక్తుల నేదో విధముగా బంధింపదలచు నేటి సి. ఐ. డీ. లకు నాటి గూఢచారుల కెంతో భేదముకలదు. నేటి ప్రభుత్వ పద్ధతులలో చాలవరకు పీష్వాలకాలమునాటివేగాని పద్ధతుల యుపయోగములో మార్పులున్నవి. పీష్వాలపరిపాలనలో

2

ప్రజలకు గ్రామస్థులకు నుండిన పలుకుబడి యిప్పుడు పోయి ఉద్యోగులయధికారములు హెచ్చుచేయబడి అధికారుల జులుము మితిమీరినది. సర్వాధికారియగు కలెక్టరు ప్రజాపాలకుడైనాడు. (చూడు : లోకమాన్యతిలకు ఉపన్యాసములు)

## II

ఔరంగజేబుచక్రవర్తి పరిపాలనముననే మొగలు సామ్రాజ్యనాశకారణము లేర్పడెను. ఈభూపాలుడు క్రీ.శ. 1707న చనిపోవగనే ఈ కారణములు మరింత వృద్ధిజెందెను. ఔరంగజేబు చనిపోయినపిదప నలుబది సంవత్సరములలోనే మొగలు సామ్రాజ్య మంతరించెనని చెప్పవచ్చును. ఔరంగజేబుని యనంతరము మొగలాయి సింహాసనము నెక్కినరాజులెల్ల అంతఃపురమునందు సురాపానలోలురై భంగుమత్తునను, వారవనితలసల్లాపములందును, విదూషకుల సంభాషణలతోను ప్రొద్దుపుచ్చుచుండిరి. హిందూదేశమునకు పశ్చిమోత్తరమున నున్న కనుమలనుండి క్రూరజాతులవారు వచ్చిపడి భారతీయుల భాగ్యమును కొల్లగొనుచుండిరి. పెర్షియాదేశపు వీరు డొకడు భరతఖండము జొచ్చి, ఢిల్లీ ప్రవేశించి, భరతఖండమునందు కాలిడుటకు తావిమ్మని మనచక్రవర్తుల నడుగవచ్చిన రాయబారుల కచ్చెరువు గొలిపిన మయూరసింహాసనమును బట్టుకొనిపోయెను. పెర్షియావారు మొదలిడిన నాశనమును ఆఫ్గనులు పూర్తిచేయసాగిరి. మొగలాయి సార్వభౌమత్వమును రాజపుత్రులు నిరాకరించిరి. సిక్కులు సింధునదీ ప్రాంతముల నేలసాగిరి.

దినవెచ్చములకు పోరాడుసైనికులు కొందరు రోహిలుఖండము నాక్రమించిరి. యమునానదీతీరములందు జాటురాజపుత్రులు విజృంభించిరి. భరతఖండమున పశ్చిమతీరమున, భరతఖండము నేకచ్ఛత్రముగ నేలదలచినవారి నెల్లర ధిక్కరించి బ్రిటిషు వారితోకూడ ననేక ఘోరయుద్ధములుచేసి బ్రిటిషువారి యదృష్టవశమున తుదకు లొంగిన వీరాతివీరుల (మహారాష్ట్ర) జాతి ఔరంగజేబు కాలములోనే బయలుదేరెను. ఔరంగ జేబుని యనంతర మాతని సామ్రాజ్యమునందెల్ల మహా రాష్ట్రుల పేరుమోగెను. ఈ జాతి మొగలాయిరాజప్రతి నిధుల ననేకుల నడచివేసెను. దక్షిణ భరతఖండమునెల్ల వీ రాక్ర మించిరి. పూనాలో, గ్వాలియరులో, గుజరాతులో, బీహా రులో మహారాష్ట్రనాయకులు పాలింపసాగిరి. అప్పుడప్పుడు చుట్టుపట్లకు మరాటీదండ్లు వచ్చి గ్రామములను కొల్లగొను చుండెను. ఈ దాడులను జూచి భయపడి కర్షకులు గ్రామ ములు వదలి యరణ్యముల కేగుచుండిరి. పెక్కు పరగణాలు వీరికి కప్పములుగట్టి వీరిబాధ తప్పించుకొనసాగెను. పేరునకు మాత్రము చక్రవర్తి బిరుదమును ధరించిన మొగలు వంశీకు డగు నిర్భాగ్యుడుకూడ వీరికి లంచ మిచ్చుకొనవలసివచ్చెను. ఈ మరాటీదండు ఢిల్లీ కోటగోడలకు దగ్గరగనే విడిసెను. ఇంకొకదండు ఏటేటను బంగాళా దేశమునందలి సేద్యపు భూము లలో విడియుచుండెను. ఐరోపావర్తకు లీ మరాటీదండులవలన తమగిడ్డంగుల కే ముప్పుగల్గునో యని వణకుచుండిరి.

హిందూ దేశమున మొగలాయి రాజప్రతినిధు లెచ్చోట

వైనన బలవంతులుగనుండిరేని వారే స్వతంత్ర ప్రభువులగు చుండిరి. పేరునకుమాత్రము మొగలాయి చక్రవర్తికి కప్పముగట్టు సామంతరాజులుగ నుండిరి. చక్రవర్తి కెప్పు డైన నజరానాలంపిన కద్దు, లేనిచో లేదు. వారికి కావలసినచో నేదైన గొప్ప బిరుదమును చక్రవర్తివలన నందుచుండిరి. వీరు వంశపరంపరముగ నేలుచుండిరే గాని చక్రవర్తి యిష్టము వచ్చినప్పుడు వీరిని తొలగించుటకు వీలులేకుండెను. ఇట్లే బంగాళమును, కర్నాటకము నేలిన మహమ్మదీయ నవాబుల వంశీయులును, హైదరాబాదు నేలు నైజాము వంశము నుద్భవించినవి.

ఎన్నటికైన నీకల్లోల మంతమగునా? భరత ఖండమున శాంతియుత ప్రభుత్వము మరల నెలకొల్పబడునా? యను ప్రశ్నల కేజ్యోతిష్కుడును ప్రత్యుత్తర మీయజాలకుండెను. హిందూదేశమును మహారాష్ట్రులేలుదురో మహమ్మదీయు లేలుదురో, లేక మొగలుచక్రవర్తులవంశము యొక్క మూల పురుషునివంటి వీరు డెవడైన నేకొండలోయలనుండియైన వచ్చునో యనుకొనిరే గాని, భరత ఖండమునకు పదివేల మైళ్ళ దూరముననున్న ద్వీపమునుండి వర్తకము చేయుట కొరకు వచ్చిన వణిజ సంఘమువా రొకశతాబ్దము లోపుగనే హిమాచల ప్రాంతములనుండి కన్యాకుమారివరకుగల దేశ మునెల్ల చల్లగ కాజేసి ఏకచ్ఛత్రపరిపాలనమును స్థాపింతురని ఎవ్వరును కలనైన తలపరైరి.

## రెండవ ప్రకరణము

## బ్రిటిష్ ఇండియా నిర్మాణము.

### I

### బ్రిటిష్ వారీ దేశము నాక్రమించిన విధము.

ఆంగ్లేయులు భారతదేశమునకు వర్తకము చేయుట కొరకు 1600 సం॥లో పట్టాపొందివచ్చి మెల్లగా దేశాక్రమణము జేసి అచిరకాలముననే బ్రిటిష్ సామ్రాజ్యమును స్థాపించిన విచిత్ర పరిణామమునకు ప్రపంచచరిత్రలో నింకొక యుదాహరణము గానరాదు. బ్రిటిష్ సామ్రాజ్య స్థాపనము అప్రయత్నముగా, తలవని తలంపుగా జరిగినదని ప్రొఫెసర్ సీలీపండితుడు చెప్పుమాటలు సరికావు. భారతదేశమున తమ ఆధిపత్యమును సుస్థిరముగా నెలకొల్పవలెనను నుద్దేశము ఆంగ్లేయ వర్తక కంపెనీవారి డైరెక్టరులకు 1687 లోనే కలిగిన దని సర్ విలియం హంటరుగారు తమ బ్రిటిష్ఇండియాచరిత్ర రెండవకూర్పు పీఠికలో వ్రాసియున్నారు. అయితే వారు తలపెట్టినది రాజకీయాధిపత్యముగాక వాణిజ్యాధిపత్యమే యని అతని తలంపు. భారతదేశమున ఆంగ్లేయులు జరిగించిన చర్యల వలన వాణిజ్యాధిపత్యము రాజకీయాధిపత్యమునకు దారితీసినదని స్పష్టమగుచున్నది. భారతదేశమున వర్తకలాభములతోపాటు రాజ్య సంపాదనకూడ కంపెనీవా రభిలషించిరనుటకు లిఖితాధారములు కలవు.

1689 లో నింగ్లాండునుండి కంపెనీ డైరెక్టరులు భారత దేశములోని కంపెనీయధికారుల కిట్లు వ్రాసిరి. "వర్తకలాభము

వలెనే భూములపైనవచ్చు రివిన్యూ (ఆదాయము) కూడా వృద్ధిచేయవలయు ననియే మా యభిప్రాయము. వర్తకములో వేయి విపత్తులు కలిగినను మనలను రక్షింపగలట్టిదీ రివిన్యూ ఆదాయమే. దానివలననే ఇండియాలో మనమొక బలవంతమగు జాతిగా నిలువగలుగుదుము. లేనియెడల మనము దేశములో వర్తకము జేసికొనుటకు పట్టానొందివచ్చిన పరాయి వారిగనే యుందుము. అట్టి స్థితిలో నితరుల కెవ్వరికిని పనికి రానిచోట్ల మాత్రమే మనము వర్తకము చేసికొనవలసి వచ్చును."

భారతదేశమును ఇంగ్లీషువారు తమ భుజబలముచేత నెన్నడును జయింపలేదు. ఈ దేశరాజులను నవాబులను నొకరిపై నొకరిని పురికొల్పి అందరిని నాశనముజేసియే వారు రాజ్యాక్రమణము జేసిరి. మొట్టమొదట ఆర్కాటు నవాబును అణచుటకు కంపెనీవారికి నైజాము సహాయము జేసెను. తరువాత నైజాము నణచుటకు ఆర్కాటు నవాబు సాయపడెను. ఇట్లే మహమ్మదీయుల నణచుటకు మహారాష్ట్రులును, మహారాష్ట్రుల నణచుటకు మహమ్మదీయులును కంపెనీవారికి తోడ్పడిరి. తిరిగి ఈ పద్ధతి తప్పకుండా హిందువుల నణచుటకు ఆఫ్గనులును ఆఫ్గనుల నడచుటకు హిందువులును కంపెనీవారికి తోడ్పడిరి. ఈదేశము నింగ్లీషువారికి చేజిక్కించుటకు మన దేశ రాజులయొక్కయు నవాబులయొక్కయు భుజబలమే.—అంతః కలహాలములే కారణములయ్యెను. ఇంకొక విశేషమేమనగా నీ మహాసామ్రాజ్యమును స్థాపించుటలో నింగ్లీషువారి కొక్క

చిల్లిగవ్వయైనను ఖర్చు కాలేదు. ఈ బ్రిటీషువారు నిజముగా భారతీయుల ధనముతోను భారత దేశ వర్తకముతోను దేశాక్రమణము జేసిరి. ఇంగ్లీషువారీ దేశమును తమ ఖడ్గబలమువలన జయించలేదు. కేవలము కుటిలోపాయమువలన జిత్తులవలన రాజ్యతంత్ర ప్రయోగము వలననే జయించిరి. నిజముగా బలప్రయోగముచే నీ దేశము నాక్రమించుటకు వారు బహిరంగముగా ప్రయత్నించియుండినచో నీ దేశములో నాటికి బలవంతులై యుండిన రాజులు ఏకమై వీరిని పారదోలియుందురు. ఆంగ్లేయులు చాలా తెలివి తేటలతో తమ రాజ్యతంత్రమును ప్రయోగించిరి. దేశములోని రాజులలోను నవాబులలోను వైరములు బుట్టించి యెవరిపక్షముననో చేరి తాము లాభమును పొందుచుండిరి. నిజముగా నాంగ్లేయులకు 1687 నాటికే సామ్రాజ్యకాంక్ష యుండెను. గాని పైకి తమకు రాజ్యకాంక్ష లేదనియు కేవలము వ్యాపారలాభము నార్జించుటయే తమ యుద్దేశమనియు చెప్పుకొనుచుండిరి. దిగ్విజయముచేసి సామ్రాజ్యముస్థాపింతునని క్లైవు 1765 లో చెప్పినప్పుడు డైరెక్టర్లు ఖర్చు భరింపలేమనిరి. ఆనాటి రాజులు నవాబులు ఆంగ్లేయులనుజూచి మోసపోయిరి. ఒకరికన్న నింకొకరు వీరి సహాయమును పొందుచు వీరికి హెచ్చు సౌకర్యముల నివ్వసాగిరి. వీరందరును పోరాడుకొని దుర్బలులై పోయినపిదప నాంగ్లేయులు నిజస్వరూపమును జూపించిరి. ఇట్లు భారత దేశాక్రమణమును ఆంగ్లేయ వర్తకులు తమకు వీలైనట్లుగను దమ్మిడీ ఖర్చులేకుండగను జేసిరి.

భారత దేశమందు కంపెనీవారి అధికారము పలుకుబడి

నానాటికి హెచ్చసాగెను. రాజ్యతంత్రము ప్రయోగించి మొగలాయి చక్రవర్తిని లోబరచుకొనిరి. నవాబులను చేతిలో పెట్టుకొని కీలుబొమ్మలవలెనాడించుచుండిరి. పేరునకుఆచక్రవర్తి ఆనవాబులు దేశాధికారులుగాని నిజమైన అధికారులు కంపెనీ వారే. అయినను చాలారోజులవరకు దేశముయొక్క సామాన్య పరిపాలనగాని, శాంతిభద్రతలను గాపాడు పోలీసు అధికారము గాని, న్యాయవిచారణచేయు అధికారముగాని కంపెనీవారు వహించలేదు. అది తమచేతిలోని కీలు బొమ్మలకే వదలి కేవలము పన్నుల వసూలు అధికారముమాత్రమే తాము వహించిరి. నవాబులకు పరిపాలనకు సొమ్ము లేనందున వారది నిర్వహింపలేక పోవుచుండిరి. ఈపద్ధతి చాలకాలము నడచిన పిదప దేశములో తాము నిలిపిన కీలు బొమ్మల నూడలాగి ప్రభుత్వాధికారములను కంపెనీవారే వహించిరి. కంపెనీ డైరెక్టరులు నియమించిన గవర్నరులే దేశపరిపాలకులైరి. ఈ పరిపాలనలో కూడా పాతపద్ధతులు మానలేదు. ఏదోమిషపైన యుద్ధముచేయుట ఆయుద్ధవ్యయము తమ కీలుబొమ్మ నవాబులపైననో ప్రజలపైననో వేయుట, రాజ్యాక్రమణము చేయుట యీరాజ్యమునెల్ల తమ లాభముకొరకు పరిపాలించి లాభము నందుట ప్రారంభించిరి. తమకు లోబడి కప్పములు గట్టిన నవాబులను రాజులుగా కొన్నాళ్లు ఏలనిచ్చుచుండిరి గాని వారివద్ద నుండి ధనములాగుకొని పీల్చి పిప్పిజేసి యేదోమిషపైన వారి రాజ్యము లాగికొనుచుండిరి. అనేక స్వదేశరాజులు భయపడి తామే లోబడి కప్పములు కట్టసాగిరి. మిత్రభేద

ములు, కుటిలతంత్రములు ప్రయోగింపబడుచుండెను. కప్పము కట్టలేదనియో, యేదో లోపము జరిగినదనియో, ఔరసుడు లేడనియో, నింకేదో మిషపైననో కొందరి రాజ్యములు లాగికొనుచు దేశమును ఇంగ్లీషుపరగణాలుగా చేయుచుండిరి. ఇట్లు క్లైవు వారన్ హేస్టింగ్సులు ప్రారంభించిన కుటిలరాజ్యతంత్రము అత్యద్భుతముగా ప్రయోగించబడి నేటి బ్రిటిషు పరగణాలును స్వదేశసంస్థానములునుగల బ్రిటిష్ ఇండియా నిర్మించబడెను.

ఆంగ్లేయ వర్తకుల కోపులు కోఠీలు కోటలయ్యెను. వీరి ఫ్యాక్టరీ గుమాస్తాలు కలెక్టరులైరి. వీరి ముఖ్యాధికారులు గవర్నరులైరి. వీరుకాపలాకొరకు పెట్టిన రెండువందల సిపాయీలు రెండులక్షల సైన్యములయ్యెను. వీరి వ్యాపారపు టోడలు యుద్ధనౌకలయ్యెను. చూచుచుండగనే వర్తకము జేసికొను సంఘమువారు దేశపరిపాలకులైరి. స్వతంత్రభారతము బ్రిటిష్ ఇండియాగా మారిపోయెను. ఈమార్పు ఒక్కసారిగా జరుగలేదు. కొన్నియేండ్లలో జరిగినది. బలవంతముగా గాక అప్రయత్నముగా జరిగినట్లు జరిగినది. 1857 వరకు కంపెనీపరిపాలనకాలమున భారతదేశము నిజమునకు బ్రిటిషుఇండియాగా నున్నను సిపాయి విప్లవానంతరము 1858 లో ఆంగ్లరాజమకుటము క్రింద పాలితరాజ్యముగా ప్రకటింపబడిన పిదపనే ఇది సాక్షాత్తుగా బ్రిటిష్ రాజ్యమైనది.

## II

## బ్రిటిష్ ఇండియా నిర్మాణ చరిత్ర

బ్రిటిష్‌వారు రాజ్యాధిపత్యము సంపాదించు నప్పటి కింకను దేశము నిమిత్తమాత్రముగా మొగలుచక్రవర్తిక్రిందనే యుండెను. గాని వివిధభాగములను పరిపాలించు రాజులు నవాబులు స్వతంత్రులుగ నుండిరి. ఉత్తరమున వంగరాష్ట్రము, బీహారు, ఒరిస్సాపరగణాలు వంగరాష్ట్ర నవాబుక్రింద నుండెను. అతని ముఖ్యపట్టణము మూర్షిదాబాదు. అయోధ్యనవాబు వజీరుక్రింద నుండెను. ఇతనిక్రింద కాశీరాజు మొదలగు అనేక సామంతు లుండిరి. మొగలు సామ్రాజ్య రాజధానియగు ఢిల్లీలోను రాజపుత్రస్థానము మధ్యరాష్ట్రములు పశ్చిమకనుమలందును మహారాష్ట్రుల యాధిపత్యముండెను. దక్షిణహిందూస్థానమున హైదరాబాదునవాబు పరిపాలనక్రింద ఆర్కాటు నవాబు, తంజావూరు రాజు, మైసూరుసంస్థానము నుండెను. పశ్చిమోత్తర హిందూదేశము మొగలుచక్రవర్తి పరిపాలనలోనే యుండెను. బ్రిటిషువారు నెలకొనునప్పటి కీభాగము శిక్కులక్రిందికివచ్చెను. వారినుండి బ్రిటిషువారు దీనిని లాగికొనిరి. సింధురాష్ట్రము అమీరులక్రింద నుండెను.

ఈ విశాలదేశము బ్రిటిషువారి అధికారముక్రిందికి వచ్చిన కథ చాల చిత్రమయినది. ఎట్లువచ్చినదో దక్షిణహిందూదేశమునుండి చూతము.

## తంజావూరు

తంజావూరు అనేక శతాబ్దములనుండి స్వతంత్రరాజుల పరిపాలనక్రింద నుండిన చిన్నరాజ్యము. 1741 లో ప్రతాపసింహు డీ రాజ్యసింహాసనము నధిరోహించెను. ఆ నాడు ఫ్రెంచివారితో పోటీగానుండిన ఆంగ్లవర్తకకంపెనీవారీ రాజుతో స్నేహము జేసికొనిరి. కొద్దిరోజులలో నీ ప్రతాపసింహుని సోదరుడు ఆ రాజ్యసింహాసనమును సంపాదించుటకు తనకు సాయపడినచో దేవికోటను, ఒక జాగీరును ఇచ్చెదనని ఆంగ్లేయులతో రాయబారము నడిపెను. అంతట వీరు దాని కాసపడి మిత్రద్రోహము చేయుటకుగూడ వెనుదీయక ప్రతాపుని సింహాసనభ్రష్టుని చేయుటకొరకు సైన్యమునంపిరి గాని యీ ప్రయత్నము విఫలమయ్యెను. మరల నింకొక సైన్యమునంపి దేవికోటను పట్టుకొని తమ్ము దేవికోటలో కదలకుండ నుండనిచ్చినచో తమ క్రొత్తస్నేహితుని విడనాడుటయెగాక అతనిని బంధించి యుంచెదమనియు అతనికి కొంత భరణము నివ్వవలసినదనియు ప్రతాపునితోనే బేరముబెట్టిరి. భారతదేశమున బ్రిటీషువారు రాజ్యాక్రమణకొరకు చేసిన ధర్మయుద్ధములలో నిదియే మొదటిది.

తంజావూరు కర్నాటక నవాబు క్రింది సామంతరాజ్యము. ఈ కర్నాటక నవాబుపై యధికారి దక్షిణహిందూస్థాన సుబేదారుడు. అనగా మొగలాయి చక్రవర్తియొక్క దక్షిణరాష్ట్రపాలకుడగు హైదరాబాదు నవాబు. ఆనాడు ఆంగ్లేయులకు ఫ్రెంచివారికిని వ్యాపారములో పోటీగానుండెను.

ఫ్రెంచివారికన్న తాము హెచ్చులాభము పొందవలెనని తలచియే ఆంగ్లేయులు దేవికోట నాశించియుండిరి. 1754 లో ఆంగ్లేయులును ఫ్రెంచివారును సంధిజేసికొనగా సక సీ కర్నాటక నవాబురాజ్యమునకీ విదేశీయులవలన నేబాధలు కలుగవని తలచిరి, గాని త్వరలోనే ఇది పొరబాటు అని తేలినది. ఆంగ్లేయుల స్నేహితుడగు మహమ్మదాలీ కర్నాటకనవాబుగా నంగీకరింపబడెను. అంతట నతనికి గప్పములివ్వక తిరుగుబాటుచేయుచున్న కొందరు హిందూసామంతరాజుల నణచుటకు ఆంగ్లేయులు తలపెట్టిరి. పాండుచేరీలోని ఫ్రెంచివారు దీనికి తమ యసమ్మతిని తెలిపిరి. అంతట కలహములు కలిగెను. ఫ్రెంచివా రోడిరి. ఫ్రెంచివారితో చేసిన యీ యుద్ధముకొరకు ఆంగ్లేయులకైన ఖర్చుల క్రింద కర్నాటక నవాబు ఆంగ్లేయవర్తక కంపెనీవారికి సాలుకు 280000 పౌనులు లేక 28 లక్షలరూపాయల చొప్పున నిచ్చునట్లు విధించి 1763 లో నతనితో నొక సంధి పత్రము మీద సంతకము చేయించిరి. కొన్ని భూములయొక్క శిస్తులను ఆదాయమును ఈ బాకీక్రింద జమకట్టు ఏర్పాటుతో ఆ భూములను కంపెనీ కిచ్చునట్లు కంపెనీవారు నవాబుతో ఏర్పాటు జేసిరి. నవాబు మారుమాటాడకుండ దీనికంగీకరింపవలసి వచ్చెను. నవాబువలన జాగీరులందిన ఈ జాగీరుదారులే నిజముగా నవాబునకు యజమానులుగానుండిరి. ఆంగ్లేయులు దక్షిణహిందూస్థానమున నడుగిడునప్పుడు వీరికి నిలువనీడలేదు. వారికి మొట్టమొదట సహాయము చేసినవాడు కర్నాటక

నవాబు. తరువాత వారి విరోధులగు ఫ్రెంచివారితో యుద్ధము లందు సహాయము జేసినవాడు నితడే.

ఇట్టి ఆప్తమిత్రుడు ఆ శతాబ్దము పూర్తియగునప్పటికి ఆంగ్లేయవర్తక కంపెనీవారి చేతిలో కీలుబొమ్మ స్థితికి దిగిపోయెను. ఆకంపెనీనౌకరుల దయాధర్మములపై నాధారపడ వలసిన వాడయ్యెను. లార్డు వెలస్లీ యీ నవాబుతో మరల నొక సంధియేర్పాటు గావించునాటికీ నవాబు ఆంగ్లేయుల స్నేహపు వలలోజిక్కి వారిరక్షణ యురితాళ్ళలో బాధపడుచు అసహాయుడై యుండెను. అతనిరాజ్యముయొక్క మేనేజిమెంటు కంపెనీవారిచేతిలో నుండెను. ఇప్పు డీ క్రొత్తసంధివలన నతని రాజ్యముయొక్క ఆదాయములో నైదువంతులలో నాల్గువంతులు కంపెనీవారికి శాశ్వతహక్కుగా నిచ్చివేయబడెను. మిగిలిన ఐదవవంతు ఆదాయ మీ నవాబుపోషణకొరకు ప్రత్యేకింపబడెను. ఇట్లీనవాబు వీరిచేతిలో మనువర్తిదారుడైనాడు. ప్రాతస్నేహము కృతజ్ఞతలను బట్టి ఈ భరణమును నవాబు దర్జాయు మాత్ర మీ దురదృష్టవంతుని కింకను గొన్నాళ్ళు మిగిల్చియుంచిరి. గాని 1853 నాటి గవర్నరుజనరలగు డల్హౌసీకి ఈ పూర్వకాలపు మర్యాదయు, ఈ దర్జాయు, మనువర్తియు, అర్థములేనట్లుగా కనబడి కంపెనీడైరక్టర్లతో ఆలోచించి ఈ కృతజ్ఞత ప్రహసనము నంతటితో నంత మొందింపదలచి అప్పటి కర్ణాటక నవాబు తదనంతరము వచ్చిన అజింషానీబిరుదు నహింపవలదని నిషేధించి అతని కీయవలసిన ఐదవవంతు ఆదాయము నిచ్చుటకు నిరాకరించెను.

'శాశ్వతసంధి'పత్రినియమములు కూడా అవి పరిపాలించుట యవసరమని తమకు తోచినంతకాలమే గాని, తరువాత తాము మన్నింపవలసిన పనిలేదని ఈ గవర్నరు జనరలు సూత్రీకరించెను.

బ్రిటిషువారితో సంధిచేసికొనిననవాబు 1792 లో చనిపోగా ఆనాటి పరిస్థితులనుగూర్చి మిల్లు తన బ్రిటిషుఇండియా చరిత్రిలో నిట్లు వ్రాసినాడు "అయోధ్యయు కర్నాటకమును పూర్వము చాల భాగ్యవంతములైన రాజ్యములు. బ్రిటిషు ప్రభుత్వముయొక్క పలుకుబడి క్రిందికి వచ్చినతరువాత దుష్టపరిపాలనవలన భారతదేశములోని తక్కిన ఏభాగముననుగానరాని దౌర్భాగ్యస్థితికి వచ్చినవి. వీనిదుస్థికి ప్రిపంచములోని ఏభాగముననుపోలికలేదు. ఈ ఘోరస్థితి బ్రిటిషుసంపర్కమువలన నెట్లు కలిగినది? " (Mill's History of British India Book VI. 51-52.) ఈప్రశ్నకు జబాబు 1792 లో నవాబుతోడి సంధినిగూర్చి వెలస్లీ పరిపాలనకాలమునాటి చరిత్రకారుడగు వెల్లింగ్టన్ వ్రాసిన మాటలలోనే కనబడును. బ్రిటిషువా రిండియాలో చేసిన ఈమాదిరి సంధు లన్నిటియందు వలెనే ఈ సంధియందుకూడ నొక్క ప్రధానమగు అనర్థకముకలదు. నవాబుయొక్క ఆంతరంగిక వ్యవహారములలో కంపెనీవా రెట్టి జోక్యము కలిగించుకొనరాదను నొక నియమముకలదు గాని ఈపరిపాలనను నిలిపియుంచుటకొరకీ కంపెనీవా రెల్లప్పు డేదో జోక్యము కలిగించుకొనుచునే యుండిరి. ఇంకొక ముఖ్యమైన అనర్థకమేమనగా కంపెనీవారి కిచ్చుకొన

వలసిన సొమ్మును గడువులోపల నిచ్చుకొనుటకై నవాబు తక్కినవారివలెనే పెద్ద వడ్డీ కప్పు పుచ్చుకోవలసి వచ్చుచుండెను. మరియు నా రాజ్యభాగములందలి శాసన ధర్మవిధులు కంపెనీవారి ఫోర్టుసెంటుజార్జి కోటలోని సివిలు మిలిటరీ యాంగ్లేయ జనులవలన నిర్మింపబడి అమలు జరుపబడుచుండెను. ఇందువలని అనర్థకము లసంఖ్యాకములుగ నుండెను. 1792 సంవత్సరపు సంధిషరతులు అమలు జరుగ నారంభించినది మొదలు పైన జెప్పిన అనర్థకములను సంస్కరించుటకును, కంపెనీవారి ఆదాయమును బందోబస్తు చేసికొనుటకును వలసిన మార్పులను చేయవలెనని ప్రతి గవర్నరును నవాబును కోరుచుండెను గాని నవాబు దీని కంగీకరింపలేదు. ఈపద్ధతివలన దేశాదాయము క్రమక్రమముగా క్షీణించిపోవుచుండెను. ప్రజాపీడన మధికమై ప్రజలలో అశాంతి ప్రబలుచుండెను. ఇటిస్థితిలో కంపెనీవారికి టిప్పుసుల్తానుతో యుద్ధము తటస్థించెను. అంతట వెలస్లీ యీ కర్నాటకమును బ్రిటిషురాజ్యములో కలుపుకొనదలచెను. దానికొక నెపము సులభముగనే దొరికెను. ఈ కర్నాటకనవాబు తన ప్రక్కరాజగు టిప్పుతో నుత్తరప్రత్యుత్తరములు జరుపుచున్నాడనియు ఇవి సంధి షరతులకు భంగకరమనియు నందువలన కంపెనీవారు తమ క్షేమముకొరకు వలసినచర్యగైకొనుట కర్హులనియు నిర్ణయించి పైనచెప్పిన ప్రకారము కర్నాటక నవాబును మనువర్తిదారుగ జేసివైచెను.

వెలస్లీయొక్క ఉత్తరువులు మద్రాసుకు చేరునప్పటికి అప్పటి కర్నాటక నవాబు ఓమ్దల్ఉమ్రా అనారోగ్యముగ నుండి తన వ్యవహారములు చక్కబెట్టుకోలేని స్థితిలో నుండెను. తరువాత కొద్దిరోజులలోనే చనిపోయెను. అంతట నీ నవాబు టిప్పుతో ఉత్తరములు నడుపుచుండెనను సంగతియు అందు వలన బ్రిటిషుప్రభుత్వమువారు తీసికొన నిశ్చయించిన చర్యను గూర్చియు అతని కొమారునికి తెలియపరచిరి. చిన్న నవాబు దీని కంగీకరింపలేదు. అంతట ఆ యువకుని త్రోసిరాజని క్రొత్తమరతులకు అంగీకరించు పద్ధతిని అతని తమ్ముని కర్నాటక నవాబుగ జేసిరి!

## III

## మైసూరు

మైసూరు మొదట హిందూరాజ్యము. హైదరాలీయను మహమ్మదీయ సైనికుడు తన తెలివితేటలవలన నారాజ్యము సింహాసనము నధిష్ఠించి పాతరాజును మనువర్తిదారుగ జేసెను.

బ్రిటిషు ప్రభుత్వమువారు హైదరాలీతో సంధిజేసి కొని స్నేహముచేసిరి. అయితే మైసూరురాజ్యములోని ఓడ రేవగు బారామహాలు నింగ్లీషువారు అక్రమముగా పట్టు కొనగా హైదరాలీకి కోపమువచ్చెను. అతడు మద్రాసు మీదికి దాడివెడలి ఆంగ్లేయులు తనకనుకూలమగు సంధి కొడబడునట్లు చేసెను. దీనివలన నతనిని ఎవరైన నెదిరించి నచో నింగ్లీషువారు ఏడుసిపాయి పటాలముల నతనికి సహాయ మంపవలెనని నిర్ణయింపబడెను.

1778లో బ్రిటిషువారు ఫ్రెంచివారితో యుద్ధము చేయుచు పాండుచేరినిపట్టుకొని మైసూరులోచేరిన 'మాహి'ని ముట్టడించిరి. హైదరాలీ తన అసమ్మతిని చూపినను వినలేదు. అంతట నతడు కర్నాటకములోని ఆంగ్లప్రదేశములపై దండెత్తి వచ్చెను. ఈతనిరాకకు ఆ ప్రదేశజనులు తమ్ముద్ధరించుటకువచ్చినట్లు సంతసించిరని ఆంగ్లచరిత్రకారుడగు మిల్లు వ్రాసియున్నాడు- అనగా నాప్రజ లానాటి యాంగ్లపరిపాలనలో నంత బాధపడుచుండిరన్నమాట!

ఆ యుద్ధములో సేనానాయకుడుగనుండిన యొక ఆంగ్లేయుడుకూడ హైదరు ప్రజానురంజకుడుగ నుండెనని వ్రాసినాడు. హైదరు పేటా ఆర్కాటులను స్వాధీనపరుచుకొనెను. అతడు అచ్చటి ప్రజల కెవ్వరివలన నెట్టి బాధయు కలుగనీయలేదు. ఎట్టిదోపిడియు అశాంతియులేకుండ కాపాడెను. నవాబు క్రిందనుండిన యుద్యోగులనెల్ల ఆ యుద్యోగములందే యుండనిచ్చెను. ఆంగ్లేయోద్యోగులకు కావలసిన సొమ్ముకూడ హైద రిచ్చెనని టారెన్సు తన గ్రంథమున వ్రాసినాడు. తరువాత నాంగ్లేయులు మైసూరుపై దండయాత్ర వెడలినప్పుడు జరిగించిన అత్యాచారములకు భీభత్సములకు నిది యెంత భిన్నము! అయిన నాంగ్ల చరిత్రకారులు హైదరు నొక్క రాక్షసునిగ జిత్రించిరి. ఆంగ్లేయులతోడి యుద్ధమధ్యముననే 1782లో హైదరు మరణించెను. టిప్పుసుల్తాను మైసూరు రాజయ్యెను. ఆంగ్లేయు లతనితో నొక సంధి జేసికొనిరి.

హైదరు తన జీవితకాలములో చాలవరకు యుద్ధము

లందు నిమగ్నుడై యున్నను, అతడు రాజ్యపరిపాలనము నేమరలేదు. అతని పరిపాలనలో, పారిశ్రామికులు వర్తకులు అభివృద్ధిగాంచిరి. కృషి వర్ధిల్లెను. ఉద్యోగులందు లంచగొండె తనము అణచి వేయబడెను. తనరాజ్యములో నలుమూలలను విదేశరాజ్యవ్యవహారములనుగూడ హైదరు జాగ్రత్తగాకనిపెట్టి చూచుచునేయుండెను. అతనికి చదువు రాకపోయినను మంచి తెలివితేటలతో తన ఉత్తర్వులను తన కార్యదర్శులకు చెప్పి వ్రాయించును. అతడు చనిపోవు నాటికతని ఖజానానిండ ద్రవ్యముండెను. దేశము సుభిక్షముగనుండెను. 300000కాల్బలముగల సైన్యము, విశాలదేశము నుండెను. (చూడు రిఫారం ప్యాంప్లెట్ - కర్నల్ ఫుల్లర్‌టన్.)

టిప్పు సుల్తానుగూడ చాలా తెలివికలవాడు. అతని దేశము చక్కగా పాడిపంటలతో తులతూగుచుండుట; పరిశ్రమ లభివృద్ధిలో నుండుట; క్రొత్తపట్టణములు బయలు దేరుచుండుట; వాణిజ్యము బాగుగా జరుగుచుండుట; ప్రజలు సుఖముగా నుండుట చూచిన విదేశీయులనేకు లాతనిపరిపాలనను పొగడియున్నారు. అతనిపైన నాంగ్లేయచరిత్రకారులు వేసిన అపవాదులకు భిన్నముగా అతనియందు ప్రజలు అనురాగమును కలిగియుండుటను దెలిపినారు. (Moore-War with Tippu).

"డిరోం" అను నింకొక గ్రంథకర్తకూడ టిప్పుసుల్తాను పరిపాలనలో మైసూరు సుభిక్షముగా నుండుట వర్ణించినాడు. (Diroms' Narrative). హైదరు టిప్పూలిరువురు అర్ధశతాబ్దమునకు తక్కువగా నేలిరి. ఈఔన్నత్యము కేవలము హైదరు

టిప్పూలే చేసినది కాదు. ఈ యాన్నత్య కారణములు, మైసూరులోని చక్రనికాలువలు, అంతకుముందు పాలించిన హిందూరాజుల కాలముననే నిర్మింపబడెను.

1789లో ఆంగ్లేయులకు మైసూరుతో మూడవయుద్ధము తటస్థించెను. 1792 లో టిప్పుసుల్తాను తనరాజ్యములో సగము ఆంగ్లేయులకిచ్చి విశేష నష్టపరిహారము నొసగవలసి వచ్చెను. హైదరు రాజవంశమునకు మిగిలినరాజ్యమును వెలస్లీ పూర్తిగా బ్రిటిషు రాజ్యములో కలుపుకొని ఆవంశమును రూపుమాపి ప్రాతహిందూరాజ కుటుంబములోని వారిలో మిగిలియున్న వారికి కొద్ది రాజ్యభాగ మిచ్చి మైసూరురాజుగా జేసెను.

## IV

## వంగరాష్ట్రము

హైదరాలీ మైసూరు నాక్రమించిన సంవత్సరముననే వంగరాష్ట్రము బ్రిటీషువారి స్వాధీనమైనది. వంగరాష్ట్రము మొగలు చక్రవర్తిమకుటములోని విలువలేని భూషణము. బ్రిటిషువారివశమైన యీ క్రొత్తరాజ్యము తరుగనిసంపదలు కల దేశమని ఈరాజ్యము తన యజమానులను ప్రపంచములో కెల్ల ధనవంతమగు సంఘముగజేసి తీరునని క్లైవు అప్పుడే చెప్పియుండెను. వంగరాష్ట్రము నందనవనమని పేరువడసియుండెను. "ఈరాజ్యములో ప్రజలకు ఆస్తికి నెట్టిభయమును లేదు. విలువగల సరుకులతో పోవువర్తకులు సైతము ప్రభుత్వము వారుచితముగా నిచ్చు రక్షకభటుల సంరక్షణకలిగి నిర్భయ

ముగా ప్రయాణము చేయగలుగుదురు. ఏ జిల్లాలోనైన నొక ధనపుమూట నెవరైనపార వేసికొనినచో నది చూచినవారు దానిని ఒక కొమ్మకు కట్టి రక్షకభటులకు తెలుపు నీతి మర్యాదచ్పట కల"దని హాల్ వెల్ వ్రాసి యున్నాడు.

(Tracts upon India. Reform Pamphlet No. 9)

"డక్కాలో సాగుచేయని భూమిలేదు. న్యాయము చక్కగా పరిపాలింపబడుచుండెను. జస్వంతరావు పరిపాలన నిర్దుష్టముగానుండెను. అతడువిద్యావంతుడు.ప్రజానురంజకుడు. సర్వమక్తావ్యాపారపంటలపైన నతడుపన్నులుతీసివేసెను." అని వ్రాసియున్నాడు, అలివర్దీఖాను వంగరాష్ట్ర నవాబగునప్పటికి వంగరాష్ట్ర మట్టి మంచిస్థితిలో నుండెను. అతని పరిపాలనలో దేశ మభివృద్ధి గాంచెను. సత్ప్రవర్తనము, సమర్థతయు నతనికి గావలసిన యోగ్యతలు.మహమ్మదీయులైనను హిందువులైనను అతడు సమానముగ జూచి మంత్రిపదవులకు సైనికోద్యోగములకు నియమించుచుండెను. దేశాదాయము దూరపు ఢిల్లీకి పంపివేయుటగాక దేశక్షేమముకొరకు ఖర్చు చేయబడుచుండెను. (హిస్టరీ ఆఫ్ బెంగాల్, స్టివార్టు) వంగరాష్ట్రము ఆంగ్లేయ పరిపాలనక్రిందికి వచ్చిన పదేండ్లలోపుగా దేశములో గొప్పమార్పు వచ్చినది. రాష్ట్రమున దుష్పరిపాలనము ప్రజాపీడనమును మితిమీరినవి. "దేశపరిస్థితులు తెలియక దూరములనుండి కేవలము ధనకాంక్షతో నుండు కంపెనీ డైరెక్టర్లకు తప్ప నీ దేశములో తాముచేయు పనుల కిక నెవ్వరికిని బాధ్యత వహింపనక్కరలేని పద్ధతిలో అమితమైన లంచగొం

డైలె అధిక గౌరవముగల కంపెనీ యుద్యోగులు, మానవ మాత్రుడు గ్రహించుకొనలేని వ్యామోహాములకు ఆశలకు విశేషావకాశములు కలిగి యుండుట, యేదైన నొక కబు రింగ్లాండుకు పోయి వచ్చుటకు 1½ సంవత్సరములు పట్టుపరిస్థితిలో క్లైవు ఇంగ్లాండుకు వెళ్ళినపిదప 5 సంవత్సర ములుజరిగిన దుష్టపరిపాలన వర్ణనాతీతము. క్రీస్తుకుపూర్వకాల మున రోము సామ్రాజ్యములో గవర్నరులుగా పంపబడిన "ప్రొకాన్సలు"లు చంద్రకాంత శిలాహర్మ్యములు నిర్మించు కొనుటకు సంపదలతో తులతూగుటకు అత్తరులో పొరలుటకు ఇంద్రభోగము లనుభవించుటకు తమక్రిందనుండిన పరగణాల భాగ్యభోగ్యములనెల్ల పిండిపీల్చి పిప్పిచేయుచుండి నట్లే క్రీస్తు తరువాత మనదేశము నాక్రమించిన ఆంగ్లేయవర్తక కంపెనీ నౌకరులు మనదేశ భాగ్యభోగ్యము లనుభవింపసాగిరి. దేశము లోని వర్తకమును తమహస్తగతమును జేసికొనిరి. దేశవస్తువు లను తమకు చౌకగా నమ్మునట్లు తమవస్తువులను ప్రియముగా గొనునట్లు నేటివులను బాధించుచుండిరి. దేశములోని న్యాయ విచారణాధికారులను, పోలీసులను, రివిన్యూ అధికారులను, ఈ తెల్లనౌకరులు తృణీకరించి అవమానించు చుండిరి. బ్రిటిషు ఫ్యాక్టరీయొక్క ప్రతినౌకరుకును కంపెనీవారికి గల సర్వాధి కారములు నుండెను. ఇట్లు కలకత్తాలోని తెల్లవారందరు అతి స్వల్ప కాలములోనే లెక్కలేనంత ధనము నార్జించుకొనిరి. మూడుకోట్ల భారతీయుల భాగ్యభోగ్యములెల్ల ఇట్లు హరింప బడి వారు ధనికులైరి. వీరు దరిద్రులైరి.

ఈప్రజలు పూర్వపరిపాలకుల క్రిందనుండి నప్పుడు దుష్పరిపాలనము మితిమీరినచో నీప్రజలు తిరుగబడి ఆ పరి పాలకులను కూలద్రోయ గలుగుచుండిరి. కాని నేడు దాపు రించిన క్రొత్తప్రభుత్వ మిట్లు కూలద్రోయ వీలైనదికాదు. అనాగరక ప్రాచీనప్రభుత్వములలో కెల్ల నన్యాయమగు నిరం కుశ ప్రభుత్వముయొక్క ప్రజాపీడనము ఆధునిక నాగరకత వలన విశేషపశుబలము కలిగిన ప్రభుత్వములలోకెల్ల బలమైన ప్రభుత్వముయొక్క పశుబలము గలిగియుండెను. అందువలన దీని గట్టిపట్టును ప్రజలు విడిపించుకో లేకుండిరి. (Macaulay's Essay on Clive.)

## V

## అయోధ్య

అయోధ్య చరిత్రయు పై విధముగనే యుండెను. అయోధ్య ఆంగ్లేయుల వశము గాక పూర్వము సుభిక్షముగ నుండెను. ప్రజల కెట్టి బాధయు లేకుండగనే సాలుకు మూడు కోట్ల రూపాయలు ఆదాయము వచ్చుచుండెను. నావిక సైన్య మును చాలమంది సివిలు ఉద్యోగులను పోషింపవలసిన భార మును నవాబుపై నాంగ్లేయులు విధించిరి. అంతట నీ ఖర్చు భరించలేక అతడు చిక్కులలో పడెను. దేశము పాడైపోయి దారిద్ర్యమున బడెను. అతని ఆదాయము సగమునకు క్షీణిం చెను. సాలుకు 34 లక్షల రూపాయలచొప్పున తొమ్మిది సంవత్సరము లీ దురదృష్టరాష్ట్రమునుండి ఆంగ్లేయులు సొమ్ము

పించిరి. (Mill's History of India) కంపెనీయొక్క సివిలు మిలిటరీ యుద్యోగుల జీతములు, పింఛనులు, నవాబు ఆదాయము మ్రింగివైచెను. అతని అధికారముకూడా క్రమక్రమముగా క్షీణించి ఆంగ్లేయుల హస్తగతమయ్యెను. అతని అధికారము గౌరవము సంపదయునశించినవి. వారన్ హేస్టింగ్సు ఆనాటి స్థితిని వర్ణించియున్నాడు. "దీనివలన దేశములోని ప్రజలకు ఆంగ్లేయ పద్ధతులపైన తీవ్రమైన అసహ్యాభావము కలిగెను. నవాబు వజీరు సేవకుల హక్కులకు బాధ్యతలకు భంగకరముగా తెల్లవారు ప్రవర్తించుచుండిరి. కేవలము తెల్లవారి లాభముకొరకు నవాబుపైన పన్ను విధించుట అతడు భరింపలేని అతని కక్కరలేని సైనిక వ్యయభారము నతనిపైన వేయుట ఎంత అన్యాయము! అయోధ్యలోని ప్రతి ఆంగ్లేయునకు సర్వాధికారము లుండెను. లక్షలకొలది ఆదాయమును వారు హక్కుగా గోరుట ప్రారంభించిరి. ఒక్క యేటలో రెండు లక్షల నొడ్డుట వారికొక లెక్కగాలేదు." అని వారన్ హేస్టింగ్సు వగచినాడు. కారన్‌వాలిస్ కాలములో ఆంగ్లేయులీ అయోధ్యవలన పుచ్చుకొను డిమాండు సాలుకు 250000 పౌనులనుండి 700000 పౌనులకు పెరిగినది. తరువాత నది యింకను పెంచబడినది. 1801లో రాజ్యమునంతయు లాగికొందునని బెదిరించి వెలస్లీ సాలుకు 1300000 పౌను లాదాయము వచ్చు అర్ధభాగమును లాగుకొన్నాడు. 1815 మొదలు 1825 వరకు అప్పులనుపేరున 40 లక్షల పౌనులు బలవంతముగా తీసికొని నవాబుకు రాజని బిరుదునిచ్చి ఎందుకు పనికిరాని

భూముల నిచ్చినారు. ఈ చరిత్రభాగ మెవరో వ్రాసినదికాదు; ఆ అన్యాయములు చేసినవారు రచియించినదే! ఈ అయోధ్య రాష్ట్ర దుష్పరిపాలనకు ప్రజల దారిద్ర్యమునకు ప్రజాపీడనకు కారణము నేటి పరిపాలకులా? వారిపైన స్వారి చేయుచుండిన ఆంగ్ల ప్రభువులా? (Reform Pamphlet No. 9)

## VI

## మహారాష్ట్ర రాజ్యము

మహారాష్ట్రుల పరిపాలనను గూర్చి ఆంగ్లచరిత్రకారు లనేకములగు అబద్ధపుకథలను గల్పించి ఆవీరజాతికి నాయకు డగుశివాజీని దోపిడిదొంగయని నిందించినారు. కాని ఆమహానుభావుని గొప్పదనమును భారతీయులెల్లరు నిటీవల గ్రహించి అతనిని పూజించుచున్నారు.

ఔరంగజేబు రాజ్యకాలమున మొగలుసామ్రాజ్యము యొక్క పునాదుల నీ మహావీరుడు శివాజీ కదల్చివైచినాడు. అతనికి కేవలము రణకౌశలముమాత్రమే గాక మంచి ప్రభుమంత్రోత్సాహశక్తులు, పరిపాలనా దక్షతయు గలవు. తన పరిపాలనలో ప్రజలసంరక్షణకొరకతడనేక శాసననియమములు చేసి వానిని తన రాష్ట్రీయగ్రామాధికారులు సక్రమముగా పాటించునట్లు చేసెను. యుద్ధమువలని అనర్థకములనుండి ప్రజలను కాపాడుటకొరకతడు చేసిన కట్టుబాటుల ప్రాశస్త్యమునుగూర్చి అతని శత్రువులుకూడ పొగడియున్నారు. ఈ "దోపిడిదొంగ" యొక్క సద్గుణములు అప్రతిమానములు. దేశ

ముయొక్క సత్పరిపాలన కొరకతడేర్పరచిన బందోబస్తులు అతడు గతించిన ఎనుబదివత్సరములవరకు గూడ చక్కగా పనిచేసియుండుటయే అతని గొప్పదనమునకు సాక్షి. 'ఆంక్వెటిల్ డు పెరాన్' అనునతడు ఆనాడు భారత దేశమును దర్శించి ప్రకటించిన వ్యాసములో మహారాష్ట్ర రాజ్యమును గూర్చి చక్కగా వర్ణించియున్నాడు:

(Brief account of a voyage to India. Anquetil du Perron published in Gentleman's Magazine 1762)

"సూరతునుండి నేను పశ్చిమ కనుమలు దాటితిని. పగలు పదిగంటలవేళ నేను మహారాష్ట్ర దేశముజొచ్చితిని. సత్యయుగమునాటి నిరాడంబరత్వము ఆనందము నాకన్నులకు గోచరించినవి. ప్రకృతి యిచ్చట కృత్రిమపు మార్పులజెంద లేదు. యుద్ధము దుఃఖము నిచ్చటి ప్రజలెరుగరు. ప్రజలెల్లరు సంతోషముగ మంచిబలశాలురుగ ఆరోగ్యవంతులుగా నుండిరి. అతిథిపూజ, అభ్యాగతి కాతిథ్యము నచ్చట సర్వసామాన్యమగు మర్యాద. బంధుమిత్రులకు ఇరుగు పొరుగువారికే గాక కేవలము పరాయివారినిగూడ ఆ రాజ్యములోని గృహస్థులు సత్కరింతురు."

శివాజీ తరువాత రాజ్యమేలినవారుకూడ చాల సమర్థులగురాజనీతిజ్ఞులు. బాజీరావుబులాల్‌కు మహారాష్ట్రుల ధైర్య సాహసములు, ధృఢకాయము మాత్రమేగాక కొంకణబ్రాహ్మణుల విద్యాజ్ఞానము, మర్యాదయు నుండెను. అతడు మహావక్త, కుశాగ్రబుద్ధి, గంభీరుడు, నిరాడంబరుడు, మంచినీతి

జ్ఞుడు. సామాన్య సైనికులతో పాటు కష్టముల కోర్చుకొనును. అతనితర్వాత రాజ్యాధిపత్యము వహించిన బాలాజి రావుకు గూడ మంచి రాజనీతికౌశలము యుద్ధమధ్యమున దేశపరిపాలనను చక్క గా నడిపిన దిట్టరి. అతనికాలమున ప్రజలస్థితి యింకనుఅభివృద్ధి గాంచెను. దేశాదాయము వసూలు, వేలముపాటలు వేయు యిజారా పద్ధతి నితడు మాన్పెను. న్యాయ విచారణ జన సామాన్యమునకు సులభసాధ్యము జేసెను. బాలాజీరావు తరు వాత పరిపాలకుడైన మధోరావు యుద్ధమునందెంత చతురుడో పరిపాలనమం దంత సమర్థుడు.

ఈ కాలమున భారత దేశమం దంతటిలోను మహా రాష్ట్రదేశ మత్యంత ఔన్నత్యము ననుభవించుచుండెను. మధోరావు మంత్రి సుప్రసిద్ధుడగు రామశాస్త్రి. అతని ధర్మ నిర్ణయములు తీర్పులు నేటికి ప్రమాణములుగా నున్నవి. అత డెంతో శ్రద్ధవహించి జనసామాన్యమున కెల్ల మేలొన గూర్చెను. ఒకరోజుకు కావలసిన దానికన్న నెక్కువ ఆహార సామగ్రి నుంచుకొనుట కీ సద్ధర్మ డంగీకరింప కుండెను. (Grant Duff's History of the Mahrattas Vol.II 208)

పీష్వాయొక్క రాజ్యములను నానాఫర్నవీసు ఇరువదై దేండ్లు అత్యంతసమర్థతతో పరిపాలించెను. ఇతడు తన చాక చక్యమువలన బుద్ధికుశలతవలన ఆవిశాల సామ్రాజ్యము నతి చతురతతో పరిపాలించెనని అతని ధర్మపద్ధతులను సత్పరిపాలన న్యాయపరిపాలనలను సర్ జాన్ మాల్కం చక్కగా వర్ణించి యున్నాడు. "దక్షిణమహారాష్ట్రజిల్లాలయం దంత చక్కనికృషి

సంపద, సమృద్ధియైన పాడిపంటలు నింకేభాగమునను నాకు గనబడలేదు. పీష్వాయొక్క రాజధాని నగరమగు పూనాపట్ట ణము మిక్కిలి ధనవంతమైన వర్తకస్థానము. కృషికి అనుకూల పరిస్థితులులేని ఈ దక్షిణాపథము (డెక్కన్)లో నింతటి కృషి సంపదయుండుట యాశ్చర్యజనకముగా నున్నది" అని పలికి నాడు. హోల్కారు పరిపాలనలో నున్న ఇంకొక మహారాష్ట్ర రాజ్యభాగమును గూర్చి ఇతడే ఇట్లు చెప్పినాడు "మాళవ రాజ్యము క్రూరజాతుల చేతులలోబడి పాడైనదిగాని ఆస్థితిలో కూడా యీ రాష్ట్రములో ధనకనకవస్తు వాహనములతో గొప్ప సాహుకారులతో నిండి గొప్ప వ్యాపారమునకు ఆట పట్టులగు మహానగరములు నిరంతరాయమగు ఎగుమతి దిగు మతి వ్యాపారము నాకు గనబడినది. భారతదేశములో నెల్ల యెడలను వ్యాపార భీమాకార్యాలయములు చక్కగా పని చేయుచునే యున్నవి. పైన చెప్పిన దక్షిణ మహారాష్ట్ర జిల్లాలు వాణిజ్యకృషి విషయములందు పూర్వపు ఔన్నత్య ముకన్న మన బ్రిటిషుపరిపాలనమున హెచ్చుఅభివృద్ధిగాంచు నని నాకు తోచదు. మొత్తముమీద మహారాష్ట్రపరిపాలన శాంతి యుతముగను ప్రజానురంజకముగనుండెను. ఈ ఔన్న త్యమునకు ముఖ్యకారణము వ్యవసాయ జీవనమన్న హిందువు లకు గల ప్రీతియే. పట్టణములను గ్రామముల నుద్ధరించి అభి వృద్ధిచేయు పద్ధతి మనకన్న వారికెక్కుడు చక్కగా తెలియు ననుటకు సందియములేదు. ధనవంతులకు ప్రోత్సాహమిచ్చుట పెట్టుబడిని వృద్ధిచేయుట అన్నిటికన్నను ముఖ్యముగా గ్రామ

పురోభివృద్ధికి తోడ్పడుట ఇతర భారతీయసంస్థలను సంరక్షించి జనసామాన్యములోని అన్నితరగతుల వారికి తగు జీవనాధార వృత్తులు కల్పించుటయు నీ యౌన్నత్యమునకు కారణములు." (Reform Pamphlet No. 9).

ఆనాడు రాజ్యమేలిన మహారాష్ట్ర పరిపాలకులలో రాణీ అహల్యాబాయి చాలా ప్రసిద్ధిచెందిన మహారాజ్ఞి. ఆమె పరిపాలనమున దేశ మనుభవించుచుండిన శాంతిని సౌఖ్యమును సర్ జాన్ మాల్కాలం వర్ణించియున్నాడు. తనప్రజల కందరికిని క్షేమలాభములు కలిగించుటయే ఈమహారాణి యొక్క పరమ లక్ష్యముగ నుండెను. సావుకారులు, వర్తకులు, కర్షకులు, రైతులు, ధనవంతులై యభివృద్ధి జెందుటను వీక్షించుటయన్న ఈమెకు పరమసంతోషము. మాళవరాజ్యమున కీమె పరిపాలనము మేలుబంతిగనుండెను. ఈమె అనేకకోటలు నిర్మించెను. వింధ్యపర్వతముల కడ్డముగా నొకవిశాలమగు రాజబాటను నిర్మించెను. మహారాష్ట్ర దేశములోని రాజులెల్లర కీమెయందు మిక్కుటమగు భక్తి. (Malcolm's History of Central India Vol. I. P. 176. 195.)

ఆనాటి మహారాష్ట్రరాజ్య సమ్మేళనములోని ప్రముఖులలో బీరారురా జొకడు. ఈతని రాజ్యముకూడ మంచిస్థితిలో నుండెను. ఈజిల్లాలలో పర్యటనముజేసిన ఐరోపాజాతి బాటసారు లీరాజ్యముయొక్క సారవంతమగు భూమి, వాణిజ్యము, ప్రజల యభివృద్ధినిగూర్చి పుష్కలములగు పాడిపంటలు గొప్ప దేవాలయములు, నీటి వసరులు ప్రజల యభివృద్ధినిగూర్చి వర్ణించియున్నారు.

# VII

## పశ్చిమోత్తర పరగణా

"రాంపూరు రాజ్యములోనుండి పోవునప్పుడు అచ్చటి కృషి సంపద దృష్టి నాకర్షింపక మానదు. ఒక్క జేనెడుభూమి యైన వదలకుండ సాగుచేయబడుచుండెను. ఋతువు అనుకూలముగ లేకపోయినను జిల్లాలోని భూమియంతయు పంటతో నిండియుండెను. దీనివలననే యిచ్చటి రైతుల మంచిస్థితి వెల్లడి యగుచున్నది. నవాబు మైదుల్లాఖానుయొక్క వ్యవహార దక్షతను అందరు మెచ్చుకొనుచుండిరి. ఇతడు విద్యాధికుడు, ఉదారుడు నగు భూస్వామి. దేశాభివృద్ధికొరకు తానే చాలాసొమ్ము వెచ్చించుచుండెను. సాగుకొరకు గొప్ప నిర్మాణములు విశేష ధనము కావలసినప్పుడెల్ల ఇతడు విరివిగా ఖర్చుపెట్టుటకు వెను దీయడు. కాలువలు త్రవ్వించెను. చిన్న నదుల కడ్డుకట్టలుకట్టి నీటిని పొంగించి పరిసర ప్రదేశములను సారవంతముచేసి పల్లము సాగుకు అనుకూలముగా జేయుచుండెను. తన ప్రజలను చక్కగా పరిపాలించి కాపాడుచుండెను. అన్ని విషయములందు నింకను చక్కగా పాటుపడునట్లు వారి నితడు ప్రోత్సహించుచుండెను. రోహిలఖండముయొక్క పరిపాలన విషయములో రోహిల పరిపాలకుల పద్ధతిని బ్రిటిషుపరిపాలనాపద్ధతితో పోల్చిచూచినచో నీ నాగరక బ్రిటిషుపరిపాలనకన్న 'అనాగరక' రోహిలపరిపాలనమే ఎక్కువ బాగుండెననుటకు సందియములేదు. ఈ రాజ్యము బ్రిటిషువారిచేతిలోనికి వచ్చిన ఏడేండ్లలో దేశాదాయములో 2 లక్షల రూపాయలుమాత్రము వృద్ధిజెందెను. తరు

వాత నిరువదియేండ్లలో నీదేశాదాయమునందును అయోధ్య లోనిదత్తమండలములయొక్క ఆదాయమునందును సాలుకు 20 లక్షల రూపాయలు తరుగు రాసాగెను. ఋతువులయొక్క అతివృష్టి అనావృష్టి దోషములవలన చుట్టుపక్కల భూభాగములలో పంటలు పాడై పోయినప్పుడుకూడా దయారామ్ భగవత్ సింగుల రాజ్యములు సుభిక్షముగానుండి పాడిపంటలతో తులతూగు చుండెను. ఈ "చుట్టుపక్కల భూభాగము" లనునవి అప్పటి కై దేండ్లనుండి బ్రిటిషుప్రభుత్వమువారి స్వాధీనములో నున్న భూములు! (Bishop Heber's Journal. Vol. II. Quoted in Reform Pamphlet.)

బిషప్ హెబరు తన జర్నలులో (Vol.II. Page 77-9) సాదత్ ఆలీపరిపాలనకాలమున అయోధ్య మంచి యభివృద్ధిలో నుండుటను పేర్కొని సాదత్ ఆలీ చాలా తెలివిగలవాడనియు వ్యవహారదక్షుడనియు, విజ్ఞానశాస్త్రమన్న అతనికి ప్రీతి యనియు చెప్పియున్నాడు. గవర్నరు జనరలగు హేస్టింగ్సుకూడా సాదత్ ఆలీయొక్క ధర్మవర్తనమును ఋజుగుణమును దయార్ద్రహృదయమును పొగడియుండెను.

## VIII

### భరతపురము

ఆనాటి నేటివుపరిపాలకులక్రింద భరతపురము చక్కగా అభివృద్ధి జెందుచుండిన సంగతి కూడా బిషప్ హెబరు వర్ణించియుండెను. 'భారతదేశములో నేనుచూచినప్రదేశములలోనికెల్ల ఈ రాజ్యభాగములోని పల్లపునీటిసాగు వనరులు చాలాబాగు

న్నవి. వరిపంట చాలాచక్కగానున్నది. ప్రత్తి విరుగబండినది. చెరుకుపంట సమృద్ధిగానున్నది. అనేక చెరుకు గానుగలుండు టయే ఈ దేశము యొక్క సంపదకు సాక్షి. జనసంఖ్య హెచ్చుగా లేదుగాని గ్రామములు మంచి స్థితిలో నున్నవి. కంపెనీవారి భూముల స్థితినిబట్టి చూడగా రాజప్రతినిధి స్థానము నందట్టి సంపద కనబడుట నాకాశ్చర్యకరముగా నున్నది. భరత పుర సంస్థానాధీశుడు చాలసమర్థుడును ప్రజానురంజకుడగు పరిపా లకుడునై యుండవలె. లేదా మన బ్రిటిషు రాష్ట్రములందవలం బింపబడుచున్న పరిపాలనా విధానము నేటివుపరిపాలకుల రాజ్య ములందువలె ప్రజలయభివృద్ధికి సౌఖ్యమునకు అనుకూలమైనది. కాకుండనట్టిదైన గావలె నని నాకు తోచుచున్నది.’

సతారారాజగు ప్రతాపసింహునియొక్క సుగుణముల గూర్చి అతని పాలనలోని రాజ్యముయొక్క సంపదనుగూర్చి బ్రిటిషు ప్రభుత్వమువారే పొగడియున్నారు. (1843 నెం 569, 1268 పుట) కంపెనీడైరక్టర్లు ఆరాజుకు వ్రాసిన ఒకలేఖలో నిట్లు కలదు. “మాప్రభుత్వమునుండి మాకువచ్చుచున్న సమాచార ములను బట్టి చూడగా మీవిధ్యుక్త ధర్మములను మీరెంతో చక్కగా నిర్వహించుచున్నట్లు మాకు కనబడుచున్నది. మీ పరిపాలనలో మీరాజ్య మత్యంతాభివృద్ధిగాంచుచు మీ ప్రజలు సుఖముగా నుండుటయు మీరు అవలంబించిన చక్కని పరి పాలనా పద్ధతియొక్కయు మీసత్స్వభావము యొక్కయు పరి ణామముగనున్నది. మాకు చాలసంతసముకలిగించినది. ప్రజోప

యోగకరములగు అనేక నిర్మాణములను మీరు స్వాయముగా విశేషసొమ్ము ఖర్చుపెట్టి నిర్మించుట మీయందు మాకుగల గౌరవము నినుమడింపజేసి మాకు సంతోషప్రదమైనది".

ఇట్టీరాజుగారి సత్పరిపాలనమును వానివలన నా రాజ్యము పొందుచున్న అభివృద్ధినిగూర్చి బ్రిటిషు ప్రభుత్వ మాయనను అభినందించుచున్న కాలముననే తమ పరిపాలనలో జేరిన మూడు కోట్ల ప్రజలస్థితి ఎట్లుండెను? ఫ్రెండ్ ఆఫ్ ఇండియాలో 1852 ఏప్రియల్ 1 వ తేదీన డాక్టర్ మార్షమన్‌గా రిట్లు వర్ణించినారు. 'వంగరాష్ట్రములోని రైతుల దుస్థితి ఊహించుటకు గూడ వీలులేనంత ఘోరముగా నున్నదను సంగతి నెవ్వరు కాదనజాలగలరు? ఈ రైతులు కుక్కలు వసించుటకైన తగని గూభ్యముల (hovels) లో నివసింతురు. చింపిరి పేలికలు ధరింతురు. వీరి కుటుంబములలో నెవరికిని రోజు కొకపూటయైన కడుపునిండ భోజనముండదు. వీరికి సామాన్య మానవ సౌఖ్యములైనను లేవు. సాలుకు మూడునాలుగుకోట్ల రూపాయల విలువగల పంటను పండించు ఈ రైతుల నిజమైన స్థితిగతులు బయల్పడినచో విన్నవారిగుండె బ్రద్దలైపోవును.' బ్రిటిషు పరిపాలనకు పూర్వము నందనవనముగ నుండిన వంగరాష్ట్రమీ అధోగతి లోనికి వచ్చిన సంగతి స్వాయముగా చూచిన వారి వర్ణనమిది. నిజముగా నీ వంగరాష్ట్రము మొదటి నుండియు ఘోరస్థితిలో నున్నచో నీ బ్రిటిషువారు ఈవంద సంవత్సరములలో దాని నుద్ధరించుట కేమిచేసిరి? క్లైవు యొక్క పలుకు లింకను లిఖితరూపముగా నిలిచియున్నవి:

"వంగ రాష్ట్రము తరుగనిసంపదలకు నిలయమైన భూమి. దీనియజమానుల నిది ప్రపంచములోకెల్ల ధనవంతులుగ జేయగల భూమి." ఈ పరిణామము ఎట్లు కలిగినది? తన కాలమున నా రాష్ట్రప్రజలు క్రమక్రమముగా ఘోరదారిద్ర్యమున దుస్థితిలో మునుగుచున్నారని గవర్నరుజనరలైన కారన్ వాలీస్ ప్రభువే పలికియున్నాడు. నానాటికి హెచ్చింపబడిన రివిన్యూ శిస్తు వసూళ్ళవలన 1765 కు 1790 కు మధ్య బ్రిటిష్ ప్రభుత్వమువారు తా మంతకంతకు ధనవంతులుకాగా నా రాజ్యప్రజ లంతకంతకు దరిద్రులైనారు. దేశము నిర్ధనమై వట్టిపోయినది. 1827 లో గవర్నరు జనరలుగ నుండిన లార్డు హేస్టింగ్సుఇట్లుచెప్పినాడు: (Parliamentary Papers Page 157) "మన చేతిక్రింద నొక క్రొత్తతరమువారు పెరిగినారు. మన శాసనములక్రింద రక్షణక్రింద వ్యాజ్యములు పెరిగినవి. స్పర్థ హెచ్చినది. నీతి క్షీణించినది. న్యాయవిచారణ శాఖవలెనే మనుష్యుల, ఆస్తిరక్షణయు, అతృప్తికరముగా నుండెను."* 1851 ఆగస్టు 28 వ తేదీన ఫ్రెండ్ ఆఫ్ ఇండియాలో నొక వ్యాసమున నిట్లు వ్రాయబడినది. "ధనముగలవా డెవ్వడును తెల్లవారులోపల తన ధన మెవరో యొకరు దోచుకొనరను ధైర్యముతో పండుకొనజాలడు. రివిన్యూ (శిస్తువసూలు) న్యాయవిచారణ, పోలీసు మొదలగు అన్ని శాఖలలోను మన పరిపాలన పనికిమాలినదిగ నున్నదని గవర్నరుజనరలు విలియం బెంటిక్కు పలికిన పలుకులలో నతిశయోక్తి లేదు. ఇది బ్రిటిష్ పరిపాలనలోని శాంతి భద్రతలు;సత్పరిపాలన".*

*England's debt to India - Lajpati Rai.

# మూడవ ప్రకరణము

# స్వతంత్ర రాజులు సామంతులగుట

## I

## స్వదేశసంస్థానముల సమస్య

ఆంగ్లేయతూర్పు ఇండియా కంపెనీ పదునేడవ శతాబ్ద ప్రారంభము (1600) మొదలు పదునెనిమిదవ శతాబ్దమధ్య (1757) వరకును కేవలము భారతదేశ స్వదేశరాజులయొక్కయు నవాబులయొక్కయుదయపైన ధర్మముపైననాధారపడిహాలెండు, ఫ్రెంచిదేశపు వర్తకులతో పాటుపోటీగా నీదేశములో వర్తకము చేసికొనుచు కాలక్షేపముచేయు వ్యాపారసంఘముగా నుండెను. అటుపిమ్మట 1757 మొదలు 1857 వరకు నింకొంక నూరేండ్లు వారేదేశమున రాజ్యాక్రమణము చేయుచు తాము సంపాదించిన రాజ్యాధిపత్యమును గట్టిపరచుకొనుచు నాంగ్లేయపార్లమెంటు ప్రభుత్వముతో కలసి యీదేశ రాజ్యపరిపాలనాధికారములను చలాయించుచు క్రమక్రమముగా తన వ్యాపారహక్కులను వ్యవహారములను విరమించుకొన సాగెను. 1857లో జరిగిన భారతదేశ సిపాయిల స్వాతంత్ర్య విప్లవానంతరము కంపెనీవారి కప్పటికి మిగిలియున్న రాజ్య పరిపాలనాధికారములు ఆంగ్లరాజ్య మకుటమునకు ఆంగ్లపార్లమెంటుకు బదలాయింపు చేయబడెను. (Government of India. — Ilbert)

మొగలాయిసామ్రాజ్యము బలహీనమై దానికిలోబడి యుండిన సామంతులు స్వతంత్రులై అధికారముకొరకు రాజ్య

సంపాదనకొరకు ప్రాకులాడుచు నిరుగుపొరుగు వారిపై దండెత్తుచు దేశశాంతికి భంగము కలిగించుచుండగా దేశ రక్షణ చేయవలసిన కేంద్రమొగలు ప్రభుత్వము అట్లు చేయ లేని సమయములో క్రొత్తగా నీ దేశమున వ్యాపారము చేసి కొనవచ్చిన విదేశీయవర్తకులు నిర్భయముగను సుఖముగను వ్యాపారముచేసికొనుట దుర్లభమయ్యెను. అందువలన దురాశా పరులును బలవంతులు నగు చిన్నరాజులు, నాయకులు, బందె పోటుదొంగలు తమపైబడి కొల్లగొనకుండ స్వసంరక్షణము కొరకు వీరు సైన్యము లుంచుకొనవలసి వచ్చెను. తమతో పాటు వ్యాపారముచేయు తెల్లవర్తకులతోను యిరుగుపొరుగు స్వదేశ రాజ్యములతోను దెబ్బలాటలు యుద్ధములు తప్పలేదు. బొంబాయి సముద్రతీరములందు సూరతు మొదలగుచోట్ల నాంగ్లవర్తక కంపెనీవారు వర్తకస్థానముల నేర్పరచుకొనిన పిదప అచ్చటి సముద్రతీరపు పరిస్థితులనుబట్టి ఆంగ్లేయు లకు సముద్రచోరుల వలననేగాక, తమతో పోటీచేయు పోర్చుగీసు డచ్చి ఫ్రెంచివర్తకుల వలని భయము, మహా రాష్ట్ర దండులవలని భయములేకుండా చూచికొనవల సిన అగత్యము కలిగియుండినందున నీ ఉద్దేశముతో వీరు కొల్హాపూరు, సావంతవాడి, జంజీర, జఫారాబాదు, క్యాంబే మొదలగు సముద్రబలముగల రాజ్యములతో సముద్రచౌ ర్యమునణచు షరతులుగల సంధిచేసికొనిరి. ఇట్లే పీష్వాతో 1739 లో చేయబడిన సంధియు సముద్రతీర రక్షణకు వాణి జ్యమునకు సంబంధించినది. ఫ్రెంచినాయకుడగు డూప్లే దక్షి

ణాపథమున నవాబులలో నెవరో యొకరిపక్షమున జేరి గొప్ప పలుకుబడి సంపాదించుట లాభముపొందుటయు చూచి ఆంగ్లేయులు నిది ప్రారంభించిరి. 1744 లో నింగ్లాండుపైన ఫ్రెంచి దేశము యుద్ధము ప్రకటించినది. 1748 లో సంధి జరిగెను గాని ఆ సమయమున మనదేశములో నీ రెండు దేశముల వర్తకులకు రగుల్కొనిన యుద్ధకీలలు ఆరక ప్రజ్వలించుచునే యుండెను. 1756 లో నైరోపాలో మరల యుద్ధముతటస్థించి 1763 వరకు జరిగినది. ఈ సందర్భములో ఫ్రెంచివారు భారత దేశమున తమబలముల నుపేక్షించుటవలన నైజాముదగ్గఱ వారి పలుకుబడి తగ్గిపోయి ఆంగ్లేయులపలుకుబడి హెచ్చినది. ఈ సమయముననే ఆంగ్లేయులు అతనివలన ఉత్తరసర్కారులు సంపాదించిరి. 1665 లో దీనిని స్థిరపరచుచు ఢిల్లీ చక్రవర్తి ఫర్మానా పొందిరి. 1775 లో అమెరికా స్వాతంత్ర్యయుద్ధ మారంభమై ఇంగ్లాండుకు ఫ్రెంచిదేశమునకు సముద్రయుద్ధ ముకలిగెను. ఈ సందర్భమున భారత దేశమున మరల నీ కంపెనీలు పోరాడెను. 1783 లో నైరోపాలో సంధిజరిగినను భారత దేశమున కుట్రలుజరుగుచునే యుండెను. ఫ్రెంచి దేశమున ప్రజా విప్లవము కలిగిన పిదప 1793 లో ఫ్రెంచి దేశ మింగ్లాండు పైన మరలయుద్ధము ప్రకటించినది. అంతట ప్రపంచములో వీరాధివీరుడని ప్రసిద్ధిగాంచిన నెపోలియను ఐరోపాలోని రాజ్యములనెల్ల నుఱ్ఱూతలూగించి ఆంగ్లేయులను మూడుచెరువుల నీళ్లు త్రాగించినాడు.

ఈ యుద్ధములందును, ఫ్రెంచివారితోడి సామదానభేద దండోపాయ ప్రయోగములందును, ఆంగ్లేయులకీ దేశములోని రాజులయొక్కయు నవాబులయొక్కయు స్నేహసహాయము లవసరములయ్యెను. ఇదియే వివిధసంస్థానములతోడి సంధి యొడంబడికలు చేయుట ప్రారంభించుటకు గారణమయ్యెను. ఈ సందర్భమున నాంగ్లేయులు తమకు సాయముచేయు స్వదేశ రాజులను నవాబులను స్వతంత్రరాజులుగా గౌరవించుచు వారి యడుగులకు మడుగులొత్తి యుద్ధములందు సంపాదింపబడిన రాజ్యభాగములను వారికిచ్చి తాము ఒదిగి యుండుచుండిరి.

మైసూరు యుద్ధములైన పిదప జయింపబడిన రాజ్య భాగములందు కొన్నిటిని హైదరాబాదునైజాము కిచ్చిరి. నైజాము ఆంగ్లేయులతో శాశ్వతముగా స్నేహముగ నుండి వీరికి సహాయముచేయుచు తనరాజ్యమును సుఖముగా పరి పాలించు కొనునట్లు వీరికి ఒడంబడిక సంధిజరిగెను. హైదరాలీ తొలగించిన పూర్వపురాజకుటుంబమునకు మైసూరును మరల నిచ్చునప్పుడు తిరువాంకూరు కొచ్చిను సంస్థానముల వలెనే రక్షితరాజ్యము (ప్రొటెక్టరేటు) గా చేయబడెను. కర్నాటక నవాబు నధికారవిహీనునిగ జేసి 1801 వరకు పేరునకుమాత్రము నవాబుగానుంచి తరువాత అదియులాగివేసిరి. ఇట్లే ఉత్తరమున అయోధ్యవిషయమునను జేసిరి. దేశములోని రాజులు నవా బులు నెల్లరు పేరునకు ఢిల్లీచక్రవర్తికి లోబడినవారేగాని నిజ ముగా స్వతంత్రులై వర్తించు చుండిరి. దక్షిణాపథమున మహారాష్ట్రులు విజృంభించి దేశములోని పరిపాలకుల నుండి

చౌతుపన్ను బలవంతముగా వసూలుచేయుచుండిరి. 1757 లో ప్లాసీయుద్ధము జరిగినపిదప నాంగ్లేయులను జూచిన షా ఆలం చక్రివర్తికని భయముగనే యుండెను. వారేది కోరిన అది యిచ్చుచుండెను. అందువలననే 1765లో వంగరాష్ట్ర బీహారు ఒరిస్సాల దివానీ యధికారమునిచ్చి ఉత్తర సర్కారులును దక్షిణాపథములును ఆంగ్లేయులకు ఉత్తరసర్కారులకు కర్నాటకమునకు గూడ రాజ్యాధికార పట్టానిచ్చెను. ఇట్లు మొట్ట మొదట ఫ్రెంచివారితో కలహముల నెపమున కుట్రలు చేసి దేశీయరాజుల కలహములందు తమకు దమ్మిడీ ఖర్చులేకుండ యుద్ధములలో వచ్చిన రాజ్యభాగమున దోపిడి సొమ్ములో తాముగూడ పంచుకొనగానే మొట్ట మొదటలో నత్యవసరము కలిగినగాని యితరులతో జోక్యము కలిగించుకొన దలపని ఆంగ్లేయ వర్తకులు మానవ రక్తమును రుచి మరిగిన వ్యాఘ్రములై దేశములో విజృంభించిరి.

తమకు సులభముగా లభించిన రాజ్యభాగములందలి ఆదాయమును తాము సుఖముగా అనుభవింపవలెనన్నచో దాని కేమియు నుపద్రవము లేకుండ కాపాడుకొనవలెనుకదా! దానికి కూడ దమ్మిడి ఖర్చులేని ఉపాయము నాలోచించి చుట్టునుండు భూభాగమును తమతో స్నేహముగానుండు ఏ స్వదేశరాజుతో నవాబుతో ఉండునట్లు చూచుచుండిరి. ఒక్కొక్కప్పు డట్టి రాజ్యములు తమకు వచ్చినను దానిని శాత్రవ మధ్యరాజ్యముగా (బఫర్ స్టేట్) జేయు కుటిలోపాయము బన్నిరి.

దీనికే ఆవరణ ("రింగుఫెన్సు") నీతియని వ్యవహరించిరి. ఈ యుద్దేశమును పురస్కరించుకొనియే బక్సారు యుద్ధమైన పిదప మహారాష్ట్రుల భయములేకుండా కాపుదలగా నుండుటకు అయోధ్యను శాత్రవ మధ్యరాజ్యముగా నుంచి దీనిని నవాబునకే యిచ్చిరి. అట్లే టిప్పూ తదనంతరము మైసూరురాజ్యములో కొంత పూర్వరాజవంశీయునకిచ్చిరి. 1817 లో సీతాబాల్డీ యుద్ధమైన పిదప నాగపురమును భోంస్లేరాజుకు మరలనిచ్చిరి. మొదటి సిక్కుయుద్ధానంతరము లాహోరు సంస్థానమును గూడ అట్లేయుంచిరి. ఆకాలమున నాంగ్లేయకంపెనీప్రభుత్వముఆయాస్వదేశరాజులతోనునవాబులతోను చేసికొనిన సంధియొడంబడికలను చూచినచో ఆరాజులు నవాబులు అంతర్జాతీయ ధర్మమునుబట్టి సర్వాధికార ప్రభుత గల స్వతంత్రరాజులుగనే వ్యవహరించినట్లు గోచరించును. ఇంకా విశేష మేమనగా కంపెనీవారు చాలకాలము తమ అధికారము లెల్ల సర్వంసహాచక్రవర్తియగు ఢిల్లీపాదుషావలన సంక్రమించినట్లుగనే వ్యవహరించుచుండిరి. కాని షాఆలంచక్రవర్తి వీరి "సంరక్షణ నిర్బంధము"నుండి వెలువడి మహారాష్ట్రుల యండజేరి వారి పై దీయైనపిదప నీకపటనాటకము నాడుటకు వీలులేకపోయినది. అంతట నీ కంపెనీవారు దేశములోని తక్కిన సామంత పరిపాలకులవలెనే స్వతంత్రులై వ్యవహరింపసాగిరి. తాము భరింపలేని బరువులుమాత్రము నెత్తిపైన పెట్టుకొనకుండా ఉపాయముగా విజృంభింపసాగిరి.

కర్నాటక నవాబు తన రాజ్యముయొక్క మేనేజిమెం

టుకు లెక్కచెప్పి తన మధ్య ఫలసాయమును శిస్తుల ఆదాయ యమును తన కివ్వవలసినదని ఆంగ్లేయకంపెనీపై ఇంగ్లాండు చాన్సరీకోర్టులో వ్యాజ్యము దాఖలుచేయుగా ఆవ్యాజ్యవిచార ణకు నియమింపబడినకమీషనరగు "అయిర్" దొర ఈవ్యవహా రము సామాన్య వ్యాజ్యముకాదనియు ఒకరికొకరు లోబడని రెండు రాజ్యములవారి మధ్యసంధియొడంబడికలకు సంబంధించిన రాజకీయ వ్యవహారమనియు తీర్మానించి దావా తోసివే సెను. ఇట్లు కంపెనీవా రొక స్వతంత్రి రాజ్యపరిపాలకు లను సూత్రిము స్థిరపరుపబడెను.

## II

స్వదేశ సంస్థానములతో నాంగ్లేయ కంపెనీవారవలం బించిన రాజ్యనీతిలోని రెండవ ఘట్టము, "సబార్డినేట్ అయి సొలేషన" అనబడు విధానము. ఇది 1813 లో ప్రారంభ మైన దని చెప్పవచ్చును. స్వదేశ సంస్థానాధీశుల స్వాతంత్ర్య గౌర వము అనవసరముగా స్వదేశరాజులతో ఐక్యముకలిగించుకొన గూడదను భావము నశించి మెల్లగా నీరాజులను నవాబులను రాజ్యతంత్రిమున నిరికించి కంపెనీవారి పలుకుబడికిోంద నుంచి అధికారమునకు లోబరచుటకు ప్రియత్నములు జరిగెను.

1798-1905 మధ్య వెలస్లీగవర్నరు జనరలుగా నున్న ప్పుడే అతడు దూరదృష్టితో నీస్వదేశరాజులు నవాబులుగ్రిించి వారికి తోడ్పడకుండా నాంగ్లేయులకు వశులై యుండుమార్గము నాలోచించెను, గాని కేవలము కంపెనీవారికి లోబడియుండు నట్లు చేయజాలకపోయెను. వెల్లస్లీ జేసిన సంధియొడంబడికలను

బట్టి రాజులు నవాబులు ఆంగ్లేయ కంపెనీతో స్నేహముగా నుండునట్లును ఉభయులు ఒండొరులకు సహాయులై యుండునట్లును, ఉభయులకు రక్షణకొరకు ఆంగ్లేయసైన్యములను సంస్థానములలో నుంచునట్లును ఏర్పాటు చేసెను. కొన్ని సంధిపత్రములందు కంపెనీ ప్రభుత్వమునకు విధేయులై యుండవలెనను మాటను చల్లగా జేర్చినాడు. నెపోలియను భయము తీరిన పిమ్మట హేస్టింగ్సు గవర్నరుజనరలుగా వచ్చిన వెంటనే క్రొత్త రాజ్యనీతి ఖచ్చితముగా అమలు జరుపబడెను. వెలస్లీ కాలమున 1802 లో పీష్వాతో చేయబడిన సంధిలోనే అతని సర్వాధికారములు తీసివేయబడు సూచనలు కలవు.

1806 లో షాఆలంచక్రవర్తి చనిపోయినను 1832 వరకు ఢిల్లీపరగణాలు చక్రవర్తి కొమారుని పేరుతోనే వ్యవహరింపబడినను హేస్టింగ్సు కాలమునుండి మొగలాయి చక్రవర్తి అధికార మావంతయైన మిగులలేదు. 1813 లోనే తక్కిన మహారాష్ట్రరాజులపైన పీష్వాకుగల సర్వాధికారము అదృశ్యమైనది. ఆనాటికి దేశములో నాంగ్లేయకంపెనీ తప్ప యింకొక బలమైన ప్రభుత్వసంస్థ లేనేలేదు. అందువలననే కంపెనీవారు సర్వాధికారులనియు, ఈ సంస్థానాధీశులు సామంతులనియు హేస్టింగ్సు స్పష్టముగా ప్రకటించి తన సంధిపత్రములందీ సంగతిని వివరించినాడు.

బ్రిటిషువారు స్వదేశరాజులపట్ల చూపిన గౌరవము, స్నేహము, అధికారము, కాలపరిస్థితిని బట్టి మారినవి. వెల్లస్లీ 1798 మొదలు 1805 వరకు గవర్నరు జనరలుగ నుండెను.

ఇతడు వచ్చునప్పటికి ఐరోపాలోగాని, భారతదేశమునగాని ఆంగ్లేయుల పరిస్థితులు బాగుగా లేవు. ఐరోపాలో ఫ్రెంచి విప్లవమున ఆంగ్లేయులు యుద్ధమున మునిగిరి. భారతదేశమున ఇంగ్లీషువారికి చిరకాలమునుండి స్నేహితుడుగా నుండిన నైజాము ఫ్రెంచివారి స్నేహము నపేక్షించి తన సైన్యములకు ఫ్రెంచి యుద్యోగులచేత శిక్షణము చేయించుచుండెను. సింధియా రాజుగూడ ఇట్లు చేయుటయే గాక ఫ్రెంచిసేనలనే తన సంస్థానమున నుంచుకొనెను. ఐరోపాలో ఫ్రెంచివారికిని ఆంగ్లేయులకును యుద్ధములు జరుగుచుండుటయు, నెపోలియన్ ఖ్యాతి భారతదేశమున వ్యాపించుటవలన నితనిని ఈజిప్టుమార్గమున హిందూదేశమునకు వచ్చి యీ యాంగ్లేయులను వెడలగొట్టవలసినదని ఆంగ్లేయులతో విరోధించియున్న టిప్పుసుల్తాను నెపోలియను కాహ్వానము లంపెను. ఈ పరిస్థితులలో ఆంగ్లేయుల గౌరవము తగ్గిపోయి ఫ్రెంచివారి గౌరవము హెచ్చుచుండెను. వెల్లస్లీ యీ పరిస్థితులు చూచి ఆంగ్లేయుల పలుకుబడిని హెచ్చించుటకు మార్గము లాలోచించినాడు. దిగ్విజయముచేసి జయించుట కలలోనివార్త. అందువలన చాణక్య నీతిప్రయోగింప దలచినాడు. స్వదేశరాజులతోమంచి మాటలాడి వారితో సంధిచేసికొని ఆసంధిమరతులందు బ్రిటిషు వారిపలుకుబడికి కావలసినకట్టుబాటులు చేయదలచినాడు. స్వదేశ స్వాతంత్ర్యమును కాపాడుటకును ఇతరులతో యుద్ధము కలిగిన వారికి భయములేకుండగ నుండునని చెప్పి బ్రిటిషు సైన్యముల నుంచుకొనుట మంచిదని నయమునను, భయమునను, కొందరిని

ప్రోత్సహించి తంత్రమును నడిపినాడు. కొందరంగీకరించినచో అందరును దారికివత్తురు. ఇట్లుచేసినచో ఫ్రెంచివారి పలుకుబడి తగ్గిపోయి ఆంగ్లేయుల పలుకుబడి హెచ్చును. ఆంగ్లేయులకిక భయముండదు స్వదేశరాజులు కోరలు దీసిన పాములగుదురు. స్వదేశరాజుల స్వాతంత్ర్యము నాంగ్లేయు లంగీకరించి వారి కపాయము రాకుండ సహాయము చేయుచుండుటకు స్నేహముగ నుండుటకు పూచీపడి ఆంగ్లసైన్యములను తమరాజ్యమున నుంచుకొని వాని కగువ్యయముక్రింద కొంతసొమ్మునో కొంత అయివజువచ్చురాజ్యమునో యిచ్చునట్లును బ్రిటిషుప్రభుత్వము అనుమతిలేకుండా యితరులతో యుద్ధముగాని శాంతి సంధిగాని చేసికొనకుండునట్లును తమరాజ్యస్థానమున నాంగ్లేయ ప్రభుత్వ ప్రతినిధిని రాయబారిగ నుంచుకొనునట్లు ఒడంబడికలు వ్రాయించుటకును రాయబారములు నడిపెను.

ఫ్రెంచివారి యొత్తిడివలన స్వదేశ సంస్థానాధీశుల సహాయము ఆంగ్లేయుల కత్యావసరమయ్యెను. ఏదోవిధముగా వారిని మంచిచేసుకొనవలయును. మైసూరు రాజుగానుండిన టిప్పు సుల్తానుకు మార్క్విస్ ఆఫ్ వెల్లస్లీ వ్రాసిన లేఖలో నీ యుద్దేశము స్పష్టముగా కనబడుచున్నది. "సగౌరవమైన ఈ లేఖలోని సంగతులు త మ రు చిత్తగించినచో నీ క్రింది సంగతులు విశదముకాగలవు. ఫ్రెంచిజాతివారు మానవధర్మమును, గౌరవమును, మతమును పాడుజేసినారు. ప్రపంచములోని అన్ని రాజరికములు, పరిపాలనాక్రమములు, మతములు, వారి యాశాపిశాచమునకు తనివితీరని కొల్లకు నాశనమునకు గురికా

వలసిన పనియే వారి తలంపు. రెండవ సంగతి. ఇస్లాముమతము నకు అధీశుడగు ఖాలీఫ్ఫును వారు దౌర్జన్యము చేసినారు. మహా మ్మద్ ప్రవక్తగారి జ్ఞాపకములు మిగిలియున్న దేశములో యుద్ధము ప్రారంభించి నష్టపెట్టుచున్నారు.

ప్రస్తుత మీ ఫ్రెంచివారి నెదిరించుటకొరకు బ్రిటిషువారి కిని గ్రాండ్ సీనియర్ కును స్నేహ సంబంధమైన ఒడంబడిక సంధిషరతులు జరిగి యున్నవి. బ్రిటిషుజాతికి వ్యతిరేకముగా మీరు ఫ్రెంచివారితో స్నేహము చేయుచున్న సంగతి గ్రాండ్ సీనియర్ కు తెలిసినది. ఫ్రెంచివారి కుట్రలవలన మోసముల వలన ద్రోహమువలన సీనియరుకు కలిగిన అనుభవ ఫలితము నతడు మీకు తెలియపరుపదలచినాడు. బ్రిటిషుసైన్యబలముల నుండి ప్రస్తుతము తప్పించుకొని తిరుగు ఫ్రెంచివారి వలన మీకు సహాయము కలుగునను పొరబాటు తలంపు మానవలె నని ఆయన మిమ్ముల హెచ్చరించుచున్నాడు. మీ ప్రవక్తల గోరీలను అపవిత్రము చేయుట పూర్తిచేసి మతము ధ్వంసము చేయువరకు గూడ వారు మీకు సహాయము చేయవత్తురనుట కల్ల. నేను అనేకమారులు మీకు సూచించుచు వచ్చిన రాజీ పద్ధతు లింతవరకు మీరు పెడచెవిని బెట్టి యుంటిరి. మీమత గురువుయొక్క హితబోధలనైన మీరు విశ్వసించి ఇప్పుడు మారాయబారికి మీరు దర్శనమిచ్చి అతనితో మాటలాడి మామిత్రమండలికిని మీకును గల అభిప్రాయభేదముల సన్ని టిని ఫైసలు చేయించి ప్రపంచశాంతికి భంగము కలిగించు

(ఫ్రెంచి) వారినుండి ఈ దేశమును రక్షింప తోడ్పడెదరని నమ్ముచున్నాను.*

## III

గవర్నరు జనరలు హేస్టింగ్సు (1813-31) ప్రైవేటు జర్నలువలన ఆనాడు స్వదేశ సంస్థానములపట్ల ప్రయోగింపబడిన రాజనీతి స్పష్టపడుచున్నది. "ఇప్పుడు వాతావరణ మెల్ల యుద్ధమేఘములతో నిండినది. దీనికి ముఖ్యకారణము స్వదేశరాజులతోడి సంబంధము లింతవరకు నిర్ధారణ కాకపోవుటయే! వారితో మనము చేసికొన్న సంధిపత్రములందు వారినిస్వతంత్రరాజులుగా మనము పరిగణించుచున్నాము. వారి యాస్థానములకు మనము మన ప్రతినిధులను (రెసిడెంట్లను) పంపుదుము. వీరు కేవలము రాయబారులుగామాత్రమే వ్యవహరింపక సర్వాధికారులుగా ప్రవర్తింతురు. ఆ రాజుల స్వంత వ్యవహారములందుగూడ వీరు జోక్యము కలిగించుకొందురు. వారి కెదురుతిరుగు దుర్మార్గ ప్రజలకు వీరు మద్దతుచేయుదురు. సర్వాధికారము పెత్తనమును బహిరంగముగా ప్రదర్శనము చేయును. తాను జరిగించు చర్యలకు ప్రభుత్వము మద్దతు చేయగలందులకు మనకు లాభింపగల సందర్భముల నేవో కొన్ని చూపించును. అంతట మన కౌన్సిలువారతని నాయొక్కవిషయమునసేగాక అన్నివిషయము లందును సమర్థించి మద్దతుచేయుదురు. ఇక ఈరాజుల వారసత్వము విషయమునగూడ అనవసరముగా మనము జోక్యము కలిగించుకొనుచున్నాము. వీనివలన ఆరాజులకు లోపల

క్రోధముకలుగుచున్నది.”అని1-2-1814 తేదీన వ్రాసికొన్నాడు. ఫిబ్రివరు 16 వ తేదీన “మనముఖ్యోద్దేశము బ్రిటిషుప్రభుత్వముయొక్క సర్వాధికారమును పేరునకు స్థిరముగా నెలకొల్పుటయై యుండవలెను. పేరునకు గాకపోయినను వాస్తవమునకు తక్కిన రాజులెల్లరు మనకు సామంతులుగా నుండునట్లు చేయవలెను. మొగలుచక్రవర్తి క్రింద నున్నట్లు గాకపోయినను మనము వారి రాజ్యములు వారి కుండనిచ్చినందులకు ప్రతిఫలముగా వారు తమసైనికబలములెల్ల మనకు సాయమున కుపయోగించి తోడ్పడవలెను. ఈ రాజులలో తగవులువచ్చినచో ఒండొరులతో పోరాడుకొనక ఈ రాజ్యముల సమ్మేళనములెల్ల అధిపతులమగు మనము చెప్పినట్లు వినవలెను. ఈ రెండు విషయములందు వారు మనకు లోబడియుండవలెను. ఈ షరతులకు కొందఱి రాజులనైనను మనము లోబరచినచో తక్కినవా రందఱును లోబడితీఱుదురు. ఢిల్లీ చక్రవర్తి యధికారమున కిది విరుద్ధమైనను వీలునుబట్టి మన మీా ఏర్పాటులు చేసికొని తీరవలెను. పరిస్థితులు చాల కష్టముగా నున్నవి, గాని అదనుకొఱకు వేచియుండి దీనిని సాధించెదను” అనినాడు.

ఫ్రెంచిజాతితోడి యుద్ధభయ ముండినందున ప్రారంభములో బ్రిటిషువారు భారతదేశ స్వదేశరాజులతోను, నవాబులతోను చేయుసంధిపత్రములు ఒకరికొకరు సహాయభూతులుగా నుండునట్టి సమానగౌరవ షరతులతో జరుగుచుండెను. ఫ్రెంచివారి నేదోవిధముగా సాధించవలెనని తమతో స్నేహముగ నుండిన స్వదేశ సంస్థానముల రాజులు సైన్యము లుంచుకొనుట

కును, వా రితర రాజులతో సంధియేర్పాటులు చేసికొనుటకును బ్రిటిషువా రంగీకరించుచుండిరి. ఫ్రెంచివారి భయముపోయి నప్పటినుండియు బ్రిటిషుప్రభుత్వముయొక్క నీతి మర్యాదలును మార్పుజెందెను. 1850 ఆప్రాంతములలో జరిగిన సంధిపత్రములందు సమానప్రతిపత్తి గానరాదు. తమతోసంధి చేసికొను స్వదేశసంస్థానములు తమ యధికారమునకు లోబడిన సామంత రాజ్యము లను భావముతో నీ సంధిపత్రములు వ్రాయబడ సాగెను. స్వదేశసంస్థానము లితర సంస్థానములతో ప్రత్యేక సంధ యేర్పాటులు చేసికొనుటను ఆంగ్లేయకంపెనీ ప్రభుత్వము నిషేధించెను.

ఈసంస్థానములకు సహాయముచేయుట కను నెపముతో నాంగ్లేయ సైన్యములను ఆ యా సంస్థానములందు నిలిపి యుంచి వానికగు వ్యయము నీ సంస్థానములు భరింపవలెనను నిర్బంధపు షరతులను సంధిపత్రములం దుదహరించిరి. ఈ సంస్థానముల రక్షణముకొరకు తాముంచిన సైన్యముల ఖర్చులక్రింద నొక నిర్ణీతపు మొత్తమును కప్పముగాచెల్లించు షరతుకూడా సంధులందు చేర్చిరి.

ఇట్లీసంస్థానములు రెక్కలువిరిగిన పక్షులస్థితికి గొనిరా బడెను. పూర్వము వీరికుండిన 'నేటివు' పటాలములు, ఫ్రెంచి యుద్యోగులుపోయి యిప్పు డాంగ్లేయ పటాలము లాసంస్థా నములందు నిలిపి యుంచబడెను. పైకి వాని రక్షణకొఱకు, సహాయముకొఱకు అని చెప్పినను, నిజముగా నాంగ్లేయప్రభు త్వమువారికి వ్యతిరేకముగా వీ రెట్టి కుట్రలు జరిగించకుండా

కనిపెట్టి యుండుటకును ఆంగ్లేయ రాజ్యాధిపత్యమునకు తోడ్పడుటకునే యీ పద్ధతి అవలంబించబడెను. ఇది అనేక విధములుగా బ్రిటీషువారికి లాభకారిగను స్వదేశసంస్థానములకు భరింపలేని భారముగను నుండెను. ఈసైనిక వ్యయముల ఖాతా పెరుగుట, సంస్థానాధీశులు చెల్లించలేకుండుట, దీనికి ప్రతిఫలముగా రాజ్యభాగము లాంగ్లేయులకు వ్రాసి యివ్వబడుట, యింకననేక సౌకర్యము లొసగుట పరిపాటి యయ్యెను.

స్వదేశసంస్థానముల యాస్థానములలో నాంగ్లేయ ప్రభుత్వప్రతినిధులు రెసిడెంట్లను పేరున నిలుపబడిరి. వీరునిజముగా నాంగ్లేయ గూఢచారులుగానుండి సంస్థానాధీశుల పట్ల కుట్ర చేయుచు వారిపైన చాడీలు చెప్పుచు వారిని కూలద్రోయుచుండిరి. వీరిని చూచిన భయము అసహ్యము వృద్ధియయ్యెను. వీ రాయా సంస్థానములందు తమకుతంత్రములను ప్రయోగించుచు సర్వాధికారులుగ ప్రవర్తించుచుండిరి. * ఈ సంస్థానాధీశులతోడి సంబంధములందు క్రమక్రమముగా బ్రిటిషువారు తమ సర్వాధికారములను బిగువుచేయుచుండిరి. 1818 లో నాటి గవర్నరుజనరలగు హేస్టింగ్సు ఉదయపురము మహారాణాగారితో చేసిన సంధిపత్రము నుదాహరణముగా గైకొనవచ్చును.

దానిలో 3 వ షరతు ఉదయపురము మహారాణా బ్రిటిషు ప్రభుత్వమునకు సర్వదా లోబడియుండి వారికి

---

*. Private Journal of Moira Vol. I - Wellesly correspondence —Garwood.

సహకారిగా నుండవలెను. అతడు వారి సర్వాధికారమును శిరసావహించవలెను. ఇతరరాజులతో నెట్టి సంబంధమును కలిగియుండ రాదు.

6 వ షరతుప్రకారము సంస్థానము యొక్క ఆదాయములో నాలుగవవంతును 5 సంవత్సరములవరకు కప్పముగా చెల్లించి తరువాత ఆదాయములో 8లో3 వంతులు శాశ్వతముగా కప్పము గానిచ్చుచుండవలెను. 8 వ షరతు ప్రకారము బ్రిటిషు గవర్నమెంటువారు కోరినప్రకారము ఉదయపుర సంస్థానము సైన్యముల నుంచుకొనవలెను. హేస్టింగ్సు హయాములో స్వదేశ సంస్థానములపైన నిట్లనేక కఠిననియమములు, హెచ్చు కప్పములు విధింపబడుచుండెను. అందువలన వారి ఖజానాలు వట్టివైపోయి వారు ప్రజలపైన భరింపలేని అత్యధికపన్నులు విధించుచుండిరి. డల్‌హౌసీకాలములో నీసంస్థానాధీశులను పీడించుట, అవమానించుట, వారి రాజ్యములను లాగికొనుట విచ్చలవిడిగా జరిగెను. ఈ సంస్థానాధీశులు ప్రజలును గూడ నీబాధలు పడిపడి తుదకు 1857 విప్లవములో పాల్గొనుటకు మొదట సిద్ధపడిరి గాని ఆంగ్ల పరిపాలకులు చాలమంది సంస్థానాధీశులకు ఆసలుగొల్పి కొనివేసి లోబరచుకొనిరి.

అందుకే విక్టోరియా రాజ్ఞి ప్రకటనలో "స్వదేశ సంస్థానాధీశుల హక్కులు, దర్జాలు, గౌరవములు మా స్వంతవానివలెనే గౌరవింతుమనియు సంధినియమములు పాటింతుమనియు" కొన్ని మాటలు చేర్చబడినవి.

## IV

సిపాయి విప్లవానంతరము ఈ సంస్థానముల తోడి బ్రిటిష్ సంబంధముల చరిత్రలో క్రొత్తఘట్టము ప్రారంభ మైనది. ఆంగ్లేయసలహాదారులు, ఏజెంట్లు రెసిడెంట్లు సంస్థాన ములయొక్క ప్రభుత్వయంత్రమునందు హెచ్చుపలుకుబడిని సంపాదించి బలవంతులై ప్రవర్తించునట్లు చేయబడిరి. బహి రంగ మర్యాదలను కొన్నిటిని పైకి ప్రసాదించుచు, క్రమ క్రమముగా ఆంగ్లేయప్రభుత్వముయొక్క సర్వాధికారములను బిగువుపరుపసాగిరి. ప్రతి సంస్థానములోను రెసిడెంట్లు నియ మింపబడిరి. చాల సంస్థానములందు పేరునకాసంస్థానాధీశుడు రాజుగ నుండెను గాని నిజముగా పరిపాలించువాడు రెసిడెంటే! సైనికవ్యయముకొఱకు కప్పములు విధింపబడని సంస్థానములు సైన్యములనే పోషించవలసి యుండెను. బ్రిటిష్‌వారి సైనిక వ్యూహములకొఱకు సంస్థానములందు రైళ్లను రోడ్లను బ్రిటిషు వారు బలవంతముగా నిర్మించిరి. తపాలా తంతి చెలామణి బ్రిటిషువారు తమ చేతులలో నుంచుకొనిరి. ఆంగ్లప్రభుత్వ యిజారాలగు ఉప్పు, నల్లమందు సంస్థానములు తయారు చేయరాదు. గనులను త్రవ్వ హక్కులను ఆంగ్లేయకంపెనీల కిచ్చునట్లు ఒత్తిడిచేసిరి. తమ పలుకుబడి యధికారములను వినియోగించి బ్రిటిషువర్తకమును అభివృద్ధి పరచిరి. ఈ బ్రిటి షురాజ్యతంత్రముయొక్క రాజ్యనీతిసూత్ర మేమనగా నీ సంస్థానాధీశులకు ప్రజలపైనగల నిమిత్తమాత్రములగు నిరం కుశాధికారములను హెచ్చించుట, బ్రిటిషువారితోడి

సంబంధములందుమాత్రము వారి యధికారములను తగ్గించుట. సంస్థానముల ప్రజలు తమ బాధలనుగూర్చి ఆందోళన చేసి తిరుగుబాటు చేయకుండా వారిని అణచియుంచుటకు బ్రిటిషు సైన్యములెల్లప్పుడును సంసిద్ధముగ నుంచబడునుగాని ఈసంస్థానాధీశుల క్రింద ప్రజ లెంత బాధపడుచున్నను వారి సివిలు హక్కులను సంరక్షించుటకైన నీ యాంగ్లేయ ప్రభువులు ప్రయత్నింపరైరి.

స్వదేశ సంస్థానముల యొక్క వంశపారంపర్యపు హక్కుదారు లెవరాయని నిర్ణయించుటలో కూడా బ్రిటిషు ప్రభుత్వమునకు హక్కుకలదని మణిపురము విషయమున 1891 లో నింగ్లాండులోని ఇండియారాజ్యాంగ కార్యదర్శి బహిరంగముగా ప్రకటించుటతో నీసంస్థానములపైన బ్రిటిషు ప్రభుత్వము చలాయించు సర్వాధికారములు స్పష్టీకరింపబడినవని చెప్పవచ్చును.

స్వదేశసంస్థానములలో సివిలు క్రిమినలు న్యాయవిచారణాధికారములు చలాయించు సంస్థానాధీశుల రాజ్యములు, సార్వభౌమ ప్రభుత్వమువారికిని సామంత రాజ్యములకును సమష్టి గానట్టి యధికారములు గల రాజ్యములు, అని రెండు తరగతులుగా విభజించిరి. ఢిల్లీచక్రవర్తి సిపాయి విప్లవమున పాల్గొనెనను నేరమున నాతనిని విచారించి శాశ్వత కారాగార శిక్ష విధించుటతో భారతదేశ రాజులపైన మొగలాయి చక్రవర్తి సార్వభౌమత్వము పేరులేకుండ పోయినది. ఆంగ్లేయ రాజ్యమకుటమే భారతదేశ సార్వభౌమత్వమును వహించినది.

ఈ సంస్థానములకు విదేశ వ్యవహారములు చేసికొను హక్కులులేవు. విదేశ ప్రభుత్వములతో గాని ఇతర సంస్థానములతో గాని ఎట్టి సంధి యొడంబడికలు చేసికొనవీలులేదు. బ్రిటిషు ప్రభుత్వమువారి అనుమతి లేకుండా ఐరోపాజాతీయులనుగాని అమెరికా జాతీయులనుగాని ఉద్యోగులుగా నియమింపరాదు. ఇతర రాజ్యములయొక్క వ్యాపార ప్రతినిధులను గూడ పిలుచుకొనవీలులేదు. బ్రిటిషు ప్రభుత్వమువారిచ్చిన బిరుదులు తప్ప విదేశీయ బిరుదులుగూడ స్వీకరింపరాదు. తన ప్రజలు విదేశములకు పోవదలచినచో తాను "ప్యాసుపోర్టు"-చీటినీయ వీలులేదు. ఇతర దేశములతో వ్యాపార సంబంధములు జరుపవలెనన్నచో బ్రిటిషు ప్రభుత్వముద్వారా జరుపుకొనవలెను. తనపట్ల నేరముచేసినవారి నెవరినైన తాను విచారించుటకు పట్టుకొనవలెనన్నచో బ్రిటిషు ప్రభుత్వమువారిని "ఎక్‌స్ట్రాడిషను" చర్య జరుపుడని కోరవలెను. స్వదేశసంస్థాన ప్రజలు విదేశములలో బ్రిటిషు ప్రజలుగనే పరిగణింపబడుదురని మస్కట్ వారి సంధివలన 1873 లో స్థిరపడినది. స్వదేశస్థానములయొక్క సరిహద్దులు అంతర్జాతీయ ధర్మమున బ్రిటిషు సరిహద్దులుగా పరిగణింపబడును. అనగా సంస్థానమునకు వ్యక్తిత్వము లేదన్నమాట!

సంస్థానములలో నొండొరులకు గల తగవులు బ్రిటిషు ప్రభుత్వమువారివలన పరిష్కరించు కొనవలెను. స్వదేశసంస్థానములను సంరక్షించు బాధ్యత, శాంతిభద్రతల బాధ్యత బ్రిటిషువారిదే గనుక వారికి సైన్యము లనావశ్యకములని

1844 లో గ్వాలియరుతో సంధిచేయుటలోను 1881 లో మైసూరును పూర్వరాజుకు వశముచేయుటలోను వారుంచుకో తగిన సైన్యముల సంఖ్య తగ్గింపు చేయబడెను. శాంతిభద్రతలు కాపాడు బాధ్యత బ్రిటీషువారి దే గనుక సంస్థానములు అవసరము వచ్చినప్పుడు వారి ఉత్తర్వులెల్ల శిరసావహించవలెను. సంస్థానములుంచు కొనదగిన ఆయుధములు నిర్ణయింపబడెను. లోపల కోటలు దుర్గములు బలముచేయరాదు. బ్రిటిషు సేనలకు అన్ని సదుపాయములు చేయవలెను.

V

ఇటీవల భారతదేశమున జాతీయోద్యమము ప్రబలుచున్న సందర్భమున కొంతకాలమునుండి బ్రిటిషువారి సంస్థానములతోడి సంబంధములందు ప్రయోగించు రాజనీతిలో మరల కొంతమార్పు కలిగెను. భారతదేశ జాతీయైక్యతను విచ్ఛిన్నముచేయుటకును, అఖిలభారత జాతీయ కేంద్రప్రభుత్వము నిర్మించుట కాటంకము కలిగించుటకును, ఈ సంస్థానములు స్వతంత్రప్రభుత్వములని ప్రకటింపసాగిరి. కర్జను రాజప్రతినిధిగా నుండగా నీ సంస్థానాధీశులు చేయు ప్రజాపీడనము దుర్వ్యయమునుజూచి యతడు వానిని మందలించి ఈ సంస్థానముల ఆదాయమును కేవలము స్వప్రయోజనముకొఱకుపయోగించుట కీ సంస్థానములు ఈ రాజుల స్వంతజమీందారీలు కావనియు కేవలము సోమరితనముతో కాలము వెళ్లబుచ్చుట కీ సంస్థానాధీశులకు భగవంతుడు శాశ్వతపట్టా వ్రాసియివ్వలేదనియు హెచ్చరించినాడు. వీరు విచ్చలవిడిగా

నింగ్లాండు పోవుటను నిషేధించినాడు. గాని తరువాత హార్డింజ్ రాజ ప్రతినిధియైనప్పుడు సంస్థానాధీశుల విదేశవ్యవహారములపైన అనవసరపుహద్దు లేర్పరచుట ఈ సంస్థానాధీశుల యాత్మగౌరవమునకు భంగము అనినాడు. భారతదేశ స్వదేశ సంస్థానములయొక్క రాజకీయ ప్రతిపత్తినిగూర్చి విచారించుటకు 1927 లో బ్రిటిషు గవర్నమెంటువా రేర్పరచిన విచారణసంఘమువా రీ సంస్థానముల స్వాతంత్ర్యమును నూతీకరించిరి. భారతదేశశాసనసభలకు బాధ్యతవహించు కేంద్ర ప్రభుత్వము స్థాపించునెడల నది నూతన రాజ్యాంగముపైన నాధారపడిన క్రొత్త ప్రభుత్వమగుననియు బ్రిటిష్‌ప్రభుత్వము వారికిని ఈ సంస్థానాధీశులకును చరిత్రరీత్యా ఏర్పడిన పరస్పర సంబంధములు వారి యంగీకారము లేకుండా ఈ క్రొత్తప్రభుత్వమునకు ట్రాన్సుఫరు చేయబడరాదనియు సలహా నిచ్చిరి. సంస్థాన ప్రజల పక్షమున కొందరు ప్రతినిధు లీ విచారణసంఘమును దర్శించి తమ సాధక బాధకములు చెప్పుకొనదలపగా సంస్థానములందలి ఆంతరంగిక పరిపాలనతో బ్రిటిషుప్రభుత్వమునకు సంబంధములేదని సాకుచెప్పి వారిమాటలు వినుటకు నిరాకరించిరి. అయితే పైన చెప్పబడినట్లు బ్రిటిషుప్రభుత్వమువారికి నీ సంస్థానములకును జరిగిన అన్ని సంధిపత్రములలోను ఆయా సంస్థానప్రజల సౌఖ్యమును పెంపొందించుటను గూర్చిన షరతులు చేర్చబడియే యున్నవి. మరియు పైన జెప్పినట్లు బ్రిటిషుప్రభుత్వమువా రింతవరకు తమ సర్వాధికారములను చలాయించుచునే యున్నారుగాని ఇప్పు డీ రాజ్యాంగ

సంస్కరణల సందర్భమున నిట్లు సాకులు చెప్పుచున్నారు! ఈ కమిటీవారి సూచనలను సైమను కమిటీవారును తమ నివేదికలో అంగీకరించినారు.

ఇటీవల శాసింపబడిన నూతన ఇండియా రాజ్యాంగ చట్టమును చేయుటలో బ్రిటిషువారీ నెపమున కొంత రాజ్యాంగ నాటకము నాడి సంస్థానములపైన ఆంగ్లరాజమకుటమునకుగల సర్వాధికారములను పురస్కరించుకొని ఈసంస్థానములను తమ కీలుబొమ్మలుగా నుపయోగించుకొని భారతదేశ ప్రజా ప్రతినిధుల ప్రభుత్వమునకు ఆటంకములుకలిగింపగల అనేక బందోబస్తులను జేసికొనినారు.

ఈ సంస్థానముల రాజ్యభాగము 824000 చతురపుమైళ్లు వైశాల్యము కలిగియున్నను దీని జనసంఖ్య బ్రిటిషుభూభాగముతో పోల్చిచూచినచో చాల హీనముగ నున్నది. దీనిలో హైదరాబాదు, మైసూరు, బరోడా రాజ్యములు గాక తక్కిన రాజ్యములు రాజపుత్రస్థానమువంటి నిరుపయోగమైన పంటలులేని భూములుగనో లేక అడవి ప్రదేశములో కొండప్రదేశములుగనో యున్నవి. దీనికి కారణము ఆంగ్లేయులు మంచి భూభాగము లెల్ల పూర్వరాజులనుండి లాగుకొని బ్రిటిషు ఇండియాలో చేర్చివేయుట. ఈ రాజులను నాయకులను యుద్ధములం. దీమారుమూలలకు తరిమియుండుట 1857 తరువాత క్రొత్తరాజ్యాక్రమణలు చేయక పోయినను ఆనాటికి మిగిలిన సంస్థానము లిట్టిస్థితిలో మిగిలెను.

# నాలుగవ ప్రకరణము

## బ్రిటిషు ప్రభుత్వతత్వము

### I

### మహమ్మదీయ ప్రభుత్వమునకు ఇంగ్లీషు ప్రభుత్వమునకు తారతమ్యములు

బ్రిటిషువారీ దేశాక్రమణ జేయక మునుపు భారత దేశమును పరిపాలించిన మహమ్మదీయ ప్రభువులు కూడా ఆంగ్లేయులవలెనే మొదట విదేశీయులుగ నుండినను వారి పరిపాలనకును బ్రిటిషుపరిపాలనకును చాల తారతమ్యము కలదు.

మహమ్మదీయులు మొదట విదేశీయులే యైనను వారీ దేశమున స్థిరపడి అచిరకాలములోనే దేశప్రజలలో కలిసిపోయి ఈ దేశమునే తమస్వదేశముగా జేసికొనిరి. అందువలన వారిది దేశీయుల పరిపాలనముగనే యుండెను. దేశముయొక్క అభివృద్ధికి వారు తోడ్పడిరి. ఇచ్చటి ధనమునెల్ల ఇచ్చటనే ఖర్చుపెట్టిరి. ఇక ఆంగ్లేయులన్ననో తమ జాత్యభిమానము వీడక తా మీ దేశమున కేవలము ప్రభుత్వాధికారములు చలాయించుటకు వచ్చిన పరిపాలకుల మనియు నీదేశమువలన లాభము పొందుటకు తమకుహక్కు కలదనియుతలచి ఈ దేశముయొక్క భాగ్యభోగ్యములనెల్ల సీమకు తరలింపసాగిరి. వీరిది కేవలము విజాతీయ పరిపాలనముగనే యుండెను. దేశప్రజలతో వీరు కలిసిమెలసి యుండక వేరింటికాపురము చేయుచు నీ దేశముయొక్క క్షేమ లాభములమాట ఆవంతయైన గమ

నింపక దేశపరిపాలనలో ప్రజలకెట్టి అధికారమును పలుకుబడిని కలిగింపక నిరంకుశులై పరిపాలనచేయుట ప్రారంభించిరి. ఇంగ్లాండు పార్లమెంటులో ఫాక్సుమంత్రి ప్రవేశ పెట్టిన ఇండియా చట్టము చర్చకు వచ్చినప్పుడు 1783 లో సుప్రసిద్ధుడగు బర్కు మహాశయు డీ యాంగ్లేయ పరిపాలనయొక్క స్వరూప స్వభావములను వర్ణించియున్నాడు. "ఆశియా దేశమునుండి భారతదేశమునకు దండెత్తివచ్చిన మహమ్మదీయ జాతివారు మొట్టమొదట చాలా క్రూరచిత్తులై యుండినను వారు కొలదికాలములోనే స్థిరనివాసులైపోయినందున వారి క్రూర స్వభావమెల్ల అణగిపోయెను. వారి సుఖదుఃఖము లీ దేశము యొక్క బాగోగులతో పెనవేసికొనిపోయెను. నా డీ దేశమున నెలకొనినవారు తమ వంశజులయొక్క భావిజీవితాశయములను భవితవ్యమును శాశ్వతముగా నీ దేశమున పాదుకొల్పిరి. వా రీ దేశముననే తమ జీవితములు గడపి ఇక్కడనే చనిపోయిరి. వీరి స్మృతి చిహ్నములను (గోరీలను) వీరి బిడ్డ లీ దేశముననే గాంచుచుండిరి. శాశ్వతముగా తాము తమపుత్రపౌత్ర పారంపర్యముగా వశింపదలచు భూమి చెడ్డదిగ నుండుట కెవ్వరు నంగీకరింపరు. దారిద్ర్యము, నిస్సారత, పాడువడుట నెవ్వరును చూచి సహింపలేరు. దేశములోని ప్రజ లెల్లరు హాహాకారములు సల్పుచు శాపములు పెట్టుచుండగా వారిమధ్య పుట్టి పెరిగి జీవితము వెళ్ళబుచ్చగలవా రరుదుగ నుండురు. తార్తారు మహమ్మదీయశూరులు, ధనకాంక్షవలనను ఆవేశమువలనను కొంత ధనాపహారణము కొంత ప్రజాపీడనము చేసినను, ఆ

తరము వారి జీవితములోనే వారుచేసిన అక్రమముల పాప ఫలితముగా వారి యధికారము నాశనమైపోవుటయు జరిగెను. ప్రజలకు విమోచనము కలిగెను. కొంత హింసయు ప్రజా పీడయు జరిగినను అది దేశీయరాజుల హింసగను ప్రజాపీడన ముగ నుండి అంతకన్న బలవంతు లీహింసను ప్రజాపీడను తొలగించుట కవకాశముండెను. చాలా అక్రమములుండినను, అధికారము నిరంకుశముగ నుండినను ప్రకృతి స్వభావ విరుద్ధ ములు మాత్రము జరుగలేదు. ఆక్రమింపబడిన రాజ్యము యొక్క మూలాధారములు, ఉపపత్తులు ఎండగొట్టబడలేదు. అందువలన దేశములోని వ్యాపారము, పరిశ్రమలు, వాణి జ్యము అభివృద్ధిజెందెను. నాటి అత్యాశ, ధనకాంక్షయు జాతీయ సంపదను కాపాడి దాని నుపయోగించునట్లు జేసినవే గాని దానిని నాశనము చేయలేదు. ఆనాటి రైతులు, వారి పారిశ్రామికులు సొమ్ము బదులుకావలసినచో హెచ్చువడ్డీలు చెల్లించుకోవలసివచ్చినను దేశములో మూలధనముమాత్రము సమృద్ధిగానుండి వారికి అందుబాటులోనే యుండెను. ద్రవ్య సంపాదన మార్గములు కష్టతరములుగ నుండినను మొత్తము మీద దేశప్రజలు క్షేమలాభములుకలిగి ఔన్నత్యము జెందు చుండిరి. ఈ పద్ధతులన్నియు బ్రిటిషు ప్రభుత్వమున తారు మారైనవి. తార్తారు మహమ్మదీయ దండయాత్రలు హానికర మైన మాట వాస్తవమే గాని నేడు భారత దేశమున నాశ నము జేయుచున్నది మన పరిపాలన రక్షణమే. నాడు వారికి నష్టము కలిగించినది, తార్తారుల విరోధము. నేడు నష్టము

UNIVERSITY LIBRARY HYDERABAD

కలిగించునది, మన బ్రిటిషువారి స్నేహము మన రాజ్యాక్రమణ మొదటిరోజున నెంత అధ్వాన్నముగ నుండెనో ఇరువదియేండ్లు జరిగిన పిదపగూడ నంత అధ్వాన్నముగనే యున్నది. (నేటికి నిట్లేయున్నది.) ప్రపంచ జ్ఞానముకలిగి వయసు మీరిన ఆంగ్లేయు లెట్లుండురో భారతీయులు కంటితో చూచి యెరుగరు. కేవలము బాలురేయని చెప్పతగిన ప్రపంచానుభవ మావంతయు లేని యువకులు ఎట్టి సాంఘిక బంధనములు సానుభూతియు లేకుండా నేటివులను పరిపాలింతురు. వీరింగ్లాండులోనున్న భారతీయుల కెంతదూరముగ నుందురో ఇక్కడ వీరి జీవితవిధానమును భారతీయుల కంత దూరమైయుండును. వీరు ప్రజలతో కలసిమెలసి యుండరు. వీరైనంత సొమ్మును సాధ్యమైనంతత్వరలో సంపాదించుకొని సీమకు పోవుటకు వలసిన మట్టుకు తప్ప దేశముతో వీరెట్టి సంబంధమునుకలిగియుండరు. ప్రజల కష్టసుఖములతో వీరికి పనిలేదు. ఆయావనగరముతో ధన కాంక్షతో ఒకరి తరువాత నొకరు సముద్రపుటలలవలె వచ్చి వెనుకకు పోవుదురు. ఆహారాన్వేషణకొరకు వచ్చి దొరికినది తన్నుకొనిపోవు క్షుద్రపక్షులుగా వీరు భారతీయులకంటికి తోచుచుండిరి. ఆంగ్లేయునికి చెందిన ప్రతిరూకయు భారతీయునికి నష్టద్రవ్యమే."

## II

## బ్రిటిషుపరిపాలన: భారతీయులు

"మన ప్రభుత్వ విధానములో ముఖ్యమైన దోషము మనము 'నేటివుల' నతి నీచముగా జూచుచుండుట. నమ్మ

కము, పెద్దజీతముగల ప్రతి పదవియు వారి కంద కుండజేసి తిమి. వారిని మనము చాలా క్రిందినౌకరీలలో మాత్రమే యుండనిచ్చుచున్నాము. వారికి జీవనమునకు చాలీ చాలని జీత మిచ్చుచున్నాము. ఈ చిన్న యుద్యోగములు కూడా తెల్లవారెవ్వరును దానికి తగరు గనుకనే విధిలేక భారతీయుల చేతులలో నుంచినాము. వీ రెల్లరను తక్కువజాతి వారినిగా మనము చూచుచున్నాము. భారతీయప్రభుత్వమే యున్నచో ప్రభుత్వములో గొప్ప యుద్యోగములు చేయగలవారిని, మన మాటంకపరుపనిచో రాష్ట్రగవర్నరులుగ నుండగలవారిని, నీచ సేవకులకన్నను కనిష్టముగా జూచుచున్నాము. వీరిని హైన్య స్థితికి దింపి వీరు పెద్ద యుద్యోగములకు తగరని నిందించు చున్నాము. కేవలము దేశశాంతిస్థాపనకొరకు మాత్రమే యుప యోగించి ప్రజలలో నెవ్వరు నెట్టి అధికారమునకు కూడ తగ నట్లుగా జేసి అణచియుంచుట కేనా ఎంతో గొప్పదని మనము గర్వపడు శాసనధర్మములును చట్టవిధులు నుపయోగించుట? ఈ భారతీయప్రజల కింతదుస్థితి దాపురింపజేసిన మన కెంత మాత్రము శ్రేయస్కరముగాని ఈ విధానమునుమార్చి ఉదార విధానముల నవలంబించుట యుక్తము. బ్రిటిషుప్రభుత్వము వారి యొక్క ఉద్దేశము తమ ప్రజల శీలమును బాగుపరచుటయే. విశ్వాసము అధికారముగల పదవులందు ఈ ప్రజలను ప్రవేశ పెట్టి వీరిని ముందుగా మనము గౌరవించిన తప్ప వీరిని బాగు పరచుట సంభవింపదు." అని సర్ తామస్ మన్రో పలికి యున్నాడు. (Life and Experiences—Sir P. C. Ray P. 226, 227)

భారత దేశమున మహమ్మదీయ పరిపాలనకాలములో ప్రారంభదినములలో కూడ హిందువులు గొప్ప సివిలు ఉద్యోగములు పొందియుండిరి. ముబారక్ ఖిల్జీకాలమున 1317-31 లో ప్రభుత్వములో రివిన్యూలెఖలశాఖలో హిందువులెందరో నియమింపబడిరి. (Elphinstone's History) సర్ వంశ పరిపాలనకాలమున 1542 - 54 మధ్య, సైన్యమున హిందువులు పెద్ద యుద్యోగములు పొందిరి. షర్షాయొక్క సేనానులలో ప్రధాని బ్రహ్మజిత్ గౌరు అను హిందువుడు. మహమ్మదు గజనీ కాలమునకూడ సైన్యమున హిందువులు నియమింపబడిరి.

మహమ్మదు అదిల్‌షా తన పరిపాలనమునెల్ల హెమూ అను హిందూవర్తకునిచేత జరిపించినాడు. మొగలుచక్రవర్తియగు అక్బరు, రాజపుత్రులకు గొప్పగొప్పయుద్యోగము లిచ్చినాడు. మానసింగుచేసిన భూములతరముల నిర్ణయము రివిన్యూ పరిపాలనయు జగత్ప్రసిద్ధమైనవి. అక్బరుకాలమున సైన్యములోను భూమి సర్వే రివిన్యూ వ్యవహారములలోను అన్ని సివిలు శాఖలందును హిందువులు నియమింపబడిరి. మొగలు చక్రవర్తులకు ఆఫ్గన్ యుద్ధములలో మొగలు సేనానులుండినను తోడర్‌మల్లువంటి హిందూ సేనానులను గూడ నియమించిరి. షాజహాను కొమారుల తగవులాటలలో జస్వంతరావు అను రాజపుత్ర వీరుడే సర్వసేనానిగా నియమింపబడి విశ్వాసపాత్రుడైనాడు.

ఔరంగజేబు చక్రవర్తి (1659-1707) రాజ ప్రతినిధి

యగు మూర్షిద్ కూలీఖాను సివిలు శాఖలలో అన్ని ముఖ్యోద్యోగములను హిందువులకిచ్చినను చక్రవర్తి హర్షించినది చూడగా అతని కిది యిష్టమేయని తెలగలదు. ఢిల్లీలో రెవిన్యూ శాఖయొక్క కార్యనిర్వహణమెల్ల హిందువుడే చేయుచుండెను. జఫర్ ఖాను ప్రధానమంత్రిగా నియమింపబడి వారస్వపుతగవులందుకూడ అతడాపదవిలోనున్నను నిజముగా రివిన్యూ పరిపాలన జరిపినది సహాయ దివానగు రఘునాథ క్షత్రియుడే. ఔరంగజేబు చక్రవర్తియైనపిదపగూడ నీయేర్పాటు కొంతకాలము జరిపి తరువాత నీ రఘునాధునికి రాజాబిరుదు నిచ్చి గౌరవించెను. [చూడు. జదునాథసర్కారు-ఔరంగజేబు III. 727] ఔరంగజేబు అనుమానము కలవాడగుటవలన మొగలు సేనానియగు దిలేర్ఖానునిగూడ బంపినను జస్వంత రావును తరువాత జయసింగును శివాజీతో యుద్ధములందు సేనానులుగ నియమించి వారిపైననే ముఖ్యభారమంతయు వేసియుండెను.

వంగరాష్ట్ర నవాబులుకూడ హిందువులకు గొప్ప యుద్యోగములనిచ్చిరి. కూలీఖానుదగ్గర దర్ప నారాయణుడు, భూపతిరాయి, కిషోర్ రాయి, జస్వంతరాయి, రఘునందనులు మంత్రులుగా నుండిరి. ఆలీవర్ధిఖాను దగ్గఱ ఆనందరాయి సర్వసేనానిగనుండెను. రాజాజానకిరాము డతని ఆంతరంగిక మంత్రి. ఇంకా అనేక ముఖ్యోద్యోగులుండిరి. రాజారామ నారాయణుడు సర్వసేనానియేగాక బీహారు డిప్యూటీ గవర్నరుగ నుండెను. హిందూ సేనానియగు శితాబ్ రాయి యొక్క

శౌర్యము నాంగ్లేయులుకూడ ప్రశంసించియున్నారు. మీర్జాఫర్‌తోపాటు దుర్లభరాముడను హిందువుడు సురాజుద్దౌలా క్రింద సేనానిగ నుండెను.

వంగరాష్ట్రములోని "బారాబున్యా"లనబడుపండ్రెండు మంది మండలాధిపతులు రాజప్రతినిధికి పేరునకు కప్పము గట్టుచుండిరి. వీరికి గొప్ప సేనలు నావికదళము లుండెను. మగ్గులు ఆరఖానీను సముద్ర చోరులను దండించుటకు వీరు నౌకా బలముల నుపయోగించుచుండిరి. నేటికిని వంగరాష్ట్రమున కొందరికిగల "మీర్‌బహర్" లనబడు బిరుదనామము నౌకాధీశు లగుటను తెలుపుచున్నది. ఇట్లు మహామ్మదీయులతోపాటు హిందువులు సైనిక సివిలుపరిపాలనమునం దధికారము గల్గియుండిరి.

బ్రిటిషువారు రాజ్యాక్రమణచేసిన ప్రథమ దినములలో పూర్వపు మొగలు ఉద్యోగుల ద్వారానే పని జరుగనిచ్చిరి. కంపెనీవారు మదాసు రాజధానిలోను వంగరాష్ట్రమునను భారతీయులకు సైన్యమున ఉద్యోగములిచ్చుచుండిరి. ఆంగ్లేయ సైనికులు వీరిక్రింద అడకువతో పనిచేయుచుండిరి. బ్రిటిషువారికి పలుకుబడిహెచ్చి రాజ్యాధిపత్యము వర్ధిల్లగానే నల్లవారిక్రింద తెల్లవారు పనిచేయ పరువుతక్కువగానెంచి సేనలో నల్లవారి కుద్యోగము లిచ్చుట మానిరి. ఉన్న నల్లఉద్యోగులకు తెల్లసైనికులు సలాములుజేయుట మానిరి. కారన్‌వాలీసు గవర్నరు జనరలగునప్పటికీ అహంభావము పూర్తిగా పెరిగి నల్లవారికి పెద్దయుద్యోగము లెవ్వియు ఒసగకూడ

దనియు అన్ని యుద్యోగములు తెల్లవారికే యివ్వవలె ననియు నొక పద్ధతి స్థిరపడినది. శిస్తు వసూలులో నల్లకలెక్టరు తీసివేయబడి తెల్లవారు నియమింపబడిరి. నల్లయుద్యోగుల పైన తెల్లయుద్యోగులను పై యధికారులుగా పెట్టిరి. పరిపాలనకు సంబంధించినట్టియు, పెద్దజీతములు గలట్టియు ఏ యుద్యోగములు కూడ నల్లవారి కొసగకపోయిరి. న్యాయవిచారణ నల్లవారి చేతులనుండి తీసివేసి తెల్లజడ్జీల కొసగిరి. 1817 లో మదాసు గవర్నరు నాటి గవర్నరుజనరలగు హేస్టింగ్సున కిట్లు వ్రాసినాడు.* బ్రిటిషువారు తమ పశుబలమువలన తిరుగుబాటులను అణచివేయగలరు. విదేశీయ దండయాత్రలను నిరోధింతురు. తమ ప్రజలకు రక్షణ నివ్వగలుగుదురు. వారి శాసనధర్మములు సంస్థలుకూడ ప్రజాపీడన తొలగించి శాంతిభద్రతలను పూర్తిగా స్థాపించునట్టివిగానే యున్నవి. గాని ప్రజలస్థితి మాత్రము పూర్వరాజుల కాలము నాటికన్న బాగుపడినట్లు చెప్పజాలము. ఈ శాంతిభద్రతలు రక్షణయు పారతంత్ర్యముతో స్వతంత్రవినాశనముతో స్థాపింపబడినవి. ప్రజలనైతిక ధర్మములు అడుగంటినవి. వారి ఆత్మగౌరవము నశించినది. ఈ ప్రజలు ఏ వ్యాపారమునో, ఏ వృత్తినో జేసికొనుచు అణగియుండవలయునే గాని పరిపాలనములో వీ రెట్టి పలుకుబడిని కోరుటకు వీలులేదు. శాసననిర్మాణములోను, సివిలు పాలనములోను వీరు పాల్గొన వీలులేదు.

ప్రజాసేవకులు ప్రభుత్వ ఉద్యోగములు సేయువారు, అట్టి అర్హత దర్జాగలవారును ఉన్ననే ప్రజల నీతిధర్మములు

బాగుపడును. అట్టి ఉద్యోగగౌరవము పొందువారు లేనప్పుడు తక్కువ తరగతుల ప్రజలయం దెట్టి సారము నుండదు. ఇట్లు ప్రజలకు ప్రభుత్వోద్యోగములు లేనందువలనిఫలితము లన్ని బ్రిటిషు పరగణాలలోను కనబడుచునేయున్నవి. ఈ జనులు కేవలము నీచమైన బానిసబుద్ధి కలవారుగా నున్నారు. సుబేదారుకన్న హెచ్చునైనిక దర్జాగాని సివిలుపరిపాలనలో న్యాయవిచారణ శాఖలోను, రెవిన్యూ శాఖలోను స్వల్ప జీతముల యుద్యోగములుకన్న హెచ్చుపదవినిగాని పొందలేని నేటివులలో నీతినియమములు వర్ధిల్లుట దుస్తరము. చాలీచాలని స్వల్పజీతములకు తోడు లంచములు పుచ్చుకొందురనుటలో నాశ్చర్యమేమియులేదు.

బ్రిటిషువారీ దేశము నాక్రమించిన దానియొక్క ఫలితమేమనగా నీజాతి నుద్ధరించుటకు బదులు కేవలము పాడుచేయుటగనే పరిణమించినది. ఈ బ్రిటిషు ఇండియాలోవలె జనులకు తమ దేశపరిపాలనలో నెట్టిపలుకుబడియు లేకుండాజేసిన నుదాహరణ మింకే దేశాక్రమణ చరిత్రలోను జరుగలేదని చెప్పవచ్చును. (Life and Experiences —Sir P. C. Ray 227-228) స్ట్రాచీగారు 1820 సంవత్సరమున చెప్పిన మాటలివి. "ఆంగ్లేయులకు దుర్బుద్ధి కలుగకుండా కావలసినంత పుష్కలముగ జీతములనిచ్చుచు 'నేటివుల'కు వారు ఎంతగొప్ప వంశీయుడైనట్టి మహనీయుని సంతతివారైననుగూడ వారికి పెద్ద యుద్యోగము లివ్వక నీచపు నౌఖరీనిచ్చి నెల కిరువది ముప్పది రూప్యముల భిక్షాదానపు వేతనముల నిచ్చి వీరు లంచగొండెలనియు

దుర్మార్గులనియు కంపెనీ కొలువులోని ఆంగ్లేయోద్యోగులు తప్ప భారతీయులు పరిపాలక ఉద్యోగములకు తగరనియు పలుక సాహసించుచున్నాము!"

"నాగరకత కలిగినట్టియు, జనాకీర్ణమైనట్టియు ఈభారత దేశములో న్యాయపరిపాలనము భారతీయుల మూలముననే జరుగవలెను. ఐరోపా ప్రభుత్వములు చేయుచున్నట్లుగానే ప్రజా సేవలో తగు జీతములను గౌరవములను ప్రసాదించి ప్రజలనైతికధర్మములను కాపాడవలెను" అని సర్ తామస్ మన్రో 1820లోనే చెప్పియున్నాడు. కాని యిది జరుగలేదు.

## III

## పూర్వపు పంచాయతీల వినాశము

బ్రిటిషువారీ దేశము నాక్రమించినది మొదలు దేశ పరిపాలనకు సంబంధించిన పెద్ద యుద్యోగములు భారతీయుల కివ్వకపోవుటయే గాక సర్వాధికారములను తెల్లయుద్యోగుల చేతులలో పెట్టుకొనవలెనను ఉద్దేశము ననుసరించి భారత దేశ ప్రజల కనాదిసిద్ధముగా నుండిన స్థానిక స్వపరిపాలన సంస్థలగు గ్రామపంచాయితీలను కూడా నాశనము చేయసాగిరి. దీని వలన భారతీయులకు కలిగిన ఘోరఅన్యాయము వర్ణనాతీతము. దీనివలన ప్రజలలో స్వాతంత్ర్యశక్తులు నశించి వారు నోరు లేని పశువులమందల స్థితికి దిగిపోయిరి. ఆంగ్లరాజ్య ప్రారంభ దినములలో భారత దేశమునకు గవర్నరుజనరలుగా నుండిన కారన్ వాలీసుయొక్క జీవితచరిత్రను వ్రాసిన సర్ తామస్

మనో చెప్పిన మాటలవలన నీ గవర్నరుజనరలుయొక్క పరి పాలనవిధానములో భారతీయసంస్థలనెల్ల కూకటివేళ్ళతో పెల్ల గించి ఆంగ్లసంస్థల నెలకొల్పుట యొకముఖ్యవిషయముగా కన పడుచున్నది. ఏవిధమైన అధికారమును పలుకుబడియు 'నేటివు' భారతీయుల చేతులలో నుండకుండా లాగివేసి యాంగ్లేయుల చేతులలో నుంచుట యితని ముఖ్యోద్దేశము. హిందూదేశ ములో ప్రతి గ్రామములోను ఆకాలములో నొకవిధమైన మ్యునిసిపాలిటివంటి గ్రామపరిపాలక సంస్థయుండి ఆ గ్రామము యొక్క (రివిన్యూ) శిస్తువసూలు గ్రామరక్షణ (పోలీసు) వ్యవ హారము లన్నియు చక్కబెట్టుచుండెను. ప్రైవేటు పబ్లికు విషయములందు గూడ వీనికి మేజస్ట్రేటు న్యాయవిచారణాధి కారము లుండెను.

"అన్నిటికన్నను ముఖ్యమైన స్వపరిపాలన సంస్థ గ్రామ పంచాయితీయే. ఇది ఆయాగ్రామవాసులలో కొందరు సభ్యులు గాగల ప్రజాసంస్థ. ఆ గ్రామస్థులలో నొండొరులకు వచ్చువి వాదలువీనియెదుట మనవిచేసికొని తమవ్యాజ్యములు నివారించు కొందురు. అంతట నా పంచాయితీ యీ వివాదలను పరిష్క రించును" అని సర్ తామస్‌మనో వ్రాసియున్నాడు. ఈ గ్రామ పరిపాలన సంస్థలనుగూర్చి సర్ చార్లెస్ మెట్కాఫ్‌దొర యిట్లు వ్రాసియున్నాడు:

"ఈగ్రామప్రజాసంఘములు చిన్న (రిపబ్లికులు) ప్రజా స్వామికములు అని చెప్పవచ్చును. వీనికి గావలసిన అధికా రము లెల్లకలవు. దేశ ప్రభుత్వసంస్థ లెవ్వియు వీని యధికార

ములకు భంగము కలిగింపవు. దేశములో రాజవంశములు రావచ్చును; పోవచ్చును. రాజకీయ విప్లవములు పరివర్తనలు కలుగవచ్చును. హిందూ, పఠాను, మొగలు, మహారాష్ట్ర, సిక్కు, ఆంగ్లేయ ప్రభువు లొకరితరువాత నొకరు వచ్చిరిగాని ఈ గ్రామ ప్రజాసంస్థ లెప్పటివలెనే చెక్కుచెదరక నిలిచి యున్నవి. నిజముగా నొక్కొక్క చిన్న ప్రభుత్వమని చెప్పదగిన ఈ గ్రామ ప్రజాసమితులే యీ భారత దేశములో కలిగిన మార్పులమధ్య ప్రజాక్షేమమునకు తోడ్పడి వారిని కాపాడిన సంస్థలని చెప్పవచ్చును. ఈసంస్థల మూలముననే భారతీయ ప్రజలు కొంతవరకైన శాంతిని స్వతంత్రమును పొందగలిగినారు.*

ఈసంస్థలేమైనవి? ఆంగ్లేయ ప్రభుత్వవిధానమున నివి నాశనమై యదృశ్యమైనవి. సివిలు అధికారము న్యాయవిచారణ దేశపరిపాలనలకు సంబంధించిన అన్ని అధికారములును ఆంగ్లేయ జిల్లా మేజస్ట్రేటుల చేతులలో కారన్ వాలీస్ కేంద్రీకరించినాడు. ఆ యధికారుల చేతులలో నిముడని యధికారములు, అత్యధిక జీతములుగల ఇతరశాఖలకు సంబంధించిన తెల్ల యుద్యోగుల చేతులలో కేంద్రీకరింపబడినవి. లెనోయీ (Lonoye) ఆనాడు (1858 లో) వర్ణించిన జిల్లా పరిస్థితులే నేటికిని అమలు జరుగుచున్నవి. "ఒకజిల్లా సాధారణముగా నింగ్లాండులో యార్కుషైరంత పెద్దదిగానుండును. 20 మొదలు 40 లక్షల ప్రజలుందురు. జిల్లా అధికారి దేశమునకుక్రొత్తవాడు, విజాతీయుడు. అతడు సర్వాంతర్యామిగా నుండుట, దివ్యదృష్టి కలవాడుగా నుండుట దుర్లభము. ప్రజలకష్టసుఖములు వారికి గావలసిన

సౌకర్యములు ఇతనికి తెలియవు. తన కచ్చేరీగోడల మధ్య కూర్చుని నివేదికలు తయారుచేసికొనుచు పెద్దకవిలెలను సంక్షిప్తము (ప్రిసిస్) గా వ్రాసికొనుచు కాలక్షేపము చేయుచుండును. తాము పరిపాలింపవలసిన ప్రజలను వీ రెరుగనే యెరుగరు. సర్ జేమ్సుకెయిర్డు చెప్పినట్లు ఈ దేశపరిపాలన యొక్క మూలసూత్రము ఎల్లప్పుడు పెద్దపెద్ద రిటరన్లు రిపోర్టులు తయారుచేయుచు పై యధికారులకు పంపవలసిన బాధ్యతతో పై యుద్యోగుల యధికారమునకు ప్రతివారిని లోబరచియుంచు పద్ధతిగా కనబడుచున్నది. భూస్వాములకు రైతులకు మధ్యగల పరస్పర సంబంధములను ఏనాడును భూస్వాములుగానివారు సూత్రీకరించు సిద్ధాంతములపైన నాధారపరచుటయు నిచ్చుట జరుగు విపరీత పద్ధతిగా నున్నది."

## IV

## బ్రిటిష్ వారి న్యాయవిచారణ

ఆంగ్లేయ న్యాయవిచారణాపద్ధతి గూఢమైనది. చాల తికమకలతో గుంటచిక్కులతో నిండి న్యాయవాదుల ఇంద్రజాలము సాక్ష్యబలమే ప్రధానముగనుండి, నిరాడంబరమును సులభసాధ్యమును అందరికి తెలియు పూర్వపు పంచాయతీ న్యాయవిచారణా పద్ధతికి భిన్నముగనుండి కూటసాక్ష్యముల సృష్టింపునకు ప్రయివేటు ప్లీడర్ల కుట్రలకు హెచ్చు అవకాశములు గల్పించి న్యాయవిచారణ నొక జూదముగా జేసినది.

ఆంగ్లేయ న్యాయవిచారణా విధానము బీదరైతు

లకుగూడ చాల వ్యయకారణమై ప్రభుత్వమునకు ఆదాయ కారణమై వివాదలను పెంచినదని సర్ జేమ్సు కెయిర్డు వ్రాసినాడు. పాతపద్ధతులుపోయి ఆంగ్లేయకోర్టులను స్థాపించుట హెచ్చినకొలది దేశములో అబద్ధ సాక్ష్యములును, అందువలన న్యాయపరిపాలనములో కలుగు ఘోరఅన్యాయములు, వర్ధిల్లిన వని చరిత్రకారులు వ్రాయుచున్నారని పార్లమెంటు మెంబరగు జాన్ బ్రైట్ ఉపన్యసించెను. (Speeches. Vol II, P. 202) మరాటీదండయాత్రలకన్నను తండోపతండములుగా పెరుగు చున్న ఈ ఆంగ్లేయ న్యాయవాదులు రాష్ట్రప్రజలకు దిగ్భ్రమ కలిగించుచున్నారని మెకాలే వ్రాసినాడు. పదునెనిమిదవ శతాబ్దిలో నింగ్లీషుకోర్టులు విధించిన శిక్ష లతికౄరములై యుండెను. అనేకభారతీయులను చచ్చువరకు కొరడాలతో బాదవలసినదని శిక్షవిధించినట్లు రికార్డులుకలవు. ఆంగ్లేయ ఆఫీసర్లకౌన్సిలువా రొకమనిషిని చచ్చువరకు గుఱ్ఱముచే నీడ్పించునట్లు శిక్షవిధించిరనియు నిదర్శనముకలదని రెజినాల్డు రేనాల్డ్సు 'న్యూలీడరులో' వ్రాసినాడు. (మే 1938).

బ్రిటిషువారీదేశమున స్థాపించిన న్యాయపరిపాలనా పద్ధతిప్రజలప్రాణములకును ఆస్తికిని శాంతిభద్రతలనొడగూర్చు నట్టిదికాదు. జూదరితనమును, దుర్మార్గమును పెంపొందించు నట్టిదిగా నున్నది. ఈ న్యాయపరిపాలనా పద్ధతియు దీని ఆచ రణమును లోప భూయిష్టముగ నుండెను. గవర్నరుజనరల్‌గ నుండిన మార్క్వెస్ ఆఫ్ హేస్టింగ్సు 1819 ఫిబ్రవరిలో వ్రాసిన

డిస్పాచిలో నీయాంగ్లేయ న్యాయపరిపాలనావిధానముయొక్క ఫలితముల నిట్లు వర్ణించి యున్నాడు:

"వంగరాష్ట్ర భూస్వామిత్వపద్ధతుల దుస్థితికి పన్నుల శాసనముల కన్నను న్యాయవిచారణ పద్ధతులే హెచ్చుకారణములుగ నున్నవి. భూమిపన్నులిచ్చుకోలేనప్పుడు భూములు వేలములు వేయబడగా ఖరీదుదారులు న్యాయశాస్త్రమును పురస్కరించుకొని రైతుకాభూములలో నెట్టి హక్కులు లేకుండా నాశనముచేసి వెళ్లగొట్టుచున్నారు. 1780 లో జిల్లా కోర్టులను స్థాపించి 1793 లో నీ న్యాయపరిపాలనావిధానమును పునర్నిర్మాణము జేసినది మొదలు మనము తలవని తలంపుగా నొక సాంఘిక విప్లవమును కలిగించినట్లు తోచుచున్నది. దీనివలన జనుల నీతిధర్మములు పాడైపోయినవి. ఇది మన ప్రభుత్వమునకును శ్రేయస్కరము కాదు. మనశాసనము వలన నొక క్రొత్త తరమువారు తయారైనారు. వీరి ముఖ్య లక్షణమేమనగా, వ్యాజ్యము లాడుటయన్న ప్రీతి. మన న్యాయవిచారణశాఖ యీవ్యాజ్యముల కాంక్షను తృప్తి పరుప జాలకున్నది. నీతి నియమములు స్పష్టముగా పాడై పోయినవి. మన న్యాయపరిపాలనా విధానములోను ముఖ్యముగా దీని నిర్వహణములోను ప్రజలకుగల నైతిక బంధనములను, మత ధర్మములయొక్క పూర్వపుకట్టుబాటులను, నీతి నియమములను సడలించి నాశనము జేసితిమి; కాని దానికి బదులుగా నెట్టి బందోబస్తులు చేయనైతిమి. అందువలన మానవస్వభావములోని క్రోధలోభ మదమాత్సర్యములు విజృంభించి

ప్రజాభిప్రాయముయొక్క కట్టుబాటువలన నలుగురు ఛీఛీ యందురని భయముగాని, భయభక్తులుగాని లేకుండా పోయినవి. మన శాసనధర్మములవలన తటస్థించిన ఈ ఘోరస్థితిగతులను మనమేదో విధముగా సంస్కరించవలెను" అనినాడు.

## V

## జ లా ధా ర ము లు

భారతదేశము నేలిన హిందూమహమ్మదీయ రాజులు ఈ దేశముయొక్క వ్యవసాయాభివృద్ధికి వలసిన నీటివసరులు, ఆనకట్టలు, కాలువలు, తటాకములు, బావులు ఎన్నో నిర్మించిరి. నిర్మించుటయేగాక వీని నెల్లప్పుడు మంచి మరమ్మతులో నుంచుట యవసరమని గుర్తెరిగి అందుకు వలసిన కట్టుబాటులు గావించిరి. పల్లపుసాగు చేయబడు ప్రతి యెకరముపైనను ఈనీటివసరులకొరకొక స్వల్పపుపన్ను విధించుచుండిరి. ఈమరమ్మతుల ఖర్చును రైతులైన భరించుచుండిరి, లేదా రైతులును రాజులును చెరిసగమైన భరించుచుండిరి. ఈ నిర్మాణములను మంచి స్థితిలోనుంచు బాధ్యత గ్రామ పంచాయతులపై నుండెను. సింధు, పంజాబు ప్రాంతములందుతప్ప యిట్టి నిర్మాణములు తక్కిన అన్నిరాష్ట్రములందును విరివిగా నిర్మింపబడెను. ఆఫ్గన్ ప్రభువులలో ఫిరోజుఖాను, మొగలుచక్రవర్తులలో అక్బరు షాజహానులు, విజయనగర చక్రవర్తులలో కృష్ణదేవరాయలును ముఖ్యముగా నీ విషయమున హెచ్చు శ్రద్ధ వహించిరి.

ఆంగ్లేయులు ప్రభువులగునప్పటికి ప్రతి రాష్ట్రమునను

జిల్లాలోను ఇట్టి ఆనకట్టలు, చెరువులు, కాల్వలు, బావులెన్నో యుండెను. తరువాత నీదేశమున రాకపోకలకు రోడ్లు, కాలువలు నిర్మించుటయా లేదా రైళ్లు నిర్మించుటయా అను సమస్య చర్చకు వచ్చినపుడు బ్రిటిష్‌వారికి లాభకరమగు రైళ్లను నిర్మించుటకే తీర్మానించిరి. భారతదేశమున నాంగ్లేయపరిపాలన స్థాపించిన పిదప పబ్లిక్ వర్క్సు కమీషన ర్లీ నీటివనరులనుగూర్చి విచారణజరిపియుండిరి. దీనివలన 1840 నాటికే చాల జిల్లాలలోని ఆనకట్టలు కాలువలు, తటాకములు, బావులు మరమ్మతులేక పాడువడిపోయెనని తేలినది. పూర్వము సాగు చేయబడుచుండిన భూములనేకములు బంజరులుగానుండి పోయెననియు తేలినది. మద్రాసులో సాగుచేయతగిన భూమిలో 5వ వంతు మాత్రమే సాగుచేయబడుచుండెను. సేలముజిల్లాలో నుద్యోగిగానుండిన లెఫ్టినెంటుటిరెల్ ఆజిల్లాలోని భూములు ఎంతో సారవంతముగా నున్నను అనేకభూములు నీటివనరులు లేక పాడుపడియున్నవనియు తాను ముప్పదిమైళ్ళదూరములో నెనిమిది పది పెద్దతటాకములు పాడువడియుండుటను చూచితి ననియు వ్రాసినాడు (1848). సర్ హెన్రీకాటన్ కూడా ఈ దుస్థితిని వర్ణించియున్నాడు. ఆంగ్లేయ ప్రభుత్వము భూముల పైన అన్నిపన్నులు కలిపి ఒకే మొత్తముగా రొఖ్ఖపుశిస్తు వసూలుచేసిన రైతువారీపద్ధతిలో తానే ఈ బాధ్యతవహించెను. వంగరాష్ట్రమునను ఆగ్రా అయోధ్య పరగణాలలోను ఈ బాధ్యత జమీందారులపైన వేసెను. ఈ రెండు పద్ధతుల యందు నీదుస్థితియే దాపురించెను. తరువాత కొన్ని ఆనకట్టలు నిర్మించిరిగాని అప్పటికే నష్టము అత్యధికమయ్యెను.

## ఐదవ ప్రకరణము

# భారతదేశమువలన నింగ్లాండు బాగుపడినవిధము

## I

1617 లో భారతదేశములో నేరకము వస్త్రమైనను సూరతు పట్టణములో దొరకుచుండెను గాని దానికి బదులుగా చైనా వస్తువులు సుగంధ ద్రవ్యములు రొఖముతప్ప యితర సరుకు లెవ్వియు చెల్లుబడి గాకుండెను. ఒకటిన్నర శతాబ్దము వరకును భారతదేశమున ఆంగ్లేయ వర్తకము కేవలము, ఈ దేశ మునుండి నూలు, పట్టు సరకులను, నీలిమందును సుగంధద్రవ్య ములు నెగుమతిచేయుటతోనే తృప్తి జెంద వలసివచ్చుచుండెను. అందువలన నాకాలమున భారతదేశములోనికి బంగారముతప్ప యికె నేసరకులును దిగుమతియే లేదు. ఇట్లు 1747 మొదలు 1757 వరకు జరిగిన పదిసంవత్సరములలోను సగటున 5,62,423 నవరసుల విలువ బంగారము భారతదేశమునకు దిగుమతియై యుండెనని బూ్రసు అను నతడు వ్రాసియున్నాడు. ప్లాసీ యుద్ధము జరిగిన (1757) తరువాత నిట్లు బంగారు దిగుమతి యగుట ఆగిపోయినది. ఈ వ్యాపారములోనే ఆంగ్లేయ వర్తకకంపెనీ యమితలాభము లార్జింప గలుగుచుండెను. ఇంగ్లండులో రెండవ చార్లెస్ రాజ్యాధిపత్యము వహించిన పిదప 23 సంవత్సరములలోను గంగాతీరమునుండి ఇంగ్లండుకు

చేయబడు యెగుమతులు 8 వేల పౌనులనుండి 30 లక్షల పౌనుల విలువవరకును పెరిగెను.*

ఆంగ్లేయ వర్తకకంపెనీ వారి లాభములు ద్విగుణీకృతము లయ్యెను. 1676 లో ప్రతిహాటాదారునకు అతనికి గల వాటాలు ఉచితముగా రెట్టింపుచేయబడి వానిపైన సాలునకు నూటికి 20 చొప్పున 5 సంవత్సరములు లాభములు పంచి యివ్వబడెను. (మెకాలే ఆంగ్లచరిత్ర) 1677 లో వాటా 1కి 245 పౌనులుగనుండిన వాటాపత్రములు 1681లో 300 కును, తరువాత 360కును, అటుతర్వాత 500 కును పెరిగెను. ఈఅత్యధిక లాభముల కట్టె హద్దును లేకుండెను. ఆంగ్లేయుప్రభుత్వమువారు వీరివద్దనుండి కొంతసొమ్ము తీసికొనుటయు, కంపెనీ నౌకరులు లోపాయికారీ లాభములు ఆర్జించుటయు లేనిచో నింక నెంతలాభము వచ్చియుండునో!

ఆనాడు మనరూపాయి విలువ 2 షిల్లింగుల 8 పెన్నీలుగ నుండి వర్తకలాభవాటము మన కనుకూలముగ నుండెను. తరువాత రూపాయి విలువ 16 పెన్నీలకు తగ్గినది. భారత దేశములో నూలువస్త్ర పరిశ్రమ అభివృద్ధి జెందెను.

## II

ఇంగ్లాండు ఆ కాలమున అనగా 16వ శతాబ్దములో ఆర్థికముగాచాలవెనుకబడియుండిన దేశము. విదేశీయులవద్దీవ్యాపా

*మిల్లు చరిత్ర 1 వ సంపుటము పుట 37.

Plans for British India. —J. Bruce.
Outlines of English Industries.-Cunningham & M.C.Arthur.

రముతప్ప దేశములో మూలధనము లేదు. పారిశ్రామిక వాణిజ్యవస్తునిర్మాణములు లేవు. 17 వ శతాబ్ది ప్రారంభములో నింగ్లాండు ప్రజాపీడనముతో అంతఃకలహములతో బాధపడుచుండెను. వ్యాపారాభివృద్ధికొఱకు వలసిన మూలధనము లేదు. వ్యాపారములో డచ్చివారి పోటీ యత్యధికముగా నుండెను. 17 వ శతాబ్ది యంతమునాటి కీపరిస్థితు లతి తీవ్రరూపము దాల్చి దేశప్రజలలో దారిద్ర్యము అసంతృప్తియు హెచ్చిపోయెను. ఐరోపాదేశము లన్నిటిలో గూడ ద్రవ్యక్షామము కలుగు సూచనలు పొడగట్టెను. దీనికిముఖ్యకారణము ఆశియా నుండి దిగుమతిచేయు వివిధవస్తుజాలముకొఱకు పంపివేయబడుచుండిన బంగారు ఆదేశములందలి ద్రవ్యమును తోడివేయుటయే. అందువలన వివిధదేశముల నాణెముల విలువ పడిపోవసాగెను. ఇంగ్లాండులో దొంగనాణెముల చెలామణి వృద్ధియయ్యెను. వెండినాణెములందు ఇనుముకల్తీ కలుపబడుచుండెను. మఱియు ఇత్తడి మొదలగు లోహములు కూడా కల్తీ చేయుచుండిరి.

1710 మొదలు 1720 వరకు పది సంవత్సరములలో ఆంగ్లేయవర్తకకంపెనీవా రింగ్లాండునుండి భారతదేశమునకు సాలుకు సగటున 43,44,000 పౌనుల విలువగల బంగారము ఎగుమతి చేయుచుండిరి.

ఈకాలములో నింగ్లాండు ఎట్లు జీవింపగల్గినది ? అను సంగతి చాల ఘోరమైనకథ. ఆనాడు వెండిబంగారుల నెల్ల ఆశియా ఆకర్షించి వేయుచుండెనని జీవన్సు చెప్పియున్నాడు.

గోలకొండ వజ్రములుగల మొగలుచక్రవర్తినుండి వెండి బంగారు నాణెములుగల సామాన్యజనునివరకును ద్రవ్యము కూడబెట్టుకొనుట యనున దీ దేశీయుల నైజగుణము. ఇట్లు కోట్లకొలది జనులు తరతరములనుండి దాచుకొనిన ధనసంచయములనెల్ల ఆంగ్లేయులు పట్టుకొని లండనునగరమునకు తరలింప సాగిరి. ఇట్లు పట్టుకొనివెళ్ళిన ధనసంచయ మెంతవిలువగలదై యుండునో ఎవ్వరును చెప్పజాలరు కాని అనేక కోట్లరూపాయలు విలువగలదై యుండునని మాత్రము అందరు నంగీకరించి తీరవలెను. ఇది యానాడు ఐరోపాలో నుండిన వెండిబంగారుల మొత్తము విలువకన్న నెన్నోమడుగు లధికముగనుండెను. (Brooke Adams — Law of Civilization and Decay. P. 305) ఇంగ్లాండునుండి భారతదేశమునకు బంగారు దిగుమతి చేయబడిన కడపటిసంవత్సరము ప్లాసీయుద్ధము జరిగిన 1757 వ సంవత్సరమే యని యిదివరకే చెప్పబడినది. ఆ సంవత్సరముతో చైనాకు బంగారము పంపుట కూడా తగ్గిపోయినది. పంపబడు బంగారమెల్ల భారతదేశము నుండియే పంపబడుచుండెను. మరియు నీ ప్రవాహ మెదురు తిరిగినది. అప్పటినుండి, మద్రాసునుండియు, చైనానుండియు ఇంగ్లాండుకు వచ్చు ప్రతియోడలోను బంగారము పంపబడుచుండెను. ఈ సంగతి కంపెనీ డైరక్టరుల యుత్తరప్రత్యుత్తరముల వలన తేలుచున్నది. (Bruce—Plan for British India. 314-315) బంగారము ప్రోగుచేసి పంపుటకుగూడ కంపెనీ నౌకరులకు భారతదేశమున అనేక అవకాశములుండెను. మెకాలే

చెప్పినట్లు సముద్ర తరంగములవలె బంగారము భారత దేశము నుండి ఇంగ్లాండుకు ప్రవహింపసాగెను. ఇది ఆకాలమున నింగ్లాండుకు గొప్ప అదృష్టముగా పరిణమించెను. ఈధన మింగ్లాండుకు పోవనిచో ఆనాడు క్రొత్తగా కనపెట్టబడిన ఆవిరియంత్రము, నూలు వడకుటకు నేయుటకు కనిపెట్టబడిన యంత్రమగ్గములు, వడకు యంత్రములు, పరిశ్రమలయం దుపయోగించుకొని లాభముపొందుటకు వలసిన మూలధనము లేక ఇంగ్లాండు ఆర్థిక క్షోభలో మునిగిపోయి యుండును. ఇట్లా కాలమున నింగ్లాండులో వచ్చిన పారిశ్రామిక పరివర్తనమునకు, ఆర్థికాభివృద్ధికి ప్లాసీయుద్ధానంతరము ఇంగ్లాండుకుతరలింపబడిన అమితధనము, భారత దేశ భాగ్యభోగ్యములే మూలకారణమయ్యెనని బ్రూక్ ఆడమ్సు మున్నగు ఆంగ్ల చరిత్రకారులు అర్థశాస్త్రజ్ఞులు నంగీకరించినారు. ఇట్లు ఇంగ్లాండుయొక్క అదృష్టము 1760తో ప్రారంభమయ్యెను. మనదారిద్ర్యము నప్పటితోనే మొదలు. యంత్రములు నిర్మింపబడక పూర్వము నూలువడకుటకు నేయుటకు నింగ్లాండులో నుపయోగింపబడుచుండిన సాధన సామగ్రిలు భారత దేశములోని పురాతన వస్తువులవంటివే. 1760 లోనే ఇంగ్లాండులో (Flying shuttle) క్రొత్త పద్ధతి కండెనేత కనిపెట్టబడెను. 1764 లో హార్‌గ్రీవ్సు (Spinning jenny) మరరాట్నము కనిపెట్టినాడు. 1779 లో క్రోంప్టన్ 'మ్యూల్'ను (Mule) కనిపెట్టినాడు. 1795 లో కార్టురైటు యంత్రమగ్గము కనిపెట్టినాడు. ఆవిరియంత్రము 1768 లో పరిపక్వస్థితి జెందినది. భారత దేశమునుండి ఇంగ్లాండుకు ధనము

ప్రవహించుటకు పూర్వము 50 సంవత్సరముల క్రిందటనే ఈ యంత్రములు కనిపెట్ట బడియుండినచో వీనిని పరిశ్రమలలో నుపయోగించుకొనుటకు వలసిన పెట్టుబడికి మూలధనము లేక యీ క్రొత్తయంత్రములు వీని నిర్మాతలుగూడ నశించి యుందురు. తరువాత నచ్చట విరివిగా స్థాపింపబడిన ఫ్యాక్టరీలకు గావలసిన సొమ్ము లేక అవి తలయెత్తియుండవు. ఇట్లు ఆంగ్లేయ పారిశ్రామిక పరివర్తనము, ఆంగ్లేయ ఔన్నత్యము సామ్రాజ్యముగూడ భారతీయులు దాచుకొనిన ద్రవ్యముపై ననే నిర్మింపబడినవి. ఎట్టిశ్రమయు లేకుండా వడ్డీలేకుండా నిట్లు భారత దేశమునుండి తెచ్చిన అమితధన సంచయము నాధారము జేసికొని ఇంగ్లాండులో నొక విధమగు ద్రవ్య పరపతి స్థాపింప బడెను. అప్పు విరివిగా పుట్టుటవలన అచ్చటి పరిశ్రమలేగాక వ్యవసాయము పాడిపంటలు గూడ వృద్ధిజెందెను. కొనయూపిరితో పడియుండిన ఆంగ్లకర్షకులు కార్మికులు నొక్కసారిగా విజృంభించిరి. ఇంగ్లాండులో బొగ్గు, ఇనుము పుష్కలముగా గలవు. దీనికి ద్రవ్యపరపతి తోడుపడగా ఆంగ్లేయపరిశ్రమలు అభివృద్ధిజెంది అమెరికా ఐరోపాలలోను ప్రపంచ పణ్య చక్రములోను గూడ విజృంభించెను. తుదకు కలకత్తాలో భారతీయ కూలీలుచేయు సరకులతో కూడ పోటీచేయగలిగెను.

ఇట్లు నిరంతరముగా భారతదేశమునుండి ఇంగ్లాండుకు ధనము ప్రవహించి పోవుటవలన మన దేశముయొక్క పారిశ్రామిక వ్యవసాయాభివృద్ధికి వలసిన ధనములేక దారిద్ర్యము

వృద్ధికాసాగెను. కరవులు ప్రారంభమయ్యెను. ఈ ధన ప్రవాహము నాలుగురకములుగా గొనిపోవబడుచుండెను. భారతదేశరాజులు పరిపాలకులవలన కంపెనీవారు గైకొనిన కప్పములు, కంపెనీవారిపేరున ప్రజలపై విధింపబడిన పన్నులు, దేశములో కంపెనీసేవకులు చేయుచుండిన స్వంతవర్తక లాభములు, నేటీవురాజులవలన నవాబులవలన వారి స్నేహితులు బంధువుల వలన వారితోడి సంబంధములందు కంపెనీ గైకొనిన లంచములుగాక రహస్యముగను బహిరంగముగాను సొమ్ము గైకొనబడుచుండెను. ఒకొక్కప్పుడు బలవంతముగా కూడ గైకొనబడుచుండెను. ఇట్లు లాగికొనబడినధనములో కొంతభాగముతో భారతదేశ సంపదకు సంబంధించిన ముడివస్తువులు కొని ఇంగ్లాండుకు, నితరదేశములకు పంపుచుండిరి. కొంత రొఖ్ఖముగానే పంపుచుండిరి.

## II

1772 మొదలు 1785 వరకు వారన్ హేస్టింగ్సు పరిపాలనకాలమునగూడా భారతదేశరాజులనుండి నవాబులనుండి ప్రజలనుండి చాలా పెద్దమొత్తముల ధనము, విశేష విలువగల సరకులు గ్రహింపబడి సమకంపబడెను. దీనికి ప్రతిఫలము కంపెనీవారు భారతదేశమునకుచేసిన "సేవ" లని చెప్పబడెను. ఈ "సేవ"లే ఆనాడు అయోధ్యలోను, పశ్చిమోత్తర ఆగ్రా పరగణాలలోను, దక్షిణాపథములోను యుద్ధములకు కారణములైనవి.

ఈనాటి ద్రవ్యార్జనముకూడ రెండువిధములుగ నుండెను. కంపెనీవారిపేరున బహిరంగముగా పుచ్చుకొనినది; కంపెనీ యుద్యోగులు ఎవరికిదొరకినది వారుపుచ్చుకొనినది. దీనికి జమా ఖర్చులు లేవు. తరువాత వెలస్లీ గవర్నరుజనరలు యుద్ధముల కాలములో స్వదేశ సంస్థానాధీశులనుండి లెక్కలేనంత సొమ్ము వసూలుచేయబడినది. డల్‌హౌసీ కాలమువరకు నిట్లు అవిచ్ఛిన్నముగా జరిగినది. ఆ కాలములో భారతదేశమునుండి సీమకు తరలింపబడిన వజ్రములకు, రత్నములకు, ధన సంచయములకు లెక్కలేదు. అట్టి దోపిడి ద్రవ్యములలో చేరినది "కొహినూరు" వజ్రమొకటి. క్లైవు, వాన్సిటార్టు, వారన్‌హేస్టింగ్సులు చేసిచూపిన దోపిడిపుచ్చుకున్నలంచములు, గవర్నరులు, కౌన్సిలు మెంబర్లు, సామాన్యోద్యోగులుగూడ అవిచ్ఛిన్నముగా సాగించి లక్షాధికారు లగుచుండిరి. ఇకయుద్ధములందు సైన్యములు సేనాధిపతులు ఉద్యోగులమాట చెప్పనక్కరయేలేదు. పై అధికారినుండి క్రిందివాని వరకును అందరికిని దోపిడిలో భాగముండెను. దండయాత్రలయందు పట్టణములను కొల్లగొట్టి ఎవరికి దొరకినది వారు దోచికొనుట సర్వ సామాన్యమగు హక్కుగానుండెను. యుద్ధానంతరము సంధి జరిగినప్పుడెల్ల స్వదేశరాజులు విశేషధనమును ఉద్యోగులకిచ్చి ఆసంధి నిలుపుకొనవలసి యుండిరి. టిప్పుసుల్తానుతో సంధిచేసినప్పుడు 3 లక్షల పౌనులిట్లు లాగికొనిరని మాల్కలం చెప్పుచున్నాడు. 1799 లో వెల్లస్లీ కాలములో నిట్లు బహుమాన ద్రవ్యముమాట వచ్చినప్పుడు ఒకలక్ష పౌనులు నిర్ణయింపబడెననియు వెలస్లీ ఆ

సొమ్ము తానుపుచ్చుకొనక సైన్యములకు పంచిపెట్టినాడనియు టారెన్సు చెప్పుచున్నాడు. (Malcolm Vol. I. Torrens 230-248) వెలస్లీ కాలములోనే మరల సింధియా విషయము లో కూడ నిట్టి బహుమతి ద్రవ్యమును గూర్చిన యేర్పాటు జరిగినట్లును వివరింపబడి యున్నది.

1836 ఏషియాటికు జర్నలు 33 పుటలో నీక్రిందిసంగతి వివరింపబడినది. కూర్గును కలుపుకొనునప్పుడు ఆ దండయాత్ర నడిపిన సర్. పి. లిండ్సేగారికి దోపిడిసొమ్ములో 16 వ వంతు ఒసగబడెను. దండయాత్రలో పాల్గొనిన ప్రతి యుద్యోగికి ఆ దోపిడిసొమ్ములోనుండి ఈ విధముగా బహుమతులు పంచి పెట్టిరి:

| | |
|---|---|
| కర్నలు లాక్కొక్కరికి | 25 వేల రూపాయిలు |
| లెఫ్టినెంటు కర్నలు లొక్కొక్కరికి | 15 ,, |
| మేజర్లకు | 10 ,, |
| కెప్టెనులకు | 5 ,, |
| సబ్ ఆల్టర్నులకు | 25 వందలు ,, |

ఈ అన్యాయమునుగూర్చి మొరపెట్టుకొనుటకు కూర్గు రాజు 1852 లో ఇంగ్లాండు వెళ్ళగా అతని మొరలెవ్వరు వినక అవమానించిరి.

1826 లో భరతపుర సంస్థానముయొక్క బాలరాజును సంరక్షించుటకు పంపబడిన లార్డుకంబర్ మేర్ అచ్చట కోట లోని 48 లక్షలలో 6 లక్ష లపహరించెను. ఇంకను విలువగల సామానులు దోచుకొనెను. (తాంప్సన్, గెర్రాట్ పుట 297)

1843 లో సింధురాష్ట్రముపైన చార్లెస్ నేపియరు దండయాత్రచేసి కలుపుకొనినప్పుడు నేపియరు ఉద్యోగులు స్త్రీలను అమీరుల జనానాలోనికి పంపి ఆ రాజస్త్రీల నగలను ధనమును తుదకు వస్త్రములనుగూడ బలవంతముగా లాగికొని హరించిరి. వారిని చిత్రహింసలు పెట్టిరి. (History of Afghans-G. P. Ferrier)

ఇటీవల నిట్లు బహిరంగముగా దోచుకొను పద్ధతి పోయినదిగాని గవర్నరుజనరలును గవర్నర్లను పర్యటనములు చేయునప్పుడు మహారాజు లిప్పటికిని వారికి లక్షలకొలది విలువ గల బహుమతులనిచ్చు పద్ధతి జరుగుచునేయున్నది.

## III

కంపెనీ పరిపాలనపోయి రాణిపేరున పార్లమెంటు పరిపాలనవచ్చిన (1858) పిమ్మట గూడ పూర్వమువలెనే భారతదేశపరిపాలన మీ దేశ ప్రజలలాభముకొఱకు చేయవలయునా ఆదేశ ప్రజల లాభము కొఱకు చేయవలయునా అను సమస్య బ్రిటిషురాజ్య నీతిజ్ఞుల మనస్సులందెల్లప్పుడును మెలగుచుండెను. విక్టోరియా రాజ్ఞి ప్రకటనలోని వాగ్దానములెల్ల నిజముగా చెల్లించినచో నీ దేశ ప్రజలకు లాభమును ఆదేశీయులకు నష్టమును కలుగును. అందువలన నవి కేవలము కాగితపు వాగ్దానములుగనే యుంచి పాతవిధానమునందు వలెనే క్రొత్తవిధానమునందుగూడ భారతదేశ భాగ్యభోగ్యముల నింగ్లాండు లాభముకొఱకుపయోగించు పద్ధతులవలం

బింపబడెను. భారత దేశమునుండి ఎప్పటివలెనే అనేకరూప ములుగా నింగ్లాండుకు ధనము తరలింపబడుచుండెను. భారత దేశ ఆర్థిక విధానమెల్ల ఇంగ్లాండులాభముకొఱకే వినియో గింపబడ సాగెను. మర్యాదకొఱకా మాట చెప్పకపోయినను భారత దేశ మింగ్లాండుయొక్క బానిసరాజ్యముగనే ఉపయో గించుకొనబడుచున్నది.

భారత దేశము బ్రిటిషువారి పాడియావు. ఇంగ్లాండు దేశపు ప్రజలకు ఆహార పదార్థములను సరఫరా చేయు చున్నది. వారి పరిశ్రమలకు గావలసిన ముడివస్తువులను పంపు చున్నది. వారివస్తువులను హెచ్చుధరలకు గొనుచు వారివర్త కము నభివృద్ధి చేయుచున్నది. వారు తమ వలస రాజ్యములను బాగుచేసికొనుటకు కూలీలనంపినది. ప్రపంచములోనిఅన్ని భాగములందు ఇంగ్లీషువారు చేసిన సామ్రాజ్యయుద్ధములకు గావలసిన సైన్యములను ధనమును పంపినది. సామ్రాజ్య సంపాదన చేసిపెట్టినది. ఇంగ్లాండువారు సైనిక విధానములం దెట్టి నూతనప్రయోగము గావించుకొనదలచినను అట్టివానికి అవకాశము కలిగించి వ్యయము భరించినది. ఆంగ్లసైనికులు తర్ఫీదుపొందుటకు శిబిరముగా నుపయోగింప బడుచున్నది.

భారత దేశ ధనమును సైన్యమును ఆంగ్లేయులు తమ సామ్రాజ్యసంపాదన కుపయోగించు కొన్నారు. ప్రపంచము లో నలుప్రక్కలనుగల తమ రాజ్యములందు కల్లోలము నణచు కొనుట కుపయోగించుకొన్నారు. బోయరు యుద్ధములో భార తీయ సైన్యములు వారికి ముందుగా తోడ్పడినవి. ఇట్లే ఐరోపా

సంగ్రామములోను మన సైన్యము లాంగ్లేయులకు ముందుగా తోడ్పడినవి. భారత దేశమున కెట్టి సంబంధములేని ఆష్టను యుద్ధము (1867-68) పెర్షియాకు దండయాత్ర (1875) 2-వ ఆఫ్ఘన్ యుద్ధము (1878-80) ఈజిప్టుయుద్ధము (1882) సూడాను యుద్ధము ఇంగ్లాండుకొఱకు గావింపబడినను వాని ఖర్చును మన దేశాదాయమునుండి ఖర్చుపెట్టిరి. ఐరోపా సంగ్రామము కొఱకు 371 కోట్ల రూపాయలును సైన్యమును పుచ్చుకొనిరి.

భారత దేశమున నాంగ్లేయులు అనేక కోట్లరూపాయలు పెట్టుబళ్లుపెట్టి దానిపైన కోట్లకొలది రూపాయలు వడ్డీక్రింద పుచ్చుకొనుచున్నారు. ఆంగ్లేయ సివిలు మిలిటరీయుద్యోగుల కత్యధికజీతము లిచ్చుచున్నారు. ఆంగ్లేయులు వర్తకమువలన లాభములేగాక నింక నెన్నో విధములుగా నీ దేశమువలన లాభములు పొందుచున్నారు.

## IV

భారత దేశ ప్రభుత్వఋణములో 729 కోట్ల 40 లక్షల రూపాయి లనవసర ఋణమని కాంగ్రెస్ విచారణ సంఘము వారు తీర్మానించి యున్నారు. అమెరికా దేశపు సుప్రసిద్ధ ఆర్థిక పండితుడు ఎల్. హెచ్. జెంక్సు (Professor L. H. Jenks) అనునాతడు 'మైగ్రేషన్ ఆఫ్ బ్రిటిషు కాపిటల్' అను గ్రంథమును నవీనముగా రచించియున్నాడు. ఆ గ్రంథము యొక్క 223-224 పేజీలలో నిట్లు వ్రాసియున్నాడు.

"ఇండియా మీాద బ్రిటిషువారు తమ వీలుకొరకు

ఋణభారమును మోపిన విధానము అపూర్వము. పరిపాలనా విధానములో నెట్టి ప్రాతినిధ్యమును, పలుకుబడియు లేనిరైతు మీద నెన్నెన్నియో భారములు వేయబడినవి. సిపాయి మ్యూటినీకి కర్చులు, ఈస్టిండియా కంపెనీవారి హక్కులను బ్రిటిషు రాజ్యాంగమువారికి ట్రాన్సుఫరు చేసినందుకిచ్చిన సొమ్ము, చైనాలోను అబిసీనియాలోను ఏకకాలమునందు జరిగిన యుద్ధములఖర్చులు, లండనులో ఇండియాఆఫీసు ఉద్యోగనిక త్రైజీతము మొదలగు ఇండియాకు అత్యంత దూరపు సంబంధముగల గవర్నమెంటు ఖర్చులన్నియుగాక, రానున్న యుద్ధములకై అమలు చేయబడి, సముద్రప్రయాణముచేసియు, యుద్ధములలో చివరకు పాల్గొనకనే తిరిగివచ్చిన ఓడలకైన ఖర్చులును, ఇండియాకు పంపుటకై యింగ్లాండులో ఆరుమాసములు శిక్షణము పొందు పటాలముల ఖర్చులును ఇవియన్నియును అమాయకపు రయితు లెక్కలోనే కర్చు వ్రాయబడినవి. 1868 సంవత్సరములో టర్కీ సుల్తానుగారు సపరివారముగా వైభవముతో ఇంగ్లాండు చూచుటకు వెళ్ళియుండిరి. అప్పుడు వారికి లండనులో ఇండియా ఆఫీసులో గొప్పవిందు జరిగెను. ఆసందర్భమున సుల్తానుగారి ఆతిథ్యమునకై కర్చుపెట్టబడిన సొమ్మంతయు నిండియామీదనే వేయుబడినది! 1870 వ సంవత్సరమునకు పూర్వము ఇండియాక్రింద కర్చువ్రాసిన పద్దులలోని క్రిందివికలవు. ఈలింగు (Ealing) లో పెట్టిన పిచ్చి ఆసుపత్రి (Lunatic Asylum) కర్చులు, జాంజిబారు (Zanzibar Mission) రాయబారులకు ఇచ్చిన నజరులు

బహూమతులు, చైనా పరిష్యా దేశములలో బ్రిటిషువారి ప్రతినిధుల ఖర్చులు (Consular and Diplomatic establishments) మధ్యధరా సముద్రములో కావలాగా నుంచిన యుద్ధనౌకాదళముయొక్క సాలియానా కర్చులలో కొంత భాగము, ఇంగ్లాండునుండి ఇండియాకు వేయబడిన టెలిగ్రాఫులైనుకు అయిన యావత్తు ఖర్చు, ఇవియన్నియు ఇండియా లెక్కనే ఖర్చు వ్రాయ బడినవి. ఇండియా బ్రిటిష్‌రాజు క్రిందికి వచ్చిన తరువాత 13 సంవత్సరములలో నిండియానుండి వసూలు చేయబడు పన్నులు 330 లక్షల పౌనులనుండి 520 లక్షల పౌనులకు పెరిగెనన్న ఆశ్చర్యమేమి? ఇట్టి కర్చులన్నియు పూడవలదా? అట్లయ్యు 1866 మొదలు 1870 సంవత్సరమువరకు అనగా నాలుగు సంవత్సరముల బడ్జెట్టులో ఆదాయముకంటె 115లక్షల పౌనుల వ్యయము అధికముగ కనపర్చబడినది. 1857-1860 సంవత్సరముల మధ్య 300 లక్షల పౌనుల ఋణము ఈ దేశముమీద నిర్ధారణచేయబడి అప్పటినుంచి క్రమక్రమముగా పెంచబడుచున్నది. ఇట్లు ఋణము పెరిగిపోవుచుండగా నిండియాను పరిపాలించు బ్రిటిషు పరిపాలకులు కర్చు తగ్గించుటలోను మిత వ్యయము చేసి దేశముయొక్క ఆర్థికస్థితిని బాగుపరుచుటలోను నిపుణులని ఖ్యాతి సంపాదించుకొనుచు నైపుణ్యముతో ఇండియా దేశపు లెక్కలను ఆర్థికపట్టికలను చమత్కారముగా తయారుచేసి ప్రచురించుచున్నారు.

# ఆరవ ప్రకరణము

## ఇంగ్లీషు దొరతనము

### I

ఈ దేశమును జయించుటకు పూర్వము వచ్చియుండిన విజాతీయ పరిపాలకజాతులవలెగాక ఆంగ్లేయు లీ దేశమునకు వచ్చి ఎంత కాలమైనను దేశప్రజలతో కలిసిపోవుటగాని కలసి మెలసి యుండుటగాని లేనేలేదు. కాలము గడచినకొలదియు పాలక పాలిత జాతులమధ్యగల తారతమ్యము వర్ధిల్లి పాలకు లలో జాత్యహంకారము వృద్ధిజెంది పాలితులను నీచముగా జూచుటయు నందువలన వైషమ్యములు హెచ్చి పాలక పాలి తుల మధ్య నెట్టి యన్యోన్యమును లేకుండుటయు తటస్థించు చున్నది. తామీ దేశమును జయించి దీనిని స్వప్రయోజనము కొరకు తమ బాహుబలమునఅణచియుంచినామనియు ఏక్షణము ననైననీప్రజలు తిరుగుబాటుగావింపగలరనియు నొకఅనుమాన ముతో విరోధులమధ్య జీవించుచున్నట్లే బ్రిటిషువారు భావిం చుచు తమబలమును ప్రజల నణచియుంచుటకే వినియోగించు చున్నారు.

ఈ విజాతీయ పరిపాలననుండి వెలువడి స్వతంత్రు లముకావలెనను భావముకలిగి దేశములో జాతీయచైతన్యము కలిగినకొలది బ్రిటిష్‌వారికి రోషము హెచ్చుచున్నది. బ్రిటిష్ పరిపాలనను తొలగించి స్వాతంత్ర్యము పొందగోరు వారి నణచుటలో నీ నాగరకులగు ఆంగ్లజాతివా రవలంబించు

నిరంకుశ పద్ధతులు చేయు దారుణ చర్యలు పూర్వకాలము నాటి అనాగరక ప్రభుత్వముల నిరంకుశపద్ధతులకు గాని నేడు ఇటలీ జర్మనీలలో అవలంబింపబడుచున్న ఫ్యాసిస్టుకూ్రరపద్ధతులకు గాని ఏ మాత్రము తీసిపోవునవి గావని భారతదేశ స్వాతంత్ర్యము కొరకు 1857 లో జరిగిన సిపాయిల విప్లవము నాటినుండి నేటివరకును జరుగుచున్న ఉద్యమముల నణచుటలో బ్రిటిషువా రవలంబించు విధానములవలన విదితమగుచున్నది.

సిపాయిల విప్లవము తరువాత శాంతి భద్రతలను స్థాపించుటకని బ్రిటిషు వా రములు జరిపిన తీవ్రసైనిక శాసనము, ప్రభుత్వోద్యోగులు న్యాయాధిపతులు సైనికులు గావించిన దారుణచర్యలు, ఎట్టిన్యాయ విచారణ విచక్షణ లేకుండ కాల్చుటలు, ఉరిదీయుటలు, మొదలగు అక్రమములను గూర్చి అనేక గ్రంథములందు వర్ణింపబడియున్నది.

సిపాయిల విప్లవము తరువాత ఢిల్లీ వశము కాగానే విప్లవమునకు కారకులని,కనపడిన మహామ్మదీయ ఘాజీల నందరిని ఉరిదీయ సాగిరి. ఒక న్యాయాధిపతి ఘాజీ ఎవడో కానివాడెవ్వడో తాను బాగుగా కనిపెట్టగలనని చెప్పుచు అనేక నిరపరాధుల కురిశిక్ష వేసెను. బ్రిటిషు సోల్జర్లు సిక్కులతో కలిసి చేసిన దారుణకృత్యములకు మేరలేదు. ఒక గాయపడిన ఖైదీ మొగముపైన (బెయొనెట్సు) సన్నీలతో పొడిచి మెల్లగా కాలుచున్న నిప్పుపైన పడవేసి కాల్చి చంపిరి. వేలకొలది ఫిరంగి ముఖముల పేల్చబడిరి. ఎట్టి విచారణయు లేకుండా గ్రామరైతు లనేకులు వధింపబడిరి. టైమ్సు విలేఖరి కూడా

ఎట్టి విచక్షణయు లేకుండా నిట్టి అత్యాచారములు జరుగు చుండెనని వ్రాసినాడు. పట్టణములు గ్రామములు నిర్మానుష్యములై పోవుటకు సిద్ధముగా నుండెను.

భారత దేశములో తరువాత వచ్చిన తిరుగుబాటులు కూడా ఇంత క్రూరముగనే యణచివేయబడెను. 1872లో 300 మంది స్త్రీపురుషులు కోట్లా సంస్థానమున మలాదుక్యాంపు పైన దాడివెడలగా ఎట్టి విచారణయులేకుండా వీరిని పట్టుకొని 50 మందిని పిరంగిమూతిదగ్గరనుంచి ప్రేల్చివేసిరి. భారత దేశ గవర్నమెంటు తమ అసమ్మతిని దెల్పిరిగాని ఇది చేసిన ఇరువురు బ్రిటిషు ఆఫీసర్లలో నొకనికి సర్ బిరుద మివ్వబడి వైస్రాయివద్దకు రాయిబారిగాకూడా త్వరలోనే పంపబడినాడు. ఇట్లే అమృతసరమున 1919 లో జరిగిన వధలో 379 మంది చచ్చినట్లును 1200 మంది గాయపడినట్లు ప్రభుత్వమువారే అంగీకరించినారు. ఇది చేసినవారెవ్వరుశిక్షింపబడలేదు. పైగా డయ్యరు సేనాని పూర్తి పింఛనుమీాద ఉపకారవేతన మందినాడు. అతనివెంట నుండిన యుద్యోగులు చాలమందికి ప్రమోషనువచ్చినది. ఇటీవల 1930 లో సత్యాగ్రహోద్యమమున షోలాపూరులోను పిషావరులోను అల్లరులుజరుగగా వాని నణచుటకని ప్రభుత్వమువారు సోల్జరులను మరఫిరంగిమోటారులను ఉపయోగించి అనేకుల ప్రాణములు దీసిరి. కేవలము సాత్విక నిరోధముచేయు శాంతిసైనికులను దేశసేవకులను హింసించిన పద్ధతులుకూడ అంద రెఱుగుదురు.

## II

భారత దేశ స్వాతంత్ర్యము కొరకు జరిగిన సిపాయిల విప్లవము వలన భారత దేశ ప్రజలపైన నాంగ్లేయులకు తీవ్రమైన కోపము కలిగెను. ఈ జాతి వైషమ్యము వలన భారతీయుల నాంగ్లేయు లెన్నడు నమ్మరాదనియు సమయము వచ్చినచో నీ దేశీయులు తెల్లవారిపైన తిరుగబడి తీరుదురనియు వీరిని శాశ్వతముగా నణచియుంచి నిరంకుశముగా పరిపాలింపవలె ననియు నొక రాజ్యనీతి సూత్రము స్థాపితమై తరువాత నీ దేశ పరిపాలనములో నన్ని విషయములందు నది ప్రతిఫలింపసాగెను. ప్రభుత్వ వ్యవహారము లన్నియు నాంగ్లేయుల వశమున నుండవలెననియు ప్రభుత్వశాఖలలోని అన్ని ముఖ్యోద్యోగములు తెల్లవారి చేతులలో నుండవలెననియు నిశ్చయింపబడెను.

సిపాయిల విప్లవమువలన భారత దేశమునందలి ఆంగ్లేయోద్యోగుల కులతత్త్వము వర్ధిల్లెను. ఆంగ్లేయులు తమ దేశము విడచి ఈదూర దేశమున తమ ఆలు బిడ్డలతో నెన్నోకష్టములు పడి జీవించుట యొక త్యాగమనియు నిందుకు తమకు హెచ్చు ప్రతిఫలము రావలెననియు నొకసూత్రము స్థాపింపబడెను. జీతములు హెచ్చుచేయబడెను. ఈ ఆంగ్లేయోద్యోగు లెల్లరును భారతీయులలో హిందూసంఘములోని అగ్రకులజుల కన్నను గూడ కులాభిమానము గలిగి జాత్యహంకారముతో ప్రవర్తింపసాగిరి. ఈ తెల్లనల్ల సమస్య యింకొక రూపముదాల్చెను. ఆంగ్లేయులకును భారతీయ స్త్రీలకును పుట్టిన యూరేషియను

సంకరజాతివారు సిపాయిల విప్లవమున తెల్లవారితో జేరి భారతీయులకు వ్యతిరేకముగా పోరాడి యుండిరి. అందువలన నీ యూరేషియనులకు కూడా కొన్ని ప్రత్యేక హక్కులు ప్రసాదింపబడు పద్ధతి ప్రారంభమయ్యెను.

సిపాయిల విప్లవానంతరము ఇంగ్లీషు ప్రభుత్వమునకును భారతదేశమునందలి సామంతరాజులకునుగల సంబంధములందు వచ్చిన మార్పు లింకొకచోట వర్ణింపబడినవి. ఇట్లే భారతదేశపరిపాలనవిధానమునందుకూడా కొన్నిమార్పులు జరిగెను. విధానమునందే కాదు, దృక్పథమునందుకూడా కొన్నిమార్పులు జరిగెను. సిపాయిల విప్లవమువలన ఆంగ్లప్రభుత్వము విచ్ఛిన్నము కాలేదు. ఒకమూల నీవిప్లవము జరుగుచున్ననుతక్కిన చోటుల సామాన్యపరిపాలన జరుగుచునేయుండెను. దక్షిణాపథమున కదలికయే లేదు. ఉత్తరమునగూడ లక్నో శత్రువుల చేతులలో నున్నప్పుడుకూడా డెక్కు బంగాళాలలో మేజా బల్లలపైన గుడ్డలు సరిగా లేవని కొంద రాంగ్లేయులు సణుగు చుండిరట!

సిపాయిల విప్లవ మంత ఆకస్మికముగా వచ్చుటకు గారణము ఆంగ్లేయ జిల్లాఅధికారులు ప్రజలతో కలసిమెలసి యుండక కళ్లుమూసికొని యుండుటయేయని ఆనాటి ఆంగ్లేయ రాజ్య నీతిజ్ఞులకు తోచెను. క్రొత్తగా ఆంగ్లేయ ప్రభుత్వము క్రిందికి వచ్చిన పంజాబులో సర్ జాన్ లారెన్సు బందోబస్తులు చేసి కట్టుదిట్టమైన పరిపాలనా పద్ధతులు స్థాపించుటవలన నచ్చట నట్టి విప్లవము లేక శాంతముగ నుండెనని తోచెను.

అందువలన దేశవ్యవహారములు తెలిసిన వారినే అన్నియు ద్యోగములందు నియమింపదలచిరి. అట్టి వానినే వైస్రాయిగా నియమింపదలచి సర్ జాన్ లారెన్సును 1864లో నియమించిరి. అనుభవశాలురును సమర్థులునునగు ఆంగ్లేయోద్యోగులను జిల్లా యధికారులుగా నియమించి వారు దేశములో పర్యటనము చేయునట్లు 1860 లో నిర్ణయించిరి.

భారత దేశ పరిపాలన విషయమై చాలకాలమువరకు కంపెనీ డైరెక్టర్లు పంపు తాఖీదు లింగ్లాండునుండి ఇచ్చటికి చేరు నప్పటికి కొన్ని నెలలు పట్టుచు ఈలోపున పుణ్యాకాలము గడచి పోవుటయు ధైర్యశాలియగు గవర్నరుజనరలు ఉత్తర ప్రత్యు త్తరములు వచ్చులోపుగా తనకు తోచిన ప్రకారము జరిపి వేయుటయు దానిని కాదనుటకు డైరెక్టర్లు ఇష్టపడకహార్షించు టయు జరుగుచుండెను. తరువాత 1870 లో నింగ్లాండుకు భారత దేశమునకు సముద్ర తంతివార్త పద్ధతి స్థాపింపబడగా భారత దేశ పరిపాలనను గూర్చి ఈ దేశ గవర్నరుజనరలు అను దినము రెండుసార్లు ఇంగ్లాండులోనుండు పార్లమెంటుమంత్రితో నాలోచించి ఆ ప్రకారమే జరుపు పద్ధతి వచ్చెను. భారత దేశ వ్యవహారములను గూర్చి ఆంగ్లేయోద్యోగుల అభిప్రాయ మునే గైకొను పద్ధతికూడ వచ్చెను. 1861 లో క్రొత్త శాసన సభలు స్థాపించినను వానిలో భారతీయ ప్రతినిధులను నియమించుటకు వెనుదీసిరి. తరువాత కేవలము ఆంగ్లేయ ప్రభుత్వమునకు లోబడియుండు సామంతరాజకుటుంబములకు సంబంధించినపాటియాలా మహారాజును బెనారసు రాజును

సర్ దినకరరావును సభ్యులుగా నియమించిరి. భారత దేశ వ్యవసాయకులయొక్క గాని వాణిజ్య పారిశ్రామిక వృత్తివంతులయొక్క గాని ప్రతినిధులను నియమించుటకు ధైర్యము చాలలేదు.

దేశపరిపాలనమునందు మద్రాసు బొంబాయి వంగ రాష్ట్రములందుకూడా పంజాబు మున్నగు (నాన్ రెగ్యులేషను ప్రావిన్సు) రాష్ట్రములందు వలెనే జిల్లాకలెక్టరు మేజస్ట్రేటు సర్వాధికారిగా నుండవలెనని వారియూహ! కాని క్రమక్రమముగా వ్యాపారాభివృద్ధివలన నగరము లభివృద్ధియై సివిలు పరిపాలన వృద్ధిచెంది జిల్లా అధికారియొక్క నిరంకుశాధికారమునకు ప్రజాభిప్రాయమును జిల్లాకోర్టులును అడ్డుతగిలెను. శాసన నిర్మాణసభలు చేసిన ల్యాండు రివిన్యూ చట్టము అడవుల చట్టము పీనలుకోడ్డు క్రిమినలు ప్రొసీజరు కోడ్డులు మొదలు, పశువుల అక్రమ ప్రవేశ చట్టమువరకును అనేక చట్టములును క్రొత్తగా నిర్మింపబడిన అధికారశాఖలును జిల్లా యధికారి నిరంకుశాధికారములకు భంగము కలిగించెను గూడ క్రొత్తగా విభజింపబడిన వివిధశాఖలకు గూడ ఆంగ్లేయాధికారులే నియమింపబడి రాష్ట్రప్రభుత్వముక్రింద పనిచేయసాగిరి. ఉదాహరణమునకు 1861 లో చేయబడిన పోలీసు చట్టమునలన పోలీసు సిబ్బంది వ్యవహారములు ఆంగ్లజిల్లా పోలీసు సూపరెంటుక్రింద నుంచబడెను. పూర్వము కంపెనీ పరిపాలన మందువలెగాక 1858 లో స్థాపింపబడిన పార్లమెంటు ప్రభుత్వముక్రింద ఆంగ్లేయోద్యోగుల సంఖ్యను హెచ్చుచేయుటకు ఎట్టి సంకోచ

మును లేకపోయెను. మరియు సిపాయి విప్లవమువలన నేశాఖ యు భారతీయులక్రిందనుంచి నడుపుట కిష్టములేకపోయెను. ఇట్లు భారత దేశ పరిపాలనను కేవలము తెల్లవారి చేతులలోనే యుంచి నడుపుపద్ధతి ఐరోపాసంగ్రామము వరకు జరిగెను. 1913 లో నెలకు 800 కు పైబడిన జీతములుగల 2501 పరిపాలకోద్యోగములలో 2153 మంది తెల్లవారు 106 మంది ఆంగ్లోయిండియనులు 242 మంది భారతీయులు నుండిరి. దేశపరిపాలన ఐ. సి. ఎస్. శాఖోద్యోగులగు కలెక్టరులు జరుపుచుండగా వ్యవసాయము పబ్లికువర్క్సు అడవులు మొదలగు శాఖలును తుదకు కేవలము ప్రజల విద్యాభివృద్ధికొరకేర్పడిన విద్యాశాఖయు కూడా ఆంగ్లేయోద్యోగులక్రింద నుంచబడెను. అదివరకు సైన్యముయొక్క ఆరోగ్యరక్షణ కొరకు నిర్మింపబడిన శానిటరీ బోర్డులనేపెంచి 1864 లో "పబ్లికు హెల్తు" (ఆరోగ్య) శాఖగా మార్చి ఆంగ్లేయోద్యోగిక్రింద నుంచిరి. ఇట్లు పరిపాలనశాఖలపద్ధతి "డిపార్టుమెంటలిజం" వర్ధిల్లి నేడుమనము చూచు మహాప్రభుత్వ యంత్రముయొక్క శాఖోపశాఖలు నిర్మింప బడినవి. ఈశాఖందు కేవల మాంగ్లేయులే నియమింపబడ సాగిరి. అట్లు నియమింపబడిన ఆంగ్లేయులెల్లరు ఆ యా శాఖల పనులు చేయుటకు తర్ఫీదు పొందిన వారుగాని నిపుణులుగాని సమర్థులు గాని కారు. వారు ఆంగ్ల జాతికి జెంది సీమనుండి వచ్చుటయే ప్రధాన యోగ్యతగా గలవారై యుండిరి. ఈ దూర దేశమున మండుటెండలో కష్టపడి పనిచేయుట కింగ్లాండులో పనిసంపాదించుకొను శక్తియు

తెలివితేటలును గల విద్యావంతు లెవ్వరును రారైరి. అచ్చట బ్రతుకు తెరువులేక గతిలేనివారే యిచ్చటికి వచ్చుచుండిరి. అచ్చట న్యాయశాస్త్రమునుబట్టి కుటుంబమున పెద్దకుమారుని కే ఆస్తివచ్చునుగాన చిన్నకొమాళ్ళు ఏదో జీవనోపాధి చూచుకొనవలసినదే! అందులో విద్యావంతులై తెలివితేటలు గలిగి పైకి రాగలిగినవారు గాక కష్టపడలేక సామాన్య తెలివితేటలు గలిగి సోమరిపోతులైన వారుమాత్రమే ఈ దేశము లోని ఉద్యోగములకొరకు ప్రయత్నించి వచ్చుచుండిరి. దీనిలో గూడా వివిధశాఖలందు తారతమ్యముండెను. ఐ. సి. యస్. పరీక్షలో నారి తేరలేని వారే సైన్యమున జేరుచుండిరి. సైన్యమున గూడ పైకిరాలేనివారే పోలీసు శాఖలోని ఉద్యోగము లపేక్షించుచుండిరి. అవియు నిగ్రహించలేని వారు మొదటి రోజులలో ఫారెస్టు (అడవులు) వ్యవసాయము మున్నగు శాఖలందు సుఖముగా కాలక్షేపము చేయసాగిరి. అడవుల శాఖయందు మొదట తర్ఫీదు పొందిన ఆంగ్లేయులే లేక పోగా 1864లో డాక్టర్ డీట్రిచ్ బ్రాండిస్ అనునొక జర్మనీ దేశీయుని ఫారెస్టుల ఇనస్పెక్టరుజనరలుగా నియమించిరి. 1861 లో పోలీసు శాఖ నిర్మించినప్పుడు సైనికశాఖలోని ఉద్యోగులలో కొందరిని దీనిలో నియమించిరిగాని వారితోపాటు పైన చెప్పబడిన రెండవరకము తెలివితేటలుగల ఇంగ్లీషుదొరలనుకూడా నియమించిరి. క్రమక్రమముగా నీ రెండవరకమువారే ప్రబలిరి. ఇక విద్యాశాఖలో అనుభవజ్ఞులగు ప్రొఫెసర్లు నియమింప

బడలేదు సరి కదా మంచి పరీక్షలం దారితేరినవారినైను నియమింపరైరి. ఆరోజులలో సింగ్లాండులోని నార్మలు స్కూళ్ళలో ఎలిమెంటరీ టీచర్లుగా నున్నవారి నీ దేశమున బడిపంతులై బ్రతుకుడని బంపిరి! ఈ యుపాధ్యాయులకు ట్రెయినింగు నిచ్చుట కొరక పాఠశాలను స్థాపింపుడని కోరగా సిబ్బందికి నెలకు 500 రూపాయలు ఖర్చుఅగునని వెనుకదీసిరి. ఇంకొక చిత్రమేమనగా నీ విద్యాశాఖ కన్నీరు తుడుచుటకే నిర్మింపబడి ఎట్టి ప్రోత్సాహము లేక జనులందు విద్యాభివృద్ధి అక్షరజ్ఞత వృద్ధిచేయుటకు తోడ్పడదయ్యెను.

ఇట్లు నిర్మింపబడిన ప్రభుత్వయంత్రము కేవలము దేశముపైకి విదేశీయుల దండయాత్రలు రాకుండను దేశములో అశాంతి ప్రబలకుండగను రక్షించుట కొరక కత్తులబోను నిర్మించుటకే ఉపయోగించినది గాని దేశప్రజలకు ఆర్థిక రాజకీయాభివృద్ధి గాని విద్యాభివృద్ధిగాని చేయుట కుపయోగింపలేదు. పూర్వము కంపెనీ పరిపాలనకన్నను ఈ ప్రభుత్వము నిర్జీవమై నిర్వీర్యమై కేవలము ఇంగ్లాండులోని తెల్లవారి లాభముమాత్రమే ఆలోచించి పరిపాలింప సాగెను.

విదేశములతో స్వేచ్ఛగా వ్యాపారము జరుగనిచ్చుట దేశములో వ్యాపార పోటీలు చేయనిచ్చుట న్యాయశాస్త్రాను సారముల‌గు ఒడంబడికలను అమలు జరుపుట, వివిధజాతి మతముల వారితోను తరగతుల వారితోను ఎట్టి జోక్యమును కలిగించుకొనకుండుట, ప్రైవేటువ్యక్తులు పూనుకొనగల కార్యములకు అట్టి

8

వారి దానధర్మములవలన జరుగగల సత్కార్యములకు తాము పూనుకొనక పోవుట; అనగా నిరుద్యోగ నివారణ, దారిద్ర్య నివారణ, రోగనివారణ, విద్యాభివృద్ధి, పారిశ్రామిక ఆర్థిక అభివృద్ధి ప్రయత్నములు చేయకపోవుటయు నీ ప్రభుత్వపద్ధతిగా స్థిరపడెను. దేశముయొక్క శాంతిభద్రతలు కాపాడుటయె తమ పనిగాని దేశాభివృద్ధిచేయుట తమపని గాదని ఈ యంత్రము యొక్క ఊహ.

పాశ్చాత్య న్యాయశాస్త్ర ధర్మములు వ్యాపార ధర్మములు నీ ప్రాద్దేశవు వ్యవసాయకులమధ్య గొప్ప విప్లవమును గలిగించెను. పూర్వమునాటి గ్రామ జీవనము సభ్యత మర్యాదలు నశించిపోవ సాగెను. వస్తుమార్పిడి పద్ధతిపోయి రొక్క వ్యాపారపు పద్ధతివచ్చెను. 1861 లో క్రోడీకరింపబడిన సివిలు క్రిమినలు ధర్మవ్యవహార విధులు సాక్ష్యస్మృతి వ్యాజ్యములందు గుంటచిక్కులు కల్పించి ఆంగ్లేయపద్ధతుల ప్రకారము అమలు జరుపబడ సాగెను. వివాదలోని నిజమెట్లున్నను గ్రామ ప్రజల ఆచార మెట్లున్నను మనస్సాక్షి కెట్లు తోచుచున్నను కేవలము 'లా పాయింటు' పైన కేసులను తీర్పు చెప్పు ఉన్నత న్యాయస్థానములు స్థాపింపబడి ప్రజలకు వ్యాజ్యములాడుటలో అభిరుచిని కలిగించి అప్పీళ్ళుచేయించి కక్షలు పెంచెను. 1860 తరువాత కొన్నాళ్ళు ధరలు హెచ్చుగా రైతులు ధనవ్యయమున కలవాటుపడిరి. పెండ్లిండ్ల కర్మలకు విరివిగా ఖర్చుచేసిరి. 1870 తరువాత ధరలు మరల పడిపోయెను. అంతట హెచ్చు ఖర్చు కలవాటుపడిన రైతులు పొదుపు చేయ

లేకపోయిరి. వివాద లధికములయ్యెను. కక్షలు ప్రబలెను. పూర్వము డబ్బు పుట్టుటయె కష్టము. ఇప్పు డట్లుకాదు. అప్పు లిచ్చు షావుకారులు బయలుదేరిరి. ఈ షావుకారుకు బాకీల వసూళ్ళయందు కోర్టులు తోడ్పడసాగెను. ఋణగ్ర స్తత హెచ్చి వ్యాజ్యములు వర్ధిల్లి ప్రజల దారిద్ర్యమును పెంచెను. (చూడు: తాంప్సన్, గెరాట్ గార్ల బ్రిటిష్‌రూల్).

## III

సిపాయిల విప్లవానంతరము భారత దేశ సైన్యమును సం స్కరించుట యను మిషతో నేటివుల చేతులలో నుండిన నవీన మారణ యంత్రములను తీసివేసి మందుగుండుసామాను శాఖ నాంగ్లేయుల వశము చేసిరి. ఆంగ్లేయోద్యోగులను హెచ్చించిరి. ఆంగ్లేయుల జీతబత్తెములను హెచ్చించిరి. ప్రారంభములో ఆం గ్లేయ సైన్యములు భారతీయోద్యోగులక్రింద పనిచేయుట పరువుతక్కువగా నెంచబడలేదు. తరువాత నాంగ్లేయసైనికుడు భారతీయోద్యోగికి సలాము చేయుటగూడ పరువుతక్కువగా నెంచబడుచుండెను. ఈ సంస్కరణల వలన భారత దేశీయులను నిర్వీర్యులుగ జేయుచుండిరి. భారత దేశమున బ్రిటిషుప్రభుత్వ మును గట్టిచేసికొనుటకు వారవలంబించిన విధానములలో సిపాయి విప్లవానంతరము వివిధ రాష్ట్రముల ప్రభుత్వములకు ఒకదానితో నింకొకదానికి సంబంధము లేకుండాచేయదలచుట యొకటి. దీనికి రాష్ట్రీయ స్వపరిపాలనమని నేతిబీరకాయవంటి పేరు పెట్టిరి. ఈ మార్పునకు కారణము భారత దేశమంతటికిని

సమాన ప్రాముఖ్యతగల సమస్యలు లేకుండ చేయవలెననియే. అట్టి సమస్యలు వర్ధిల్లినచో దీనినిగూర్చి దేశము నలుప్రక్క లను అల్లుకొను ఆందోళనము చెలరేగగలదనియు అందువలన బ్రిటిషుప్రభుత్వముయొక్క నెమ్మదికి భంగము కలుగగలద నియు ఆనాటి ఆంగ్లప్రముఖులు ఊహించిరని 1858 లో పార్ల మెంటరీ కమిటీయెదుట సాక్ష్యమిచ్చిన విన్‌గేట్ జవాబులలో కలదు. బ్రిటిషు సామ్రాజ్య ప్రభుత్వముయొక్క పలుకుబడిని అధికారమును గట్టిపరచుటకు చేయబడిన ప్రయత్నములో ప్రభుత్వమునకు రైతులకు మధ్య నెట్టి మధ్యవారును లేకుండ చేయుట యింకొకటి. రైత్వారీపద్ధతిలో రాజులకు జమీందారు లకు పాలెగాండ్రకుగల అధికారములు పలుకుబడి తగ్గించివేయ బడెను. కరణము మునసబులకు తాహీల్దారులకు సిరైతుల నప్పగించిరి. భూస్వామికి రైతులకుగల మానవసంబంధములు నశించి రైత్వారీపద్ధతిలో కేవలము యంత్రమువలె పని చేయు కఠినవిధానము లవలంబింపబడినవి. ఈ శిస్తులపద్ధతిలో శిస్తులు చెల్లించిన పిదప రైతుకు కడుపునిండ కూడుండదు.

భారత దేశమున బ్రిటిషు సామ్రాజ్యమును గట్టిపరచు టకుచేసిన పను లింకనెన్నోకలవు. క్రిమినలువిచారణ పద్ధతులు ఆయుధశాసనము, నిర్బంధశాసనము, శిక్షాస్మృతియు నీయుద్దే శముతోనే స్థాపింపబడెను. సిపాయి విప్లవానంతరము ప్రజా స్వాతంత్ర్యము నిరోధించు అనేక శాసనములు చేయబడెను. భారత దేశ ప్రజలను అణచియుంచుటకు శాసనధర్మ ముపయో గింపబడసాగెను. దేశముయొక్క ప్రకృతి సంపదను ముడి

వస్తువులను దేశముయొక్క పారిశ్రామిక అభివృద్ధికొరకుపయోగించుట, దేశముయొక్క కృషిని పాడిపంటలను అభివృద్ధి చేయుట, అందుకొరకు నీటివసరులు రోడ్లు నిర్మించుట, క్రొత్త పరిశ్రమలు స్థాపించుటయనునవి బ్రిటిషు సామ్రాజ్య తత్వజ్ఞులకు గిట్టనిపనులు. కేవలము తమ వర్తకులకును సైన్యములకును ఉపయోగించునట్లు విశేషసొమ్ము వెచ్చించి రైళ్ళను నిర్మించిరి. లంకాషైరు మిల్లుల కొరకు ప్రత్తిపంటలను ప్రోత్సహించిరి. సింధు పంజాబుల యాక్రమణ మిందుకొఱకే యని 1858 లోనే తేలినది.

బ్రిటిషువారి నీదేశమునకు వచ్చి నెలకొనుడని అనేక విధముల ప్రోత్సహింపసాగిరి. నీలిమందు తేయాకు తోటల యజమానుల కీదేశమున ననేక సౌకర్యములిచ్చిరి. నీలిమందు తోటలు, తేయాకు తోటలు నిట్లు వృద్ధిజెందెను. జీతబత్తెముల నమితముగా వెచ్చించి ఆంగ్లేయోద్యోగులను ప్రోత్సహించిరి. ఎడ్వర్డు సల్లివన్ 1885 లో తన 'లెటర్సు ఆఫ్ ఇండియా' లో ఈ సంగతులను వర్ణించి యున్నాడు:

భారతీయులకు తమ దేశపరిపాలనలో నెట్టి ప్రవేశము నొసగకపోవుటకు నీ బ్రిటీషుసామ్రాజ్యతత్వమే కారణము. తరువాత నెన్ని రాజ్యాంగ సంస్కరణలు చేసినను నిజమైన అధికారము ప్రజాయత్తము చేయకపోవుటకు నిదియే కారణము.

"భారతదేశముమనకు లభించిన గొప్ప బహుమతి. మన దేశమునగల జీవనాధారముల వలన సంవత్సరములో మన మూడునెలలే జీవించగలము. ఈ భారతదేశమును నిలిపి

యుంచుకొనుటకు మీలో పైకివచ్చుచున్న యువకులగు మీ తరములవారు మీ శరీరమునగల కడపటి రక్తపుచుక్కనైనను ధారపోయవలెను." అని ఆక్సుఫర్డు విద్యార్థుల కుపన్యసించుచు ఇండియా రాజ్యాంగమంత్రిగ నుండిన బర్కెన్ హెడ్డు హెచ్చరించినాడు. ఈదేశము పోయినచో తమకు కూడు గుడ్డలు కరవగునని దీనిని వదలరాదని బ్రిటీషు రాజనీతిజ్ఞు లెల్లరుపలికినారు. ఈ యుద్దేశముతోనే 1858 మొదలు భారత దేశమున బ్రిటిషు సామ్రాజ్యమును గట్టిపరచుకొనుటకు బ్రిటీషు రాజనీతిజ్ఞులు, రాజప్రతినిధులు తమ యావచ్ఛక్తిని వినియోగింపసాగిరి. దీనికొఱకు వా రనేక విధానములను ప్రయోగించిరి. సిపాయి విప్లవానంతరము చేయబడిన పరిపాలనలో సైనిక వ్యయము వలన భారత దేశమునకు విద్యయు ఆరోగ్యమును వృద్ధిజెందుటకు సొమ్ములేకుండ చేయబడినది. ఇటీవల స్వదేశ సంస్థానములను కలుపుకొనుట మానినకారణము కేవలము పరమార్థచింతవలన గాని మనపైన దయవలనగాని కాదు. దేశములో అసంతృప్తి పెరుగకుండ నుంచుటకే. మఱియునప్పటికి దేశములో మిగిలిన సంస్థానములు రాజ్యములు సారహీనములైనవి. పూర్వమంత బహిరంగముగా క్రైస్తవమతమున కలుపుకొనుటకు మతప్రచారము చేయకపోవుటకు గలకారణముగూడ అసంతృప్తి హెచ్చింపరాదనియె! అయినను నేడుకూడ క్రైస్తవమత ప్రచారము అనేక విధములుగా ప్రోత్సహింపబడుచునే యున్నది.

## IV

భారతదేశమును బ్రిటిషువా రాక్రమించు నాటికి మొగలుసామ్రాజ్యమున నుండిన మహమ్మదీయ నవాబులు ధనవంతులుగను బలవంతులుగను నుండిరి. వారి నెల్లరను బ్రిటిషు వారు నిర్ధనులుగను అధికారహీనులుగను జేసియుండిరి. మహమ్మదీయ మతమును అణచివేయవలయుననియే క్రైస్తవుల యభిప్రాయము. కలకత్తా రివ్యూ పత్రికలో నిట్టి వ్యాసములనేకములు ప్రకటింపబడెను. కాని క్రమక్రమముగా దేశములో స్వధర్మరక్షణ ప్రయత్నము, ప్రజల హక్కులకొఱకు పోరాటము, భారత జాతీయచైతన్యము, కలుగుటతో హిందూ మహమ్మదీయులను విడదీసి యుంచవలెనని ఆంగ్లేయ రాజ్య తంత్రిజ్ఞులు గ్రహించి ఇట్టి విధానము ప్రారంభించిరి.

1821 లో ఏషియాటిక్ జర్నలులో 'కర్ణాటికస్ అను పేరుతో రాజకీయ సివిలు మిలటరీ పరిపాలనమునందు 'విడదీసి పాలించు రాజ్యనీతి' యవలంబింపబడవలెనని ఒక సూచన చేయబడెను. మొదట నిట్లు బహిరంగముగా చెప్పుటకు జంకుచుండిరి గాని సిపాయి విప్లవముతరువాత బాహాటముగా చెప్పసాగిరి.

1859 మే 14 వ తేదీన బొంబాయి గవర్నరగు ఎల్ఫిన్‌స్టన్ ప్రభు విట్లు తన మినిట్సులో వ్రాసెను. "విడదీసి పాలించు నీతిని పూర్వపు రోముసామ్రాజ్యము అవలంబించి యుండెను. మనముగూడా దీనినే అవలంబింపవలెను."

ఈ ఉద్దేశముతో సామ్రాజ్య తత్వజ్ఞులు మహమ్మ

దీయులపట్ల పక్షపాతము చూపుట ప్రారంభించిరి. తరువాత హిందూ మహమ్మదీయులకు విరోధములు కల్పించిరి. మహమ్మదీయులకు ప్రత్యేక నియోజకవర్గము లిచ్చిరి. ఇదియే హిందూమహమ్మదీయ సమస్యయొక్క పుట్టుక చరిత్ర.

హిందూ మహమ్మదీయ మతవైషమ్యములు, కొట్లాటలను నవి బ్రిటిషు ప్రభుత్వము స్థాపింపబడకపూర్వ మీదేశమున లేవు. ఇది కేవలము మిత్రభేధము జేసి విడదీసిపాలించు కుటిల రాజ్యతంత్రముయొక్క ఫలితమే! మూడు తరముల క్రిందట సర్ ప్రఫుల్లచంద్రరాయిగారి తాతగారును ముత్తాతగారును దుర్గాపూజలకు గదైపూరుఖాజీలను ఆహ్వానించుటయు వారు వచ్చి తాంబూలములు పుచ్చుకొనుటయు జరుగుచుండె నని రాయిగారు తమ స్వీయచరిత్రలో వ్రాసినారు. (Life and Experiences of a Bengali Chemist Vol.II P.297) బ్రాడ్లీబార్టు తన పుస్తకములో (The Romance of an Eastern Capital) హిందువులు షేకుమహమ్మదు యూసుఫు గోరీకి మొక్కులిడుటను వర్ణించినాడు. 1840లో "టోపోగ్రఫీ ఆఫ్ డెక్కా" అను గ్రంథమున టెయిలరు ఇట్లు వ్రాసినాడు. "హిందూ మహమ్మదీయులు, మతవైరములు, కొట్లాటలు అరుదు. ఈ రెండు తెగలవారును నెమ్మదిగా జీవించుచున్నారు. ఉభయ జాతులవారును ఒక హుక్కానే పీల్చునంత స్నేహభావము కలిగియున్నారు."

ఇక మహమ్మదీయ ప్రభుత్వకాలమున మతవైరములు లేనేలేవు. 1295-1314 మధ్య రాజ్యమేలిన అల్లాయుద్దీను ఖిల్జీ

షిల్లీసుల్తాను "సివిలు పరిపాలనకు మతమునకు ఎట్టి సంబంధ మునులేదు. మత మనునది కేవలము వ్యక్తుల ప్రయివేటు వ్యవహారము. అది వారి మనోప్రవృత్తికి సంబంధించిన వినోదము" అనినట్లు ఎలిఫిన్‌స్టను వ్రాసియున్నాడు. ఇరువదియవ శతాబ్దిలో లెనిన్ మహాశయుడుకూడ నట్లే పలికినాడుకదా!

1542—45 మధ్య రాజ్యమేలిన షర్షా "మతము కేవలము వ్యక్తులకు సంబంధించిన చిత్తవృత్తి" యనియు దీనికి ప్రాముఖ్యత నొసగకుండా బహిరంగ జీవనమునందు కేవలము రాజకీయ పరిజ్ఞానమును కలిగించుటయే తన యుద్దేశమనియు వెల్లడించెను. (K.Quanungo- Shershah)నాదిర్‌షా దేశమును దోచికొన వచ్చినప్పుడు మహారాష్ట్రరాజ్యమును స్థాపించుటకు ప్రయత్నించుచున్న పీష్వాబాజీరావు తన యుద్ధములను కట్టిపెట్టి "మన అంతఃకలహము లిప్పుడు ఆలోచింపతగినవి కావు. హిందూస్థానమునకిప్పు డొక్కడే శత్రువుకలడు; హిందువులు మునల్మానులు దక్షిణాపథముయొక్క జనులెల్లరును ఇప్పుడు నడుము కట్టవలెను" అనినాడు (Grant Duff - History of Maharattas).

మహామ్మదీయుల పరిపాలనలో హిందువులకు సివిలుమిలిటరీయుద్యోగములు విరివిగా ఒసగబడుచుండుటయు ఈహిందూ మహామ్మదీయులు విశ్వాసపాత్రులై యుండుటయు ఎల్‌ఫిన్‌స్టన్ తనహిందూ దేశ చరిత్రలో వర్ణించియున్నాడు. కేవలము మతావేశపరుడని ప్రసిద్ధిజెందిన ఔరంగజేబు కాలములోకూడా మతకారణమును బట్టి ఒక్కహిందువునికిగూడ పన్నువిధింప

బడుటగాని నిర్బంధముగాని మరణముకాని కలుగలేదని వ్రాసి యున్నాడు. మరియు నతడనేక రాజపుత్రుల కుద్యోగములిచ్చి గౌరవించెననియు వ్రాసినాడు.

ఈ హిందూ మహమ్మదీయ మతవైరములను నవి బ్రిటిషుప్రభువులు తెచ్చిపెట్టినవేయని సర్ హెన్రీకాటన్ గారు తన గ్రంథములలో వ్రాసినారు "కొందరు బ్రిటిషు అధికారులు సిమ్లాలోను లండనులోను కుట్రలుచేసి మహమ్మదీయ నాయకులను రేపి మహమ్మదీయులపట్ల పక్షపాతముజూపి హిందూమహమ్మదీయులమధ్య విరోధబీజము నాటినారు" అని ఇంగ్లాండుకు ప్రధానమంత్రిగా పనిచేసిన రామ్సేమేక్డానల్డుగారు స్వతంత్ర రాజకీయ నాయకుడుగా నుండగా 1911 లో వ్రాసినారు. (The Awakening of India) ఈతడే ప్రధానమంత్రియైనప్పుడు కులభేదములను ప్రత్యేక నియోజక వర్గములకు స్థిర రూపమునిచ్చు కమ్యూనల్ అవార్డును ప్రసాదించినాడు!

ఈ మతవైరములను పెంచు రాజ్యతంత్రముయొక్క చరిత్ర 1906 నాటిది. ఆక్రిందటి సంవత్సరమే హిందువులను సాధించుటకు కర్జను వంగరాష్ట్రమును విడదీసెను. నేడు బ్రిటిషు వారికి ముఖ్యస్నేహితుడగు ఆగాఖానుగారి నాయకత్వము క్రింద 1906 లోనొక చిన్న ప్రతినిధ్యము ఆనాటి రాజ ప్రతినిధియగు మింటో ప్రభువును దర్శించి తమకు ప్రత్యేక ప్రాతినిధ్యము కావలెననియడిగిరి. ఈబుద్ధిమహమ్మదీయులకున్వాయముగాకలిగినది కాదు. ఇది మింటోగారిసలహావలన నేజరిగినట్లును ఆనాడు రాజ్యాంగ కార్యదర్శిగానుండిన మార్లే కిది యిష్టము

లేదనియు మార్లే వ్రాసిన గ్రంథమువలననే బయల్పడినది. (Recollections of Lord Morley). బ్రిటిషు ప్రభుత్వమువారే ప్రత్యేక ప్రాతినిధ్యపద్ధతిని 1907 లో మింటో మార్లే సంస్కరణములందు చేర్చిరి. నూతన ఇండియా రాజ్యాంగ సంస్కరణములను జేయుటలో మహమ్మదీయులకేగాక ఇతర వర్గములవారికిగూడ ప్రత్యేక ప్రాతినిధ్యము నిచ్చుటకు బ్రిటిషువారు నిశ్చయించి రాజ్యాంగ సంస్కరణల నాటకము జరిపిరి. భారతదేశమును శాశ్వతముగా తమ చేతులలో నుంచుకొనుటకే యీ మితభేద పద్ధతు లవలంబింపబడినవి.

ఇట్లు నేడు భారతదేశ స్వాతంత్ర్యమునకు ప్రతిబంధకము లని బ్రిటిష్‌వారు చెప్పు అవిద్యాంధకారము, అనారోగ్యము, దారిద్ర్యము, హిందూమహమ్మదీయ కులకక్షలు మొదలగు సమస్యలెల్ల సామ్రాజ్యతత్వమున కనుగుణముగా బ్రిటిష్ రాజ్యతంత్రజ్ఞులు కల్పించినవేయై యున్నవి.

## ఏడవ ప్రకరణము

## మర్యాదలలో మార్పులు

### I

ఆంగ్లేయు లీ దేశమునకు మొట్టమొదట వర్తకము చేయుటకొరకు వచ్చిన రోజులలో నీదేశాధీశుడగు మొగలు చక్రవర్తి పట్లను ఆయన సామంతుల పట్లను వారుచాల భయభక్తులతోను అతి వినయముతోను ప్రవర్తించుచుండుటయేగాక,

ఈదేశములోని హిందూ మహమ్మదీయ జనసామాన్యముపట్ల గూడా చాలా మర్యాదతో ప్రవర్తించుచుండిరి. హిందూమహమ్మదీయాచార వ్యవహారముల యెడల నెంతో సహనబుద్ధి చూపుచుండిరి. ఆంగ్లేయుల కీదేశమున పలుకుబడి హెచ్చి రాజ్యాధిపత్యము చేజిక్కి బలవంతులైనకొలదియు వీరి వైఖరిలో గొప్పమార్పుకలుగసాగెను. చక్రవర్తిని, నవాబులను రాజులను గౌరవించుటపోయి తృణీకరించుటయు, ప్రజలను మర్యాదచేయుట పోయి నీచముగ జూచుటయు ప్రారంభమయ్యెను. ఈ మార్పు చాలచిత్రమైన పరిణామము.

ఆంగ్లేయ వర్తక కంపెనీ పరిపాలనమున విలియంబెంటింకు గవర్నరు జనరలగు నాటికి అనగా 1828 నాటికిగూడ ఆంగ్లేయవర్తక కంపెనీ ప్రభుత్వాధికారులు పూర్వమర్యాదలు విడిచిపెట్టలేదు. పూర్వాచారములను పూర్తిగా తృణీకరించుట ప్రారంభింపలేదు. మత సహనము జూపుట కంపెనీవారి విధియని తలచి హిందూ మహమ్మదీయులు తమతమ మతాచారములను బట్టి జరుపు ఉత్సవములందు కంపెనీ వారి ఆంగ్లేయోద్యోగులు హాజరుగానుండు నట్లు ఉత్తర్వుజేసిరి. 1830 నాటికి హిందూ మహమ్మదీయుల పండుగలకు ప్రభుత్వము సెలవులిచ్చుచుండెను. ఆనాటి కింకను ఆదివారములు సెలవులులేవు. ఆదివారము నాడుగూడ ప్రభుత్వ కార్యాలయములు పనిచేయుచుండెను. ఆనాటి కింకను న్యాయస్థానమున ఇంగ్లీషు భాష వాడుకలోలేదు. ఫారశీభాషయె వాడబడుచుండెను. వర్షఋతువు ప్రారంభ సమయమున పూర్వాచారము ప్రకార

మాంగ్లేయ పరిపాలకోద్యోగులుకూడా కొబ్బెరకాయ కొట్ట వలసి యుండిరి.

పూర్వము క్రొత్తగా వచ్చిన ఆంగ్లేయోద్యోగులు జిల్లాలోనుండు హిందూమహమ్మదీయ ప్రముఖుల నెల్లరను దర్శించి మర్యాదచేయుట ఆచారముగా నుండెను. ఆ పద్ధతి 1830 నాటికి పోయి మనవారే ఆంగ్లేయోద్యోగులను దర్శించి మర్యాదచేయు పద్ధతి ప్రారంభమయ్యెను. అంతేకాదు. వారి కాంగ్లేయోద్యోగులు దర్శనమిచ్చుటయే యొక గొప్ప గౌరవముగ పరిగణింప బడసాగెను. తెల్ల యధికారులను దర్శించుటకు పోవు హిందూమహమ్మదీయ పెద్దమనుష్యులు తమ మర్యాదను స్థితిగతులను గూర్చిన నిదర్శన పత్రములు తీసి కొనిపోవలసి యుండిరి. తెల్లవారిలోకూడా నొక విధమగు జాత్యహంకారము, గర్వము ప్రారంభమైనది. ఎంత గొప్ప వాడైనను భారతీయుని "నేటివు" అని నీచముగ పిలుచుటయు నీచముగ జూచుటయు మొదలిడిరి. భారతీయులకు తెల్లవారన్న భయమొకటి కలుగసాగెను. తెల్లవారియెదుట కూర్చుండుటకు గూడ భారతీయులు సాహసింపలేకుండిరి. కలకత్తాలో ప్రతి యాంగ్లేయుడును తనకు ప్రతి భారతీయుడు సలాము చేయ వలెనను భావము ప్రబలినది.

విలియంబెంటికు చాలా నిగర్వియై భారతీయులను తెల్ల వారితో సమానముగా చూడసాగెను. తన భవనమున జేయు విందులకు సమ్మానములకు ఆంగ్లేయులతో పాటు భారతీయులు కూడా గుఱ్ఱపుబండ్లెక్కి రావచ్చునని శాసించెను. ఇది

తెల్లవారికి అగౌరవకరముగా తోచెను. తమ్మతడవమానించుచున్నాడని కోపగించిరి.

ఆంగ్లేయకంపెనీ అధికారులును వారి తాబేదారులును మొదటి రోజులలో భారతదేశమున చక్రవర్తికిని నవాబులకును సాగిలబడి మ్రొక్కుచు ఎంతో భయభక్తులతో పూర్వపు మర్యాదలెల్ల పాటించుచుండిరి. జామరిన్ రాజుకు పాశ్చాత్యులు సాగిలబడి మ్రొక్కుటను, జహంగీరుకాలమున సర్ తామస్‌రో చేసిన జోహారులనుగూర్చిన చిత్తరువు లెన్నో కలవు. కంపెనీ డైరెక్టర్లు మొదలు గవర్నరువరకు తమ లేఖలందు చక్రవర్తియొక్కయు నవాబులయొక్కయు బిరుదావళిని వర్ణించి మర్యాద వాచకములను వ్రాయుచుండిరి. 1711 లో కలకత్తా విలియంకోట ప్రెసిడెంటు వంగరాష్ట్ర నవాబున కతివినయముగా దాసోహముజేసి "ఏలినవారి సేవకే అంకితముజేసిన నా ప్రాణములను తమపాదములకడ నుంచుచున్నానని వ్రాసెను. ఇతడే రెండేండ్లకు తరువాత ఫరుక్‌షయ్యారు చక్రవర్తికి వ్రాయుచు, "ఏలినవారి సేవకుడును, అత్యల్పమైన ఇసుకరేణువును అగు తూర్పుఇండియా కంపెనీ ప్రెసిడెంటు జాన్ రస్సెల్ తన నుదుటిని నేలపైన మోపిచేయు మనవి" అని వ్రాసి సాష్టాంగ ప్రణామముజేయుటను సూచించినాడు.

ఆరోజులలో నింగ్లీషు వర్తకకంపెనీవారు మొగలుచక్రవర్తికిని ఆయనయొక్క రాజప్రతినిధులకును అడుగులకు మడుగులొత్తి అతివినయముగా ప్రవర్తించుచు వారి కనేకవిధములగు బహుమతులు రొక్కనజరులు సమర్పించి వారిని తృప్తి

పరచి వారివలన లాభము లందుటయు పరిపాటిగనుండెను. 1700 సంవత్సర ప్రాంతమున ఔరంగజేబు చక్రవర్తి వలన క్రొత్తగా నియమింపబడిన కర్నాటక నవాబునకు మదారాసు ఫ్యాక్టరీవారు పెద్దతుపాకులు చిన్నతుపాకులు అద్దములు విదేశీ సారాయి సీసాలు ఇతరసామానులు బహుమతిగా నిచ్చిరి. ఈ బహుమతుల కతడు తృప్తిజెందక వీరి ప్రతినిధులను కోపదృష్టితో చూచినాడు ఈ నవాబు 1701 లో నొకమారును మరుసటిసంవత్సర మింకొకమారును తన పరివారముతో తరలిరాగా మదారాసు కార్యస్థానమువారతనిని తృప్తిపరచుట కతనికి రెండవమారు 25 వేలరూపాయలు సమర్పించిరి.

మదారాసుగవర్నరు పిట్టు 1708 లో మొగలుచక్రవర్తి యొక్క కేంద్రప్రభుత్వముతోనే ఉత్తర ప్రత్యుత్తరములు జరిపి మదారాసుదగ్గరనుండు అయిదు గ్రామములను కంపెనీకి సంపాదించినాడు. చక్రవర్తియొక్క వజీరు వ్రాసిన లేఖలలో కంపెనీవా రింకను బహుమానము లంపలేదని హెచ్చరించి తమకు పనికివచ్చు బహుమతుల జాబితాను జతపరచినాడు. ఐరోపాలోను ప్రపంచములోను దొరకు అపూర్వ వస్తుజాలమందు వివరింపబడెను. వివిధరకముల గంటల గడియారములు, మరబొమ్మలు, మరసామానులు, పింగాణీలక్కవస్తువులు, చీనాతెరలు, వెండిబంగారు నగిషీవస్తువులు, ఏనుగులు, గుఱ్ఱములు, ఘాటుగల సీమ సారాయములు, ఫిరంగులు, తుపాకులు, రంగు పెన్సిళ్ళు నింక నెన్నో వివరింపబడినవి. ఇంతదయతో వ్రాయబడిన లేఖకు బదులు వ్రాయుచు పిట్టుదొర యిట్లువ్రాసెను :—

"ఏలినవారు సామంతరాజులకును గొప్పవా రందరికిని బహుమతు లంపవలెనని వ్రాయుచున్నారు. వారివారి దర్జాలకు తగిన బహుమానము లంపవలెనని తమ యభిప్రాయమైనచో మాకంపెనీవారిఆస్తియంతయు అమ్మిననుగూడా అది సాధ్యపడదని మనవి చేయుచున్నాను. ఏదో కొంచెము లాభము సంపాదింపవలెనని మాకంపెనీవా రిన్ని బాధలు పడుచున్నారనియు, సాధారణముగా మాకు లాభము కన్న నష్టమే కలుగుచుండుననియు ఏలినవా రెరుగనిదికాదు. మాశక్తిని బట్టి చంద్రుని కొక నూలుపోగను నట్లు మేము సమర్పించు బహుమానములను శ్రీచక్రవర్తిగారును వారి సామంతులును స్వీకరింపవలెనని మా ప్రార్థన." ఇట్లు ఢిల్లీకంపబడిన "నూలుపోగు"బహుమానమున నారు ఏనుగులుండెను! ఈలేఖ వ్రాయబడిన నెలలోనే కర్నాటక నవాబు మధుపాన మత్తతతో కంపెనీవారి స్వల్పబహుమతుల కతృప్తితో గొణుగుకొనుచు, తన సైన్యముతో మద్రాసు ప్రక్కనుండి పోయెను.

ఘాటుగల సారాయము లంపవలెనని యీ పై లేఖలో వివరింపబడి యుండుటలో నాశ్చర్య మావంతయులేదు. ఏలన 1709 లో వేయి సీమ సారాయ సీసాలంపవలెనని రాజుగారి దర్బారు నుండి దావూదుఖాను గవర్నరుకు లేఖవ్రాయగా 250 సీసాలంపబడెననియు, రెండు సీమకుక్కలనుగూడా పంపినట్లును మద్రాసురికార్డులలో గలదు. సారాయిబుడ్లు సమర్పించి మెప్పునందు పద్ధతికొ్రత్తకాదు. అది జహాంగీరు చక్రవర్తి నాటినుండియు జరుగుచునే యుండెను.

1715 లో జాన్ సర్మన్ అను నాతని నాయకత్వమున పంపబడిన రాయబారము ఆరులక్షల రూపాయిలు ఖర్చుపెట్టి రెండేండ్ల తరువాత చక్రవర్తివలన ఫర్మానా సంపాదింపగలిగెను. (చూడు: థాంప్సన్, గెరాట్ గార్ల బ్రిటిష్‌రూల్)

ఆరోజులలో గవర్నరుజనరలును గవర్నరులునుకూడా చక్రవర్తి యెదుటనిలిచి యుండవలసినదే గాని కూర్చుండుటకు వీలులేదు. వారన్ హేస్టింగ్సు గవర్నరుజనరలుగానున్నప్పుడు ఢిల్లీ చక్రవర్తి ఏనుగుపైన అంబారిలో కూర్చుండగా నీ వారన్‌హేస్టింగ్సు ఆయన వెనుకనే కూర్చుండవలసి వచ్చెను! 1813 లో హేస్టింగ్సు గవర్నరుజనర లగునప్పటి కాంగ్లేయుల పలుకుబడియు బలమును హెచ్చుటవలనను చక్రవర్తి ఇంకను బలహీనుడై మహారాష్ట్రుల చేతిలో నుండుట వలనను చక్రవర్తి హేస్టింగ్సు నొకమారు రమ్మని కోరినప్పుడు, పోవుట కెంతో జాగుచేసి తుదకు చక్రవర్తితో సమానముగా కుర్చీలో కూర్చుండగలిగెను. డాల్‌హౌసీ ప్రభువు 1848లో ఢిల్లీకి వెళ్ళినప్పుడు చక్రవర్తిని దర్శించుటయె తనకు పరువుతక్కువయని మానివేసి చక్రవర్తికిని నవాబులకును చూపవలసిన మర్యాదలను పూర్తిగా తీసివేసెను.

తూర్పు ఇండియా వర్తక కంపెనీవారి నౌకరులును గవర్నరులును మన మొగలాయి చక్రవర్తికి నవాబులకు రాజులకు అడుగులకు మడుగులొత్తు రోజులు పోయి వారే రాజాధిరాజులై మనరాజులచేతనే గౌరవములందు రోజులు వచ్చినవి. తూర్పు ఇండియా కంపెనీ పరిపాలన అంతమొందు భారత

దేశము ఆంగ్ల రాజమకుటముక్రిందికి వచ్చునాటికి కలిగిన మార్పునుగూర్చి 1856 వరకు గవర్నరు జనరలుగనుండిన డాల్ హౌసీ ప్రభువు ఇంగ్లాండునుండి వ్రాసిన లేఖవలన తెలియ గలదు.

1857 డిసెంబరు 2 వ తేదీన డాల్‌హౌసీ ఇంగ్లాండు నుండి యిట్లు వ్రాసెను. " ... ప్రథమ దినములలో తూర్పుయిండియాకంపెనీవారు ఢిల్లీరాజులు తమప్రభువులు గాను, తాము వారివలన వంగరాష్ట్రపు పన్నుల వసూలు హక్కు పొందిన తాబేదారులుగనే చరించిరి. మొదటి గవర్నరుజనరలైన వారన్ హేస్టింగ్సు ఢిల్లీరాజుతో నేనుగు నెక్కినప్పుడు తానా రాజు వెనుక కూర్చుండెను! మా నాయనగారి కాలములోకూడ ఆంగ్లేయులు పెద్ద మొగలుఉద్యోగులను, రాజులను చూడబోయినప్పుడు రొక్కరూపమున నజరులను సమర్పించుచుండిరి. గవర్నరుజనరలు క్రమముగాతనయర్హస్థానమును గ్రహింపసాగెను. ఎట్టకేలకు హేస్టింగ్సు ప్రభువు ఢిల్లీ రాజులతో సమానముగ కుర్చీలోకూర్చుండుటవరకు సమాన గౌరవమును పొందెను. 1848 లో నేను ఢిల్లీకి వెళ్ళినప్పుడు రాజును దర్శించుటగాని రాజనగరుకు వెళ్లుటగాని జరుపలేదు. కుశల ప్రశ్నముల నుత్తర ప్రత్యుత్తర మూలమున సాగించితిని. ఈగౌరవముల నెల్ల నీ రాజు తదనంతరము తుదముట్టింపనెంచి తిని గాని కంపెనీవారు అభ్యంతరపెట్టుటవలన నట్లు చేయలేదు. ఈ డంబముల నెల్లవదలి గవర్నరుజనరలును సమానునిగ గౌర

వించువరకును నేను యువరాజును రాజుగ నంగీకరింపక నా పంతము నెగ్గించుకొంటిని."

## II

తూర్పుఇండియా వర్తకకంపెనీవారి తరఫున నీ దేశములో నుద్యోగములు చేయవచ్చిన ఆంగ్లేయుల జీవితవిధానమునందును వారి మర్యాదలందును చాలా మార్పులు కలుగసాగెను. ప్రారంభములో నీదేశమునకు వచ్చినవారెల్లరు నొకరినిజూచి ఇంకొకరెంత స్వల్పకాలములో నెంత హెచ్చుధన మార్జించి పోదుమా యను తదేక ధ్యానముతో పనిచేయుచు స్వంత వ్యాపారములుచేసి లంచములు పుచ్చుకొని భారతీయులను వంచించి బాధించి ధనమార్జించి సీమకుపోయి నవాబులవలె జీవించుచుండిరి.

హిందూదేశమున నుద్యోగము చేయుటకు ఒడంబడికపత్రములు వ్రాసి, వచ్చినేటి ఐ.సి.యస్.ఉద్యోగులకు పూర్వులనదగిన కవనెంటెడ్ సివిలు సర్వీసులోని ఆంగ్లేయోద్యోగులు ఇంగ్లాండునుండి ఈదేశమునకు వచ్చునప్పటికి సాధారణముగా పదునేడేండ్లైన నిండని యువకులుగ నుండిరి. వీరికి ప్రపంచానుభవములేదు. ఎట్టి తర్ఫీదునులేదు. దేశభాషలు ఆచారవ్యవహారములు తెలియవు. భారతదేశమునుండి అమిత ధనము దోచుకొనివచ్చి సీమలో మహారాజులవలె సుఖముగ జీవించువారి యదృష్టమునుజూచి సీమనుండివచ్చు ప్రతి యుద్యోగియు తాను కూడా అట్టి భాగ్యభోగ్యములు పొందుటకు వీలు కలదు గదా యని యువ్విళ్ళూరుచుండెను.

తెల్లవారెల్లరు సైనికులో లేదా అధికారులోయని ప్రజలు భయపడుచుండిన ఆ రోజులలో కంపెనీ పలుకుబడిని అధికారమును పురస్కరించుకొని నిరంకుశముగా ప్రవర్తించుటకు ప్రజలను భయపెట్టి సులభముగా లంచములు గైకొనుటకు వీరికి గల అమితమైన అవకాశములు, భార్యాబిడ్డలు గాని సంసారములుగాని లేకుండా ఈ దూరదేశములో చాల రోజులుండ వలసివచ్చుట, తమదేశ శీతోష్ణ స్థితికి భిన్నముగానుండు ఈ దేశపరిస్థితులును, ఈ యువకులను అతిత్వరితముగనే సుఖలోలురుగను సోమరిపోతులుగను జేసివైచుచుండెను. వీరిలో చాల మంది సురాపానమున వ్యభిచారమున మునిగియుండిరి. అనేకులు దేశీయవారకాంతల నుంచుకొనుచుండిరి.

వెలస్లీ గవర్నరుజనరలుగా నున్నప్పుడు కంపెనీవారి సివిలు సర్వీసు ఉద్యోగుల కొరకు పాఠశాల నేర్పరుప దలపగా కంపెనీ డైరెక్టర్లు మాన్పించిరి. అందువలన వీరిలో నెట్టి సంస్కారమును కలుగలేదు. ఈ ఉద్యోగులు చాలమంది లంచగొండులై అమిత ధనము నార్జించి విచ్చలవిడిగా ఖర్చుపెట్టుచు తమ నేటివు ఉంపుడుకత్తెలకు పుట్టిన యూరేషియను పిల్లలతో సంసారసాగరము నీదుచు భారతీయుల కులాచారములను అలవాటు చేసికొనుచుండిరి.

తక్కిన ఆంగ్లేయులుకూడ వీరినిజూచి ఈ క్రొత్త జీవిత విధానమున కలవాటుపడసాగిరి. ఏ బంగాళీబాబునో నవాబునో దబాయించియో వంచించియో ఎరువుతెచ్చుకొన్న గుఱ్ఱపుబండ్లలోను పల్లకులలోను ఈ ఆంగ్లేయు లూరేగుచుం

డగా వీరి ముందువెనుకల పది పండ్రెండుగురు నల్ల సేవకులు వీరి బిరుదావళిని వర్ణించుచు కేకలువేయుచు పరుగిడుచుండిరి.

ఆరోజులలో ఆంగ్లేయుల జీవితవిధానము నేటికన్న నత్యధిక ధనవ్యయ కారణముగ నుండెను. ఆంగ్లేయులకు గావలసిన సీమసరకు లమిత ప్రియముగనుండెను. సారాయి బుడ్లు, దుస్తులు, నాటకముటిక్కెట్లు మొదలు ఇంటి అద్దెల వరకును నేటికన్న చాలా హెచ్చుసొమ్ము ఖర్చుచేయవలసి యుండెను. ఆహారవిహారములకు వినోదములకు పెద్ద యుద్యోగులు చేయునట్లే చిన్నయుద్యోగుల స్త్రీలును ఇతర ఆంగ్లేయులుకూడా ఖర్చుచేయుట ప్రారంభించుచుండిరి. ఎంత ధనమైనను చాలకుండెను. ప్రజలను పీడించి పుచ్చుకున్న లంచములు చాలక అనేకమంది అప్పులపాలై ఋణదాతల చేతులలో నుండి వెలువడలేక సీమకు పోవుటకుగూడ వీలులేకుండ నుండిరి. ఈ దుబారాతనమువలనను దుర్వ్యసనములవలనను ఆంగ్లేయులలో అనేకులు దుర్మార్గములుచేయుచు తాము పాడగుటయే గాక ఇతరులనుగూడ పాడుచేయుచుండిరి.

## III

ఈ దేశములోని వివిధజాతులవారిని, మతములవారిని, క్రైస్తవ మతమున గలుపుకొనుటకు మిషనరీలు విశ్వప్రయత్నములు చేయుచుండిరి. కంపెనీ ఉద్యోగులు వారికిందు సహాయము చేయుచుండిరి. మిషనరీలు బలవంతముకూడా చేసినట్లు ఒత్తిడి చేసినట్లు నిదర్శనములుకలవు. శ్రీరాజా రామమోహన రాయలనుగూడా క్రైస్తవమతమున చేరుమని క్రైస్తవ

మిషనరీలు బలవంతము చేసినట్లు ఆయన చరిత్రలోకలదు. పాఠశాలలందు బైబిలును ప్రవేశపెట్టుటకు మిషనరీలు ప్రయత్నింపసాగిరి. బాలురు బైబిలు చదువునట్లు చేయుటకు ప్రపంచజ్ఞానమును పరీక్షించు నెపమున పరీక్షకులు బాలురను బైబిలు కథలనుగూర్చి ప్రశ్నింపసాగిరి. క్రైస్తవమతమున జేరిన హిందువుల ఆస్తి హక్కులు పోవుటవలన క్రైస్తవమత ప్రచారమునకు భంగకరముగ నున్నందున మిషనరీలు ఆనిబంధనను తీసివేయుటకు శాసనము చేయింపదలచిరి.

భారతదేశమున కంపెనీవారు తమ పరిపాలన ప్రారంభించినప్పుడీ దేశీయుల మతాచారవ్యవహారములతో జోక్యము కలిగించుకొనమనియు, అన్ని మతములపట్లను సహనభావముకలిగి యుండుమనియు, దేశీయులను క్రైస్తవమతములో కలుపుకొను ప్రయత్నము చేయమనియు వాగ్దానము చేసియుండిరి. కాని 1813 లో కంపెనీ పట్టానిచ్చు సమయమున క్రైస్తవమతబోధ శాఖకు సాలుకు20 లక్షల ఖర్చు మంజూరుచేసి వాగ్దానమునకు భంగకరముగా ప్రవర్తించి క్రైస్తవ మిషనరీలకు కంపెనీవారు సర్వవిధముల సహాయముచేయసాగిరి. ఉద్యోగులు బహిరంగముగా పక్షపాత బుద్ధి చూపసాగిరి.

మద్రాసులో కంపెనీ ప్రభుత్వ కార్యదర్శియగు "తామస్"గారు క్రైస్తవులైన వారికి మాత్రమే ఉద్యోగములివ్వసాగెను. చెన్నపట్టణమున నొక సదరుకోర్టు జడ్జి, దొరతనమువారు సూచించినట్లుగా క్రైస్తవ మతాచార్యులకు సహాయముచేయక, తనకు న్యాయమని తోచినట్లుగానే ప్రవర్తిం

చినందు కాయనపనిని తీసివేసిరి! ఆయనను హిందువులు గౌర వించి సభ జేయగా ఆయన ఆ సభలో నొక మహోపన్యాస మును గావించి నాటి ప్రభుత్వవిధానమునందు క్రైస్తవమతా చార్యులకుగల విశేషపలుకుబడిని అందువలన జరుగుఅన్యాయ ములను బహిరంగపరచెను. 1845 నాటికి చాలమంది జడ్జీలు మతాచార్యుల కీలుబొమ్మలై యుండిరి. మదరాసు కోర్టు జడ్జి "సర్ విలియంబర్టన్" అను నాయన బహిరంగముగానే మతా చార్యులపై అభిమానమును చూపుచు ఆ యభిమానమును తన చర్యలలో వెల్లడించుటయేగాక న్యాయపీఠమున కూర్చున్న ప్పుడు హిందువులకు స్వయముగా క్రైస్తవమతబోధను తానే చేయసాగెను. చెంగల్పట్టు జిల్లాజడ్జియొకడు ఒక దినమున వ్యాజ్యములను విచారించుట మాని తన కోర్టు భవనమునందు ఒక క్రైస్తవ మతబోధకునిచేత నుపన్యాస మిప్పించెను!

భారతదేశమున

# బ్రిటిష్ రాజ్యతంత్రయుగము

## ద్వితీయ భాగము

## ఇంగ్లీషు దొరతనము : కంపెనీ రాజ్యము

### 1600—1857

### మొదటి ప్రకరణము

### ఇంగ్లీషు వర్తకసంఘము

ఆంగ్లేయు లీ దేశమునకు వచ్చునప్పటి కిది యత్యంత భాగ్యవంతముగ నుండెను. ఈ దేశాధీశుల ఖజానాలు బంగరు వెండి నాణెములతోను, విలువలేని రత్నములతోను నిండి యుండెను. ఈ దేశపరిశ్రమలు అభివృద్ధిలో నుండెను. ఇచ్చటి నుండి అనేకసరకు లెగుమతి చేయబడి బంగారు వెండి దిగుమతి చేయబడుచుండెను. ఈ దేశీయులు ఆశియా ఐరోపా ఆఫ్రికాలతో విరివియగు వర్తకము జరుపుచు అమితలాభము సంపాదించుచుండిరి. ఈదేశపునూలు మజిలిను వలువలు, పట్టు బట్టలు, ఉన్ని శాలువలు, ఇత్తడి కంచు వస్తువులు ప్రపంచము నందెల్ల ప్రసిద్ధిగాంచెను.

ఐరోపాలోని వివిధజాతులవా రీ దేశమునకు సముద్ర మార్గము గనిపెట్టవలెనని అనేక శతాబ్దములనుండి విశ్వప్రయ

త్నములు చేయుచుండిరి. ఆ ప్రయత్నములలోనే కొలంబను అమెరికాను కనుగొని భారతదేశమని భ్రమపడినాడు. ఎట్టకేలకు వాస్కోడాగామా యను పోర్చుగీసు నావికుడు ఆఫ్రికా ఖండమునుజుట్టి భారతదేశము జేరినాడు.

ఆంగ్లేయ వర్తకకంపెనీవారీ దేశమునకు రాకపూర్వము చాల సంవత్సరములు పోర్చుగీసు డచ్చి జాతీయు లీ దేశముతో నోడవర్తకము చేయుచు అమితలాభము లార్జింపసాగిరి. ఈతూర్పు సముద్రతీరములందలి వర్తకమెల్ల తమకొక్కరికే ఇజారాహక్కులుగలట్లుగా వీరు నిరంకుశులై ఇతరజాతుల వారిని రానివ్వక సముద్రయుద్ధములు జేయుచు బలవంతులై విజృంభించిరి. ఈ ఖండమున సముద్రతీరములందు వారు స్థాపించిన వర్తకస్థానములను సంరక్షించుకొనుటకు కోటలు గట్టుకొనిరి. దీనివలన వారి వ్యాపారమునకు నిలుకడయు దేశీయుల దృష్టిలో గౌరవమును కలిగెను. పోర్చుగీసువారు 1510 లోనే గోవానగరము నాక్రమించి తమ ప్రభుత్వము స్థాపించిరి.

భరతఖండపు సంపదనుజూడగ ఐరోపా దేశములవారి కన్నులు మిరిమిట్లు గ్రమ్మెను. ఐనను మోసపుచ్చి ధనమపహరించుటకు భారతీయు లనాగరకప్రజలుకారు; అడవిమనుష్యులుగారు. వారు విద్యావినయ సంపన్నులు. ప్రకృతి పరిశ్రమలు వ్యవసాయము లలితకళలు బాగుగ నెఱిగినవారు. పాశ్చాత్య దేశపుసరకులు పుచ్చుకొని తమసరకులనిచ్చుటకు వారికభ్యంతరములేదు. పోర్చుగీసువారు వర్తకము సాగించుకొనుటకు మొదట మొగలాయి సామంతరాజులతో స్నేహముచేసికొనిరి.

తరువాత ఢిల్లీ చక్రవర్తితో నెయ్యమునలిపిరి. తమ వ్యాపారమున కడ్డువచ్చిన యితర పాశ్చాత్యులతో సముద్రమునయుద్ధములు సేయుట తప్ప పోర్చుగీసువా రితరులతోపోరాడలేదు. అట్టి వారిలో ముఖ్యులు డచ్చివారు. డచ్చివారు 1611 సంవత్సరమున పోర్చుగీసువారి నోడించి వారి వర్తక స్థానమగు సూరతు పట్టణమును పట్టుకొనిరి. కాని హిందూ మహాసముద్రమునగల సారవంతములైన ద్వీపములు వారి నాకర్షించుట వలన హిందూదేశ భూముల నాక్రమించవలెనను వాంఛ తగ్గెను. ఇంతలో ఫ్రెంచివారును, ఇంగ్లీషువారును రంగస్థలము లోనికివచ్చి లాభముపొందగోరిరి. ఫ్రెంచిమంత్రియగు కోల్బేర్ (Colbert) తన దేశముయొక్క నౌకాదళము నభివృద్ధిజేయు సందర్భమున 'తూర్పు ఇండియా' వర్తక సంఘమును స్థాపింప దలచెను. ఇంగ్లీషు మంత్రులుగూడ భరతఖండముతోడి వర్తక మభిలషించిరి. ఎలిజబెత్తురాణి అక్బరుచక్రవర్తికి వ్రాసిన లేఖతో 1583 లో టైగర్ అను ఇంగ్లీషు వర్తకపు ఓడ బయలుదేరెను. 1599 సంవత్సరమున ఇంగ్లీషు తూర్పు ఇండియా సంఘము ఇంగ్లండుదేశ రాణీఎలిజబెత్తు ప్రభుత్వము వలన ఇండియాలో వ్యాపారము చేయుబోవుట కనుజ్ఞనుపొందిరి. వర్తకము చేయుబోవు నోడలలో సాధారణవర్తకులనేపంపిరి. కొంచెము లాభమువచ్చినచో సంతసించిరి. పోర్చుగీసుడచ్చివర్తక సంఘములకు హిందూదేశమున వర్తకస్థానములు గిడ్డంగులు కోటలు నుండుట జూచి తమకుగూడ నట్టి వుండిన బాగుండు ననితలచిరి. అప్పుడింగ్లాండు రాజుగనుండిన మొదటిజేమ్సు

భరతఖండము నేలుచుండిన జగద్విఖ్యాత మొగలాయి చక్రవర్తి యగు జహాంగీరునకు తన దేశపు వర్తకులకు తావిచ్చి రక్షింప వలసినదని లేఖను వ్రాయగ జహాంగీరు వారిని సూరతుకాంబే అహమ్మదాబాదులలో నెలకొననిచ్చి 1613 లో ఫర్మానా జారీ చేసెను. ఆ కాలమున భారతదేశమున ప్రపంచములోనికెల్లను విశాలమైన మహా సామ్రాజ్యము వర్ధిల్లుచుండెనని జె. బ్రూస్ అను నతడు వ్రాసియున్నాడు. * ఆంగ్లేయ తూర్పుఇండియా కంపెనీవారు ముడిపట్టు, 'కాలికో' వస్త్రములు, నీలిమందు, లవంగములు, జాపత్రియు మన దేశమునుండి ఐరోపా కెగుమతి చేసి వాని ఖరీదుక్రింద బంగారునే ఈ దేశములోనికి తెచ్చి యిచ్చుచుండిరి. ఈ వ్యాపారము వారి కమిత లాభకారిగ నుండెను. వర్తక మారంభించినది మొదలు ఎనుబది వత్సరములు వారికి సాలుకు నూటికి 171 వంతుల చొప్పున లాభము వచ్చుచుండెను. కంపెనీ స్థాపింపబడిన నాలుగేండ్లకు వారికి లాభములు నూటికి 87½ వంతులు మాత్రమే వచ్చుచుండెనని వారెంతో వగచిరి.

1615 లో నాంగ్లేయరాజగు మొదటి జేమ్సుదగ్గరనుండి జహాంగీరు చక్రవర్తిదగ్గరకు సర్ తామస్ రో అను రాయబారివచ్చి మూడునంవత్సరము లిచ్చట నుండెను. ఆంగ్లేయ వర్తకులకు ఆశ్రయ మివ్వ వలసినదని ఆశ్రయించెను. దీని ఫలితముగా నీ యాంగ్లేయులు తన మొగలుసామ్రాజ్యములో

* (Annals of the East India Co. - J. Bruce quoted by James Mill in his History of India)

నే ప్రాంతముననైనను వర్తక స్థానములు స్థాపించుకొనవచ్చు నని చక్రవర్తి అనుజ్ఞనిచ్చెను. ముఖ్యముగా సూరతు, వంగ రాష్ట్రము సింధురాష్ట్రమును ఫర్మానాలో పేర్కొనబడెను. 1616 లో పడమటితీరమున కొన్ని వర్తకస్థానములుస్థాపించిరి. కళ్ళికోటలోను మచిలీపట్టణములోను ఫ్యాక్టరీలుస్థాపించిరి.

ఫ్రెంచి తూర్పుఇండియా వర్తకసంఘము 1614 లో స్థాపింపబడెను. ఫ్రెంచివారు పుదుచ్చేరీ, చందనగరము, మహీ, మచిలీపట్టణము, డక్కా, పాట్నా, కాసీం బజారు మున్నగు చోట్ల వర్తకస్థానములు స్థాపించుకొని పుదుచ్చేరీని రాజధానిగా చేసికొనిరి.

పోర్చుగీసు వారివలెనే ఆంగ్లేయులును కొన్ని కోటలు కట్టుకొని కొన్నిసైన్యము లుంచుకొన దలచిరి. కాని దీనివలన వ్యయ మధికమై లాభము తగ్గునని సర్ తామస్‌రో వలదని వారించెను.

ఆంగ్లేయుల సేవకులు తమ ఓడలపైన నేదైన నేరము జేసినచో వారిని విచారించుట కెట్టి యధికారములు గలవో అట్టి యధికారములే ఈ దేశములో తమ వర్తకస్థానములందు కూడ తమ కవసరమని చక్రవర్తిని ప్రార్థించి 1624 లో నట్టి న్యాయపరిపాలనాధికారములను సంపాదించికొనిరి. ఈ యధికారముల మూలమున మునుముందు తన ప్రజలపైనను, తన వారసులపైనను గూడ వీ రధికారము చలాయించి వారు లొంగనిచో వారిని బంధించి బాధింతురని చక్రవర్తి కలనైనను తలపడయ్యె.

1639లో చెన్నపట్టణములో వర్తకస్థానము కొరకు కొంత భూమినిసంపాదించి కోటనుగట్టుకొని ఈ దేశమున తమవ్యవహారములెల్ల నిర్వహించుకొనుటకు ముఖ్య కార్యస్థానముగ జేసికొనిరి.

మొదటినుండియు నీవర్తకసంఘమువారు తమకొక్కరికే వర్తకము చేసికొనుటకు హక్కుకలదను సూత్రమును స్థాపించుకొన జూచుచుండిరి. ఇతరుల యోడలువచ్చినచో గొణుగుచుందురు. ఓడలోనివారు నిరాయుధులుగ నుండినచో నాయోడలను బట్టుకొనుచుందురు. అట్టి వర్తకులీ సంఘమువారిచేతబడినప్పుడు వారిని పట్టుకొని దొంగలను బాధించినట్లుగా హింసించినట్లు కొన్ని నిదర్శనములుకలవు.

1664 లో శివాజీ బొంబాయిరేవుపైన బడగ నాంగ్లేయులు సూరతును సంరక్షించుకొనిరి. ఇది విని ఔరంగజేబు చక్రవర్తి వారికి కొన్ని సౌకర్యములనిచ్చుట కంగీకరించెను. అప్పటికి బొంబాయి పోర్చుగీసువారిది. తరువాత ఇంగ్లీషు రాజైన రెండవ ఛార్లెసుకు వరకట్నముగ బొంబాయి వచ్చెను. అంతట నాచక్రవర్తి అనుపయోగముగ నుండిన ఆ రేవును ఆంగ్లవర్తక సంఘమువారు తనకు సాలుకు పదిపౌనులిచ్చు పద్ధతిని 1669 లో వారి కిచ్చివేసెను.

ఇట్లు మొదటి యేనుబదేండ్లలో నింగ్లీషువర్తకసంఘమువారు కొంత స్థిరాస్తిని ధనమును గడించుకొని తమ తోడి వర్తకులపైన గూడ దౌర్జన్యములు జేసియు, పోరాడియు కాలక్షేపము చేయుచుండిరి. నాటిభరతఖండపు ప్రభుత్వము వారు వీరిని లెక్కసేయలేదు.

కొన్నియేండ్లకు బొంబాయిలో వీరి దౌర్జన్యములు వృద్ధియైనందున మొగలాయి చక్రవర్తికి కోపమువచ్చి ఉపేక్షింపదగదని తలచి సూరతునుండి వీరిని తరిమించెను. బొంబాయినిముట్టడింపజేసెను. విశాఖపట్టణమును, ఇతర చోటులనుండిన వర్తకస్థానములను, బట్టుకొనెను. కాని ఇంగ్లీషువారు రాజ్యతంత్రనిపుణులు. అతిదీనులై దాసోహమ్మని క్షమార్పణలు కోరుకొనిరి. వారిదీనాలాపములు విని చక్రవర్తి కరుణించి సూరతును మఱల నిచ్చెను. అవసరమైనచో ఇట్లు వీరి నణచగలనుగదా యని చక్రవర్తి యశ్రద్ధవహించెను.

బంగాళమున నున్న సామంతరాజులు మాత్రము పరదేశీయు లిట్లు వర్తకస్థానములను, కోటలను గట్టుకొనుట శ్రేయస్కరముగాదని గ్రహించిరి. అంతట వర్తకసంఘమువారు వీరితో కలహింపసాగిరి. ఇది వరకు తాము భరతఖండములోని రాజులకు దాసులమని నటించు తెల్లవర్తకులు బంగాళానవాబుతోడి కలహమున నిజోద్దేశములను బయల్పరచిరి. 1615లో చిటాగాంగును పట్టుకొని కొల్లగొనదలచి తమ సైనికుల నంపిరి. ఆంగ్లవర్తకులు బాలసూరును తగులబెట్టిరి. గాని పరాజితులై పాట్నా, కాశీం బజారులలోని తమ వర్తకస్థానములను గోల్పోయి శరణుజొచ్చి రాజీపడిరి. ఆంగ్లేయవర్తకుల కప్పుడు విజయము కలిగినచో భారతీయులు వీరివలనకలుగు ముప్పునకు కండ్లు తెరచియైన నుందురు.

నాటినుండియు నాంగ్లేయ వర్తకులు వర్తకలాభము పొందుటమాత్రముగాక రాజ్యలాభమునుగూడ పొందగోరిరి.

1689లో నింగ్లాండులోని వర్తకసంఘ కార్యనిర్వాహకులు తమ వారి కిట్లువ్రాసిరి. "మనవర్తక మభివృద్ధిచెందుట మాత్రమే గాక భూమిశిస్తులుగూడ అభివృద్ధి జెందవలెను. మనవర్తక మే కారణమువల్లనైన పోయినను మన శిస్తులపైన మన మాధార పడవలసి యుండును. అది లేనిచో మనకు భరతఖండమున గౌరవముండదు". వర్తకసంఘమువారి సేవకు లీ సలహాను జాగ్రత్తగ పాటించిరి. అప్పటినుండి వర్తకమును రాజ్యలాభ మునకు మార్గముగ, సాధనముగ, నుపయోగించిరి. బంగాళ మున పరాజితులైనను వారీ నీతినిగ్రహించిరి. ఢిల్లీచక్రవర్తికి మాత్రముదూరదృష్టి లేకపోయెను. 1699లో ఆంగ్లవర్తక సంఘ మువారు చక్రవర్తిగారిని వేడుకొని మఱికొన్ని వర్తకస్థాన ముల నేర్పరచికొని కోటలను గట్టుకొనుటకు ఉత్తరువుపొందిరి. ఆంగ్ల వర్తకసంఘమువారు తమ కార్యక్రమమును మెల్లగ సాగించిరి. 16 వ శతాబ్దాంతమున నీ సంఘమువారు హుగ్లీనదీ ముఖమున చుట్టానాట్టి, కలకత్తా, గోవిందపురము లను గ్రామములను పన్నుచెల్లించు పద్ధతిని బంగాళాదేశపు సుబేదారుడగు అజీంషావలన జాగీరులుగ గైకొనిరి. ఔరంగ జేబు మనుమనికిగూడ నజరానాలిచ్చి దీని కంగీకరింపజేసిరి. అంతట చక్రవర్తి యంగీకారమును బడసియో, బడయకుండ గనో ఒక కోటనుగట్టి తమదేశపు రాజగు విలియము పేరిడిరి. మొగలుచక్రవర్తి యీ చిన్న వర్తకసంఘము వారిచ్చుట నేమిచేయుచుండిరో గమనింపవలసిన యావశ్యకమేమి?

సాలుకు పదివేలరూపాయలు రుసుము చెల్లించు పద్ధతిని

వంగరాష్ట్రమున స్వేచ్ఛగా వ్యాపారముచేయు హక్కును పొంది ఔరంగజేబు సుంకములు హెచ్చుచేయక పూర్వము నూటికి రెండు చొప్పున సుంకము చెల్లించు పద్ధతిని సూరతులో కంపెనీకిగల ప్రాతహక్కును క్రొత్తఫర్మానా ద్వారా స్థిరపర్చుకొనిరి. సూరతులో భూములు కొలుకు పొందు హక్కునే గాక విక్రయముపొందు హక్కును సంపాదించిరి. కలకత్తా దగ్గర రెండూళ్ళను కొలు పొందుటకు వీలుగలిగెను. మదాసుదగ్గర నైదుగ్రామములనుండి నవాబు వీరిని 1711లో బలవంతముగా వెళ్ళగొట్టగా అప్పుడు మరల 1708 లో పొందిన దానశాసనమును స్థిరపరచుకొనిరి. ఈ ఫర్మానా సంపాదించినందులకు ఆంగ్లేయులు పరమానందము బొంది సంతోషసూచకముగా ఫిరంగులు పేల్చిరి.

## II

మదాసు వర్తకస్థానమునకు గవర్నరుగా పనిచేసిన తామస్‌పిట్టుయొక్క చరిత్రవలన నా రోజులలో ప్రతివానికి నిండియాకువచ్చి త్వరగా ధనమార్జించు టెంతసులభమో తెలియును. ఇతడు వేటకాడుగా జీవితము ప్రారంభించినాడు. సైన్యములో కెప్టన్ స్థానము పొందినాడు. ఆనాటి కంపెనీ డైరక్టర్ల నాశ్రయించి సులభముగా పెద్దయుద్యోగి యైనాడు. ఆ రోజులలో డబ్బుగలవా రందరు ఇంగ్లాండు పార్లమెంటులో సభ్యత్వస్థానములు సంపాదింప గలుగుచుండిరి. 1689 లోను 1691 లోను పిట్టు బేచీరాకు గ్రామములకు సభ్యత్వము సంపాదించినాడు.

ఇతడు పోగరుబోతుగానుండి కంపెనీ డైరెక్టర్లను తూలనాడినాడు. ఇతనికి భయపడి వారలు 1697లో నితనిని మదాసు ఫోర్టుసెంట్ జార్జికి గవర్నరుగా ఎన్నుకొనిరి. ఇతడు 12 సంవత్సరములు గవర్నరు పదవిలోనుండి అమిత ధనము నార్జించెను. ఇతడు గవర్నరుగా నుండగానే రీజెంటువజ్రమని ప్రసిద్ధిగాంచిన మణి నిండియానుండి సీమకు జేర్పించినాడు. ఫ్రెంచి దేశపు రీజెంటు కా వజ్రమును 135000 పౌనులకు విక్రయించి లాభముపొందినాడు. ఈ ధనముతో తన మనుమని గూడా పార్లమెంటుసభ్యునిగా జేసినాడు.

## III

## రాజ్యతంత్ర ప్రారంభము.

మొగలాయి సామ్రాజ్యవిభవపు దిబ్బలపైన పాశ్చాత్య సామ్రాజ్యపు పునాదులు వేయవచ్చుననియు అంతఃకలహము లతో నిండియున్న ఈ విశాల దేశమును చేజిక్కించుకొని రాజకీయాధిపత్యమును సంపాదించి స్వప్రయోజనార్థము విని యోగించుకొన వచ్చుననియు మొట్టమొదట గ్రహించి పనిజేసిన అభినవచాణక్యుడు ఆనాడు భారత దేశమున వర్తకముజేయు టకు వచ్చిన పాశ్చాత్య వర్తక కంపెనీలలో ఫ్రెంచివారి గవ ర్నరగు డూప్లే. ఇతడు కుశాగ్రబుద్ధి. ఆనాటి రాజులు, నవా బులు విశేష ధనవ్యయముజేసి పోషించుచున్న అసంఖ్యాకము లగు సైనికనిచయములకు క్రమ శిక్షణము లేదనియు, ఇట్టి సైన్యము లెన్నియైనను పాశ్చాత్యపద్ధతిని తర్ఫీదుపొందిన

సైన్యములనల కెనరావనియు, భారతీయసైనికులను పాశ్చాత్య సైనికాధికారులే తర్ఫీదుచేసి నడిపినచో నట్టి క్రమశిక్షణ లేని సైన్యము లెంతసంఖ్యాబలముగలట్టి వైనను నిలువజాలవనియు గ్రహించిన మేధావి యితడే. ఆంగ్లేయవర్తక శిఖామణు లింకను తమ వ్యాపారములో మునిగి తేలుచు రూపాయలు లెక్కపెట్టుకొనుచు గూర్చుండియుండగా నీ రాజ్యతంత్రజ్ఞుడు తన చాణక్య నీతిని ప్రయోగింపసాగెను.

ఔరంగజేబు చనిపోయినపిదప మొగలుచక్రవర్తులు బలహీనులై నందున వారి గవర్నరులుగానుండిన సుబేదారులు నవాబులు స్వతంత్రులగుచుండిరి. చిన్న చిన్న నవాబులు రాజులు స్వతంత్రులై సింహాసనముల నాక్రమించుటకు పెనగు లాడుచుండిరి. ఈ కల్లోలములో నైజాముదగ్గర పలుకుబడి సంపాదించి అతనికిలోబడిన కర్నాటక నవాబు సింహాసనమున నొక కీలుబొమ్మను నిలిపి ఇంగ్లీషువర్తకులను తోసిరాజను టకు ఫ్రెంచి గవర్నరు డూప్లే తంత్రమును పన్నెను. సైన్యము లను నడిపెను. ఐరోపాలోని యుద్ధము భారతదేశమునకు గూడ ప్రాకెను. ఫ్రెంచివర్తక సంఘమును ఇంగ్లీషువర్తక సంఘమును వ్యాపారముకొరకు దేశములోని రాజకీయము లందు పాల్గొని ప్రతిపక్షములు వహించిన నవాబులకు సహా యము చేసి పోరాడనాగిరి. ఫ్రెంచివారికి డూప్లేదొరికినట్లే ఇంగ్లీషువారికి క్లైవు దొరకెను. ఇంగ్లాండులో నల్లరిచిల్లరిగా తిరుగుచుండిన క్లైవు ఇండియాకు సామాన్యగుమాస్తాగావచ్చి సైనికుడై సేనానియై గవర్నరుపదవిపొందెను. ఇతడు కుటిల

రాజ్యతంత్రమున నిపుణుడై ఆంగ్లరాజ్య స్థాపనకు పునాదులు వేసెను.

దక్షిణాపథమున నిట్లు కేవలము వ్యాపారపు పోటీల యందు పెనగులాటతో ప్రారంభమైన పోరాటము దేశములో రాజకీయాధికారమును చేజిక్కించుకొని ఆధిపత్యము వహించుట కొరకు చేయబడు తీవ్రయుద్ధముగా పరిణమించి ఉత్తర హిందూస్థానమునకు పాకెను. 1757 లో క్లైవు కుతంత్రము జేసి వంగరాష్ట్ర నవాబు సైన్యములను ప్లాసీయుద్ధములో నోడించుటతో ఆంగ్లరాజ్యస్థాపనకు పునాదులు వేయబడినట్లు చెప్ప వచ్చును. ఈ విజయముతో క్లైవు ఢిల్లీ చక్రవర్తిని బుట్టలో వేసికొని మూడుపరగణాల దివానీగిరీని సంపాదించెను. దీనితో నీ దేశమున నాంగ్లేయ రాజ్యాధిపత్యమునకు దారి ఏర్పడెను.

## IV

భారతదేశాక్రమణముచేయు తలంపు ఫ్రెంచి వర్తక కంపెనీ యుద్యోగులకే మొట్టమొదట కలిగినను తుద కారాజ్యాధిపత్యము ఆంగ్లేయుల కంపెనీకే దక్కినది. వీని కనేక కారణములుకలవు. ఆంగ్లేయులు మొదటినుండియు వర్తకమువలని లాభమును ధనార్జనమును తమ ప్రధానోద్దేశములుగా నుంచుకొని రాజ్యాక్రమణమునకు తమ చేతిసొమ్మును ఖర్చుచేయక సామదానభేదోపాయములతో మెల్లగా రాజ్యాధిపత్యము సంపాదించిరి. ఫ్రెంచి సేనానియగు డూప్లే యట్లుగాక వర్తక లాభమును లెక్కసేయక కేవలము తన బాహుబలపరాక్రమమువలన దిగ్విజయముచేసి ఒక్కసారిగా దేశాక్రమణ చేయ

బ్రియత్నించెను. అందువలన నతనికి విశేషధనము కావలసి వచ్చెను. తన దేశ ప్రభుత్వమువారిని సొమ్ము అడుగగా వారైరోపాలో యుద్ధములందు మునిగి ఇతనికి సహాయముచేయలేక పోయిరి. ఆంగ్లేయులు ఫ్రెంచివారికన్న మూడురెట్లు హెచ్చు వ్యాపారము చేయుచు దానివలన విశేషధనము నార్జించుచుండిరి. పైగా 1757 మొదలు బంగాళా దేశాదాయములెల్ల ఆంగ్లేయులచేతులలోనుండి వారికిధనబలము చేకూరెను. ఫ్రెంచి వారితో నాంగ్లేయులకు యుద్ధములుతటస్థించిన సందర్భములో రాజ్యతంత్రనిపుణులగు ఆంగ్లేయులు వారిని ఐరోపాలోకన్న దూరప్రదేశములగు నిండియాలోను వలసరాజ్యములలోను యుద్ధములం దోడింపవచ్చునని గ్రహించి తమ వర్తక కంపెనీలకు సైన్యములను సాయమంపి ఆ యుద్ధములందు తోడ్పడుచు జయము గాంచుచుండిరి. ఫ్రెంచివారిది గ్రహింపలేదు. ఐరోపాలోనే తమ శక్తులెల్ల కేంద్రీకరించి వలసరాజ్యములందలి కంపెనీవారి కేసహాయమును జేయరైరి. ఆంగ్లేయకంపెనీ యుద్యోగులు అవకాశము దొరికినప్పుడెల్ల భారతదేశములోని ఫ్రెంచి కంపెనీపైకి దాడి వెడలుచుండిరి. అందుకొరకు స్వదేశనవాబులతోను రాజులతోను కుట్రలు చేయుచుండిరి. ఈ కుట్రలకును రాజ్యాక్రమణయుద్ధములకును ఆంగ్లేయాధికారులు మద్దతుచేయుచుండిరి. విజయముగాంచినవారికి బహుమతులిచ్చి సమ్మానముజేసి వారి శౌర్య ధైర్యములనుగూర్చి పొగడుచు సీమకువ్రాసి ప్రోత్సహించుచుండిరి. సీమవారు సామాన్య సైనికుడగు క్లైవుకు బిరుదులిచ్చి ప్రోత్సహించు

టమె దీనికి తార్కాణము. ఇక ఫ్రెంచివారన్ననో తమ యుద్యోగులు అనవసరముగా యుద్ధములుచేసి సొమ్ము పాడుచేయుచున్నారని మందలించుచు చీటికిమాటికి వీరిని శిక్షింపజేయుచుండిరి. డూప్లేచూపిన ధైర్య సాహసముల కతనికి కలిగిన బహుమానము తిట్లు, అవమానములు! లాలీ కురిశిక్షయె విధింపబడినది. ఆంగ్లేయుల కీదేశమున జయము కలుగుట కింకొక కారణము వారికిగల నౌకాబలము. సముద్ర మార్గములెల్ల వారి వశములై యుండి యుద్ధపరికరములు సైన్యములు అందుబాటులో నుండెను. ఫ్రెంచివారి కవి దుర్లభము లగుచుండెను. ఫ్రెంచి నావలను ఆంగ్లేయులు ముంచివేయుచు వారికి నష్టము కలిగించుచుండిరి. ఇట్లు అలభ్యయోగముగా నాంగ్లేయులకు విజయమును ఫ్రెంచివారి కపజయమును కలిగినవి.

## రెండవ ప్రకరణము

## క్లైవు చూపినదారి

### I

### లాభసంపాదన పద్ధతి

భారతదేశమును బ్రిటిషు ఇండియాగా జేయుటకు పునాదులు వేసిన రాజ్యతంత్రజ్ఞుడు రాబర్టు క్లైవు. ఈ దేశ భాగ్యభోగ్యముల నింగ్లాండుకు తరలించుటకు మార్గము చూపిన వాడు నితడే. 1756 నాటి మొగలాయిసామ్రాజ్యములోని వివిధభాగముల స్థితిగతు లెట్లుండెనో పరిశీలింతము.

మొగలుసామ్రాజ్యములో చేరిన అయోధ్య, వంగ, బీహారు, ఒరిస్సాలకు రాజప్రతినిధులు అయోధ్య వజీరు లనియు, వంగరాష్ట్ర నవాబులనియు ప్రఖ్యాతిగాంచి పేరు నకు చక్రవర్తికి సామంతులుగ నుండినను, నిజమునకు స్వతంత్రు లగు రాజులుగ నుండిరి. వంగరాష్ట్ర నవాబుయొక్క ముఖ్య పట్టణము ముర్షిదాబాదు. ఇది బహు సుందరమై ధనవంతమై నాటి లండను నగరముతో తులతూగుచుండెననియు లండనులో కన్న నీ నగరమునం దెక్కుడు ధనవంతులు గలరనియు క్లైవు వర్ణించియున్నాడు. ఈరాజ్యమునకు 1756 లో సురాజ్ ఉద్దౌలాయను యువకుడు నవాబయ్యెను. క్లైవును సమర్థించుటకు ఆంగ్ల చరిత్రకారు లితనినిగూర్చి అనేకములగు అసత్యపు వ్రాతలు వ్రాసి యితనిని దుర్మార్గుడని చిత్రించియున్నారు. గాని ఇతడు నిజముగ నట్టి దుర్మార్గుడుకాడు. ఇతనిచుట్టును చేరినవారు మాత్రము స్వామిద్రోహము చేసిన దుర్మార్గులుగ నుండిరి. అట్టివారిలో నొకనికి కలకత్తాలోని ఆంగ్లేయ వర్తక కంపెనీవారు ఆశ్రయమిచ్చి అతనిని నవాబుకు ఒప్పగింపకపోగా నతడు కోపించి కలకత్తాను పట్టుకొనెను. ఈ సందర్భమున నితడు ఇంగ్లీషువారిని బంధించి చీకటికొట్టులో పడవేయించగా చాలమంది చచ్చిపోయిరని ఒక కథ వ్యాప్తిజేయబడెను. ఇది అబద్ధమని బాసు, మొదలగు చరిత్రకారులు రుజువుపరచియు న్నారు. మద్రాసునుండి క్లైవు నాటుదారివి, వాట్సను ఓడల పైనను కలకత్తాను రక్షించుటకు వచ్చిరి. క్లైవు అక్కడకు వెళ్ళినపిదప నవాబుయొక్క అధికారుల దగ్గఱనుండి లంచము

వుచ్చుకొని ఆ నవాబుతో స్నేహమును నటించెను. గాని లోలోపల నీతనిని సింహాసనభ్రష్టునిచేయుటకు కుట్రలుచేయ సాగెను. నవాబుయొక్క దగ్గరబంధుగుడును సేనానాయకుడును అగు మీర్జాఫరుకు సింహాసనము నిచ్చుటకును ముర్షిదాబాదు వర్తకుడగుజగత్సేటుకును కలకత్తాలోని వర్తకుడగుఉమచందు నకును విశేష ధనలాభముచేకూర్చుటకు కుట్రచేసెను. తనతో చేయు సంధిపత్రములో నీషరతు స్పష్టముగా వ్రాయవలెనని ఉమచందుకోరగా క్లైవుకపటనాటకమునాడి కర్నల్ వాట్సను సాక్షిసంతకమును తానే సృష్టించెను. తరువాత నీ కూటసృష్టి పత్రముసంగతి ఉమచందుకు తెలియగా నతనిగుండె పగిలి పిచ్చివాడై పోయెను. క్లైవు యెట్టి యన్యాయము చేయుటకును వెరవడు. నవాబుయొక్క మహాసైన్యములను తనస్వల్పసైన్యము లతో నెదిరించి గెలుచుట కష్టమని ఎరిగి నవాబుసైన్యములలో కొన్నిటిని తనవంకకు త్రిప్పుకొని ఆకస్మికముగాస్వామిద్రోహ ముచేయుట కేర్పాటు చేసియుండెను. ఇట్లు మిత్రభేదమువలన స్వామిద్రోహమువలన కూటసృష్టివలన క్లైవు ప్లాసీయుద్ధమున గెలుపొంది బ్రిటీషుసామ్రాజ్య స్థాపనకు కారకుడయ్యెను. (23 జూను 1757) సురాజుద్దౌలా నిట్లు ద్రోహముచేసిన క్లైవు మీర్జాఫరులు వంగరాష్ట్ర బీహారు ఒరిస్సాల నపహరించిన విధానము చిత్రమైనది. మీర్జాఫరు కంపెనీవారికి 214 0000 పౌనులును, క్లైవుకు లంచముగా 20 లక్షల నవరసులు నిచ్చుపద్ధతి నీవరగణాల సింహాసనమును మీర్జాఫరుకొసగునట్లు కంపెనీ వారు ఢిల్లీ చక్రవర్తిని ప్రోత్సహించిరి. మీర్జాఫరు క్లైవుపట్ల

చాలకృతజ్ఞుడయ్యెను. తన యాస్థానమున క్లైవు నొక ఉమ్రావుగా చేసెను. ఆ దర్జాను నిలుపుకొనుటకు తనకుతగిన రాబడి యుండవలెనని క్లైవుకోరగా సాలుకు 30 వేలపౌనుల రాబడి గల 882 చతురపుమైళ్ళ జాగీరును క్లైవు జీవితమువరకు క్లైవు అనుభవించి తరువాత కంపెనీవారికి చెందునట్లు మీర్జాఫరు దానమిచ్చెను. (1759) ఈ యపాత్రదానఫలితమగు భూభాగమే 'ఇరువదినాల్గుపరగణా'లని నేటికిని పిలువబడుచున్నది. ఈజాగీరును క్లైవు 1765 నుండి కంపెనీ వశముజేసి వారివలనప్రతి సాలున 1774వరకు షుమారు 30 వేల నవరసులు క్విట్ రెంటును పుచ్చుకొనుచుండెను. ఇట్లు క్లైవు దమ్మిడీ లేకుండా జీవితము నారంభించి 34 వ యేడువచ్చునప్పటికి అమిత ధనవంతుడయ్యెను. 1755 కు 1760 కు మధ్య నితడు ప్రైవేటు వర్తక కంపెనీలకు ఇండియానుండి 22000 నవరసులను పంపెనని, 25 వేల నవరసుల విలువగల వజ్రములు తరలించెనని, ఇంకను చాల సొమ్ముపంపెనని, అతనివద్ద ఇంకను నగదుండెనని, అతని లెక్కప్రకారమే సాలుకు 27 వేల నవరసు లాదాయము వచ్చు జాగీరు సంపాదించెననియు, ఇతని చర్యలను గూర్చి 1773 లో ఇంగ్లాండులో కామన్సు సభలో విశ్వాస రాహిత్య తీర్మానము చర్చింపబడినప్పుడు నేరారోపణచేయబడెను; గాని ఇతడు తన దేశమునకు మహోపకారము జేసెనని ఆతీర్మానమును తోసివేసిరి. ముర్షిదాబాదు ఖజానాలో మూల్గుచున్న రత్నరాసులు, ధనసంచయములు తనకాళ్ళదగ్గఱపడి యుండగా తానింత తక్కువమొత్తమునే తీసుకొనుట తనకే

యాశ్చర్యముగానున్నదని క్లైవు తన చర్యలు సమర్థించుకొనెను! ప్రపంచములో మానవులకెల్లరకును పరమధర్మ ప్రమాణములుగ నుండవలసిన నీతి నియమములను ప్రభుత్వములు గమనింపవలసిన న్యాయ ధర్మములనుగూడ మీరి, క్లైవు ఘోరమైన నేరములు జేసినాడని ఇతని జీవితమువ్రాసిన మెకాలే యంగీకరించినాడు. క్లైవు 1774 లో ఆత్మహత్య జేసికొనెను.

మీర్జాఫరును సింహాసన మెక్కించినప్పుడు చేసినసంధి సమయమున బహిరంగముగా కంపెనీవారి కీతడిచ్చిన 1750000 పౌనులు రొక్కమును విశాల భూభాగమునుగాక సంధిపత్రమున నుదాహరింపకపోయినను అతడు కంపెనీ యుద్యోగులందరికిని విశేషధనమును బహుమతులరూపముగా లంచమిచ్చెను. 1772 లో సెలెక్టుకమిటీవారే ఈ బహుమతుల విలువ 1250000 పౌనులుండునని అంచనా వేసియున్నారు. దీనిలో క్లైవు వాటా కొనగబడిన లంచములవిలువ 234000 పౌనులనియు నిర్ణయింపబడినది. ఇవి రుజువైన లంచములు; రుజువుకాని వెన్నికలవో ఎవ్వరునెరుగరు. 1765 లో క్లైవు మూడవసారి పరిపాలనాధికారము వహించి కలకత్తాకు వచ్చునప్పటికి(మీర్జాఫర్)జఫరాలీఖానుచనిపోయెను. క్లైవుతనకుమారునికుపకారముచేయగలడనితలచి మీర్జాఫర్ చనిపోవుచుక్లైవుకు70వేల నవరసులు చెందజేసెను.గానిఅతనివారసుడు సింహాసన మెక్కుటకై కంపెనీకి లక్ష నవరసులు లంచమిచ్చుకొనవలసి వచ్చెను. ఈలోపుగా కొన్నాళ్ళు అయోధ్యవజీరుగానుండిన

మీర్జాఫరు అల్లుడు మీర్ఖాసీం కొత్తనవాబు మొగలుచక్రవర్తితో కలసి ఆంగ్లేయుల ప్రాబల్యమును కూలద్రోయ ప్రయత్నించెను. గాని లాభము లేకపోయినది. దీనిఫలితముగా 1765 లో క్లైవు, చక్రవర్తివలన వంగరాష్ట్రబీహారు ఒరిస్సాల దివానీగిరీని కంపెనీకి సంపాదించి ఫర్మానా పొందగలెను. ఇట్లే కర్ణాటకమునకు దక్షిణ హిందూస్థానమునకు కూడ ఒక ఫర్మానాను పొందెను. ఇది బ్రిటిషు సామ్రాజ్యస్థాపనకు ప్రథమ సోపానము. వంగరాష్ట్ర నవాబుగద్దెపై నొక కీలుబొమ్మను నిలిపి తన యిచ్చవచ్చిన ట్లాడించుటవలన కంపెనీవారికి ఉత్తర హిందూస్థానమున గొప్ప పలుకుబడి యేర్పడెను.

మీర్జాఫరుతో సంధిజరిగిన మూడుసంవత్సరములలోనే ఆంగ్లేయదొరల కతనిపైన దయతప్పినది. అతనికాలమున కంపెనీనౌకరు లెల్లరు తామే దేశాధికారులుగ బ్రవర్తించి వంగరాష్ట్రము నల్లకల్లోలముజేసి అరాజకమున ముంచిరి. మీర్జాఫరు పనికిమాలినవాడని అతనిని తొలగించి రాజని అతని అల్లుడగు మీర్ఖాసీమును సింహాసనమెక్కించి అందుకు ప్రతిఫలముగా అతనివల్ల సైనిక వ్యయముక్రింద రెండులక్షల నవరసులును, బర్ద్వాను, మిడ్నపూరు, చిటగాంగు, జిల్లాలను పుచ్చుకొనిరి. అతని అధికారులను ధిక్కరించి దౌర్జన్యముచేసి కంపెనీసేవకులెల్లరు కంపెనీసరకులనేగాక తమ స్వంతసరకులకు గూడ పన్నులులేకుండా వ్యాపారలాభములు పొందుచుండి నందున అతని ఆదాయము తగ్గిపోయెను. మీర్జాఫరు ఇవ్వవలసిన బాకీని మీర్ఖాసీము చెల్లించుట కంగీకరింపవలసివచ్చెను.

ఇదిగాక కంపెనీవారు దక్షిణమునజేసిన యుద్ధఖర్చులకిౖంద 50 లక్షల రూపాయలిచ్చుటకితఁ డొడంబడెను. ఈసమయమున నితఁడు కంపెనీ నౌఖరులకు బహుమతులపేరున నిచ్చిన లంచములవిలువ 200269 పౌనులు. దీనిలో 58333 పౌనులు గవర్నరే పుచ్చుకొనెను.*

మీర్ఖాసి మెంతో కష్టపడి తానుచేసిన వాగ్దానముల నెల్ల రెండేండ్లలోనే చెల్లించెను.

## II

### అన్యాయపు వ్యాపారము : ప్రజాపీడనము.

మీర్ఖాసీము మీర్జాఫరుకన్న సమర్థుడగు పరిపాలకుడు. ఇతఁడు ప్రజల స్థితిని బాగుచేయ ప్రయత్నించెను. గాని సత్పరిపాలన జేయుటకీ మీర్ఖాసీమున కవకాశ మొవరిత్తురు ? కలకత్తాలో కంపెనీవారి కౌన్సిలులోని అధికసంఖ్యాకుల కితనిపై అనుమానము. మీర్జాఫరువలె నితఁడు తమ మాట వినుటలేదని కోపము. ఇందువలన తమ రహస్యలాభములు తగ్గుచున్నవని రోషము. ముఖ్యముగా నీ పెద్ద యధికారుల లాభము నిమిత్తము భారతీయ గుమాస్తాలు చేయుచుండిన వ్యాపారముపైన అతఁడు ఘాటీసుంకములు విధించుటవలన వీరికి కంటకమయ్యెను.

---

* ఈ మహాత్కార్యము గావించినందుకు కౌన్సిలు అధ్యక్షుఁడగు వాన్సిటార్టుకు 58333 పౌనులు తక్కిన సభ్యులలో హాల్వెలుకు 30937 పౌనులు గమ్నరుకు 28000 కెయివాడుకు 22916 యింకను చిల్లర యుద్యోగుల కితరమొత్తములను మీర్ఖాసీము లంచములుగానిచ్చెను.

గవర్నరు వెరెల్ష్టు ఈక్రిందిసంగతి బయలుపరచి యున్నాడు. 'సుంకములు చెల్లించకుండా రహస్యవ్యాపారము చాల జరుగు చుండెను దీనిలో చాల క్రూరకృత్యములు కూడా చేయబడు చుండెను. ఇంగ్లీషు ఏజెంట్లు గుమాస్తాలును ప్రజలను పీడించుటయే గాక తమ కాటంకము కలిగించిన నవాబుయొక్క అధికారులను ధిక్కరించుచు వారిని కట్టికొట్టుట కూడా చేయు చుండిరి. ఇదియే మీర్ఖాసీముతోడి యుద్ధమునకు ముఖ్య కారణము.'

ఈ సంగతులన్నియు సర్వసామాన్యముగ జరుగుచుండి నట్లు అప్పుడు చిన్న అధికారిగానుండిన వారన్ హేస్టింగ్సునాటి గవర్నరుకు 25-4-1762 తేదీన వ్రాసిన లేఖవలనకూడా తెలియుచున్నది. కంపెనీవారి జెండాతో పోవు నౌకరులకు సుంకములు లేని యవకాశముజూచికొని కంపెనీ నౌకరులెల్లరు తమస్వంతవ్యాపారము చేయ ప్రతిపడవపైనను ఆంగ్లేయ జెండాల నెగురవేయించుచు మోసములు చేయుచు సుంకము లివ్వక తప్పించుకొను చుండిరి. తెల్లవారు వచ్చుచున్నారని తెలిసినచో వారి బాధలు పడలేక పారిశ్రామికులు వర్తకులు పారిపోవుచుండిరి. అందువలన నాంగ్లేయులపైన ప్రజల కసహ్యభావముకూడా కలుగుచుండెనని వారన్ హేస్టింగ్సు తనలేఖలో వ్రాసెను.(India under Early British Rule-R. C. Dutt)

ఈఅన్యాయములనుగూర్చి వంగరాష్ట్రనవాబుమీర్ఖాసీం ఫిర్యాదుచేసెను. "ఉప్పు, పోకచెక్కలు, నెయ్యి, బియ్యము, గడ్డి, వెదుళ్లు, చేపలు, గోనెలు, అల్లము,పంచదార, పొగాకు,

నల్లమందు ఇంకననేక వస్తువులను ప్రతిపరగణాలోనుగ్రామము లోను, ఫ్యాక్టరీలోను కంపెనీ గుమాస్తాలు క్రయవిక్రియములు చేయుచున్నారు. రైతులను వర్తకులను దౌర్జన్యముచేసి వారి సరకులను నాలుగవవంతు ధరలకు బలవంతముగా గైకొను చున్నారు. తమ సరకులకు ఒకరూపాయి విలువచేయు వాని కైదురూపాయలు బలవంతముచేసి హింసించి పుచ్చుకొను చున్నారు. ప్రతిజిల్లాలోని అధికారులును తమవిధిని నెరవేర్పుట లేదు. అందువలన నాకురావలసిన ఆదాయము రాకుండ పోయి, సాలుకు 25 లక్షలరూపాయల నష్టము వచ్చుచున్నది. పరమేశ్వరానుగ్రహమున మన సంధిషరతులలో దేనిని నేను మీరలేదు. ఇట్టి స్థితిలో ఆంగ్లేయనాయకులు నా పరిపాలన మున కట్టుఏల భంగము గలిగించి నన్ను నష్టపరచుచున్నారు!" అని 1762 మే నెలలో మీర్ఖాసీమొక లేఖవ్రాసెను.

ఆనాటి పరిస్థితులనెల్ల సార్జెంటు బ్రిగోకూడా తన లేఖలో వెల్లడించియున్నాడు. "ఒక ఆంగ్లేయ పెద్ద మనుష్యుడు తన గుమాస్తా నేదో సరకు నమ్ముటకో కొను టకో పంపును. అంతట నీత డా వ్యవహారము కొఱకే యాసామినైనను బలవంతముచేయుటకు తన కధికారము గల దను ధీమాతో బయలుదేరును. ఆయాసామి దాని కంగీ కరింపనిచో నీగుమాస్తా ఆతనిని కొట్టి నిర్బంధించును. ఒక వేళ క్రియ విక్రియముల కత డంగీకరించినను అతని బాధలు తప్పవు. ఆ సరకులలో నితరు లెవ్వరు వ్యాపారము చేయకుండ బందోబస్తు జేయును. తమ ఆజ్ఞను మీరిన

వారిని హింసించి బాధింతురు. ఇక కొనుటలో తమ కిచ్చ వచ్చిన ధర కత డివ్వవలెను. అమ్మకటలోను అంతే. ఒక్కొక్కప్పు డేమియు నివ్వరు. నేను మందలించినచో పై యధికారులకు ఫిర్యాదుచేయుదురు. ప్రతిదినమునిట్టిప్రజాపీడనమును వంగరాష్ట్ర గుమాస్తాలుచేయుచున్నారు. ఈబాధలుపడలేక ఈజిల్లా (బేకర్ గంజి)లోనిజనులు లేచిపోవుచున్నారు. పూర్వము వస్తువులతో కలకలలాడు బజారు లిప్పుడు ఖాళీగానుండుట తటస్థించుచున్నది. ఈ గుమాస్తాల బంట్రోతులు ప్రజలను బలవంతపెట్టుట యధికముగానున్నది. జమీందారుదీనిని నివారించుటకు ప్రయత్నించినచో అతనినిగూడా దండించెదమని బెదరించుచున్నారు.

పూర్వము న్యాయవిచారణ బహిరంగముగా కచేరీలో జరుగుచుండెను. ఇప్పుడు ప్రతిగుమాస్తాయు ఒకన్యాయాధిపతియై అతనిబసయే ఒక కచేరీగానున్నది. వీరు జమీందారులకుకూడా శిక్షలు విధించుచున్నారు. తమ జవానులతో కలహించిరనియు లేదా ఏదో దొంగిలించిరనియు లేనిపోని నేరములుకల్పించి నష్టపరిహారముక్రింద వారిదగ్గఱనుండి సొమ్ము లాగుచున్నారు." (India under Early British Rule-R.C. Dutt)

విలియంబోల్ట్సు అనునొక ఆంగ్లేయువర్తకు డానాటి పరిస్థితు లింకను చిత్రముగా వర్ణించినాడు. "కంపెనీవారి నాటు వ్యాపారపద్ధతి చాలా అన్యాయముగానున్నది. ప్రతినేతగాడును పారిశ్రామికుడును దీనివలన బాధల నందుచున్నాడు. ప్రతి వస్తువుకు ఇజారా లేర్పరుపబడి ఎంతెంత సరకు ఏ పారిశ్రా

మికుడు తయారుచేసి ఒప్పగించవలెనో, ఎంతధర కివ్వవలెనో ఆంగ్లేయ దొరలును, వారి కోమటి దళారీలును, గుమాస్తాలును తమ చిత్తానుసారముగా నిర్ణయింతురు. ఆయా వస్తువుల తయారుచేయు పట్టణమునకు గుమాస్తా రాగానే అతడొక చోట విడిదిసేయును. అది తినకచ్చేరీయని వ్యవహారించును. తన జవానులను 'హర్కారాలను' ముందుగా పంపి దళారీలను పైకారులను నేతగాండ్రను పిలిపించును. తనయజమానులంపు సొమ్ముకు ప్రతిఫలముగా కొంతనిర్ణీతపు మొత్తము సరకును నిర్ణీత ధరకు నిర్ణీతగడవు లోపల నిచ్చునట్లు వారి చేత ఒడంబడిక పత్రములు వ్రాయించును. కొంత బయానా నిచ్చును. నేతగాని అంగీకారముతో నిమిత్తములేదు. సాధారణముగా గుమాస్తా బలవంతముగానే పత్రములు వ్రాయించును. ఆ సొమ్ము పుచ్చుకొనుటకు నేతగాండ్రంగీకరించనిచో సొమ్ము నడుముకుగట్టి కొట్టి పంపివేయుట సర్వసాధారణముగా జరుపబడుచర్య. ఈ నేతగాండ్రలో చాలమంది పేళ్ళను గుమాస్తా తన రిజిష్టరు పుస్తకములలో నమోదుచేసి యితరులెవ్వరికిని పనిచేయకుండ నిరోధించును. ఇది నవీనబానిసత్వముగా పరిణమించును. గుమాస్తాలు తమ రిజిస్టర్లలోని పేళ్ళ నింకొక గుమాస్తా లెక్కలలోనికిఎక్కించుచు నీదాస్యమును శాశ్వతముగా అమలులోనుంతురు. దీనిలోజరుగు అన్యాయములకు మోసములకు లెక్కలేదు. దీని నష్టములెల్లను అనుభవించువారు నేతగాండ్రే. ఈ గుమాస్తాలను వస్త్రవాణిగాండ్రను ఏకమై ఆ సరకులు బజారు విలువకన్న నూటికి 15 మొదలు

40 వంతులుకు తక్కువ ధరలు నిర్ణయింతురు. ఈ యన్యాయపు ముచ్చిలకా ఒడంబడికలప్రకారము జరుపలేని నేతగాండ్రనుభవించు బాధలు వర్ణనాతీతములు. వారి సామగ్రిని జప్తు జేసి సామానులెల్ల బాకీక్రింద బలవంతముగా అచ్చటనే వేలము వేసి అమ్మించివేయుచుండిరి. పచ్చిపట్టునుతీయువారికిగూడ ఈగతియే పట్టుచుండెను. ఈబాధలు పడలేక పట్టుతీయుడని నిర్బంధము లేకుండా వారు తమ బొట్టనవ్రేళ్ళను నరికివేసుకొనిన ఉదాహరణము లనేకములు గలవు."

ఈ ఘోర పరిస్థితులవలన వంగరాష్ట్రములోని వ్యవసాయముగూడా పాడైపోయినది. రైతులు సాధారణముగా భూస్వాములుగను పారిశ్రామికులుగను ఉండిరి. ఆంగ్లేయ గుమాస్తాలు పెట్టు బాధలవలన వీరు తమ పొలములు బాగు చేసికొనలేక శిస్తు లిచ్చుకొనలేక రివిన్యూ అధికారుల కోపమునకు అన్యాయములకు పాత్రులై బాధలుపడుచు పొలముల నమ్ముకొని పోవుచుండిరి. నవాబుచేసిన ఫిర్యాదుల నాలించి ఆనాటి గవర్నరగు వాన్సిటార్టు, వారన్ హేస్టింగ్సు లీయన్యాయములు బాపుటకు కొంత ప్రయత్నించిరి గాని లాభము లేక పోయినది. తక్కిన అధికారులు కేవలము స్వార్థపరులై వీరిమాటలు పెడచెవినిబెట్టిరి. అంతట మీనవాబు ధైర్యము వహించి దీనికి ప్రతిక్రియగా ఆంగ్లేయులతో పాటు తన ప్రజలు స్వేచ్ఛగా వ్యాపారము చేసికొనుటకు దేశములోని నాటు వర్తకముపైన సుంకము లసలే తీసివేయుటకు నిశ్చయించెను. అంతట నీ తెల్లదొర లిది యన్యాయమని హాహాకారములుసలిపి

తమ లాభము పోవునని ఆగ్రహపరవశులైరి. అంతట నీకలహమును కారణముగా గైకొని మీర్‌ఖాసీముపైన యుద్ధము ప్రకటింపజేసిరి. 'స్వార్థపరత్వము న్యాయధర్మములను సిగ్గు, బిడియములను కూడా నాశనము చేయగలదనుట కీ కంపెనీ నౌకరుల ప్రవర్తనమే తార్కాణము' అని జేమ్సుమిల్లు తన చరిత్రలో వ్రాసినాడు. ఈ యుద్ధములో మీర్‌ఖాసీమున కపజయము కలిగెను. అంతట నతడు విషాదముతోను, రోషముతోను పాట్నాలో ఆంగ్లేయ నిర్బంధితులను వధింపజేసి రాజ్యము విడచిపోయెను. అంతట పూర్వము కంపెనీ వారే త్రోసిరాజనిన కీలుబొమ్మయగు మీర్జాఫరును మరలతఖ్తుపై నెక్కించిరిగాని ఆతడు కొద్దిరోజులలోనే చనిపోయెను. అంతట నతని జారజుడగు నాజిముద్దౌలాను 1765 లో నవాబుగా ప్రకటించిరి. ఈ సమయములో కంపెనీవారు బహుమతుల రూపమున మీర్జాఫరువలన 500166 పౌనులు, అతని జారజ పుత్రునివలన 230356 పౌనులుపుచ్చుకొనిరి. ఇదిగాక 3770833 పౌనులు 'ముజరా' (Restitution) లక్రింద గ్రహించిరి. ఈ నవాబులవలన కంపెనీవారు పుచ్చుకొనిన రాజ్యభాగములపైన వచ్చుచున్న ఆదాయము లీ మొత్తములో చేరని అదనపు ధనము కలదు. ఇదిగాక ఆ సంధిషరతుల ప్రకారమే కంపెనీ వారికి సబ్సిడీల క్రిందనిచ్చుట కంగీకరించిన సొమ్ము ప్రత్యేకముగా నిర్ణయింపబడియే యుండెను.

11

## III

## క్లైవుయొక్క రెండవపరిపాలననాటి స్థితి

ఆంగ్లేయ వర్తక కంపెనీ నౌకరులు భారతదేశమున జరుపుచున్న ఘోరఅన్యాయములు మితిమీరగా నింగ్లాండుకు ఫిర్యాదులు కొల్లలుగా పంపబడగా, ఎట్టకేలకు కంపెనీ డైరక్టర్లు మేల్కాంచి అప్పటికి చాలసొమ్ము గడించుకొని హాయిగా కూర్చుండిన క్లైవును మరల నిండియాకుపోయి ఆ దురాచారములను మాన్పు మని కోరిరి. నవాబులతో పూర్వము చేసికొనిన సంధిషరతులకును తరువాత నీతనితో బలవంతముగా చేసికొనినసంధికిని గూడ భంగకరముగా తమ యుద్యోగులు స్వంతవ్యాపారము జేసికొనుట యన్యాయమని యీ డైరక్టర్లకుకూడా తోచినది. ఆనాడు వంగరాష్ట్రమున జరుగుచుండిన అన్యాయములు క్లైవుకుకూడా రోత కలిగించు నంత ఘోరముగనుండెను. అతడు వ్రాసినలేఖలనుబట్టి యిది బయల్పడినది. ఒక్క వంగరాష్ట్రమునతప్ప యిక నే యితర దేశములోకూడ ఇట్టి అరాజకము, కల్లోలము, లంచగొండి తనము, కుళ్ళు, బలాత్కారఅపహరణము కనివిని యెఱుగము. ఇంత దౌర్జన్యముగను, దోపిడిగను, ఇంతమంది యింతటిసంపద లార్జించుకొనుటయు నెక్కడను జరుగలేదు. వంగరాష్ట్రము, బీహారు, ఒరిస్సాలవలన సాలుకు 30 లక్షల పౌనులు నికరాదాయము (3 కోట్ల రూపాయలు) వచ్చుచుండెను.

ఈ సుబాను మీర్జాఫరుకు మరల నిచ్చినప్పటినుండి యీ రాజ్యము కంపెనీవారి మేనేజిమెంటుక్రిందనే యుండెను.

నవాబు మొదలు చిన్న జమీందారువరకు అందరివలన నీ కంపెనీ అధికారులు సివిలు మిలిటరీశాఖలవారు లెక్కలేనంతసొమ్ము లాగికొనుచుండిరి.

"ఈ ప్రాంతములందు దళారీ వర్తకులే వ్యాపారము చేయుట ప్రారంభించినారు. వీరు కంపెనీ యుద్యోగుల గుమాస్తాలుగా వ్యవహరించుచు, వారి యధికారములను పురస్కరించుకొని వారి పేరున అనేకములగు అక్రమపు చర్యలు జరిగించుట మొదలిడిరి. దీనివలన హిందువులకు మహమ్మదీయులకుగూడ ఆంగ్లేయులపైన రోత కలిగినది. నవాబు తన దేశాదాయమును వసూలుచేసికొనుటకే కంపెనీ యుద్యోగులు పెక్కు ఆటంకములు కలిగింపసాగిరి. తమ కిచ్చవచ్చినట్లు నవాబు క్రింది యుద్యోగులను నియమించుటకును తొలగించుటకును తమ ప్రాపకమును పలుకుబడిని వినియోగించుచుండిరి. (Malcolm —Life of Clive) ఈ యన్యాయములనుగూర్చి క్లైవు మరల వ్రాసి వీనిని తొలగించుటకు కొన్ని సూచనలనుకూడా చేసినాడు. ఇది చాలా సుప్రసిద్ధమైన లిఖితాధారము.

"నేనిక్కడికిరాగానే యిచ్చట మీ వ్యవహారములు చాల దుస్థితిలోనుండుటను పొడగాంచితిని. కేవలము స్వార్థచింతతోనే ప్రవర్తించువారుగాక ఏమాత్రమైన ఆత్మగౌరవముగాని తమ యజమానులపట్ల బాధ్యతగాని కలవారి కీ పరిస్థితులు చాల భయంకరముగ గనబడితీరును. చాలమందికి ఎట్టి కష్టమును పడకుండగనే ఎట్లువచ్చినది తెలియకుండగనే ఆకస్మికముగా ఐశ్వర్యము కలుగుచుండుటవలన లేనిపోని సుకుమారము బలిసి

అనేక రూపములగు అనవసరపు ఖర్చులు అత్యధిక వ్యయములు
ప్రబలినవి. రాజధానిలో ప్రతిశాఖలోని ఆంగ్లేయోద్యోగు
లెల్లరికి నీ దురభ్యాసము లధికములైనవి. పెద్దయధికారులతో
పాటు తాముకూడా సొమ్ము విచ్చలవిడిగా ఖర్చుచేయుట వలన
తమకు అధిక గౌరవము కలుగునని చిన్నవారు తలంచు
చుండిరి. అందువలన దూబరా ఖర్చులు చేయుటయే యొక
వ్యసనముగ పరిణమించెను. అందుకొరకు కావలసిన ధన
మేదోవిధముగ సంపాదింపవలెనుగదా! ఇట్టి స్థితిలో తమ చేతు
లలోగల అధికారము నిందుకొరకు దురుపయోగము జేసి
సామాన్య లంచగొండితనమువలన కావలసినసొమ్ము లభించ
నిచో ప్రజాపీడనకు దిగుటలోను నాశ్చర్యమేమికలదు ? పైవా
రినిజూచి క్రిందివారు, వీరినిజూచి చిల్లర సేవకులుగూడ నీ దురా
చారములందు దిగుట సహజపరిణామము. ఈయన్యాయ విధా
నము దేశములోని సివిలు మిలిటరీ శాఖలందలి యుద్యోగులం
దరియందును సామాన్య గుమాస్తాలయందును వర్తకులందును
ప్రాకిపోయినది. (Quoted by R. C. Dutt—India under
Early British Rule)కంపెనీయుద్యోగులయధికారమును పుర
స్కరించుకొని ఐరోపాజాతి ఏజెంట్లు ప్రారంభించిన ప్రజాపీడనము,
హింసలు, అసంఖ్యాకులగు నల్లగుమాస్తాలు ఏజెంట్లు సబ్ ఏజంట్లు
కలిసిచేయు ఘోరములు, ఈ దేశములోని ఆంగ్లేయులకు చాలచెడ్డ
పేరు తెచ్చుచున్నది. ఈదురాచారముల నంత మొందించుటకు
దివానీగిరీవలన త్వరలోనే మార్గ మేర్పడగలదని సంతసించు
చున్నాను. ఈ దివానీగిరీ యనగా వంగరాష్ట్రము బీహారు

ఒరిస్సా పరగణాలలోని భూములపైనను వాని శిస్తు వసూలు పైనను తనిఖీ అధికారము. మన సైన్యము ధనము మొగలు చక్రవర్తికి సహాయపడినందుకు ప్రతిఫలముగా నతఁడీ యధికారమును మన కిచ్చుట కంగీకరించినాఁడు. ఈ వ్యవహారము అతి జాగ్రత్తతో నిర్వహింపబడినది. ఈ దేశముల ఆదాయములనుండి నవాబుయొక్క అధికారము, గౌరవము నిలువబెట్టి యుంచుటకు గావలసిన (అలవెన్సు) సొమ్మును మొగలు చక్రవర్తి కివ్వవలసిన కప్పమును సక్రమముగా చెల్లింపవలెను. మిగిలినది మన కంపెనీకి చెందును. ఈయధికార ప్రాప్తివలన బర్ద్వాను మొదలగు ప్రాతజాగీరులపైన కలిసి తమ రివిన్యూ ఆదాయము సాలుకు 250 లక్షల సిక్కా రూపాయిలకు తక్కువయుండదు. ఇకముం దింకను ఇరువది ముప్పది లక్ష లధికము కాగలదు. మాసివిలు మిలిటరీవ్యయము లన్నియుకలసి సామాన్యముగా సాలుకు 60 లక్షలరూపాయిలు దాటవు. నవాబు కివ్వనలసినసొమ్ము ఇప్పుడు 42 లక్షలకు తగ్గించివేయబడినది. చక్రవర్తికి కప్పముక్రింద సాలుకు 26 లక్షలు పోగా మనకు ప్రతిసాలున 122 లక్షల రూపాయిలు నికరలాభము మిగులుచుండును." అని క్లైవు డైరక్టరులకు వ్రాసినాడు. ఇదియంతయు 1765 సెప్టెంబరు 30వ తేదీన వ్రాసిన లేఖలోకలదు. కంపెనీ నౌకరుల జీతములు హెచ్చుచేసి స్వంతవ్యాపారమును నిషేధింపవలెనని క్లైవు సలహా యిచ్చినాడు.

## IV

## క్లైవు తరువాత స్థితిగతులు

1769 లో క్లైవు కడపటిసారి మన దేశము వదలి పోయెను. వంగరాష్ట్రముయొక్క సత్పరిపాలనను గూర్చినచింత క్లైవు కెన్నడునులేదు. నవాబుయొక్కయు అతని ప్రజలయొక్కయు బలహీనతను పురస్కరించుకొని కంపెనీవారి రాజకీయాధిపత్యము నేదోవిధముగా నిలువబెట్టవలెనని యే అతని యూహ. క్లైవున కేకోశమునను నీతి నియమము లనునవి లేవు. ఒకవంక కంపెనీసేవకులలో లంచగొండితనము మాన్పవలెననియు వారి జీతములు హెచ్చింపవలెననియుసీమకువ్రాయుచు 1765 వ సంవత్సరము సెప్టెంబరు 15 వ తేదీననే ఉప్పు, పోకచెక్కలు, పొగాకులో స్వంతలాభము కొఱకు నాటువ్యాపారము చేయుటకు కొందఱు కంపెనీ సేవకులతో తాను భాగస్వామిగానొక వ్యాపార కాగితము వ్రాయుటయే గాక, ఈ భాగస్వాములను కంపెనీ డైరెక్టరు లంగీకరింపక పోయినను, వంగరాష్ట్ర కౌన్సిలు అధ్యక్షుడుగా తా నీ వ్యాపారమును స్వేచ్ఛగా జరపనిచ్చెదనని అందులో నొక మరతుగూడా చేర్చెను. తరువాత దీనినిగూర్చి అతనిపైన నేరము మోపగా తనను నమ్మికొని వంగరాష్ట్రమునకు వచ్చిన స్నేహితుల లాభముకొఱకు తా నిట్లు చేసితినని తప్పించుకొనజూచెను. ఈ వ్యవహారము సిగ్గు బిడియములేని అన్యాయపు పనియని మిల్లు తన చరిత్రలో వ్రాసినాడు.

క్లైవు వెళ్ళిపోయిన పిదప నైదు సంవత్సరములలో కంపెనీయుద్యోగు లెప్పటివలెనే యన్యాయ విత్తసమార్జనము చేయుచునే యుండిరి. ప్రజలను వంగరాష్ట్ర నవాబును పీడించి పీకికొని తినుచుండిరి. ప్రాతపద్ధతులతోనే స్వంతవ్యాపారము చేయుచు ప్రజలను బాధించుచుండిరి. ఆనాటి ఘోరపరిస్థితులనుగూర్చి కంపెనీ యుద్యోగియగు విలియం బోల్ట్సు అనునతడు 1772 లో తన గ్రంథములో వర్ణించియున్నాడు. * అతడు వర్ణించిన సంగతులు నిజములేయని ప్రొఫెసర్ మ్యూర్ అంగీకరించియున్నాడు. దేశీయపారిశ్రామికులపైనను పనివారిపైనను వర్ణనాతీతములగు క్రూరకృత్యములుచేయబడుచుండెను. వీరు కంపెనీవారికి కేవలముబానిసలుగా చేయబడిరి. కంపెనీఏజంట్లు గుమాస్తాలు వీరిని చిత్రహింసలకు పాల్పరచి పీడించుచుండిరి. జుల్మానాలువిధించుట,కొట్టుట, బలవంతముగా ముచ్చిలకాలు వ్రాయించుట, ఖైదుచేసి నిర్బంధించుట, మున్నగు క్రూర కృత్యములవలన నేతగాండ్రు వృత్తులు మానుకొని పోయిరి. వస్తువుల ఉత్పత్తి క్షీణించినది. సరకులే కరవులైనవి. ఆదాయము తగ్గినది. కంపెనీవారి యిజారాను పురస్కరించుకొని పెద్దయధికారులు కంపెనీవారికి తమకు తమ వారికి వీలైనంత లాభకరముగా నీవ్యాపారము జరుపుచున్నారు. ఈ అన్యాయములు బయల్పరుపబడకుండా నోళ్లను

---

*Considerations on Indian affairs—William Bolts.
The making of British India. —Muir.

కట్టుటకు కొందఱు విదేశకంపెనీవారికి మాత్రము కొంత సదుపాయము చేయబడుచున్నది. ఇట్లు దేశములోని పరిశ్రమలను, వాణిజ్యమును కంపెనీ సేవకులు నాశనముచేసి దౌర్జన్యముతోను, ప్రజాపీడనముతోనుతమయిజారాను నిలుపుకొనిరి. కంపెనీవారు దేశమునుండి తరలించుకొని వెళ్ళిన సొమ్ములోనింకొక భాగము వారి స్వాధీనములోనుండిన రాజ్యభాగములపైనవచ్చు శిస్తు ఆదాయము. వంగరాష్ట్రమునకు కొంతకాలము గవర్నరుగానుండిన వెరెల్స్టుగారిట్లు చెప్పినారు.

"బర్డ్వాను మిడ్నపూరు జిల్లాలయొక్క భూములను వారి పరిపాలనాధికారమునుగూడ మీర్ఖాసీము కంపెనీవారికి 1760లోనే యిచ్చియుండెను. పాత ప్రభుత్వములోనుండిన లోపములు పోవలేదు సరికదా ఘోరమైన క్రొత్తపద్ధతులు స్థాపింపబడెను. ఆ భూముల సాగుహక్కును 3 సంవత్సరముల యిజారాగా వేలముపాట పాడిరి. ఎట్టి ఆస్తిగాని మర్యాదగాని లేనివారు కొందఱు పాటపెట్టసాగిరి. ఆ భూముల నిదివరకు సేద్యముచేయుచుండిన రైతులు వానిని వదలుట కిష్టములేక ఈ పోటీలో తలకుమాలిన పాటలుపెట్టిరి. పంటతో సహా స్వాధీనపరచుకొనవచ్చునను నాసతో పైనజెప్పిన దశారీలింకను పెద్దపాటలు పెట్టిరి. ఈ అన్యాయపు పోటీ ఫలితముగా నక్షత్రకులవంటి రాక్షసులు బయలుదేరి ప్రజలను పీడించి సొమ్ము వసూలు చేయసాగిరి." (View of the Rise of the English Government in Bengal—H. Verelst)

ఇట్లు 1765—1771 మధ్య కంపెనీవారి సివిలు మిలిటరీ ఖర్చులన్నియుపోను ఇంగ్లాండుకంపెనీ శిస్తు ఆదాయము బాపతు సొమ్ము 40 లక్షలపౌను (4కోట్ల రూపాయ)లుండెను. అసలు వసూలుచేసిన సొమ్ము 130 లక్షల పౌనులు. (11 కోట్ల ముప్పదిలక్షల రూపాయలు)

పైనజెప్పిన సివిలు మిలిటరీ ఖర్చులుగూడ జీతముల రూపముగానేమి, ఇతర రూపముగానేమి ఇంగ్లాండునకే తరలినవి.

తూర్పుఇండియా కంపెనీ వ్యవహారములనుగూర్చి విచారణచేయుటకు పార్లమెంటు కామన్సుసభవారేర్పరచిన కమిటీ నివేదికలో ధర్మాత్ముడగు బర్కుగారు ఈ అన్యాయముల నెల్ల బహిరంగపరచియున్నాడు. ప్రజలవలన శిస్తు వసూలుచేయు అధికారమును పురస్కరించుకొని చేయబడు యీ క్రొత్తరకపు వ్యాపారము పద్ధతి యొక్క సహజమైన అనర్థకములు త్వరలోనే కనబడసాగెను. వంగరాష్ట్రములోని నేటివులు (భారతీయులు)ను అచ్చట వ్యాపారము చేయు విదేశీయులునుగూడ ఈ యన్యాయములనుగూర్చి మొరపెట్టసాగిరి. దేశముయొక్క వ్యాపార విధానము నంతటికి నిది వేరుపురుగయ్యెను. నేటివుల బాధలు మాన్పుట కెవ్వరును ప్రయత్నింపలేదు. దీనివలన విదేశీయులకు కలుగుచుండిన నష్టము విషయములోమాత్రము వారితో కొన్ని ఏర్పాటులు చేసికొనుట యవసరమని వంగరాష్ట్ర రాజధానిలోని కంపెనీ యధికారులు సీమలోని కంపెనీ డైరక్టర్లకు

స్పష్టముగా వ్రాసిరి. ఈవిదేశీయులనుగూడ కొంతవరకు పెట్టు బళ్ళు పెట్టుకొని వ్యాపారము చేసికొననీయవలెననియు లేనిచో వారికివచ్చుచున్న నష్టములవలన ఫ్రెంచివారితో కలహము రాకతప్పదనియు వ్రాసిరి." (చూడు: 9 వరిపోర్టు; బర్కుగారి సంపూర్ణరచనలు. 3వ వాల్యూము.)

1770 లో ఘోరమైనక్షామమువచ్చి వంగరాష్ట్రమును నాశనముచేసిననుగూడ కనికరములేకుండ కంపెనీవారి పెట్టు బడిపైన రావలసిన లాభము ఏదోవిధముగా వసూలు చేయ బడెను. ఈవసూలు మొత్తము క్రమక్రమముగా హెచ్చింప బడుచుండెను. మొదటి రోజులలో చేసిన కొన్ని ఋణములు తీర్చబడి, కంట్రాక్టరులకు పారిశ్రామికులకు బయానాలివ్వబడుచు భూముల రివిన్యూ ఆదాయము సొమ్ముతోను, ఐరోపా దేశపు సరకుల విలువ సొమ్ముతోను, యిజారాల ఫలితపు సొమ్ము తోను, 1776 - 1780 మధ్య వంగరాష్ట్రమున కొని తీసుకుని వెళ్ళిన సరకుల విలువ పదిలక్షల పౌనులకన్న తక్కువగాకుండా నుండెను! ఈ పదిలక్షల పౌనులకు భారతదేశమున కే ప్రతి ఫలమునులేదు. ప్రపంచములోని అన్ని దేశముల ఆదాయము వ్యాపారమువలననే వచ్చుచుండగా నీ దేశములో వ్యాపార లాభము రివిన్యూవలన రాబట్టబడుచుండెను! ఆనాటి దుష్పరి పాలనను గూర్చి మెకాలే యిట్లువర్ణించినాడు. "మూడుకోట్ల మానవులు ఘోరదుస్థితిలో మునిగిపోయిరి. వీరు నిరంకుశ రాజుల పరిపాలనక్రింద నుండుట కలవాటుపడినవారేగాని యిట్టి నిరంకుశ ఘోరపరిపాలన మెన్నడును వీరెరుగరు. పూర్వపు

నిరంకుశత్వము, నాగరకతయొక్క బలమునుగల ఈక్రొత్త ప్రభుత్వము వీరిని పీడించుచుండెను."

1770 లో బంగాళారాష్ట్రమున నొక ఘోరక్షామము వచ్చెను. ఈ కఱవు వచ్చుటకు కంపెనీవారే కొంతవరకు బాధ్యులు. 1768 లోనే బంగాళారాష్ట్రమున వరిపంట కెల్ల నష్టమై పోయెనుగాని పన్నుల వసూలు నిలుపబడలేదు. ధరలు విపరీతముగా హెచ్చెను. రైతులకు విత్తనములు గూడా మిగుల లేదు. కాని 1769లో బంగాళములోని ధాన్యమంతయు నితర చోట్ల కెగుమతి చేయబడెను. మద్రాసుమొదలగు స్థలముల వేరగాండ్లువచ్చి కొనివేసిరి. దీనివలన దేశమునకు కీడుమూడు నని కంపెనీవారెఱిగియు ఏమియు చర్యగైకొనలేదు. 1769 లో అతివృష్టివలన పండిన కొంచెముపంటకూడా పోయెను. సీమకు వాసినఉత్తరములలోనీదుస్థితినిగూర్చియెవ్వడువ్రాయడయ్యెను. 1770 జనవరిలోమాత్రమొక చిన్నవాక్యములో - ఒక జిల్లాలో తిండిలేక ప్రజలు బాధపడుచున్నారనియు, అయినను రివిన్యూకు ఫరవాలేదనియు వ్రాసిరి. పన్నుల వసూలేకాని ప్రజల ప్రాణ రక్షణ తమపని కాదని వీరియూహ! ప్రతిగోజున వేలకొలది శవములీ ఇంగ్లీషు పరిపాలకుల యిండ్లదగ్గఱకు కొట్టుకొని వచ్చుచుండెను. కలకత్తావీధులు శవములతోను చచ్చువారి తోను నిండియుండెను. వంగరాష్ట్ర జనసంఖ్యలో మూడింట రెండు వంతులు అనగా నొకకోటిమంది యీక్షామమున మరణించిరి. (ఇంపీరియల్ గెజెటీరు 2 వ వాల్యూము 480 పుట

పూర్వపురాజు లిట్టిసమయములందు పన్నుల వసూళ్ళ నాపి రైతులకు సొమ్ము అడ్వాన్సులిచ్చి కాపాడుచుండిరి. కరవులందు ప్రజలనురక్షించుచుండిరి. పైనజెప్పిన ఘోరక్షామమున ప్రజలను కాపాడుటకైనను కంపెనీవారు తగిన శ్రద్ధగైకొనలేదు. ధాన్యము ఎగుమతి మాత్రము నిలుపుదలజేసిరి.*

## మూడవ ప్రకరణము

# వారన్ హేస్టింగ్సు ఘనకార్యములు

## I

## రాజకీయ సంస్కరణలు

వారన్ హేస్టింగ్సు 1772 లో గవర్నరయ్యెను. ఈతడు నేటి పరిపాలనా పద్ధతికి మూలపురుషుడని చెప్పవచ్చును. నవాబునకు 16 లక్షలిచ్చి బంగాళమును ఆంగ్లరాజ్యముక్రిందికి తెచ్చి తానే ప్రభుత్వము వహించెను. వారన్ హేస్టింగ్సు ప్రెసిడెంటుగా కౌన్సిలుతో కలసి 1773 లో రాజ్యాంగసంస్కరణలపేరున దేశములో పూర్వకాలమునుండి అమలుజరగుచుండిన దేశీయపద్ధతులను రూపుమాపెను. బంగాళమును కొన్ని

---

*కొందఱు జమీందారులు ప్రజలపట్ల కొంచెము దయదలపగా పన్నుల వసూలులో అశ్రద్ధ చేసిరని కంపెనీవారనేకుల నుద్యోగములనుండి తొలగించిరి. కరవులో మాడుచున్న వారికిచ్చుటకు మంజూరు చేయబడిన స్వల్పపుధాన్యము కంపెనీ యుద్యోగులు హరించి దొంగ లెఖ్ఖలు వ్రాసి స్వంతవ్యాపారము సాగించిరి. ఈ ఘోరాన్యాయము సీమవారికి గూడ తెలిసెను. తెల్లదొరలు నల్లవారిపైన నీ నింద వేయుటకు ప్రయత్నించిరి. నిజమైన వారిపేర్లు మాత్రము బయటకు రాలేదు!

జిల్లాలుగ విభజించి పన్నులవసూలుకొఱకు ప్రాత దేశీయోద్యోగులను తొలగించి జిల్లా కొక కలెక్టరును, నలుగురైదుగురు కలెక్టరులపైన ఒక కమీషనరును నియమించెను. వీరందరిపైన కలకత్తాలో రెవిన్యూ బోర్డు నేర్పరచెను. కలెక్టరులు జిల్లాలలో పన్నుల వసూలు హక్కు వేలము వేయుదురు. అంతే కాని తామే వసూలు చేయకూడదు. ఏలననగా ఆనాటి కలెక్టరులు విశేషముగా లాభములు పొందుచుండిరి. ఈయిజారాదారులు 'దివాను'లనబడి తరువాత జమీందారులైరి. సివిలు కేసులను విచారించుటకు ప్రాతన్యాయాధికారులను పంచాయితీలను తీసివేసి కలెక్టరులే నియమింపబడిరి. ఈ క్రిందికోర్టుల నుండి రివిన్యూ అప్పీళ్లను పరిష్కరించుటకు సదర్ దివానీ అదాలత్ అను కోర్టును, క్రిమినల్ వ్యవహారములను పరిష్కరించుటకు సదర్ నిజామత్ అదాలత్ అను రెండు ఉన్నత న్యాయస్థానములు స్థాపింపబడెను. పండితులును, ఖాజీలును ఈ ఇంగ్లీషు జడ్జీలకు సహాయము జేయుచుండిరి. కాని అమలు జరుపబడు ధర్మములన్నియు ఆంగ్లశాస్త్రధర్మములే. ఇది బాగా లేదని హేస్టింగ్సుఎరిగియు, న్యాయవిచారణాధికారము దేశీయ ప్రభువుల చేతులలోనుంచినచో వారి అధికారమునకును కంపెనీ యధికారమునకును ఘర్షణవచ్చునని తానిట్లు చేసితినని అతడే చెప్పినాడు.

1774 నాటికి బంగాళము, బీహారు, ఒరిస్సా, ఉత్తర ర్కారులు, చెన్నపట్టణము, బొంబాయి ఇంగ్లీషుపరగణాలుగా

నుండెను. ఈ రాజ్యము విస్తీర్ణమునందు జనసంఖ్యయందు ఇంగ్లాండును మించెను. ఆదాయము 3½ కోట్ల రూపాయిలు.

ఆంగ్లపార్లిమెంటుచేసిన రెగ్యులేటింగు చట్టము ప్రకారము వారన్ హేస్టింగ్సు 1774లో మొదటి గవర్నరుజనరలై 1785 వరకును పరిపాలించెను. బుద్ధిసూక్ష్మతయందు వారన్ హేస్టింగ్సును మించిన ఆంగ్లేయుడు లేడని చెప్పవచ్చును. నిరంకుశ పరిపాలనము చేయుటలో, మిత్రభేదము చేయుటలో, ధనము సంపాదించుటలో నితనిని మించినవారు లేరు. భారత దేశ భాగ్యభోగ్యములను హరించి బ్రిటీషు ప్రజలకు లాభము కల్గించు మార్గములనెల్ల ఇతడు స్థాపించెను. నాటి గవర్నరు జనరలు ఇంగ్లీషుపార్లమెంటునేగాక ఇంగ్లాండులో తూర్పుఇండియా వర్తక సంఘమువారినిగూడా సంతృప్తి పరుపవలసి యుండెను. కంపెనీవారికి అమితలాభము కలిగించుట కిచ్చట నిరంకుశ పరిపాలనము చేయవలసియుండెను. భారత దేశము పరిపాలనమున వారన్ హేస్టింగ్సు ఎన్నో అన్యాయములను గావించెనని భారత దేశ ప్రజలను బాధించెనని పార్లమెంటులో నితనిపైన నేరము మోపబడిన సందర్భమున తూర్పు ఇండియా వర్తకసంఘము వారి దుష్టపరిపాలనమును అందువలన భారతీయులు పొందుచుండిన బాధలును బయల్పరుపబడెను.

## II

## కుటిల రాజ్యనీతి

కంపెనీ ఖజానాను నిండించుటకు వారన్ హేస్టింగ్సు అనేక ఘోరకృత్యములుచేసెను. వంగరాష్ట్ర నవాబుయొక్క

అధికారములు తొలగించునప్పుడు క్లైవు వాతనికి సాలుకు 53 లక్షలిచ్చెదనని వాగ్దానముచేసియుండెను. క్రొత్తనవాబు తక్తునెక్కినప్పుడు క్లైవు ఆ మొత్తమును 41 లక్షల రూపాయలకు తగ్గించెను. మూడవనవాబు కాలములో నీ అలవెన్సు సాలుకు 32 లక్షలకు తగ్గింపబడెను. వారన్ హేస్టింగ్సుకాలమున నీ సింహాసనమునకు వచ్చిన నాలుగవ నవాబు చంటిపిల్లవాడు. అంతట హేస్టింగ్సు ఆయసహాయుని అలవెన్సును సాలుకు 16 లక్షలకు తగ్గించివేసెను. వారన్ హేస్టింగ్సు అలహాబాదు కోరా పరగణాలను అయోధ్య నవాబుకు విక్రయించి 50 లక్షల రూపాయిలు పుచ్చుకొనెను. వంగరాష్ట్రమును దివానీగా నిచ్చినప్పుడు ఢిల్లీచక్రవర్తితో చేసికొనిన సంధిపత్రము దాఖలా ప్రతియేట నతనికి చెల్లించవలసిన 26 లక్షల రూపాయిల కప్పమును తీసివేసెను. చక్రవర్తి అసహాయుడైనందున ఏమిచేయగలడు ? అందువలన వాగ్దానభంగము చేయుటకు వారన్ హేస్టింగ్సు వెనుదీయలేదు. ఈ యన్యాయములన్నియు చూడగా భారతీయుల కింగ్లీషువారి ధర్మముపైన రోతకలిగెను. కాని హేస్టింగ్సుచేసినదురంతము ఇంతటితో ఆగలేదు. ధనము పుచ్చుకొని రోహిలాను దోపిడిదొంగల కప్పగించివేయుట, నందకుమారు నన్యాయముగ నురిదీయుట, అయోధ్య రాజుల పట్ల ద్రోహముచేయుట, యింకను తరువాయిగానేయుండెను. అవిగూడచేసి యితడు పుణ్యము గట్టుకొన్నాడు.

రోహిలఖండము సుభిక్షమైన దేశము. ఈ రాజ్యము

నాక్రమింపవలెనని అయోధ్యనవాబు సుజాఉద్దౌలా యాశ. గాని 80 వేల రోహిలా శూరులనుజూచి భయపడెను. ఇట్టి స్థితిలో నింగ్లీషు సైన్యమును వారన్ హేస్టింగ్సు సుజాఉద్దౌలా కిచ్చి అతనివల్ల 4 లక్షల నవరసులు పుచ్చుకొనెను. దీనితో తన సైన్యమునుజేర్చి నవాబు రోహిలఖండమును దోచి, ప్రజలను హింసించి, ఇండ్లు తగులబెట్టి, యా దేశమును నాశనముజేసెను. ఇట్టి చర్యలవలన హేస్టింగ్సు రెండు సంవత్సరములలో పదిలక్షల నవరసుల రొక్కమును కంపెనీకి జేర్చుటయేగాక సాలు ఆదాయమును 450000 నవరసులకు పెంచెను. ఇదిగాక ప్రతిసాలున వంగరాష్ట్రరక్షణకు ఖర్చుపెట్టవలసిన 250000 నవరసులను అతడు పొదుపుచేసెను.

నందకుమారుడు ధనవంతుడు, తెలివైనవాడు, గౌరవ కుటుంబమునకు జెందిన బ్రాహ్మణుడు. వారన్ హేస్టింగ్సు మూడేండ్లలో 40లక్షల రూపాయలు లంచములు పుచ్చుకుని ఘోరఅన్యాయములు చేసెనని యితడు కౌన్సిలువారికొక అర్జీ నిచ్చి అతనిపైన నేరారోపణ గావించెను. తన కౌన్సిలుకు హేస్టింగ్సు జవాబుచెప్పలేకపోయెను. ఇక నీ బ్రాహ్మణుడు బ్రతికియున్నచో తనకొంప మునుగునని భయపడి హేస్టింగ్సు అతనిని నాశనముచేయ నిశ్చయించి నందకుమారుడు పూర్వ మేదో యొక కూటసృష్టి (ఫోర్జరీ) చేసెనను నేరమునుమోపి అతనిఅరెస్టు చేయించెను. వారన్ హేస్టింగ్సుయొక్క అప్తుడైన న్యాయాధిపతియగు సర్ ఎలిజా ఇంపే ఆంగ్లేయ ప్రమాణపురుషుల (జూరీ) సహాయముతో నీ బ్రాహ్మణుని విచారించి ఉరి

శిక్ష విధించెను. ఇతనిని శిక్షింతురని వారన్ హేస్టింగ్సుకు మొదటినుండియు తెలియును. ఇంకొక చిత్రమేమన, కూటసృష్టికి హిందూధర్మశాస్త్రమున లేనిఉరిశిక్ష క్రొత్తగా అమలు జరుపబడు ఆంగ్లధర్మముననుండెను. అందువలననే ఈనేరమతనిపైన మోపిరి. నందకుమారుడు ధైర్యముతో ప్రాణములబాసెను.

అయోధ్యరాణులు వజీరుఅసఫ్ఉద్దౌలాయొక్క తల్లియు తండ్రితల్లియు చాలధనవంతులని ప్రఖ్యాతి. వారిదగ్గఱ 30లక్షల నవరసులుండెననియు ఇంకను వారి కేటేట అమితమగు ఆదాయము వచ్చుచుండెననియు ప్రతీతి. వీరి ధనమును సంపదను కాపాడుదుమని వంగరాష్ట్ర ప్రభుత్వము వాగ్దానము చేసియుండెను. అయిన నేమి? ఏ విధముగనో వీరి పనిబట్టి వీరి ధనము లాగివేయవలెనని హేస్టింగ్సు నిశ్చయించెను. కాశీరాజగు ఛయితుసింగు కంపెనీవారిపైన చేసిన కుట్రలో వీరికి సంబంధముకలదని వారన్ హేస్టింగ్సు వీరిపైన నొక నేరము మోపెను. ఇందుకు సాక్ష్యము లేనందున కోర్టులో విచారణపెట్టుటకు సాహసింపలేదు. అంతట పెద్దరాణి మనుమడును చిన్నరాణి కుమారుడునుఅగు అయోధ్యవజీరు క్రొత్త నవాబు అసఫుద్దౌలా తన చేతిలో నుండినందున హేస్టింగ్సు అతనిని లోబరచుకొని రాణుల ఆస్తినంతను లాగికొని వదలివేయునట్లు ఆతనితో నేర్పాటు చేసికొనెను. చిన్నరాణిని చెరలో పెట్టించెను. ఈ రాణుల జనానాలో నుండు ఖోజా వారి నిరువురను పట్టుకొని నిర్బంధించి తిండిపెట్టక మాడ్చుటయే గాక వారిని చిత్రహింసల జేయుటకు నవాబు నౌకరుల

కనుజ్ఞ నిచ్చి, ఈ నిర్బంధితులను నవాబు శిక్షించదలచినాడు గనుక ఆయన నౌకరు లీ నిర్బంధితులదగ్గఱకుపోయి యిచ్చ వచ్చినట్లు చేయుటకు తాను వ్రాతమూలకమగు అనుజ్ఞాపత్రి మును వ్రాసియిచ్చెను! వారుచేసిన పాపమేమనగా గతించిన యజమాని వారి కప్పజెప్పిన ధనమును వీరి కివ్వకపోవుటయే. చిన్నరాణిని 1200000 నవరసులిచ్చువరకు తిండిపెట్టక మాడ్చి హింసించెను! ఈ చర్యలకు నవాబు తరువాత పశ్చాత్తాపము జెందెను. గాని వారన్‌హేస్టింగ్సుకు మాత్రము పశ్చాత్తాపము కలుగలేదు.

## III

## వారన్‌హేస్టింగ్సుచర్యలవిచారణ.

వారన్‌హేస్టింగ్సు చాల తెలివైనవాడు; గొప్ప రాజ్య తంత్రిజ్ఞుడు; నిపుణుడగు పరిపాలకుడు; గాని ఇతడుచేసిన ఘోరకృత్యము లసంఖ్యాకములు. ఇతడు 1785లో నింగ్లాండు నకు వెళ్లెను. అంతట కామన్సుసభవా రితనిపైన నేరారోపణ గావించగా ప్రభువుల సభలో విచారణజరిగెను. ఈతడు చేసిన అన్యాయములు నేరములు దీర్ఘముగా చర్చింపబడెను. గాని ఆంగ్లరాజితనికి సహాయుడయ్యెను. కంపెనీ వారితనిని గౌరవిం చిరి. ఇతనిని విచారించు ప్రభువుల సభవారి అధ్యక్షుడగు లార్డుచాన్సిలర్ తర్లో యితని కండయైయుండెను. అందువలన నీతని యన్యాయములను పూసగ్రుచ్చి వర్ణించి మహోపన్యాస ములుచేసిన బర్కు మహాశయు డెంతి కష్టపడినను లాభము లేదనియు నితనిని వదలివేయుదురనియు అందరికిని తెలిసి

పోయెను. ఈ విచారణ 1785 లో ప్రారంభమై 1795 లో ముగిసినది. విచారణ నారంభించినప్పుడు సభలో 160 మంది ప్రభువులు పాల్గొనిరి. తీర్పుచెప్పునప్పుడు 29 మంది మాత్రమే తమ వోటు నొసగిరి. ఈలోపుగా హేస్టింగ్సు రాజసమ్మాన మును పొందుచునేయుండెను. ఇతడొక యింటిని దాని యుద్యాన వనమును నిర్మించుటకు 40 వేల నవరసులు ఖర్చుపెట్టి కులుకు చుండెను.

"ఈ వారన్ హేస్టింగ్సు భారత దేశములోని పరిపాలనా విధానమును తన స్వప్రయోజనములకు నాశనముచేసి నాడు. తాను నిర్వహించవలసివచ్చిన అధికారములు నిర్వహించ లేదు. తన చేతిలోని కీలుబొమ్మలుగానుండు ఒక కమిటీని నియ మించి సాలుకు 62 వేల పౌనులచొప్పున దుర్వినియోగము చేసినాడు. ఒక దుర్మార్గుడగు తన వశవర్తిని ఆ కమిటీకి దివానుగా జేసినాడు.

గంగా గోవిందుసింగుదగ్గఱ లంచము పుచ్చుకొన్నాడు. లంచము పుచ్చుకొనియు అతనికి ద్రోహముచేసినాడు. అనేకుల వలన లంచములు పుచ్చుకొని వారిని కొల్లగొనినాడు. వితంతు వుల ఆస్తిని కాజేసినాడు. అనాథలయొక్కయు, తల్లిదండ్రులు లేని పిల్లలయొక్కయు ఆస్తులను లాగివేసి తన వశవర్తులగు దుర్మార్గుల కిచ్చినాడు.

ఒక మైనరు రాజుయొక్క శాస్త్రీయ సంరక్షకులను తొలగించి వాని జమీందారీని దుర్మార్గుడగు దేవసింగుకిచ్చి నాడు. మూడు పెద్దరాష్ట్రముల పరిపాలన నీ దేవసింగువశము

జేసి ఆరాజ్యములందలి రైతులఇండ్లను తగులబెట్టించి, కుప్పలు లాగికొని హింసించి, వారిస్త్రీలను జెఱచి, వారి నవమానపరచి నష్టపర్చినాడు. బ్రిటిషుజాతి కవమానము తెచ్చినాడు. భారతదేశములోని ప్రజల ధర్మములను హక్కులను స్వాతంత్ర్యములను తలక్రిందులుజేసి వారి ఆస్తిని నాశనముచేసి వారి దేశములను పాడుపెట్టి ధర్మవిధ్వంసముజేసి, మానవత్వముసే భంగపరచినాడు." అని బర్కు మహోపన్యాసముచేసినాడు. ఆయనయు షెరిడను మొదలగువారు చేసిన నేరారోపణలను వినినవారి వారన్ హేస్టింగ్సుమానవరూపముననున్న రక్కసివలె కనపడినాడు; గాని పార్లమెంటులో నీ వారన్ హేస్టింగ్సుకు పక్షపాతులు లేకపోలేదు. యార్కు ఆర్చిబిషప్పు కొమారునికి వారన్ హేస్టింగ్సు చేసిన ఉపకారమును బట్టి అతడొక పక్షపాతిగా నుండెను. కంపెనీడైరెక్టర్లకోర్టు అధ్యక్షుడగు సల్లివన్ యొక్క కొమారునికి వారన్ హేస్టింగ్సు బంగాళారాష్ట్రమున నాల్గు సంవత్సరములకు నల్లమందు ఇజారా నిచ్చెను. దాని నతడొక స్నేహితునికి 40 వేల పౌనుల కమ్ముకొనెను. ఆ స్నేహితుడు ఆ హక్కునే ఇంకొకనికి 60 వేల పౌనులకమ్ముకొని లాభము పొందెను. ఇంగ్లీషు రాజకీయములందు వారన్ హేస్టింగ్సు పార్టీవారొకరు బయలుదేరి అనేక అన్యాయములు జరుపసాగిరి.

ప్రభువుల సభవారు తుదకు 1795 వ సంవత్సరము ఏప్రిలు 23 వ తేదీన వారన్ హేస్టింగ్సుపైన కేసును కొట్టివేసిరి. ఇట్లు భారతదేశ ప్రజలకు జరిగిన ఘోరాన్యాయమును గూర్చిన మొదటి యభియోగము వృథయైపోయెను. ఈఅన్యా

యములు చేసినవాడు తప్పించుకొనిపోయెను గాని భారతదేశ స్థితిగతులు మాత్రము ప్రపంచమున కొకమారు వెల్లడి యయ్యెను. ఇంక కొన్నాళ్ళవరకిట్టి ఘోరములుచేయుట కెవ్వరు సాహసింపలేకపోయిరి. వారన్ హేస్టింగ్సు తరువాత భారత దేశగవర్నరు జనరలు పదవిని స్వీకరించుటకును చాల మంది భయపడిరి. అయినను మానవ స్వభావము చిత్రమైనది. కొలది కాలములోనే ఈవారన్ హేస్టింగ్సు చేసిన ఘోరాన్యాయములనుగూర్చి ఆంగ్లప్రజలు మరచిపోయి ఇతడు సామ్రాజ్య నిర్మాతయని గౌరవింపసాగిరి. చరిత్రకారులు చాలమంది మొదట వారన్ హేస్టింగ్సును విమర్శించినను సామ్రాజ్య తత్వాభిమానులగు వారు క్రమక్రమముగా నతని దుశ్చర్య లకు వెల్లవేసి వానిని కప్పిపుచ్చసాగిరి. తుదకు విన్సెంటుస్మిత్తు అతనిని పూర్తిగా సమర్థించి అతడు గవర్నరు జనరలులలో కెల్ల గొప్పవాడని పొగడినాడు.

## నాలుగవ ప్రకరణము

## దొరల వడ్డీ వ్యాపారము

### I

భారతదేశమున నాంగ్లేయులు పన్నిన రాజ్యతంత్రపు వలలో నీ దేశరాజులను నవాబులను పడవేసియుంచి యుద్ధ ములకని సైనికపోషణకని ఇంక నితరఖర్చులకని తఫిరీకులకని సొమ్ముకొరకు పీడించి నయమునను భయమునను అమిత ధనము లాగుచుండిరి. కంపెనీవారి ఆంగ్లేయోద్యోగులును తమ అధికారమును వీలువెంబడి నుపయోగించి అనేక మాయో

పాయములుపన్ని ఈ రాజులను నవాబులను పీడించి లంచపం చములు కొల్లగాగొనుచుండిరి. ఈ నవాబుల చుట్టును రాజుల చుట్టును జేరిన ఆంగ్లేయ తార్పుడుగాండ్రును దుర్మార్గులును వీరిని వంచించి దుర్వ్యసనములలో దింపి ధనమపహరించుచుండిరి. సామాన్యదర్బారు ఖర్చులకు పరివారమునకు వేశ్యలకు వ్యభిచారమునకు సురాపానమునకు ధనము కావలసియుండెను. ప్రజాపీడనము వలన దుష్పరిపాలనమువలన నెంత ధనము సంగ్రహించినను కూడ సొమ్ముచాలక ఈ రాజులు నవాబులు బాధలు పడుచుండిరి.

నేటివులను దొరలునుకూడ వీరికి అప్పులిచ్చుట యొక వ్యాపారముగా సాగించిరి. అవసరమునుబట్టియు అధికారమును బట్టియు ప్రతిఫలరహితముగను కూడనూటికి 24 మొదలు 48 వంతులవరకు సాలుసరి కాంపౌంసువడ్డీలతో నీ దొరలు అధికారులు నేటివులు ఋణపత్రములు వ్రాయించుకొనసాగిరి. ఈ ఋణపత్రములనుబట్టి బాకీదారు లీ నవాబులను ఒత్తిడి చేయుట, జాగీరులు వ్రాయించుకొనుట, రివిన్యూ తాకట్టు వ్రాయించుకొనుటయుకూడ కలదు. ఆర్కాటునవాబు రాజ్యములోను తంజావూరులోను అయోధ్యలోను ఇట్టి వ్యాపారము చేయు దొరల సంఖ్య మితిమీరెను. ఆర్కాటు నవాబు బాకీల విషయమునవలె నిజమైన విచారణ జరిగిన సందర్భములలో నీ బాకీలలో చాలవరకు అబద్ధములని తేలినవి. చాల పద్దులను గవర్నరు గవర్నరుజనరలుల కవున్సిళ్ళు అబద్ధములని తోసివేసెను గాని పోగా మిగిలినవే యత్యధికముగానుండెను.

బాకీదారులలో బలవంతులైన దొరలుండిరి. కవున్సిలు సభ్యులకుకూడా లంచములిచ్చి వారినోళ్లు కట్టివేసిరి. కంపెనీడై రెక్టరులకుగూడ నీ బాకీలవ్యాపారములో భాగమున్నట్లు తేలినది. వీరందరు కలిసి పార్లమెంటులో స్థానములు సంపాదించి తమ పలుకుబడిని వినియోగించి తోసివేసిన బాకీలనుకూడా మరల అమలులోనికి తెచ్చి భారత దేశ ఆదాయమునుండి కొన్ని కోట్ల రూపాయిలు అపహరించిరి. దీనినిగూర్చి 1840 లోనే తారంటంన్ తన చరిత్రలో వ్రాసియున్నాడు. (Thornton's History of British Empire in India Vol. VI. Pages I-17)

## II

## ఆర్కాటు నవాబు బాకీలు.

మొదటిరోజులలో కంపెనీయుద్యోగులు స్వంతవ్యాపారము చేయుటయేకాక తా మన్యాయముగా నార్జించిన ధనమును దేశములోని నవాబులకు రాజులకు అప్పులిచ్చుచుండిరి. తమ పలుకుబడిని వినియోగించి దొంగపత్రములు వ్రాయించుకొనుచు అత్యధికమైన సాలుసరి కాంపౌండు వడ్డీలు పుచ్చుకొనుచుండిరి. ఆ రోజులలో ప్రతిరాజధానిని పరిపాలించుటకు గవర్నరుకు 'కౌన్సిల్' అను సలహా సంఘముండెను. ఈ కౌన్సిలులోని బహుసంఖ్యాకుల అభిప్రాయానుసారము అన్నివ్యవహారములును జరుగవలెను. అందువలన కౌన్సిలు మెంబర్లకు లంచములిచ్చి అనేకు లీ వ్యాపారమున లాభములు పొందుచుండిరి. ఇట్టి యుదాహరణము లనేకములు కలవు. 1763లో బెన్ఫీల్డు అను ఆంగ్లేయుడు మదాసులో కంపెనీవారి కొలువులో ఇంజ

సీరుగా కుదిరెను. ఇతడు డబ్బు దోచుకొనుటలో మొనగాడు. ఆంగ్లేయాధికారులు తంజావూరు రాజ్యమును తమ స్నేహితుడగు ఆర్కాటు నవాబున కిచ్చియుండిరి. (కర్నాటక నవాబునకే ఆర్కాటునవాబు అనియు పేరు) ఆ రాజ్యమును మరల రాజు కిచ్చివేయుడని కంపెనీ డైరెక్టర్లు ఉత్తర్వుచేయగా ఆ సమయములో నీ బెన్ఫీల్డు తనకు ఆర్కాటునవాబు 16 లక్షల 20వేల రూపాయలు బాకీయున్నాడనియు దానికిందక్రింద తంజావూరు తనకు తాకట్టు పెట్టినాడనియు ఇదిగాక తంజావూరులోని ఆసాములకు తాను 7 లక్షల 20 వేలు రూపాయలు అప్పిచ్చితిననియు దానికింద ఆభూములలోని నిలువుపైరు తనకు తాకట్టు ఉంచబడినదనియు వాదింపసాగెను. ఆ రోజులలో మదాసు గవర్నరగు 'పిగట్టు' ఈసంగతి సీమలోని డైరెక్టర్లకు వ్రాసెను. అంతట నీతాకట్టు నమ్మతగినదికాదని వారుతోసివేసిరి. బెన్ఫీల్డు చాలాబలవంతుడు. మదాసురాజధాని కౌన్సిలులో నతనికి గొప్ప పలుకుబడియుండెను. అందువలన నతడు తనవ్యాజ్యమును పునర్విచారణకు తెప్పించి తనపక్షముగా తీర్పుచెప్పించుకొనెను. తరువాత తంజావూరుకు ఆంగ్లేయప్రతినిధిని (రెసిడెంటును) నియమించుటలో బెన్ఫీల్డుకు అనుకూలముగానుండు వానిని నియమించుటకు కౌన్సిల్ వారు సలహానిచ్చిరి. గవర్నరు పిగట్టు అందుకు అంగీకరింపక యింకొకనిని నియమించెను. అంతట కౌన్సిలువారును బెన్ఫీల్డ్ను కుట్రచేసి 1776 సంవత్సరం ఆగస్టు 24 వ తేదీన పిగట్టును చెరబెట్టి బంధించిరి! ఈ సంగతి సీమకు తెలియగా డైరెక్టర్లు దిగ్భ్రమజెందిరి. కాని వారిలోనే

అభిప్రాయభేదములు కలిగినందున వారు తగుచర్యగైకొనక పిగట్టును పనిమాని యింటికి రమ్మనిరిగాని యీ ఉత్తరువు వచ్చు లోపలనే అతడు చెరసాలలో మరణించెను. ఈలోపుగా సర్ తామస్ రంబోల్డును అతని స్థానే గవర్నరుగా నియమించిరి. ఆర్కాటు నవాబునకు 1767 లో కంపెనీ యుద్యోగు లిచ్చిన ఋణముగాక 1777 లో సైనికులజీతముల కతనికి మరల ఋణము కావలసివచ్చెను. అంతట కంపెనీ ఉద్యోగులు టైలర్, మెజెండీ, కాల్ అనువారు అతనికి ఋణ మిచ్చుట కంగీకరించి 16 లక్షల రూపాయలు అప్పుగానిచ్చి దానిక్రింద కొన్నిజిల్లాల ఆదాయము తాకట్టుపెట్టుకొని శిస్తు వసూలు చేసుకొనిరి. 1777 లోనే మరల కంపెనీనౌకర్లు నవాబునకు రెండుకోట్ల పైచిల్లర మూడవమారు ఋణమిచ్చినట్లు వెల్లడింపబడెను. ఈ అప్పు లన్నిటిపైనను నూటికి 36 మొదలు 48 వరకు అత్యధిక రేటు వడ్డీ నిర్ణయింపబడి యుండెను. ఈ సొమ్ము కంపెనీనౌకర్లు కిచ్చుటనుండి వచ్చినదని విమర్శించువారు లేరైరి. 1784 కు 1804 కు మధ్య ఈ నవాబుయొక్క ఋణమును పిట్టు, డండాసులు 480000 పౌనుల సాలుసరి వాయిదాలచొప్పున తీర్మానింపజేసిరి. ఆ తరువాత మరల నీనవాబునకు మూడుకోట్ల పౌనుల ఋణమైనట్లు నవాబును అతని ఇంగ్లీషు స్నేహితులును వెల్లడి చేయసాగిరి. అంత 1805-1814 సంవత్సరముల మధ్య నొక విచారణ సంఘ మేర్పరుపబడగా రెండుకోట్లలో లక్ష తొంబదివేల పౌనులు అబద్ధపు ఋణమని తీర్మానించిరి. మొత్తము మూడుకోట్ల పౌనులలో 30 లక్షలు

తప్పు తక్కిన దంతయు అబద్ధమని తేలినది. 1830 నాటికి బాకీ పరిష్కరింపబడెను. పూర్వము తీర్మానింపబడిన బాకీలుకూడా సరిగా విమర్శింపబడినచో నందులో చాల భాగమబద్ధమని తేలియుండును.

బెన్‌ఫీల్డును రెండుమార్లు ఉద్యోగమునుండి తొలగించి నను అతడు తన పలుకుబడి నుపయోగించి మరల నుద్యోగము సంపాదింపగలిగెను. తరువాత కారన్‌వాలిసు గవర్నరు జనర లుగా వచ్చినపిదప 1788లో నితనిని బలవంతముగా సీమ కంపి వేసెను. అంతట నితడు పార్లమెంటులోనే పలుకుబడి సంపా దించి పనిచేయసాగెను. బెన్‌ఫీల్డును, ఇతనివలెనే అన్యాయా ర్జిత ధనముతో కుబేరుడైన అట్కిన్‌సన్ అనునతడును, ఇంకను గొందరును ఏకమై భారత దేశములోజరుపుచున్న అన్యాయము లనుగూర్చి బర్కు మహాశయుడు పార్లమెంటులో ప్రసంగించి తాను వారన్ హేస్టింగ్సు పైన నేరారోపణ చేయబోవుచున్నా ననియు అయోధ్యరాష్ట్ర విభజనకును, ఆర్కాటు నవాబు ఋణములకును సంబంధించిన కాగితములను బయల్పరుపవల సినదనియు ప్రవేశపెట్టిన తీర్మానము నోడించివైచిరి. పిట్టు డండాసులు తీర్మానించినబాకీ నిజముగా కంపెనీ నౌకరు లక్ర మముగా పైవిధముగా బనాయించిన బాకీలే. దీని వడ్డీభారము సాలుకు 623000 పౌనులుగా నుండెను—అనగా కంపెనీవారికి సాలియానా వచ్చులాభములకు రెట్టింపుగానుండెను.

ఆనాడు క్రిందివానిమొదలు పైవానివరకు, కంపెనీనౌక రులు లంచములు పుచ్చుకొనుట కలవాటుపడి యుండిరి. పిగట్టు

స్థానమున మద్రాసుగవర్నరుగా నియమింపబడిన రంబోల్డు చేసిన అన్యాయములకు మేరలేదు. ఆనాడు శిస్తులనిర్ణయము కొరకు నియమింపబడిన కమిటీనితడురద్దుచేసి జమీందార్లను మద్రాసుకు రప్పించి వారివలన అమితధనమును లాగికొన సాగెను. ఇతడు 16 లక్షలరూపాయిలు లంచముపుచ్చుకున్నట్లు రుజువుకాగా 1781 లో నితనిని పనిలోనుండి తీసివేసిరి. (Early British Rule—R. C. Dutt)

1780 ఆ ప్రాంతములందు మద్రాసు ప్రభుత్వ మిట్టి అవినీతిపరులును దుర్మార్గులునగు దొరలతో నిండి అన్యాయములతో పుచ్చిపోయియుండెను. ఆ దొరలు లంచగొండెలగుటయేగాక పై యధికారులనుకూడ తృణీకరించునంతటి పొగరుబోతులై యుండిరి. అట్టివారిలో నొన్నాళ్ళు మచిలీపట్టణమున బనిచేసి మద్రాసు గవర్నరుగాకూడా పనిచేసిన వైట్ హిల్ అను వాడొకడు. ఇతడు గవర్నరుజనరలు ఆజ్ఞలనుకూడా ధిక్కరింపసాగెను. అంతట నితనిని 1780 లో సస్పెండుచేసి 1781 జనవరి 15వ తేదీన పనినుండి తొలగించిరి. ఈ వైట్హిల్లును మద్రాసు గవర్నరుగా పనిచేసిన రంబోల్డును, ఫెర్రింగు అను ఇంకొక దొరయుకలిసి ప్రభుత్వధన మపహరించినట్లుబయల్పడి విచారణకూడ జరిగెను. రంబోల్డు పుచ్చుకొన్న లంచములు రుజువుకాగా 1781 లో నతనిని డిస్మిసుచేసిరి. వైట్హిల్లుయొక్క దుర్మార్గము నూజవీడు జమీందారు బాకీల విషయమున నింకను విపులముగా వర్ణింపబడినది.

గవర్నరుజనరలు-కారన్వాలిసు గడచినదానికి ఏమియు

చేయజాలకపోయినను, ఇకముందైనను ఇట్టి అన్యాయము జరుగ రాదని నిశ్చయించెను. 1784 వ సంవత్సరపు చట్టమువలన గవర్నరు జనరలునకు తనకవున్సిలునుత్రోసి రాజనగల అధికారము కలిగెను. అందువలన కార్న్‌వాలిసు ధైర్యముగా నీదుర్మార్గములను నిషేధింపగలిగెను. అనేకమంది పెద్ద యుద్యోగుల నుద్యోగమునుండి తొలగించి సీమకంపి కొన్ని కఠిననిబంధనలను గావించెను. కంపెనీనౌకరులు దేశము వదలిపోవునప్పుడు తమ ఆస్తినిగూర్చిన ఒక ప్రమాణపత్రము దాఖలుచేయవలెనని శాసించెను. ఆంగ్లేయవర్తకులు కలకత్తా దాటి దేశములో వర్తకము చేయదలచినచో నచ్చటి స్థానిక న్యాయస్థానముల అధికారమునకు లోబడియుందుమని పత్రము వ్రాయవలెననియు శాసించెను.

## III

### నూజివీడు జమీందారు బాకీలు

నూజివీటి జమీందారగు అప్పారావుగారు దొరలకు వ్రాసియిచ్చిన ఋణపత్రముల చరిత్ర చాల చిత్రమైనది. కొన్నాళ్ళు మచిలీబందరులో కంపెనీ యధికారిగనుండి తరువాత మద్రాసు గవర్నరు పనిచేసిన వైటుహిల్లుకును కంపెనీ డైరెక్టరులలో ముఖ్యుడును పార్లిమెంటు బోర్డుసభ్యుడును నగు రైట్ ఆనరెబిల్ జాన్‌సల్లివనుకును జేమ్సుహాడ్జెస్ అను నొక దొరకును మరికొందరు దొరలకును కలిసి ఈ నూజివీడు జమీందారు కొన్ని లక్షలరూపాయిలు బాకీయున్నట్లును, ఆఋణముతాను ట్రాన్సుఫరు పొందినాననియు తా నింకను కొంత

మొత్తము అప్పారావుగారికి బదులిచ్చి ఋణపత్రము వ్రాయించుకొంటిననియు హాడ్జెస్ బనాయించెను. హాడ్జెస్ పేర అప్పారావుగారు పత్రమువ్రాసినట్లు చెప్పు తేదీన అప్పారావుగారు బందిఖానాలో ఖైదీగా నుండిరి. ఆయన కారాగారాధికారి యీహాడ్జెస్ దొరయే! ఈ బాకీ యెంత నమ్మతగినదో యూహింపుడు. ఈ హాడ్జెస్ తనను బలవంతము జేసి ఒక ఋణపత్రమును వ్రాయించుకొనెనని ఇంకొక జమీందారు 1785 లో ఫిర్యాదు జేసియుండెను. ఈ హాడ్జెస్ 1794 లో చనిపోయినాడు. అతని భార్య 1801 వరకు నీబాకీమాట ఎత్తలేదు. ఆసంవత్సరమున నామె ఒక అర్జీ యిచ్చుకున్నది గాని ఆ తన బాకీ యిప్పించవలసినదని కంపెనీ డైరెక్టర్ల కోర్టువారికి అర్జీని వారు త్రోసివేసిరి. 1803లో శాశ్వతపైసలా (పర్మనెంటు సెటిల్మెంటు) సందర్భమున నూజివీడు జమీందారీ భూములకు అప్పారావుగారి కుటుంబము వారికి ఇంగ్లీషు ప్రభుత్వము వారు సన్నదునిచ్చిరి. అప్పుడెట్టి షరతులును నిర్ణయింప బడలేదు. ఇట్లు రమారమి ముప్పది సంవత్సరములు గడచిపోయినవి. అంతట నీ బాకీని ఇప్పించవలసినదని కొందరు దొరల మద్దతుతో మరల నొక ప్రయత్నము జరిగెను. ఈ బాకి అబద్ధమనియు చెల్లదనియు కంపెనీవారు ఎదిరించిరి గాని 1832 లో నింగ్లీషు ప్రభువుల సభవారీ బాకీ యివ్వవలసినదే యని తీర్మానించిరి. ఇట్లు తెల్లదొరల అధికారబలమును పలుకుబడియు జయము పొందెను. *

(* Thornton-History of British Empire in India. Vol. II P. 243)

## IV

## అ యో ధ్య న వా బు బా కీ లు

అయోధ్యనవాబు వలన నూటి కిరువదినాల్గు మొదలు 36 రూపాయిలవరకు సాలుసరి కాంపౌండు వడ్డీరేటుచొప్పున పత్రములు వ్రాయించుకొని బాకీదారులు అతనిని పీడించు చుండుట, సామాన్య పరిపాలనకు సొమ్ము లేకపోవుట, రివిన్యూ క్షీణించుటాదిగాగల సంగతులు 1796 లో లక్నో రెసిడెంటు గవర్నరుజనరలుకు వ్రాసినాడు. హిందూదేశ మున బాకీలు ఎగవేయుట అమర్యాదగా పరిగణింపబడును. అందువలన ఏదోవిధముగా తీర్చుకొందురు. ఇట్లే నవాబు అసఫ్‌ఉల్‌దౌలా తనబాకీదార్లకు దామాషాగా ఋణ పరిష్కారము చేయదలచెను. అయితే అట్లు పరిష్కరించుటలో బాకీల నిజానిజములు న్యాయాన్యాయములు పరిశీలింపకయే భారతీయుల బాకీలకు తక్కువదామాషా ప్రప్తిని తెల్ల వారి బాకీలకు హెచ్చుదామాషా ప్రాప్తిని చెల్లించుటకు నిశ్చయించెను. దీనికిగల కారణము తెల్లబాకీదారులకు గల అధికారబలమే! ఈ అన్యాయపు పంపిణీకి నల్లవారు కొంద రంగీకరింపలేదు. అందువలన వారిబాకీలక్రింద వారికేమియు రానేలేదు. 1797 లో నీనవాబు చనిపోయినాడు. అంతట నీతని కొమారుడు తనతండ్రి ఋణములు పరిష్కరించుట ధర్మ మని తలచి ఋణపత్రములను తిరుగవ్రాయసాగెను. ఈ సం దులో మరల ననేకులు నూటికి 36 వంతున వడ్డీతో ఋణ పత్రములు వ్రాయించుకొనిరి. తమబాకీల పరిష్కారము విష

యమై ఈ బాకీదార్లు గోలచేసి అయోధ్య ప్రభుత్వమునకు ఇంగ్లాండులోని అధికార్లకు అర్జీలు పెట్టుకొనసాగిరి; కాని కంపెనీ వారు వినిపించుకొనలేదు. మార్క్విస్ ఆఫ్ హేస్టింగ్సు గవర్నరుజనరలుగా నుండగా ఈ బాకీల పరిష్కార విషయము ఇంగ్లీషు ప్రభుత్వమునకు సంబంధించినది కాదనియు నవాబే పరిష్కరించుకొనవలెననియు తెల్పుమని రెసిడెంటుకు ఉత్తరువు చేసిరి. ఇంతఅత్యధిక రేట్లతోనున్న ఈబాకీలు కేవలము జూదరులవ్యవహారముగా కనబడుచున్నవని తూర్పుఇండియా వర్తక సంఘమువారు 1822 మే నెల 31వ తేదీన రికార్డుచేసిరి. కాని బాకీదార్లకు మంచిరోజులు వచ్చెను. భారతదేశ రాజులలో మంచివారు కలరనియు, భారతీయులకు న్యాయమొనరింపవలెననియు సద్భావముతో పరిపాలించు ధర్మాత్ములగు ఎల్ఫిన్‌స్టన్, మన్రో, మాల్కములవంటివారుపోయి ఈ భారతదేశీయులకు తాము న్యాయమొనరింపవలసిన బాధ్యత లేదనియు రాజులచుట్టును చేరి పీడించు ఆంగ్లేయులుచేయు దుర్నయములను నివారించవలసిన బాధ్యతయు తమకులేదనియు తలచుఅధికారులు బయలుదేరిరి. భారతదేశ రాజులు నవాబులు ఇటు ప్రభుత్వమునకును అటుఉద్యోగేతరులగు దొరలకును పుష్కలముగాధనము లిచ్చుకొనవలసినవారే యను భావము ప్రబలెను. ఈ సమయమున దేశీయరాజుల బాకీలు చెల్లించవలసిన దేయని కొన్ని తీర్మానములు జరిగెను. ఆర్కాటునవాబు బాకీలలో కొన్నిలక్షలట్లు తీర్మానింపబడెను. ఇటే అయోధ్యనవాబు

బాకీల విషయములో నేటివు బాకీదార్లకన్న ఆంగ్లేయ బాకీదార్లకు పక్షపాతము చూపబడెను.

V

హైదరాబాదు నైజాంగారి బాకీలు

గవర్నరుజనరలుగ నుండిన లార్డుహేస్టింగ్సు పాలక పుత్రికభర్త రంబోల్డు హైదరాబాదులో పామరుకంపెనీలో ముఖ్య భాగస్థుడుగ నుండెను. కంపెనీవారు నెలకు 20 వేల పౌనులచొప్పున సాలుకు నూటికి 25 వంతుల వడ్డీపైన నైజాముకు ఋణమివ్వగా నైజాముసాలుకు 300000పౌనుల రివిన్యూ వీరికి తాకట్టుపెట్టెను. ఇది ఎన్నాళ్ళకునుతీరను. గవర్నరుజనరలు కంపెనీపై నభిమానము వహించెను. ఈకంపెనీ నైజామును పీల్చిపిప్పిచేయసాగెను. ఈసందున నైజాము ఖర్చుపైన కలకత్తాలో దీపములు నీటి సరఫరా చేయునట్లు హేస్టింగ్సు స్వదస్తూరీతో నైజాముతో సంధిపత్రములో నొకవరతును వ్రాసెను; గాని నైజాము నిట్లు బాధించుటకు తూర్పుఇండియా కంపెనీ డైరక్టర్లు అంగీకరించలేదు. హైదరాబాదు రెసిడెంటగు మెట్కాఫు పామరు కంపెనీ దుర్నయములు చూచి అసహ్యపడెను. 1820 లో పామరుకంపెనీవారు 60 లక్షల పౌనుల మొత్తమును క్రొత్తబాకీ అను పేరున పాతఋణమునే నైజాము నెత్తిపైన వేయుదలచిరి. ఈ ఋణముపైన వడ్డీ నూటికి 18 కి తగ్గింపబడినది; కాని ఇది అన్యాయమని మెట్కాఫు వ్రాసినాను. అంతట పామరుకంపెనీవా రెప్పటివలెనే నైజామువలన నూటికిరువదైదువంతుల వడ్డీప్రకారము ఋణపత్రములు వ్రాయించు

కొన సాగిరి. ఈఅన్యాయములను విమర్శించినందుకు మెట్కాఫు పైన గవర్నరుజనరలుకు కోపమువచ్చెను. పామరుకంపెనీ వారి అక్రమములు బయల్పడగా ఆంగ్లేయకంపెనీ డైరెక్టర్లు గవర్నరుజనరలును వెనుకకు రమ్మనిరి. 1823 లో 7 నెలలు గవర్నరుజనరలుగా పనిచేసిన 'ఆడం' ఈ పామరుకంపెనీవారి బాకీలలో కొన్ని అబద్ధపు బాకీ లని తీసివేసెను. పామరు కంపెనీకి 80 లక్షల పౌనులు చెల్లింపబడెను. తరువాత నీ పామరు కంపెనీవారు తాము చెల్లించవలసిన సామాన్య బాకీలుకూడా చెల్లించకుండా దివాలా అయిరి. ఈ సంగతి 1828 డిశంబరులో మెట్కాఫు కవున్సిలులో నివేదించినాడు. 1833 లో నీ కంపెనీ వ్యవహారములనుగూర్చి మరల నొక అభియోగ మింగ్లాండులో తేబడినది. ఇట్టి గోల జరుగుచుండగా 1834 లో అయోధ్య నవాబు తమకు 15 లక్షల పౌనులు బాకీయున్నాడనియు అది అయోధ్య రివిన్యూనుండి ఇప్పించవలసినదనియు దొరలు పెట్టుకొన్న అర్జీలను అంగీకరించుట కిష్టములేక పార్లిమెంటువారు 1834 లో దానిని త్రోసివేసిరి. (తాంప్సన్ గెరాల్ట్ గార్ల బ్రిటిషు రూల్).

ఐదవ ప్రకరణము

## ఆంగ్ల గవర్నరుజనరలుల దొరతనము

## I

### కారన్ వాలిస్

వారన్ హేస్టింగ్సు తరువాత 1786లో గవర్నరు జనరలైన కారన్ వాలిసు రాగానే కంపెనీ యుద్యోగులు సివిలు

పరిపాలనలోను న్యాయవిచారణలోను శిస్తుల వసూళ్ళలోను చేయుచుండిన అన్యాయములు తొలగించుటకు వారి జీతములు హెచ్చించుట ముఖ్యమని అట్లుచేసెను. కలెక్టరుల న్యాయ విచారణ అధికారము తీసివేసి జిల్లాకోర్టులు స్థాపించెను. దేశ పరిపాలన కవసరమని తోచిన అనేక శాసనములుచేసెను. ఈ సంస్కరణలు చేయుటలో అతని యుద్దేశము భారత దేశ ప్రజల నుద్ధరించవలెననికాదు. ఆనాడు కంపెనీ ప్రభుత్వము చెడిపోయియున్నందున దానిని కట్టుదిట్టముగ చేయవలెననియె. వారన్ హేస్టింగ్సుయొక్క దుష్పరిపాలనము తరువాత నితడు వచ్చి అతనివలె బహిరంగముగా ఘోర అన్యాయములు జేయ నందున నితడు కేవలము ధర్మరాజని కొందరు చరిత్రకారులు పొగడుచుందురు. కాని నిజముగా నితడు మన దేశమునకు చేసిన మేలు వారన్ హేస్టింగ్సుక్లైవులవలె ప్రవర్తింపక పోవుటయే. (Rise of Christian Power in India. —B. D. Basu.)

కారన్ వాలిసు 1786లో వచ్చినపిదప కంపెనీ యుద్యోగుల జీతములన్నియు వృద్ధిచేసి వారి స్వంతవ్యాపారమును రాజులకు నవాబులకు పెట్టు బళ్ళుపెట్టుటను నిషేధించెను. 1773 లో చేయబడిన రెగ్యులేటింగు ఆక్టుక్రింద గవర్నరుజనరలుకు సాలుకు 25000 పౌనులు (2½ లక్షల రూపాయిలు), కౌన్సిలుమెంబర్లు కొక్కరికి సాలుకు 10 వేల రూపాయిలు జీతములు నిర్ణయింపబడెను. సామాన్య ఉద్యోగులలో ఆరుసంవత్సరముల సర్వీసుఅనుభవముగలవారికి సాలుకు 1500 పౌనులును, 1[illegible] సంవత్సరముల సర్వీసుగలవారికి 4000

పౌనులును, జీతవృద్ధియగునట్లు నిర్ణయింపబడెను. కలెక్టర్లకు జీతముతోపాటు రివిన్యూ వసూలుమొత్తముపైన కమీషను డెను. లంచము లెప్పటివలె సాగుచునేయుండెను. బెనారసు రెసిడెంటుకు నెలకు వేయిరూపాయిల జీతముండగా నత డనేకదుర్మార్గములద్వారా సాలుకు నాలుగులక్షలార్జించుచుండెను. కారన్‌వాలిసు అతనిజీతమును నెల 1కి అయిదు వేలకు హెచ్చించెను. ఇట్లే వంగరాష్ట్ర సివిలుసర్వీసు ఉద్యోగుల జీతములను 1787 లో కారన్‌వాలిసు హెచ్చించెను. భారతదేశ పరిపాలనమున కేవలము ఆంగ్లేయోద్యోగుల నత్యధిక జీతములమీద నియమించుపద్ధతిని కారన్‌వాలిసే ప్రారంభించినాడు. కంపెనీ ప్రభుత్వము కేవలము ఆంగ్లేయుల వలననే జరుగవలెనని ఇతని పట్టుదల. భారతీయుల కెవ్వరికిని ప్రవేశమివ్వలేదు. ఇక భూమిశిస్తులను శాశ్వతముగా నిర్ణయించి భూములలో రైతుల కెట్టిహక్కులు కలవో అనియైన యోజింపక ఆ భూములెల్ల జమీందారుల వశముచేయు పర్మనెంటు సెటిల్మెంటు పద్ధతిని స్థాపించుటలో నితని యుద్దేశము కేవలము కంపెనీవారికి శిస్తులవసూలు సులభసాధ్యము చేయుటయే! ఈ సంస్కరణములయొక్క నిజస్వభావ మింకొకచోట చర్చింపబడినది.

కారన్‌వాలిసు రాకపూర్వము 1784 లో నింగ్లాండు పార్లిమెంటువారు తమకు రాజ్యాక్రమణ యుద్ధములన్న ఇష్టములేదనియు ఇది ఆంగ్ల జాతీయ గౌరవమునకును ధర్మమునకును విరుద్ధమనియు ప్రకటించి యుండిరి; కాని కారన్‌వాలిసు

రాగానే రాజ్యాక్రమణయుద్ధమునకు దిగెను. దీనికి కారణము లాంగ్ల రాజ్యమునకు సరిహద్దులలో మైసూరులో హైదరాలీ టిప్పూలు బలవంతులై ఫ్రెంచివారి సాయముతో నాంగ్లేయులను వెళ్ళగొట్టవలె నని ప్రయత్నించుచుండి రనియు, మహారాష్ట్రులును బలవంతులై విజృంభించుచుండిరనియు జెప్పిరి. కారన్ వాలిసు టిప్పూసుల్తానుపైన దాడివెడలి 1792 లో నతని నోడించి చాలరాజ్యమును లాగికొని అనేక లక్షల ధనము పుచ్చుకొనెను. కొంతరాజ్యమును నైజామునకిచ్చెను. రాజ్యాక్రమణ యుద్ధములన్న తమ కిష్టములేదన్న ఆంగ్ల పార్లమెంటు కారన్ వాలిసుకు "మార్క్విస్" ప్రభు బిరుదు నిచ్చి గౌరవించిరి!

## II

కారన్ వాలీసు తరువాత గవర్నరు జనరలులైన వెల్లస్లీ హేస్టింగ్సులు సామ దాన భేద దండోపాయములను స్వేచ్ఛగా ప్రయోగించి అనేకములగు అక్రమరాజ్యాక్రమణ యుద్ధములు గావించి చాలా భూభాగములను బ్రిటిషు ఇండియాలో చేర్చిరి. వెల్లస్లీ కాలముననే మద్రాసు రాజధాని పూర్తియై తూర్పుతీరమెల్ల బ్రిటిషువారిదైనది. హేస్టింగ్సు కాలమునాటికి కలకత్తా, మద్రాసు, బొంబాయి, రాజధానులు నేటిరూపము దాల్చినవి. అనేక సంస్థానాధిపతులతో స్నేహసహకారసంధులు జరిగినవి. మెల్లగా వారి సంస్థానములందు సైన్యములు నెలకొల్పబడి బ్రిటిషువారి పలుకుబడియు అధికారమును గట్టిచేయ

బడెను. దీనిని గూర్చిన వివరములు 'సంస్థానముల సమస్య' అను ప్రకరణమున గలవు.

1783 లో ఫాక్సుమంత్రియొక్క ఇండియా బిల్లును గూర్చి పార్లమెంటులో మాటలాడుచు బర్కుమహాశయుడిట్లు పలికినాడు:

"హిమాలయమునుండి కన్యాకుమారివరకును పెద్ద వాడైనను పిన్నవాడైనను ఏరాజ్యముగాని రాజుగాని మనతో సంబంధముగల ప్రతివానిని మనకంపెనీ అధికారులు విక్రయించి వారిపట్ల ద్రోహముచేసియున్నారు. అట్లు విక్రయించినందు వలని లాభము చేతికి చిక్కనిచో అది వేరే సంగతి. మనవారు చేసిన సంధిపత్రములలో మనవారు షరతులకు భంగకర ముగా నడువని సంధిలేదు. మన కంపెనీవారిని నమ్మిన రాజు లలోను, రాజ్యములలోను నాశనముగానిది లేదు. ఈజాతిని నమ్మకుండా మనతో విరోధించినవారుతప్ప మంచిస్థితిలో నున్న వారు లేరు. ఈసంగతులు సర్వసామాన్యములైనవి. ఇది కేవలము బాహ్యసంబంధములకు రాజకీయములకు సంబంధిం చిన సంగతి. ఆంతరంగిక విషయములను గూర్చిగూడ ఇటు వంటి సంగతులనే మీకు నేను చూపగలను" అనినాడు.

ఇది నిజమని మొదటినుండియునీ దేశమున జరిగిన కథ వలన తెలియగలదు. గవర్నరుజనరలు వెల్లస్లీయు నతని సోదరు డగు అర్థర్ వెల్లస్లీయు కుటిలరాజ్యతంత్రమునందు నిపుణులు. వెల్లస్లీ పరిపాలనమునకు రాగానే అతడు మహారాష్ట్రరాజ్యనష్టే శనమును భగ్నము చేయదలచెను. వారిలో నెవరినో యొకరిని

చీలదీసి ఆంగ్లేయకంపెనీతో సంధి ఒడంబడిక చేయించినచో నీనమ్మేళనము బలహీనమై, విచ్ఛిన్నమగునని వెల్లస్లీ వెంటనే నిశ్చయించి బెస్సీను సంధిజేసెను. (చూడు: మిల్లుయొక్క చరిత్ర). వీరిరువురును తరువాత మహారాష్ట్రరాజులతో కుట్రలు చేయ సాగిరి. సింధియాక్రిందనున్న ఫ్రెంచి సైనికాధికారులకు లంచములిచ్చి తిరుగ దీయుటకును, ప్రజలచే పితూరీ చేయించుటకును ప్రయత్నించిరి. రెండవ మహారాష్ట్రయుద్ధము కేవలము వెల్లస్లీ స్వంతబాధ్యతతో జరిగించినాడు. ఈయుద్ధము సంగతి ఇంగ్లాండుకు చాల రోజులవరకు తెలియనేలేదు. రాజ్యతృష్ణయే దీనికి కారణము. ఈ యుద్ధములందు సేనానాయకుడుగా పనిజేసిన జనరల్ 'లేకు' కేవలము దుర్మార్గుడు. వెల్లస్లీ సోదరుల కీ కుట్రలయందు ఇతడు కుడిభుజముగ నుండెను. ఢిల్లీ చక్రవర్తికి మహారాష్ట్రులందు ద్వేషము పుట్టించుటకును అతనిని తమ రక్షణక్రిందికి రమ్మనియు వెల్లస్లీ 1803లో ఒక లేఖవ్రాసి లేకుసేనానిద్వారా పంపెను. చక్రవర్తికనేక యాశలు కలిగించెను. ఇట్లే సుప్రసిద్ధురాలగు 'బీగం సమ్రూ'కుకూడా ఆసలుగొల్పి ఆమెకును లేఖలు వ్రాసెను. బీరారు రాజులయెడల కుట్రచేయవలసినదని తన సైనికోద్యోగికి వెల్లస్లీ 1803 ఆగష్టు 3వ తేదీన ఉత్తరము వ్రాసెను. జనరల్ వెల్లస్లీ ఆగష్టు 24వ తేదీన మేజరుషాకు వ్రాసినలేఖలో "పీష్వా పూనానుండి పారిపోవునని నాకు తోచదు. పోయినచో అతని మంత్రులకు తెలియకుండా (పీష్వా) పోవగలడనియు తోచదు. కర్నల్ క్లోజుకు నేను వ్రాసిన లేఖలలో ఎప్పటికప్పుడు సంగతులు

తెలుపగలందులకు మంత్రులకు లంచము లివ్వవలసినదని వ్రాసియేయున్నాను" అనినాడు! పూనా రెసిడెంటగు క్లోజుకు (28-9-1803) వ్రాసిన లేఖలో పీష్వాయొక్క మంత్రులకు భారీగా లంచములిచ్చు విషయమును గూర్చి గవర్నరు జనరలు ఆలోచించుచున్నాడని వ్రాసినాడు! జనరల్ వెల్లస్లీ వ్రాసిన అఫిషియల్ డెస్పాచీ వలన బరహాన్ పూరుయొక్క పతనమునకు సింధియాక్రింద నుండిన ఐరోపా యుద్యోగుల యొక్కయు సైనికులయొక్కయు ద్రోహమే కారణమని బయల్పడినది. సింధియాక్రిందనున్న 'పేరాన్' అను నొక ఫ్రెంచి యుద్యోగిని గూర్చి మిల్లు తనచరిత్రలో వ్రాయుచు నితడు లంచము పుచ్చుకొన్నను తన యజమానునికి ద్రోహముచేసినచో చాలా పెద్దసొమ్ము లంచము వచ్చిడిదేగాని అతడు కొలువు మానుకొని పోయినాడని వ్రాసినాడు. 8-9-1803 తేదీని గవర్నరుజనరలుకు లేకుసేనాని వ్రాసిన రహస్యలేఖలో నతడు కేంగాకోటను పట్టుకొనుటకు లోపలివారికి లంచమిచ్చినట్లు తెలిపియున్నాడు. హోల్కారును నాశనము చేయవలెనని వెల్లస్లీ సంకల్పించెనుగాని వెంటనే అతనితో యుద్ధముచేయుటకు ఇష్టములేక పైకి స్నేహము నటించునట్లు లేకుసేనానికి వ్రాసెను. లేకుసేనాని వెల్లస్లీకి అప్పుడు. హోల్కారు బ్రిటిషువారికి వ్యతిరేకముగా కుట్ర చేయుచున్న లేఖలు తన చేతిలో పడినట్లు ప్రకటించెను. వీనిలోకొన్ని ఫోర్జరీలని తేలినది. యుద్ధకారణము కల్పించుటకే యిది యిట్లు కల్పింపబడెను. వెల్లస్లీయొక్క కుట్ర లింగ్లాండుకు

కూడా వ్రాసినవి. గాని అతనిని వెనుకకు రప్పించుటతప్ప అధికారులు చేసిన ఘనకార్యములేదు. (6-12-1804) తేదీన కారన్‌వాలిసు రాస్ సేనానికి వ్రాసినలేఖవలన నిది బయల్పడినది.

## III

హేస్టింగ్సు కేవలము వెనుకముందు లాలోచింపని ఆశావరుడు. అతనికాలమున 1813 నాటి కంపెనీ రాజ్యాధికార సన్నదుచట్టము ప్రకారము భారతదేశమువలన నింగ్లాండు అమితలాభము పొందదలచినది. ఇతడు కుటిలరాజ్యతంత్రము ప్రయోగించి కుట్రలుచేసి అక్రమయుద్ధములు జరిపి ఈయుద్దేశమును సఫలముచేసినాడు. తానుగూడ లాభముపొందినాడు. నేపాళరాజుతో యుద్ధమును, పిండారీలయుద్ధమనబడు మహారాష్ట్రయుద్ధమును, రాజపుత్రులతో కుట్రయు, సింధియాతో సంధియు కేవలము రాజ్యాక్రమణకొఱకును, ధనార్జనకొఱకును జేసినవే. పీష్వా బాలాజీరావు బరోడారాజును చెరపెట్టి కొన్ని లాభకరములగు ఏర్పాటులుచేసికొనగా హేస్టింగ్సు పీష్వాకును బరోడాకునుగల ద్రవ్యవ్యవహారములలో తాను కొంతలాభము పొందదలచి గంగాధరశాస్త్రియను బ్రాహ్మణుని బరోడాప్రతినిధిగా నియమించి కుట్రలుచేసి అతనిద్వారా చాలలాభమును పొందెను. హేస్టింగ్సు నాగపురరాజగు అప్పాసాహెబును తన రాజ్యతంత్రముచేత బిగియించి ఒక రాత్రిపూట సంధిపత్రముపైన సంతకముచేయించెను. ఇది నాగపుర ప్రజల కిష్టములేదు.

Prinse-Political and Military Transactions in India)

అంతట గుడ్డిరాజు హత్యచేయబడెను. ఇది యంతయు నొక కుట్రయొక్క ఫలితమని ప్రజలకు తోచినది. ఈ సంధివలన అప్పాసాహెబు అత్యధికమగు సొమ్ము బ్రిటిషువారి కివ్వవలసివచ్చెను. సాలుకు 30లక్ష లిచ్చుకోవలసివచ్చి అతడు బాధపడెను. తరువాత అప్పాసాహెబు బాధలు భరింపలేక రాజ్యమును త్యజించినాడు. అతనిని ఇంగ్లీషువారు చెఱపెట్టిరి. హేస్టింగ్సుయొక్క మహారాష్ట్ర యుద్ధమువలన నితని కనేక వేల పౌనులు లాభముకలిగినది. మహారాష్ట్రయుద్ధమందు జయించినందు కతనికి బహుమానముగా కంపెనీవారు 60 వేల పౌనులిచ్చిరి. కంపెనీవారికి 50 వేల చతురపుమైళ్ళ భారత దేశము, మధ్యరాష్ట్రములు లభించినవి. హేస్టింగ్సు ప్రజల కెట్టి లాభమును చేయలేదు, సరికదా దిగుమతులపైన సుంక ములు తగ్గించి భారతదేశ పరిశ్రమల నితడు నాశనముచేసి నాడు. మద్రాసులో రైత్వారీపద్ధతి కనుజ్ఞనిచ్చి రైతులను దరిద్రులుగా జేసినాడు. అనేక స్వదేశరాజులచేత సంధిపత్ర ములు వ్రాయించి వారి స్వాతంత్ర్యమును నాశనముచేసినాడు.

హేస్టింగ్సుచేసిన నాల్గు గొప్ప యుద్ధములకు చాల సొమ్ము కావలసివచ్చెను. దీనికి అయోధ్య వజీరుదగ్గఱ నితడు అప్పుచేసెను. హామీాక్రింద గూర్ఖావాండ్రదగ్గఱనుండి లాగిన జిల్లా నతనికిచ్చెను. హేస్టింగ్సు పాలకపుత్రిక భర్త హైదరాబా దులో పామరు కంపెనీలో భాగస్థుడు. నైజాముకు పెద్దవడ్డీకి ఋణ మిప్పించి లాభము పొందినాడు. ఈ వ్యవహారములోని అన్యాయములు బయల్పడగా డైరెక్టర్లు హేస్టింగ్సును చీవాట్లు

పెట్టిరి. హేస్టింగ్సు దుబారా ఖర్చుచేసి అప్పులలోబడి వచ్చి నాడేగాని అతని క్రిందుభాగము లేదని అతని స్నేహితులు వాదించిరి. అంతట హేస్టింగ్సును డైరక్టర్లు వెనుకకు రప్పించిరి.

## IV

బ్రిటిషు రాజ్యతంత్రముయొక్క ప్రధానోద్దేశము ఈ దేశము నింగ్లాండు దేశ లాభముకొరకుపయోగించుకొనుటయే. అందుకు గావలసిన బందోబస్తులనెల్ల కంపెనీ డైరెక్టర్లు గావించి తమ దేశమునకు పదివేలమైళ్ళ దూరమునగల ఈ దేశమును పాలించుటకు కొందరిని అధికారులుగా నియమించి వారిపైన నాధారపడుచుండిరి. ఈతాబేదారులిచ్చునలహా ప్రకారమే కంపెనీ పరిపాలన మంతయు నడుపబడుచుండెను. కాబట్టి ఈ దేశములోని అంతరంగిక పరిపాలనలో ప్రజాపీడనము హెచ్చగుటయు తగ్గుచుండుటయు ఆ యా కాలములనాటి గవర్నరు జనరలు మొదలు క్రిందివరకుగల తాబేదారుల మంచి తనముపైనను చెడ్డతనముపైనను ఆధారపడియుండెను. క్లైవు వారెన్ హేస్టింగ్సులకును, కారన్‌వాలీసు బెంటింకులకును, గల తారతమ్యమే డల్‌హౌసీ రిప్పనులకును, కర్జనువిల్లింగ్డనులకును, ఇర్విన్ లిన్‌లిత్గోలకును గలదు. నిరంకుశత్వములో కుడి ఎడమ, ప్రజాపరిపాలనలో విచక్షణ, ప్రజాసౌకర్యములందు వృద్ధిక్షీణ ములు, విజ్ఞాన వికాసమునందు పెరుగుతరుగులు, ప్రజల హక్కులందు ఎదుగుబొదుగులును ఈ తారతమ్యమునందే యిమిడియున్నవని ఆంగ్లరాజ్యస్థాపననుండి నేటివరకు ప్రయో

గింపబడిన బ్రిటిషు రాజ్యతంత్రమునందు చేయబడిన పరిపాలనా విధానమునందు స్పష్టముగా గనబడుచున్నది.

భారత దేశమున బ్రిటిష్ పరిపాలన స్థాపింపబడిన పిదప నీ దేశమును పరిపాలించుట కంపబడిన వారిలో కెల్ల విలియం బెంటింకు, సర్ తామస్ మన్రో, స్ట్రాచీ, ఎల్ఫిన్‌స్టనులు చాలా ఉదారులైన రాజ్యనీతిజ్ఞు లని పేరుపొందినారు. వీరికాలమున నింగ్లాండులో గూడా ఉదార రాజనీతిజ్ఞులే ప్రభుత్వము చేయుచుండినందున నచ్చటగూడా ప్రజలకు ప్రాతినిధ్యము వృద్ధిచేయబడినదనియు, నీ దేశమునగూడా కొంత ఉదార రాజ్యపరిపాలనా పద్ధతి అమలుజరుగుట కదియె కారణమనియు రమేశచంద్ర దత్తుగారు వ్రాసియున్నారు. ఆనాడు మన దేశమున రాజకీయ సంస్కరణలు కొన్ని జరిగినమాట వాస్తవమే; భారతీయులకు హెచ్చుగా ఉద్యోగము లివ్వవలెనని విద్యనేర్పవలెనని వీరు శిఫారసుచేసినమాటయు నిజమే; తక్కిన పరిపాలకులతో పోల్చిచూచినచో వీరు ఉదారులను మాటయుగూడ నిజమే; గాని భారత దేశమున ఉదార రాజనీతికింగ్లాండులో ఉదార రాజనీతిజ్ఞులు ప్రభుత్వము వహించుట మాత్రము కారణముకాదు. నిజముగ నీ దేశము నింగ్లాండు ఆక్రమించుటలో గాని దీనిని ఇంగ్లాండు లాభముకొర కుపయోగించుటలోగాని ఆంగ్లేయ రాజకీయ పక్షముల వా రెవ్వరు వెనుకబడినవారు కారు. విలియంబెంటింకు, మన్రో, ఎల్ఫిన్‌స్టను లెంతమంచి వారైనను భారతదేశపరిపాలనమునం దెంత ఔదార్యబుద్ధి చూపినను అసలు వ్యవహారమందు మాత్రము వీరు వెనుకబడ

లేదు. వీరుకూడా బ్రిటిష్ ప్రభుత్వమును గట్టిపరచినవారే. కొన్నాళ్ళు మద్రాసుగవర్నరు పనిజేసి ఎంతో మంచివాడనియు ఉదారుడనియు పేరుపొందిన సర్ తామస్ మన్రోకూడ సామ్రాజ్య తత్వమునందు ఇతర ఆంగ్లేయ రాజ్యతంత్రజ్ఞులకు తీసికట్టు కాడు. ఈ సంగతి ముఖ్య సైనికాధికారిగా నితడు 1790 లో సీమకు వ్రాసిన రహస్యపు ఉత్తరమువలన తెలియగలదు. "దేశీయరాజులకు మధ్య రాజ్యాధికారమును పంచియుంచుటకు మన మిప్పు డవలంబించుచున్న పద్ధతి యెంత మాత్రము బాగుగలేదు. వీరి నందరిని జయించి ఆరాజ్యాధి కారమునంతను మనమే కాజేయుట యనున దొక్కటే సరియగు రాజనీతి మార్గము, సరియైన పద్ధతి. ఈపద్ధతి వలన మన కిప్పుడు వచ్చుచున్నదానికంటె మూడు రెట్లు రివిన్యూ అవలీలగ రాగలదు. ఆ రాజ్యాధికారము నంతను మన మిప్పుడే ఒక్కసారిగనే దిగమ్రింగవలెనని నాయుద్దేశముకాదు; ఏలననగా అది యిప్పుడు మనకు సాధ్యముకాదు. నేను చెప్పునది యేమనగా ఈపరమలక్ష్యమును మాత్రము మనము మరచిపోకుండా సదా మన దృష్టియందుంచుకొని మనము మెలుకువతో పనిచేయవలసియుండును. ఈ సంకల్పసిద్ధి నెర వేరుటకు చాల సంవత్సరములు పట్టునను సంగతి నాకును తెలియును. అయినను దానిని మన దృష్టినుండిమాత్రము జారిపో నీయకూడదు. మన మెప్పుడు రంగములోనికి రావలెనో దేశీయరాజుల అంతఃకలహములే మనకు తప్పక చెప్పును. కాని టిప్పు ఉన్నంతవరకు మాత్రము మనకు ఆ సుముహూ

ర్తము ఎన్నడును రాజాలదు." అతడే ఇంకొక లేఖలో నిట్లు వ్రాసెను. "తరుణము కొఱకు వేచియుండి మనకెక్కువ అపాయముగాని ఖర్చుగాని లేకుండగనే అచిరకాలములోనే దక్షిణాపథద్వీపకల్పములో చాలభాగము మన మాక్రమించుకొనవచ్చును. దీనికిగాను మనము మొట్టమొదట క్రిష్ణా సాహెబును కూలద్రోయవలెను." (కారెన్సు పుట 368, 382,) ఇక ఎల్ఫిన్స్టన్ అన్ననో మహారాష్ట్రుల ఆధిపత్యమును నాశనము చేయుటకు జరిగిన కుటిలరాజ్యతంత్రప్రయోగములందును, రాజ్యాక్రమణయుద్ధమందును పాల్గొనిన తరువాత నితడా దేశమునకే పరిపాలకుడైనాడు.

## V

భారతదేశపు ప్రజలుకూడ ఆంగ్లేయులకువలెనే కలెక్టరు జడ్జీ మొదలగు పెద్దయుద్యోగములు చేయుటకర్హులనియు, తగు ప్రోత్సాహమిచ్చినచో అతిసమర్థతతో తమ దేశపరిపాలనమును నిర్వహింప గలుగుదురనియు ఎల్ఫిన్స్టన్ కంపెనీ డైరెక్టర్లకు వ్రాసియుండెను. సర్ తామస్ మన్రో చనిపోవుటయు ఎల్ఫిన్స్టన్ పదవి చాలించుకొనుటయు ఒకేసంవత్సరమున 1827లో జరిగినదిగాని గ్రుడ్డిలో మెల్లయన్నట్లు వీరివలెనే ఉదార రాజనీతిజ్ఞుడును స్వాతంత్ర్య ప్రియుడునని పేరు పొందిన విలియం బెంటింక్ ఆ సంవత్సరముననే భారతదేశమునకు గవర్నరు జనరలుగా నియమింపబడెను. ఇతడు వారిపద్ధతులతోనే పరిపాలింపసాగెను. 1831 వ సంవత్సరమున మున్సబులు సదరమీనుల రెగ్యులేషనుచేసి భారతీయులలో సమర్థత

గల యుద్యోగులకు హెచ్చు న్యాయవిచారణాధికారముల నిచ్చుచు "సదరమీన్" అను హోదాగల న్యాయవిచారణాధికారివర్గమును నిర్మించెను. 1833 వ సంవత్సరమున భారతీయోద్యోగులకు కొంత పరిపాలనాధికారమును (executive) రివిన్యూ అధికారమునుగూడ నొసగుచు డిప్యూటీకలెక్టరును కొత్తహోదాగల యుద్యోగ వర్గమునుకూడా నిర్మించెను. నాటినుండి నేటివరకు క్రమక్రమముగ కొన్ని గొప్ప ఉద్యోగములుకూడా భారతీయులు అతిసమర్థతతో నిర్వహించుటయు కొందరు గవర్నరులుకూడా అగుటయుకూడ తటస్థించిన దీతనిప్రసాదమేయని చెప్పక తప్పదు. అయినను ఆనాడు వీరియుద్దేశము మనకు లాభముకలిగింపవలెనని కాదు. భారతీయులను నియమించినచో వ్యయము తగ్గునసియే. 1822 లో జరిగిన భూమిశిస్తుల నిర్ణయము (Land Settlements) వలన ఉత్తర హిందూస్థానములో భూమిమీదవచ్చు (ఆదాయపువిలువ) కట్టుబడిలో నాల్గంట మూడువంతులు భూమిశిస్తుగా వసూలుచేయుటకు ప్రభుత్వమువారివల్ల నిర్ణయింపబడెను. ఇది మిగులభారముగా నుండెను. అందువలన కట్టుబడిలో 2/3 వంతులు మాత్రమే భూమిశిస్తుగా వసూలు చేయుపద్ధతిని బెంటింకు స్థాపించెను. దానిప్రకారము 1833 లో ఒక సెటిలుమెంటు జరుపబడి ప్రజలకు కొంత సౌకర్యమును కలిగించెను.

నాడు రాజా రామమోహనరాయలు తన అద్వితీయమైన మేధాశక్తిని భారతీయ క్షేమలాభములకొరకును, సంఘ

సంస్కరణములకొరకును, విజ్ఞానాభివృద్ధికొరకును వినియోగించుచు మహోపన్యాసముల గావించుచు దేశములో ప్రచారము చేయుటయేగాక ఇంగ్లండుకుపోయి భారత దేశ ప్రజల పక్షమున పనిచేయసాగెను. ఈతడు బెంటింకుప్రభువునకు మిత్రుడయ్యెను. ఈతని ప్రోత్సాహముతో సహగమనము నిషేధింపబడెను. నాడు దేశమునెల్ల సంక్షుభితముచేసిన "థగ్గు"లను దారిదోపిడి గాండ్రను హత్యగాండ్రను అణచివేయుటకు బెంటింకు చాల పనిచేసెను.

1833 లో కంపెనీవారికి క్రొత్త రాజ్యాధికార పట్టా యివ్వబడుతరుణమున చేయబడిన రాజ్యాంగ చట్టమువలన కొన్నిసంస్కరణములు జరుపుట కేర్పాటు గావింపబడెను. ఆచట్టమునుబట్టి భారత దేశమునకు తాను చేయగలిగిన ఉపకారములను బెంటింకు చేసినాడు. దేశములో జరుగుచుండిన వర్తకమునకు కంపెనీ రాజ్యప్రారంభము నుండియు సుంకములు విధించు ఆచారముండెను. అందువలన ప్రజల వర్తకమున కాటంకము కలుగుచుండెను. ఇది ఈ కాలముననే రద్దుచేయబడెను. ఈ మధ్యకాలములో జరిగిన సంస్కరణములవలన దేశముయొక్క రివిన్యూ ఆదాయములో 1814 మొదలు 1834 వరకు కొన్ని కోట్ల రూపాయలు నష్టము కలిగెను. దానిని పూడ్చుటకు బెంటింకు పరిపాలనలో కొంతపొదుపు చేసెను.

భారతీయోద్యోగులకు సివిలు అధికారములు హెచ్చు చేయుటవలనను ఆంగ్లేయులకు కలకత్తా సుప్రీముకోర్టుకు సివిలు అప్పీళ్ళు చేసుకొనుహక్కు తీసివేయుచు చట్టమొకటి

చేయబడినందునను బెంటింకుపైన తెల్లవారు క్రోధమువహించి దుర్భాష లాడసాగిరి. గాని బెంటింకు లెక్క సేయలేదు. "నోరు లేని జనసామాన్యము అజ్ఞానులగు అవకాశము చూచుకొని ఆ అజ్ఞానమును చిరస్థాయిగా చేసి దానివలన అక్రమలాభము లను కొన్ని పొందుటయే ఈ ప్రభుత్వముయొక్క ఈ ద్దేశ మను తలంపు బ్రిటీషునీతికిని ధర్మమునకును విరుద్ధము" అని బెంటింకు ప్రభువు పలుకుచు పాఠశాలలను విరివిగా స్థాపించి విద్యాభివృద్ధికి తోడ్పడెను. దేశీయవార్తా పత్రికలను స్థాపింప బ్రోత్సహించెను.

విలియంబెంటింకు ఇట్లు ఏడేండ్లు అతిసమర్థతతో పరిపా లించి 1835 లో తన పదవి చాలించుకొనెను. తరువాత నితడు పార్లిమెంటు మెంబరై 1839 లో చనిపోయెను.

భారతదేశము భారతీయుల క్షేమలాభముల కొరకే పరిపాలింపబడవలెననియు దానివలన బ్రిటీషువారు పొందు లాభములు కేవలము నైమిత్తికములుగ మాత్రమే యుండ వలెననియు ప్రధానములై యుండరాదనియు నొక గొప్ప సూత్రమును విలియంబెంటింకు ప్రారంభించెనని ఇంగ్లాండులో 1853 లో ప్రభువులసభలో సాక్ష్యమిచ్చుచు ట్రివెలియన్ పలికినాడు.

## VI

1836 మొదలు 1856 వరకును అనగా బెంటింకు పదవి చాలించుకొనిన తరువాత 'మన్రో ఎల్‌ఫిన్‌స్టన్'ల నాటి మంచి పద్ధతులు బెంటింకునాటి ఔదార్యాదిగుణములు అడుగంటి

పోయినవి. నిరంకుశులగు ప్రాతఅధికారులవంటి వారే మరల పరిపాలనకువచ్చిరి. అంతట పూర్వపద్ధతులతోనే రాజ్యాక్రమణలకొరకు కుతంత్రములు, అక్రమయుద్ధములు చేయబడి, ఎంతో సొమ్ము ఖర్చుపెట్టబడి, ప్రజలకు బాధకలిగించి, సింధు పంజాబు బర్మాలు కలుపుకొనబడినవి. డల్‌హౌసీ ప్రభువు 1848లో గవర్నరుజనరలు కాగానే ఈనిరంకుశత్వము రాజ్యాక్రమణము మితిమీరి ఇంకను చిత్రమైనపద్ధతు లవలంబింపబడినవి. ఇంతవరకును బ్రిటిషువారిపట్ల భక్తివిశ్వాసములు కలిగియున్న నవాబులును రాజులునుగూడ పదభ్రష్టులుగా చేయబడి కూలద్రోయ బడసాగిరి. నాగపురము అయోధ్యయు కలుపుకొనబడెను. భాంస్లే రాజు మరణింపగా నతని దత్తపుత్రుడు నాగపుర సింహాసనమెక్కెను. అయితే అతని దత్తత నంగీకరింపక డల్‌హౌసీ అతనిని బంధించి రాణివాసములోని నవరత్నఖచితములగు నగలనెల్లవశముచేసికొని బహిరంగముగా వేలము వేయించి రాజ్యమునుగూడ లాగికొనెను. ఝాన్సీరాజు 1853లో మరణింపగా, అతనికిని అతనివారసులకును దత్తపుత్రులకును వారి సంతతికినికూడ రాజ్యాధికారముండునట్లు పూర్వము చేసికొనిన ఒడంబడికకు భంగకరముగా డల్‌హౌసీ ప్రవర్తించెను. సైనిక వ్యయములక్రింద బీరారును నైజామువల్ల పుచ్చుకొనెను. ఇంతటితో తృప్తిజెందక నవాబులకు చూపవలసిన గౌరవ మర్యాదలనుగూడ ఇతడు తీసివేసెను.

## VII

డల్‌హౌసీ తన స్నేహితులకు వ్రాసినలేఖలను * బట్టి యాతని కాలమునాటి స్థితిగతులును బ్రిటిషు రాజ్యతంత్రమును కొంత బయల్పడుచున్నవి.

18 వ సెప్టెంబరు 1848 :

"నే నిచ్చట దర్జాగా కూర్చుని రాళ్ళురువ్వినట్లు రాజులను, రాజ్యములను ఇటునటు గిరవాటు వేయుచుండుట చూడగా నాకే నవ్వువచ్చుచుండును. నీవు నాశ్చర్యపడుదువు. నవ్వువచ్చుచున్నను ఇది కష్టమగు పనియే సుమీ" అని డల్ హౌసీ వ్రాసెను. ఇప్పటికి ఆతడు గవర్నరుజనరలై సంవత్సరము తిరుగలేదు !

7 వ మార్చి 1849 :

"ఇప్పుడు వ్యవహారము కొంత బాగున్నది. ఒక స్నేహితుడు నన్ను చూచి 'నీవును రష్యాదేశపు చక్రవర్తియుమాత్రమే ప్రస్తుత కాలమున నిర్భయులగు నిరంకుశ పాలకు'లని వ్రాసిన సంగతి వాస్తమేయని నాకిప్పుడు స్ఫురించుచున్నది."

30 వ మార్చి 1849 :

"చేప నావలలో పడినది. (సిక్కు) మహారాజు బ్రిటిషు అధికారమునకు లొంగి పత్రమును వ్రాసినాడు. కోహినూరు వజ్రమును మన రాణి కిచ్చి వైచినాడు. పంజాబులో ప్రతియంగుళమును బ్రిటీషు పరగణాగా ప్రకటింపబడినది. ఈరాజ్య

---

* Private letters of Marquess of Dalhousie.
—J. G. A Baird.

నీతియొక్క యావశ్యకతనుగూర్చి నే నారునెలల క్రిందటనే మన యధికారవర్గము వారికి వ్రాసియున్నాను. వారు సరియైన జవాబు నీయలేదు. నేను నా బుద్ధిపూర్వకముగనే ఇట్లు చేసితిని. వారి పరిపాలనమునందలి యుద్యోగి బ్రిటిషు సామ్రాజ్యమునకు నలుబది లక్షల ప్రజలను కలిసి మొగలు సామ్రాజ్యపు దివ్యరత్నమును తన రాణి కివ్వగలుగు అవకాశము ప్రతిదినము దొరకదు. ఇది నేను చేసితిని."

5 వ అక్టోబరు 1849:

చత్తర్ సింగును షర్ సింగును సిక్కు పాలకులు. వారనుదినము నూర్వురు బ్రాహ్మణులకు భోజనము లిడుచుండిరి. వారి నరెస్టుచేసి ఇతడు, "ఈ బ్రాహ్మణులు కుతంత్రములకు, రాజద్రోహ తంత్రములకు నుపసిద్ధులు," అని వ్రాసెను.

15 వ డిశంబరు 1849:

తనకు లాహోరులో జరిగిన స్వాగత మహోత్సవమునుగూర్చి యిట్లు వ్రాసెను: "...లెక్కకుమీరినగుంపులు చేరిరి. నే నెచ్చటికి పోయినను సలాములు మిన్ను ముట్టుచుండెను. ఇది మన పరిపాలనము పట్ల ప్రజలకుఁ గల ప్రీతిని తెలుపునని తలంచునంతటి మూర్ఖుడనుగాను. కాని వారు లోబడిరనియు, వారు బాగుగా భయపడినారనియు, మనకు హస్తగతులైనారనియు మాత్రమిది తెలుపుచున్నది."

4 వ ఆగస్టు 1850:

"......యుద్ధముముగిసిన పదునెనిమిది మాసములలో మన పరిపాలనకు వ్యతిరేకుడగు ప్రతిసిక్కును పనిపట్టించితిని.

ఒక్కడైనను స్వేచ్ఛగలేదు. అశక్తదుర్జనత్వముగల నారాయణ సింగు పారిపోవగా వానిని సైతము పట్టుకొని బంధించితిని."

1 వ డిశంబరు 1850 :

"అయిదేండ్లకు ముందు అమృతసరపు వీధులలో ఐరోపీయుడు నిలుచుటకు భయపడుచుండెను. ఈ రోజున వారి కోరికపైననే వారి పవిత్రస్థలమున, గ్రంథ సాహెబు సన్నిధిలో నొక ఇంగ్లీషు గవర్నరుజనరలు నిలిచినాడు. సాహసులును, హంతకులును, మతావేశులునగు అకాలీలే అతని యెదుట సాగిలిపడి మ్రొక్కిరి. అయినను పంజాబుపరిపాలన బాగుగలేదని సర్ చార్లెసు నేపియ రనుచున్నాడు!"

30 వ జూలై 1851:

"ఈమారు నైజామును చాలబాగుగా బెదరించి హడలగొట్టితిని. ఈమారు క్రిష్టమసు పండుగకుముందు ఎనిమిది లక్షల పౌనులను క్రిక్కనని నా ధైర్యము."

1 వ ఫిబ్రవరి 1852 :

"ఈమారు ఢిల్లీలోకూడా నా పంతము నెగ్గినది. వారసత్వము అంగీకరించెదనని చిన్న రాజకుమారునికి చెప్పి నా మాటలు వినునట్లుచేసి నాకు గావలసినదెల్ల తెచ్చితిని. ఇతరుల చేతులలోనున్న యెడల మనకు చాల భయంకరమును, మన చేతులలోనున్న యెడల మన కత్యంతోపయుక్తమగు నాయుధాగారమును కాగల ఢిల్లీలోని గట్టికోటనుకూడ సంపాదించితిని. ఆ కోటయొక్క వెలుపలిప్రక్కగోడ చాలగట్టిది. వాని రాజనగరుతోపాటు కిరీటమునుగూడ తీసికొనవలెనని నాకున్నది.

కాని డైరెక్టరుల కోర్టువారు వడవడ వడకిపోయిరి. ఆరునెలలు మాటలుజరిపి తుద కా గాజులు తొడుగుకొనినవారి నేల భయ పెట్టవలెనని యూరకుంటిని."

18 వ ఆగష్టు 1853:

"అయోధ్యరాజు కొంచెము పెంకితనము చూపునట్లు న్నాడు. చూపవలెననియే నా కోరిక. నేను పోవులోపల వానిని కబళించుట నాకు తృప్తిని కలిగించును. ముసలి ఢిల్లీ రాజు చచ్చుచున్నాడు. డైరెక్టర్ల కోర్టువారు భయపడనియెడల వానితో తైమూరువంశము నంత మొందించి యుందును."

22 వ అక్టోబరు 1854:

"రాణులతోను, రాజులతోను విందులారగించిన పిదప, ధులీప్‌సింగు, గవర్నరుజనరలు గదిముందు పాదరక్షలు విడిచి లోనికివచ్చుట కిచ్చగించునని నేనుతలంపను. అయినను అతడు పాదరక్షలు విడుచునట్లు చేసితీరెదను."

22 వ జూలై 1855:

"........మన బ్రిటీషువారు వింతవస్తువుల కోస మను నెపమున బొరియలుపెట్టి నవరత్నములను లాగని దేవాలయమే లేదు. ఒకమారు నేను రంగూనులో నట్టి వింత వస్తువులు కొనియుండుటవలన నీ యన్యాయములో నాకును పాలున్నదని తోచుచున్నది."

2 వ డిశంబరు 1857 - లేఖకు 130 వ పుటచూడుడు.

డల్‌హౌసీ భారతీయులను ఇంగ్లీషువారిని బులిపింప గల రాజకీయసంస్కరణములు నాగరకతాచిహ్నములు కొన్ని

వెలయింపజేసెను. పూర్వమునాటినుండియు కంపెనీవారి ప్రభుత్వాచార వ్యవహారములలో రాజరికమునకు విరుద్ధములును వర్తకసంఘచిహ్నములును అగు వ్రాతకోతలునుమరియాదలును వ్యవహారవిధానములును ఇంకను నిలిచియుండెను. అవియన్నియు నీతడు మాన్పించి బ్రిటిషు రాజ్యతంత్రముయొక్క ప్రధాన పద్ధతులలో ముఖ్యమైన పరిపాలనా శాఖల విభజనమును అతి నేర్పుతో చేసి నేటిప్రభుత్వ ఉద్యోగవర్గ ఉక్కుచట్రమునకు పునాదులు వేసెను. రైతులకు రాకపోకల సౌకర్యములకు గ్రామములకు రోడ్లు, పొలములకు నీటివసతులు, వృద్ధిచేయుట యత్యవసరమై యుండగా కేవలము సైనిక సదుపాయముల కొరకే నిర్మింపబడి ఆ నిర్మాణముల వలన ఆంగ్లేయుల కమిత లాభము కలిగినట్టిటీవల అర్థశాస్త్రజ్ఞులు నిర్ణయించిన రైళ్ళను నిర్మించుట కీతడు దారిచూపి మొదటిరైలుదారిని నిర్మింపజేసినాడు. తంతి తపాలాపద్ధతికూడ నెలకొల్పినాడు. 1854 లో విద్యావిధానమును గూర్చి ఒక ప్రణాళికతయారుచేయబడెను. జిల్లాలలో పాఠశాలలు నెలకొల్పబడెను. విశ్వవిద్యాలయస్థాపన చేయుట కాలోచించిరి.

గుడ్డిలో మెల్లయనునట్లు ఈ నిరంకుశయుగమున ఒక్క లాభము మాత్రము ప్రజలకు కలిగి రాజకీయ పరిజ్ఞానము వృద్ధియగుటకును ప్రజాభిప్రాయము వర్ధిల్లుటకును అందువలన ప్రజలు తమ హక్కులకొరకాందోళనచేయుటకును కారణమైనది. బెంటింకుకును ఆతని తరువాత వచ్చిన ఆక్లెండుకును మధ్య కొన్నాళ్లు గవర్నరుజనరలుగా ఆక్టింగుచేసిన మెట్‌కాఫ్

దేశములోని ముద్రాలయములపైన వార్తాపత్రికలపైన అంత వరకుండిన కఠిన నిరోధక నిర్బంధములను తీసివేసెను. అంత వరకును వార్తాపత్రిక నిర్వహణము కేవలము ఆంగ్లేయుల చేతి లోనే కలకత్తాలో నుండెను. భారతీయుల కందు తావులేదు. బెంటింకుమాత్రము కొంచెము ప్రోత్సాహ మొసగెను. మెట్ కాఫ్ చేసిన ఉపకారమువల్ల దేశములో భారతీయ విద్యాధికులు మెల్ల మెల్ల గా పత్రికా నిర్వహణమునకు పూనుకొని ప్రజాభి ప్రాయమును రాజకీయ పరిజ్ఞానమును వృద్ధిజేసి దేశమునకు తోడ్పడసాగిరి. విద్య యభివృద్ధి జెందుటవలనను పత్రికలు స్థాపించబడుటవలనను అంతవరకు స్తంభీభూతమై పోయియున్న ప్రజాభిప్రాయ మొక్కమారుగా వెలికివచ్చెను. ఆనాడు క్రైస్తవమత బోధకులు హిందువులను తమ మతములో కలుపుకొనుటకు చేయుచున్న దుష్ప్రయత్నములను గూర్చి తీవ్రమైన సంచలనమును ఆందోళనమును కలిగి స్వదేశసంఘ ములు స్థాపింపబడి దేశోద్ధరణ ప్రయత్నములకు మార్గము లేర్పడెను.

## ఆ ర వ ప్ర క ర ణ ము

## రా జ్యాం గ ని ర్మా ణ ము

### I

ఇంగ్లీషు రాణియగు ఎలిజబెత్తు తూర్పు ఇండియా వర్తక సంఘమువారికి 1600 సంవత్సరమున నిచ్చిన సన్నదు లేక పట్టా ఆకంపెనీవారు భారతదేశమున వ్యాపారము చేయుటకు

వలసిన అధికారములు మాత్రమే ఒసగియుండెను. రాణీవల్ల పట్టాపొందిన ఈ కంపెనీ ఒక రాజకీయసంస్థగాని రాజ్యాంగ సంస్థగాని కాదు. కేవలము వ్యాపారసంస్థ. అందువల్ల ఇతరులతో యుద్ధముచేయుటకు సంధియొనరించుటకు అధికారముగాని, దేశాక్రమణము జేసి రాజ్యపరిపాలనము చేయు అధికారముగాని దీనికిలేదు. రాజ్యపరిపాలనలో ప్రధానాధికారములగు పరిపాలన శాసననిర్మాణ న్యాయవిచారణలు జేయు అధికారములును లేవు. ఈ అధికారములెల్ల ఈకంపెనీవారు ఇంగ్లాండురాజులవలన పార్లమెంటు వలన క్రమక్రమముగాపొంది భారతదేశములో రాజ్య పరిపాలనచేయు అధికారులైరి. ఈ కంపెనీవారి వాటాదారులు ఇంగ్లాండులోనేయుండి దీని వ్యవహారములు నిర్వహించుటకు కమిటీగానుండిరి. 500 పౌనుల వాటాయున్న వారికి వోటుహక్కు 2 వేల పౌనుల వాటాయున్నచో డైరెక్టరుగా ఎన్నుకొనబడుహక్కును ఉండెను. మెజారిటీ అభిప్రాయమునుబట్టి వ్యవహారములు తీర్మానించుకొనిరి. మొదట ఈకంపెనీ కార్యనిర్వహణము 24 మంది వాటాదారులు, ఒక గవర్నరు, కలిసిన 'జనరల్ కోర్టుఆఫ్ ప్రొప్రియిటర్లు'నియు, తరువాత "డైరెక్టరుల కోర్టు" వారను గౌరవ బిరుదుతోను పని చేసెను. వీరు ప్రారంభములో నిండియాకు ఓడల నంపి అచ్చట ఎగుమతి దిగుమతి వ్యాపారము చేయుటకు వీలుగానుండునట్లు సముద్రతీరములందు వర్తకస్థానములను నిర్మించిరి. ముఖ్యమైన వర్తక స్థానములగు మద్రాసు బొంబాయి కలకత్తాలలోని ఫ్యాక్టరీ వ్యవహారములను నిర్వహించుట కొక

పరిపాలక వర్గమును నిర్మించిరి. ఒక్కొక్క చోట నొక్కొక ప్రెసిడెంటు లేక గవర్నరు నితనితో కలిసి ఆఫ్యాక్టరీ వ్యవహారములు నిర్వహించుటకొరకు కౌన్సిలు లేక కార్యాలోచన సభయు నిర్మింపబడెను. ఈ సభలలో అనుభవజ్ఞులగు కంపెనీ యుద్యోగులు నియమింపబడిరి. అన్నిపనులును మెజారిటీ అభిప్రాయము ప్రకారము నిర్వహింపబడునట్లు కట్టడిచేసిరి.

ఈ ప్రెసిడెంట్లను బట్టియే యీ మూడుప్రదేశములకు ప్రెసిడెన్సీ లేక రాజధాని అనిపేరు వచ్చెను. ఈ రాజధాను లొకదాని కొకటి లోబడియుండలేదు. కంపెనీ యుద్యోగులు, రైటర్లు, ఫ్యాక్టర్లు, సీనియర్ ఫ్యాక్టర్లు, మర్చెంట్లు అను తరగతులవారుగా విభజింపబడిరి. సీనియారిటీ వల్లనే ప్రమోషను లివ్వబడుచుండెను. వీరికి చాలా స్వల్పజీతము లుండెను. ప్రయివేటు (స్వంత) వర్తకము చేసుకొనవచ్చును. కంపెనీ నౌకర్లుచేయు నేరములను విచారణచేసి శిక్షించుట అవసరముకాగా కంపెనీవారు అప్పటి ఇంగ్లాండురాజగు జేమ్సు వల్ల 1623లో ప్రెసిడెంట్లకును ఇతర ముఖ్యాధికారులకును క్రిమినల్ విచారణాధికారము నిచ్చుటకు పట్టాపొందిరి. తరువాత 1661 లో నీ కంపెనీవారు పొందిన సన్నదువలన మరికొన్ని అధికారములను వీరు సంపాదించిరి. వీరికి పోటీగా భారతదేశ సముద్రతీరములందు వ్యాపారము చేయుటకువచ్చినవారి ఓడలను పట్టుకొను అధికారమును పొందిరి.

కంపెనీవారు సముద్రముపైన తమ నౌకలందువలెనే మొగలాయిరాజ్యమునగల భూమిపైనకూడా తమకంపెనీ నౌక

ర్లపైన తామే సివిల్ క్రిమినల్ చర్యలు జరుపుకొను అధికారములను మొగలాయి చక్రవర్తి ఫర్మానావలన పొందిరి. దీనినిపురస్కరించుకొని తరువాత వీరు తన ప్రజలపైన కూడా అధికారము చలాయింతురని అతడు కలనైనను తలపలేదు. ఈ కంపెనీలో చేరినవారుతప్ప ఇతరు లెవరైనను తమతో పోటీవ్యాపారము చేయవచ్చినచో వారిపైన ఓడదొంగలను నేరములు మోపి హింసించుచుండిరి. తమదేశస్థులను నౌకర్లనుగూడ వీరికాలమున చిత్రహింసలు చేయుచుండిరి. వీరికి సైనిక శాసనాధికారము రాక పూర్వము వీరు కొరడాలతో చావబాదుచుండిరి. తరువాత ఓడదొంగలను ఉరితీయుటకొరకు వీరుపొందిన అధికారమును దుర్వినియోగము చేయసాగిరి. స్వతంత్రవర్తకుల ననేకులనట్లు ఉరిదీసిరి. వీరి దుండగముల కాగ్రహించి మొగలుచక్రవర్తి వీరిని మందలించుటయు వీరిపైన దండయాత్ర చేయుటయు కూడ జరిగినది.

ఫ్యాక్టరీప్రదేశములందుండువారెల్లరిపైనను గూడ క్రిమినలు విచారణాధికారము ఫ్యాక్టరీ కౌన్సిలు సభాయుతులగు గవర్నరుల కొసగబడుటకు ఫర్మానా పొందిరి. 1676 నాటికి కంపెనీవారు భారతదేశములో రాజ్యతంత్రము నడుపు పద్ధతిలోనికి దిగినందున యుద్ధము లవసరమైనందున ఆసియా దేశములందలి రాజులతోను ప్రభుత్వములతోను యుద్ధప్రకటన చేయుటకు సంధిచేసికొనుటకు అనుజ్ఞను పొందిరి. 1686 లో కంపెనీవారి అధికార ప్రదేశములందు న్యాయపరిపాలనజేయుట కొక న్యాయస్థానము నెలకొల్పబడెను.

అంతట నీ కంపెనీవారికి ఋణ మవసరము కాగా అందు కవసరమైన అధికారమును పొంది 1694 లో 12 లక్షల పౌనుల ఋణపత్రములను జారీచేసిరి. ఇట్లు రాజస్వకోశ సంబంధ అధికారములుకూడ వీరికి లభించెను.

భారతదేశమునందు కేవలము వర్తకము చేయుటకు వచ్చిన వ్యాపారసంస్థ తన వ్యవహారములు నిర్వహించుకొను నెపముననే ఇట్లు కొన్ని రాజకీయాధికారములను పొందెను. అంతట వీరి ఫ్యాక్టరీ పరిపాలకులగు గవర్నరులు కౌన్సిళ్ళు ఒక విధమగు పరిపాలనాధికారముగల సంస్థలుగా పనిచేయసాగెను. నాటి కింకను వీరికి శాసననిర్మాణాధికారము లేదు. వీరి వర్తకస్థానములందు కేవలము సైనికశాసనమే అమలులో నుండెను. ఇట్టి స్థితిలో బొంబాయి కౌన్సిలు ప్రెసిడెంటు, ఈ కంపెనీ యొకవిధమైన స్వతంత్రరాజకీయ సంస్థగానున్నందున తమ ఫ్యాక్టరీల పరిపాలనకు సంబంధించినంత వరకైనను శాసననిర్మాణాధికారము చలాయించు హక్కు వీరికి కలదని వాదింపగా 1686 నాటికి శాసననిర్మాణ అధికారముకూడా ఏర్పడి మద్రాసు కలకత్తాలలో గూడ చలాయింప బడసాగెను. ఈకంపెనీవారు భారతదేశములో ప్రయోగించిన రాజ్యతంత్రమువల్ల దీని అధికారములెల్ల క్రమక్రమముగా అభివృద్ధిగాంచి కంపెనీ నొక జమీందారీగాను స్వతంత్ర సంస్థానముగాను తుదకు దేశపరిపాలనజేయు ప్రభుత్వముగాను మార్చిన చరిత్ర చాల చిత్రమైనది.

జేమ్సు మిల్లు తన చరిత్రలో చెప్పినట్లు ఔరంగజేబు

మరణించుటతో 1707 మొదలు వీరిచరిత్రలో నూతన యుగము ప్రారంభమయ్యెను. కేవలము వర్తకులుగనుండి బహు వినయ విధేయతలతో రాజుల నాశ్రయించిన వర్తకులు బలవంతులై దేశములోని రాజుల పోరాటములందు తాముగూడ కల్పించుకొని రణరంగమున బ్రవేశింపసాగిరి. కయ్యమునకు కాలు ద్రువ్వుచు ధనలాభము, రాజ్యములో పలుకుబడియుకూడా పొందుట ప్రారంభించిరి. ఇక్లైబదేండ్లలో వీ రమితధనమును, పెక్కుజాగీరులను సంపాదించిరి. మొగలుచక్రవర్తి పైన పలుకుబడిసంపాదించి, అతనిని వంచించి బంగాళము, బీహారు, ఒరిస్సాలలో పన్నులు వసూలుచేయు దివానీగిరి హక్కును 1765 లో పొందిరి.

## II

### దివానీగిరి-దొరతనము.

12 వ ఆగస్టు 1765వ తేదీనాటి కింకను నామమాత్రావశిష్టుడైయున్న మొగలాయి సామ్రాజ్య చక్రవర్తియగు షా ఆలంవల్ల తూర్పుఇండియా వర్తకసంఘమువా రొక ఫర్మానానుపొంది వంగరాష్ట్రమునను బీహారు ఒరిస్సాలలోను పన్నులు వసూలు, సివిలు పరిపాలన అధికారమును సంపాదించిరి. నాటి కింకను వంగరాష్ట్ర నవాబులు పేరునకు ఢిల్లీ చక్రవర్తి యొక్క రాజ ప్రతినిధులేగాని బలవంతులగు ఇంగ్లీషువారి చేతిలో వారు కీలుబొమ్మలు. మొగలు చక్రవర్తివలన కంపెనీవారు సులభముగా నొక ఫర్మానాను సంపాదించిరి. ఈ కంపెనీవారు తనకు జేసిన అనేక 'ఉపకారము'

లకు ప్రత్యుపకారముగా అతడు ఆరాష్ట్రములందలి దేశా దాయమును వసూలుచేయు "దివానీ"గిరీ అధికారము వీరి కొసగెను. ఈ ఆదాయములో సాలుకు 26 లక్షలు మాత్రము 'సర్కారు'కొసగుచు మిగతాసొమ్ము తమ సైనిక వ్యయముక్రింద వారే అనుభవించవచ్చును. నిజముగా కంపెనీ వారు బలవంతులైనందుననే ఈ ఫర్మానా జారీచేయుటయు అది అమలు జరుగుటయు సంభవించినది. దీనికే "దివానీ" అని పేరువచ్చినది. ఇట్టి "రాజస్వ" అధికారములను పొందియు, కంపెనీవారు అప్పటికే దేశమున పరిపాలనాధికారమును చలా యించుటకు శక్తికలవారైననుగూడా వీరు బహిరంగముగా తమ ప్రభుత్వమును ప్రకటింప సాహసింపక తాము పన్నులు మాత్రము వసూలుచేయుచు, పరిపాలన భారము నవాబుపై ననే వేసి నడుపదలచిరి. ఇది ఆనాడు గవర్నరైన క్లైవు నడిపిన రాజ్యతంత్రము. ఇక దేశముయొక్క సివిలుపరిపాలన పోలీసు న్యాయవిచారణశాఖలు నవాబునిర్వహింపవలసినట్లుకూడా అత నితో కంపెనీవారు ఏర్పాటుచేసికొనిరి. ఈ ఏర్పాటులన్నియు సంధిపత్రములో లిఖితమూలముగానే చేసుకొనిరి. ఈ దివానీ అధికారమును చలాయించుటలో కంపెనీ గవర్నరగు క్లైవు చాల తెలివితేట లుపయోగించెను. కంపెనీకి దమ్మిడీయైన ఖర్చు లేకుండా దళారీలకు ఇజారాలనిచ్చి సొమ్ము వసూలుచేయిం చెను. వీరే తరువాత జమీందారులైరి. వీరు ప్రజల నెన్ని విధములుగానైన బాధించి సొమ్ము వసూలు చేయుచుండిరి. దేశములో 150 లక్షలరూపాయిలు వసూలుచేసి ఇందులో

32 లక్షలు మాత్రమే క్రైవు "మొగల్ సర్కారు"న కిచ్చు చుండెను. నవాబు సొమ్ములేక రాజ్యభారము చక్కగా నిర్వహించ లేకుండెను.

"చక్రవర్తి ఫర్మానా ననుసరించి మూడు రాష్ట్రములపైన వసూలు చేయబడు పన్నులలోనుండి వంగరాష్ట్ర నవాబుకు ఇంటిఖర్చులకొరకు 17 లక్షలు, నవాబు దర్బాను నిలువబెట్టుటకు కావలసిన రక్షకభటులు, పోలీసువగైరా సిబ్బందికొరకు 36 లక్షలును వెరసి 53 లక్షల రూపాయిలు ప్రతిసాలున చెల్లించునట్లు ఒడంబడిక జరిగెను. ఈ మూడు రాష్ట్రములపైననువచ్చు అమాంబాపతు శిస్తులు కలిసి రెండు కోట్ల రూపాయిలకు తక్కువలేదని అంచనా వేయబడి యున్నది." (చూడు. టారెన్సు-ఆంగ్లరాజ్యస్థాపన పుట 114)

ఇట్లొసగబడిన దివానీ యధికారము కేవలము శిస్తుల వసూలు అధికారమే యైనను కంపెనీవారు దీనికి తరువాత అపార్థములు కల్పించి ఈ మూడు రాష్ట్రములయందు చక్రవర్తి తనకుగల సర్వాధికారములను వదలుకొని వాని పరిపాలనాధికారము తమకొసగినాడని వాదించి ఆయధికారములనెల్ల చలాయించిరి. తరువాత నీ కంపెనీవారేయన్యాయములకు గడంగినను చక్రవర్తి వలన నధికారమునుపొందియే యట్లు చేయుచున్నట్లు చాలకాలమువరకు నటించిరి.

## 1767 సంవత్సరపు కంపెనీ పట్టాచట్టము.

తూర్పుఇండియా కంపెనీవారు భారతదేశమున వర్తకము చేయుచు గొప్ప జమీందారీని సంపాదించుటయేగాక

దివానీగిరిని సంపాదించి రాజ్యాధికారములకు సంబంధించిన పన్నులవసూలు హక్కులుకూడా సంపాదించినందున ఇంగ్లాండు పార్లమెంటువారు కంపెనీవారి వ్యవహారములపైన కొంత అధికారము చలాయింపదలచి దానినిగూర్చి ఒక విచారణసంఘము నిర్మించిరి. 1756 మొదలు 1766 వరకు దేశీయరాజులతో జరిగిన ఒడంబడికలను వానికి సంబంధించిన యాపత్తురికార్డును రివిన్యూ లెక్కలను దాఖలుచేయమనిరి. కంపెనీవారు నూటికి 10 కన్న హెచ్చులాభము పంచుకోకూడదని శాసించిరి. కంపెనీవారు ఇంగ్లాండు దేశ ప్రభుత్వమునకు వంగరాష్ట్ర ఆదాయములో నుండి ప్రతిసాలున 400000 పౌనులు అనగా 60లక్షల రూపాయిలిచ్చిననే కంపెనీవారికి క్రొత్తపట్టా ఇవ్వబడునట్లు శాసించిరి. 1769 లో నీ పద్ధతి యింకను 5 సంవత్సరములు పొడిగింపబడెను. ఇట్లు భారతదేశ పరిపాలనవలన బ్రిటిష్ ప్రభుత్వమువారు ఆదాయమును గ్రహించుపద్ధతి ప్రారంభింపబడెను. ఈ సమయమున కంపెనీవారి నౌకరులు ధనికులగుచుండగా కంపెనీకిమాత్రము ఋణము కాజొచ్చెను. 1767 నాటికి 60,00,000 పౌనులఋణమయ్యెను. 1770 నాటికి వంగరాష్ట్రమున కలకత్తాలో గవర్నరు, సర్వసేనాని, ముగ్గురు సభ్యులును కలసిన సెలక్టుకమిటీద్వారా పరిపాలన వ్యవహారములు, జరుగుచుండెను. మద్రాసు బొంబాయి మొదలగు ఫ్యాక్టరీల పాలకసంఘములకు దీనితో సంబంధములేదు. అవి ప్రత్యేకముగా నుండెను.

## రెగ్యులేటింగు ఆక్టు

1772 అక్టోబరు - నవంబరు నెల నాటికి కంపెనీ దివాలా స్థితిలోనికివచ్చెను. ఆనాడు ఇంగ్లాండు ప్రభుత్వప్రధాన మంత్రి నార్తుప్రభువు కంపెనీకి ఋణ మిప్పించెద ననియు ఇందుకు ప్రతిఫలముగా తానొక క్రొత్తచట్టము ప్రకారము కలకత్తాలో నిర్మించు కార్యనిర్వాహక సంఘముయొక్క సర్వాధికారమునకు ఆ నా డిండియాలో కంపెనీవారికి వివిధ రాజధాను లందుగల 'ప్రెసిడెన్సీ కౌన్సిల్లు'ను పరిపాలనలును లోబడవలెననియు ఇండియాలోని రాజకీయ సివిలు మిలిటరీ పరిపాలనలయొక్క అధికారుల నింగ్లాండు ప్రభుత్వమువారే నియమింతురనియు దానిఖర్చులు కంపెనీ భరించుట కంగీకరింప వలెననియు చెప్పెను. కంపెనీవారి ఆంతరంగిక వ్యవహార విధాన ములో కూడా కొన్ని క్రొత్తనిబంధన లేర్పరచిరి. వేయిపౌనుల వాటాదార్లే డైరెక్టర్ల నెన్నుకొనవలెననెను. దీనికి కొందరు వాటాదార్లు ప్రతిఘటించిరి కాని తుదకా సలహా ప్రకారము జరిగెను. ఇండియా వ్యవహారములను జూచుచుండుట కొక "సీక్రెట్ కమిటి" (రహస్యఉపసంఘము) ఏర్పాటు గావింప బడెను.

1773 లో కంపెనీవారికి రాజ్యాధికారము లిచ్చుచు పార్లమెంటువారొక చట్టము జేసిరి, దీనికే "రెగ్యులేటింగు ఆక్టు" అని పేరు. ఇదివరకు కంపెనీవారేర్పరచిన కౌన్సిలు ప్రెసి డెంటులు, గవర్నరులే, ఈదేశమున అధికారము కల్గియుండిరి. ఈచట్టమువలన వంగరాష్ట్రమును పాలించుటకు ఒక గవర్నరు

జనరలు, నలుగురు కార్యాలోచన సభ్యులునియమింపబడునట్లును ఆ రాజధానిపరిపాలన, పన్నులవసూలు, అందలి సివిలుపరిపాలన సైనిక వ్యవహారములు, జరుపుటకును, ఆ రాష్ట్రమునందేగాక బీహారు ఒరిస్సాలందునుగూడ అధికారము గల్గియుండుటకును ఏర్పాటు గావింపబడెను. మఱియు నీ గవర్నరుజనరలు ప్రభుత్వమునకు మద్రాసు బొంబాయి రాజధానులలోని కంపెనీవారి కౌన్సిలు ప్రెసిడెంటుల పరిపాలనలపైన పై తనిఖీ అధికారము లివ్వబడెను.

మొట్టమొదట ఈగవర్నరుజనరలును సభ్యులను కంపెనీ డైరెక్టర్ల సలహాతో ఇంగ్లండురాజే నియమించును. వీరిని తొలగించుటకు ఆ రాజుకేఅధికార మీయబడెను. ఈగవర్నరు జనరలును కార్యాలోచన సభ్యులు కంపెనీ డైరక్టర్లక్రింద పని చేయవలెను. ఆ డైరక్టర్లు ఇంగ్లండునుండి పంపు తాకీదులను వీరు శిరసావహింపవలెను. డైరెక్టర్లకు వీ రెప్పటి కప్పుడు సంగతులు వ్రాయుచుండవలెను. ఈకంపెనీ డైరక్టర్లు భారత దేశ ప్రభుత్వమునజరుపు అన్నిచర్యలకు వ్యవహారములకు వ్రాతమూలపు రికార్డునువ్రాసి అట్టి 'మినిట్సు'యొక్క ప్రతిని ఇంగ్లీషు ప్రభుత్వమున కీయవలెను. అదివరకు ఇంగ్లండురాజు ఇచ్చిన సన్నదులోనే కంపెనీవారి రాజ్యములలో సివిలు క్రిమినలు తగవులను విచారించుటకు ఒక కోర్టునెలకొల్పబడుట కధికారముండెను. రెగ్యులేటింగుఆక్టువలన వంగరాష్ట్రమున కలకత్తాఫోర్టువిలియం కోటలో ఇంగ్లీషురాజు అధికారముక్రింద నొక పరమోన్నతన్యాయస్థానము (సుప్రీముకోర్టు) ను స్థాపించి

ఇంగ్లీషు బారిస్టర్లను న్యాయమూర్తులను ఆంగ్ల నృపాలుడు నియమించునట్లు ఏర్పాటు చేయబడెను. ఆకోర్టుకు దేశము లోని అన్ని సివిలు క్రిమినలు అడ్మిరాలిటీ మత వ్యవహారములను గూర్చిన కేసులు, విచారించు అధికార మొసగబడెను. దానిక్రింద పనిచేయు ఉద్యోగులను గూర్చిన నిబంధనలు చేయుట కధికార మొసగబడెను. 1774 మొదలు కంపెనీ పరిపాలన కొలువులో చేరిన ప్రభుత్వనౌఖరులు స్వంతలాభముకొరకు ఏనెపమునగాని ఎట్టిబహుమతిని విరాళమును దానమునుగాని వరూపముగాని ఎట్టి లంచములును పుచ్చుకొనరాదని శాసింపబడెను. ఇంగ్లీషు పార్లమెంటువారి అధికారమునకు లోబడి గవర్నరుజనరలు కార్యాలోచన సభకు, కంపెని రాజ్యమున సత్పరిపాలనకు వలసిననిబంధనలను రిగ్యులేషనులను ఆర్డినెన్సులను చేయుట కధి కారమీయబడెను. ఇవి సుప్రీముకోర్టువారివలన రిజష్టరు చేయ బడి ప్రకటించినగాని అమలు జరుగవు. వీనినిగూర్చి ఇంగ్లాం డులో ఎవరైనను ఈ ప్రభుత్వచర్యలనుగూర్చి అప్పీలు చేసినచో అవి విమర్శించబడి లోపములు సవరించబడును.

రిగ్యులేటింగు ఆక్టు వలన బంగాళాగవర్నరే ఇండియా గవర్నరు జనరలుగా చేయబడి బొంబాయి మదరాసు గవర్నరులకు పైయధికారిగా చేయబడెను. వారతని సమ్మతి లేనిదే యుద్ధములుగాని సంధిగాని చేయకూడదు. గవర్నరు జనరలుకు సహాయము చేయుటకు నలుగురు సభ్యులుగల సుప్రీముకౌన్సిలు అను కార్యాలోచనసభ యేర్పాటుచేయ బడెను. మెజారిటీ అభిప్రాయము ప్రకారము గవర్నరుజనరలు

నడువవలెను. ఈ రెగ్యులేటింగు ఆక్టు ప్రకారమే భారత దేశ పరిపాలన కొంతకాలము నడిచినది.

1784 వ సంవత్సరమున తూర్పు ఇండియా కంపెనీ చట్టము అను శాసనముచేయబడి భారత దేశమున నింగ్లీషు ప్రభుత్వమును స్థిరపరచుటకు బందోబస్తులను కట్టుదిట్టములను చేసినది. తూర్పు ఇండియా సంఘముయొక్క వ్యవహారముల క్రమ నిర్వహణము కొరకును అవి చక్కగా జరుగగలందులకును, భారత దేశములోని "బ్రిటిష్" రాజ్యముల యొక్క వ్యవహారముల క్రమ నిర్వహణమును జక్కపరచుటకును, తూర్పు ఇండియా రాజ్యములందు నేరములు చేయువారిని విచారణ చేయుటకు కోర్టు ఆఫ్ జూడికేచరును నిర్మించుటకును ఈ చట్టమును పార్లిమెంటువారు శాసించినట్లు దాని పీఠికలోనే వివరింపబడియున్నది. భారత దేశ వ్యవహారములను కనిపెట్టి చూచుటకు ఆరుమంది కమీషనర్లను నియమించుటకు అందులో ఇంగ్లాండుమంత్రిలలో నిరువురుండునట్లును ఇట్లు నియమింపబడిన కమీషనర్లలో ముగ్గురకు తక్కువగాకుండ ఒక బోర్డుగా ఏర్పడి భారత దేశ పరిపాలనలో కంపెనీ వ్యవహారముల నన్నిటిని తనిఖీచేయుచు దానిని నడుపుచు సర్వాధికారములు చలాయించవచ్చుననియు శాసింపబడెను. దీనికే 'బోర్డు ఆఫ్ కంట్రోలు' అని పేరువచ్చినది. ఈ చట్టమును శాసించునాటికి ఇంగ్లాండు ప్రధాని పిట్టు. అందువల్ల దీనికి "పిట్టుచట్టమని"యు పేరువచ్చినది. భారత దేశములోని ప్రభుత్వమునందు కొన్ని మార్పులు చేయబడెను. గవర్నరు జనరలుకు సహాయముచేయుటకు

ముగ్గురు కార్యాలోచన సభికులుందురు. వారిలో నొకడు సేనాని. వంగరాష్ట్రమునగాక తక్కిన రెండు రాజధానులలోను గవర్నరులును వారికిసహాయము చేయుటకు ముగ్గురుచొప్పున కార్యాలోచన సభికులు నేర్పరుపబడిరి. వీరినినియమించుటలో కంపెనీ డైరెక్టర్లకు అధికారముండెను. యుద్ధప్రకటన, సంధి వ్యవహారములందే గాక కంపెనీ డైరెక్టర్లు నిర్ణయించిన విషయములందు గూడా గవర్నరు జనరలుకు కౌన్సిలుకు తక్కిన రాజధానులపైన పెత్తనము లివ్వబడెను. పరువుకు భంగముగల్గిన తప్ప దేశాక్రమణకొరకు యుద్ధములు చేయకూడదని శాసింపబడెను. యుద్ధము ప్రకటించుటకు సంధిచేయుటకు డైరెక్టర్ల అనుమతి పొందవలెను. న్యాయవిచారణమునందు కంపెనీ నౌఖరులతోపాటు దేశపౌరులందరిపైన అధికారము ఇవ్వబడెను. బహుమతులు లంచములు నిషేధింపబడెను. సివిలు మిలిటరీ ఉద్యోగముల సంఖ్య తగ్గించుటకు డైరెక్టర్లకే అధికార మివ్వబడెను. ప్రమోషనులు సీనియారిటీ ప్రకారము చేయబడవలెననియు నిర్ణయింపబడెను.

తరువాత నీ చట్టములో మరల కొన్నిమార్పులు చేయబడెను. కౌన్సిలు అభిప్రాయమునకు విరుద్ధగా ప్రవర్తింపగల అధికారము గవర్నరుజనరలు కొసగబడెను. కంపెనీకి సన్నదు నిచ్చునప్పుడు దేశాదాయములోనుండి కంపెనీవారు బ్రిటిషు ప్రభుత్వమునకు హెచ్చుసొమ్ము నివ్వవలెనను ఆలోచన జరిగెను. కాని అది మానివేసి దేశాదాయమును ముందుగా సైన్యము కొఱకు ఖర్చుచేయు బ్రిటిషు రాజ్యతంత్రిపద్ధతి

నిర్ణయింపబడెను. ఇట్లు దేశాదాయ మింగ్లీషుసైన్యము ఖర్చులక్రింద తాకట్టుపెట్టబడు విధానము స్థాపింపబడెను. 1784 మొదలు భారతదేశ వ్యవహారములు రెండు ముఖము లుగా నడువజొచ్చెను. భారతదేశమున తమ పెట్టుబడియొక్క లాభములు తగ్గిపోకుండా ముడివస్తువుల పంటలనుపండించు శక్తినిమాత్రము ప్రోత్సహించి వానిని సీమ కంపవలసినదనియు భారతదేశప్రజల ఆచార వ్యవహారములజోలికి మాత్రము పోవలదనియు మతముపట్ల సహనము కలిగి యుండుడనియు కంపెనీ డైరక్టర్లు భారతదేశ గవర్నరుజనరలుకును, గవర్నర్ల కును వ్రాయుచుండిరి. ఇక ఈదేశప్రభుత్వముపైన పెత్తనము వహించుటకు ఇంగ్లండు ప్రభుత్వమువా రేర్పరచిన బోర్డువార న్నెనో బ్రిటిషు రాజ్యమును వ్యాపింపజేసి గట్టిచేయుడని వీరిని హెచ్చరించుచుండిరి.

## III

### 1797 సం॥ కంపెనీ సన్నదు చట్టము:

కంపెనీవారి ఆంతరంగిక వ్యవహారములను భారతదేశ వ్యవహారములనుగూర్చి ఈచట్టము చేసిననిబంధనలే చాలకా లము అమలుజరిగెను. తరువాత కొద్దిమార్పులు జరిగెను. భారత దేశములోకొత్తపరిస్థితులకు అనుగుణముగా ఏర్పాట్లు కట్టు బాటులు చేయబడెను. స్వదేశ సంస్థానాధీశులకు అప్పు లిచ్చుటవలన అనేక అన్యాయములు జరుగుచుండినందున ఎవ్వ రును అప్పు ఇవ్వకూడదని నిషేధింపబడెను. దీనికి కారణము అట్టి ఋణములనుగూర్చిన ఫిర్యాదులు చిక్కులు వచ్చుటయే. కారన్

వాలిసు గవర్నరు జనరలుగా నుండినప్పుడు అతడనేక శాసనములు చేసెను. పార్లిమెంటు చట్టమిచ్చిన శాసన నిర్మాణాధికారముకన్న హెచ్చు అధికారముల నితడు చలాయించెను. నాటిశాసనములెల్ల క్రోడీకరింపబడెను. ప్రజల ఆస్తిని హక్కులనుగూర్చి చేయబడిన యీ శాసనములను పార్లమెంటువారామోదించి అది భారతదేశములో ప్రధానకోర్టువారివలన రిజిష్టరు చేయబడగలందులకు ఉత్తర్వుచేసిరి. న్యాయవిచారణకేర్పడిన కలకత్తా సుప్రీముకోర్టులోని న్యాయాధిపతుల సంఖ్య ఇద్దరికి తగ్గింపబడెను. తరువాత కొన్నాళ్లకు మద్రాసు బొంబాయిలలో రికార్డరుకోర్టులు స్థాపింపబడెను. శాసన నిర్మాణాధికారము మెల్లగా వర్ధిల్లెను. 1807 లో మద్రాసు, బొంబాయిల గవర్నర్లకౌన్సిళ్లకు శాసన నిర్మాణాధికారమొసగబడెను. భారతదేశ ఆదాయములోనుండి ఇంగ్లాండుప్రభుత్వము కొంతలాభము పొందదలచెను. 1799 లో పార్లమెంటుచేసిన చట్టమువలన భారతదేశములో నుపయోగపడు సైన్యమునకు గావలసిన సైనికులకు బ్రిటిషు ప్రభుత్వపార్లమెంటు వారే తగు యేర్పాటుగావించుచు ఒక సైన్య పట్టికను తయారుచేసి కంపెనీవారు అర్జీ పెట్టుకున్నచో అందలి సైనికులను కంపెనీకి మార్చునట్లు శాసింపబడెను. ఈ సైన్యముయొక్క వ్యయమును కంపెనీవారు భరింపవలెను. అట్టి సైనికులసంఖ్య 3000 లకుగాని, లేదా మ్యూటినీచట్టము నిర్ణయించు సంఖ్యకు గాని మించరాదని నిర్ణయింపబడెను. కంపెనీవారు స్వాయముగా 2 వేలకన్న హెచ్చు సైన్యమును చేర్పరాదు.

ఇంతలో కంపెనీవారి సన్నదు మంజూరు చేయువలసిన తరుణము రాగా కంపెనీ వ్యవహారములనుగూర్చిన విచారణయు విమర్శయు జరిగెను. ఏలయన గవర్నరుజనరలు వెల్లస్లీచేసిన రాజ్యాక్రమణ వలన చాలసొమ్ము ఖర్చుపడి కంపెనీవారికి ధనసహాయము కావలసి ఋణముచేయుటకు ఇంగ్లీషు పార్లమెంటువారిని అనుమతి నడిగిరి. కంపెనీ పరిపాలననుగూర్చి చాల అసంతృప్తి బయలుదేరెను. వీరి పద్ధతులనుగూర్చి అనేక ఫిర్యాదులు వచ్చియుండెను. అంతట 1808 లో పార్లమెంటువారొకవిచారణ కమిటీ నేర్పాటుచేయగా వారు 1812 లో "ఫిఫ్త్" రిపోర్టు (Fifth report) అనబడు నివేదికను తయారుచేసిరి. భారత దేశములోని న్యాయవిచారణ పోలీసు శాఖలనుగూర్చియు భూస్వామిత్వమునుగూర్చియు ఈనివేదికలో విపులముగా చర్చింపబడెను. కంపెనీవారివేగాక ఇతరుల ఓడలనుగూడ భారత దేశమునకు పోనిచ్చుటకు పార్లమెంటువారు అంగీకరింపవలెనను ప్రచారము చేయబడెను. కంపెనీవారు తాము పరిపాలకులై రాజకీయాధికారములను గలిగియున్నను వ్యాపారలాభములు పోయినచో తాము బ్రతుకజాలమని మొరబెట్టుకొనిరి గాని లాభము లేకపోయెను. తమ అధికారమునకు లోబడనివారు దేశములోనికి వచ్చినచో అందువలన కలుగు చిక్కులకు తాము బాధ్యత వహింపలేమనిరి. మరియు అట్టివారివలన భారతీయుల క్షేమమునకు భంగము కలుగుననిరి. ఇంక నెన్నో సాకులు చెప్పిరి. ఇందులకు ఫలిత మేమనగా ఆయా ప్రెసిడెన్సీల స్థానిక ప్రభుత్వములవలన లైసెన్సులుపొంది వారేర్ప

రచు నిబంధనలకు లోబడి ఇతరు లిట్లు ఓడ వ్యాపారము చేయవచ్చునని 1813 లో శాసింపబడెను.

## IV

### 1813 సం॥ కంపెనీ సన్నదుచట్టము.

కంపెనీవారి భారత రాజ్యభాగములను వారు వసూలు చేయుచున్న దేశాదాయములను వారి కెప్పటివలెనే యింకను 20 సంవత్సరములదాకా భుక్తపడునట్లు పార్లమెంటువారు నిర్ణయించిరి. భారతదేశముపైన కంపెనీవారి పాలనముపైన బ్రిటిషురాజులకుగల రాజ్యాధికారములు స్పష్టీకరింపబడెను. కంపెనీవారి వ్యాపార వ్యవహారములకును వీరి పాలన వ్యవహారములకును వేరువేరుగా లెఖ్ఖలుంచవలెనని శాసింపబడెను. ఈ లెక్కలు "బోర్డు ఆఫ్ కంట్రోలు" వారి తనిఖీక్రింద నుండవలెను. భారతదేశ ఆదాయములనుండి ఇంగ్లీషు ప్రభుత్వమువారు లాభముపొందు తలంపుకలిగి అట్లు బహిరంగముగా సొమ్ము పుచ్చుకొనుట కిష్టములేక, ఇంగ్లాండు ప్రభుత్వము పంపుసైన్యములను కంపెనీవారే భరింపవలెనను విధానము స్థిరపరుపబడెను. ఈ విధానము ప్రకారము రెండు లక్షల సైన్యమువరకు అట్లు పంపవచ్చుననియు శాసింపబడెను. కంపెనీవారు భారతదేశ పరిపాలనకొరకు చేసిన ఋణమును తగ్గింపవలెననిరి. కంపెనీ లాభములు నూటికి 10½ కన్న మించ కూడదనిరి. భారతదేశములోని అన్ని ఉద్యోగములకు అభ్యర్థులను నియమించు అధికార ప్రపకములు ఎప్పటివలెనే కంపెనీ డైరెక్టర్లకే నిలువబడెను. గవర్నరుజనరలు, సర్వసేనాని, ఇతర

ఉద్యోగులు నిట్లు నియమింపబడుచునేయుండిరి. ఇందువలన కంపెనీవారు లాభముపొందుచుండిరి. భారత దేశములో కంపెనీ రాజ్యభాగములందలి కంపెని ప్రభుత్వములకు అచ్చటి ప్రజల పైన పన్నులు విధించుట కధికార మొసగబడెను. దీనినిగూర్చి సుప్రీము కోర్టువారుకూడా అధికారము కలిగియుందురు. పన్నులివ్వనిచో శిక్షింపవచ్చును. అధికారము స్వదేశ రాజుల వల్ల కంపెనీకి సంక్రమించిన అధికారమునకు అదనముగా నివ్వబడిన అధికారము. గౌరవ న్యాయాధిపతులకు, ఐరోపావారు దేశవాసులపైన జరిగించు దౌర్జన్యపు నేరములు అక్రమప్రవేశ నేరములు విచారించు అధికార మివ్వబడెను.

భారత దేశమునకు క్రైస్తవ మిషనరీలుగా వచ్చువారు లైసెన్సు పొందవలెనని విధింపబడెను. ఇదివరకువలెగాక మొదటిసారి భారత దేశ ప్రజల విజ్ఞానాభివృద్ధికని చెప్పి లక్ష రూపాయిలు ప్రత్యేకించి యుంచి దానిని సారస్వతవిజ్ఞానమునకు శాస్త్రవిజ్ఞానమునకు వినియోగింపవలెనని శాసింపబడెను. ఈసంస్కరణము ఆ రోజులలో విశేష కృషి చేసిన రాజా రామమోహనరాయలవలన జరిగినదని చెప్పకతప్పదు. 1814 లో బ్రిటీషు ప్రజలపైన విదేశములపైన ఇతరులపైన సుంకములు విధించుటకు అధికారమిచ్చు చట్టముచేసిరి. 1823లో బ్రిటీషు సైనికుల పించనులక్రింద 60వేల పౌనులు మన దేశాదాయము పైన బద్ధతిచేసిరి. క్రైస్తవమతశాఖవారి జీతములు మనపైన బడవేసిరి. న్యాయవిచారణ శాఖవారి జీతములు నిర్ణయింపబడెను.

ఇంగ్లాండువారి లాభముకొరకు భారతదేశమును పరిపాలించు పద్ధతి 1813 లో తూర్పుఇండియా కంపెనీ కివ్వబడిన పట్టాలో లిఖితరూపము దాల్చినది. భారతదేశ పరిశ్రమలను నాశనముచేయు విధానము 1813 వ సంవత్సరముననే ప్రారంభమైనదని చెప్పవచ్చును. స్వేచ్ఛా వ్యాపారపద్ధతి యను పేరున భారతదేశములోనికి ఇంగ్లీషుసరకులను ఎట్టి సుంకములు లేకుండా దిగుమతిచేయు విధానము నీ పట్టానిచ్చునప్పు డింగ్లీషు పార్లమెంటువారు శాసించిరి. అందువలన ఇంగ్లీషుసరకులను భారతదేశీయులకు బలవంతముగా అంటగట్ట గలిగిరి. భారతదేశ దారిద్ర్య మానాటితోనే మొదలుపెట్టినది.

ఈ పట్టాను జారీచేయునప్పుడే ఆంగ్లేయరాజ్య తంత్రజ్ఞులు భారతీయులను సుఖాసక్తులుగను భోగలాలసులుగను త్రాగుబోతులుగను చేయదలచి అందుకు వలసిన ఏర్పాటులు చేయ నిశ్చయించిరి. ఆ పట్టా నొసగునప్పుడు చేయబడిన విచారణలో ధనవంతులగు నేటీవులు ఇంగ్లీషు భోగద్రవ్యములను గొనుచున్నారా? లేదాయని విచారించి యుండిరి. భారతీయుల కీదుబారాతనము దుర్వ్యసనము లలవాటుగానిదే నాంగ్లేయ వస్తువులను గొనుటయె తటస్థించదని వా రెఱుగకపోలేదు. అందువలననే ముందుగా నాంగ్లేయు లీ దేశ పరిశ్రమలను నాశనము జేసిరి. నా డీ యాంగ్లేయుల దురుద్దేశమును మనవారు గ్రహించి యున్నచో నాడే బ్రిటీషువస్తు బహిష్కారోద్యమమును ప్రారంభించి యుందురు.

ఇంగ్లీషు పార్లిమెంటువారు తమ సరకులను విరివిగా

చలామణి చేసికొనగలుగుటకే తమ రాజ్యమును విస్తరింపజేయ దలచిరి. పూర్వము 1793 లో నీ కంపెనీకి పార్లిమెంటువారు పట్టా నొసగునప్పుడు దేశాక్రమణచేయుటయు రాజ్యమును వృద్ధి జేయుటయు ఆంగ్లజాతియొక్క ఉద్దేశములకు గౌరవమునకు నీతికిని గూడ విరుద్ధమని స్పష్టీకరించి యుండిరి. 1813 లో మరల పట్టానొసగు సందర్భములో నీనియమమును తీసివేసిరి. దీనివలన నిప్పటి కప్పుడే ఆంగ్లేయులకు వర్తక సామ్రాజ్య మును స్థాపించవలెనను కాంక్ష యుదయించినట్లు నిశ్చయించ వచ్చును. ఈ కాంక్షను ఉద్దేశమును పురస్కరించుకొని ఆంగ్ల పరిపాలకులు భారతదేశములోని స్వదేశరాజులను నవాబులను ఏదో మిషపైన నయముననో భయముననో మోసముననో పదభ్రష్టులజేసి రాజ్యములను లాగికొని బ్రిటిష్ ఇండియాను వృద్ధిజేయుచుండిరి. కేవలము వర్తకలాభము కొరకే రాజ్యా క్రమణము నారంభించిరను సంగతి 1813 లో సర్ తామస్ మనోహ్రి చెప్పిన మాటలవలననే తెలియగలదు. "కంపెనీవారి బలమువలన మనము సంపాదించిన రాజకీయాధిపత్యమే భారత దేశములో మన వర్తకముయొక్క అభివృద్ధికి గారణముగ నున్నది. ఈ రాజకీయ బలము మనకు లేనిచో స్వదేశరాజులు మనవర్తకమును పెరుగనీయరు. టిప్పు సుల్తానువంటివా రసలే జరుగనీయరు." ఈ కారణము వలననే రాజ్యమును పెంచిన వెలస్లీ హేస్టింగ్సులను పార్లిమెంటువారు గౌరవించి బహూ కరించిరి.

1813 వ సంవత్సరపు పట్టాలో నింకొక ముఖ్యసూత్రము

కూడా యిమిడియున్నది. ఆంగ్లేయ క్రైస్తవ మిషనరీల యాధిపత్యమునకుగూడ ఇది పునాది. కంపెనీవారు మొదటినుండి భారత దేశములోని మతములతో తాము జోక్యము కలిగించు కొనమని పలుకుచుండిరి. ఈమాటలు కేవలము బూటకములని 1813 లో పార్లమెంటువారి చట్టమువలన తేలినది. భారత దేశ ప్రభుత్వము భరింపవలసిన వ్యయములో సాలుకిరువది లక్షల రూపాయిలు క్రైస్తవమతబోధకుల శాఖయొక్క ఖర్చుగా చేర్చబడినది. ఇట్లీ కంపెనీ ప్రభుత్వము క్రైస్తవ ప్రభుత్వమేయను సంగతి బయల్పడినది. లేనిచో హిందూమహమ్మదీయ మతములకు లేని ప్రోత్సాహమీ క్రైస్తవ మతమున కేలనొసగవలెను? ఇప్పటిలగాయతు ఆంగ్లేయ క్రైస్తవ మతబోధకులకు భారతదేశ ప్రభుత్వమున గొప్ప పలుకుబడి లభించినది. పాఠశాలలందు బైబిలుప్రవేశ పెట్టుటయు ప్రజలను ఒత్తిడిచేసి తమమతములో కలుపుకొనుటయు ప్రారంభించిరి.

ఆంగ్లేయు లీ దేశమునకు విరివిగా వలసవచ్చునట్లు చేయుటకు వారికి వృత్తులు కల్పించుటకు వలసిన అవకాశము గూడ 1813 వ సంవత్సరపు పట్టావలన కలుగజేయబడెను. ఇదికూడా పార్లమెంటువారు ఆలోచించి చేసినపనియె.

ఈ చట్టము శాసింపబడిన వెంటనే ఆంగ్లేయవర్తకులు తండోపతండములుగా నీ దేశమునకువచ్చి మనవారి రుచులను అవసరములను జాగ్రత్తగా కనిపెట్టి అందు కనుగుణములగు సరకులను తయారుచేసి మన పట్టణములలో వెదజల్లసాగిరి.

నెపోలియను విజృంభించుచున్నంత కాలము భారత దేశములోని రాజులతనితో కుట్రచేయుచుండిరను మిషపైన వెలస్లీ వారిపైన దాడివెడలుచు వారి రాజ్యములను కలుపుకొను చుండెను. తరువాత హేస్టింగ్సుజరిపిన దౌర్జన్యముల కెట్టి కార ణమును కనబడదు. నిజముగా 1813 వ సంవత్సరపు చట్టము యొక్క ఉద్దేశములను నెరవేర్చుటకే ఈ రాజ్యాక్రమణలు చేయబడెననుట కెట్టి సందియమునులేదు.

## V

## 1833 వ సంవత్సరపు కంపెనీ ప్రభుత్వ రాజ్యాంగచట్టము.

1833 వ సంవత్సరమునాటికి భారతదేశములో తూర్పు ఇండియాకంపెనీవారు శాశ్వతయిజారాగా ప్రత్యేకముగా వర్త కముజేయు వర్తకులును మఱియు దేశమును పరిపాలించు ప్రభు వులునై యుండిరి. వీరిరాజకీయాధికారములు వ్యాపారాభివృద్ధి కొరకుపయోగింపబడుచుండుట, దుష్పరిపాలనము ప్రబలుట, ఇంగ్లాండులో నందరికిని తెలియును. అయితే చేయునదేమి? పదివేలమైళ్లో దూరముననున్న భారతదేశ వ్యవహారముల నొక్కమారుగా చక్కబెట్టుటెట్లు? ఇరువదేండ్ల కొక్కమారు కంపెనీ సన్నదును మరల జారీచేయునప్పుడు ఈ సమస్య పార్ల మెంటులో చర్చకు వచ్చుచుండును. ఇట్లు 1833 లో నింకొక మారు చర్చకువచ్చెను. కంపెనీ పరిపాలన తీవ్రముగా విమ ర్శింపబడెను. దీని ఫలితముగా నొక రాజ్యాంగచట్టము చేయ బడెను. భారతదేశములో నీ కంపెనీవారికివ్వబడిన శాశ్వత

వ్యాపార యిజారా రద్దుచేయబడెను. వారివ్యాపారపు సొత్తు యావత్తూ ఖరీదుకట్టబడి భారతదేశపు ప్రభుత్వ ఖాతాకు ఖర్చు వ్రాయబడెను. భారతదేశములో 'స్వేచ్ఛా వ్యాపార' పద్ధతి నెలకొల్పబడెను.

ఇక భారతదేశ రాజ్యాంగవిషయమున పార్లమెంటు వారి ప్రభుత్వముక్రింద వారి ప్రతినిధులుగా భారతదేశమును పరిపాలించుట కెవరో ఒక రుండవలసిన ఆవశ్యకతయున్నందున కంపెనీవారినే అట్టి ప్రతినిధులుగానుంచి భారతదేశములో వా రేర్పరచియుంచిన పరిపాలనాయంత్రము ద్వారానే పార్లమెంటువారీ దేశమును పరిపాలింప నిశ్చయించిరి. ఇట్లు కంపెనీ వారి రాజకీయాధికారమును పలుకుబడియు నిలుపబడెను. 1853లో వారికి సన్నదును మరల నొసగునప్పుడుకూడా పార్లమెంటువారీ పద్ధతిప్రకారమే కంపెనీకి పట్టానిచ్చిరి. ఇందు వలన కంపెనీ పరిపాలనలో నెట్టి అంతరాయముగాని మార్పు గాని లేక ప్రాతపద్ధతులప్రకారము నిరంకుశపరిపాలనము జరుగసాగెను.

1833 వ సంవత్సరపు ఇండియారాజ్యాంగచట్టమే నేటి బ్రిటిషుప్రభుత్వవిధానమునకు పునాదియని చెప్పవచ్చును. భారతదేశపరిపాలన, సివిలు మిలిటరీ ప్రభుత్వాధికారములు, ఆ దేశప్రభుత్వమును నడుపుఅధికారము, దాని అదుపు ఆజ్ఞలు, పై తనిఖీ అధికారములు, ఇంగ్లాండు దేశపుపార్లమెంటువారివే యని శాసింపబడెను. భారతదేశప్రభుత్వభారము కార్యాలోచనసభతో కూడిన గవర్నరుజనరలు నందు నెలకొల్ప

బడెను. ఈకార్యాలోచనసభలో నలుగురు సామాన్యసభ్యు లుండురు. వారిలో ముగ్గురను నియమించుఅధికారము పూర్తిగా తూర్పు ఇండియాకంపెనీ డైరెక్టర్ల కొసగబడెను. నాల్గవ సభ్యుని నియమించుటలో ఇంగ్లాండురాజుయొక్క సమ్మతి పొందవలెను. ఈనాలుగవ సభ్యుడు దేశములో శాసనములు చేయునప్పుడు కార్యాలోచనలో పాల్గొనునట్టి 'లామెంబరు'. ఇంగ్లీషు రాజు ఆమోదమునకు లోబడి భారత దేశ గవర్నరు జనరలును సర్వసేనానినిగూడా కంపెనీ డైరక్టర్లు నియమింతురు. ఈ సభాయుతుడగు గవర్నరుజనరలుకు భారత దేశమునకు కావలసిన చట్టనిర్మాణము చేయు అధికార మొసగబడెను. పూర్వ మిట్టి శాసననిర్మాణ అధికారములేదు. భారత దేశ మున చేయబడినశాసనవిధులు "రెగ్యులేషను"లనబడుచుండెను. ఇప్పుడుగూడ పార్లమెంటు అధికారమునకు విరుద్ధముగా చట్టములు చేయరాదు.

భారత దేశములో సక్రమమైన న్యాయవిచారణ పద్ధతి నేర్పరచుటకు, కోర్టులు స్థాపించుటకు, వాని అధికారము నిర్ణ యించుటకు అందములు జరుగవలసిన న్యాయధర్మములు నిర్ణ యించుటకు ఒక కమీషను సంఘమును నియమించుటకు గవ ర్నరు జనరలు కధికార మీయబడెను. సివిలు సర్వీసు ఉద్యోగ ముల విషయమున భారత దేశమునందు కంపెనీవారి కొలువులో నుండవలసిన ఉద్యోగుల సంఖ్యను నిర్ణయించుచు ప్రతిసాలున ఒక అంచనా యేర్పాటు గావింపబడెను. ఇదియే నేటి ఉద్యోగ వర్గ నిబంధనలకు దారిజూపెను. కేవలము భారతీయుల జాతి

మత వర్ణములవలనగాని పుట్టుక, ప్రదేశము, వంశము వలన గాని కంపెనీ కొలువులో ఉద్యోగము చేయుట కనర్హత యుండ రాదనియు ఒక సూత్రము విధింపబడెను.

ఆంగ్లేయ విద్యావిధానమును నెలకొల్పుటలో ఆంగ్ల రాజ్యనీతిజ్ఞు లీదేశవాసుల కాంగ్లరుచులు కలిగించి తమవ్యాపారము నభివృద్ధి జేసికొనవలెనను ఉద్దేశముండెనని చార్లెస్ గ్రాంట్ యొక్క కరపత్రమువలన విదితమయ్యెను. ఆనాడు గంభీరోపన్యాసముల జేసిన మెకాలే భారతీయులను కేవలము ఆంగ్లేయ పరిపాలనపట్ల అభిమానముగలవారిగా జేయు నుద్దేశము వారి కుండెననియు అంగీకరించియున్నాడు.

ఈ 1833 వ సంవత్సరపు చట్టనిబంధనలను నిర్ణయించిన వారిలో మెకాలేయొకడు. ఈచట్టమువలన భారతదేశమునకు హెచ్చుధనవ్యయము కలుగుటకు మార్గము లేర్పరుపబడెను. అందువలన నానాటి స్వదేశసంస్థానముల నేదో మిషపైన బ్రిటీషు రాజ్యములో గలుపుకొని ఆదాయము వృద్ధిచేయవలసి వచ్చెను. భారతీయులకు క్రొత్తపన్నులును క్రొత్తసంకెళ్లును వేయబడెను.

1853 లో మరల నొకమారు కంపెనీవారికి రాజ్యపరిపాలనాధికారము నిచ్చు శాసనమును పార్లిమెంటువారు చేసిరి. కంపెనీవారి దుష్పరిపాలనమును గూర్చి అనేక మహాజరులు వచ్చినను పెడచెవిని బెట్టిరి. క్రొత్తచట్టమున ఈ రాజ్యాంగమున మార్పు లెవ్వియు చేయబడలేదు. ఈ మారు ఇన్నిసంవత్సరములని గడువు నేర్పరుపకయే పట్టానిచ్చిరి.

# ఏడవ ప్రకరణము

## భూమిశిస్తుల నిర్ణయము - వసూలు

### I

### కర్షకుల స్థితి

భారత దేశము బ్రిటిషువారి వశమగునప్పటికి దేశములో నన్నిభాగములందు నొకేవిధమగు పరిస్థితులులేవు. కొన్ని చోటుల సత్పరిపాలనము మరికొన్ని చోటుల దుష్పరిపాలనము జరుగుచుండెను. కొన్నిచోటుల శాంతిసౌఖ్యములు మరికొన్ని చోటుల కల్లోలము ప్రజాపీడనము నుండెను. గాని మొత్తము మీద గ్రామములు సుభిక్షముగానుండెను. మొగలాయి చక్రవర్తిక్రింద దేశపరిపాలనకొరకు రివిన్యూ వసూలుకొరకు, సైన్యము ప్రోగుచేయుటకొరకు నేర్పడిన రాజప్రతినిధులు, జమీందారులు, తాలూకాదారులు, జాగీరుదారులు, ఉద్యోగులు మొదలగు వివిధతరగతుల పరిపాలకులు, ఉద్యోగులు, భూస్వాములు, ఇజారాదారులు రాజ్యములందును భూములందు వంశపారంపర్యపు హక్కులను స్థాపించు కొనుటకు ప్రాకులాడుచుండిరి. ఆంగ్లేయు లింత సులభముగా దేశాక్రమణచేసినారన్నచో నానాడెంత కల్లోలము, అరాజకము ప్రబలియుండెనో తెలియగలదు. అనేక గ్రామములందు పంచాయతీలద్వారా స్థానిక స్వపరిపాలనాపద్ధతి జరుగుచునే యుండెను. గ్రామమునందు కులకట్లు చెరువులు బావులు చిన్న నేరములవిచారణయుకూడ పని యధికారముక్రింద నేయుండెను.

కేవలము మతాచారములపైన వీని బలము ఆధారపడియుండి నందున క్రొత్తపరిస్థితులలో కులకక్షలు, గ్రామకక్షలు వృద్ధియై విదేశీయుల బారినుండి స్వాతంత్ర్యమును కాపాడుకొను ఐకమత్యము క్షీణించుచుండెను. రాజులు, నవాబులు, జమీందారులు, దేశపరిపాలనము చక్కగా నిర్వహించి, దేశరక్షణ చేసి, జాతీయనాయకులుగా వ్యవహరింపలేకుండిరి. కేవలము బలవంతముగా రివిన్యూ వసూలుచేయుట తప్ప దేశప్రజలకు వీరుచేయు ప్రత్యుపకారములేకుండెను. బ్రిటిషువారు రాజ్యాధిపత్యము సంపాదింపగానే ఈతరగతివారి నెల్లరను జమీందారులని వ్యవహరించిరి. దేశములోని భూములందు వీరికిగల హక్కులను నిర్ణయించుట, భూమిశిస్తువసూలు పద్ధతులను క్రమపరచుట యనునది యొకపెద్ద సమస్యగానుండెను. ఆంగ్లేయులీదేశమునకు వచ్చునప్పటికి మొగలాయి పరిపాలనలో భూమిశిస్తువసూలు హక్కులను ఇజారాకిచ్చు పద్ధతి అమలులో నుండెను. తమదేశమునగల భూస్వామ్యపద్ధతికి నీదేశమున తాము చూచిన భూస్వామ్యపద్ధతికినిగల తారతమ్యము నాంగ్లేయులు గ్రహింప లేకపోయిరి. భూములకెల్ల హక్కుదారు ప్రభుత్వమేయనియు, జమీందారులకు, జాగీరుదారులకు శిస్తువసూలు చేయు ఇజారాదార్లకు ఉద్యోగులకు కూడా ప్రభుత్వముక్రింద తాబేదారీ భూస్వామ్యాధికారములు కలవనియు, వారెల్లరు ప్రభుత్వమునకు కట్టుబడి చెల్లింపవలసిన భూస్వాములేయనియు భ్రమపడిరి.

భూమిశిస్తు అనునది ఒకపన్ను కాదనియు అది కట్టుబడి

మక్తాయే యనియు, ఆర్థికముగా రాబట్ట తగినంత కట్టుబడిని రాబట్టుటకు తమకు హక్కు కలదనియు అదిన్యాయమే యనియు తలంచిరి. అందువలన నికరపంటలో వీలైనంత హెచ్చుభాగ మును కట్టుబడిగా వసూలు చేయుటయే ఇంగ్లీషు దొరతనమున 1857 వ సంవత్సరపు శిపాయివిప్లవమునకుపూర్వ మవలంబింప బడిన శిస్తుల పద్ధతిలోని నీతిగా నుండెను. వంగరాష్ట్రమున శిస్తులువసూలుచేయుహక్కులను వేలమువేసినప్పుడును, జమీాం దారులకు భూములందు హక్కులు స్థిరపరచి శాశ్వత శిస్తును పేష్కస్ గా నిర్ణయించినప్పుడును, మదాృసులోను బొంబాయి లోను రైతులకే భూమిహక్కు లిచ్చి వారి వద్దనుండి తిన్నగా శిస్తులు వసూలు చేయుటలోను కూడ కంపెనీవారీ నీతినే పాటించిరి.

భూసంపదవిషయమునను పంటసమృద్ధి విషయమునను నేటికన్న నూటఏబదియేండ్లక్రిందట రైతులెక్కువ మంచి స్థితిలో నుండినందుకు చాల నిదర్శనములు కలవనియు, 1857 నాటికే పరిస్థితి పాడుకాజొచ్చెననియు, అయితే ఈ దుస్థితికి బ్రిటిషు పరిపాలనమే కారణముకాదనియు,'తాంప్సన్ గెర్రాట్టు' గార్లు వ్రాసిన బ్రిటిషుపరిపాలన చరిత్రలో చెప్పుచున్నారు. 1750 కిని 1850 కిని మధ్య భారతదేశమున జనసంఖ్య చాల హెచ్చినది. డాల్ హౌసీకాలము (1848) వరకునుకూడా పల్లపు వ్యవసాయమునకు వలసిన పెద్దకాలువలుగాని ఆనకట్టలుగాని నిర్మింపబడలేదు. ఆ కాలములో గ్రామవృత్తులందుండు వారును గ్రామనౌకరులును వ్యవసాయమునందుకన్న సైనిక సేవయందే

ఎక్కువమంది పనిచేయుచుండిరి. రైతులు నిలుకడగా భూములను అంటిపెట్టుకొని యుండరైరి. వంగ రాష్ట్రము స శాశ్వతకవుల్లుగాక కేవలము వ్యవసాయతరుణమునకు, ఒక ఫసలీకి మాత్రమే కవులుపొందువా రధికముగానుండిరి. భూములకు రైతుఒత్తిడి చాల తక్కువగానుండెను. అందువలన భూములయందు జిరాయితీ హక్కులకు విలువ తక్కువ. జిరాయితీ హక్కులు లేనప్పుడు ఆ కల్లోలపు రోజులలో షావుకారులు ఋణ మిచ్చుటయు తక్కువగనే యుండి ఋణభారమును తక్కువగనుండెను. విభక్తకుటుంబము లభివృద్ధిజెంది హిందూ మహమ్మదీయ వారసత్వపద్ధతుల ప్రకారము కొమాళ్ళసంఖ్య హెచ్చినకొలదియు భూములు పంపిణీ చేయబడి రైతులకుగల భూవిస్తీర్ణము తగ్గిపోవుచుండెను. 1877 కు పూర్వము 70 సంవత్సరములలో రైతులకు సగటునగల భూమి విస్తీర్ణము సగమునకు తగ్గిపోయెను. భారతదేశము అనాదినుండి వ్యవసాయ ప్రదేశము గనుక క్రొత్తగా సాగులోనికి వచ్చిన భూములు చాలతక్కువ. భూములకు ఎరువుగా నుపయోగించు పేడను పిడకలుగచేయు చెడుఅలవాటువలన భూసారము వృద్ధి కాలేదు. క్రొత్తనీటివసతుల నిర్మాణము లేనందున పల్లపు సాగు హెచ్చుకాలేదు. బ్రిటిషువారి ఆర్థిక సిద్ధాంతము ప్రకారము భూములకు రొక్కశిస్తు నిర్ణయింపబడి, అది నిర్ణీత కాలములో వసూలు చేయబడుచుండెను. అది చెల్లించుటకు రైతులు అశక్తులై కష్టపడసాగిరి.

బ్రిటిషువారు రాకపూర్వము రైతులకు భూములలో

అమ్మకునే జిరాయితీ హక్కులులేవు. ఈక్రొత్త విధానములో రైతు భూమిని ఆక్రమించి రెండుసంవత్సరములు కట్టుబడి శిస్తు చెల్లించగానే భూమికి హక్కుదారుడు కాసాగెను. అతడాశిస్తు నివ్వగలిగినంతకాలము ఆశిస్తు అతని నెత్తిపైన వేయఁబడుచుండెను. కావలసినంత బంజరుభూమి యుండెను. రైత్వారీపద్ధతిలోని రైతు సాగుచేయని భూమికికూడా పన్నులిచ్చుకొనవలసియుండెను. తరువాత జనసంఖ్య పెరిగి జిరాయితీ హక్కు విలువగలిగినదైనంతటనే రైతులు షావుకార్లచేతులలో జిక్కి అప్పులపాలు కాసాగిరి. భూమిని విక్రయించుటకు తనఖాయుంచుటకు రైతుకు హక్కుగలిగినంతటనే ఋణముచేయు పరపతియు హెచ్చెను. రొక్క శిస్తు కిస్తీ చెల్లించుటకు షావుకారుకు ధాన్యమమ్మట ఋణముచేయుట అవసరమయ్యెను. రైతులు వివాహములకు కర్మలకుకూడ హెచ్చు సొమ్ము ఖర్చుపెట్టుచు ఋణపడసాగిరి.

కారన్ వాలిసుచేసిన రెగ్యులేషన్లు వంగరాష్ట్రమునుండి 1802 లో మద్రాసుకు వ్యాపింపగనే ఆంగ్లేయ సివిలు, క్రిమినలు సంహితలు అవతరించి, పూర్వము రివిన్యూవసూలులో తాశిల్దారులు చేయు దురాగతములు కొంతతగ్గినను, బీదరైతుకూడా నిర్భయముగా ఆంగ్లన్యాయస్థానములకుబోయి న్యాయము పొందవచ్చుననుసిద్ధాంతము ప్రబలినను ఆచరణలో ధనవంతులు బలవంతులు నగు జమీందారులు షావుకారులు మాత్రమే న్యాయస్థానముయొక్క లాభములు పొందగలుగుచుండిరి. కోర్టులలో అత్యధిక ఖర్చులు భరించి వీరు రైతులను పీడింపగలుగుచుండిరి.

చరాస్తి జప్తు, భూములు అమ్మించు అధికారము, పూర్వము నాటి చింతబరికెల పద్ధతికి తీసికట్టుగా లేకుండెను. బ్రిటిషు క్రిమినలు ధర్మము శాంతిభద్రతలను స్థాపించినదని చెప్పబడినను, 1830 సంవత్సరమువరకు దారిదోపిడిగాండ్రు, హంతకులు (థగ్గులు) విజృంభించుచునే యుండిరి. జమీందారులనేకు లీ దుర్మార్గులతో సంబంధము కలిగియుండిరి. ఆంగ్లేయులు మతాచారములతో జోక్యము కలిగించుకోమని చెప్పినందున గ్రామనౌకరులు, పాలేళ్ళు, వర్ణాశ్రమ ధర్మముల కులాచారములందు అజ్ఞానమున మునిగి వెట్టిచాకిరి బానిసత్వమున, దారిద్ర్యమున, బడియుండిరి. తుదకు రోడ్లు బావులుకూడా అందరు సమానముగా నుపయోగించుకొను భాగ్యము లేకపోయెను. అస్పృశ్యతాపిశాచము బలవంతముగానేయుండెను.

1820 మొదలు భారతదేశ వర్తకవాటములో మార్పు కలిగెను. అందువలన పారిశ్రామికుల వృత్తులుకూడా క్షీణించిపోయి దారిద్ర్యము హెచ్చెను.*

## II

## భూమి శిస్తుల చరిత్ర.

భారతదేశమున బ్రిటిషు వా రవలంబించిన భూమిపన్నులపద్ధతియే మనదేశదారిద్ర్యమునకు మూలకారణమైనది. ఆంగ్లేయులు భూమిశిస్తుల వసూలులో అవలంబించిన పద్ధతులు రెండు. వంగరాష్ట్రమునందు కారన్‌వాలిస్ చేసిన పర్మ

* Rise and Fulfilment of British Rule in India.
—Edward Thompson and G. T. Garratt.

సెంటు సెటిల్మెంటు లేక శాశ్వతఫైసలా అనబడు జమిందారీ పద్ధతి; మద్రాసులోని రైత్వారీపద్ధతి. మొదటిదానియందు జమీందారులే ప్రభుత్వమునకు కొంత శాశ్వతశిస్తు చెల్లించుచు రైతులనుండి శిస్తులు వసూలుచేసికొందురు. రెండవ దానిలో ప్రభుత్వముతరపున కలెక్టరును తహశీల్ దారు మొదలగురివిన్యూ అధికారులే శిస్తునిర్ణయముచేసి రైతులవలన వసూలు చేయుదురు. ఈ రెండుపద్ధతులవలనను గూడ, పూర్వమునాటిన్యాయమైన పద్ధతిపోయినది. పూర్వమునుండి భారతదేశప్రజల క్షేమలాభములకు తోడ్పడు గ్రామప్రజాపరిపాలన సంస్థలగు పంచాయతీలే న్యాయముగా శిస్తుల నిర్ణయమును వసూలును చేయుచు గ్రామస్థులకు బాధలేకుండా వ్యవహరించుచుండెను. ఇంగ్లీషు దొరతనము స్థాపించిన క్రొత్తపద్ధతులలో శిస్తు వసూలు చేయుటలో జమిందారుగాని కలెక్టరుగాని రైతులవలన తాను రాబట్టగలంత సొమ్ము పిండుటకే ప్రయత్నించును. గ్రామ సంఘములిందు కాటంకముగనుండును గనుక ఆంగ్లేయులు వాని అధికారములను తీసివేసి వానిని నాశనముచేసిరి.

పండిన పంటనుబట్టి పన్నువిధించు పద్ధతియే పూర్వమునుండియు అమలు జరుగుచుండెను. రాజును సేద్యగాడును కలిసి పండిన పంటను సమానముగా పంచుకొనుచుండిరి. రాజు కివ్వబడిన భాగములో పదవవంతు జమీందారుకు పోవుచుండెను. సాగుబడి, భూమిపన్ను, మున్నగు లెక్కలన్నియు గ్రామకరణము వ్రాయును. వీరికి రైతులే జీతము లిచ్చుచుండిరి. లేదా వీ రీ పని చేసినందుకు వీరి కీనాము లుండెను.

కొన్ని గ్రామములు చేరి ఒకపరగణాగను, కొన్ని పరగణా లొక సర్కారుగను, రెండుమూడుసర్కారు లొకసుబాగా నుండెను. మిక్కిలి విస్తీర్ణములగు భూములను గలిగియుండి అందలి పన్నుల వసూళ్ళకు తాము ప్రభుత్వమునకు బాధ్యతవహించువారు జమీందారులు. వీరిక్రింద తాలూకాదారులు వీరిక్రింద రైతులు నుండిరి. జమీాల కధిపతులే రాజులు. ఇంగ్లీషు కంపెనీవారు దివానీగిరీ పొందగానే కేవలము పన్నులు తాలూకుసొమ్మును జమకట్టుకొను పనిని చేసికొనవలసినదనియు వసూలుపరచు వ్యవహారములన్నియు దేశీయులకు వదలవలసినదనియు కంపెని డైరెక్టర్లు వీరి కాజ్ఞాపించిరి. వీరు మొదట నట్లేచేసిరి. కాని విదేశీయులకీ పన్నులు తీసికొను హక్కు కలుగగానే ప్రాతపద్ధతులు మర్యాదలు, ధర్మములు, నశించి పన్నుల వసూలు కఠినముగా చేయబడుట సహజమే. 1769 లో నీ కంపెనీవారు తమ భూముల శిస్తువసూలు తృప్తికరముగా లేదని దేశీయ వసూలుదారుల పైన ఆంగ్లేయ సూపరువైజర్లనుపెట్టిరి. 1772 లో వారన్ హేస్టింగ్సు రివిన్యూవసూలు విధానమును పూర్తిగా మార్చివేసెను. దేశీయ కలెక్టర్లను తీసివేసి ఆంగ్లేయ కలెక్టర్లను నియమించెను. కలకత్తా కవున్సిలును రివిన్యూబోర్డుగాజేసి కలెక్టర్లపై నధికారిగా నియమించెను. క్రొత్త యుద్యోగులను చాలమందిని నియమించెను. భూమితరములనిర్ణయమునుగూర్చివిచారించుటకొరకు నలుగురు కౌన్సిలు సభ్యులను సంచారముచేయుట కంపెను. దేశీయోద్యోగులకు పనులుపోయెనే గాని దీనివలన కంపెనీకి కలిగిన లాభములేదు. పంట హెచ్చలేదు. 1774 లో వారన్

వాలిసువచ్చి తిరిగి నల్లవారినే వసూలుదారులుగా ఏర్పాటు చేసెను. వీరిపైన తనిఖీకొరకు ఆరు జిల్లాకౌన్సిళ్ళను నిర్మించెను. ఈ పద్ధతి ఐదేండ్లు జరిపి జూచెను గాని లాభము లేకపోగా 1777 లో తిరిగి ఏకసాలా నిర్ణయపద్ధతి నేర్పరచెను. దీని వలన పన్నుల వసూలుకు జమీందారులు బాధ్యులుగా చేయబడిరి. వీరిపని తిన్నగా చేయుదురో లేదోయని భూములలో వీరికి పూర్వమునుండి యున్న హక్కులు తీసివేసి కంపెనీవారే వహించిరి. 1781 లో మరల నింకొకపద్ధతి అమలుజరుప బ్రయత్నించిరి. జిల్లా కౌన్సిళ్ళను తొలగించి దేశమునకంతకును ఒకే రివిన్యూబోర్డును స్థాపించిరి. కలెక్టర్లకు అనగా శిస్తు వసూలు దారులకు జీతములుగాక వసూలుచేయు శిస్తుపైన కమీషను కూడా ఇచ్చుచుండిరి. దీనివలన పన్నులవసూలులో వీరతిక్రూర పద్ధతు లవలంబించుచుండిరి. ఈ కమీషను లంచముగా పరిణమించెనని కారన్‌వాలిసే చెప్పినాడు. ఆ కాలమున నెలకు వేయిరూపాయిల జీతముగల కలెక్టరు సాలుకు నాలుగు లక్షలకు తక్కువలేకుండా కమీషను సంపాదించుచుండెనట!

1784 లో చేయబడిన చట్టము ప్రకారము భారతదేశ భూస్వాముల బాధలను విచారించి భూమితరములను నిర్ణయించుటకును రివిన్యూ వసూలుకు తగు నిబంధనలతో బందోబస్తు చేయవలసినదనియు దేశీయుల పూర్వాచారములను శాసనములను అనుసరించి న్యాయాన్యాయములను నిర్ణయించవలెననియు శాసింపబడెను. అందువలన కారన్ వాలిసు వెంటనే భూమితరముల నిర్ణయమొకటి చేసెను. ఇదియేపర్మనెంటు సెటిల్మెంటు

(శాశ్వత పైసలా) అని ప్రసిద్ధికెందినది. ఆనాటికి భూము లందుగల రైతులకు జమీందారులకు ఆక్రమణదారులకు ఏమి హక్కులున్నవో నిర్ణయించుట, పైసలుచేయుట సామాన్య కార్యముకాదు. పైగా కంపెనీవారి దివానీగిరీ కాలములోని ప్రాతపద్ధతులన్నియు తారుమారు లైనవి. భూమిపన్నుల వసూలు హక్కును వేలముద్వారా ఇజారాలకిచ్చు దురభ్యాస మొకటి ప్రబలి అసలు భూమి దున్నుకొను సేద్యగానిస్థితి దుర్భరమగునట్లు ఈ దళారీ ఖరీదుదారులు ప్రవర్తించిరి.

సేద్యగాండ్రతో గాక కేవలము జమీందారులతోనే భూమితరముల నిర్ణయముచేసి పైసలు చేసికొనవలెనని కౌన్సి లులో చాలమంది యభిప్రాయము. జమీందారులే శాశ్వత భూమిపన్ను శిస్తు కంపెనీకిచ్చు పద్ధతిని ఆనాడు భూములలో జమీందారులకు భూములందు వంశపారంపర్యపు హక్కులను స్థిరపరచినచో ఆ శిస్తునందు బకాయిపెట్టినచో భూములు లాగికొందుమనిగాని చెరలో నుంతుమనిగాని బెదిరించి వారి నణచియుంచవచ్చును. ఇట్లైనచో శిస్తులవసూలు సులభసాధ్య మగుననితోచినది. అందువల్లనే శాశ్వతమైనపద్ధతినే వంగరాష్ట్ర మున స్థాపించుటకు నిశ్చయించిరి. ఈ పద్ధతి కంపెనీ డైరెక్టర్లు 1793లో ఆమోదించిరి. గతసంవత్సరము భూమియొక్క విలు వలో పదింట తొమ్మిదవవంతుచొప్పున శిస్తులు వసూలుచేయ బడెనని తేలినది. భూమియొక్క విలువలో పదునొకండువంతులలో పదివంతులు (10/11) శాశ్వతపు రేటుగా విధించిరి. ఈ శాశ్వత పైసలాకొరకు జరిగిన విచారణ చాలా అసంతృప్తికరముగా

నుండెను. ఈ శాశ్వత పైసలాలో ఊరుపేరులేని దళారీలకును ఎట్టిహక్కులులేని యిజారాదార్లకును వసూలుదార్లకును భూమి యందు శాశ్వత హక్కులిచ్చిరి. ఏ భూమితాలూకు శిస్తు ఎవడు సరాసరికంపెనీ ఖజానాకు తెచ్చి చెల్లించునో ఆ భూమికి వాడే శాశ్వతహక్కుదారుడని నిర్ణయించిరి! ఇందువలన రైతుల కన్యాయము జరిగినదనుటలో నాశ్చర్యమేమి?

శిస్తులయొక్క రేట్లకు నీతినియమములుగాని నిలుకడ గాని లేవు. తరములకు స్థిరత్వములేదు. భూమిలో పండు నికర పంటలో సగము పంటను శిస్తుగా పుచ్చుకొనుటకు తమకు హక్కుకలదని ప్రభుత్వమువారి యూహ. అది కొన్నిచోట్ల పూర్వము నూటికరువది వంతులుగను కొన్నిచోట్ల ఎనుబదివంతు లుగనుగూడనుండెను. తరువాత సర్ తామస్ మన్రో పంటలో మూడవవంతు రొఖరూపమున శిస్తుగా పుచ్చుకొనునట్లు శిఫా రసుచేసెను. ఇదిగాక నీరుకావలసినను అక్కరలేకపోయినను నీటితీరువ తప్పదు. శిస్తులు క్రమక్రమముగా పెరుగుచునే యుండెను. రైతులకు వ్యవసాయఖర్చులును శిస్తును పోగా మిగులునది వారికుటుంబము మరుసటి సంవత్సరమువరకు జీవిం చుటకే చాలకుండెను. అందువలన భూములను బాగుచేసి కొనుట యనునది కలలోనివార్త. భూసారము తగ్గిపోయిపంటలు క్షీణించుచుండెను. పాడిపంటలు బాగుగ లేనందువలన సంతత ధనక్షామమున రైతు బాధపడుచుండెను. రైతులు భరింపలేని పన్ను విధించి దానిని కఠినముగా అణాపైసలతో వసూలు చేయు పద్ధతియే వారి దారిద్ర్యమునకు గారణమని ప్రజల

యొక్క నిజస్థితి నెరిగిన ధర్మాత్ములగు నాంగ్లేయు లనేకులు వ్రాసియున్నారు.

కరవులు వచ్చుటకుగల కారణములు ఆహార పదార్థములు లేకపోవుటగాదనియు, నవి కొనుటకు రైతులకు శక్తి లేకపోవుటయే యనియు, వారి కేదైనా మిగిలి, జీవనాధారము కలిగియుండుట యనునది రైతులపైన విధింపబడు భూమిశిస్తు పయినను వానిని వసూలుచేయు పద్ధతిపయినను నాధారపడి యుండుననియు కర్నల్ బైర్డు స్మిత్తు గారు వ్రాసియున్నారు. ఈయన 1861 లో వ్రాసిన రిపోర్టులో కాలువలు రోడ్లు మరి యితర సాగుబడి మార్గములు లేకపోవుటకన్నను భూమిపన్నుల హెచ్చుతగ్గులతోనే ఈ కరవుల కెక్కువ సంబంధము కలదని వ్రాసినాడు. నిజముగా నీ భూమిపన్ను యింత హెచ్చుగా నిర్ణయించుట, రైతు స్వతంత్రుడై తల ఎత్తుకొని తిరుగకుండా అణగి పడియుంచవలెననియే నని పూర్వము సివిల్ సర్వీసు యుద్యోగిగా నుండిన థ్యాకరీ వ్రాసియున్నాడు. ఈసంగతినే సర్ శంకరన్ నాయర్ గారు కూడా చెప్పి యీ అత్యధిక భూమిపన్నునుగూర్చి విమర్శించియున్నారు. మదాసులో రైతువారీపద్ధతి స్థాపించిన సర్ తామస్ మనో్రి 1827 లో చని పోయినపిదప కొన్నాళ్లలోనే రైతువారీపద్ధతిలోని లోపము లెల్ల తీవ్రతరము లయ్యెను. తరువాత 30 సంవత్సరములు శిస్తు లిచ్చుకోలేక రైతులు బాధలుపడుటయు వారినుండి బలవంతముగా శిస్తులు వసూలుచేయుటకు రివిన్యూ ఉద్యోగు లతికూరములయిన పద్ధతు లవలంబించి వారిని పీడించుటయు

జరిగినది. అందువలన వ్యవసాయము పాడై కరవు లధికము లైనవి. ప్రజల దుస్థితినిగూర్చి కలెక్టర్లును రివిన్యూబోర్డువారును గూడా అనేకరిపోర్టులు వ్రాసిరిగాని లాభము లేకపోయినది. పన్నులు తగ్గింపబడలేదు సరికదా పన్నులిచ్చుకోలేని రైతులను చిత్రహింసలు పెట్టుట మితిమీరినది. దీనినిగూర్చి మద్రాసులో గొప్పఆందోళనముజరుగగా నెట్టకేలకు పార్లిమెంటువారు 1854 లో నొకవిచారణసంఘము నేర్పరచిరి. శిస్తు లివ్వలేని రైతులను తీవ్రమైన ఎదురెండలో నిలువబెట్టుట; అన్నము తినుటకుగాని దేహబాధ తీర్చుకొనుటకుగాని పోనివ్వకుండుట; కొట్లో పెట్టియుంచుట; వాని పశువులను మేతకు పోనివ్వకుండుట; వానిపైన బంట్రోతులను నియమించుట; మనిషిని వంగియుండునట్లు కట్టివేయుట; చేతివేళ్ల నొకదానిలో నొకటి దూర్చి నొక్కుట, పొడుచుట, చంపలువేయుట, పిడికిళ్లతో గుద్దుట; కొరడాలతో బాదుట, పైకిని క్రిందికిని పరుగెత్తించుట; చెవులు మెలిపెట్టుట, మోకాళ్ల మడతలలో కంకరరాళ్ళు పెట్టి గొంతుకూర్చుండపెట్టుట; వంగియుండపెట్టి పైన పాకీవానినో మాలవానినో కూర్చుండ పెట్టుట; ఇరువురి తలలు డీకొట్టించుట; వారిజుట్లు వెనుకప్రక్క కలిపి ముడివేయుట, బండకొయ్యలు వేయుట; రైతు జుట్టును గాడిదతోకకుగాని దున్నపోతుతోకకుగానికట్టుట; బొమికలనులేక యితర అసహ్యపదార్థములను దండగా మెడలోవేయుట; ఇంకను ఘోరకృత్యములుచేయుట జరుగుచుండిన ట్లీ కమీషనువారికి విశదమైనది. ఈ వివరములనెల్ల వారు ప్రకటింపగా నిట్టివి జరుగరా దని

తాకీదులు జారీచేయబడెను. ఈ విచారణ సంఘమునకే 'మద్రాస్ టార్చర్ కమిషన్' అని పేరు.

వంగరాష్ట్రమునందు శాశ్వతపైసలా (పర్మనెంటు సెటిల్మెంటు) చేసినదిమొదలు జమీందారీలపైన ప్రభుత్వమునకు చెల్లవలసిన భూమిశిస్తు శాశ్వతముగా నిర్ణయింపబడి ఆ మొత్తములకు జమీందారులే పూచీవహించి వారు రైతులను పీడించుట ప్రారంభమైనది. ఈ అన్యాయములనుగూర్చి రైతులు మొరపెట్టుకున్నను లాభములేకపోయెను. శాశ్వత భూమిశిస్తు (పేష్కసు) సరిగా చెల్లించుచున్నంతకాలము జమీందారు లెంత దౌర్జన్యముచేసినను ఏమనకుండిరి. రైతుల మొరలు వినువారులేరు. వంగరాష్ట్రమున నిట్లొకవిధముగాను, చెన్నరాజధానిలో నింకొకవిధముగాను రైతులయొక్క దురవస్థలు నానాటికి హెచ్చుచుండెను. చెన్నరాజధానిలో "రైతువారీపద్ధతి" స్థాపింపబడినది. ఈ పద్ధతిప్రకారము ప్రభుత్వమే భూఖామందుగానుండెను. దొరతనము వారి భూములకు కలెక్టరులే మేనేజర్లుగానుండి భూమిని ప్రతిసాలున రైతులకు అమర్చుచుండుటయు భూమిశిస్తులు వసూలుచేయుచుండుటయు జరుగసాగెను. వంగరాష్ట్రమునవలెనే, ఈరాష్ట్రములోని కలెక్టరుయొక్క న్యాయవిచారణాధికారములు తీసివేయబడినచో అమరకపు వ్యవహారములు నెరవేర్చుటలో లోపములు కలుగునని అధికారులకు తోచినది. అందువలననే ఆ యధికారము లిచ్చుట విడదీయుబడలేదు. దీనిఫలితముగా కలెక్టరే రివిన్యూ ఉద్యోగియు, మేజస్ట్రేటునై రెండు అధికారములను పన్నుల

వసూలులో నిరంకుశముగా చలాయించుచుండుటయు అతని క్రింది రివిన్యూ ఉద్యోగులు రైతులను అనేకవిధములుగా పీడించుచుండుటయు, కలెక్టరుల అధికారమునకు భయపడి ప్రజలు నోరు విప్పలేకుండుటయు శీటస్థించినది. ఈ పరిస్థితులు నాటికి నేటికి నొకేతీరుగా నున్నవి.

## III

### రివిన్యూ పరిపాలన

భారతదేశ మాంగ్లేయుల వశమైన తరువాత రివిన్యూ పరిపాలనా పద్ధతు లెట్లున్నవో చూపుటకు చెన్నపురి రాజధానిలోని స్థితిగతులను నుదాహరణముగ గైకొనవచ్చును.

ఈ రాజధాని వైశాల్యము ఒక లక్ష నలుబదివేల చతురపుమైళ్ళు. మొత్తము జనసంఖ్య రెండుకోట్ల ఇరువది లక్షలు. ఆనాటి కీ రాజధానిలో 20 జిల్లాలుండెను. ఒక్కొక జిల్లా వైశాల్యము రమారమి 7 వేల చతురపుమైళ్ళు, జన సంఖ్య 11 లక్షలు. ఒక్కొక జిల్లాలో 14 లేక 16 తాలూకా లుండెను. ఒక్కొక తాలూకా వైశాల్యము 300 లేక 500 లేక 1000 చతురపుమైళ్లు; ఒక్కొక తాలూకాలో నూరులగాయతు రెండువందల గ్రామములుండెను. వీనిలో 500 మొదలు 2000 పొలములు లేక మళ్ళు, ఉండెను.

జిల్లాకంతకును ప్రధానాధికారి కలెక్టరు. ఈతని క్రింద నుండు ఆంగ్లేయోద్యోగులలో జిల్లాలో నాలుగవవంతుకు సంపూర్ణాధికారియగు సబుకలెక్టరు ఒకడు. ఆరు లేక పది సంవ

త్సరముల అనుభవముగల హెడ్ అసిస్టెంటు ఒకడు. ఏమియు తెలియని యొకరిద్దరు జూనియర్ అసిస్టెంటు లనబడు క్రొత్త దొరలు నుందురు. కలెక్టరుకు జిల్లాలో రివిన్యూపన్నులు వసూలుచేయు అధికారము మాత్రమేగాక పోలీసు, మేజస్ట్రేటు అధికారములును, రివిన్యూకు సంబంధించిన కేసులు విచారించు అధికారమును కూడ నుండెను. అన్నిపనులు వ్రాతమూలక ముగా జరుగవలెనను నిబంధన యొకటి యుండినందునను ప్రజ లకును పాలకులకును ఒకరిభాష ఒకరికి తెలియనందునను చాల చిక్కులకు కారణమగుచుండెను.

ఒక్కొక్క గ్రామములో మామూలు గ్రామోద్యోగులు గాక కలెక్టరుయొక్క అధికారముక్రింద 1500 మొదలు 2500 వరకు రివిన్యూవసూలు ఉద్యోగులు నౌకరులు పనిచేయుచుం డిరి. ఈనౌకరులకు చాలక్రొద్దిజీతములుండెను. కలెక్టరు మంచివా డైనను తాబేదారులు సర్వసామాన్యముగా దుర్మార్గులుగను లంచగొండెలుగను ఉండిరి. గుమాస్తాలు, డఫేదారులు, బంట్రో తులు గ్రామములలో జులుముచేసి సప్లయిలు కొట్టి లంచములు పుచ్చుకొని గ్రామస్థులను పీడించుచుండిరి. రివిన్యూనౌకరులం దరును కలసి యొక్కకట్టుగా పనిచేయుచు, ఒకరిపై వారికింకొ కరు సప్లయిలు లంచములు అందచేయుచు, రైతులను పీడించు చుండిరి. 1816 లో తహశ్శిల్దారుకు కూడా పోలీసు అధికారము లివ్వబడెను. అంతట నీ రివిన్యూపరిపాలనలోని దురాగతములు హద్దుమీరిపోయెను. నాటికి కేవలము ఆశ్రయింపులపైననే ఉద్యోగము లొసగబడుచుండెను. ఎవ డెక్కువ శీఘ్రముగా

పూర్తిగా పన్నులు వసూలు చేయునో వానికే వేతన వృద్ధియు పెద్దఉద్యోగమిచ్చుటయు జరుగుచుండెను. అందువలన చిన్ననౌకరు మొదలు తహశీల్దారువరకు పన్నులువసూలు చేయుటలో క్రూరులై ఇచ్చుకోలేని రైతులను గూడ బాధించి కొట్టి, కోదండములు తీయించి, బొండలలో పెట్టి, చిత్రహింసలుచేసి అతిక్రూరముగా పన్నులు వసూలు చేయుచుండిరి. నాటి పన్నులు రైతులు భరింపలేనంత అత్యధికముగా నుండెను. సర్ తామస్ మన్రో ఈ పన్నులలో నూటికి 25 వంతులు తగ్గించవలయునని సలహానిచ్చినను అట్లు జరుగ లేదు. తహసీల్దారులు తమకుగల పోలీసు అధికారములను పురస్కరించుకొని ఊరిలోని సామాన్యరైతులను పెత్తనదార్లను కూడ ఏదోమిషపైన తాలూకాకురప్పించుటయు విచారణయను పేరుపెట్టి పడవేసియుంచుటయు ఒక్కొక్కప్పుడు పన్నులవసూలు సరిగా జరుగలేదను క్రోధముతో అబద్ధపునేరములను కల్పించి అనుమానముపైన ఖైదులోపెట్టియుంచుటయు ఇంకను బాధించి లంచములు పుచ్చుకొనుటకు ప్రయత్నించుటయుగూడ జరుగు చుండెను. అడుగకుండానే లంచములిచ్చురైతులుకూడ నుండిరి. ఇచ్చినమట్టుకు పుచ్చుకొను తహసీల్దారు చాల మహానుభావుడని వారు సంతసించుచుండిరి. తాశిల్దారు తన యప్రయోజకత్వము బయల్పడకుండా తనతాలూకాలో జరిగిన నేరములను కూడా కప్పిపుచ్చుచుండెను. చింతబరికెలుపుచ్చుకొని పెత్తనదార్లను రైతులనుకొట్టి యావత్తు శిస్తుపన్నులు వసూలు చేయు రివిన్యూ ఉద్యోగులు ఆనాడు మిక్కుటముగా నుండిరి.

ఇట్టివారి తెలివితేటలకు కలెక్టర్లు మెచ్చుకొని తహసీల్దారుపని యొసగుచుండిరి! ఈ రివిన్యూపరిపాలనలో నింకొక చిత్రము గలదు. గ్రామకరణము లెక్కలలో తెలివితేటలు జూపగా రివిన్యూ యినస్పెక్టరు అజమాయిషీలోను తాశిల్దారు జమాబందీలోను తన చాకచక్యము గనపరచును. వీరందరును కలిసి కుట్రచేసి రైతులను పీడించుచు ఎందుకు పనికిరాని ఊసరక్షేత్రములను రైతుల నెత్తి మీద పడవేసి, వద్దు మొర్రోయని పారిపోయిన రైతులు పట్టా అంగీకరించినట్లుగా దొంగసంతకములు చేసి బాధించుచుందురు. ఆనాటిసర్వేలు పక్కాసర్వేలు కావు. అవి పగ్గము సర్వేలే. దీనిలో దొంగకొలతలు కొలిచి ప్రతియేటనుభీభత్సము జేయుచుండిరి. ఇక జమాబంది నాటకములో సీపాత్రిధారు లెల్లరు తహాసిల్దారుతో గూడుపుఠాణీ చేయుచుండిరి. కర్రలతోను చింతబరికెలతోను చావగొట్టుట, ఖైదులోపెట్టి బాధించుట, చిత్రహింసలు చేయుట రైతులుభరింపవలసిన సామాన్య కష్టములు. వీరిమొర లాలకించువారెవ్వరు లేకుండిరి. పైవారికి చెప్పుకొనుటకు ధైర్యముచాలదు. కలెక్టరుకు చెప్పుకొన్నను తమ తాబేదారులమాటలను నమ్మునేగాని వీరిమాటలను నమ్మడు. తహాశీల్దారుకు ఉన్నపోలీసుఅధికారములకు భయపడి అతని పైన నెవ్వరును సాక్ష్యము చెప్పరు. కలెక్టరులపైనుండిన రివిన్యూ కమీషనరుకుగాని రివిన్యూబోర్డువారికిగాని అర్జీలు నిచ్చుకొన్నచో వా రాయర్జీలను రిమార్కులకొరకు కలెక్టర్లకే బంపుచుందురు. అవి బుట్టదాఖలగును. 1822 లో లంచముల రెగ్యు

లేషన్ అను శాసనము చేయబడినది. ఘోర అన్యాయములు చేసి లంచములు పుచ్చుకొను దుర్మార్గపు అధికారులసంఖ్య పెరిగి పోయినందుననే ఆ చట్టము చేయబడినది. కొందరుశిక్షింపబడిరి గాని దానిని గట్టిగా అమలు జరిపినచో పన్నులవసూలు బాగా జరుగదని కలెక్టర్లు ఉపేక్షించుచుండిరి. కలెక్టరులు నిర్వహించ వలసిన కర్తవ్యములు అసంఖ్యాకములుగ నుండెను. జిల్లాలోని అన్ని వ్యవహారములపైన అన్ని శాఖలపైన వారికి అధికార ముండెను. ఇంత విశాలప్రదేశమున ఇన్ని పనులను తృప్తికర ముగా నిర్వహించుట యనునది అసంభవము. ఇంత పెద్ద సిబ్బం దిని అనుపు ఆజ్ఞలలోనుంచి పరిపాలించుట కూడ కష్టమే. అందువలన జిల్లాపరిపాలనలో చాల అన్యాయములు జరుగు చుండెను. (జాన్ బ్రూస్ నార్టన్—1854)

## ఎనిమిదవ ప్రకరణము

## సివిల్ క్రిమినల్ న్యాయవిచారణ

### I

న్యాయవిచారణచేయు అధికారము మొదట కంపెనీ వారికి లేదు. తమ నౌకరులు చేయునేరములను విచారించి శిక్షించుటకవసరమని అట్టి అధికారమునివ్వవలసినదని ఇంగ్లీషు రాజునడిగిరి. తమ ఓడలపైనుండు వారిని విచారించి శిక్షించు టలోవలెనే భారతదేశమున తాముస్థాపించిన వర్తకస్థానము లందును అట్టి న్యాయవిచారణ చేయుటకు మొగలు చక్రవర్తి వలన అధికారము పొందిరి. ఈ కంపెనీవారు ప్రారంభమున

చలాయించినది ఆంగ్లసైనిక శాసనధర్మము. ఆనాటి ఆంగ్లధర్మ శాస్త్రమునం దనేక విపరీతపు పద్ధతులుండెను. ఎంతచిన్న వస్తువును దొంగిలించినను ఉరిశిక్ష వేయుదురు. ఏదైన నొక పత్రమును ఫోర్జరీ చేసినను ఉరిశిక్షయే. దీనికి కారణము ఆంగ్లేయులకు ఆస్తిపైనగలకాంక్షయె. సైనిక శాసనధర్మము వారి కివ్వబడక పూర్వము ఈ కంపెనీ వారు తమ దేశస్థులను స్వంత నౌకర్లను కూడ కూ్రరశిక్షల పాల్జేయుచు చిత్రహింసలు వధలు జేయుచుండిరి. ఎవనినైన వదల్చుకొనవలె నన్నచో వానిని కొరడాలతో చావబాది చచ్చినపిదప ఈడ్చివేయుచుండిరి. ఓడదొంగల నురిదీయుట కొసగబడిన అధికారమును పురస్కరించుకొని ఆ నేరమును అనేక సామాన్య వర్తకులపైన మోపి ఉరిదీయుచుండిరి. ఈ సంగతి నింగ్లీషుచరిత్రకారుడే వివరించినాడు. (చూడు:టారెన్సు, పుటలు 21-22)

ఆంగ్లేయ రాజ్యాధిపత్యమును గట్టిపరుపవలెనన్నచో నవాబులకు గల న్యాయవిచారణ అధికారమును దీసివేయుట యవసరమని వారన్ హేస్టింగ్సు గ్రహించెను. అందువలన నీతడు గవర్నరు కాగానే పూర్వమునుండియు న్యాయవిచారణ చేయుచుండిన గ్రామపంచాయతులకును నవాబుయొక్క అధికారులకును గల క్రిమినలు విచారణాధికారములను తొలగించి ఆంగ్లేయ కలెక్టర్లను నియమించినాడు. ఈ మార్పు సహజముగనే జరిగెను. దివానీగిరీ వచ్చినప్పటినుండియు పంచాయతీయొక్క అధికారములు తగ్గింపబడి కంపెనీయొక్క అధికారములు వృద్ధిచేయబడుచునే యుండెను.

1773 లో చేయబడిన రిగ్యులేటింగుచట్టముప్రకారము అన్ని సివిలు క్రిమినలు వ్యవహారములందునుఆంగ్ల శాసనధర్మము అమలుజరుపు సుప్రీముకోర్టు కలకత్తాలో స్థాపింపబడుటతో భారతీయ న్యాయవిచారణ పూర్తిగా రూపుమాసినది. కేవలము హిందూ మహమ్మదీయుల మతధర్మములు, వారసత్వము, వ్యక్తిసంబంధ ధర్మములు తప్ప తక్కిన అన్నివిషయములందును ఆంగ్ల శాసనధర్మములే అమలు జరుపబడెను. జడ్జీలెల్లరు దేశభాషలును ఆచార వ్యవహారములును తెలియని ఆంగ్లేయులే. కంపెనీవారు ప్రవేశపెట్టిన చట్టములు పద్ధతులు కేవలము అన్యాయములనియు దేశములో క్రిమినలు విచారణాధికారము కంపెనీవారు వహించుట దేశీయుల హక్కులను హరించుటయే యనియు వారన్ హేస్టింగ్సు అంగీకరించియున్నాడు. అయినను అట్లు చేయవలసి వచ్చిన దనియు ఆ యధికారమును దేశీయప్రభువుల చేతులలో నుంచినచో కంపెనీఅధికారమునకు భంగము కలుగుననియు అందువలన నీ పద్ధతి మంచిదైనను చెడ్డదైనను ఒక ఆంగ్లేయన్యాయపరిపాలనా విధానమును స్థాపించితిమని చెప్పుటకే ఈ అధికారమును తాము వహించితిమనియు హేస్టింగ్సు స్పష్టముగా జెప్పెను.

1770 లో వచ్చిన కరవు తరువాత, పూర్వము 1760లో నియమింపబడిన సూపర్వైజర్లను వారన్ హేస్టింగ్సు కలెక్టర్లుగా మార్చెను. హేస్టింగ్సు కలకత్తాలో సివిలు క్రిమినలు అప్పీలు కోర్టులను స్థాపించినాడు. మునల్మానుల క్రిమినలు ధర్మమును

అమలులోనుండిన దాని నక్లేయుంచినాడు. రెగ్యులేటింగు ఆక్టు అమలులోనికి వచ్చిన పిదప సుప్రీముకోర్టు ఆంగ్లేయ ధర్మ మును అమలు జరుపసాగెను. వంగరాష్ట్రమునం దన్ని ప్రక్కల నుండిన జమీందారులపై నను అధికారము చలాయింపసాగెను. ఈ జడ్జీల తెలివితక్కువతనమును చూచి కొంతమంది భారతీ యులు చిక్కులు తెచ్చిపెట్టి లాభము పొందసాగిరి. గొప్ప గొప్ప భారతీయులుకూడా అనుమానముపైన ఆకస్మికముగా పట్టుకొనబడి కలకత్తాలో సామాన్యఖైదీలుంచబడు చెరసాల లందుబంధింపబడుచుండిరి. ఈ సుప్రీము కోర్టు పద్ధతులానాటి నేటీవుల కగమ్యగోచరముగనుండెను. "హేబియస్ కార్పస్" అనగానేమో 'డామేజస్' అనగానేమో 'వారంట్' అనగానేమో వారెరుగరు. నేటీవులకు సమను లంపునప్పుడు వారు కోర్టు అధికారమునకు లోబడినవారే యని ఒక ప్రమాణపత్రము దాఖలుచేయవలెనని జాగ్రత్తకొరకు ఒక నియమమును వారన్ హేస్టింగ్సు చేయించినను లాభములేకపోయెను. ప్రతికేసులోను ఇట్టి ప్రమాణపత్రము దాఖలుచేయబడుచుండెను. జమీం దారులను ప్రభుత్వాధికారముగల చిన్న సంస్థానాధీశులను కూడ కోర్టుకు లాగసాగిరి.

దేశములో రాష్ట్రీయ కోర్టు లనబడు వాని యందు ముప్పదిమంది ఆంగ్లేయులు హిందూ మహామ్మదీయజడ్జీల సహాయముతో పనిచేయుచుండిరి. ఆస్తికిని వ్యక్తులకును సంబంధించినట్టి హిందూ మహామ్మదీయ ధర్మముల అమ లును నేటీవు జడ్జీలకే వదలిరి. ఇప్పుడు సుప్రీము కోర్టువారు

పార్టీలలో ఎవరికో ఒకరికి కంపెనీ రివిన్యూ వసూలుతో సంబంధ మున్నదనియో లేక ఇంకొక మిషపైననో వారిపైన అధి కారమును వహించి ఆంగ్లధర్మమును అమలు జరుపసాగిరి. వారన్ హేస్టింగ్సు హయాములో కలకత్తాకు బయటనుండు క్రిమినలు కోర్టులలో న్యాయవిచారణ మహమ్మదీయ అధి కారులవలననే చేయబడుచుండెను. అందు అమలు జరుపబడు నది ముసల్మాను ధర్మశాస్త్రమే. కోర్టులలో నుపయోగింపబడు భాష ఫారసీభాష. విధింపబడు శిక్షలలో తూర్పుదేశములందు సర్వసామాన్యశిక్షలగు చేతులు కాళ్లు ఖండించుట వాతలు వేయుటయుకూడ ఉండెను. ఆంగ్లేయకలెక్టర్లు 'కమిటింగు మేజ స్ట్రేటులు' అనగా నేరములను విచారణకొరకు పంపు అధి కారులుగా నుండిరి.

## II

కారన్‌వాలిసు 1787 లో కలెక్టర్లకే చిన్న నేరము లను విచారించు అధికార మిచ్చెను. 15 బెత్తము దెబ్బలు విధించుటకు వీరికధికారమిచ్చెను. 1790లో నితడు క్రొత్త నిబంధ నలనుచేయగా వానిప్రకారము ప్రాంతకోర్టులు తీసివేయబడెను. వానికిబదులు నాలుగు సర్క్యూటుకోర్టులు నెలకొల్ప బడెను. ప్రతికోర్టుకును ఇద్దరు ఆంగ్లేయ జడ్జీలు నియమింపబడిరి. దీనివల్ల కంపెనీవారు వంగరాష్ట్రమున నేరవిచారణాధికారము వహించిరి. 1793లో నితడు పాట్నా డెక్కా మూర్షిదాబాదు కలకత్తాలలో ముగ్గురు జడ్జీలుగల అప్పీలుకోర్టులు స్థాపించెను. వీరు సర్క్యూటుకూడ చేయుచుండిరి. ప్రాంతమహమ్మదీయ ధర్మ

శాస్త్ర మింకను అమలుజరుపబడినను 'రెగ్యులేషనుల' ద్వారా వానిలో కొన్నిమార్పులు చేసెను. వానిలో ముఖ్యముగా 'కాఫరు'ల సాక్ష్యముపైన తురకలకు మరణదండన విధింప రాదను పూర్వపు నియమమును మార్చివేసెను.

వారన్‌హేస్టింగ్సు స్థాపించిన సివిలు విచారణ పద్ధతు లందుకూడా కొన్నిమార్పులు చేయబడెను. జిల్లా కోర్టుల యందు పరివేష్టించు కలెక్టర్లకు ధర్మశాస్త్రము తెలియదు; పనియందు ఆసక్తియులేదు. మరియు వారు తమ అధికారము లను తమ రివిన్యూ వసూలుకొరకు స్వంత వ్యాపార లాభము కొరకు వినియోగించుచుండిరి. కారన్‌వాలిసు సివిలు న్యాయపరి పాలనను చౌకగను సులభసాధ్యముగను చేయదలచెను. అందు వలన 1793లో కొన్ని రెగ్యులేషన్లు చేసెను. జిల్లాలలో 28మంది ఆంగ్లేయ జడ్జీలను నియమించి నాలుగు సర్క్యూటు అప్పీలుకోర్టు లను పెద్దవిచేసి వానికి సివిలు విచారణాధికారమిచ్చెను. వీనిక్రింద భారతీయ సదరమీనులు కమిషనర్లు చిన్న సివిలు కేసులను విచారించుచుండిరి. ఆంగ్లజడ్జీలకు రివిన్యూ అధికారముతో సంబంధములేదు. ఇతడు అప్పు డమలులోనున్న శాస్త్ర ధర్మ ముల నెల్ల క్రోడీకరించి రెగ్యులేషన్లు చేయ ప్రయత్నించెను. దీనిలో నితనికి సర్ విలియంజోన్సు అను విద్వాంసుడు చాల తోడ్పడెను. కారన్‌వాలిస్ చేసిన సంస్కరణములవలన వ్యాజ్య ముల పిచ్చి ప్రజలలో ప్రజ్వలించెను. అంతట డిపాజిటురుసుము గ్రహించు పాతపద్ధతి మరల అమలులోపెట్టగా నిది కొంత తగ్గినది. 1802 నాటికి ఆంగ్లేయజడ్జీలు 8298 కేసులు విచారించపగా

12 వేల కేసు లింకను నిలువయుండెను. భారతీయ కమిషనర్లు 342184 కేసులు పరిష్కరింపగా 149827 కేసులు నిలువ యుండెను.

కారన్ వాలిసు చేసిన సివిలు క్రిమినలు సంస్కరణముల వలన రివిన్యూ కలెక్టర్లజులుము కొంత తగ్గినమాట వాస్తవము. దౌర్జన్యములుకూడ కొంత తగ్గినవి. కాని షాహుకారులును న్యాయవాదులును కోర్టులద్వారా జనసామాన్యమును పీడించుట ప్రారంభమైనది.

కారన్ వాలిసు పోవునాటికి కీ విశాలమైన 'బ్రిటిషు ఇండియా'యొక్క జనసంఖ్య 10 కోట్లు. ఇటిస్థితిలో కంపెనీ ప్రభుత్వముచేసిన ఏర్పాట్లు ఏమూలకును సరిపోలేదు. దేశము లోని ప్రజలతో కలసిమెలసియుండు భారతీయుల సహాయము పొందకుండ ఆంగ్లేయులే న్యాయవిచారణ జరుపదలచిరి. ఇది కష్టసాధ్యమైనపని. అందుకొరకు నియమింపబడిన ఆంగ్లేయ జడ్జీలకు దేశభాషలురావు. దేశీయుల ఆచారవ్యవహారములు తెలియవు. వారికిక్రింద తక్కినపనులన్నియుచేయు కోర్టుగుమాస్తాలు చాల చిన్నజీతగాండ్రు. అందువలన వారిలో లంచ గొండితనము ప్రబలమైనది. వీరు తమకు లంచమిచ్చినవారికి మాత్రమే న్యాయవిచారణ సౌకర్యములను కలుగజేయు చుండిరి. దొరలు పనిచేయలేక దావాలు పెరిగిపోయినందున విచారణలో కాలహరణము జరుగుచుండెను. లెక్కలేనంత మంది సాక్షులు ఇళ్లువాకిళ్లు పనులు వదలుకొని దూర ప్రదేశముల నున్న కోర్టులకుపోయి చాలరోజులు పడియుండ

వలసివచ్చుచుండెను. సాక్షిగా పోవుటయన్న ఎంతో పాపము చేసుకొనుటయని హిందూమహమ్మదీయ ప్రజల కెల్లరకు తోచుచుండెను. కోర్టుఖర్చులు, రుసుములు అత్యధికముగా నుండి న్యాయవిచారణ అమితధనవ్యయ కారణమయ్యెను. పని తగ్గించుటకు న్యాయాధికారుల విచారణాధికారము హెచ్చు చేయబడి అప్పీళ్ళుచేసుకొను అవకాశము తగ్గింపబడెను. ఎన్ని నిర్బంధములనైనను నిరోధములనైనను చేసిరి గాని భారతీయులకుమాత్రము న్యాయవిచారణాధికారము నొసగరైరి. ఇంగ్లీషువారు రాకపూర్వ మీ దేశములో తరతరములనుండి తగవులుదిద్ద నేర్పరులైన భారతీయులు బ్రిటిషువారికాలములో పనికిరాకపోయిరి. తామీ దేశములో అడుగిడునప్పటికి ప్రభుత్వము చేయుచున్న మొగలాయిరాజుల కాలమున అయిదు వందలయేండ్లు ఈ భారతీయులు గొప్పగొప్ప ఉద్యోగములు పొంది వానిని చక్కగా నిర్వహించుచుండిరను మాట నీ ఇంగ్లీషుదొరలు మరచిరి.

నేరములను విచారించి శిక్షించు క్రిమినల్ న్యాయ విచారణ పద్ధతిలోకూడ చాల లోపములుండెను. వంగ రాష్ట్రమునిండా బందిపోటుదొంగలు విచ్చలవిడిగా తిరుగు చుండిరి. దీనినణచుటకు మేజస్ట్రేటులకు సహాయము చేయ గలందులకు నియమింపబడిన పోలీసు సిబ్బంది యొక్క జీతములు చాలతక్కువగానుండి వారిలో లంచగొండి తనము మితిమీరినది.అందువలన పెక్కు నేరములు ఆచోకీతీయ కుండ పోవుచుండెను. దీనినణచుటకు ఈ మేజస్ట్రేటులకు సహా

యముచేయుటకు క్రొత్తగా ఇద్దరు ఆంగ్లేయపోలీసు సూపరెంటెండెంట్లను నియమించిరి. ప్రత్యేకాధికారములతో క్రొత్త మేజస్ట్రేటులనుగూడ నియమించిరి. ఈయధికారులు తమ పనిని చలాయించుటలో తమకు తోడ్పడుటకు కొంతమంది ('గుండా' లను) ఆతతాయిలను, రహస్యపరిశోధనకు మఱికొందరిని,నియమించిరి. ఈపోగరుబోతులు పశుబలమును ప్రయోగింపసాగిరి. అనుమానమున్నను లేకున్నను, తమ విరోధులపైన నేరములు మోపుటయు, అన్యాయములచేయుటయు మొదలిడిరి. ఇదియె రహస్య పోలీసుశాఖకు పునాదియైనది. అబద్ధపు ఫిర్యాదులు కొండెములు చెప్పి నిరపరాధులనుగూడ చాలకాలమువరకు జైళ్ళలో పడవేయించుచుండిరి. నిందితులు విచారణకు పెట్టబడునప్పటికి కొన్ని నెలలుపట్టి ఒక్కొక్కప్పుడు కొన్ని సంవత్సరములుకూడ జైళ్ళలో పడియుండుటవలన జైళ్ళు క్రిక్కిరిసియుండెను. మేజస్ట్రేటులను జూచినదానికన్న ఈ రౌడీలను కొండెగాండ్రనుజూచి ప్రజలు ఎక్కువగా భయపడుచుండిరి.

ఎన్నిలోపములున్నను న్యాయవిచారణచేయు కోర్టులనునవి వచ్చినతరువాతనే వంగరాష్ట్రములోను తక్కిన రాజధానులలోను ఆంగ్లేయవర్తకుల ఆగడములు కొంతవరకు చల్లారినవి. అంతకుపూర్వము వర్తకమెల్ల వారి చేతిలోనుండి కంపెనీక్రింద పనిచేయునల్ల నౌకరులను,ఇతర ఆంగ్లేయవర్తకులక్రిందపనిచేయు నౌకరులను దొరలు కొట్టుట, హింసించుట, నిర్బంధించియుంచుట సర్వసామాన్యముగానుండెను. వేలకొలదిమంది వెట్టిచాకిరి చేయవలసివచ్చుచుండెను. వారికిచ్చుస్వల్పకూలి కడుపు

నిండ తినుటకుకూడ చాలదయ్యెను. ఒక్కొకప్పుడు యజమానులు వారిని కాళ్లుచేతులుకట్టివేసి కంపెనీవారికి ఉప్పుతయారు చేయగలందులకు "సుందర్బన్స్" మొదలగు అనారోగ్యపు ప్రదేశములకుపంపి నిర్బంధసేవ చేయించుటకూడ జరుగుచుండెను. 1793 లో కోర్టులు స్థాపింపబడిన పిదప నీయన్యాయములు చాలవరకు తగ్గినవిగాని తెల్లవారి నిరంకుశత్వముగాని హింసలుగాని పూర్తిగారూపుమాయలేదు. సివిలుకోర్టుల తీర్పులును చిన్న ఫౌజుదారీ క్రిమినలు కేసులలో మేజిస్ట్రీటులు వేయు శిక్షలును తెల్లవారికి కొంచెము జంకుకలిగించినను, నల్లవారికి తమ బాధలను కలెక్టర్లతో చెప్పుకొను ధైర్యము లేనందున సాధారణముగా నెట్టి ఫిర్యాదును చేయకయె వారు బాధలనుభవించుచుండిరి. (రమేశచంద్రదత్తుగారి ఆర్థికచరిత్ర)

జిల్లాలో పరి పాలనాధికారమును న్యాయ విచారణాధికారమును ప్రథమమునుండియు కలెక్టరులే చలాయించుచున్నందున చాలా అన్యాయములకు కారణమాలయ్యెను. కలెక్టరు కేవలము ప్రభుత్వముయొక్క రివిన్యూ వ్యవహారములు చక్కబెట్టుటకు నియమింపబడిన అధికారిగానుండి ప్రజల కష్టసుఖములు గమనించి న్యాయవిచారణ విషయమై తగు శ్రద్ధవహింపడయ్యెను. 1793 లో నీరెండు అధికారములును వంగరాష్ట్రములో కారన్ వాలిసు విడదీసి వేరువేరు ఉద్యోగులకిచ్చినాడు. దీనివలన న్యాయవిచారణాధికారులు తమ యధికారము క్రిందనుండిన ప్రజల క్షేమమునుగూర్చి కొంతజాగ్రత్తగా యోజించి న్యాయపరిపాలన చేయసాగిరి. ఇతరచోట్ల నిది జరుగలేదు.

## III

నాటి భారతదేశ పరిపాలనలో న్యాయవిచారణ అధ్వాన్నముగ నుండెననియు సివిల్ రివిన్యూ పరిపాలన లోపభూయిష్ఠముగనుండెననియు అనుభవజ్ఞులగు ఆంగ్లేయోద్యోగులగు స్ట్రాచీ, మన్రో, వాకరు లింగ్లాండుకు పలుమారు వ్రాయసాగిరి. భారతదేశ పరిస్థితులనుగూర్చి 1812 లో పార్లిమెంటు ఉపసంఘమువారు 'ఫిఫ్తురిపోర్టు' అను నొక నివేదికను ప్రకటించిరి. దీనిలోని సంగతుల వలనను, 1813 లో మన్రోయిచ్చిన సాక్ష్యమువలనను భారతదేశ న్యాయపరిపాలనలోను రివిన్యూ పరిపాలనలోను కొన్ని సంస్కరణము లవసరమని కంపెనీ డైరెక్టర్లకుకూడా తోచినది. అంతట దీనినిగూర్చి విచారించి తగు సలహా లిచ్చుటకు కర్నల్ మన్రోగారి అధ్యక్షతక్రింద మద్రాసురాష్ట్రములో నొక స్పెషల్ కమీషను నియమించిరి. మన్రో 1814 లో మదరాసులో విచారణసలిపి డిశంబరులో తన సలహాలను మదరాసు ప్రభుత్వమునకు నివేదించెను.

కలెక్టరే మేజస్ట్రీటుగానుండవలెననియు, గ్రామపోలీను అధికారములు గ్రామాధికారులకే యివ్వబడవలెననియు, గ్రామపంచాయితీలు పునరుద్ధరింపబడవలెననియు, "నేటీవు" జిల్లాజడ్జీలు కమీషనరులు నియమింపబడవలెననియు, పట్టా రెగ్యులేషన్‌లను కలెక్టరులు సక్రమముగా అమలు జరిగించవలెననియు, ఆస్తిని జప్తుచేయు అధికారములను జమీందారులకు లేకుండ చేయవలెననియు, పొలముల సరిహద్దు (బౌండరీ) వివాదలను కలెక్టరులే పరిష్కరించవలెననియు, అతడు సలహా

నిచ్చెను. ఇట్లు న్యాయవిచారణాధికారము సాధ్యమైనంతవరకు భారతీయులవశము గావింపవలెనని యాతని ప్రధానోద్దేశము. జిల్లాలోని రివిన్యూ మేజస్ట్రీటు పోలీసు అధికారములెల్లను సంపూర్ణముగా నొకే యధికారి చేతులోనేయుంచి కలెక్టరును జిల్లాకు సర్వాధికారిగా చేయవలెనని యాతని రెండవయుద్దేశము. మొదటిపద్ధతిని సక్రమముగా నమలుజరిపి యుండినచో దేశమునకు క్షేమము కలిగియుండును గాని దానిలో కొన్ని సంస్కరణములు మాత్రమేచేసి యూరకొనిరి. రెండవదిమాత్రము పూర్తిగాజేసిరి. క్రిందియధికారుల పరిపాలనమెల్ల చెడి, జిల్లా పుచ్చియున్న నాటికాలములో జిల్లాకలెక్టరును సర్వాధికారిగా చేయుటవలన దేశమునకు కొంతలాభముకలిగినమాటవాస్తవమె గాని తరువాత దానివలన ప్రజల కమితమైననష్టములు గల్గినవి. ప్రజలకు స్వేచ్ఛస్వాతంత్ర్యములు లేకుండ పోయినవి.

1813లో న్యాయవిచారణశాఖను సంస్కరించుటకొరకు కంపెనీ డైరెక్టర్లు అనుభవజ్ఞులగు ఉద్యోగులను సలహా లడిగి నప్పుడు వంగరాష్ట్రమున సర్ హెన్‌రీ స్ట్రాచీ, మదాసులో తామస్‌మనో్ర, బొంబాయిలో కర్నలువాకర్ గార్లు హిందూ మహమ్మదీయ పెద్దమనుష్యులను న్యాయవిచారణ శాఖలో నియమించి ఆంగ్ల ధర్మశాస్త్రములు, శాసనములు, అమలుజరిపి నచో ఏ శాఖ చాలవరకు చక్కబడునని సలహాల నిచ్చి యుండిరి. రెండువందల రూపాయిలవరకు విలువగల వ్యాజ్యముల పైన మునసబులకు విచారణాధికారమునిచ్చి వారి జీతములు ఆంగ్లేయజడ్జీల జీతములలో పదియవ వంతుదాకనైన హెచ్చిం

చినచో చాలునని అభిప్రాయముగూడ నిచ్చిరి! గాని ఎట్టి సంస్కరణములును జరుగలేదు.

## IV

1833 లో కంపెనీ వారికి మరల పరిపాలనాధికారపు పట్టా నిచ్చునప్పుడు భారత దేశమున న్యాయపరిపాలనావిధానము సంస్కరించుట యవసరమని గ్రహించి పార్లమెంటువారు 1833వ సంవత్సరపు కంపెనీ పట్టాచట్టమునుచేసి న్యాయపరిపాలనావిధానమును సంస్కరించుటకని మెకాలే నొక 'లా కమీషనరు'గా నియమించిరి. శాసనధర్మములను సంస్కరించి క్రోడీకరించు బాధ్యత నతనిపై నబెట్టిరి. పీనలుకోడ్ అను శిక్షాస్మృతిని మెకాలే నిర్మించినాడు. ఈ స్మృతి భారతీయప్రజల క్షేమ లాభములకు తోడ్పడలేదుగాని ఆంగ్లపరిపాలనను గట్టిపరచుటకుమాత్రము తోడ్పడెను. సామాన్యముగా నింగ్లాండులో శాసనాధికారమునుబట్టి ఎవడేమిచేసినను ఆ శాసనముప్రకారమే చేయవలెను. ఎవరైన కీడు కలిగించినచో దానికి నష్టపరిహార మివ్వవలెనో లేక శిక్షింపవలెనో అనునది జరిగిన హానినిబట్టిఏర్పడును. మెకాలేచేసినశిక్షాస్మృతిలో నిండియాలో నెవ్వడైన తనకు అధికారముకలదని తలచి ఒకనికి హానికలిగించినచో అది శిక్షార్హమగు నేరముకాదని అధికారుల కొక గొప్ప విశేషాధికార మిచ్చినాడు! ఇట్లే శాసనాధికారమును చలాయించుటలో నెవడే హానిచేసినను చేయవచ్చుననుటయు గూడ అధర్మమేయని కలకత్తా బ్యారిష్టరు తిమోబాల్డు 1885లో విమర్శించియున్నాడు. (Basu - Rise of Christian Power)

ఈ శిక్షాస్మృతి భారతీయుల నధోగతిలోనికి దింపినది. అధికారులు తలచు కొన్నచో దీనిక్రింద నేరము కానిదే లేదు. వారికిష్టమున్నచో నిజమైన నేరగాండ్రనుగూడ వదలుటకు వీలులేని నేరమునులేదు. ఇట్టి విధముగా నేరవివరణములు చేయబడినవి. ఐర్లాండు దేశ ప్రజల స్వాతంత్ర్యమును హరించి వారి నణచి పీడించుట కా దేశమున నాంగ్లేయు లెట్టి శిక్షాస్మృతిని నిర్మించిరో ఈ దేశమునగూడ నట్లేచేసిరి. దాని వలన ప్రజలధోగతికిదిగి దరిద్రులై దుర్మార్గులగుటకు కారణమైనది. ఇక శిక్షల జాతుమా, ఇంతకఠినశిక్షలు ప్రపంచములో నెక్కడను కని వినియెరుగము. ఒకమారు చెరకంపబడినవా డెల్లకాలము ఖైదీగానుండున ట్లిందలివిధులు నిర్మింపబడినవే గాని సంస్కరణ విధాన మిందులేదు. ఖైదీలనెల్లరను సంఘము నుండిబహిష్కరించు విపరీతపుకట్టుబాటు లిందు చేయబడినవి. ఇక విచారణ విధానమునందు భారతీయుల కొక విధియు ఆంగ్లేయుల కింకొక విధియు నిర్మింపడుటయు, నేరము మోపువాడు విచారించువాడునొకడేయగుటయు, ఉన్నత మేజస్ట్రీటులు జడ్జీలు నాంగ్లేయులగుటయు భారతదేశ న్యాయవిచారణ విధానము నొక నిరంకుశయంత్రముగా జేసినవి.

భారతదేశ న్యాయపరిపాలననుగూర్చి 1878 లో విమర్శించుచు సర్ జార్జి క్యాంబెల్ గారు భారతదేశ కారాగారములందలి మరణముల రేటు హెచ్చుగానుండుట వలన నేరగాండ్రు తాము చెర కేగినపుడు బయటకువచ్చుట దుర్లభమని ఎరిగి నేరములు జేయకుందురని తన మినిట్సులో వ్రాసినట్లు

"ఇంగ్లీష్‌రూల్ అండ్ నేటివు ఒపినీయన్ ఇన్ ఇండియా" అను గ్రంథమున జేమ్సు రౌట్ లెడ్జి, చెప్పినాడు. చెరసాలలందు వంగ రాష్ట్రమున ఖైదీలచేత జనపనార పరిశ్రమలలో సీసమయమున నతికఠినముగా పనిచేయించినట్లును తెలుచున్నదని రెజినాల్డు రేనాల్డ్సు 1938 మే నెల 'న్యూలీడరు'లో వ్రాసినాడు.

V

న్యాయపరిపాలన, రివిన్యూ పరిపాలన, పోలీసు, గ్రామ పంచాయతీల సంస్కరణమును గూర్చి 1814 లో మన్రోగారు చేసిన సూచనల విషయమున మద్రాసుప్రభుత్వమునకును కంపెనీ డైరెక్టర్లకును ఉత్తర ప్రత్యుత్తరములు జరిగిన పిదప పై వ్యవహారములలో కొన్నిటిని గూర్చి నట్టియు, జిల్లా గ్రామాధికారుల కర్తవ్యములను గూర్చినట్టియు, వివిధనిబంధనలుగల 15 రెగ్యులేషనులు (శాసనములు) చేయబడెను. దీని ఫలితముగా మద్రాసు రాజధానిలో భారతీయులకు కొన్ని పెద్దయుద్యోగము లివ్వబడుటయు, న్యాయవిచారణాధికారములుగూడ ఒసగబడుటయు జరిగినది. గాని మన్రోగారు సూచించినట్లు గ్రామపోలీసు అధికారములు గ్రామోద్యోగుల కొసగబడక ప్రజలకు బాధ్యతలేని నిరంకుశపు పోలీసుసిబ్బంది యొకటి నిర్మింపబడినది. ఈపోలీసుశాఖ యనునది ఇతర దేశములందువలె ప్రజాసంరక్షణకొరకు గాక దొరతనమువారిఅధికారము నిలువబెట్టుటకే ఉపయోగపడుచున్నది. మన్రోగారు సూచించిన ప్రకారము గ్రామ పంచాయితీలు పునర్నిర్మాణము గావింపబడలేదు. అది జరిగి యుండినచో

గ్రామములకు నేటి దుర్గతి పట్టియుండదు. తరువాత చాలా యేండ్లకు తాలూకా జిల్లాబోర్డులు, యూనియనులు, స్థాపింపబడి వను గ్రామములకు ప్రభుత్వముతో అన్యోన్యసంబంధ మేర్పడ లేదు. కలెక్టర్లకు సర్వాధికారము లిచ్చుటవలన నేరము మోపువాడు, విచారించువాడు నొక్కడేయై ప్రజలకు న్యాయ విచారణమందు విశ్వాసము కుదురలేదు. పోలీసు మేజస్ట్రేటు అధికారము లొక్క అధికారిలోనే కేంద్రీకరింపబడుట చాలా అన్యాయములకు గారణములయ్యెను.

వంగరాష్ట్రమున 1757 లో ప్లాసీయుద్ధముకాగానే ఆంగ్లేయులకు రాజ్యాధిపత్యములభించినది. మదరాసులో వంద వాసియుద్ధము జరుగగానే 1761 లో నది లభించినది. ఉత్తర సర్కారులు నైజామువలన వీరికి వచ్చివేసినవి; గాని బొంబా యిలో తరువాత నేబదేండ్లవరకు మహారాష్ట్రులు ఆంగ్లేయు లతో పోరాడుచు వారికి రాజ్యాధిపత్యము కలుగనివ్వలేదు. ఎన్నోయుద్ధములు జరిగినపిదప 1802 లో నొక కీలుబొమ్మ పీష్వాగా చేయబడి 1817 లో బొంబాయి రాజధాని యాంగ్లే యులచే కలుపుకొనబడెను. బొంబాయి చరిత్రకెల్ల మూల పురుషుడు, మౌంటుస్టూవార్టు ఎల్ఫిన్‌స్టన్ అని చెప్పవచ్చును. 1818 జనవరిలో నితడు డక్కను కమీషనరుగా నియమింప బడి 1819 లో బొంబాయికి గవర్నరయ్యెను. మదరాసు రాజధానిలో మన్రోవలెనే ఇతడును బొంబాయిలో రాజకీయ న్యాయవిచారణశాఖను పరిపాలనను సంస్కరించుటకు పూను కొనెను. పరిపాలనశాఖలలోని ఉద్యోగములందు దేశీయులను

నియమించుటకు నిశ్చయించెను. దేశప్రజల ఆచార వ్యవహార ములను, శాస్త్రధర్మములను క్రోడీకరింపజేసెను.

## తొమ్మిదవ ప్రకరణము

## ఇంగ్లీషు చదువులు

బ్రిటిషు ప్రభుత్వము స్థాపించబడునాటికి ప్రతి రాష్ట్రములోను ప్రజలు కొంచెముగనో గొప్పగనో విద్యనేర్చి యుండిరి. గ్రామపంచాయితీలు, గ్రామపాఠశాలలు మంచి స్థితిలో నుండెనుగాని ఒక్కొక రాష్ట్ర మాంగ్లేయుల వశమగు చుండగా నచ్చటి గ్రామపంచాయితీలు పాఠశాలలు దుస్థితిలో పడి నాశనమైపోవుచుండెను. కంపెనీవారు ప్రాతసంస్థల నుద్ధ రింపక ఆంగ్ల పాఠశాలలను స్థాపింపక ఉపేక్షించుచుండిరి. అందువలన ప్రజలు అజ్ఞానాంధకారమున మునుగసాగిరి. ఆంగ్లేయ కంపెనీ కవిలెలందలి సంగతుల వలననే కంపెనీకి పూర్వమునాటి విద్యాభివృద్ధి చక్కగ నుండెనని తెలియు చున్నది. 1822-26 మధ్య మదాసు రాజధానిలో జరిగిన విచారణవలన నానాటికి పాఠశాలకు బోవు బాలురసంఖ్యలో దరిదాపు ఆరవవంతు మంది ఏదోవిధమగు విద్యనేర్చియుండిరని తెలిసినది. ఇట్లే బొంబాయిలో 1823-28 మధ్యజరిగిన విచా రణవలన ఎనిమిదిమందిబాలురలో నొకడు విద్యనేర్చినట్లు తెలిసి నది. వంగరాష్ట్రమున పురుషులలో నైదవవంతు చదువగల వారని నిర్ణయింపబడినది. 1835 నాటికి వంగరాష్ట్రమున ఒక లక్ష గ్రామపాఠశాల లుండెను. మన్రోగారి కాలము నాటికి

మద్రాసులో 12498 గ్రామపాఠశాలలుండెను. 188650 విద్యార్థులుండిరి. ఇదియంతయు అడుగంటినది. ఇట్టిస్థితిలో ఎల్ఫిన్ స్టను విద్యాభివృద్ధి సంఘమును స్థాపించ దలచి 1820 లో నొక మహాసభకు అధ్యక్షతవహించెను. ఆ సభకు 5000 పౌనుల విరాళమిచ్చి పుస్తకములు అచ్చుచేయుటకును బహుమతు లిచ్చుటకును దేశభాషలో విద్య నేర్పుటకును మార్గములను అవకాశమును కలిగించినాడు. పదునా రేండ్లు చక్కగా పని జరిగినది. ప్రాథమికవిద్యనుగూర్చిన విచారణ జరుగగా 1832 లో 1705 పాఠశాలలను 35143 విద్యార్థులును బొంబాయి రాజధానియందున్నట్లు తేలినది. నాటికి బొంబాయి రాజధాని జనసంఖ్య 50 లక్షలు. నాటి మదరాసు రాజధానిలో రెండు కోట్ల యిరువదిలక్షల జనసంఖ్యకు నొక్కటే ఇంగ్లీషుపాఠశాల! బొంబాయిలో నిట్లు ఎల్ఫిన్ స్టన్ గారి కృషివలన ఆంగ్లవిద్య అత్యంతాభివృద్ధిగాంచినది. ఎల్ఫిన్ స్టన్ గారు ఉన్నత విద్యను అభివృద్ధి చేయదలచెను గాని కంపెనీ డైరెక్టరు లంగీకరింప లేదు. బొంబాయిలో నొక కాలేజీని స్థాపించి ప్రత్యేకముగ భారతీయోద్యోగులను పరిపాలనా పద్ధతులందు తరిఫీదు చేయ దలచెను గాని వారంగీకరింపరైరి. విద్యాభివృద్ధి కొరకు అత డీక్రింది సూచనలను చేసెను.

"నేటీవు" పాఠశాలల సంఖ్యను హెచ్చించి వారికి పుస్తకములను సరఫరాచేయుట, నిమ్నజాతులను ప్రోత్సహించుట, శాస్త్రవిజ్ఞానమును బోధించు సంస్థల నేర్పరచుట, దేశభాషలలో వైజ్ఞానిక నైతిక శాస్త్రగ్రంథములను రచి

యింపించుట, ఇంగ్లీషు బోధించు క్రొత్త పాఠశాలలను నిర్మించుట, ప్రజలనితర విధములుగ ప్రోత్సహించుట అవసరమనియు ఈకార్యములకగు వ్యయములన్నియు గ్రామవాసులే భరింపగలరనియు దొరతనమువారు సొమ్ము ఖర్చుపెట్ట నక్కరలేదనియు కూడచెప్పిచూచెను. కాని ఈతడుపదవి మానుకొనువరకును ఈ ప్రణాళికకు అనుజ్ఞ రాలేదు. బొంబాయిలో ప్రథమ ఇంగ్లీషు పాఠశాల 1828 లో స్థాపింపబడెను. పూనా సంస్కృతకాలేజికి ఒక ఇంగ్లీషుశాఖ చేర్చబడెను. బొంబాయిలోని ఎల్‌ఫిన్‌స్టన్ కాలేజి 1834లో గాని స్థాపింపబడలేదు. కలకత్తాలో రామమోహనరాయి, డేవిడ్ హేర్ మున్నగువారి కృషివలన 1817లో హిందూ కాలేజీ స్థాపింపబడెను. ఆంగ్లవిద్య నేర్పవలెనా సంస్కృతవిద్య నేర్పవలెనా యనువివాద మొకటిరాగా మెకాలే సలహాతో బెంటింకు ప్రభువు ఆంగ్ల విద్యాపద్ధతినే స్థాపించెను. ఎల్‌ఫిన్‌స్టన్ బెంటింకు లెంతసద్బుద్ధితో నాంగ్లవిద్యాభి వృద్ధి కొఱకు ప్రయత్నించినను ఆంగ్లవిద్యావిధానమును నెలకొల్పుటలో బ్రిటిషు రాజ్యతంత్రజ్ఞుల యొక్కనిజోద్దేశము భారతీయులకు విజ్ఞాన వికాసములు కలిగింపవలెనని కాదు; కేవలము బ్రిటిషు పరిపాలనకు అనుకూలములగు పరిస్థితులు కలిగించుట, బ్రిటిషువారిను నాగరకత వారి పద్ధతులను భారతీయు లర్థము చేసికొని వారి పట్ల గౌరవభావము స్నేహభావము కలిగించుటకేయని కంపెనీ ప్రభుత్వమున అనేక గొప్పయుద్యోగములు చేసి మద్రాసు గవర్నరైన సర్ చార్లెస్ ట్రెవెలియన్‌గారు తనపుస్తకములో స్పష్టముగా చెప్పియున్నారు. పూర్వము

రోమునగర సామ్రాజ్యములో నా సామ్రాజ్యాధీశులు జయించిన వివిధజాతులనెట్లు వైజ్ఞానిక పారతంత్ర్యమున ముంచినారో ఆ ప్రకారమే నేడు భారతీయులను గూడ తమదేశ వేషభాషల పైన అభిమానమును కలిగించి ఆంగ్లనాగరికతా వ్యామోహమున ముంచుటయే ప్రధానకర్తవ్యమునియు బయల్పరచినారు ఇట్లే వంగరాష్ట్రమున ఆంగ్లవిద్యాభివృద్ధి ప్రయత్నము జేసిన వారిలో నొకడగు రెవరెండు అలెగ్జాండర్ డఫ్‌గారును జెప్పియున్నారు. భారత దేశమునకు లా మెంబరుగాను లాకమీషనరుగాను వచ్చిన లార్డు మెకాలే ఈ విద్యావిధానముయొక్క పరమోద్దేశమును 1836 లో నిర్భయముగా నిట్లు చెప్పినాడు. "మన విద్యావిధాన మమలుజరిగినచో వంగరాష్ట్రమున ముప్పదేండ్లలో నొక్క విగ్రహారాధకుడైనను మిగులడని నా విశ్వాసము." ఈమహానుభావు డింతటితో నూరకొనలేదు. 1853 లో నిట్లు చెప్పినాడు. "ఇప్పుడు మనము ముఖ్యముగా చేయవలసిన కర్తవ్యము—మనము పరిపాలించు లక్షోపలక్షలజనములకును మనకును మధ్య నొకరిభాష నింకొకరికి తెలుపు ద్విభాషీలై, రక్తములోను రంగులోను భారతీయులై, జన్మమునమాత్రమే భారతీయులుగానున్నను రుచులలోను అభిప్రాయములందును నీతియందును విజ్ఞానమందును కేవలము ఆంగ్లేయులుగనే యుండు నొక తరగతివారిని సృజియించుటకు మన యావచ్ఛక్తిని వినియోగింపవలెను." ఇట్టి దురుద్దేశముతో ప్రారంభింపబడిన విద్యావిధాన విషవృక్షము ఫలించి దేశద్రోహులను తయారుజేయుటలో నాశ్చర్య మేమున్నది?

కేవలము చౌకబారు నౌకరులను తయారు జేసి దేశ దాస్యమును చిరస్థాయిచేయుటకే ఈ యాంగ్లేయచదువులు ప్రారంభింప బడినవి. నాడు సంస్కృతవిద్యావిధానాభిమాని యగు హెచ్. హెచ్. మన్నుగారు మున్నగువారీ యన్యాయమును జూచి వగచినను లాభములేకపోయినది. "నేటివు" భారతీయు లందు విద్యావ్యాప్తిజేయుటకుగల ముఖ్యకారణములలో నొకటి, ప్రభుత్వోద్యోగములందు వారిని నియమించు అవసరము కలుగుటయని బొంబాయి గవర్నరుగనుండిన సర్ జాన్ మాల్కలంగారు 1828లో స్పష్టముగా జెప్పియున్నారు. 'దీని వలన ఖర్చుతగ్గును. కొంత దేశాభివృద్ధికలుగును. బ్రిటిషు పరిపాలన గట్టిపడు'ననియు చెప్పినాడు. 1854లో కంపెనీ పరిపాలకులు విద్యావిధానమునుగూర్చి జారీచేసిన 'ఎడ్యుకేషనల్ డెస్పాచి' అనబడు తాఖీదులోగూడ ఈ విద్యాభివృద్ధి, ప్రభుత్వము వారి నౌకరీలోనుండు ఉద్యోగుల శక్తిసామర్థ్యములను తెలివి తేటలను హెచ్చించుననని వ్రాసియుండిరి. మాల్కలంగారు వ్రాసిన మినిట్సులో నేటివులలో విద్యనేర్చినవారు తక్కువగ నున్నందున హెచ్చుజీతములు ఇవ్వవలసి వచ్చుచున్నదనియు విద్యాభివృద్ధి చేసినచో ఉద్యోగముల కొఱకు పోటీపడువారి సంఖ్య హెచ్చుననియు అందువలన జీతములుతగ్గించ వచ్చుననియు సెలవిచ్చిరి! ఇట్లు విశ్వాసపాత్రులగు చౌకబారు నేటివు నౌకరులను సృజించుటయే ఈ విద్యావిధానము స్థాపించినవారి యొక్క ప్రధానోద్దేశముగ నుండెను.

( Rise of Christian Power in India—Basu. )

## పదియవ ప్రకరణము

## కంపెనీ పరిపాలన యొక్క ఫలితములు

భారతదేశ రాజకీయములను సంస్కరించు నుద్దేశముతో "ఇండియా రిఫారం సొసైటీ" అనబడు సంఘమొకటి ఇంగ్లాండులో 12-3-1853 తేదీన స్థాపింపబడెను. ఆ సంఘమువారీ దేశ పరిస్థితులనెల్ల చక్కగా విచారించి తెలుసుకొని ఆంగ్లప్రజలకు తెలియపరచుట కప్పుడప్పుడు కొన్ని కరపత్రములు ప్రకటింపసాగిరి. అట్టి కరపత్రములలో మొదటిది 1834 సంవత్సరము నుండి 1853 వరకు జరిగిన భారతదేశ పరిపాలనను గూర్చినది. 1853 లో మరల తూర్పుఇండియా కంపెనీవారికి పట్టానివ్వవలసి వచ్చు తరుణము వచ్చెను. దానిలో నంతవరకు నీ కంపెనీ పరిపాలన మెట్లుజరిగెనను సంగతిపై గూర్చి వారు చక్కగా వివరించిరి.

"దేశశాంతి:— 1833 వ సంవత్సరములో కంపెనీ వారి కివ్వబడిన పట్టాననుసరించి స్థాపింపబడిన ప్రభుత్వమున గతించిన 19 సంవత్సరములలో 15 సంవత్సరములు యుద్ధములోనే గతించినవి. ఈ యుద్ధములు భారతదేశ రక్షణకొరకవసరమైనవికావు సరికదా వీనివలన నాదేశప్రజల శాంతికిని సౌఖ్యమునకునుభంగముకలిగెను. భారతదేశప్రభుత్వముయొక్క ఆదాయముల నివి వృధాగా వ్యయపరచెనుగాని ఈయుద్ధములు 1833 లో స్థాపింపబడిన విధానముయొక్క సహజ పరిణామములే. ఇట్టి యుద్ధములందు నిమగ్నమైన ప్రభుత్వము ప్రజా

క్షేమమున కెట్లు తోడ్పడగలదు? ఈ కాలములో భారత దేశ ప్రభుత్వాదాయము ఎట్లుండెనో పరిశీలింతము.

ఇంగ్లాండుయొక్క ప్రభుత్వాదాయములో లోటుకని పించినచో నది యొక ఘోరమైన తప్పిదముగా పరిగణింతురు. భారత దేశముపై పునకు తిరిగిచూడుడు. ఈ గడచిన పదునాలు గేండ్లలో ప్రతియేటను ఆదాయములో లోటుకనపడుచున్నది. ఈ భారత దేశ పరిపాలనావిధానము 1833లో స్థాపింపబడి నప్పుడు ఆ దేశాదాయము భరింపవలసిన సైనికవ్యయము 80 లక్షల పౌనులు లేక 8 కోట్ల రూపాయలుగనుండెను. అనగా నికరాదాయములో నూటికి 49 వంతులు. ఇరువది సంవత్సర ముల "అభివృద్ధియు దేశసౌభాగ్యమును" జరిగినపిదప నిప్పుడు కూడా 120 లక్షల పౌనులు సైనికవ్యయముగానుండి నికరాదా యములో నూటికి 56 వంతులపిది మిగ్రింగుచున్నది. 1833 లో స్థాపింపబడిన కంపెనీ పరిపాలనయొక్క ఫలితమిది! ఇట్టితరి 1853 లో మరల నీ కంపెనీకి పట్టాయొసగుట న్యాయమేనా?

ప్రజల కుపయోగించు రోడ్లు కాలువలు మున్నగు ప్రజోపయుక్త నిర్మాణములు సత్ప్రభుత్వముయొక్క ముఖ్య లక్షణములు. సాలుకు 210 లక్షల పౌనులకు పైబడిన ఆదాయ ముగల భారత దేశ ప్రభుత్వము, పైనచెప్పినట్టి ప్రజోపయోగ కరములగు పబ్లికువర్క్సు కార్యములకొఱకు 5 లక్షలపౌనులు అనగా నూటికి 2½ వంతులుమాత్రము ఖర్చుచేయుచున్నది! ఐరోపాఖండమంత పెద్ద దేశమున కీ స్వల్పపు మొత్తమేమూలకు సరిపోవును? ప్రజోపయోగకర నిర్మాణములకు ఖర్చుపెట్టినట్లు

లెక్కలలో చూపబడిన మొత్తములో కొంత కేవలము సైన్యమున కుపయోగించు బ్యారక్సు (బారకీచుల) నిర్మాణమునకు వ్యయము చేయబడినవి. మరియు మొత్తము ఖర్చులో నూటికి 70 వంతులు కేవలము పైతనిఖీక్రిందనే ఖర్చుచేయబడుచున్నది. ఇక ప్రజోపయుక్తములకొరకు చేయబడిన వ్యయమను నది యెంత బూటకముగనున్నదో యూహింపుడు.

దేశములో యుద్ధములు, ప్రభుత్వాదాయములో లోటులు, రోడ్లు బ్రిడ్జీలు హార్బర్లు పబ్లికు వర్క్సు లేకపోవుట, యటుండనిచ్చి ప్రజ లీ యిరువదేండ్లలో నావంతయైన అభివృద్ధిగాంచినచో కంపెనీపరిపాలన ధన్యమైనదని చెప్పవచ్చును. గాని యిది శూన్యము. వంగరాష్ట్రమున జమీందారీ పద్ధతిలోని రైతులు కృంగిపోవుచుండగా మద్రాసులో రైత్వారీ పద్ధతిలోను, బొంబాయిలో "కంపోజిట్" పద్ధతిలోను కూడా రైతు దుస్థితిలోనే యున్నాడు. బంగాళములో నాల్గుకోట్ల ప్రజలు, మద్రాసులో రెండుకోట్లఇరువదిలక్షల ప్రజలు, బొంబాయిలో కోటిమంది ప్రజలు ఈప్రభుత్వమునపొందు సౌఖ్యము గానరాదు. వ్యవసాయము, పాడిపంటలు, క్షీణించుటయేగాక జనుల యొక్క పూర్వసంపద మటుమాయమైనది. నేటివు సంపన్న గృహస్థులు నేడు గానరారు. ప్రస్తుతపు పరిస్థితులే యింకను అములుజరిగినచో నింకొకటి రెండు తరములలో రైతులు సామాన్య ప్రజలుగానుండు స్థితికూడపోయి కేవలము దరిద్రులగు దేశదిమ్మరులై పోవుదురు. 1833 వ సం॥ చట్టము స్థాపించిన న్యాయవిచారణ విధానము పనికిమాలినది. ధర్మ

శాస్త్రసంస్కరణమను పేరున చాలసొమ్మును వెచ్చించిరి. కోర్టు విచారణలు బాహ్యాడంబరములు ఆచార వ్యవహార విధులు లెక్కకు మీరెనన్ని నెలకొల్పబడినవి. న్యాయము పొందగోరి వచ్చిన బాధితులు న్యాయవాదులకేగాక ప్రభుత్వమునకు గూడ చాల సొమ్మునిచ్చుకోవలసి వచ్చుచున్నది. ఇవ్వలేని వారికి కోర్టుద్వారములు తెరువబడవు. ఇచ్చినవారికిగూడా న్యాయము ధర్మము దొరుకుననుమాట కల్ల. బ్రిటిషుజాతి యొక్క గౌరవమునకుగూడ అవమానము దెచ్చున్యాయాధిపతు లాకోర్టులందు పరివేష్టించు చుండిరి. కంపెనీవారికోర్టులలో అమలు జరపబడిన 'క్రిమినలు లా' గవర్నమెంటు వారివలననే నిరసింపబడియున్నది. ఆధర్మము ఇంగ్లాండులోని క్రైస్తవ జనుల కెంతతగినదో భారతీయుల కంతతగినదని చెప్పవచ్చును.

నేరవిచారణ క్రిమినలు ధర్మము సరియైనది లేకపోయి నను ఒక విచిత్రపోలీసుశాఖమాత్రము కలదు. అయితేఇది ఎట్టి సంస్థ?కలకత్తాలోను దక్షిణ వంగరాష్ట్రములోనుగల 1252 మంది ప్రజలు కామన్సుసభకు పంపిన మహాజరునుబట్టిచూడగా నీ పోలీసువారు నేరములు జరుగకుండ నివారింప నశక్తులును, నేరగాండ్రను పట్టుకొనుటకును, ప్రజలను వారి ఆస్తిని సంర క్షించుటకును అసమర్థులును అగుటయేగాక నీతిధర్మములు లేక ప్రజాపీడన చేయువారుగా నున్నట్లు తేలుచున్నది. ఇక 1833 సంవత్సరపు ప్రభుత్వవిధానమువలన భారతదేశ ప్రజలలో విద్యాభివృద్ధియైన కలిగినదాయని పరిశీలించినచో నదియు లేదని తేలినది. నేటివుల విద్యకొఱకు చేయబడు ఖర్చు అతి

స్వల్పము. పార్లమెంటుకు నివేదించుటకుకూడ తగనంత హీనముగ నున్నందున లెక్కలలో నిది కనబరుపబడుటయే లేదు. ఒక్క సంగతిమాత్రము స్పష్టము. హిందూరాజ్య కాలమున ప్రతి గ్రామములోను నొక పాఠశాల యుండగా భారతదేశ గ్రామసంఘములను ప్రజాసంస్థలను మనము నాశనము జేయుటవలన నీపాఠశాలలును పోయినవి. వానికిబదులు మన మెట్టి విద్యావిధానమును స్థాపింపలేదు. మద్రాసులో 2 కోట్ల 20 లక్షల ప్రజలలో సాలుకు 160 మందికిమాత్రమే ఆంగ్లేయ ప్రభుత్వము విద్యాదానము చేయుచున్నది. వంగరాష్ట్రములోని ధైర్యశాలురు కొందరు ఇంగ్లాండుకువచ్చి చదువుకొని వెళ్ళగా వారి నాంగ్లేయులతో సమానముగానుద్యోగములిచ్చి ఆదరింప రైరి. ఇంగ్లాండు కట్లు వచ్చి 5 సంవత్సరములు చదివి సువర్ణ పతకము బహుమానమంది ఎం. డి. పట్టమునందిన చక్రవర్తియను భారతీయవైద్యునికికంపెనీ డైరెక్టర్లు సైనిక వైద్య శాఖలో నుద్యోగ మీయరైరి. భారతీయులకు పెద్ద యుద్యోగము లీయకపోవుట యనునది చాల అన్యాయమైన రూపము దాల్చినది.

ఆంగ్లేయ ప్రభుత్వము యొక్క ప్రారంభ దినములలో భారతీయులకు సైన్యమునగూడ ఉద్యోగములివ్వబడుచుండెను. వారు సమర్థతతో పనిచేయుచుండిరి. అనేకచోట్ల నేటివు ఏజెంట్లు,ప్రతినిధులు నుండిరి. అప్పుడు నేటివుల నుపయోగింప వలసిన అవసరముండెను. జీతములుగూడా మితముగానుండెను క్రమక్రమముగా భారతీయులను త్రోసిరాజనిరి. గొప్ప

జీతముగల ప్రతియుద్యోగమునుండి భారతీయులను తీసివేసి ఆంగ్లేయులను హెచ్చుజీతములతో నియమింపసాగిరి. తరువాత నిది ప్రభుత్వములో నొక ముఖ్యవిధానముగా అమలు జరుగుచున్నది. ఈ యన్యాయము మాన్పుటకు జాతి, మత, వంశ, నివాసము లుద్యోగమున కనర్హత కలిగింపరాదను సూత్రమును 1833 వ సంవత్సరపు చట్టము శాసించినది. కాని దీనివలన భారతీయులకు న్యాయముకలుగలేదు సరికదా మొదట నేటివుల కొరకేర్పడిన యుద్యోగములందుకూడా ఆంగ్లేయులే నియమింపబడుటకే నియమము నాధారముజేసికొనిరి. ఇంగ్లాండులోనే నియమింపబడు కవనెంటెడ్ సర్వీస్ యుద్యోగులకును భారత దేశమున నియమింపబడు అన్‌కవనెంటెడ్ సర్వీస్ యుద్యోగులకును గల ఘోర తారతమ్యము నెప్పటివలెనేయుంచిరి. నేటివు లెంత తెలివికలవారైనను విద్యావంతులైనను తెల్లవారితో సమానగౌరవమును పొందలేకుండాజేసిరి. 15 కోట్ల భారతీయ ప్రజలలో మూడు నాల్గువేలమందికి కొన్ని చిన్నయుద్యోగము లివ్వబడినను ఆ యుద్యోగములకు సగటున సాలుకు 300 రూపాయిలకన్న హెచ్చుజీతములులేవు. ప్రభుత్వములో భారతీయుల కెట్టి పలుకుబడియులేదు. ఆఫ్రికా నీగ్రోలనుగూడా సలహాసంఘములోని కాహ్వానించి పరిపాలించుచున్నామని ప్రగల్భములు పలికిన ఆంగ్లరాజ్య నీతిజ్ఞులు, ఆంగ్లేయు లనాగరకులై అడవులలో చరియించునప్పటికే సకలకళలం దారితేరిన భారతీయులకు వారిదేశ పరిపాలనలో నట్టి ప్రవేశమును కలిగించుటలేదు.

ఇట్టిస్థితిలో భారతీయులు తృప్తి జెందియున్నారా ? నిజముగా వారీదుస్థితి నంగీకరించి యూరకొనలేదు. వారు తమ అసమ్మతి తెలిపి తిరుగబడక పోవుటకు కారణమేమనగా వారి నణచియుంచిన యీ బ్రిటిషు ప్రభుత్వ మతిబలవంతమైనది. ప్రజాభిప్రాయము లేవకుండ అణచివేయగల బందోబస్తులుగలట్టిదిగనున్నది. ఇప్పుడు మరల నీకంపెనీ పరిపాలనకు పట్టానిచ్చు తరుణమువచ్చినది. గనుక భారతీయులు మొరబెట్టుకొనుచు పార్లమెంటుకు మహాజరు లంపినారు. 1833 వ సంవత్సరపు ప్రభుత్వపద్ధతిని భారతీయులు హర్షించి రనుట విపరీతము. ఈ విధానము వలన తమ ప్రజాసంఘమే పెల్లగింపబడి పాడైపోయినదని మదార్సు ప్రజలు మొఱబెట్టుకొనుచున్నారు. రుచిలేని గంజిమెతుకుల కవసరమైన ఉప్పుకల్లు, మానవులకు పశువులకుగూడ అవసరమైన వస్తువు, ప్రభుత్వము వారి యిజారాగా చేయబడుట యన్యాయమని మొరబెట్టుచున్నారు. పట్టణములలో బజారులలోని అంగడులపైననేగాక బాటల ప్రక్కల పందిళ్లలోను పంచలలోను పెట్టుకొనిన చిన్నదుకాణములపైన తాము జీవనముకొరకుపయోగించు ప్రతిపనిముట్టుపైనను తుదకు చూరకత్తులపైనను గూడా దానిఖరీదుకన్న అరురెట్లు మొత్తము మోతర్ఫా పన్నువిధింపబడుచుండుటను గూర్చి ఘోషించుచున్నారు*.

---

*ఇది గాజుల లక్ష్మీనర్సుసెట్టిగారు, జాన్ బ్రూస్ నార్టన్ గారు చెన్నపట్టణ స్వదేశసంఘము ద్వారా చేసిన అందోళనను గూర్చిన ఉల్లేఖనము.

హిందూమహమ్మదీయ మతములు త్రాగుడును నిషేధించుచుండగా ప్రభుత్వమువారు కల్లు సారాయములపైన లాభములు దీయుకొరకు ప్రజలను త్రాగునట్లు నిర్బంధించుచున్నారనియు చెప్పుకొనుచున్నారు. అందువలన ప్రజాభిప్రాయమును దృష్టాంతరముగా గైకొనినను 1833 వ సంవత్సరపు ప్రభుత్వవిధానము అసంతృప్తి కరముగనే యున్నదనక తప్పదు.

భారత దేశమున కొక రాజ్యాంగమును ప్రసాదించుటకు బదులుగా 1833 సంవత్సరపుకంపెనీ పట్టాచట్టమును పార్లమెంటు వారు శాసించియుండిరి. భారత దేశపరిపాలనమును భారతీయుల వశముచేయుటకు వీలులేదు గనుక భారత దేశ ఆదాయవ్యయములలో నేలోపమైన గలిగినచో నది మనగృహకల్లోలముగను మనకు నష్టముగను భావించుకొను ఆంగ్లేయ ప్రజాసమూహములే ఆ దేశమును కనిపెట్టి రక్షింపగల నియోజకవర్గముగా నుండునని ఆనాటి పార్లమెంటులో మెకాలే మున్నగువారు పలికియుండిరి. ఆంగ్లేయ ప్రజా ప్రతినిధులీ యిరువది యేండ్లలోను ఇట్టి బాధ్యతను గలిగి ప్రవర్తించినారా? భారత దేశ క్షేమలాభములు కనిపెట్టియుండి రక్షింపప్రయత్నించినారా? లేదు. భారత దేశ ఆదాయవ్యయములందు ఈ 15 సంవత్సరములలోను కల్లోలములు కలిగెను గాని ఆచిక్కులను మన ఆంగ్లేయ కంపెనీ డైరక్టర్లు తమ క్షేమమునకు సంబంధించిన వ్యవహారముగా ఎంచుకొని యుండలేదు. భారత దేశ ఆదాయములో లోటులు కలుగుచున్నను ఆంగ్లేయ

వర్తక కంపెనీ డైరెక్టరులకు తమ పెట్టుబళ్ళపైన నూటికి 10½ వంతుల లాభము పంచిపెట్టబడుచునే యుండెను. అందువలన 1833 సంవత్సరములో చెప్పబడినట్లు భారతదేశ సత్ప్రభుత్వమునకు ఆంగ్ల పార్లమెంటువారి హామీ యుండునను మాటలు వృథయైనవి.

ఇక నీసంగతులనుగూర్చి హెచ్చు వివరములు చెప్ప వలసిన అగత్యములేదు. ఏమాత్రము న్యాయబుద్ధిగాని ధర్మ చింతగాని దేశభక్తిగాని గలవారికైనను ఈకంపెనీవారికి భారత దేశపరిపాలనాధికారపు పట్టాను మరల నిచ్చుట న్యాయము కాదని తోచుటకు వలసిన సంగతులు చెప్పబడియే యున్నవి. దీనివలన నికముందు భారత దేశ పరిపాలనకు తగిన ప్రత్యేక ఏర్పాటులు చేయుట యవసరమని నిష్పక్షపాతబుద్ధి కలవారి కెల్లరకు తోచితీరును. (Rise of Christian Power–Basu)

## పదునాల్గవ ప్రకరణము

## దేశోద్ధరణ ప్రయత్నములు

### I

భారతదేశమును పరిపాలించు బ్రిటిష్ ఉద్యోగవర్గము యొక్క యజమానులీదేశమునకు పదివేలమైళ్ళ దూరమున నింగ్లాండులోనున్న పార్లిమెంటువారును కంపెనీవారునై యుండినందున నీ దేశపరిపాలనమున ప్రజలకుగల కష్టములు చెప్పుకొనుటకును, ఆలనపాలన జరుగుటకును, తగుఅవకాశములేకుండెను. భారతదేశముపట్ల సానుభూతిగలిగిన ఆంగ్లేయు

ప్రముఖులెవ్వరైన దయగలిగి ఇంగ్లీషు పార్లిమెంటులో నేదైన చెప్పినకద్దు లేకపోయినలేదు. అట్లు చెప్పినప్పుడైనను పార్లిమెంటు సభ్యులు ఓపికతో వినెద రను నాస లేదు. ఇండియా వ్యవహారముల చర్చించుసమయమే చాలమందికి భోజనసమయము నొకసామెతవలన నీ దేశముపట్ల వారి కెంతశ్రద్ధయుండెనో తెలియుగలదు. వారన్ హేస్టింగ్సు కాలమునాటి దుష్పరిపాలనమునుగూర్చి బర్కుమహాశయుడును అతని స్నేహితులును విమర్శించిన కాలమునుండి 1847 వరకును మరల నీ దేశ వ్యవహారములనుగూర్చి పార్లిమెంటులో తలపెట్టినవారే లేరు.

1847 లో జాన్ బ్రైట్ అను నొక మహానుభావుడు పార్లమెంటు మెంబరయ్యెను. ఇతడు భారత దేశచరిత్రను వ్యవహారములనుగూర్చి జాగ్రత్తగా చదివి, హృదయము కరిగి ఈ దేశమున జరుగుచుండిన దుష్పరిపాలనమునుగూర్చి పార్లమెంటులో వెల్లడింపసాగెను. ఈ దేశమున బ్రిటిష్‌ప్రభుత్వమున ప్రజ లెన్నో బాధలు పడుచుండుట, న్యాయవిచారణ బాగుగ జరుగకుండుట, పోలీసులు ప్రజాపీడకులగుట, పన్ను లత్యధికముగానుండి రైతు లిచ్చుకోలేకుండుట, వానిని వసూలుచేయుటలో అధికారులు రైతుల నెన్నోవిధములుగా హింసించుచుండుట, ప్రజల కెట్టి సౌకర్యములును లేకుండుటనుగూర్చి యితడు పార్లమెంటులో తీవ్రముగా విమర్శింప సాగెను. క్రైస్తవమతాచార్యులు చేయుచుండిన అన్యాయముల నాయన పార్లమెంటువారికి విశదపరుపసాగిరి. స్లాగ్ గారు బాక్సుటరుగారు అను పార్లమెంటు సభ్యులును, సర్ విలియం

హాంటరు, ఆర్. టి. రీడ్ మున్నగువారును నిష్పక్షపాతముగానే మాటలాడుచుండిరి. డల్‌హౌసీప్రభువుగూడ నిష్పక్షపాతిగనే యుండెను. 1868 లో సభ్యుడుగా నుండిన ఫాసెట్‌గారు గూడా భారతదేశమం దభిమానముగల్గి పనిచేసిరి. 1853 లో మద్రాసుకు వచ్చి రైతుల దురవస్థలు స్వయముగా చూచి వారిని పెట్టుచున్న హింసలు పార్లమెంటుకు చెప్పిన 'డాంబే సేమరు'ను, 1890లో నీ దేశమునకు హోమురూలు నివ్వవలసిన దను బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఛార్లెస్ బ్రాడ్‌లా' గారును, తరువాత నీ దేశ కష్టసుఖములను విచారించి వీనిని గూర్చి ఎంతో పనిజేసిన టారెన్సు, కేర్‌హార్డీ మున్నగునాంగ్లేయ ప్రముఖులును, ఈ దేశము తరపున చాల పనిజేసిరి.

ఇక ఇంగ్లాండునుండి భారతదేశమున కుద్యోగము చేయవచ్చిన ఆంగ్లేయులలోను ఈ దేశమునం దితరవృత్తులు చేసి పోవు ఆంగ్లేయులలోను ఈ దేశప్రజల బాధలను జూచి హృదయములు కరగి ఈ ప్రజల బాధల మాన్పుటకును, వీరికి విద్యాభివృద్ధిచేసి ఉద్ధరించుటకును వీరిలో, జాతీయ చైతన్యము కలిగించుటకును తోడ్పడిన పరోపకార పారీణులగు నాంగ్లేయు లనేకులుండిరి. వారిలో సర్ థామస్ మన్రో, వాకర్, ఎల్ఫిన్‌స్టన్ మున్నగు ఉద్యోగులును డేవిడ్ హేర్, జాన్ బ్రూస్ నార్టన్ మున్నగు ఉద్యోగేతరులును మన దేశోద్ధరణకు తోడ్పడిన మహానుభావులు. తరువాత భారతజాతీయ కాంగ్రెసు మహాసభ నుస్థాపించుటకు మూలపురుషుడైన ఎ. ఓ. హ్యూముదొరగారు కూడ మన దేశమున పనిచేయవచ్చిన ఐ.సి.ఎస్. ఉద్యోగియే. ఇట్లే సర్

హెన్రీకాటనుగారు నొక ఐ.సి.ఎస్. ఉద్యోగి. ఇట్టి పరోపకార పారీణులగు మహనీయులెందరో మన దేశోద్ధరణకొరకు పాటు పడిరి. భారత దేశమునకు పరోపకారము చేసిన రాజప్రతినిధు లలో రిప్పనుపేరు సువర్ణాక్షరములతో లిఖింపదగినది. డఫ్రిన్ ప్రభువుకూడ కాంగ్రెసు స్థాపనకాలమున చాల పాటుపడెను. వెడ్డర్ బర్న్, యూలు గార్ల పేర్లు మన జాతీయ చరిత్రయందు శాశ్వతముగా స్మరింపదగినవి. భారత దేశ ప్రజలందు జాతీయ చైతన్యమును కలిగించుట కిట్టివారే మూలకారకులు.

## II

బ్రిటిష్ ప్రభుత్వయుగమున భారత దేశోద్ధరణప్రయ త్నము రాజారామ మోహనరాయలుగారితో ప్రారంభమైన దని చెప్పవచ్చును. ఈతడు క్రీస్తుశకము 1774 లో జన్మించి సంస్కృతాంగ్లములందును, ఫారసీ వంగభాషలయందును అఖం డమైన పాండిత్యమును సంపాదించి భారత దేశ మతధర్మమును క్రైస్తవ మహమ్మదీయమతధర్మములను చక్కగా గ్రహించి బ్రహ్మసమాజస్థాపన జేసి, సహగమనమును నిర్మూలించుటకు, పసిపాపలను గంగలోపారవేయు దురాచారమును మాన్పుటకు, సంఘసంస్కారమును జేయుటకు, విజ్ఞానవికాసము కలిగించు టకు కృషిజేసి అసంఖ్యాకములగు గ్రంథములను రచియించి ఉపన్యాసముల నొనగి శ్రమపడినాడు.

ఆనాటి క్రైస్తవమతబోధకు లీయనను తమమతములో గలుపుకొనుటకు ప్రయత్నింపగా నీయన నిరాకరించి క్రైస్తవ ధర్మములను తీవ్రముగా విమర్శించెను. రాజకీయ మత

స్వాతంత్ర్యములు సంఘసంస్కారము నీయనకు పరమధర్మ ములుగ నుండెను. రామమోహనరాయలు, విద్యాధికుడును ధనవంతుడును రవీంద్రునికి పితామహుడును అగు ద్వారకనాథ టాగూరుగారితోను ఇంకను డేవిడుహేర్ దొర మున్నగువారి తోను కలసి 1817 లో కలకత్తాలో హిందూకాలేజీని స్థాపించి విద్యాభివృద్ధికి మార్గము జూపినాడు. ఆనాడు జీవచ్ఛవమువలె నున్న మొగలాయి చక్రవర్తి, ఏలుటకు రాజ్యమును అనుభ వించుటకు ఐశ్వర్యమును లేక ఆంగ్లేయులవలని బాధలు పడుచు రామమోహనరాయలుగారికి "రాజా" అను బిరుదునిచ్చి తన పక్షమున నింగ్లాండుకుపోయి పార్లిమెంటులో పని చేయవలసిన దని కోరగా రామమోహనరాయలు 1830 నవంబరు 15 వ తేదీన మొగలాయి చక్రవర్తి రాయబారిగా నింగ్లాండుకు పోయెను. అచ్చట ఆంగ్లరాణి పట్టాభిషేకమున నీయన గొప్ప గౌరవమునుకూడ పొందెను. పార్లిమెంటు కమిటివారి ఎదుట భారతదేశరాజకీయములను గూర్చియు సంఘసంస్కారమును గూర్చియు సాక్ష్యమునిచ్చి తరువాత జరిగిన కొన్ని రాజకీయ సంస్కరణములకు మూలకారకుడయ్యెను. ఇంగ్లండులోని కవీ శ్వరులు తత్వశాస్త్రజ్ఞులు విద్యాధికులు నీయన ఉపన్యాసములు విని ఈతనితో స్నేహముచేసి భారతదేశముపట్ల అభిమానము గలవారైరి. ఈ మహామహుడు 1833 సెప్టెంబరు 27 వ తేదిన ఇంగ్లాండులోనే దివంగతుడయ్యెను. ఈయన 'సంవాద కౌముది' యను పత్రికను నడుపుచుండెను. ద్వారకనాథఠాకూరుగా రీయనకు కుడిభుజమువలెనుండి పనిచేయుచుండిరి. ఠాకూరు

గారు కూడా 1841 లో ఇంగ్లాండునకు పోయి అచ్చటనే మరణించిరి.

## III

భారత దేశమున 1799 మొదలు 1884 వరకును ప్రెస్ రెగ్యులేషనులు పత్రికాప్రచురణకు నిర్బంధకరములుగ నుండెను. ఆంగ్లేయులు మాత్రము కొంతమంది కొన్ని పత్రికలు నడుపుచుండిరి. కంపెనీవారి దుష్పరిపాలననుగూర్చి అనహ్యాము కలిగి విమర్శించిన కొందరు ఆంగ్లేయ పత్రికాధిపతులు, పాపము, ఈనాటి హార్నిమన్ గారివలెనే ప్రవాసముల కంపబడు చుండిరి. మొదటి ఇంగ్లీషుపత్రిక 1780 లో కలకత్తాలో స్థాపింపబడిన "హిక్కీస్ గెజెట్." తరువాత కొందరు ఆంగ్లేయులు, వర్తకులు, క్రైస్తవమతబోధకులు కొన్ని పత్రికలు స్థాపించిరి. అటుతరువాత కొద్దిమంది భారతీయులు కూడ ఇంగ్లీషు పత్రికలు స్థాపించిరి. 1835 నాటి కట్టివి 6 పత్రికలుండెను. ఆనాటి గవర్నరుజనరలు విలియం బెంటింకుగారు వానిపట్ల కొంచెము సానుభూతి కలిగియుండెను. గాని దేశభాషలందు అంతవరకు ప్రకటింపబడిన పత్రికలు కడుస్వల్పముగ నుండెను. ఉన్నవి కేవలము మతమునకు సంఘసంస్కారమునకు సంబంధించినవే. రామమోహనరాయలవారి "సంవాద కౌముది" వానిలో ప్రధానమైనది. 1835 లో తాత్కాలిక గవర్నరుజనరలుగ నుండిన 'మెట్ కాఫ్' ప్రెస్ రెగ్యులేషనులను తీసివేయగా క్రమ క్రమముగా దేశీయపత్రికలు స్థాపింపబడసాగెను.

ఆ రోజులలో భారతజాతీయ చైతన్యమునకు తోడ్పడిన

పత్రికలను నిర్వహించిన భారతీయులలో హారిశ్చంద్ర ముఖర్జీ ప్రధానుడు. హారిశ్చంద్రముఖర్జీ 1824లో జన్మించెను. ఈతడు ఇంగ్లీషునేర్చి దేశస్థితిగతులనుగూర్చి ఆనాటి వార్తాపత్రికలకు వ్రాయసాగెను. 1853లో కలకత్తా నగరవాసులు తూర్పుఇండియాకంపెనీ డైరెక్టర్లకుపంపిన మహాజరును వ్రాసిన దితడే. 1854లో కలకత్తాలో "హిందూపేట్రియటు" స్థాపింపబడగా నీతడు దానికి విలేఖరియై తరువాత సంపాదకుడై అతి సమర్థతతో నడుపసాగెను. ఈతడు సంఘసంస్కర్తయై స్త్రీ పునర్వివాహ ములవిషయమున ఈశ్వరచంద్రవిద్యాసాగరులకు సహాయము చేయసాగెను. ఆ నాటి గవర్నరుజనరలగు డల్‌హౌసీ ప్రభువు, వంశపారంపర్యముగా నేలుచుండిన స్వదేశరాజు లనేకులను పద భ్రష్టులజేసి వారి రాజ్యములను కలుపుకొనుచుండగా చూచి హారిశ్చంద్ర ముఖర్జీ ఈ అన్యాయమునుగూర్చి పలుమారు నిర్భయముగా విమర్శించెను. తరువాత వచ్చిన సిపాయి విప్ల వము నణచుట కాంగ్లేయులుచేసిన దౌర్జన్యములను, తీసు కొనదలచిన చర్యలను, నిరసించి ఆంగ్లేయులకు, సిపాయీ లకును గల మనస్పర్థలను తొలగించుటకు నితడు పాటుపడెను. బంగాళాదేశమున దొరలు నీలిమందుల తోటలువేయించి అమితలాభములు పొందుచు రైతులను బాధించుచుండగా బాధలు దుర్భరములై రైతులు తిరుగుబాటుచేసిరి. అప్పుడు ఇంగ్లీషు యజమానులు వారిని హింసించుటయు వారిని కోర్టులో దింపి బాధించుటయు జూచి ఈయన రైతులకు భోజనముకూడ పెట్టి అర్జీలువ్రాసి ప్లీడర్లచేత సహాయముచేయించెను. నీలి

మందుతోటల యజమానులు వ్యాజ్యములలో ఓడిపోయి, ఈయనపై నకక్షవహించి నష్టముకొరకు మరలవ్యాజ్యములు వేసిరి. 1869 లో ఈయన చనిపోయిన పిదప ఇతనిఆస్తినిఅమ్మించి సొమ్ముపుచ్చుకొనిరి. ఈ మహానుభావు డిట్లు తన సర్వస్వమును దేశమున కర్పించి ధన్యుడైనాడు.

ఆనాడు భారతదేశోద్ధరణకు పాటుపడిన వారిలో డాక్టర్ రాజేంద్రలాల్ మిత్రా గారింకొకరు. ఈయన 1824 లో జన్మించి విద్యాభ్యాసముజేసి గ్రీకు ల్యాటిను జర్మను మొదలగు పాశ్చాత్యభాషలందు మహాపండితుడై చరిత్ర పరిశోధనలుచేసి గొప్ప గ్రంథరచననుచేసెను. ఈయనకూడ నీలిమందుతోటల యజమానులకు వ్యతిరేకముగా రైతుల పక్షమున పనిచేసెను.

## IV

ఇట్లు వంగరాష్ట్రమున నానాడు గొప్పవిద్యావంతులు సంస్కర్తలు బయలుదేరి దేశోద్ధరణకొరకు పాటుపడసాగిరి. ఆనాటి కంపెనీ పరిపాలనలో దొరల దుండగములను అరికట్టి దేశప్రజల హక్కులను సంరక్షించుటకొక ప్రజాసంఘముండుట యవసరమని తోచెను. అంతట దేశభక్తులగు మహానుభావులందరు కలసి, 1851 లో 'బ్రిటిష్‌యిండియన్ అసోసియేషన్' అను సంఘమును స్థాపించి దేశముయొక్క రాజకీయ ఆర్థిక సాంఘికాభివృద్ధికొరకు పాటుపడసాగిరి. దీనిని స్థాపించినవారిలో హారిశ్చంద్రముఖర్జీ, రాజేంద్రలాల్ మిత్ర, ప్రసన్నకుమారఠాగూరు, రామగోపాలఘోషు, దిగంబర్‌మిత్ర, ప్యారీచందు

మిత్రి మున్నగువారు సుప్రసిద్ధులు. ఈసంఘమువారు సభలు చేయించుచు ప్రజలబాధలు వర్ణించుచు నింగ్లాండుకు మహా జరులంపసాగిరి. తరువాత ఈసభకు క్రిస్టోదాస్‌పాలు సహాయ కార్యదర్శియై విశేషకృషి చేసెను.

క్రిస్టోదాస్‌పాల్ 1831లో జన్మించెను. ఇతడు ఇంగ్లీషు చదివి పత్రికావిలేఖరియై దేశసేవ చేయసాగెను. 1857లో నొక మాసపత్రికను స్థాపించెనుగాని యది కొద్దిరోజులలోనే యంత రించెను. ఇతడు హారిశ్చంద్ర ముఖర్జీగారి స్నేహమునకు పాత్రుడై హిందూపేట్రియటుకు విలేఖరియై ఆయన 1869 లో మరణింపగా తానే దాని కధిపతియై దేశముకొరకు గొప్ప పనిచేసెను. ఇతని విమర్శనలు నిర్భయముగా నుండెను. 1863 లో నితడు మునిసిపలుసంఘసభ్యుడై 1872 లో వంగ రాష్ట్రశాసనసభ్యుడై తరువాత గవర్నరుజనరలు శాసనసభకు 1883 లో సభ్యుడుగా నియమింపబడెను. ఇతడు 1884 లో మరణించెను. హిందూపేట్రియటు పత్రికలో నితడు 1866 నాటికఱవునుగూర్చి చేసిన విమర్శనలకు వంగరాష్ట్రగవర్నరు బహిరంగసభలో జవాబుచెప్పి ప్రజాభిప్రాయమును మన్నించు టను సూచించెను. 1874 లో నతని పత్రికను నాటిగవర్నరు కోప దృష్టితో చూచి కొన్నాళ్లు బహిష్కరించెను గాని తరువాత నతని ప్రతిభనుజూచి ప్రభుత్వముకూడ మెచ్చుకొనెను. ఈత నికి రావుబహదూరు, సి. ఐ. ఇ. బిరుదము లిచ్చిరి. ఈబిరుద ములు తనకు రుచింపవనియు, తనకు ముందుగనే చెప్పినచో వీనికంగీకరించి యుండననియు నితడు తనపత్రికలోనే వ్రాసెను!

క్రిస్టోదాస్ పాలుయొక్క శక్తి సామర్థ్యముల వల్లనే బ్రిటిషు ఇండియన్ అసోసియేషను దిన దిన ప్రవర్ధమాన మయ్యెను. మొదట నతడు దానికి సహాయ కార్యదర్శిగానుండి దేశోద్ధరణ ప్రయత్నములందు గొప్ప సేవజేసి హారిశ్చంద్ర ముఖర్జీగారు చనిపోయిన తరువాత 1879 లో కార్యదర్శియై దీనిని మద్రాసు స్వదేశసంఘము, బొంబాయి సంఘములతో పాటు సక్రమముగా నడిపి భారతజాతీయచైతన్యమునకు తోడ్పడునట్లు గావించిన దీ ప్రతిభాశాలియె. 1861 లో దేవేంద్రనాథ టాగూరు కేశవచంద్రసేనులు స్థాపించిన 'ఇండియన్ మిర్రరు' తరువాత స్థాపింపబడిన అమృతబజారుపత్రికలు క్రమక్రమముగా దేశమునందు ప్రజాభిప్రాయము కలిగింపసాగెను.

1851 ఆ ప్రాంతములలోనే బొంబాయిలో ఆనాటిప్రముఖులగు జగన్నాథ్ శంకరసేట్ గారును మరికొందరును కలసి ఒక ప్రజాసంఘమును స్థాపించి దేశోద్ధరణకొరకు పాటుపడసాగిరి. ఈ సేటుగారు 1863 లో బొంబాయి శాసనసభలో మెంబరయి భారతదేశ జాతీయోద్యమ పితామహుడగు దాదాభాయి నౌరోజిగారితో కలిసి దేశముకొర కెంతో పాటుపడెను. దాదాభాయి నౌరోజిగారు గొప్ప దేశభక్తుడు. ఈయన 1825 లో జన్మించి విద్యాభ్యాసమైనపిదప పారశీ పాఠశాలోపాధ్యాయుడై పారశీసంఘమందు పనిచేసి తరువాత బొంబాయి ప్రజాసంఘమునకు తోడ్పడెను. ఈయన వ్యాపారము కొరకు 1855 లో నింగ్లాండుకువెళ్ళి అక్కడనే యుండి భారతదేశమున కప్పుడప్పుడు వచ్చుచు నీ దేశోద్ధరణకొరకు

విశేషకృషి చేయుచుండెను. ఈ బొంబాయిసంఘమున జేరి దేశముకొరకు పనిచేసినప్రముఖులలో సర్ మంగళదాస్ నాతూభాయి, నౌరోజీ ఫర్దూంజీగార్లు నిర్భయముగా భారతదేశప్రజాపక్షము వహించి వంగరాష్ట్రమున క్రిస్టోదాస్ పాల్ వలెనే ప్రభుత్వచర్యలను విమర్శించుచు దేశోద్ధరణకొరకు పాటుపడుచుండిరి. వీరు బొంబాయి మునిసిపలుసంఘమునందుగూడ విశేషకృషి చేసిరి.

V

ఆ కాలముననే మన చెన్నరాజధానిలోగూడ స్వధర్మరక్షణకొరకును దేశోద్ధరణకొరకును మహత్తర కృషి జరిగెను. ఈఉద్యమమునకు నాయకులు ఆనాడు ప్రత్తి, నీలిమందు వ్యాపారములలో లక్షాధికారియైన ఆంధ్రవర్తకుడగు గాజుల లక్ష్మీనరుసుసెట్టిగారు. ఆ కాలమున మద్రాసులో సుప్రసిద్ధ బ్యారిష్టరుగానుండిన ఆంగ్లవిద్యాధికుడగు జార్జ్ బ్రూస్ నార్టనుగారు వీరికి కుడిభుజమైయుండిరి. భారతదేశ నాగరకతను ధర్మమును రూపుమాపుటకు ఆనాడు క్రైస్తవమతాచార్యులును కంపెనీ ప్రభుత్వమువారును కలిసి పన్నుచున్న కుతంత్రములను, చేయుచున్న అన్యాయములను, ప్రతిఘటించి స్వధర్మమును సంరక్షించుటకును, దేశములో తీవ్రమైన ప్రజాభిప్రాయమును కలిగించి ఇంగ్లాండులోని కంపెనీ డైరక్టర్లకు తెలియపరచుటకును అందువలన లాభము లేకపోయినచో వారి పైయధికారులగు ఇంగ్లాండుప్రభుత్వ పార్లిమెంటువారికి సైతము తెలియపరచుటకును ఎంతో కృషి చేయవలసి

యుండెను. అందుకొరకెంతో సొమ్ము ఖర్చుచేయవలసి ఈ కార్యము సాధించుటకెంతో ధైర్యము కావలసియుండెను. ఈ శక్తియెల్ల ఈ ఆంధ్ర వణిక్ఛిఖామణికి కలుగుట పరమేశ్వరుని కృపగాక మరి యేమనవచ్చును? ఇందు దిగినచో ప్రభుత్వముతోను ఆంగ్ల వర్తకులతోను విరోధములువచ్చి తీరుననియు తన వర్తకమునకు నష్టము వచ్చుననియు సర్వనాశనమగుటకూడ సంభవించవచ్చుననియు లక్ష్మీనరుసుగారు గ్రహింపకపోలేదు. అందు కెల్ల సిద్ధపడియే ఇతడు ప్రజాసేవచేసి ధన్యుడు కాదలచెను. ఈతని జీవితచరిత్ర గాంధి మహాత్ముని జీవితమువలెనే నిష్కళంకమై దేశభక్తి పూరితమై ధన్యతగాంచి దేశచరిత్రలో సువర్ణాక్షరములలో లిఖయింపదగినది.*

ఇట్టి దేశభక్తుడు ఆంధ్రుడే యగుట మన అదృష్టమని చెప్పకతప్పదు.

లక్ష్మీనరుసుగారు విద్యాధికుడు కాడు. ఇతని కింగ్లీషు రాదు. తన వ్యాపారమునకు గావలసిన వ్రాతకోతలు లెక్కలు మాత్రము వచ్చును. పైన చెప్పబడిన దేశపరిస్థితులను చూడగా నీతని హృదయము కరగి స్వధర్మమును, స్వమతమును సంరక్షింపవలెనను దీక్షనువహించి అందుకు కావలసిన కార్యములెల్ల నిర్వహించుచు అందుకు తన యావచ్ఛక్తిని వినియోగించి తన సర్వస్వమును ధారవోయుటకు నిశ్చయించు

---

* గాజుల లక్ష్మీనరుసుసెట్టిగారి జీవితమునకు శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహకవిగారి మహాపురుషుల జీవితములు చూడుడు.

కొనెను. మతాభిమానము త్వరలోనే దేశాభిమానముగా పరివర్తన జెంది ఈతనిని దేశభక్తునిగా జేసెను.

స్వమతరక్షణకొరకు పూనుకొనగానే ఇతడు ముందుగా ప్రజాభిప్రాయమును కలిగించుటకు 'చెన్నపట్టణ స్వదేశసంఘ' మను పేరున ఒక ప్రజాసంఘమును స్థాపించి అప్పుడప్పుడు సభలుచేయించి తీర్మానములనుగావించి మహాజరులను తయారు చేయించి అధికారులకు పంపుట ప్రారంభించెను. అందుకు కావలసిన వ్యయమునెల్ల తానే భరించెను. నాడు దేశమున ప్రచారములోనుండిన ఆంగ్లేయపత్రికలెల్ల హిందూమతమును దూషించుచు కైస్తవమతమునుభూషించుచు కైస్తవమతాచార్యుల యొక్కయు ప్రభుత్వముయొక్కయు చర్యలనెల్ల సమర్థించుచు భారతదేశప్రజల కెంతోనష్టకరముగా ప్రచారముచేయుచుండెను. ఈవ్రాతలనెల్ల ఖండించి సత్యప్రచారము గావించుటకును, నిజమైన ప్రజాభిప్రాయమును వెల్లడించుటకును స్వతంత్రమగు ఆంగ్లపత్రిక నొకదానిని స్థాపించుట అవసరమయ్యెను. అట్టిది నడుపుటకు ఎంతో ధనము కావలసియుండెను. నేటివలె నాడు ఇంగ్లీషు బాగుగవచ్చిన భారతీయులు హెచ్చుమంది లేరు. ఇంగ్లీషువచ్చిన కొద్దిమందికూడా ప్రభుత్వోద్యోగముల నాసించి వారినాశ్రయించువారేగాని స్వతంత్ర అభిప్రాయములను కలిగి పత్రికను నడుపగల శక్తిగాని ధైర్యముగాని కలవారు కారు. అందువలన అట్టి పత్రిక కాంగ్లేయసంపాదకునే నియమింపవలసివచ్చెను. పెద్దజీతమిచ్చినగాని ఆంగ్లేయులు రారు. ఇందుకెల్ల సంసిద్ధుడై, లక్ష్మీనరసుగారు "క్రెసెంటు" అనుపేర నొక

ఆంగ్లపత్రికను స్థాపించి సైనికోద్యోగముచేసిన విద్యాధికుడగు నొక ఆంగ్లేయునకు పెద్దజీతమిచ్చి దానికి సంపాదకునిగానియమించెను. ఈసంపాదకు డతిధైర్యముతో పనిచేయుచు ప్రభుత్వమును మతాచార్యులునుచేయు దురాగతములను తీవ్రముగావిమర్శింపసాగెను. ఆనాటి ఆంగ్లపత్రికలకెల్ల కంపెనీ దొరతనమువారు ప్రకటనలనిచ్చియు ఇతరవిధములుగను ప్రోత్సహించుచుండిరి. గాని యీ క్రెసెంటు పత్రికను తమకు విరోధిగా పరిగణించి దీని కెట్టి సహాయమును చేయరైరి. పైగా లక్ష్మీనరసుగారిని అనుమానముతో చూడసాగిరి.

ఇంతలో తీవ్రమైన రాజకీయాందోళన ప్రారంభించుట యవసరమైన సందర్భము కలిగెను. హిందూధర్మశాస్త్రప్రకారము మతాంతరులైనవారికి జాయింటు కుటుంబాస్తిలో హక్కులు పోవును. అందువలన క్రైస్తవమతము నవలంబించుటకు ప్రజలు సంశయించుట చూచి క్రైస్తవమతాచార్యులు ప్రభుత్వముతో కుట్రచేసి ఈ యాటంకమును తొలగించి ప్రజలను ప్రోత్సహించుటకు ఒక చట్టముచేయ ప్రయత్నించిరి. దానివలన క్రైస్తవమతము పుచ్చుకొన్నవారికి పైతము ఆస్తి హక్కులు నిలిచి యుండగలవు. ఇక నిర్భయముగ బలవంతముగ కూడ తమ మతములో కలుపుకొనవచ్చును. ఇది చూచి లక్ష్మీనరసుగారు వెంటనే తన పత్రికాముఖమున ఈ కుతంత్రమును వెల్లడించి విమర్శించుటయె గాక ప్రజలలో దీనిని గూర్చి ప్రచారముజేసి ఈ అన్యాయపు చట్టము చేయకుండ నిరోధించుట కొక అసమ్మతి సభను 1845 ఏప్రియలు 9 వ

తేదీన సమావేశపరచిరి. ఆ సభకు చెన్నపురిలోని హిందూ ప్రముఖులెల్లరు విచ్చేసి దానినిగూర్చి అసమ్మతి తీర్మానములను గావించిరి. ఆ తీర్మానముల ప్రకారము అసమ్మతిని సూచించుచు ఒక పెద్ద మహాజరును గూడా తయారుచేయించి పెక్కుమందిచేత సంతకములు చేయించి లక్ష్మీనరసుగారు తన ఖర్చుపైన దానిని ఇంగ్లండులోని కంపెనీ డైరెక్టర్లకంపిరి. ఇంత ఆందోళనము జరుగగా ఆ చట్టమును అప్పుడు చేయుటకు ధైర్యముచాలక అప్పటికా ప్రయత్నమును కంపెనీ ప్రభుత్వము వారు విరమించిరి. గాని తరువాత నైదేండ్లకు 1850లో ప్రాత నిబంధనలతోనే ఇంకొక చట్టమును నిర్మించిరి. (Cast Disabilities Removal Act-1850) దీని ఫలితముగానే బందరులో మర్యాదగల నియోగి వైదిక మధ్వ, కుటుంబముల లోని కొందరు యువకులు క్రైస్తవులై నేటికిని ప్రాత యింటి పేర్లతోనుండుటయు తటస్థించినది. పాఠశాలలందలి యువకు లెందరో ఆకాలమున క్రైస్తవులుగ చేయబడిరి. ఆనాడు 1845లో తమ ప్రయత్నములకు భంగము కలిగించెనని ఆంగ్లేయ మతాచార్యులకును వారి వశవర్తులగు కంపెనీ ఉద్యోగులకును లక్ష్మీనరసుగారిపైన తీవ్రమైన క్రోధముకలిగి ఆయనకు నష్టముకలిగించుట కనేక దుష్ప్రయత్నములు జేసిరి.

ఇంతలో క్రైస్తవ మతబోధకులు తమదృష్టిని పాఠశాలలవైపుకు మరలించిరి. అప్పటివరకు ప్రభుత్వపాఠశాలలయందు శాస్త్రవిజ్ఞానమును ఇంగ్లీషుభాషయుమాత్రమే బోధింపబడుచుండెను. గాని, ఎట్టిమతబోధయు చేయబడుటలేదు. ఇప్పుడుక్రైస్తవ

మతబోధకుల ప్రోత్సాహముతో నా పాఠశాలలో పరీక్ష చేయు దొరలు ఉద్యోగులుకలిసి ఒక తంత్రమును గావించిరి. అధికారులుచేయు పరీక్షల యందు త్తీర్ణులైనగాని ఉద్యోగము లివ్వరు. పరీక్షలుచేయు అధికారులు దొరలు. వీరు పాఠ్య పుస్తకములలోని సంగతులనుగూర్చి మాత్రమేగాక ప్రపంచ జ్ఞానమునుగూర్చి ప్రశ్నించునెపమున బాలకులను క్రైస్తవ మతగ్రంథములలోని సంగతులనుగూర్చి యడుగుటయు వారు జవాబు చెప్పలేని వారు ప్రభుత్వోద్యోగములకు అనర్హులని నిర్ణయించుటయు ప్రారంభించిరి. అందువలన బాలురెల్లరు బైబిలు చదువవలసి వచ్చుచుండెను. ఇది అన్యాయమని మొత్తుకొనిప్రభుత్వమునకుఅర్జిలు పెట్టుకొనగా,ప్రపంచజ్ఞానమునకు సంబంధించిన ప్రశ్నలడుగుటలో తప్పులేదనియు పాఠశాలలందే బైబిలును చదివినచో నీచిక్కు ఉండదనియు ప్రభుత్వమువారు జవాబుచెప్పి ఆ ప్రకారము బైబిలును పాఠశాలలలో ప్రవేశ పెట్టిరి! ఈ తంత్రము పన్నబడి మతప్రచారము పాఠశాలల యందు ప్రారంభమగుటచూచి లక్ష్మీనరుసుగారు దీనినిగూర్చి తీవ్రమైన ప్రచారము జేసి దినితోపాటు దేశములో ప్రజలకు జరుగుచున్న ఇతర అన్యాయములనుగూర్చి యోజించి తగు చర్య జరుపుటకొరకు 1846 అక్టోబరు 7 వ తేదిన నొక గొప్ప సభను మదరాసులో సమావేశపరచిరి. అందులో దేశస్థితిగతులెల్ల విమర్శింపబడి పెక్కుతీర్మానములు గావింపబడెను. ఆతీర్మానముల ననుసరించి ఒక మహాజరును తయారుచేసి ఇంగ్లాండులోని కంపెనీ డైరక్టర్లకు గవర్నరుద్వారా పంపుటకు నిశ్చ

యించబడెను. నాటిసభవారనేక తీర్మానములు గావించిరి. అన్ని మతములను సమానముగా చూతుమనియు క్రైస్తవమతమునకు ప్రత్యేక ప్రోత్సాహము నొసగమనియు కంపెనీ ప్రభుత్వము చేసినవాగ్దానములకు విరుద్ధముగా పూర్వపు గవర్నరు ప్రవర్తించుట మతబోధకులు ప్రభుత్వమువారి ఉద్యోగుల సహాయముతో ప్రజలను తమమతములో కలుపుకొనుటకు నిర్బంధించుచుండుట, అందుకు ప్రభుత్వమువారు తోడ్పడుచుండుట, పాఠశాలలోని బాలురనుగూడ క్రైస్తవ మతమున జేర్చుచుండుట, హిందూబాలురు పరీక్షయందు తీర్ణులు గాకుండగను వారి కుద్యోగములు రాకుండగను మతబోధకులును వారి చేతిలోని ప్రభుత్వోద్యోగులునుకలిసి కుట్రలు చేయుచుండుట, చెన్నపురిరాజధానిలోని వివిధజిల్లాలలో ఇంగ్లీషు పాఠశాలలు నెలకొల్పి జనసామాన్యమునకు ఇంగ్లీషువిద్య నేర్పకుండుట; న్యాయస్థానములందుగూడ తరచు అన్యాయములే జరుగుచుండుట; కంపెని పరిపాలనమందు ఇంక ననేక అన్యాయములు జరిగి ప్రజలు బాధపడుటయు నా సభవారు చక్కగా విమర్శించి ఈ అన్యాయములు తక్షణమే మాన్పవలెనని కోరిరి.

ఈ సభకు లక్ష్మీనరసుగారే అధ్యక్షత వహించి సభను శాంతియుతముగాను జయప్రదముగాను నిర్వహించియుండిరి. భారతీయ ప్రజలుబాగుపడుటయు, అభివృద్ధి జెందుటయు సహించని స్వార్థపరులగు దొరలు కొందరు, ఆ సభలో రాజద్రోహకరమైన ఉపన్యాసములు జరిగెననియు, సభలో కల్లోలము కలిగెననియు రసాభాసము జరిగి యది ముగిసెననియు అబద్ధపు

ప్రచారముగావించిరి. ఇక గవర్నరన్నను 12 వేల సంతకము లతో పై సంగతులుగల ఆమహాజరు తన దగ్గరకు రాగా అందలి సంగతులు అబద్ధమని ఖండించలేక ఈ ప్రచారమెల్ల మిడిమిడి జ్ఞానముగలవారిచేత చేయబడుచున్నదనియు ప్రభు త్వమువారు తలపెట్టిన సత్కార్యములకు, చేసిన మంచి చర్య లకు, అపార్థములు కల్పింపబడినవనియు, ప్రజలు ఇది మంచి ఇది చెడుగని తెలియని అజ్ఞానులనియు రిమార్కులు వ్రాసి సీమకంపగా కంపెనీడైరక్టరులు ఆ మహాజరును బుట్టదాఖలు చేసిరి. అయితే ఈ ఆందోళన ఫలితముగా పాఠశాలలయందు బైబిలు బోధించు తరగతి మాత్రము అప్పటికి నిలిపి వేయ బడెను. 1853 లో మరల బైబిలుబోధను ప్రారంభించుటకు ప్రయత్నింపగా లక్ష్మీనరసుగారును ఆయనకు ప్రథమము నుండియు ఈ ఆందోళనమున తోడ్పడుచు పుణ్యము గట్టు కొనుచున్న పరోపకార పారీణుడగు 'నార్టన్' దొరగారును ఈ ప్రయత్నమును విఫలముచేసిరి.

ఆ కాలముననే ఇంగ్లాండు పార్లమెంటుసభ్యుడగు డాంబే సేమర్ అను దొర భారతదేశస్థితిగతులను స్వయముగా చూచు టకువచ్చి లక్ష్మీనరసుగారిపేరు వినియుండుటవలన ఆయనక్షేమ మడిగెను. అంతట లక్ష్మీనరసుగా రాయన కాతిథ్యమిచ్చి కడ లూరు, కోయంబత్తూరు మొదలగు జిల్లాలకన్నింటికిని తీసికొని వెళ్లి పన్నులవసూళ్లలో జరుగుచుండిన దురాగతముల నాయ నకు ప్రత్యక్షముగా చూపించెను. పన్నులివ్వలేని రైతులను రివిన్యూనౌఖరులు రెక్కలువిరిచి కట్టి కొట్టుచుండిరి. కొందరిని

బొండలలోపెట్టి హింసించుచుండిరి. కొందరి నెండలో నిలువబెట్టి వారితలపైన రాతిబండలనెత్తియుంచి ఎదుట కర్రలు పుచ్చుకొని యుండిరి. కొందరిని తలక్రిందుగా కోదండములు తీయించిరి. ఇదిచూచి ఆదొరగారు నివ్వెరపోయిరి! ఇది యంతయు తాలూకాకచ్చేరీ యెదుటనే జరుగుచుండినను అచ్చటి కలెక్టరును తాశిల్దారునుకూడ తమపనిచేసికొనుచు నిది చూడనట్లూరకొనిరి! ఈదొరగారు తరువాత 1854 లో నీ సంగతులన్నియు పార్లిమెంటులో చెప్పగా నచ్చటివారు నమ్మలేదు. అంతట హింసాసాధనములను కొన్నింటిని తాను తెచ్చితిననియు కావలసినవారు వచ్చి చూచుకొన వచ్చుననియు అతి తీవ్రముగా నితడు సవాలు చేసెను. అంతట కొందరాతని పక్షమవలంబింపగా ఎట్టకేలకు పన్నుల వసూళ్ళలో భారత దేశములో జరుగుచుండిన దారుణహింసలను గూర్చి విచారించుట కొక ఉపసంఘము నేర్పరచిరి. దీనికే ('మద్రాసు టార్చర్ కమిషన్') హింసల విచారణసంఘమని పేరు. ఈ ఉపసంఘమువారు సాక్ష్యముల గైకొనిరి. ఈ లోపుగా లక్ష్మీనరుసుగారు కూడా ఈ విషయములను గూర్చి అనేకులచేత సంతకములు చేయించి మహజరులను పంపి ఆ విచారణకు తోడ్పడిరి. ఆవిచారణవలన పన్ను లిచ్చుకోలేని రైతులను బాధించు దురాచారములు మాన్పబడెను.

ఈలోపుగానే కంపెనీవారికి భారత దేశ రాజ్యాధికారపు పట్టామరల నొసగు సందర్భము తటస్థించగా కంపెనీ పరిపాలన కాలమునాటి భారత దేశస్థితిగతులనెల్ల తెలియబరచుచు లక్ష్మీ

నర్సుగారు గొప్ప మహజరును తయారుచేయించి 1852 లోనే పార్లిమెంటుకు నివేదింపచేసిరి. నాటి కంపెనీపరిపాలనమున ప్రజలు దరిద్రులై అజ్ఞానమున మునిగి అనారోగ్యమున పడి యుండుటయు, రాకపోకలకు పల్లపుసాగుకు ఎట్టి సౌకర్యములు లేకుండుటయు, పన్నులత్యధికమై రైతులు భరింపలేకుండుటయు పన్నులివ్వలేనివారు బాధింపబడుచుండుటయు, కలెక్టరుల నిరంకుశత్వమును, అధికారుల లంచగొండితనమును, కోర్టుల యప్రయోజకత్వమును, క్రైస్తవమతబోధకుల దురాగతములును, కంపెనీవారి దుష్పరిపాలనయు ఆమహజరులో వివరముగా వ్రాసి చిట్టచివర "దేశపరిపాలన మిప్పటివలెనే కంపెనీ చేతులలో నున్నను సరే, లేదా మరియొకరి చేతులలోనున్ననుసరే, పరిపాలనాపద్ధతిలో మాత్రము మార్పులును అభివృద్ధియు కలుగవలెను." అని పార్లిమెంటువారిని ప్రార్థించిరి.

ఆకాలములో మన రాజధానిలో చెన్నపట్టణ స్వదేశ సంఘము స్థాపింపబడి పనిచేయుచున్నట్లే కలకత్తాలో బ్రిటిష్ ఇండియన్ అసోసియేషను అను సంఘమును బొంబాయిలోకూడా ఇంకొకసంఘమును స్థాపింపబడెను. వివిధ రాష్ట్రములనుండి పార్లిమెంటుకు మహజరు లంపబడినవి. చెన్నపట్టణమున లక్ష్మీనర్సుగారి వలెనే బొంబాయిలో దాదాభాయి నౌరోజీగారును దేశసేవచేయుచు నింగ్లండుకుపోయి భారత దేశ ప్రజలకష్టములను ఇంగ్లీషువారికి తెలుపసాగిరి.

పార్లిమెంటువారు 1853 లో కంపెనీవారికి క్రొత్త పట్టాను జారీచేయుచు ఒకచట్టమును చేసిరి. దానిలోపెద్ద సంస్కార

ణములను చేయకపోయినను కొన్ని చిన్న సంస్కరణములను మాత్రము చేసిరి. తృప్తికరముగ పనిచేయుచుండని సదరు కోర్టులను తీసివేసి హైకోర్టులు స్థాపింపబడునట్లు ఏర్పాటు చేసిరి. ఆశ్రియించువారికెల్ల ఉద్యోగములిచ్చు పద్ధతిని మాన్పి పరీక్షలందు తేరినవారికి మాత్రిమే ఇవ్వవలెనని శాసించిరి.

కంపెనీవారు మరల రాజ్యాధికారపట్టా పొంది ఎప్పటివలెనే తమ దుష్పరిపాలనమును నిరంకుశముగ చలాయింపసాగిరి. దేశమునందు అసంతృప్తి హెచ్చెను. ఆశాభంగము కలిగెను. కాని లక్ష్మీనరసుగారును, ఆయనకీ ఆందోళమునందెల్ల తోడునీడయై పనిచేయుచున్న నార్టన్ గారును, నిరాశజెందక ధైర్యముతోను ద్విగుణీకృతమైన పట్టుదలతోను రాజకీయ సంస్కరణములకొరకు పనిచేయసాగిరి. నార్టన్ గారు కంపెనీవారి దుష్పరిపాలనా ఫలితముగా గలిగిన దేశదారిద్ర్యమును అజ్ఞానమును గూర్చిన లెక్కలతోను ప్రత్యక్ష ప్రిమాణములతోను కొన్నివందలు పుటలుగల గొప్పనివేదికను తయారుచేసి వివిధజిల్లాలలో జరిగిన అన్యాయములను వివరించి భారతదేశప్రిజలు రాజకీయహక్కులకు తగరనియు కంపెనీ పరిపాలనము బాగుగనే యున్నదనియు దొరలుచేయుచుండిన అబద్ధపు ప్రిచారమును ఖండించుచు కంపెనీ దుష్పరిపాలనా విధానమునెల్ల చక్కగావర్ణించి ఈ పరిపాలనా పద్ధతిని వెంటనే రద్దుపరచి ఇంగ్లాండు రాజుక్రింద పార్లిమెంటుమంత్రియే ఈ దేశప్రిభుత్వమునకు బాధ్యతవహించి ప్రిభుత్వము స్థాపించవలసినదని పార్లిమెంటును ప్రార్థించుచు 1854 లో

బోర్డుఆఫ్ కంట్రోలుకార్యదర్శికి నివేదిక నంపిరి. తనస్నేహి తులకు భారతదేశమును గూర్చి తగు శ్రద్ధవహించ వలసినదని లేఖలు కూడా వ్రాసిరి. గాని ఇంత శ్రమపడినను కంపెనీవారి పాలనలోని అన్యాయములను మాన్పుటగాని కంపెనీ రాజ్యాధి కారమును రద్దుచేసి తామే ప్రభుత్వము వహించుటగాని పార్లిమెంటువారు చేయలేదు. ప్రజలలో అశాంతి హెచ్చ సాగెను. కంపెనీ ప్రభుత్వమువారు ఈ అశాంతి నణచుటకును దీని నాయకులను ఏవిధముగ నైనను భయపెట్టి ఈ యుద్య మమునుండి విరమించునట్లు చేయుటకును ప్రయత్నింపసాగిరి. లక్ష్మీనర్సుగారు రాజద్రోహము చేయుచున్నట్లు అనుమా నించుచు ఆయన నెల్లప్పుడు పోలీసులు వెంటాడునట్లుచేసిరి! ఆయన నేవిధముగా నైనను పట్టుకొనవలెనని ఆయన యిచ్చిన యుపన్యాసముల నెల్ల జాగ్రత్తగ పరిశీలింపసాగిరి. వీలైనచో రాజద్రోహముక్రింద శిక్షింపవలెనని వారియూహ! ప్రభుత్వో ద్యోగులును ఆంగ్లేయవర్తకులును ఏకమై ఆయన వ్యాపారము నకు నష్టము కలిగించుట కనేక విధములుగ బ్రయత్నించిరి. ఇట్లు ప్రభుత్వమువా రెన్నివిధములుగా భయపెట్టినను ఎన్ని యిబ్బందులు పెట్టినను ఆతనికి ఎంత నష్టము కలిగినను ఈ దేశభక్తుడు తన పట్టుదలను వీడక ఆవంతయైనను జంకక ద్విగుణీకృతోత్సాహముతో అతి ధైర్యముతో ఎప్పటివలెనే తన రాజకీయోద్యమ కార్యక్రమమును జరుపుచు ప్రజల హక్కుల కొరకు పోరాడుచుండెను. లక్ష్మీనర్సుగారు గొప్ప రాజకీయ సంస్కర్తయేగాని విప్లవకారుడు గాడు. 1857 లో

ఉత్తర హిందూస్థానమున జరిగిన సిపాయిల విప్లవము అనబడు స్వాతంత్ర్య సమరము గూడ స్వధర్మ స్వదేశ స్వరాజ్య స్థాపనలకొరకే జరుగుచుండినదని గ్రహించియుకూడ లక్ష్మీనరసు అట్టి దారుణపద్ధతి నవలంబించుట కెంతమాత్రము ఇష్టపడలేదు. ఈతని సత్యశీలమును శాంతగుణమును త్యాగ ధైర్యములను ఔదార్యమునుచూచి భారతదేశములోని ఆంగ్లేయులేగాక పార్లమెంటులోని ఆంగ్లేయులుకూడ ఆశ్చర్యపడిరి. అందువలన సిపాయిల విప్లవానంతరము రాణీ ప్రభుత్వమున క్రొత్త పరిస్థితులలో శాంతిస్థాపన సందర్భమున నీతనికి సి. ఎస్. ఐ. అను నొక బిరుదునిచ్చి క్రొత్తశాసనసభలో నొక సభ్యునిగా చేసిరి. ఇతడు బిరుదు నందినంతమాత్రమున ప్రభుత్వ వ్యామోహమునబడి వారి కనుకూలముగ ప్రవర్తించు స్వార్థపరుడుగాడు. స్వధర్మరక్షణకొరకు దీక్షవహించి దేశ ప్రజల హక్కులను కాపాడుటయే తన ధర్మముగ నెంచుకొని ఎప్పటి వలెనె ప్రజాసేవ చేయుచు ప్రభుత్వచర్యలు అక్రమములై నప్పుడు వాని నతితీవ్రముగ విమర్శింపసాగెను. ఈతడు చేయుచుండిన నిరంతర కృషివలన నీతనికి గొప్ప రాజకీయపరిజ్ఞానమును రాజ్యతంత్ర నిపుణతయు నలవడినవి. ఆశక్తులెల్ల తన తోడి ప్రజల క్షేమలాభములకొరకు వినియోగింపసాగెను. బ్రిటీషు పరిపాలనలోచేరిన మన రాజధానిలోని ప్రజల కష్టసుఖములనే గాక నాడు బ్రిటీషువారితో సంబంధము గలిగియుండిన మన రాజులయొక్కయు నవాబులయొక్కయు క్షేమలాభములకొరకు గూడ నీతడు పాటుపడసాగెను. ఆసందర్భములో నీతడు నేటి

మైసూరుసంస్థానమునకు మహోపకారముగావించుట తటస్థించి నది. మైసూరుయుద్ధము జరుగుచుండినప్పు డాదేశమును నైజా ముతోకలిసి పంచుకొనుటకు బ్రిటిషువా రేర్పాటు చేసికొని యుండిరి. తరువాత ఆయేర్పాటుకు భిన్నముగా ఆరాజ్యమును తామే యుంచుకొని అనుభవింపసాగిరి. మైసూరుయొక్క పూర్వపు రాజింకను మైసూరులో బ్రతికియుండెను. భారత దేశపు పూర్వపు రాజులలో నొక డిట్లు అన్యాయముగా పద భ్రష్టుడైయుండుట జూచి లక్ష్మీనరసుగారికి జాలి కలిగెను. ఇతడు గాఢమైన దేశాభిమానము కలవాడైనందున ఈరాజుకు మరల సంస్థానము నిప్పించవలెనను కోరిక గలిగినది. అంతట నావృద్ధరాజును దత్తుచేసికొనుమని ప్రోత్సహించి ఆదత్తును ఖాయపరిచి ఆరాజ్యమును అతనికి మరల ప్రసాదించుటయో లేక పూర్వము జరిగిన ఏర్పాటుప్రకారము నైజామునకిచ్చు కొనుటయో చేయవలసిన సందర్భమును కలిగించినచో బ్రిటీషు వారు దారికి వత్తురని గ్రహించి లక్ష్మీనరసుగారు రాజ్య తంత్రమును ప్రయోగించి నైజాముమంత్రియగు సలారు జంగ్‌తో మాటలాడి బ్రిటీషు వారితో రాయబారము నడి పించగా నైజామునకు రాజ్యభాగము నిచ్చుటకన్న మైసూరు రాజుకు సంస్థానమిచ్చివేయుటయే గౌరవప్రదమని యెంచి బ్రిటీషువా రట్లు గావించిరి. ఇట్లు లక్ష్మీనరసుగారు కేవలము పరమార్థచింతతో దేశభక్తిపరుడై మైసూరు సంస్థానాధీశు నకును ప్రజలకును మహోపకారము జేసినాడు. బ్రిటీషువారి వలన బాధలు పొందుచున్న చిన్నచిన్న రాజులకు రాణులకు నవాబు లకుగూడ నీతడు చాల సాహాయ్యమును జేసెను.

దేశముకొరకీ విధముగా పనిజేసి లక్ష్మీనరసుగారు కృతకృత్యుడైనాడు. తన ధనమెల్ల సత్కార్యములను సాధించుటకే మహోద్యమములను నడపుటకే ప్రజాసేవకొరకే వ్యయపరచెను. ఈతని సంపదనెల్ల ఒక్క క్రెసెంటు పత్రికయె మ్రింగివేసినదనుటలో నతిశయోక్తి లేదు. శ్రీ టంగుటూరి ప్రకాశము పంతులుగారి 'స్వరాజ్య' పత్రికవలెనే నాటి క్రెసెంటు పత్రికయు ప్రభుత్వాగ్రహమునకు ఆహుతియగుదునను భయముకూడా విసర్జించి ప్రభుత్వచర్యలనుగూర్చి తీవ్రవిమర్శ చేయుటయె గాక ఆనాడు జరుగుచుండిన దురాగతములను నిర్భయముగ వెల్లడించుచుండెను. పత్రికా నిర్వహణము అతి కష్టసాధ్యము. అమిత ధనవ్యయకారణము. సామాన్యుడు చేయదగిన కార్యముకాదు. లక్షాధికారులు కూడ నిర్వహింపజాలరు. గొప్ప బారిష్టరుగా నుండి తాను సంపాదించిన ధనము సర్వస్వము స్వరాజ్యపత్రిక నిర్వహణమున పోగొట్టుకొని దేశముకొరకు దారిద్ర్యము ననుభవించిన ప్రకాశముగారివలెనే వ్యాపారమున సంపాదించిన ధనమునెల్ల క్రెసెంటుపత్రిక నిర్వహణమున ఖర్చుపెట్టి లక్ష్మీనరసుగారును దరిద్రులైరి. ఆయన తలపెట్టిన ప్రజాసేవ కార్యములెల్ల ధనవ్యయ కారణములయ్యెను. ఆయన చేసిన దేశసేవ ప్రయత్నములెల్ల ఆంగ్లేయ కంపెనీవారి ప్రభుత్వముతో విరోధము తెచ్చిపెట్టినవి. వారి కుట్రవలన ఇతని వ్యాపారమునకు నష్టము కలిగినది. కుమారుడప్రయోజకుడైనాడు. ధనమెల్ల గోల్పోయి లక్ష్మీనరసుగారు 1868 లో దారిద్ర్యమున మరణించెను.

లక్ష్మీనరసుగారిజన్మ సార్థకమైనది. ఆయన ధన్యుడు. రాజకీయ పరిజ్ఞానము వృద్ధియై ప్రజాభిప్రాయము వర్ధిల్లి పత్రికల విమర్శనలు, ప్రజల ఉద్యమములు, తీవ్రతరములై సత్యాగ్రహ శాసనోల్లంఘన పద్ధతులతో ప్రభుత్వముతో పోరాడుటకు ప్రజలకు శక్తియుదయించి ప్రజల హక్కులను కంటికి రెప్పవలె కాపాడుచు శాంతిసమరమును నడుపగల బలమైన ప్రజాసంస్థయగు కాంగ్రెసును, ఈప్రజాశక్తినెల్ల విజృంభింపజేసి ఈ శాంతిసమరమును జయప్రదముగ నడిపి ఈ దేశము నేగాక ప్రపంచమును గూడ ఉద్ధరింపగల మహానాయకుడగు గాంధీమహాత్ముడు సారథియైయున్న ఈ కాలముననే ఇంకను ప్రభుత్వమన్న భయము, విమర్శయన్న జంకు, రాజకీయాందోళనమన్న వెఱపును, కలిగిన మితవాదులుపిరికిపందలు స్వార్థపరులును మిగిలియుండగా ఇట్టి పరిస్థితులుగాని ఇట్టి ప్రజాశక్తిగాని ఇట్టి ప్రజాసంస్థగాని ఇట్టి మహానాయకుడు గాని లేనినాడు, దేశములో ప్రజాభిప్రాయమే లేక స్తంభీభూతమైయుండిననాడు, ప్రజలు నోరులేనివారై అసహాయులై పడియుండిననాడు, ప్రభుత్వము బలవంతమై నిరంకుశమై రాక్షసత్వము ప్రదర్శించి భీభత్సము చేయుచుండిననాడు, ఒంటరియై ఇడుమలబడుటకు, ఆ ప్రభుత్వముతో ప్రతికక్షకట్టి భారత దేశప్రజల హక్కులను నాగరకతను నణగద్రొక్కి శాశ్వత రాజకీయార్థిక బానిసత్వమును స్థాపించదలచిన శక్తులతో పోరాడి అందువలన తనకు కలుగు నష్టములకు అపాయములకు సర్వనాశనమునకుగూడ సంసిద్ధుడై, ఆ నోరులేని ప్రజలకొరకు పోరాడి తనసర్వస్వమును

అర్పించి దరిద్రుడై కీర్తిశేషుడైన ఈ లక్ష్మీనర్సుగారి నేమని పొగడవలెను ? కేవలము ధనార్జనములోనే కాలము గడుపుచు లుబ్ధుడుగను అధికారులజూచిన భయపడిపోవు పిరికివాడుగను నుండవలసిన సాహుకారు ఉదారుడై, త్యాగియై ధైర్యశాలియై దేశభక్తుడైనాడు. స్వమతరక్షణకొరకు అధికారులతో పోరాడి ప్రజలహక్కులను సంరక్షించుటకొరకు రాజకీయోద్యమము నడిపి కృతకృత్యుడైనాడు. ఇట్టి మార్పు పరమేశ్వరు కృపవలనగాక మరియెట్లు కలుగును? వేదములు ప్రమాణములనియు ఉపనిషన్మతము సత్యమనియు జన్మపరంపర నిజమనియు దుష్టశిక్షణము శిష్టరక్షణము చేయుటకు భగవంతుడే యవతారముగా వచ్చునను మాట నిశ్చయమనియు నమ్మి. ఈభారతీయ ప్రజలు లక్ష్మీనర్సుగారు తమ్ము రక్షించుటకొరకు భగవంతుడంపిన దేవదూతయని నమ్ముటకును, నేటి గాంధిమహాత్ముని పూర్వావతారమని నమ్ముటకును అభ్యంతరమేమికలదు? లక్ష్మీనర్సుగారి వలెనే ప్రభుత్వోద్యోగములకు పదవులకు ప్రాకులాడక, బిరుదుల నాసింపక, స్వార్థము దలపక కేవలము పరమార్థచింతతో ధర్మముకొరకు దేశము కొరకు పాటు పడుచు అందుల కష్టములకోర్చి నష్టములను భరించి తమ సర్వస్వమును అర్పించి తుదకు ప్రాణములనునహితము ధారవోసి దేశోద్ధరణ మహాయజ్ఞమున పూర్ణాహుతిని సమర్పించిన మహానుభావులెందరో మన దేశములో వివిధ రాష్ట్రములందు గలరు. గతించినవారిని కీర్తిశేషులని మనవా రనుచుండుటయె గాని ఈ శేషించినకీర్తిగాని తుదకు వారి పేరులైనగాని

మన చరిత్రగ్రంథముల కెక్కుటలేదు. ఇది మన దురదృష్టము.

రాజకీయార్థికములందువలెనే విజ్ఞాన విషయములందు గూడ మనము పారతంత్ర్యమున బడియున్నాము. అందువలన మనచరిత్రనిర్మాణవిషయమునగూడ ఏవిన్సెంటుస్మిత్తు పైననో ఆధారపడి శివాజీ కొండఎలుకయనియు, ఝాన్సీ లక్ష్మీబాయి మున్నగు స్వాతంత్ర్యయోధులు రాజద్రోహులనియు, ఎన్నో దుర్మార్గములుచేసిన క్లైవు, వారన్ హేస్టింగ్సు మొదలగు తెల్లవారు మహానుభావులనియు వ్రాయబడిన చిలుకపలుకులను మనవారుకూడ తమ పుస్తకములలోనిక్కించుచున్నారు. అంతేగాని స్వధర్మముకొరకు స్వదేశముకొరకు స్వరాజ్యము కొరకు పాటుబడి సర్వస్వమునర్పించిన మహానుభావుల చరిత్రలుకాదుగదా తుదకు వారి నామములనైనను పేర్కొనుట దేశచరిత్ర కత్యంతావశ్యకమను జ్ఞానము మనవారికి లేనేలేదు. రాజకీయార్థిక దాస్యములతోపాటు వైజ్ఞానిక శాసనత్వము కూడ మనకు దాపరించినది.

రాజా రామమోహనరాయ లాదిగాగల సంస్కర్తలు దేశారాధకులు కృషిచేసిన భారతభూమిలో నాడు మదరాసు రాజధానిలో లక్ష్మీనర్సుగారును ఇతరరాష్ట్రములందు ఆయన వలెనే దేశోద్ధరణకొరకు పాటుపడిన మహానాయకులును స్వధర్మరక్షణకొరకు నాటిన దేశభక్తివిత్తనములు లోకమాన్య తిలకు అనీబీసెంటుల కాలమున స్వరాజ్యోద్యమమున చిగిర్చి మొలకలెత్తి కాంగ్రెస్ మహోద్యమమున మహావృక్షమై గాంధిమహాత్ముని యధ్వర్యమున పూర్ణస్వాతంత్ర్య స్థాపన

కొరకు జరుపబడిన సహాయనిరాకరణ శాసనోల్లంఘన సత్యా గ్రహోద్యమములందు వృష్పించి కాంగ్రెస్‌వలన సంరక్షింప బడి త్వరలో ఫలింపనున్నది. ఈ స్వాతంత్ర్యఫలమును భారతీయులెల్లరు - అన్ని జాతులవారు అన్ని మతములవారు అన్ని తరగతులవారు—ముఖ్యముగా తరతరములనుండి దారిద్ర్యమున, అజ్ఞానమునబడియున్న కర్షకులు కార్మికులు దీనజనులు సమానముగా ననుభవింపగలరు. ఇట్టి ఫలానుభవమునకు దోహదముచేసిన అసంఖ్యాకులగు అజ్ఞాతవీరులగు దేశభక్తులకెల్లరకు నమస్కరించి శాశ్వతముగా కృతజ్ఞులమయియుండి తరింతుము గాక!

## పం డ్రెం డ వ ప్ర క ర ణ ము

## భారతదేశ స్వాతంత్ర్యవిప్లవము.

### I

1856 నాటికి భారతదేశ భూభాగములో రెండువంతులు బ్రిటిషుఇండియాగా మారిపోయినది. మహారాజులు, సుబేదారులు, నవాబులు చాలమంది నాశనము చేయబడిరి. కొంత మంది భయపడి కంపెనీవారికి కప్పముగట్టుచు సంస్థానాధీశులుగ మిగిలిరి. వీరిలోకూడ చాలమంది నేదో నెపమున పదభ్రష్టులుగా జేసి రాజ్యములు లాగికొనుచుండుటచే భారతదేశ సంస్థానాధీశులందు రాజులందు, నవాబులందు తీవ్రమైన అసంతృప్తి కలుగుటయేగాక తమ రాజ్యముల నెప్పుడు లాగికొందురో యను భీతియు ప్రబలుచుండెను. పదవులుపోయి పింఛను

లనుభవించుచున్నవారు లోలోపల కుళ్ళుచు కుట్రలుచేయు చుండిరి. ఆంగ్లేయులు మొగలాయి సామ్రాజ్యమును నాశనముచేసి ఆ దిబ్బలపైన 'విలాతీ' రాజ్యము స్థాపించినారని దేశములోని మహమ్మదీయులు అందుముఖ్యముగా అయోధ్య ప్రజలు అసంతృప్తి కలిగియుండిరి. ఇట్లు దేశములో నీ విజాతీయ కంపెనీ ప్రభుత్వముపైన అసహ్యాభావము ద్వేషభావము నానాటికి వర్ధిల్లుచుండెను. ఈ ప్రజలెల్లరు ఇంగ్లాండు డైరెక్టర్ల కనేకమార్లు అర్జీలుపెట్టుకొనియుండిరిగాని లాభము లేకపోయెను. భారతదేశ స్థితిగతులనుగూర్చి నాటి సంస్కర్తలు ఇంగ్లాండువారికి నివేదించి దేశప్రజలలో విద్యను అభివృద్ధి చేయుమని సౌకర్యములు కలిగించమని కోరినను లాభము లేకపోయినది. పార్లమెంటుకుగూడా మహజరు లంపినను లాభము లేకపోయినది. లక్ష్మీనరసు మొదలగువారివంటి దేశభక్తులు వివిధరాష్ట్రములందు పత్రికలయందు విమర్శించియు, సభలందు తీర్మానములు గావించియు అర్జీలు మహజరు లంపియు, శాంతియుత పద్ధతులతో నెంత యాందోళనము చేసినను ఈ దుష్ట పరిపాలనము సంస్కరింపబడలేదు. ఈ అన్యాయపు పద్ధతులు పోలేదు. పైగా ప్రభుత్వమువారు నిరంకుశులై ఈ యాందోళనము చేయుచున్న వారందరిని రాజద్రోహులుగా నెంచి వారిని పోలీసులచే వెంటాడింపజేసిరి.

ఆనాటికి భారతదేశ ప్రజలందు వివిధజాతి మతకులముల వారియందు మతభ్రష్టు లగుదుమను భీతియు విజాతీయులపైన ద్వేషమును స్వాతంత్ర్యము కావలెనను కాంక్షయు

నుండెననుటకు సందియము లేదని పాశ్చాత్య చరిత్రకారులే ఒప్పుకొనియున్నారు. ఈ విప్లవబీజములు వంగరాష్ట్రము నందలి సిపాయిలలో నత్యధికముగా నుండెను. తమశక్తి వలననే ఈ భారత దేశమునెల్ల ఈ తెల్లవారు పరిపాలించుచున్నారనియు తాము లేనిచో వారు అసహాయులగుదురనియు వారి యూహ. వీరిలో చాలమంది అయోధ్యనుండి వచ్చిన ఉత్తమ జాతిహిందువులు. వీరు స్వధర్మ స్వదేశములపై నభిమానముగల వారు. ఈ సమయమున పదభ్రష్టులైన రాజులు, వీరివారసులు, రాణులు నీయసంతృప్తిని అవకాశముగా తీసుకొనిరి. వీరికి పింఛనులుండుట వలన చేతిలో పుష్కలముగా సొమ్ముండెను. ఈ విజాతీయ కంపెనీవారి నెట్లు దేశమునుండి వెడలగొట్టుదుమాయని వీరు తీవ్రముగా ఆలోచించిరి. ఆనాడు ఆంగ్లేయులు క్రిమియన్ యుద్ధమున పరాజయము పొందుచున్నట్లు వీరు వినియుండిరి. రష్యా ఇంగ్లాండు వారికి ప్రబలశత్రువనియు ఈ జాతిని అణచివేయగలదనియు తలచిరి. మరల నొకమారు హిందుస్థానమును మొగలాయి చక్రవర్తి క్రిందికి తేవలెనని ఆతనియభిమానులును, హిందూరాజ్యమును స్థాపించవలెనని హిందువులును, లోలోపల ఆలోచనలు చేయసాగిరి. అంతట నీవిప్లవభావములనెల్ల నేకోన్ముఖమునకు నడుపశక్తిగల ప్రతిభాశాలురగు విప్లవనాయకులు బయలుదేరి ఈవిప్లవమునకు దోహదముజేసి వలసిన వ్యూహములనెల్లపన్ని విప్లవాగ్నికి చిచ్చు ముట్టించి భారత దేశమున విదేశపరిపాలనము నంత మొందింపదలచిరి.

చూచుచుండగనే భారతదేశమున చాలభాగమును బ్రిటిషు ఇండియాగా జేసివైచిన డల్‌హౌసీ ప్రభువు ప్రయోగించిన రాజ్యతంత్రము అద్వితీయమైనది. 1857లో స్వాతంత్ర్య సమరము రానిచో భారతదేశ పటమంతయు అరుణముగా జిత్రింపబడి యుండెడిదే. పీష్వాబాజీరావు ప్రభుత్వమువారి యనుమతితో నానాసాహేబును దత్తుచేసుకొనెను. అతడు చనిపోవుటకు ముందు తనకిచ్చు 8 లక్షల పింఛనును తన పీష్వా పదవిని తన పుత్రునకివ్వవలసినదని కంపెనీ వారికి అర్జీ పెట్టుకోగా పీష్వాబిరుదు నిచ్చుటకు వీలులేదని చెప్పి పింఛనుసంగతి తరువాత ఆలోచింపబడుననిరి. బాజీరావు 1851 లో చనిపోగా డల్‌హౌసీ ఆ ఫింఛను తీసివేసెను. బాజీరావుపైన ఆధారపడిన అశేషజనులకు జీవనాధారము లేకపోయెను. గవర్నరు జనరలు తీర్మానముపైన నానాసాహెబు కంపెనీ డైరెక్టర్ల కోర్టువారికి అప్పీళ్లు దాఖలుచేసికొనెను. అచ్చట తన పక్షమున పని చేయుట కొరకు తన కొలువులో నుండిన విద్యావంతుడు రాజ్యనీతి విశారదుడు నగు అజీముల్లాఖాన్ అను నొకమహమ్మదీయ యువకుని నానాసాహెబు ఇంగ్లాండుకుపంపెను. ఈ రాయబారి ఇంగ్లాండు చేరులోపలనే 1853 లో కంపెనీ డైరక్టర్లు నానాసాహెబు అప్పీలుత్రోసివేసిరి.

అజీముల్లాఖాను చాలా తెలివైనవాడు. ఇతడు కామన్సు సభానమావేశములకుగూడ బోవుచు తన యజమానికి జరిగిన అన్యాయములను మాన్పుట యెట్లని యోజించుచు అతడిచ్చిన సొమ్ముతో కొన్నాళ్లు ఇంగ్లాండులోనే యుండెను. ఇంతలో

ఇంగ్లాండుకును రష్యాకును క్రిమియను యుద్ధము ప్రారంభమయ్యెను. క్రిమియనుయుద్ధములో ఇంగ్లాండు సైనికులు విశేషనష్టము పొందుచున్న కథల నితడు పార్లమెంటుసభలో విని ఈయుద్ధములో ఇంగ్లాండు దెబ్బతినినచో తన యజమానునికి లాభము కలుగునుగదాయని తలంచుచుండెను. అంతట నీమేధాశాలి ఆ యుద్ధభూమికే తరలిపోయి ఐరోపాలోని వివిధరాజ్యముల జాతివారితో ఆలోచనలు చేయసాగెను. భారతదేశమునందింత గర్వముతో ప్రవర్తించు నీ ఇంగ్లీషు వారీయుద్ధమున నాశనమగుటకు సిద్ధముగా నున్నారని ఇతనికి తోచినది. అచ్చటి పరిస్థితులను జూచి ఈ సమయమున భారతదేశమునగల రాజులును ప్రజలును ఏకమై ప్రయత్నించినచో నీ విదేశీయ ప్రభుత్వమును తొలగింపవచ్చునని యీ కుశాగ్రబుద్ధికి తోచినది. ఈ తలంపులతో నితడు 1856 లో భారతదేశమునకు దిరిగి వచ్చెను. ఇతడు వచ్చిన కొద్ది రోజులకే అజీముల్లాఖానుతో కలసి నానాసాహెబు లక్నోనగరమునకు పోయినాడు. ఎందుకిట్లు వచ్చినాడో నాటి ఆంగ్లేయాధికారులు గ్రహింపలేదు.

నానాసాహెబు కాపురస్థలమగు బీదరు పరగణాయు, అయోధ్య పరగణాయు నిట్లు అశాంతికి నిలయమైయుండగా ఆగ్రా పరగణాయందెల్ల నీ అసంతృప్తి క్రమ క్రమముగా వ్యాపించుచునే యుండెను. పూర్వమునాటి నుండియు ఆరాష్ట్రములందుగల గ్రామ పరిపాలనపద్ధతిలో గ్రామాధికారులు వంశపారంపర్యముగా హక్కుగలిగియుండిరి.

నవీన ఆంగ్లేయ ధర్మములనుబట్టి యీ పద్ధతి యీ పర గణాపరిపాలకుడగు తొమేసన్‌కు రుచింపలేదు. ఈ గ్రామాధి కారుల హక్కుల నితడు తీసివేసెను. అంతట నారాష్ట్ర ములో జవాన్‌పూరు, అజాంగర్, ఆగ్రా, కాన్పూరు, జిల్లాలలో తీవ్రమైన సంచలనము కలిగెను. ఈ చిల్లరగ్రామాధి పతులెల్లరు తరువాత పెద్ద కుట్రదారులతో కలసిరి. ఆగ్రాకు దగ్గఱనే ఝాన్సీ రాజ్యముండెను. ఈ రాజ్యమునకుగూడా నానాసాహెబుకు తటస్థించిన గతియే పట్టినది. వితంతువగు ఝాన్సీరాణి చాలా సద్గుణవంతురాలు. ఆమె నెరిగినంతవరకు దేశప్రజలెల్లరు ఆమెను గౌరవించుచుండిరని అచ్చటి పొలిటికల్ యేజంటుగారే వ్రాసియుండిరి. హిందూధర్మశాస్త్రప్రకార మీామెకు దత్తతాధికారము గలదు. 1854లో నామె భర్త చని పోగా నామె దత్తతచేసికొనదలచినది. డల్‌హౌసీ యందుల కంగీ కరింపక యీ రాజ్యమునకు వారసులు లేనందున కలుపుకొ వచ్చునని యట్లు చేసెను. ఝాన్సీరాణి ఎన్నివిధములుగా మొర పెట్టుకొన్నను లాభములేకపోయెను. అందువలన నెంతో సద్ధర్మ రాలగు నీయమ తరువాత నాంగ్లేయులపాలిటి మృత్యుదేవత యయ్యెను. విప్లవప్రారంభమునకు పూర్వము ఈమెగూడ నానాసాహెబుతో రహస్యాలోచనలు జేసెననుట కాధార ములు కలవు.

ఇట్లీనానాసాహెబును అయోధ్యనవాబుల వంశీయురాలగు బేగంసాహెబాయను మహమ్మదీయస్త్రీయు, నేటి సంయుక్త రాష్ట్రప్రజలును, ఝాన్సీరాణియు ఆంగ్లేయపరిపాలనపై విరో

ధించి ఏకోద్దేశముతో నొక విప్లవ కమిటీగా నేర్పడి దేశము నందు విప్లవాగ్నికి దోహదము చేయసాగిరి. వీరి యుద్దేశముల కానాటి పరిస్థితులు చాల అనుకూలముగా నుండెను. 1857 నాటి స్వాతంత్ర్య విప్లవము వచ్చుటకుగల నిజమైన కారణములను చరిత్రకారులు క్రమక్రమముగా బయల్పరచి యున్నారు. ఈ క్రిందివి ముఖ్యకారణములుగా పేర్కొనబడినవి. *

(౧) అన్యాయపు భూస్వామ్యపద్ధతులు; రైతులు భరింపలేని అత్యధికమగు పన్నులభారము; పన్నులువసూలుచేయుట కవలంబింపబడిన క్రూరవిధానములు; అన్యాయపు రివిన్యూ పరిపాలన. (౨) భారత దేశపరిపాలనలో భారతీయులకు కొంచమైన ప్రవేశ మివ్వక పోవుట. (౩) న్యాయవిచారణ చక్కగా జరుగకపోవుట. అది అత్యధిక వ్యయకారణమై అన్యాయములు హెచ్చుట. పోలీసుల లంచగొండితనము ప్రజాపీడనము. (౪) ఆంగ్లపరిపాలకులకు దేశభాషలు తెలియకపోవుట; దేశవాసులన్న అసహ్యము కనబరచు చుండుట. (౫) ఇంగ్లీషు విద్యావిధానము; మతబోధకుల తంత్రములు. (౬) ముద్రణ స్వాతంత్ర్యమువలన రాజకీయ అభిప్రాయములు వర్ధిల్లుట, (౭) కులములు వర్ణాశ్రమధర్మములు ప్రజలందు ఆవేశమును కలిగించుట. (౮) చలామణి పద్ధతిలోని లోపములు; అందువలన ప్రజలకు కలిగిన నష్టము. (౯) నల్లమందు యిజారాప్రభుత్వము వహించుట చాలమందికి కడుపుమంటగానుండుట. (౧౦) పబ్లికువర్క్సు కాలువలు, చెరువులు, నూతులు అభివృద్ధి చేయకపోవుటవలన

* చూడు ఆండర్సన్ సుబేదార్ గార్ల గ్రంథము

రైతులు దరిద్రులగుట. (౧౧) ఇటీవలి రాజ్యాక్రమణమువలన సంస్థానాధీశులు ప్రజలు కలవరముజెందుట. (౧౨) హిందువుల వారసత్వధర్మమును మార్పుజేసి క్రైస్తవులైనను ఆస్తి హక్కులు పోవనుట. (౧౩) సతారా, నాగపూరు, కర్ణాటక, ఝూన్సీ, తంజావూరు, అయోధ్యరాజ్యములను రూపుమాపుట. (౧౪) వంగరాష్ట్ర సైన్యమునకు క్రమశిక్ష లేకుండుట; ఉద్యోగులు సివిలుపనులకు నియమింపబడుట; ఐరోపా సైనికులు తక్కువగానుండుట. (భారతదేశమున ఆనాటికి 40 వేలమంది మాత్రమే యుండిరి.) (౧౫) పందికొవ్వు, ఆవుకొవ్వు తోటాల నుపయోగించుటకు హిందూమహమ్మదీయ సిపాయిలకు స్వధర్మ విరుద్ధమై అసహ్యమగుట (౧౬) 1856 జులైలో సైనికులు సముద్రప్రయాణము చేయువలెనను శాసనము. (౧౭) విదేశీయుల కుట్రలు: పర్షియా రష్యాదేశములు ఆంగ్లేయ ప్రభుత్వమును తిరుగదోడ దలచుట. (౧౮) మహమ్మదీయుల అసంతృప్తి; అయోధ్యనవాబు బీగముల కుట్రలు.

కంపెనీవారి లోపములకన్నను, వారి తాబేదారుల దుష్పరిపాలనముకన్నను, పార్లమెంటువారి ఉపేక్షాభావము అత్యంత గర్హ్యమైనదని చెప్పక తప్పదు. మద్రాసులో "టార్చర్ కమిషన్" వారు అచ్చట జరుగుచున్న ఘోరవిషయముల నెన్నో బయల్పరచినను పార్లమెంటువారు కన్ను తెరువలేదు. ఇండియా సంగతులు పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడెల్ల సభ్యులు విందారగింపుసమయముగా నుపయోగించుకొనుటకు బయటకు పోవుచుందురు! మీరతులోను, కాన్పూరు

లోను సాక్షాత్తుగా రక్తపాతము జరుగువరకు నీ భారతదేశ సమస్యయనునది తమ తాబేదారుల దుష్పరిపాలనమువలన కలిగిన విప్లవమనిగాని ఈదేశమనునది కోట్లకొలది జనులుగల విశాలరాజ్యమునకును అందలి ప్రజలకష్టసుఖములకును సంబంధించిన గొప్పసమస్యయనిగాని పార్లమెంటులో నే యాంగ్లేయ సభ్యుడును తలంపడయ్యెను. ఇంతటి యుపేక్షాభావమే బ్రిటిషు పరిపాలనలోని అన్యాయములకు మూలకారణముగనుండెను.

## II

ఈవిప్లవవ్యూహమునకెంత జాగ్రత్తగా ఆలోచనలు జరిగెనో,ఎంతరహస్యముగాకుట్రలుజరిగెనో తెలిసికొనుటసాధ్యము కాదు. కొన్ని నెలలనుండి యీ రాబోవు తుపాను లక్షణములు కనబడుచునేయుండెను.ఉత్తరహిందూస్థానములోనిదండుప్రదేశములో సంకేతపుమంటలు వేయబడుచుండెను. దీనిభావము నాంగ్లేయు లెరుగరు. ఇంగ్లీషు ప్రభుత్వము 100 సంవత్సరములలో పోవునని అనేకులు భవిష్యత్తును చెప్పుచుండిరి. మహమ్మదీయ సామ్రాజ్యము మరల స్థాపింపబడినదని ఢిల్లీ జుమ్మామసీదు గోడలపైన వ్రాయబడి ప్రకటనచేయబడెను. గ్రామములవెంట చపాతీలను ఉప్పు అందించినట్లు అందించిరి. ఇది ఆంగ్లేయులు గమనింపలేదు. ఒకడు పండ్రెండు చపాతీలుచేసి దానిలో రెంటిని ఉంచుకొని తక్కినవానిని ఇంకొకనికి పంపుచుండును. ఆ రెండవ వాడు మఱల 12 చేసి అట్లే యితరులకు పంపును. దీని అంతరార్థమును పలువురు పలువిధములుగా తలంచుచుండిరి.

ఇట్లు సర్వమును సంసిద్ధముచేసికొని దేశములోని సిపాయిల పటాలములు తిరుగుబాటుచేయుటకు,విప్లవారంభమునకు, సుముహూర్తము నేర్పాటుచేసిరి. కాని మఱల ఏదో విఘాతముకలిగి సుముహూర్తమును మార్చిరి. ఇట్లు కొన్నిమారులు జరిగినది. ఈ ఆలోచనలు, సంచలనము వలన ప్రభుత్వాధికారులు మేల్కొని యుండవలసినదే గాని మీరతులో తిరుగుబాటు ప్రారంభమగువరకు నిది తిరుగుబాటని గ్రహింపలేదు. లక్నోలో వధలు జరుగువరకు నిది విప్లవమని గ్రహింపలేదు. ఆనాడారణరంగమున పాల్గొనినవారిది నిజముగా విప్లవమని గ్రహింపలేకపోయిరనియే చరిత్రకారుడగు కర్నల్ మల్లెసన్‌గారి యభిప్రాయము. నలుబదివేల ఆంగ్లేయదళములతోను కొన్ని నేటివు దళములతోను సిక్కుల సహాయముతో అణచివేయబడిన ఈ సిపాయిల విప్లవమును నిజముగా నొక స్వాతంత్ర్య యుద్ధమనుటకు వీలులేదని తాంప్సన్ గెరాట్ గార్ల అభిప్రాయము.

ఈమహావిప్లవమున కేర్పరుపబడినదినము,ముహూర్తము రాకమునుపే ఇది ప్రజ్వరిల్లినది. పందికొవ్వు ఆవుకొవ్వు పూసిన తోటాలనిచ్చి తమ్ము మతభ్రష్టుల చేయదలచిరని తలచిన సిపాయిలలో నాకస్మికముగా నిప్పు ముట్టుకొనినది. వీరు అనుకొనిన ప్రకారము జరుగక ఆకస్మికముగ ఒక సిపాయిల పటాలములో నొక తిరుగుబాటు ప్రారంభమై వీరు పన్నిన విప్లవవ్యూహములెల్ల వృథలైపోయెను. దేశములోని వివిధశక్తులు భిన్నములైపోయి, సంస్థానాధీశులు ప్రజల విప్లవ

సైన్యములు ఎవరికివారు విప్లవయుద్ధము చేయసాగిరి. అందువలన యీ విప్లవము యేకోన్ముఖమునకు రాకపోయెను. మీరతు, లక్నో, కాన్పూరు, ఢిల్లీబలము లేప్రిక్కవి యా ప్రిక్కనే పోరాడసాగెను. వేసవి మొదలు నాలుగునెలలు పోరు తీవ్రమయ్యెను. ఆంగ్లేయులు నిరాసచెందిరి. ఇట్టి స్థితిలో వీరి యదృష్టవశమున విప్లవనాయకులందు సైన్యములందు ఐకమత్యముతగ్గెను. సిక్కులింగ్లీషువారికితోడైరి. బ్రిటీషువారు సిక్కులస్వాతంత్ర్యము హరించి పదేండ్లయిన గాలేదు. వీరేల నాంగ్లేయుల కిట్లుతోడ్పడిరి? దీనికి గారణము లేకపోలేదు. మొగలుసామ్రాజ్యపు తుదిదినములలో విషయలోలురగు చక్రవర్తులీసిక్కుల గురువులను నిష్కారణముగావధింపగానీసిక్కులు ఎన్నటికైన ఢిల్లీ ప్రవేశించి కొల్లగొందుమని ఆనాడే ఘోర ప్రమాణములు చేసియుండిరి. ఆయవకాశము నేడు లభింపగా వీరు దేశస్వాతంత్ర్యము మాటతలపెట్టుదురా? అంతట నీసిక్కులాంగ్లేయుల పక్షమును వహించి అత్యద్భుతముగా పోరాడి వారి యాపద గడవబెట్టిరి. ఇదియే విప్లవము విఫలమగుటకు ముఖ్య కారణము. ఈ మహాస్వతంత్రయుద్ధమున నానాసాహెబు, ఝాన్సీ, లక్ష్మీబాయియు ఇతర మహావీరులు నతి ధైర్యముగా పోరాడిరి. లక్ష్మీబాయి రణరంగముననే ప్రాణముల బాసెను. విప్లవసైన్యములు చెల్లాచెదరయ్యెను.

కూకటి వేళ్ళతో పెల్లగించి వేయుబడుటకు సిద్ధమైన విజాతీయ పరిపాలన, చావు తప్పి కన్ను లొట్టవోయినట్లు ఈవల బడినది. బ్రతికి బయటపడిన ఆంగ్లేయులకు ధైర్యము

వచ్చినది. అంతట వీరికి తీవ్రవిషాదమును రోషమును గలిగెను. ఈ విప్లవమును లేవదీసినందుకు అందరికిని తగుశాస్తి గావింప వలెనని క్రోధావేశముగలిగి దేశములో చిందులు ద్రొక్కుచు నిరాయుధులును నిరపరాధులును అగు స్త్రీపురుషులను పసి పిల్లలను దొరకినవారి నెల్లరను క్రూరముగా వధింపసాగిరి. తామేదో మహాయుద్ధమునకు తరలిపోవుచున్నట్లు సైన్యము లను నలుప్రక్కలకు తీసికొనిపోయి ఇంక నెవ్వరో విప్లవకారులు మిగిలియున్నారని చెప్పుచు, వారి నణచు నెపమున పట్టణము లను పల్లెలను భీభత్సము చేయసాగిరి. ఈసమయమున జరిగిన రక్తపాతము, ఘోరాన్యాయములు, క్రూరకృత్యములు, అసలు విప్లవమున జరిగినవాని కన్న వేయిమడుగు లధికముగా నుండె ననియు, విప్లవసైన్యములు చేయని అనేక దుష్కృత్యములను ఆంగ్లేయులు చేసిరనియు ఆనాటి ఆంగ్లేయచరిత్రకారులే ఒప్పు కొని యున్నారు. విప్లవమునందు భారతీయసైనికులు స్త్రీలను అవమానించినారని వ్రాసిన వ్రాత లబద్ధములని ఆంగ్లేయ చరిత్రకారులే ఒప్పుకొన్నారు. ఆంగ్ల సైనికులు కనపడినవారి నెల్లరను చెట్లకొమ్మలకు వ్రేలాడదీసి చంపిరి. తుపాకులతో గాల్చిరి. స్త్రీలను జెఱచిరి. చిత్రవధలు గావించిరి. తమ యక్కసు నెల్ల దీర్చికొనిరి. నిజముగా విప్లవము అణగిపోయిన చాలకాలమువరకు వీరు దేశములో నిల్లు భీభత్సము గావించు చునేయుండిరి. ఎవ్వరైన నిష్పక్షపాతులగు నాంగ్లేయులు దీనిని గూర్చి మందలించినచో 'మీకు తెలియదు ఊరకొను' డనిరి. ఇంగ్లాండువారికి, తాము ఇంక నెంతో కష్టపడి విప్లవాగ్నిని

చల్లార్చు చున్నామని తెల్పుచుండిరి. ఈ అత్యాచారముల కెల్ల చేయబడిన ఖర్చుతో గలిసి విప్లవము నణచుటకు నలుబది కోట్లరూపాయలు వ్యయమైనట్లు అంచనా వేసి దానిని భారతీయ ప్రజల నెత్తిపైన బడవేసిరి. ఇంత ఘోరమైన విప్లవమువచ్చి ఇంత రక్తపాతమైనపిదప శాంతియేర్పడునప్పటికి-ఆంగ్లేయుల కోపాగ్ని చల్లారునప్పటికి చాల కాలము పట్టినది. (చూడు : కే. మల్లెసనుల ఇండియన్ మ్యూటినీ)

## III

కంపెనీవారి దుష్పరిపాలనము మాన్పుటకు వివిధరాష్ట్రములో శాంతియుతముగా లక్ష్మీనర్సుమున్నగువారు ఎంతకష్టపడిపనిచేసినను ఇంగ్లాండువారికి చీమయైన కుట్టినట్లు లేదు. భారత దేశము నుండి వారికి వచ్చిన విన్నపములు, మహాజరులు, బుట్టదాఖలు చేసియుండిరి. అంతట నా కార్యమును సాధించుటకే హింసా పద్ధతులతో దారుణవిప్లవము జరుగగా తత్క్షణమే యీ లక్ష్మీనర్సు మున్నగు అహింసావాదులు ఏమి కోరుచుండిరి? దేశములో నింత యశాంతి ఎందుకు ప్రబలెను? ఇంత దారుణ విప్లవము ఎందుకు జరుగవలసి వచ్చెను? అను ఆలోచనలు కలిగెను. చాలకాలమునుండి కంపెనీవారి దుష్పరిపాలనమును గూర్చి చేయబడుచున్న ఫిర్యాదులలో కొంతయైన నిజ ముండవలెనను ఊహా, ఇంగ్లాండు దేశీయులకును పార్లమెంటువారికిని కలిగెను. వా రప్పుడు పూర్వము లక్ష్మీనర్సు మున్నగువారు పంపిన అర్జీలు మహజర్లు బయటకుదీసి భారత దేశ వ్యవహారము లెల్ల పరిశీలించి భారతీయుల బాధలు నిజమేననియు వారు

కోరు రాజ్యాంగ సంస్కరణములలో కొన్నిటినైన గావించుట యవసర మనియు నిశ్చయించిరి. భారతదేశములో వ్యాపించి యున్న తీవ్రమైన అశాంతిని కేవలము దారుణకృత్యముల తోను పశుబలముతోను అణచివేసి నంతమాత్రమున లాభము లేదనియు, దాని కారణములలో కొన్నిటినైనను తొలగించి నిజమైన శాంతిని కలుగజేయుట యవసరమనియు గ్రహించిరి. అంతట భారత దేశములోని కంపెనీ ప్రభుత్వమును రద్దుపరచి యిక ముందు దేశాక్రమణము జేసి రాజ్యములను కలుపుకొన మనియు ఉన్న సంస్థానాధీశులతో నెయ్యమును పాటింతు మనియు దేశప్రజల హక్కులను గాపాడెదమనియు దేశప్రజల మతములతో జోక్యము కలిగించుకొనమనియు ఇంక నేక్షేమో వాగ్దానములుచేయుచు తమ రాణీచేత ప్రకటింపజేసిరి.

"స్వదేశసంస్థానాధీశుల బిరుదులను, అధికారములును యథాప్రకారము ఆదరించెదము. వారు కంపెనీవారితో చేసి కొనిన ఒడంబడికలన్నియు మన్నించెదము. క్రొత్త రాజ్యము లను కలుపుకొని రాజ్యాక్రమణముచేయము; భారతీయుల ప్రాచీన సాంప్రదాయములను ఆచారములనుబట్టియే శాసన ములను చేయుదుము; క్రైస్తవమత మవలంబింపుడని నిర్బం ధింపము; ప్రజల ఆచారములకును, మతసిద్ధాంతములకును భంగముకలిగింపరాదని మాయుద్యోగులకు కట్టడిచేయుదుము; జాతి మత వర్ణ భేదములతో నిమిత్తములేకుండా శక్తిసామ ర్థ్యములనుబట్టియే ఉద్యోగముల నిచ్చెదము. భూస్వాములకు వంశపారంపర్యముగా సంక్రమించుహక్కులను కాపాడెదము.

దేశములో శాంతికలుగగానే ప్రజాసౌకర్యములు చేయుదుము" అని గూడ విక్టోరియారాణి ద్వారా ప్రకటన గావించిరి.

భారతదేశములో తన పరిపాలన స్థాపింపబడినదని 1858వ సంవత్సరము 1వ నవంబరు తారీఖున ఇంగ్లాండు దేశపు రాణియగు విక్టోరియా ప్రకటన గావించుచు "మా పరిపాలన క్రిందనున్న యితర రాజ్యభాగములందలి ప్రజల విషయము నందువలెనే భారతదేశపుప్రజల విషయమునగూడ మేము ప్రభుత్వపు బాధ్యతలను వహించి ఆ బాధ్యతలనెల్ల పరమేశ్వరానుగ్రహమువల్ల సక్రమముగ కొనసాగింప నిశ్చయించితిమి." అని దానిలో నొక వాగ్దానము గావించెను. మరియు నామె యీ మార్పునుగూర్చి డర్బీప్రభువుకు వ్రాయుచు "భారతదేశ ప్రజలు బ్రిటిషు సామ్రాజ్యములోని తక్కిన భాగములందలి ప్రజలతో సరిసమానులుగ చేయబడుటవలన వారికి లభించు విశేషహక్కులును, నాగరకత యభివృద్ధిచెందుటవలన వారికికల్గు విశేషలాభములును వారికి తెలియచెప్పుటయే" తన ప్రకటనయొక్క ముఖ్యోద్దేశమనియు నామె వెల్లడించెను.

సిపాయివిప్లవముయొక్క రాజకీయఫలితము లింకొక చోట చర్చింపబడినవి. 1858 లో భారతదేశపు పరిపాలనయం దొక క్రొత్తఘట్టము ప్రారంభమైనట్లుగా యెంచవచ్చును. ఏది యెట్లున్నను భారతదేశమునకు అభయమొసగబడుచు నొక రాజ్యాంగపత్రము వచ్చినది. ఇదియే రాజ్యాంగసంస్కరణలకు దారిచూపినది.

సిపాయిలవిప్లవము తరువాత చేయబడిన క్రొత్తరాజ్యాంగ

చట్టముప్రకారము భారతదేశ ప్రభుత్వమునకు శాసననిర్మాణాధికారమునిచ్చి చట్టనిర్మాణసభలలో కొందరు భారతీయులనుగూడా నియమింపదలచిరి. ప్రజాప్రాతినిధ్య పరిపాలన మేర్పడకపోయినను ఆనాటి కిది కొంత బాగుగనే యుండెను.

## IV

## వి క్టో రి యా రా జ్ఞి ప్ర క ట న
(1858 నవంబరు 1 వ తేదీ)

"గ్రేట్ బ్రిటన్ (ఇంగ్లాండు స్కాటులాండు వేల్సు) రాజ్యములకును, ఇంగ్లాండుకు ఐరోపాలోను, ఆశియాలోను, ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియాలలోను గల వలసరాజ్యములకును సామంత రాజ్యములకును దైవకృపవలన రాణియు మతసంరక్షకురాలు నగు విక్టోరియా అను పేరుగల మేము ఇదివరకు మా తరఫున ధర్మవిశ్వాసులుగా తూర్పుఇండియా కంపెనీ పాలించు భారత దేశములోని రాజ్యభాగములను, పార్లమెంటులో సమావేశమైన ప్రభువులు కామన్సువారి సలహాతోను, అంగీకారముతోను ఇకముందు మేమే స్వయముగా పరిపాలించుటకు నిశ్చయించి యీ ప్రకటన చేయుచున్నాము.

కాబట్టి ఆరాజ్యభాగములందుగల ఆయా ప్రజలెల్లరును మాయెడల విశ్వాసము కలిగి మాయెడలను మా వారసులపట్లను మాతదనంతరకర్తలపట్లను విధేయతకలిగి యుండవలసినదనియు, మా తరఫున నా రాజ్యములను పరిపాలించుటకు మేము ప్రభుత్వము చేయుటకు నియమించువారి అధికారమునకు లోబడి యుండవలసిన దనియు కోరుచున్నాము.

మా సన్నిహితుడగు చార్లెస్ జాన్ వైకౌంటు క్యానింగు యొక్క రాజభక్తియందును సామర్థ్యమందును తెలివితేటలందును మాకుగల నమ్మకమునుబట్టి అతనిని మాయొక్క ప్రథమ రాజప్రతినిధిగా నియమించి మా తరఫున నా రాజ్యములను పరిపాలించుటకు నియోగించినాము. మా ప్రధాన రాజ్యాంగ కార్యదర్శులగు క్యాబినెట్టు మంత్రులలో నొకరిద్వారా అతనికప్పుడప్పుడు వచ్చు ఉత్తర్వులకు లోబడి అతడు పరిపాలించును.

తూర్పు ఇండియా వర్తకసంఘము వారి కొలువులో వివిధశాఖల యుద్యోగములందు సివిలు మిలిటరీ శాఖలలో యుద్యోగములందు నియమింపబడి యిప్పుడు పనిచేయు చున్నవారినెల్లరను మా చిత్తమునకును, యికముందు చేయబడు శాసనములకును రిగ్యులేషనులకును లోబడి యిందు మూలముగా ఖాయపరచుచున్నాము. భారతదేశ స్వదేశసంస్థానాధీశులతో తూర్పు ఇండియా కంపెనీవారి హయాములో నిదివరకు చేయబడిన ఒడంబడికలను, సంధులను మేము అంగీకరించుచున్నామనియు వాని ప్రకారము జరుపవలయుననియు నిందుమూలముగా ప్రకటించుచున్నాము.

ప్రస్తుత రాజ్యభాగముల నికముందు పెంచి విస్తరింపజేయు ఉద్దేశము మాకులేదు. మా రాజ్యములపైన మా హక్కులపైన ఇతరులెట్టి యాక్రమణలు చేయుటను మేము సహింపము. ఇతరులపై నట్లు జరిగించుటకు నంగీకరింపము. స్వదేశసంస్థానాధీశులహక్కులు, దర్జాలు గౌరవమును మావాని వలెనే మేము మన్నింతుము. వారును మా ప్రజలును గూడా అంత

రంగిక శాంతి సత్పరిపాలనములవలన కలుగు అభివృద్ధిని, సాంఘికాభివృద్ధిని కలిగియుండవలెనని మాయుద్దేశము. మాయొక్కయితర ప్రజలపట్ల మేమెట్టి విధ్యుక్త బాధ్యతలను కలిగియున్నామో అట్టి బాధ్యతలనే భారతదేశములోని మా నేటివు ప్రజలపట్లకూడ కలిగియుందుము. భగవంతుని కృపవలన మేము మా బాధ్యతల నెల్ల సక్రమముగాను మనఃపూర్వకముగాను నిర్వర్తింతుము.

క్రైస్తవమత ధర్మముయొక్క సత్యముపైన సంపూర్ణ విశ్వాసమును మేము కలిగియుండియు, మతమునందలినమ్మకము వలన కలుగు శాంతికి కృతజ్ఞులమైయుండియు, మా మతముల నితర ప్రజలపైన బలవంతము చేయుటకు మాకు హక్కుగాని కోరికగాని యున్నదని మేము చెప్పదలప లేదు. ఏమత విశ్వాసమునుగాని ఆచారములనుగాని పురస్కరించుకొని ఎవరికిని మేము అధికాదరమును అనాదరణమును చూపము. అందరును సమానముగా శాసనధర్మములయొక్క సంరక్షణను పొంది సుఖముగా నుండగలరు. మా క్రింద నధికారము వహించువారెల్లరును మా ప్రజలయొక్క మతాచారములతో నెట్టిజోక్యము కలిగించుకొనగూడదు. వారట్లు చేసినచో మాయనుగ్రహమునకు పాత్రులు కాజాలరని హెచ్చరించుచున్నాము. ఏజాతి మతములకుజెందినవారైనను తగిన విద్య సమర్థత, నమ్మకము గల మా ప్రజలెల్లరు మా కొలువులోని యుద్యోగములందు నిష్పక్షపాతముగా వీలైనంతవరకు నియోగింపబడుటయే మా యభిమతము. వంశపారంపర్యపు హక్కులుకలిగిన భూములందు

భారతీయులకుగల ప్రేమను మేము ఎరుగుదుము. ఈభావమును మేము మన్నింతుము. ప్రభుత్వము వారి న్యాయమైనహక్కులకు లోబడి అందుకు సంబంధించిన ప్రజల హక్కులనెల్ల సంరక్షింతుము. శాసనధర్మవిధులను చేయునప్పుడును వాని నమలు జరుపునప్పుడును భారతీయుల కనాదిసిద్ధముగానుండు హక్కులు ఆచారములు సామాన్యముగ గమనింప వలయుననియే మా తలంపు.

కేవలము స్వార్థము నాశించినవారు కొందరు తమ తోడి ప్రజలకు అబద్ధపుమాటలు చెప్పి మోసగించి బహిరంగముగా తిరుగుబాటును ప్రోత్సహించినందువలన కలిగినకీడులకు దురవస్థలకు మేము విచారించుచున్నాము. ఆ పితూరీని యుద్ధ భూమిలో అణచివేయుటవలన మాశక్తి ప్రదర్శింపబడినది. మోసపోయినవారు మరల సన్మార్గమునకు వత్తురేని వారి నేరములను మన్నించి మాకరుణకు పాత్రులుగ జేయుదుం.

ఇకముందు రక్తపాతము జరుగకుండగను మా భారత దేశరాజ్యములందు శాంతిని స్థాపించుటకును, మా రాజప్రతినిధి అప్పుడే కొన్ని షరతులకు లోబడి యొక రాష్ట్రములో సర్వ జన క్షమాపణను ప్రకటించియున్నాడు. ఇదివరకు జరిగిన దురదృష్టకరమైన కలతలలో మా ప్రభుత్వముపట్ల నేరములు జేసినవారి విషయములో కొన్ని షరతులకు లోబడి క్షమాపణ ప్రకటించినాడు. మన్నించుట కెంతమాత్రము వీలులేని నేరములు జేసినవారి విషయములో విధింపబడు శిక్షలను ప్రక

టించినాడు. మా రాజప్రతినిధి జేసిన ప్రకటనలను మేము ఆమోదించుచున్నాము. అదిగాక యిప్పు డీ క్రిందిసూచనను జేయుచున్నాము. బ్రిటిషుప్రజలను హత్యచేసిన నేరములు చేసినట్లు స్థిరపడినవారిని తప్ప తక్కిన నేరములు చేసినవారి నెల్లరను మేము క్షమింప దలచినాము. హత్యగాండ్రను మాత్రము క్షమించుటకు వీలులేదు.

హత్యగాండ్రని యెఱిగియు, వారికాశ్రయమిచ్చినవారిని, విప్లవమునకు నాయకులుగా గాని ప్రోత్సాహకులుగా గాని యుండినవారిని, వారియొక్క ప్రాణములను మాత్రము రక్షించెదము. వారికి శిక్షలువిధించుటలో వీరు రాజద్రోహము చేయుటకుగలకారణసందర్భములన్నియు ఆలోచింపబడును. కేవలము అబద్ధపు ప్రచారమువలన మోసపోయిన వారిపట్ల చాలదయ దాక్షిణ్యము చూపబడును. ఇంకను మాప్రభుత్వముకు వ్యతిరేకముగా పోరాడుచున్నవా రెల్లరు వెంటనే తమ యిండ్లకువచ్చి సన్మార్గజీవనమునకు మరలినచో మేము క్షమింతుమని యిందు మూలముగా ప్రకటించుచున్నాము. రాబోవు జనవరి మొదటి తేదీలోపుగా నీ షరతులు మన్నించినవా రెల్లరు క్షమింపబడుదురు. పరమేశ్వరుకృపవలన శాంతికలుగగానే భారత దేశము యొక్క పరిశ్రమలకెల్ల ప్రోద్బలము చేయుటకును ప్రజోపయుక్తములును, ప్రజాభివృద్ధికరములు నగు కార్యములను చేయుటకును ఆ రాజ్యము లందందు మా ప్రజలయొక్క క్షేమలాభములకొఱకా దేశమును పరిపాలించి ప్రభుత్వము నడుపుటకును మేము నిశ్చయించినాము. వారి అభివృద్ధిలోనే మాకు బలము,

వారి సంతృప్తిలోనే మాకు శ్రేయము; వారి కృతజ్ఞతలోనే మాకృతకృత్యతయు నుండును. సర్వశక్తిస్వరూపుడగు భగవంతుడు మాకును మాక్రింది యధికారులకును ఈ మా యాశయములను మాప్రజల క్షేమముకొఱకు చక్కగా నెరవేర్చునట్టిశక్తిని మాకొనగూర్చునుగాక!"

భారతదేశమున

# బ్రిటిష్ రాజ్యతంత్రయుగము

## తృతీయ భాగము

## ఇంగ్లీషు దొరతనము : సామ్రాజ్యతత్త్వము

## 1858—1937

### మొదటి ప్రకరణము

### జాతీయ చైతన్యము

I

సిపాయిల విప్లవమువలన కలిగిన రాజకీయ ఫలితములలో దేశప్రజల స్వాతంత్ర్య స్వత్వములకు, ప్రజాభిప్రాయ ప్రకటనకు భంగకరమగు "ప్రెస్సుఆక్టు" అనబడు ముద్రణ శాసనము చేయబడుటయొకటి. భారత దేశ స్వాతంత్ర్యోద్యమము నరికట్టుటకే యిది చేయబడినది. ఈ యభిప్రాయముతోనే ఇరువదేండ్ల తరువాత గవర్నరుజనరలుగావచ్చిన లిట్టను దేశభాషలలోని వార్తాపత్రికలనునిరోధించు శాసనము జేసినాడు. ఇంకను అనేక స్వాతంత్ర్య నిరోధకశాసనములు చేయబడినవి.

విప్లవము నణచివేయుటకై సైనికవ్యయము 40 కోట్ల రూపాయిలుగా అంచనావేయబడిన యాభారము, కంపెనీవారితర యుద్ధములకొరకుచేసిన ఋణభారము, భారత దేశ ఆదా

యములపైన బద్ధత చేయబడినది. ఇట్లు కంపెనీవారి పరిపాలన పోవునప్పటికి 112 కోట్ల రూపాయిల ఋణము మన దేశము పైనబడి దానిపైన వడ్డీ మనము చెల్లించవలసివచ్చితిమి. కంపెనీ వారి ఆస్తి కొన్నందుకైన ఖర్చు, తరువాత గవర్నరుజనరలు చేసిన యుద్ధముల ఖర్చులు, అత్యధికవ్యయముతో నిర్మింపబడిన రైలుదారిఖర్చులు, కలిసి ఈ ఋణభారము క్రమక్రమముగా వృద్ధియై సాలియానా 60 కోట్ల రూపాయల చొప్పున వడ్డీలు చెల్లించగా కూడా నేటికి రూ 1200 కోట్లు మిగిలినది.

సిపాయిల విప్లవము తరువాతనే భారతదేశ ప్రజలు భరించవలసిన పన్నులధికము చేయబడి అవి నానాటికి పెరిగినవి. సిపాయివిప్లవమువలన దేశాదాయములో లోటు వచ్చినదని తాత్కాలికముగా ఆదాయపుపన్ను అనబడు క్రొత్త పన్ను విధించుట మొదలిడిరి. ఆ పన్ను నాటికి నేటికి తీసివేయబడలేదు. దేశప్రజలకు విద్యకు వైద్యమునకు ఇతర సౌకర్యములకు సొమ్ము లేదనిరి. దేశక్షేమముకొరకని సైనిక వ్యయము మాత్రము అత్యధికము జేసిరి. జాగ్రత్త కొరకని ఆంగ్లేయ సైనికుల సంఖ్యను వృద్ధిజేసిరి.

సిపాయి విప్లవానంతరము బ్రిటిషువారు సివిల్ క్రిమినల్ వ్యవహార ధర్మవిధులను శిక్షాస్మృతిని క్రోడీకరించిరి. ఇట్లు 1860 లో పీనల్‌కోడ్ 1861 లో క్రిమినల్ ప్రొసీజర్‌కోడ్డును క్రోడీకరింపబడినవి. శివిల్ ప్రొసీజర్ కూడా నిర్మింపబడినది. సాక్ష్యస్మృతి విధులుకూడా సంపుటీకరింపబడినవి. 1861 లో ప్రాతన్యాయస్థానములకు బదులు ఆంగ్లరాణి ఫర్మానాక్రింద

నేటి హైకోర్టులను స్థాపించుచట్టము చేయబడి మొదటి హైకోర్టు కలకత్తాలో స్థాపింపబడినది.

ఈ విప్లవానంతరమే బ్రిటిషువారీ దేశపు ప్రభుత్వోద్యోగములనుగూర్చిన నిబంధనలను క్రమబద్ధముగ జేసిరి. ఇండియన్ సివిల్ సర్వీసు ఉద్యోగములు కేవలము ఇంగ్లాండులో నియమింపబడు ఐ.సి.యస్ వర్గము వారికే ప్రత్యేకించి, తక్కిన ఉద్యోగముల నందరికిని అందుబాటుజేసిరి. ఈ ఐ. సి. యస్. ఉద్యోగుల జీతములు, అలవెన్సులు, పింఛనలును అత్యధికముగా పెంచబడెను. విప్లవమునకు ముందుగానే విద్యావిధాన సంస్కరణమును గూర్చి చేయబడిన సూచనలనుబట్టి విశ్వవిద్యాలయములు స్థాపింపబడెను. ఈ సమయముననే క్రొత్త శాసన సభలను నిర్మించుచు 1861 లో నొక చట్టమును చేయబడెను.

ఆనాటికే భారతదేశ ప్రజలస్వాతంత్ర్యముల నణచివేయు శాసనము లనేకము లమలులోనుండెను. ఎట్టి విచారణ లేకయే రాజద్రోహము గావించెనను అనుమానమున్నచో పట్టుకొని ప్రవాసమంపుటకు 1818లో వంగరాష్ట్రపు మూడవ రెగ్యులేషన్; మద్రాసురాష్ట్రపు రెండవ రెగ్యులేషను; బొంబాయి రాష్ట్రపు ఇంకొక రెగ్యులేషను;ల తోపాటు దేశములోని రాజకీయపరిజ్ఞానము హెచ్చుటచూచి 1850 లో మరికొన్ని నిర్బంధకరములైన శాసనములు చేయబడినవి. విప్లవానంతరము చేయబడిన ప్రజాస్వాతంత్ర్య నిరోధక శాసనములకు మితియే లేదు. అతి నిపుణముగా శిక్షాస్మృతి సవరింపబడి 1860 నాటికి పీనలు కోడ్డుగా శాసింపబడినది. 1861లో క్రిమినలు న్యాయవిచారణ

వ్యవహారధర్మములు క్రిమినలు ప్రొసీజరుగా నిర్మింపబడినవి. ఈలోపుగానే 1857లో ప్రెస్‌చట్టము, స్టేటునేరముల చట్టము, 1858లో స్టేటుప్రిజనర్ల చట్టము, 1858లో ప్రభుత్వముపైన తిరుగబడు పితూరీదారుల ఆస్తినిలాగుకొనుచట్టము, 1860లో ఆయుధ నిషేధచట్టము, 1861 లో శిక్షార్థపు, ప్యూనిటివ్ (పోలీసు) చట్టము శాసింపబడినవి. 1867లో ప్రెస్సులు, బుక్కుల, రిజిస్ట్రేషనుచట్టము, 1878లో దేశభాషాపత్రికలచట్టము, 1876లో నాటకప్రదర్శనముల చట్టము, ప్రజాభిప్రాయము నణచు క్రొత్త శృంఖలములుగా జేయబడెను. ఈ దేశభాషాపత్రికల శాసనము ప్రభుత్వ విమర్శలజేయు పత్రికాధిపతులపైన ముద్రాలయముపైన ప్రయోగింపబడి కొందరు శిక్షింపబడిరి. ఇది బహిరంగ ప్రజాభిప్రాయమునకు ఆటంకము కలిగించి రహస్య విప్లవమార్గములకు ప్రోత్సాహ మొసగెను.

## II

భారతదేశమున ఆంగ్లేయవిద్య యభివృద్ధిగాంచుటవలన 1870 నాటినుండి దేశములో రాజకీయపరిజ్ఞానముకూడ క్రమక్రమముగా అభివృద్ధి గాంచుచుండెను. 1875 నాటికి భారతీయులు నడుపు ఆంగ్లేయపత్రికలు గాక దేశభాషలందు కూడ 475 పత్రికలు వెలసి ప్రజాభిప్రాయమును వెల్లడించుచుండెను. 1878 లో హిందూపత్రిక ఒక వారపత్రికగా జి. సుబ్రహ్మణ్య అయ్యర్, న్యాపతి సుబ్బారావు పంతులుగార్లవల్ల స్థాపింపబడెను. 1884 లో నిది వారమునకు మూడు సార్లు ప్రచురింపబడుచు 1889 లో దినపత్రికయై జాతీయ ప్రజాభి

ప్రాయమునకు తోడ్పడుచుండెను. అంతవరకు జరిగిన సభల వలన పత్రికలయొక్క విమర్శలవలన భారతదేశమునందు కొంత జాతీయ చైతన్యము కలుగసాగెను.

దేశములో వివిధ ప్రాంతములందు రాజకీయార్థిక ప్రజాభిప్రాయము కలిగించుటకు సభలు స్థాపింపబడసాగెను. వంగరాష్ట్రమున ఇంపీరియల్ అసోసియేషన్ 1876 లో స్థాపింపబడెను. దీనికి మూలకారకుడు సురేంద్రనాథ బెనర్జీ యని చెప్పవచ్చును. ఇతడు మొదటి భారతీయ ఐ. సి. యస్. ఉద్యోగి. ఇతనిని ప్రభుత్వములోని తెల్లవారు అనేక విధములుగా బాధించి తుదకు 1874 లో ఉద్యోగము వదలుకొనునట్లు చేసిరి. భారతీయులు ఐ. సి. యస్. చదువుటకు ఇంగ్లాండు పోవలసి యుండెను. ఇది మన ఆచార వ్యవహారములందు పొసగదు. అట్లు పోవదలచిన వారికిగూడ ఆటంకము కలుగచేయుటకు ఆపరీక్షకు పోవలసిన వయస్సు 19కి తగ్గించిరి. అంతచిన్నవారెట్లుపోగలరు? ఇది అన్యాయమని ప్రజాభిప్రాయమును కలిగించుటకు సురేంద్రనాథబెనర్జీ దేశమెల్లయెడల పర్యటనము గావించి గంభీరోపన్యాసము లొసగుచు రాజకీయ ప్రచారము గావించెను. 1876లో నితడు ఇంపీరియల్ ఇండియన్ అసోసియేషన్ స్థాపించెను. దీనికి మొదటికార్యదర్శి ఆనందమోహనబోసు. బెనర్జీ 1876 లో సంయుక్తరాష్ట్రములు, పంజాబు తిరిగెను. 1877 లో జరిగిన ఢిల్లీ దర్బారులో నలుముఖములనుండి ప్రతినిధులు వచ్చుట చూడగా ఇట్టి జాతీయ సభయుండిన ఎంతబాగుండునని ఇతని కప్పుడే తోచిన

దట. 1878 లో నితడు బొంబాయి మద్రాసులు తిరిగి రాజకీయ ప్రచారము గావించినాడు. చెన్నపట్టణమునందు 1881 లో స్థాపింపబడిన "మహాజనసభ" ప్రజలరాజకీయ హక్కులకొరకు కృషిచేయుట ప్రారంభించినది. ఈ సంఘమువారు 1884 లో నొక రాజకీయ మహాసభను జరిపిరి.

ఈ పరిస్థితులలో 1883 లోనే "ఇల్బర్టు" గారు భారతీయ మేజస్ట్రీటులకు ఐరోపాజాతి వారిని కూడ విచారించి శిక్షించుట కధికార ముండవలెనను చిత్తుశాసనము (బిల్లు) నొకదానిని శాసనసభలో ప్రవేశపెట్టిరి. అంతట నాంగ్లేయు లెల్లరు ఏకమై దేశములో నన్ని ప్రదేశము లందును సభలుచేసి అసమ్మతి తీర్మానములు గావించి గొప్ప ఆందోళనము గావించిరి. ఈ జాతీయగర్వము భారతీయులకు దుస్సహామగుటయే గాక, వారి ఐకమత్యము వారి ఆందోళనపద్ధతులు, చూడగా భారతీయులకు ఆశ్చర్యముకలిగెను. దాని ఫలితముగా జిల్లా మేజస్ట్రీటులకు జిల్లాజడ్జీలకు మాత్రమే అట్టి యధికారముండు నట్లు బిల్లు సవరణ చేయుబడగా భారతీయుల కది యొక గుణపాఠమయ్యెను.

1883 లోనే కలకత్తాలో నొక గొప్ప రాజకీయసభ జరిగెను. ఇది ఆల్బర్టు హాలులో జరిగినది. ప్రధానవక్తలు సురేంద్రనాధ బెనర్జీ, ఆనందమోహానబోసు గార్లు. ఢిల్లీ దర్బారులో నాంగ్లేయ ప్రభుత్వముపట్ల భక్తి గలవారెల్లరు సమావేశ మయినట్లే మనదేశముపట్ల భక్తిగలిగి దాని శ్రేయముకొరకు పాటుబడు సంఘసంస్కర్తలు రాజకీయ

సంఘముల నాయకులు కూడ నొక్కచోట సమావేశమయి ఒక జాతీయ దర్బారు జరిపినచో నీ దేశక్షేమలాభముల కెంత తోడ్పడవచ్చును! అని సురేంద్రబెనర్జీగారు తమగంభీరకంఠ స్వరముతో మహాసభలో పలుకగా నచ్చటివారెల్లరు నిది బాగున్నదనిరి. మన జాతీయకాంగ్రెస్ మహాసభను స్థాపించుటకు తోడ్పడిన ఊహాలలో, సంకల్పములలో, నిదియొక్కటిగనుండెను. ఇట్టి యభిప్రాయము ఆ నాడు వివిధరాజకీయ నాయకులందు కలిగెను. (అంబికాముజుందారుగారి జాతీయచరిత్ర)

బొంబాయిలో 1851వ సంవత్సరమున స్థాపింపబడిన ప్రజాసంఘము 10 సం॥రములు మాత్రమే చక్కగా పనిజేయ గలిగెను. తరువాత నది కొన్నాళ్ళు స్తంభితమై పోయెను. గాని 1870 లో మరల నది పునరుద్ధరింపబడగా 1873 లో దాని నిర్వహాణమునకు నౌరోజీ ఫర్దూంజీగారు పూనుకొని దానిని అతి చతురతతో నడిపిరి. ఇంతలో ఈస్టుఇండియా అసోసియేషను దీనితో పోటీగా పనిచేయసాగెను. ఈ రెంటి కిని గల స్పర్థలవలన కొన్ని చిక్కులు కలిగెను. తరువాత 1875 ఆ ప్రాంతములలో పూనాలో సార్వజనికసభ స్థాపింపబడి రావుబహద్దరు కిృష్ణాజి లక్ష్మణనుల్కర్, సీతారాం హరి, విష్ణుకృష్ణచిప్లంకర్, గార్లును ఇంక నితరులును ఆ రాష్ట్రములో నీ సంఘముద్వారా ప్రజాసేవ చేయసాగిరి.

1880 నాటికి లోకమాన్య తిలకుమహారాజు భారత దేశోద్ధరణకొరకు నడుముగట్టెను. ఈయన 1856 జూలై 23వ తేదీన జన్మించి 1876లో బి. ఏ. పరీక్షలో నుత్తీర్ణుడై 1879లో

ఎల్.ఎల్.బి. పరీక్షలో తేరి ప్రభుత్వోద్యోగమునుగాని న్యాయవాదవృత్తినిగాని స్వీకరింపక తన స్నేహితుడగు ఆగార్కార్ గారితో కలిసి పూనాలో ఒక పాఠశాల నేర్పరచిరి. విష్ణుచిప్లంకర్ గారుకూడా వీరితో కలిసి యీ పాఠశాలను వృద్ధిచేసి 1880 లో పూనాలో నొక నూతనాంగ్ల పాఠశాలను స్థాపించిరి. వీరి కష్టము అప్టే, నామజోషీగార్లను వారిరువురు తోడైరి. వీరందరు కలిసి కేసరి మహారాష్ట్ర పత్రికలను స్థాపించి దేశసేవ చేయసాగిరి. కొల్హాపూరు మహారాజును రీజంటు పరిభవించుటనుగూర్చి ఆ పత్రికలందు విమర్శింపగా వీరిపైన రాజద్రోహనేరము నారోపించిరి. చిప్లంకరుగారు చనిపోగా తిలకు-ఆగార్కారుగార్లు శిక్షింపబడిరి.

చెరసాలనుండి విముక్తులైనపిదప తిలకుగారును ఆగార్కారుగారును మఱల దేశోద్ధరణమునందే తమ కాల మెల్ల వినియోగింపసాగిరి. వీరు తమ యావజ్జీవము దేశసేవకొరకు వినియోగింపదలచి సుప్రసిద్ధ విద్యాభివృద్ధిసంఘమగు 'డెక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ'ని 1884 లో స్థాపించిరి. దీనిలో జేరిన యావజ్జీవ సభ్యులు భారతదేశప్రజలకు విద్యాదానము జేయుచు దేశసేవజేయుటకు నెల 1కి 75 రూపాయిలుచొప్పున జీతముపైన పని చేయుటకు దీక్షవహించి 1885లో తాము స్థాపించిన ఫెర్గుసన్ కాలేజీలో ఉపాధ్యాయులుగ పనిజేయుచుండిరి. వీరెల్లరి దేశాభిమానమును స్వార్థత్యాగమునుజూచి 1834 లో బి. ఏ., పరీక్షలో నుత్తీర్ణుడైన 18 సంవత్సరముల వయస్సుగల శ్రీ గోపాలకృష్ణ గోఖలేగారు ఆ చిన్నవయస్సులోనే

తానుగూడ ఈ సమాజమున జేరెరి. తిలకుగారిట్లు తన విద్యార్థి దశ నాటినుండియు దేశాభిమానియై దేశసేవ చేయుచు 1885 లో దాదాభాయి నౌరోజీ ఏ. ఓ. హ్యూముదొర గారు మున్నగువారు జాతీయ కాంగ్రెస్ మహాసభ స్థాపింపగా నొకటి రెండేండ్లలోనే తిలకుగారందు సభ్యులై జాతీయ మహా సభయొక్క దక్షిణహిందూస్థాన సంఘమునకు కార్యదర్శులై బొంబాయి రాష్ట్రీయసభ నైదేండ్లు జయప్రదముగా జరిపిరి. ఈయన తన పత్రికలద్వారా భారతజాతీయ విజ్ఞాన వికాస ములనుగూర్చి ప్రబోధము జేయసాగిరి.

## III

భారతజాతీయ కాంగ్రెసు మహాసభకు మూలపురుషుడు ప్రోత్సాహకుడు "అలెన్ అక్టేవియన్ హ్యూము" అనునొక ఆంగ్లేయుడు. ఇతడు ఐ. సి. యస్. ఉద్యోగి. ఇతడు జిల్లా యధికారిగా నుండగానే ప్రజలకు విద్యాభివృద్ధి గావింప వలెననియు పోలీసుశాఖను సంస్కరింపవలెననియు సారా విక్రయమును నిషేధింపవలయుననియు దేశభాషాపత్రికలను ప్రోత్సహింప వలయుననియు సంస్కరణ కారాగారముల నెలకొల్పవలయుననియు ఇతర ప్రజాసౌకర్యములను గావింప వలెననియు నెంతో పట్టుదలతో కృషిచేయుచుండెను. 1857 విప్లవములో నీతడు యుద్ధమున పాల్గొని శాంతి స్థాపింపబడిన పిదప ఈ సత్కార్యములనెల్ల నాచరణలో పెట్టుటకు ప్రయ త్నింపగా నాటి దొరతనమువా రడ్డుపడిరి. నేటీవులను విద్యాభి వృద్ధి పనులలో నియోగించకూడదని దొరతనమువారు తాఖీదు

జారీచేసిరి! పాప మీా కలెక్టరుగారు ప్రజలను తమ పిల్లలను పాఠశాలల కంపవలసినదనియు పాఠశాలలకు సాయపడవలసినదనియు ప్రోత్సహించుచున్నందుకు ప్రభుత్వమువా రితనిని మందలించిరి! దీనినిగూర్చి యితడు తీవ్రమైన అసమ్మతిని తెలుపుచు, పై అధికారులకు వ్రాసినాడు. న్యాయవిచారణాధికారులకే పోలీసు అధికారము లుండుటవలని యన్యాయములను, పోలీసుచేయు జులుమును గమనించి దానిని విడదీయవలెనని ఇతడు శిఫారసుచేసెను గాని లాభములేకపోయెను. గవర్నమెంటువారి అబ్కారీ విధానమువలన ప్రజలు నాశనమై పోవుచున్నారనియు దానివలన వచ్చుసొమ్ము పాపపుద్రవ్యమనియు నిది శ్రేయస్కరము కాదనియు గవర్నమెంటుకు వచ్చు ఒక్కొక్క రూపాయి పన్నుకు ఈ వ్యసనమున తగుల్కొనిన వారు నేరములు చేయుచున్నందున దానిని అణచుటకు ప్రభుత్వమువారు చేయుచున్న ఖర్చు రెండేసి రూపాయలు అగుచున్నదనియు, దీనిని సంస్కరించు మార్గము కనబడుట లేదనియు నితడు వగచి తాను బ్రతికియున్నచో నీ యన్యాయమును రూపుమాప ప్రయత్నింతు ననినాడు. నాడు కోర్టులలోని యత్యధిక వ్యయము, రిషిన్యూవిధానములోని నిరంకుశత్వము, ఆయుధచట్టము ఫారెస్టు చట్టము నిరంకుశముగా అమలు జరుగుట, ఇంకను ప్రజలుపడుచుండిన బాధలనుగూర్చి యితడు పైయధికారులకు వ్రాసినాడు. 1859 లోనే ఇతడు "పీపుల్సు ఫ్రెండ్" అను నొక దేశభాషపత్రికను స్థాపించుటకు తోడ్పడి సంయుక్తరాష్ట్ర ప్రభుత్వమువారు 600 ప్రతులు

తీసుకొని ప్రోత్సహించునట్లు చేసినాడు. ఆపత్రికను తర్జుమాజేసి ఇంగ్లాండులో ఇండియా కార్యదర్శికిని విక్టోరియారాజ్ఞికిని పంపుట కేర్పాటుచేసెను. నేరములనుచేయు బాలురను సంస్కరించుటకును వృత్తికళలనేర్పి సత్ప్రవర్తనము నలవరచు రిఫార్మేటరీ లను స్థాపించుటకును 1863 లోనే ఇతడు దొరతనమును ప్రోత్సహించెను.

రాజపుత్రస్థానములోనుండి చౌకబారు ఉప్పు వచ్చి దొరతనమువారి ఉప్పు యిజారాకు నష్టము కలిగించకుండా ఆరోజులలో సింధునదిదగ్గఱ అట్టాకునుండి బంగాళాఖాతముదగ్గఱ కటకమువరకును 2500 మైళ్ల పొడవునను "సుంకముల సరిహద్దుగీత" యను నొకముళ్లతీగె బందోబస్తును చాలా సొమ్ముఖర్చుపెట్టి దొరతనమువారు చేయుచుండిరి. ఇది చాలా అసహ్యమైన కార్యమని తలచి ఇతడు పశ్చిమోత్తర (ఆగ్రా) రాష్ట్రములో కష్టమ్సు కలెక్టరుగానుండగా దానిని తీసివేయించుటకు కృషిచేసినాడు. 1870 మొదలు 1879 వరకు ఇతడు గవర్నరుజనరలు క్రిందప్రభుత్వమున కార్యదర్శిగా నుండెను. ఇతని స్వతంత్రబుద్ధి, తెలివి తేటలు, అచ్చటి దొరలకు గిట్టకపోగా అతనిని బదలాయించిరి. ఇతడు 1879 లో నొక వ్యవసాయసంస్కరణ ప్రణాళికను తయారు చేసెను. రాజప్రతినిధి మేయో సానుభూతి కనబరచెనుగాని తెల్లదొరలు ఇది జరుగనీయలేదు. గ్రామములందలి రైతులు షాహుకారుల చేతిలో బానిసలై పడియుండుటకు మూల కారణములు అమిత వ్యయకారణములై దూరప్రదేశముల

జరుగు కోర్టువ్యాజ్యములనియు, గ్రామ ఋణములకు సంబంధించిన వ్యాజ్యములనెల్ల, గ్రామస్థుల కష్టసుఖము లెఱిగిన భారతీయ న్యాయాధిపతులే శీఘ్రముగను ఖర్చులేకుండగను, ఆయాగ్రామములలోనే పరిష్కరించ వలెననియు, ఆగ్రామములోనే విచారించినచో నిజము బయల్పడి తీరుననియు అబద్ధము లాడుటకు జంకుదురనియు ఇతడు సలహానిచ్చెను. నేటి శ్రీరాంతి రామమూర్తి సత్యనాధనులగార్ల అభిప్రాయములవలెనే ఇతని యభిప్రాయములును ఉదారములై యుండెను, గాని లాభము లేకపోయెను. అతడు తయారుచేసిన ప్రణాళికను బొంబాయి గవర్నమెంటువా రమలులో పెట్టలేదు. ఇతనికి లెఫ్టినెంటు గవర్నరుపదవి నిచ్చుటకు గవర్నరుజనరలైన లిట్టను శిఫారను చేయగా హ్యూముగారే తన కది వలదనిరి. హోం మెంబరుగా నియమింపుడనగా ఇంగ్లాండునుండి దిగుమతియగు బట్టలపైన గలపన్నును తీసివేయుటకు హ్యూముగా రిష్టపడరని శాలిస్‌బరీ ప్రభువు దానికి అడ్డుపడెను.

హ్యూముగారు 1882లో పింఛను పుచ్చుకొని భారత జాతీయ చైతన్యమును కలిగించుటకు పాటుపడసాగిరి. హ్యూముగారి కీ దేశమున నింగ్లాండులోను గొప్పపలుకుబడి యుండెను. అందువలననే ఆయన భారతదేశ ప్రజల అభిప్రాయమును ప్రభుత్వమునకు తెలుపగలందుల కొకజాతీయ ప్రతినిధుల సభ స్థాపింపబడుట యవసరమని ప్రచారము చేయగా ఆంగ్లేయ భారతీయ ప్రముఖులే గాక నాటి రాజప్రతినిధి డఫ్రిన్, ప్రాతరాజ ప్రతినిధులగు లిట్టన్ డల్‌హౌసీలు, ఇతర

ఉద్యోగులుగూడ దీనికి సహాయముచేయుట తటస్థించెను. హ్యూముగారికి స్నేహితుడగు బ్రైట్ గారు ఇంగ్లాండులో నాయన చాలపనిచేసిరి. భారతదేశపక్షమున నింగ్లాండులో పార్లమెంటులో పనిచేయుట కచ్చట పార్లమెంటు సభ్యులను గొందరిని ఒప్పించి ఒకపార్లిమెంటరీ ఉపసంఘమును స్థాపించిరి. భారతదేశమున వివిధప్రాంతములందలి రాజకీయ సంస్థల యొక్క ప్రతినిధులను, కొందరు రాజకీయ ప్రముఖులను, 1885 డిసెంబరు నెలలో పూనాలో నొక మహాసభయందు సమావేశము కావలసినదని హ్యూముగారు మార్చి నెలలోనే ఆహ్వానము లంపిరి. ఈ మహాసభకు పూనా నగరమున నొక ఆహ్వానసంఘ మేర్పరచిరి. అయితే పూనాలో కలరా వచ్చుటవలన సభను బొంబాయిలో జరుపవలసివచ్చెను. అచ్చట నాహ్వానసంఘమువకు కాశీనాధత్ర్యంబకనాధ తెలాంగు గారు అధ్యక్షులైరి. ఆ ప్రకారము డిశెంబరు 28 వ తేదీన బొంబాయిలో జరిగిన జాతీయ ప్రతినిధుల సభయే నేటి కాంగ్రెస్ మహాసభయొక్క ప్రథమ సమావేశము. ఇట్లు కాంగ్రెస్ మహాసభకు హ్యూముగారే మూల పురుషు డైనాడు.

## IV

భారతదేశ భాగ్యభోగ్యములు బ్రిటిష్ రాజ్య తంత్రజ్ఞుల నాకర్షించినట్లే ఈ దేశముయొక్క పూర్వనాగరకత, ఆర్య విజ్ఞానము, మత ధర్మములు పాశ్చాత్య పండితుల నాకర్షించెను. అనేక సంస్కృతగ్రంథములు ఇంగ్లీషులోనికిని జర్మనీ

భాషలోనికిని చాలకాలము క్రిందటనే అనువదింపబడెను. భారత దేశముపై ననేక పాశ్చాత్యవిద్వాంసుల కభిమానము కలిగెను. వారిరచనల ద్వారా భారత దేశ విజ్ఞానవికాసము క్రమక్రమముగా వృద్ధిగాంచి జాతీయచైతన్యము కలిగించెను.

ప్రపంచములోని వివిధమతములయొక్క మూలసూత్రములను పరిశోధించి సర్వమానవ సౌభ్రాతృత్వము స్థాపించు నుద్దేశముతో రష్యా దేశపుస్త్రీయగు బ్లావెట్‌స్కీగారును అమెరికా దేశీయుడగు కర్నల్ ఆల్కాటుగారును 1875 లో అమెరికాలో థియసాఫికల్ సొసైటీ అనుపేరుతో నొక దివ్యజ్ఞానసమాజమును స్థాపించిరి. వీరు భారత దేశ విజ్ఞానమును గూర్చి తమ గ్రంథములందు పత్రికలందు వ్రాయుచుండిరి. ఆకాలమున నాంగ్లవిద్యాధికులగు భారతీయు లనేకు లీ గ్రంథములను పత్రికలను జదువుచు నీ సమాజమున సభ్యులైరి. అట్టివారిలో సర్. టి. మాధవరావు, తల్లాప్రగడ సుబ్బారావుగార్లు మున్నగు ప్రముఖు లుండిరి. ఈ సుబ్బారావు గారు చాలా దూరదృష్టితో దివ్యజ్ఞాన సమాజముయొక్క స్థాపకులను మదాసు కాహ్వానించి వారి ప్రధానకార్యస్థానమును అడయారులో స్థాపించుటకు ప్రోత్సహించిరి. ఇది భారత దేశమునకు మహోపకారమయ్యెను. ఆసమాజమున ననేకులు విద్యాధికులు, రాజ్యతంత్రిజ్ఞులు, సంఘసంస్కర్తలు సభ్యులై భారత దేశోద్ధరణకు బద్ధకంకణులై పనిచేయసాగిరి. నాడు దివ్యజ్ఞానసమాజమున సభ్యులైనవారిలో ఏ. ఓ. హ్యూముగరును ఏ. పి. సిన్నెటుగారును ముఖ్యముగా పేర్కొన

దగినవారు. వీరియువురు 1931 లో సమాజసభ్యులై సిమ్లాలో నొకశాఖను స్థాపించిరి. సిన్నెటుగారు పయోనీరుపత్రికకు సంపాదకులు. వీరు భారతదేశీయుల పక్షమున వ్యాసములు వ్రాయుట చూచి పత్రిక యజమానులగు ఆంగ్లేయులకు కోపమువచ్చి ఈయనను పనినుండి తొలగించిరి. హ్యూము గారును సిన్నెటుగారును భారతదేశముపట్ల నత్యంతాభిమానము కలిగియుండుటకు దివ్యజ్ఞానసమాజమే కారణమనియు వీరు తల్లాప్రగడ సుబ్బారావుగారికి శిష్యులుగ నుండిరనియు సమాజ పుస్తకములందు వ్రాయబడినది. (బ్లావెట్ స్కీ లేఖలు)

దివ్యజ్ఞానసమాజము భారతదేశమునకు చేసినసేవ నిరుపమానమైనది. భారత దేశోద్ధరణకు తన జీవితమెల్ల ధారవోసిన అనిబిసెంటుగారు నీ సమాజసభ్యురాలైన తరువాత నే భారతదేశముపట్ల గాఢమైన అభిమానము కలిగియుండెను. ఈమె ఇంగ్లండులో నుండగా 1878 లో 'భారతదేశము-ఆఫ్గనిస్థానము-బ్రిటిష్‌ప్రభుత్వము,' అనునొక ఉద్గ్రంథమును వ్రాసి భారతదేశ వ్యవహారములను తీవ్రముగా విమర్శించి యుండెను. తరువాత నామె యీ దేశమునకు వచ్చి ఈ దేశము పట్ల నెంతో భక్తి కలిగి ఎన్నో గ్రంథములను రచించి ప్రబోధము కలిగించెను. 1916-18 మధ్య హోంరూలు ఉద్యమమును నడిపి భారతదేశ స్వాతంత్ర్యము కొరకు విశేష కృషిచేసెను. ఈ దేశముకొరకీమె యెన్నో బాధలనుభవించెను. ఈమె కాంగ్రెస్‌కు అధ్యక్షురాలై సమర్థతతో నడిపెను.

ఏది యెట్లున్నను 1882 వ సంవత్సరము భారత దేశ జాతీయచైతన్య చరిత్రలో చాల ప్రాముఖ్యత జెందిన వత్సర మనక తప్పదు. భారత దేశ సందేశమును పాశ్చాత్యుల కంద జేసిన వివేకానందస్వామి యీ సంవత్సరముననే శ్రీరామ కృష్ణపరమహంసయొక్క శిష్యుడయ్యెను. భారతదేశములోని ప్రతిభాశాలురను విద్వాంసులను రాజ్యనీతిజ్ఞులను సంస్కర్తలను ఒక్క ముఖమునకు తెచ్చిన సంస్థలలో ప్రధానమైనదగు దివ్యజ్ఞానసమాజ కార్యస్థానము అడయారులో స్థాపించుటకు నిశ్చయింపబడినదియు ఆ సంవత్సరముననే. నాడు మొదలు భారతదేశోద్ధరణకు తోడ్పడిన శక్తులెల్ల కేంద్రీకృతము కాజొచ్చెను. అట కలకత్తాలోను బొంబాయి సిమ్లాలలోను మదాసులోను జాతీయభావములు పెంపొందెను.

భారత దేశ జాతీయోద్యమమును గూర్చి అనీబిసెంటు గారు వ్రాసిన పుస్తకము వలన నొక విశేషము తెలియు చున్నది. 1884 లో దివ్యజ్ఞాన సమాజ 'కన్వెన్షను' వార్షికోత్స వమునకు దేశములో నలుప్రక్కలనుండి మదాసుకు వచ్చిన ప్రముఖులలో 17 మంది ప్రత్యేకముగా సమావేశమై అఖిల భారతజాతీయ ప్రతినిధుల సభ నొకదానిని స్థాపింప నిశ్చయించి రనియు నిదియే కాంగ్రెస్ మహాసభ స్థాపనకు కారణమయ్యె ననియు ఆమె వ్రాసినది.*

* How India wrought for Freedom.—Annie Besant.

## రెండవ ప్రకరణము

## వందేమాతరం

### I

కాంగ్రెసు మహాసభ మొదటి సమావేశము జరిగిన 1885 మొదలు ప్రతియేటను సమావేశమై రాజకీయ సాంఘిక సంస్కరణములను గూర్చిన తీర్మానములు చేయుచుండెను. ప్రభుత్వ శాసనసభలకు భారతీయ ప్రజాప్రతినిధులు ఎన్నుకొనబడవలెననియు, ప్రభుత్వవ్యవహారములందు భారతీయులు పాల్గొనుటకు అవకాశము లుండవలెననియు, ఉన్నత ప్రభుత్వోద్యోగములందు భారతీయులు హెచ్చుగా నియమింపబడవలెననియు ఇంగ్లాండులోను ఇండియాలోను ఐ. సి. ఎస్. పరీక్షలు జరుపవలెననియు ఇంక నెన్నో తీర్మానములు గావించి ఆందోళన ప్రారంభించెను. "ఇండియా" అను పేరుతో ఇంగ్లాండులో నొక వార్తాపత్రికను స్థాపించి ప్రచారముచేసెను. ఆనాటి రాజప్రతినిధియగు డఫ్రిన్ ప్రభువు స్థానిక శాసనసభలయందైనను భారత దేశ ప్రజాప్రతినిధులను నియమింపవలెనని సలహా నిచ్చెను. 1890లో కాంగ్రెసువా రింగ్లాండుకొక ప్రాతినిధ్యమంపిరి. కాంగ్రెసు మహాసభ వారి కోరికపైననే ఛార్లెస్‌బ్రాడ్లా అను స్వాతంత్ర్య ప్రియుడు భారత దేశమునకు స్వపరిపాలనమివ్వవలెనని ఆంగ్లపార్లమెంటులో నొక చిత్తుచట్టమును ప్రవేశపెట్టెను. ఇట్లు రాజకీయాందోళనము తీవ్రతరము కాగా, విడదీసి పాలించు పద్ధతిని హిందూదేశప్రభుత్వమువారు ప్రారంభించిరి. 1890

లో హిందువులకును మహమ్మదీయులకును తగవులు ప్రారంభ మయ్యెను.

దేశభాషాపత్రికల శాసనము 1882 లో రద్దుచేయ బడినది మొదలు దేశభాషలందు జాతీయ పత్రికలు వృద్ధియై దేశములో తీవ్రమైన రాజకీయాభిప్రాయములను వెదజల్ల సాగెను. 1891 లో పీనలుకోడు సవరణచేయబడి బాలికల తోడి సంపర్కనేరములలో అంగీకారమున కేర్పరుపబడిన వయస్సు పరిమితి హెచ్చు చేయుటకు ఒక శాసనము (Age of consent Bill) చేయబడెను. దీనిని గూర్చి పూర్వాచార పరాయణులు తీవ్రముగా ఆందోళనము చేయసాగిరి. ఈ సందర్భములో "బంగబాసీ" యను వంగపత్రిక సంపాదకుని పైన ముద్రాపకునిపైన రాజద్రోహనేరమును మోపి శిక్షించిరి.

ఈ ఆందోళన ఫలితముగా 1892 సం॥ లో భారతదేశ రాజ్యాంగవిధానములో శాసనసభలను సంస్కరించుచు పార్లమెంటు వారొక చట్టమును గావించిరి. దీనివలన గవర్నరు జనరలుయొక్క శాసనసభలోని అదనపు సభ్యుల సంఖ్య 16 మందికి హెచ్చింపబడెను. ఈ సభ్యులలో కొందరిని గవర్నరుల శాసనసభలవారు ఎన్నుకొనునట్లు అప్రత్యక్షపు ఎన్నిక (ఇండైరెక్టు ఎలెక్షన్) పద్ధతి నిర్ణయించి నియోజకవర్గముల నేర్పాటుచేయగలందుల కొక రెగ్యులేషను శాసించుటకీ శాసనసభకే అధికార మొసగబడెను.

దాదాభాయి నౌరోజి 1892 లో పార్లమెంటు సభ్యుడై భారతదేశ వ్యవహారములను గూర్చి విచారణ చేయవలసినదని

గట్టిగా కోరసాగెను. 1895 లో భారతదేశములోనికి దిగుమతి యగు ఇంగ్లీషు బట్టలపైన సుంకములు విధింపబడగా పార్లమెంటులో ల్యాంకషైరు సభ్యులతితీవ్రముగా ఆక్షేపించిరి. భారతదేశముయొక్క వ్యవహారములు ప్రభుత్వ వ్యయ విధానమునుగూర్చి విచారించుటకును ఒక కమిటీ యేర్పడెను. విశ్వవిద్యాలయములందు చదువుకొనిన విద్యార్థికులు రాజకీయార్థిక వ్యవహారములందెల్ల భారతదేశమునకు జరుగుచున్న అన్యాయములను గమనించి చర్చింపసాగిరి. అందువల్ల రాజకీయ పరిజ్ఞానము దేశములో క్రమక్రమముగా వృద్ధియగుచు దేశ పరిపాలనమునుగూర్చిన ఆలోచనలు ప్రజలలో వృద్ధియగుటయు ప్రభుత్వచర్యలు తీవ్రముగా విమర్శించుటయు ప్రారంభమయ్యెను.

1893 లో బొంబాయిలో హిందూ మునల్మానుల కొట్లాట మజిల జరిగెను. అంతట మహారాష్ట్రమునందు హిందువులలో గొప్ప మతాభిమానము కలిగి భజనలతోను, కీర్తనలతోను గణపతి యుత్సవములు ప్రారంభించి ఉద్రేకము పొందసాగిరి. ఈ ఉత్సవములే దేశభక్తిని బోధించు సాధనములుగా జాతీయనాయకులవలన ఉపయోగింపబడెను. దేశములోని యువకులలో వ్యాయామక్రీడలు పురికొల్పబడెను. "చాపేకారులను" చిత్పావనబ్రాహ్మణులు పూనాలో యువకులకు సైనికశిక్షణము నిచ్చి తర్ఫీదుచేయుట కొక సంఘము స్థాపించి శివాజీ యుత్సవములు ప్రారంభించిరి. పురాణకథలు దేశభక్తి పూరితములగు ఉపన్యాసములుగా చేయబడసాగెను. దేశ

భాషాపత్రికలు దేశాభిమానమును ప్రోత్సాహించి ప్రజలయందు గాఢమగు దేశాభిమానమును వ్యాపింపజేయుచుండెను. ఇంతలో కఱవులు వచ్చి ప్రజలు బాధపడుచుండిరి. 1896 లో కఱవుకు తోడుగ మహామ్మారి వ్యాపించెను. దీనినిగూర్చి ప్రభుత్వోద్యోగు లవలంబించినచర్యలు, బలవంతపు సంసర్గనిషేధపు పద్ధతులు. ప్రజలయందు అశాంతిని ప్రబలించెను. అప్పుడు లోకమాన్య తిలకు మహాశయుడుగూడ జాతీయ ప్రబోధము గావించు చుండెను. యువకుల నెల్లరను బలశాలులై తేజముగల్గి దేశోద్ధరణ చేయుడని ప్రోత్సహించుచు శివాజీ గణపతి యుత్సవములకు ప్రోద్బల మొసగెను. ఈయన శాసనసభయందుగూడ అప్పుడు సభ్యుడుగా నుండెను. కఱవునుగూర్చియు ప్లేగు నిబంధనలను గూర్చిన ప్రభుత్వ చర్యలను తీవ్రముగా విమర్శింపసాగెను. దేశములో అశాంతి కితడే కారణమని ప్రభుత్వమున కీయనపైన కోపముగా నుండెను.

దేశ మిట్లు దారిద్ర్యమున కఱవులో మునిగి ప్లేగు వలని బాధలలో నుండగా ఆ తరుణమున 1897 జూన్ 22 వ తేదీన ఇండియాప్రభుత్వమువారు విక్టోరియారాణి వజ్రపూర్తి యుత్సవము చేయ తలపెట్టిరి. ఉత్సవమునాడు చాపేకారుసోదరులు ఇరువురు ఇంగ్లీషుప్రభుత్వోద్యోగులను హత్య జేసిరి. వారిలో నొకడు ప్లేగుచర్యలు జరిగించిన "రాండ్" అను ఆంగ్లేయోద్యోగి. ఈ కాలమున కేసరిపత్రికలో, లోకమాన్యుడు వ్రాసిన వ్రాతలు తీవ్రరాజద్రోహమును ప్రోత్సహించినవనియు, ఈ హత్యలకు కారణమైనవనియు, రాజద్రోహ

నేరము నారోపించి లోకమాన్యుని పట్టుకొని 1½ సంవత్సరములు కఠినశిక్ష విధించిరి. 1818 సంవత్సరపు రిగ్యులేషనుక్రింద మహారాష్ట్ర సర్దారులగు 'నాతూ' సోదరులను ప్రవాసముంపిరి. తిలకుగారి పాండిత్యమువలన మాక్సుమూలరుగా రాయనకు స్నేహితులై తిలకుగారి పక్షమున పనిచేయగా ఒక సంవత్సరము తరువాత తిలకుగారిశిక్ష రద్దుచేయబడెను.

## II

ఆరోజులలో భారత దేశ రాజకీయరంగమునందు గోఖలేగారిపేరు మారుమ్రోగుచుండెను. భారత దేశములో సుప్రసిద్ధహైకోర్టుజడ్జియై గొప్పదేశభక్తుడై మహారాష్ట్ర చరిత్రను రచియించి దేశోద్ధరణకు తోడ్పడు అన్ని కార్యములందును తానుగూడ పాటుపడుచుండిన శ్రీ మహాదేవ గోవింద రానడేగారికి గోఖలేగారుశిష్యులై 1887లో ఆంగ్లమహారాష్ట్ర భాషలందు పత్రికలను నిర్వహింపసాగిరి. భారత దేశ ఆర్థిక స్థితిగతులందు ప్రభుత్వాదాయ వ్యయపద్ధతులందు గోఖలేగారు తనగురువగు రానడేగారి వలెనే గొప్ప ప్రజ్ఞావంతుడయ్యెను. ఆనాడు బ్రిటిషు పరిపాలనావిధానములను సమర్థింప జూచువారికి వీరిరువురు పక్కలో బల్లెములవలె నుండిరి. గోఖలేగారు ఆకాలముననే నాలుగు సంవత్సరములు బొంబాయిరాష్ట్రీయ మహాసభకు కార్యదర్శియై తరువాత 1895 లో కాంగ్రెసు మహాసభకును కార్యదర్శియైరి. భారత దేశ రాజకీయములకు పితామహుడని ప్రఖ్యాతివడసిన దాదాభాయి నౌరోజీగారు భారత దేశోద్ధరణకు చేయుచున్న కార్యములందెల్ల గోఖలేగారు వారికి కుడిభుజముగ

నుండిరి. 1897లో గోఖలేగారు ఇంగ్లాండుకువెళ్లి భారతదేశ ఆదాయ వ్యయములను గూర్చి "వెల్బీకమీషను" ఎదుట సాక్ష్యమిచ్చుచు బ్రిటిషు వారీదేశమునకు గావించిన అన్యాయము లెల్ల నుగ్గడించిరి.

ఆకాలములోనే భారతదేశమున ప్లేగు నివారణచేయు నెపమున చేయబడిన అక్రమములనుగూర్చి ఈయనకు తంతులు రాగా నీయన దానినిగూర్చివిశేషప్రచారముచేసిరి. ఈయన 1901 లోను 1902 లోను బొంబాయిశాసనసభలో సభ్యులై 1902లో కేంద్రి ఇంపీరియల్ శాసనసభలో సభ్యులై తమకుగల గొప్ప ఆర్థిక విజ్ఞానమునెల్ల గనబరచుచు కర్జను ప్రభువుయొక్క నిరంకుశ చర్యలను అన్యాయములను తీవ్రముగ విమర్శింపసాగిరి.

కర్జను ప్రభువు భారతదేశమునకు 1898 లో రాజప్రతినిధిగావచ్చెను. ఇతడు చాల చిన్నవాడు; తెలివైనవాడు; అయితే నిరంకుశుడు. కర్జనుకు బ్రిటిష్ రాజ్యమునకెల్ల తానధిపతినను గర్వముండెను. ఇతడు సంస్థానాధీశులను విద్యార్థులను తృణీకరించుచుండెను. ఇతడు మొదటి నాల్గువత్సరములలో చేసిన చర్యలు, ఆడినమాటలు దేశములోని విద్యార్థులకు వ్యవసాయకులకు సంస్థానాధీశులకుగూడ చాలా అసంతృప్తిని కలిగించి కల్లోలము కల్గించెను.

1900 సంవత్సరమున మఱల కఱవువచ్చి ప్రజలు మలమల మాడుచుండిరి. దాని నివారణకొరకు చేయబడినపని యతిస్వల్పము. ఇట్టిస్థితిలో 1903 లో ఢిల్లీచక్రవర్తుల నాటి డాబు దర్పములతో కర్జను ఢిల్లీలో నొకగొప్ప దర్బారు గావించి

అందులో రాజాధిరాజులచేత మొక్కించుకొన్నాడు. ఈతడు గావించిన ఉపన్యాసములందు భారతీయులను గూర్చిన అవమానపు మాటలు అత్యధికముగా నుండెను. అంతేకాదు. తన చర్యలందుగూడ భారతీయప్రజాభిప్రాయమును తృణీకరించెను. ఇతని విశ్వవిద్యాలయచట్టము, మునిసిపాలిటీల చట్టము చాల అసంతృప్తిని కలిగించెను. అన్నిటికిని తోడు తూర్పు వంగరాష్ట్రభాగములను విడదీసి అస్సాములోని కొన్ని జల్లాలతో కలిపి ఒకభాగముగను, తక్కినజిల్లా లొక భాగముగను, ఇరువురు లెఫ్టినెంటు గవర్నర్లక్రింద నుంచునట్లు కర్జను నిశ్చయించి దేశప్రజ లెల్లరు వలదని మొత్తుకొన్నను వినక 1905 సెప్టెంబరులో నా ప్రకార మొకచట్టమును జేయించెను. దీనికే బంగాళావిభజనమని పేరువచ్చెను. ఇది 1905 అక్టోబరు 16వ తేదీన అమలులోనికి వచ్చెను. అదివరకు వంగరాష్ట్రము నందలి శాసనసభలు, ప్రజలు, ప్రభుత్వచర్య లెల్ల తీవ్రముగా ఖండించుచుండుటకు ప్రతిక్రియగా ఈరాష్ట్రములోని హిందువులను మహమ్మదీయులను విడదీసి పాలించు కుటిలరాజ్యతంత్ర ప్రయోగమే ఈ విభజనకు కారణమని ప్రజలు తలచిరి. అంతట దీనినిగూర్చి ప్రజలలో తీవ్రమైన విషాదాందోళనములు కలిగెను. ఈ విభజనను రద్దుచేయుకొఱకు బయలుదేరిన ఆందోళనము గొప్పజాతీయోద్యమముగా పరిణమించెను. స్వధర్మము, స్వదేశము, స్వరాజ్యము అను మాటలెల్ల "వందేమాతరం" అను పదములో మిళితమై దేశ మెల్లయెడల ప్రతిధ్వను లిచ్చెను. ఈ విభజనక్రింద నిరువురు లెఫ్టినెంటు గవర్నరులు జారీచేసిన

ఉత్తరువులు ప్రకటనలు శాఖములు బహిరంగముగా తృణీకరింపబడసాగెను. స్వదేశీయుద్యమము బయలుదేరి విదేశవస్తు బహిష్కరణముచేయుటకు ప్రమాణములతో సాత్వికనిరోధము నారంభించు సన్నాహములుగూడ జరిగెను.

1905 లో భారతదేశపక్షమున గోఖలేగారును, లాలా లజపతిరాయిగారును ఇంగ్లాండులో గొప్ప ప్రచారము గావించిరి. గోఖలేగారు 50 రోజులలో 45 మహోపన్యాసములు గావించిరట ! గోఖలేగారు వంగరాష్ట్రవిభజన విషయమున ప్రజాపక్షమునే యవలంబించి పనిచేయసాగిరి. ఇంగ్లాండు నుండి రాగానే గోఖలేగారు కాంగ్రెసు మహాసభకు అధ్యక్షత వహించి జగద్విఖ్యాతమైన ఉపన్యాసము నొకదానిని గావించిరి. కర్జనుప్రభువుయొక్క నిరంకుశ పరిపాలనమును ఔరంగజేబు పరిపాలనముతో పోల్చిచూపి బ్రిటిషు పరిపాలనలోని లోతుపాతులను గుట్టుమట్టులను వెల్లడించిరి. వంగరాష్ట్ర విభజనను తీవ్రముగ ఖండించిరి. స్వదేశీ బహిష్కారోద్యమములను సమర్థించిరి.

స్వదేశీయుద్యమము వంగరాష్ట్రమునుండి బొంబాయి పంజాబు రాష్ట్రములలోనికి వ్యాపించి ఆందోళనము అతి తీవ్రమయ్యెను. బాలగంగాధరతిలకు, లజపత్ రాయి, బిపినచంద్రపాలు లీయుద్యమమునందు గొప్ప ప్రచారము గావించిరి. "వందేమాతరం" "బాల్ లాల్ పాల్" అనుమాటలు నాటి రోజులలో ప్రతి స్త్రీపురుషునినోటను ప్రతిధ్వను లిచ్చుచుండెను. వందేమాతర మని యొక రనగా, మనదే రాజ్యమని

ఇంకొకరనుట దేశభక్తిసూచకమగు జోహారుగనుండెను. దేశములోని విద్యార్థులందు గొప్ప సంచలనము కలిగెను. వందేమాతరం చిహ్నములతో కాలేజీలకు, పాఠశాలలకు బోవుట, వందేమాతరమని యఱచుట, అందులకు అధికారులు కోపించి విద్యార్థులను వెళ్లగొట్టుటయు గూడ జరిగినది. ఆసియాఖండవాసులగు జపానీయులు ఐరోపావాసులగు రష్యావారి నోడించగా జపాను స్వాతంత్ర్యమున బడనందువలననే ఆ దేశమిట్లు అభివృద్ధి జెందిన దను తలంపు మనవారికి కలిగెను.

1906 లో జరిగిన కాంగ్రెసు మహాసభలో దాదాభాయి నౌరోజీ యధ్యక్షత వహించెను. భారత దేశమునకు "స్వరాజ్యము" కావలెనను తీర్మానము చేయబడెను. దేశప్రజలు పరవశులై దేశభక్తిపూరితులై ప్రవర్తింపసాగిరి. నాటినుండి "స్వరాజ్య" మను పదము వాడుకలోనికి వచ్చినది.

## III

గోఖలేగారు 1907-08 లో నింపీరియల్ శాసన సభలో ప్రభుత్వమువారి ఆదాయ వ్యయవిధానములను నిర్బంధకరములైన రాజకీయ చర్యలను అతి తీవ్రముగా విమర్శించి సంచలనము కలిగించుచుండగా నొకవంక ఈయన విమర్శనలను నింకొకవంక దేశములోని తీవ్రరాజకీయాందోళనమును జూచి మింటో ప్రభువు, గోఖలేగారి విమర్శనలను అవనయించుట కేవో కొన్ని సంస్కరణములను జేయుట యవసరమని తోచి సీమకు వ్రాసెను. గోఖలేగారికి అధికారులన్నను, ప్రభుత్వమన్నను భయముగాని మోమోటమిగాని లేదు.

ఈయన ఎన్నడును పదవుల నాశింపలేదు. ప్రభుత్వమీయనకు బిరుదుల నొసగదలపగా నీయన స్వీకరింపలేదు. ఇట్టి నిష్కళంకమైన దేశభక్తుడు, త్యాగధనుడు, నేటికిని, మితవాదులలో నింకొకడులేడు. మితవాదియని పేరేగానే నేటి మితవాదులవలె ప్రభుత్వము నెన్నడు నాశ్రయించినవాడు కాడు. ఇతడు నిజముగా గాఢమైన దేశాభిమానముగల రాజకీయ నాయకుడేగాని ప్రభుత్వముతో విరోధము పెట్టుకొనుటకు ఇష్టపడడు. మరియు రాజకీయములందు తీవ్రపద్ధతులను సహింపకుండెను. ఆరోజులలో కాంగ్రెసులో కలిగిన చీలికల కిదియే కారణముగాని వేరుకాదు. ఏదియెట్లున్నను ఈ మహానుభావుని గౌరవించు విషయములో మాత్రము నాటికినేటికి మితవాదులు అతివాదులు నను భేదభావము నెవ్వరును కనుబరుపలేదు. గాంధీమహాత్ముడుగూడ రాజకీయములందు గోఖలేగారే తనకు గురువని చెప్పుచుండుట వలననే ఈ మహామహుని గొప్పదనము వెల్లడియగుచున్నది. సాత్వికనిరోధ పద్ధతులయందు గాంధీమహాత్ముడెంత ప్రజ్ఞావంతుడో, పార్లమెంటరీశాసనసభ కార్యక్రమములయందు గోఖలేగారంత ప్రతిభాశాలి. మహాత్ముడు సత్యాగ్రహమునకు మూలపురుషుడైనట్లే గోఖలేగారు భారతదేశ పార్లమెంటరీ రాజ్యతంత్ర పద్ధతులకు మూలపురుషుడు. ఎట్టి యధికారములులేని బొమ్మకొలువులందుగూడ తన అనర్గళ వాగ్ధోరణిచే తీవ్ర విమర్శనలచే గోఖలేగారానాడు కొన్ని రాజ్యాంగ మర్యాదలు స్థాపించినారు.

వందేమాతర జాతీయోద్యమమిట్లు తీవ్రముగా పెరుగుచుండగా దీనిని అణచుటకు ప్రభుత్వము తీవ్రనిర్బంధవిధానమును ప్రయోగింపనాగెను. పత్రికలపైనను వ్యక్తులపైనను సభలపైనను నిషేధములు ప్రయోగించిరి. ఇట్లు ప్రజల అభిప్రాయ ప్రకటనయు సమావేశస్వాతంత్ర్యము నణచివేయబడెను. అనేక సంస్థలను అశాస్త్రీయ సంఘములుగా అణచివేయు శాసనము గూడ గావింపబడెను. 1907 లో బారిసాలులో జరిగిన రాజకీయసభను అక్రమసంఘముగా ప్రకటించి అచ్చటి సభవారిని పోలీసువారు లాటీలతో తీవ్రముగా కొట్టి చెదరగొట్టిరి. అనేకులకు చావుదెబ్బలు తగిలెను. ఇదియే మన దేశములో జరిగిన మొదటి లాటీచార్జి. స్వరాజ్యము కోరినందుకు సురేంద్రనాథ బెనర్జీగారిపైన రాజద్రోహనేరమును మోపిరి. గాని కలకత్తా హైకోర్టులో శారదాచరణమిత్రయను భారతీయ న్యాయాధిపతి స్వరాజ్యము కావలెననుట రాజద్రోహము కాదని ఆ కేసును కొట్టివేసెను.

1907 లో కాంగ్రెసు నాగపూరులో జరుగవలసియుండెను. గోఖలే సర్ ఫిరోజిషా మెహతాలు నాటి కాంగ్రెసులో ప్రముఖులు. వీరెల్లరు ప్రభుత్వమువట్ల వినయ విధేయతలతో మెలగవలెనను అభిప్రాయముగల మితవాదులు. వీరు కాంగ్రెసుకు రసవిహారీఘోషు నధ్యక్షత వహింపజేయదలచిరి. ఇది తీవ్రజాతీయవాదులకును యువకులకును ఇష్టములేదు. ప్రవాసమంపబడిన లజపతిరాయిగారినే అధ్యక్షునిగా చేయగోరిరి. మితవాదులు నాగపురములో మానివేసి సూర

తులో కాంగ్రెసుసభను జరిపిరి. బారిసాలులో జరిగిన అత్యాచార ములు స్వయముగా అనుభవించివచ్చినవారికి సూరతు కాంగ్రెసు పరిస్థితులు రోషము కలిగించెను. సూరతు కాంగ్రెసు సభలో తీవ్రవాదులకును మితవాదులకును గొప్పవాగ్వాదమును పోరా టమును జరిగెను. మితవాదుల కోరికపైన పోలీసులు వచ్చిరి. సభలో చెప్పు లెగిరి సభభగ్నమయ్యెను. నాటితో కాంగ్రెసు రెండు చీలికలై పడి. తీవ్రజాతీయవాదులు వేరుపడిరి. అప్పటి నుండి 1916 వరకును మితవాదులే కాంగ్రెసులో బలము గల్గి యుండిరి. 1916 లో శ్రీమతి అనీబిసెంటుయొక్క "హోం రూలు" ఉద్యమముతో లోకమాన్యుడు మరల కాంగ్రెసులో ప్రవేశింపగలిగెను. అంతట ఆనాటినుండి నేటివరకు కాంగ్రెసు తీవ్ర జాతీయభావములతో స్వాతంత్ర్యముకొరకు పనిచేయు చున్నది.

## IV

వందేమాతరోద్యమములోనే మన ఆంధ్రదేశమున జాతీ యోద్యమము తీవ్రముగా విజృంభించినది. కాంగ్రెసు స్థాప నకు తోడ్పడిన దివ్యజ్ఞాన సమాజసభ్యులలో ఆంధ్రనాయకు లగు తల్లాప్రగడ సుబ్బారావుపంతులుగారును, ప్రథమసమా వేశమునకు పోయివచ్చిన కేశవపిళ్ల, రంగయ్యనాయుడు, శింగ రాజు సుబ్బారాయడు, న్యాపతిసుబ్బారావు గార్లును ఆంధ్రదేశ జాతీయ చైతన్యమున కాదపురుషులని చెప్పవచ్చును. న్యాపతి సుబ్బారావుపంతులుగారు కాంగ్రెసు కార్యదర్శిగా చాల కాలము పనిచేసిరి. కాని వందేమాతరోద్యమమువరకు దేశ

మున పెద్ద కదలిక పుట్టలేదు. నేడు ముట్నూరికృష్ణారావు పంతులుగారి సంపాదకత్వమున ఆంధ్రదేశమున కఖండ సేవ చేయుచున్న కృష్ణాపత్రిక 1902 లో స్థాపించబడెను. దానికి కొండ వెంకటప్పయ్య పంతులుగారు మొదటి సంపాదకులుగ నుండిరి. ఆనాడు ఆంధ్రదేశమున వీరేశలింగము పంతులుగారి ఉద్గ్రంథములు, సంఘసంస్కార కార్యక్రమము, బ్రహ్మసమాజ బోధలు, రామకృష్ణ వివేకానంద విజ్ఞానము, గ్రంధాలయ ములద్వారా ఉపన్యాసములద్వారా దేశభక్తిపూరితములగు నాటకములద్వారా నలుగడల వ్యాపించెను. భారతదేశములో నాడు కిరీటములేని రాజుగానుండిన తిలకుమహారాజుయొక్క దేశభక్తిపూరితములగు వ్యాసములు వ్యాసంగములు ప్రతి రాష్ట్రమునందును ప్రజాహృదయమునందు దేశాభిమానము పురికొల్పినట్లే మన రాష్ట్రమునకూడ పురికొల్పుచుండెను. ఇట్టి తరుణమున వంగరాష్ట్రమునుండి బిపినచంద్రపాలు వందేమా తర సందేశమును గొనివచ్చి ఆంధ్రదేశమునందు గొప్ప యుప న్యాసములనిచ్చుచు పర్యటనము చేయసాగెను. ఆతనిమాటలు వినిన వారెల్లరు పరవశులై తత్క్షణమే విదేశవస్తు బహిష్కార దీక్షను గైకొనసాగిరి. నాడుప్రజలు ధరించు చుండిన మల్లుబట్టలను విసర్జించి స్వదేశమిల్లుబట్టలను ధరింప సాగిరి. వందేమాతరమను మాట దేశములో ప్రతిధ్వను లిచ్చుచుండెను. ఎచ్చటచూచినను దేశభక్తిపూరితములగు పాటలు భజనలు ఉపన్యాసములు ఎచ్చటచూచినను లోకమా న్యుని తిలకధారణము, ఎచ్చట చూచినను వ్యాయామ క్రీడలు,

స్త్రీపురుషులెల్లరుకూడ నీదేశభక్తియందు లీనమై పోవుచుండిరి. చిన్న పిల్లలును తుదకు గోరువంకలును కూడ "వందేమాతరం మనదే రాజ్యమ్" మని పలుకుట సర్వసామాన్యమై పోయినది.

ఈ వందేమాతరమనుమాట దొరలకు కర్ణకఠోరముగ నుండినందున వారు దౌర్జన్యములు చేయుచుండిరి. 31-5-1907 తేదీన సాయంత్రం షుమారు 5 గంటలవేళ కాకినాడలో మెడికల్ ఉద్యోగి కెంపుదొర పోవుచుండగా కోపల్లె కృష్ణారావు అను బాలుడు 'వందేమాతరం' అని అరవగా ఆదొర కుర్రవానిని బూటుకాళ్లతో తొక్కి, వాడు స్పృహ తప్పిపడిపోగా క్లబ్బుకు వెళ్ళిపోయెను. అంతట ప్రజలు రోషావేశులై రాత్రి పదిగంటలకు క్లబ్బును ముట్టడించి గలభా చేయుచుండగా పోలీసులు తుపాకులతో కాల్చెదమని బెదిరించుటయు కొందరు సోడాబుడ్లను విసరుటయు జరుగగా దౌర్జన్యనేరమునకు కొందరిపైన కేసులుపెట్టి శిక్షించిరి. ఇరువురు కాకినాడ కాలేజి విద్యార్థుల నరెస్టు చేసిరి. దీనికి శాస్తిగా ఊరిలో శిక్షార్థవు (ప్యూనిటీవు) పోలీసు నగరవాసుల ఖర్చుపైన నిలిపిరి. ఈపోలీసు పోల్జరులు వీధులవెంట తిరుగుచు ప్రజలను బెదరించుచుండిరి.

ఆనాడు మన రాష్ట్రమందు ఆంధ్రపౌరుషము తేజరిల్లి వంగరాష్ట్రముతో వియ్యమందసాగెను. నాడు విద్యార్థులలో సంచలనము కలిగి తిలకమును ధరించి వందేమాతర చిహ్నములను ధరించి పాఠశాలలకు పోయి వందేమాతరమని పలుమరు స్మరించుచుండిరి. ఆనాడు రాజమహేంద్రవర కళాశాలలో బి.ఏ. క్లాసు చదువుచుండిన గాడిచెర్ల హరిసర్వో

త్తమరావుగారు, కీర్తిశేషులైన గజవల్లి రామచంద్రరావు గారు మొదలగు నిరువదమంది యట్లు చేసినందుకు ఆకళాశాల ప్రిన్సిపాలు మార్కు హంటరు దొరగారు వారిని కళాశాలనుండి వెళ్లగొట్టి రెండేండ్లదాకా ఎచ్చటను చేర్చుకొనరాదని ఆంక్ష వేసిరి. వీరికి ప్రభుత్వోద్యోగముల నీయరాదని గెజటులో ప్రకటింప బడెను. తరువాత వీరిరువురును యమ్. ఏ. పరీక్షయందు తీర్ణులైరి. హరిసర్వోత్తమరావుగారు 1907 లో బెజవాడలో స్వరాజ్యపత్రిక అను జాతీయపత్రికను నిర్వహించుచు వందే మాతరోద్యమమునకు తోడ్పడిరి. ఆరోజులలో పోలీసు సోదాలు, సిఘాలు, దౌర్జన్యములు ప్రబలెను. సర్వోత్తమ రావుగారిని, ముద్రాపకులగు బోడి నారాయణరావుగారిని రాజద్రోహముక్రింద 1908 లో పట్టుకొనిరి. నాటికింకను గాంధిమహాత్ముని సత్యాగ్రహసమరపద్ధతులుగాని ఒకరివెంట నొకరు ఉత్సాహముతో ఇష్టపడి చెరసాలకేగి ప్రభుత్వముతో సాత్వికనిరోధము చేయుట అనునదిగాని ప్రజ లెరుగరు. పోలీసువాని ఎర్రతలపాగను చెరసాలయొక్క ఇనుపకమ్ములను చూచినంతనే జనసామాన్యముయొక్క ప్రాణములు పైకి పోవుచుండెను. ప్రజల నింకను భయపెట్టి దేశాభిమానము నణచివేయవలెనని రాజద్రోహమున కరెస్టు చేసిన వారికి సంకెళ్ళువేసి వీధులవెంట త్రిప్పుటయు చెరసాలలందు తలలు గొరిగించి మల్లచిప్పలయందు పురుగుల అంబలిని పోయించి బాధించుటయు నాటికిని నేటికిని ఒకేతీరుగానున్నది. శాసనసభ్యుడును బి.యల్. పరీక్షనిచ్చినవాడును శ్రీమంతుడును

లోకమాన్యుడును అగు తిలకుమహారాజునే సంకెళ్లువేసి కోర్టుకు తెచ్చి నిలువబెట్టగా ఇక సర్వోత్తమరావుగారి మాట చెప్ప నేల ? అరెస్టులో నుండగా నీయనకు తిండిపెట్టువారు లేరైరి. నీవాయని పలుకరించువారు లేరైరి. ఆనాడు ఒకరిద్దరు న్యాయ వాదులు జాతీయవాదులుగా నున్నారను నెపమున ఇళ్లు సోదాలు చేసి భయపెట్టిరి. ఈరాజద్రోహనేరమునకు ముద్దా యిల తరఫున పనిచేయుటకు ప్లీడర్లకు కూడా ధైర్యము లేక పోయినది. అంతట నీమండలమున తరువాత సుప్రసిద్ధ న్యాయ వాదిగా పేరుపొందిన క్రైస్తవవకీలు జె. డీ. శామ్యూల్ గారు ముద్దాయిల తరఫున ధైర్యముచేసి పనిచేసిరిగాని శిక్ష తప్ప లేదు. ఈరాజద్రోహకేసులో ప్రభుత్వము తరఫున పనిచేసి నందుకొక ప్లీడరుగారికి జిల్లామునసబు ఉద్యోగము నిచ్చి గౌరవించిరి. ఆహా ! ప్రభుత్వపరిపాలనలోని నిరంకుశసంప్రదా యములును దేశభక్తుల బాధలును నాటికిని నేటికిని ఒకేరీతిగా నున్నవి గదా !

పదుగురతో చావు పెండ్లితో సమానమను మాట నిజము. కాంగ్రెసుయొక్క బలము, మహాత్ముని యొక్క సారథ్యము పత్రికలయొక్క విమర్శలు ప్రపంచప్రజాభిప్రాయమును చేయూతగాగలిగి శాంతిసమరమును చేయుచున్న ఈరోజులలో సామాన్యునకుగూడ ప్రభుత్వముతో సాత్వికనిరోధముచేసి చెరకేగు ధైర్యము కలుగుటలో నాశ్చర్యములేదు. ఇట్టిబలము సానుభూతియు సారథ్యము లేనినాడు దేశములో సంచలనము లేనినాడు నీవా యని పలుకరించువారు లేనినాడు ఒంటరియై

ప్రభుత్వక్రోధాగ్నికి ఆహుతియై చెరయందుబడి ఆరోగ్యమును చెడగొట్టుకొని బయటకు వచ్చినపిదప జీవనాధారము కూడ లేక అల్లాడుటకు సంసిద్ధుడై తన జీవితమునెల్ల ధారవోసిన ప్రథమ ఆంధ్రసత్యాగ్రహియగు నీ సర్వోత్తమరావు గారి పేరు మనము కృతజ్ఞతతో స్మరింపవలెను. ఆ దేశసేవా ఫలితముగానే ఇతడీనాటికికూడ దారిద్ర్యదుఃఖము ననుభవించుచున్నాడు. ఇట్టివా రెందరో అజ్ఞాతవీరులు కలరు. వీరి త్యాగ ఫలమే కాంగ్రెసుమహాసభకు మహత్తరమైన శక్తిని కలిగించి కాంగ్రెసు ప్రభుత్వోదయమునకు దారిచూపినది.

నాడు ఆంధ్రదేశమున ప్రజ్వలించిన దేశాభిమానము కేవలము మాటలతో చల్లారలేదు. నేటి కాంగ్రెసునిర్మాణ కార్యక్రమమువలెనే నాడును దేశాభివృద్ధికి తోడ్పడు పెక్కుపనులు జరిగెను. నాటి జాతీయభావము దేశాభిమానము ముట్నూరి కృష్ణారావుగారిచేత కృష్ణాపత్రికను జాతీయాభ్యుదయము కొరకు నడిపించినది. కోపల్లె హనుమంతరావుగారిచేత ప్లీడరు పట్టాను బందరుకాలవలో చింపి పారవేయించి ఆంధ్రజాతీయ కళాశాలను స్థాపింపజేసి యావజ్జీవ దేశసేవకునిగ జేసినది. డాక్టర్ పట్టాభిగారిని ఉద్యోగాభిలాషను విడనాడజేసి కాంగ్రెసునాయకునిగ జేసివైచినది. నాటి విజ్ఞాన వికాసములే తిరుపతి వెంకటేశ్వరులవంటి సాహిత్య సరస్వతులను, పోలవరం రాజాగారివంటి రాజ్యనీతిజ్ఞులను, ఆంధ్రదేశ బంకించంద్ర చటర్జీ యనదగిన శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారిని, కోడి రామమూర్తినాయుడుగారివంటి దేశభక్తుడగు ఆంధ్రభీముని,

కాశీనాథుని నాగేశ్వరరావు, కొండా వెంకటప్పయ్యగార్లవంటి దేశనాయకులను, ఇంకను జాతీయకళ్యాణముకొరకు సర్వస్వము త్యజించి దేశముకొరకు కాపాలతియై ధన్యులైన అసంఖ్యాకులగు అజ్ఞాతవీరులను, ఆంధ్రదేశమునకు ప్రసాదించి గాంధిమహాత్ముని స్వాతంత్ర్యయజ్ఞమునకు స్నాతకులుగ జేసినది. నాడు దేశములో నెల్లయెడల జాతీయవిద్యయు స్వదేశపరిశ్రమలు దేశాభిమానమును ప్రజ్వరిల్లెను.

## V

### దారుణవాదము ('టెర్రరిజం'.)

దేశములో ప్రభుత్వమువారు ప్రజాస్వాతంత్ర్యముల నణగద్రొక్కివేయుచు తీవ్రనిర్బంధవిధానము నవలంబించుచున్నకొలది, ప్రజలలో నందుముఖ్యముగా యువకులందు రోషము హెచ్చుట సహజము. ఈ కారణమువలన దేశాభిమానము రహస్యమార్గములబట్టి పోవుచు వక్రగతిని నడువసాగెను. వంగరాష్ట్రమున కొందఱు యువకులు ఈ పరాయి ప్రభుత్వము నేవిధముగానైనను తిరుగద్రోడవలెనని నిశ్చయించుకొని అందుకొఱకు రహస్యసంఘములు స్థాపించి దేశముకొఱకు ప్రాణము లర్పించుటకు కాళికాశక్తియెదుట ప్రమాణములు జేసి కార్యదీక్షతో పనిచేసిరి. ఐరోపాలో పరాసుదేశమునను, అమెరికాలోను, జరిగిన స్వాతంత్ర్యయుద్ధములను రష్యాలోను ఇతరచోట్లను అచ్చటి నిరంకుశ ప్రభుత్వములను తిరుగద్రోయుట

కచ్చటి రహస్య రాజకీయ సంఘములవారు గావించు 'టెర్రి రిజం'. భయంకర విప్లవమార్గములను వీరు ఉదాహరణముగా గొని ప్రభుత్వోద్యోగులను బాంబులువేసి వధించుటకు, తుపాకులతో కాల్చుటకు, రహస్యప్రయత్నములు చేయుట దానికి వలసిన సరంజామును సమకూర్చుకొనుట, బందిపోటుదోపిడిచేసి ధనము సేకరించుట మున్నగు దారుణపద్ధతు లవలంబింపసాగిరి. ఈ 'టెర్రిరిజం' లేక దారుణవాదము 1907 మొదలు 1908 వరకు చాలతీవ్రముగా విజృంభించెను. యువకులు బాంబులు ప్రయోగించియు, తుపాకులతో కాల్చియు ఇతరవిధములగు దారుణకృత్యములు జరుపసాగిరి. జిల్లా మేస్ట్రేటుపైన తుపాకీ పేల్చిరి. లెప్టినెంటు గవర్నరును చంపప్రయత్నించిరి. కింగ్సు ఫోర్డును బాంబువేసి చంపుటకు ప్రయత్నింపగా నది ముజఫర్ పూరులోని ఇర్వురు ఆంగ్లేయ స్త్రీలకు తగిలి వారు మరణించిరి.

ప్రభుత్వమువారును దారుణవాదమునకు ప్రతిక్రియగా తీవ్రమైన అత్యాచారములు చేయుచు, సోదాలు, నిషేధాజ్ఞలు, నిర్బంధములు కూరకృత్యములు చేయసాగిరి. ఆకాలమున శ్రీ అరవిందఘోషు వంగదేశములోను, లోకమాన్య తిలకు మహారాష్ట్రములోను పత్రికలను నడుపుచు ప్రజలలో చాలా పలుకుబడిని కలిగియుండిరి. తిలకుమహాశయుని కేసరి పత్రిక ఆనాడు 20,000 ప్రతు లమ్ముడు పోవుచుండెను. ఆనాటి జాతీయ పత్రికలలో ప్రధానములైన ఈ కేసరి మొదలుగా గల పత్రికలు దారుణవాదుల చర్యలను ఖండించుచుండెను. గాని ఆయువకుల దేశభక్తిని మెచ్చుకొని క్రూరములగు

ప్రభుత్వచర్యలను నిరసించుచుండెను. ముజఫర్‌పూరు హత్య ననుగూర్చి తిలకుగారు వ్రాసినవ్రాతలకు ప్రభుత్వమువారు ఆయనను పట్టుకొని రాజద్రోహమునకు శిక్షించి ఆరుసంవత్సరములు ప్రవాసముంపిరి.

పంజాబులోకూడా విప్లవోద్యమము 1907 నాటికే వర్ధిల్లెను. వలసకేగిన భారతీయులపట్ల ఆంగ్ల ప్రభుత్వము ద్రోహము చేసినదను ప్రచారము జరిగెను. పోలీసువారిని సైనికులను తిరుగుబాటు గావింపుడని అచ్చటి నాయకులు కొందరు ప్రోత్సహింపసాగిరి. ఈ ఉద్యమము నరికట్టుటకు ఈ ప్రభుత్వమువా రచ్చటగూడ తీవ్ర నిర్బంధశాసన ప్రయోగము జేసిరి. లాలాలజపతిరాయిగారిని, అజితసింగును 1818 రెగ్యులేషనుక్రింద పట్టుకొని విచారణలేకుండా చెరపట్టి ప్రవాసమంపిరి. ఆరోజులలో ఈ తీవ్రజాతీయవాదము విప్లవవాదము దారుణవాదమును ఇంగ్లాండులోని భారతీయులలోగూడా వర్ధిల్లెను. అచ్చట శ్యామ్‌జీ కృష్ణవర్మ స్థాపించిన ఇండియా హౌసులో విప్లవోపదేశములు జరిగెను. 'భారతదేశస్వాతంత్ర్యయుద్ధగ్రంథ' కర్తయగు సవర్కారుప్రభృతులు దానిలో సభ్యులు. ఇంగ్లాండులోకూడా 1909 లో ఇరువురు తెల్లవారు హత్యగావింపబడిరి.

ఈ సమయమున ప్రభుత్వమువారు వంగరాష్ట్ర యువకుల నెల్లరను పట్టివేయవలయునని ప్రయత్నించుచుండగా కలకత్తాలో "మాణిక్తలా"తోటలో బాంబులుచేయు ఫ్యాక్టరీ బయలుపడెను. అంతట చాలామంది యువకులను పట్టుకొని చక్రవర్తిపైన యుద్ధముచేయ ప్రయత్నించిరనియు కుట్రచేసి

రనియు వారిలో 34 మందిపైన నేరమునుమోపి విచారించిరి. వారిలో 15 మంది యువకులు శిక్షింపబడిరి. ఈఆలీపూరు కుట్ర కేసులో శిక్షింపబడినవారిలో శ్రీ అరవింద ఘోషుగారి సోదరు డగు బరీంద్ర కుమార ఘోషుకూడ ఒకడు. అరవిందునిపైన కూడా నేరములు మోపిరి. ఆయన తరఫున చిత్తరంజన దాసుగారు వకీలు. అరవింద ఘోషు విడుదల అయిన తరువాత ఆయన ఫ్రెంచి రాజ్యములోనికిపోయి పాండు చెరీలో తపమాచరింపసాగెను. విప్లవోద్యమముల నణచుటకు ప్రయత్నించు నెపమున ప్రభుత్వము విపరీత నిర్బంధములెల్ల ప్రయోగించి ప్రజల స్వాతంత్ర్యములెల్ల అణగద్రొక్కి వేయుచుండెను. తమ కెదురాడువారు లేకుండ ప్రజాభి ప్రాయము నణగద్రొక్కి వేయదలచి ప్రభుత్వమందుకు వలసిన క్రొత్త శాసనములనుకూడ చేసెను. 1908 లో నేరముల ప్రోత్సాహ చట్టమును ప్రయోగించి ముద్రణాలయములను పత్రికలను బెదిరించెను. ప్రేలుడుపదార్థములచట్టము శాసించెను. ప్రచారముచేయు జాతీయసంస్థల నణగద్రొక్కుటకు 'క్రిమినలు లా అమెండుమెంటు' శాసనమును జేసెను. సైనికశాసనము సందువలె తీవ్ర నిర్బంధ విధానములందు ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యములను నాశనముజేసి ప్రజాభిప్రాయము నణగ ద్రొక్కి వైచిరి. ఈ నిర్బంధములను, క్రూరవిధానమును చూచి దేశములోని మితవాదులు ప్రభుత్వము నేమనలేక హాహాకారములు మాత్రము చేయసాగిరి. వీరీ హాహాకార ములుకూడా చేయకుండ వీరిని బుజ్జగించి వీరిని చేరదీసి తమ

నిర్బంధ విధానమునకు తోడ్పడజేయవలయు నన్నచో ఏవో కొన్ని స్వల్పపు రాజకీయ సంస్కరణములు జేసి వీరికి కొన్ని గౌరవబిరుదులును గౌరవోద్యోగములను ఒసగి తృప్తిపరచుట యావశ్యకమని నాటి రాజప్రతినిధియగు మింటో ప్రభువును ఇంగ్లాండు రాజ్యాంగమంత్రి మార్లే ప్రభువును నిశ్చయించిరి. తమ గులాములగు నీ జమీందారులకును ఈ మితవాదులకును ప్రాతినిధ్యము నొసగగల శాసనసభలను నిర్మించినచో, వీరి సలహాతోనే తమ నిరంకుశ పరిపాలనమును జరిగింప వచ్చుననియు తలచి ఒక రాజ్యాంగసంస్కరణము జేయదలచిరి.

## మూడవ ప్రకరణము

## హొంరూలు - స్వరాజ్యోద్యమము

తానొకటి తలచిన దైవ మొకటి తలచునను సామెత నిజమైనది. మింటోమార్లే సంస్కరణములు ప్రసాదించిన రాజ్యాంగము నిరుపయోగమే యైనను, దేశములో రాజకీయ విజ్ఞానము కలిగించుట కిది ప్రజల కుపయోగపడెను. దీనిలో చేయబడిన తీర్మానములు, జరిగిన చర్చలు, బ్రిటీషు రాజ్యతంత్రముయొక్క ఆర్థికలాభవిధానమునుగూర్చియు పరిపాలనా పద్ధతినిగూర్చియు గోఖలేగారు చేసిన తీవ్రవిమర్శనములు ప్రజలలో గొప్పసంచలనము కలిగించెను. శాసనసభలందు వేయబడిన ప్రశ్నలవలన అనేకసంగతులు, ప్రభుత్వ రహస్యములు, బయల్పడి ప్రజల రాజకీయ పరిజ్ఞానము వర్ధిల్లెను. 1917 నాటికి గవర్నరు జనరలు సభలో 168 తీర్మానములు చేయబడెను.

73 తీర్మానములలోని సూచనలనుబట్టి ప్రభుత్వము కొన్ని చర్యలు గైకొనుటయు తటస్థించినది. రాష్ట్రములందుకూడ ఇట్టి శాసనసభలవలన స్వపరిపాలనలోని రుచి, ప్రజాప్రతినిధులకును రాజకీయ నాయకులకు ను తెలిసినది. ఈ రాజ్యాంగము వలన ప్రజలందు స్వపరిపాలనాభిలాషయు స్వరాజ్యకాంక్షయు నధికమైనవి.

బ్రిటీషు సామ్రాజ్య పరిస్థితులుగూడ భారతీయుల స్వరాజ్యకాంక్షకు దోహద మొసగెను. దక్షిణాఫ్రికాలో బ్రిటీషు బోయరు యుద్ధము తరువాత జరిగిన రాజ్యాంగ సంస్కరణముల వలన నా దేశములోని తెల్లవారికి బాధ్యతాయుతస్వపరిపాలనము కలుగజేయబడి అది భారతీయులదృష్టి నాకర్షించెను. ఇంతేకాదు; తమ దేశము బ్రిటీషువారి బానిసరాజ్యముగా నుండుటవలన తమజన్మభూమియగు భారత దేశములోనే తాము దరిద్రులుగా నుండుటయేగాక బ్రిటీషు సామ్రాజ్యములో చేరిన తక్కిన రాజ్యములందును దక్షిణాఫ్రికాలోను గూడా భారతీయులు దరిద్రులై హక్కులు లేక కష్టపడుటయు, దక్షిణాఫ్రికాలో అనేక అన్యాయములు జరుగుచుండుటయు, వానిని మాన్పుట కెవ్వరు నేమియు చేయలేక పోవుటయు, చూడగా స్వపరిపాలనము లేనిది భారతీయుల కష్టములు గట్టెక్కవని గ్రహించిరి.

దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కులకొరకు గాంధీ మహాత్ముడు స్వయంసహాయ్యపద్ధతితో పోరాడి సాత్వికనిరోధము చేయుగా 'గాంధీస్మట్సు' రాజీనామా జరిగి భారతీయులకు కొన్ని హక్కులు కలిగెను. ఇట్లు స్వయంసహాయ పద్ధతులతో

స్వరాజ్యప్రయత్నముచేయుటయే భారత దేశీయులకును సరియైన మార్గమనియు తెలిసివచ్చినది. ఐర్లాండులోని స్వతంత్రవాదులగు సిన్ ఫిన్ పక్షమువారు దేశస్వాతంత్ర్యముకొరకు చేయుచుండిన కృషియు లేవదీసిన విప్లవమును భారతీయులకొక గుణపాఠముగా నుండెను.

ఇట్టిస్థితిలో భారత దేశములోని దివ్యజ్ఞానసమాజాధ్యక్షురాలును భారతనాగరకతయందు అత్యంతప్రేమగలిగిన విదుషీమణియునగు ఆనీబిసెంటుగారు ప్రజాభిప్రాయమును గ్రహించి భారత దేశమునకు స్వపరిపాలనమును సంపాదించుటకు సేవచేయదలచి ఆ దేశములో 'హోంరూలులీగు' అనబడు సంస్థను, దేశములో దానికి శాఖోపశాఖలుగా హోంరూలు సమితులను "న్యూయిండియా" పత్రికను స్థాపించి తీవ్రమైన రాజకీయాందోళనమును శాస్త్రీయపద్ధతులపైన నడుపసాగెను. అందువలన దేశములో గొప్ప రాజకీయప్రబోధము కలిగెను. బర్మాలో మండలేనుండి 1914 జూనునెలలో విడుదలయై వచ్చిన లోకమాన్య డామెకు సాయమొనర్చెను.

ఆ సమయమున జరుగుచున్న ఐరోపామహాసంగ్రామ సందర్భమున దేశమున శాంతిభద్రతలను స్థాపించుట కని బ్రిటిషుసామ్రాజ్యమువారు "డిఫెన్సు ఆఫ్ ఇండియా" చట్టమును శాసించి దానిక్రింద దేశములోని రాజకీయ నాయకులను చెరలోనుంచి తీవ్రనిర్బంధ విధానమును ప్రయోగించిరి. పత్రికాశాసనమును ప్రయోగించి పత్రికల ధరావతులను రద్దుచేసియు ముద్రణాలయములను స్వాధీనపరచుకొనియు

స్వాతంత్ర్యోద్యమమును అణచుటకును ప్రజాభిప్రాయము నణగద్రొక్కుటకును ఎన్నో నిషేధాజ్ఞలను నిర్బంధములను ప్రయోగించిరి. ఆనీబిసెంటును ఆమె అనుచరులను నిర్బంధించిరి. అంతట సర్ సుబ్రహ్మణ్యఅయ్యరుగారు తమ అసమ్మతినిదెలుపుటకు 'సర్' బిరుదును వదలుకొనిరి. ప్రభుత్వమువారు 143పత్రికలను బెదరించగా నవి భయపడిపోయెను. ఈ సందర్భమున 3 పత్రికలును 13 ప్రెస్సులును తమ ధరావతులను గోల్పోయెను.

ఐరోపా మహాసంగ్రామముయొక్క ఉద్దేశము లోకమునందలి చిన్నజాతులయొక్క స్వాతంత్ర్యము కాపాడుటయని ప్రకటింపబడుటయు అన్నిజాతులు తమ యిష్టానుసారము స్వాతంత్ర్యముగా నుండవలెనను స్వయంనిర్ణయ సూత్రమును, విశేష ప్రచారములోనికిరాగా భారత దేశీయులకు కూడ కొంతఆశ కలిగెను. ఐరోపామహాసంగ్రామములో భారతీయ యోధులును సైనికులును చూపిన ధైర్యసాహసములు ప్రజలలో జాతీయభావమును వర్ధిల్లజేసెను. రష్యాఓడిపోయి విప్లవమున మునిగియుండగా జర్మనీవారు ముందుకు వచ్చుచుండగా ఆవిపత్సమయములో ఐరోపామహాసంగ్రామమున ధనము సైన్యము అమితముగా కావలసివచ్చెను. ఆసందర్భములో బ్రిటిషుప్రభువులు తమ జాతీయ గర్వమును విడచి భారత దేశప్రజలతోను సంస్థానాధీశులతోను ఆలోచనలుసలిపి వారిసహాయమును గోరిరి. సంగ్రామ సమాలోచనలందును 1917-18 లలో జరిగిన సామ్రాజ్య కార్యాలోచన సభలందును మంత్రిమండలి సభలందును కూడ భారత దేశమునకు ఒకస్థాన మొసగబడి భారత దేశప్రభుత్వ ప్రతినిధులను సంస్థా

నాధీశులను అందుపాల్గొనుట కవకాశమిచ్చిరి. తరువాత జరిగిన సంధిసమయమందు కూడ భారతదేశము పాల్గొనుటయు సంధి పత్రముపైన భారతదేశపు ప్రతినిధులు సంతకము చేయుటయు జరిగినందున అప్రియత్నముగ నిట్లు భారతదేశమునకు అంత ర్జాతీయ వ్యక్తిత్వమొకటి యేర్పడెను. ఈ సందర్భములలో బ్రిటిషుసామ్రాజ్యమువారు భారతదేశరాజకీయ వాతావరణ మందు కొంతశాంతినికలిగించి భారతదేశమున కాసగొలిపి వారి వలన సహాయముపొంది తమయాపద గడవబెట్టుకొనుట యుక్త మనితోచి భారతీయులకు క్రమక్రమముగా బాధ్యతాయుతస్వపరి పాలనమునందు అనుభవము కలిగించి వారికట్టి స్వపరిపాలనము నిచ్చుటయే తమయుద్దేశమనియు సామ్రాజ్య పరిస్థితులలో కొంత శాంతి యేర్పడగానే అందు కనుగుణములగు ఏర్పాటులు గావింపబడుననియు తమ రాజ్యాంగ మంత్రియగు మాంటేగ్యూ చేత 1917 ఆగష్టు 20వ తేదీన బ్రిటిష్‌వారొక ప్రకటనజేసిరి. దీనివలన భారత దేశములో గొప్ప యుత్సాహము కలిగెను. అనీబిసెంటుగారిని విడుదలచేయగా దేశములో ఆమె కెంతో గౌరవము కలిగెను. ఆమె కలకత్తా కాంగ్రెసుకు అధ్యక్షత వహించెను.

ఐరోపాసంగ్రామమున బ్రిటీషుసామ్రాజ్యము యొక్క మిత్రమండలికే జయము కలిగినది. తరువాతజరిగిన సంధి యే ర్పాటులందును బ్రిటిషుసామ్రాజ్యమువారియొక్క రాజ్యతంత్ర మునకే జయముకలిగి వారికే విశేషలాభములు చేకూరెను. అంతట భారతదేశమునకు తాముచేసిన వాగ్దానములను చెల్లిం

చుటలో బ్రిటిషువారొక గొప్పతంత్రమును పన్నిరి. దేశము నకు నిజముగా బాధ్యతాయుత స్వపరిపాలనము నిచ్చినచో తమ క్షేమలాభములకు భంగము కలిగితీరునని వారికి భయము కలిగెను. అందువలన తాము భారతదేశమున పొందుచున్న లాభముల కెట్టి భంగమును కలుగకుండునట్లు తగు బందోబస్తు లెల్ల జేసికొనవలెను. పైకి కొంత భారతీయులకు మేలుచేసినట్లు కనపడవలెను. అందువలన ఈ ఉద్దేశములను లోపలపెట్టుకొని రాజ్యాంగ సంస్కరణములనుగూర్చిన విచారణయను నొక నాటకమును జరిపిరి. 1918 లోనే మాంటేగూ్యు ఛెమ్సుఫోర్డు నివేదికను ప్రకటించిరి. ఇదియంతయు నాటకమనియు వారు చేయదలచుకొన్న సంస్కరణల ప్రణాళిక అదివరకే నిర్ణయింప బడియుండెననియు ఇటీవల బయల్పడెను. మాంటేగూ్యు యిక్కడకు వచ్చినప్పుడు స్వరాజ్యము గోరుచు చేయబడిన లక్షలకొలది సంతకములుగల మహాజరులతని కర్పింపబడెను. అయినను మాంటేగూ్యు ఛెమ్సుఫోర్డు రాజ్యాంగ సంస్కరణ ములలో మందునకైన స్వరాజ్యము గానరాదయ్యెను. ఇది భారతీయుల కెల్లరకును ఆశాభంగము కలిగించెను. "ఈసంస్కర ణములు బ్రిటిషువారు ప్రసాదించుటకుగాని భారతీయులు స్వీక రించుటకుగాని యోగ్యమైనవి కావని అనీబిసెంటు వ్రాసెను.

దేశములోని కాంగ్రెసువాదులలో చాలమంది మాంటే గూసంస్కరణములను నిరాకరింపవలెననిరి. కాని లోకమాన్య తిలకును గాంధిమహాత్ముడును ఈ రాజ్యాంగమును స్వీకరించి వీనిని ఉపయోగించుకొని క్రొత్తవాని కొరకు ప్రయత్నించ తల

మనిరి. అప్పటికింకను గాంధిమహాత్మునికి బ్రిటీషు న్యాయమునందును ధర్మమునందును విశ్వాసము పోలేదు. గాంధిమహాత్ముడు ఐరోపాసంగ్రామమునకు సైనికులనుగూడ ప్రోవుచేసి బ్రిటీషు ప్రభుత్వముపట్ల తనకుగల భక్తి విశ్వాసముల ప్రకటించియుండెను. తాను దక్షిణాఫ్రికాలో చేసిన సత్యాగ్రహసందర్భమున, భారతదేశ రాజప్రతినిధియగు హార్డింజి ప్రభువును, ఇంగ్లీషు రాజనీతిజ్ఞులును, చాలా సానుభూతి చూపియుండినందున వారెల్లరు సద్ధర్ములే యనియు భారతీయులకెన్నిటికైన నిజమైన స్వపరిపాలనము నొసగుదురనియు ఆయన విశ్వాసము. అందువలననే మాంటేగ్యూ సంస్కరణ రాజ్యాంగ మెంత ఆశాభంగకరముగా నున్నను దానిని స్వీకరింపవలెనని ఆనాడట్లాయన ప్రబోధముచేసెను.

## నాలుగవ ప్రకరణము

## ఖూనీ బాగ్

### I

### రౌలటుబిల్లులు

ప్రభుత్వమువారెన్ని విధములుగా ప్రయత్నించి ఎన్ని క్రూర నిర్బంధ శాసనములు చేసినను దేశములో బయలుదేరిన అరాజక విప్లవోద్యమ మనబడు దారుణవాదము రూపుమాయలేదు. దేశములో నలుమూలలను రహస్య విప్లవ సంఘములు పాతుకొని పనిచేయుచునే యుండెను. బాంబు ప్రయోగములు, హత్యలు, బందిపోటులు సాగుచునే యుం

డెను. ప్రభుత్వమువారు విచ్చలవిడిగా నిర్బంధవిధానమును ప్రయోగించి అనేకులపైన కుట్రకేసులుపెట్టి ఉరిదీసి చెఱకంపి అనేక విధములుగా వారిని హింసించినను పూర్తి రహస్యము బయల్పడలేదు. దేశములోనిది వేళ్లుపారి, పాదుకొనినదని ప్రభుత్వము వారు గ్రహించిరి. ఢిల్లీదర్బారు సమయముననే రాజప్రతినిధియగు హార్డింజిపైన బాంబుప్రయోగము జరిగెను.

దేశములో తీవ్రవాదుర్జన్యము పురికొల్పు రాజద్రోహకరము లైన కరపత్రములు, పత్రికలు, ప్రచారము, జరుగుచునే యుం డెను. ఈయుద్యమమున తనుప్రాణము లర్పించి దేశమునకేదో సేవజేసి ధన్యులమగుదుమని స్వరాజ్యము స్థాపింపగలమని ఈ యువకులయూహ. ఇండియా డిఫెన్సుచట్టముక్రిందను 1918 సంవత్సరపు శాసనముక్రిందను నిర్బంధింపబడినవారు నాటికి 800 మంది యుండిరి. ఇట్లు పెరుగుచున్న ఈ రాజద్రోహ ఉద్య మము యొక్క శాఖోపశాఖలెల్ల పరిశీలించి దీనిని సమూ లముగా పెరికివేయు మార్గములను సూచింపవలసినదని కోరి ఆంగ్లన్యాయాధిపతియగు "రౌలటు"గారి అధ్యక్షతక్రింద నొక విచారణసంఘమును నియమించిరి. సభ్యులలో మద్రాసుహైకో ర్టున్యాయాధిపతియగు కుమారస్వామిశాస్త్రిగారు నొకరు. ఈకమిటీ నివేదిక 1918లో ప్రకటింపబడెను. వీరు దేశము లోని స్వాతంత్ర్యద్యమము స్వదేశీయుద్యమము స్వరాజ్యోద్య మము మొదలగుతీవ్రరాజకీయాందోళనములకును ఈవిప్లవోద్య మమునకును సంబంధమును గల్పించిరి. లోకమాన్యుడు అరవింద ఘోషు మున్నగునాయకు లెల్లరు ఈ రాజద్రోహకరోద్యమ

మునకు విప్లవోద్యమమునకు కారణభూతులని చిత్రచిత్ర కథ లెల్ల ఈ నివేదికలో వ్రాయబడెను. ఈ నివేదికలో ఈవిప్లవోద్యమమును కూకటివేళ్ళతో నిర్మూలించి దీనితో పాటు రాజద్రోహ మనునది లేకుండా చేయుటకు మాత్రమే గాక ప్రభుత్వము పట్ల ద్వేష భావము విరోధ భావము వర్ధిల్ల చేయు అభిప్రాయములతోపాటు సామాన్య రాజకీయాభి ప్రాయములు గూడా నిర్మూలనము చేయుగల తీవ్రనిర్బంధ శాసనములను జేయవలెనని ఈ కమిటీవారు సలహానిచ్చిరి. అంతట కనివిని యెరుగని దారుణ నిర్బంధ ప్రయోగములు తీవ్రనిషేధములు నిరోధములు కఠినశిక్షలతోను తరువాత 1932 లో చేయబడిన ఆర్డినెన్సులలోవలెనే చిత్రవిచిత్రములుగా సృజింపబడిన నిబంధనలతోను రెండుచట్టములు చేయబడెను. దేశప్రజల ప్రాతిపదికహక్కులను నిర్మూలనముజేసి దేశములో ప్రజాభిప్రాయముగాని రాజకీయ సంస్కరణోద్యమముగాని లేకుండచేయుగల ఈ ఘోరచట్టములు రద్దుజేయవలసినదని ప్రజలు రాజకీయనాయకులు ఎంత మొరపెట్టినను ప్రభుత్వము వారు వినిపించుకొనలేదు.

## II

## ఖూనీ బాగ్

దక్షిణాఫ్రికా సత్యాగ్రహ నాయకుడు సబర్మతీ సత్యాగ్రహ ఆశ్రమస్థాపకుడు నగు గాంధిమహాత్ముడు ఈ అన్యాయపు బిల్లులనుగూర్చి గొప్ప ప్రచారముచేసి వీనిని నిరోధించుటకును రద్దుపరచుటకును పూనుకొని నడుముగట్టి

అవసరమైనచో నందుకొరకు సాత్వికనిరోధముకూడ చేయ దలచెను. ఈ సందర్భమున దేశములో నెన్నో సభలు చేయబడు చుండెను. రౌలటుశాసనముపట్ల తీవ్రమైన అసమ్మతిని దెల్పుచు 1919 ఏప్రియలు 6 వ తేదీన దేశములో శాంతియుతముగా సభలు, హర్తాళములు చేయబడెను. కొన్నిచోట్ల హర్తాళములు చేయుటకు బలవంతములు జరిగినను పోలీసువారికిని ప్రజలకును కొన్నిచోట్ల స్వల్పపు పోరాటములు జరిగినను మొత్తముమీద దేశనాయకులు శాంతిని స్థాపింపగలిగిరి. పంజాబులో అమృతసర్ లో జాతీయనాయకులగు సత్యపాలు కిచ్లూగార్లను ఏప్రిలు 10వ తేదీన అధికారులు ఆకస్మికముగాపట్టుకొని ప్రవాసమంపిరి. అంతట దీనికి ప్రజలు తమ అసమ్మతిని తెలుపసాగిరి. ఈప్రజలు శాంతియుతముగనే యున్నను పోలీసువారు వీరిని పోనీయక ఆటంకపరచిరి. ఈ గుంపు పోలీసులను వెనుకకు నెట్టిన దనునెప మున వీరిపైన పోలీసువారు తుపాకులు కాల్పగా చాలమంది గాయపడిరి; కొందఱు చచ్చిరి. అంతట నీ ప్రజలలో కొంత కల్లోలము కలిగెను. వీరిలో కొందరు దౌర్జన్యము జరిపినమాట వాస్తవమేగాని ఇంతలోనే కమీషనరు శాంతిభద్రతలను స్థాపించుటకు మిలిటరీ అధికారియగు డయ్యరును సహాయము కోరవలసిన ఆవశ్యకత యెంతమాత్రమును లేదు.

13 వ తేదీన 20 వేల మంది అమృతసరమున జలియన్ వాలాబాగ్‌లో శాంతియుతముగా సమావేశమై 10 వ తేదీన జరిగిన కాల్పులనుగూర్చి అసమ్మతిసభను జరుపుచుండగా డయ్యరు అచ్చటికి ప్రత్యక్షమై వారిని తొలగిపోవుడని ముం

దుగా 'వార్నింగు' నైన నివ్వక తుపాకులతో కాల్పించి చచ్చిన వారిని, గాయపడిన వారిని అచ్చటనే వదలివెళ్లెను. వారి కెట్టి సహాయమును చేయలేదు. ప్రభుత్వ లెక్క ప్రకారమే 400 మంది చచ్చిరి. రెండు వేలమంది వరకును గాయపడిరి. అప్పటి కింకను సైనిక శాసనము (మార్షల్ లా) ప్రయోగింపబడలేదు. కాని సాక్షాత్తుగా మార్షల్ లా అమలు జరుపబడుచునే యుండెనని డయ్యరు సాక్ష్యమిచ్చినాడు. 13 వ తేదీన ఎట్టి సభలు జరుపరాదని తాను నిషేధించుటను గూర్చి ముఖ్యమైన అన్ని చోట్లను చాటించితి నన్నాడు. కాని అది అబద్ధమని తేలినది. చాలాచోట్ల యీ నిషేధము ప్రకటింపబడనే లేదు. సభలోని వారిని తొలగిపొమ్మని తాను చెప్పలేదని డయ్యరు అంగీకరించినాడు. పైనచెప్పబడిన అక్రమముల వలన జలియన్ వాలా బాగ్‌కు "ఖూనీబాగ్" అని పేరువచ్చినదని మోతీలాల్ నెహ్రూగారు అసెంబ్లీలోనే చెప్పినారు.

## III

### మార్షల్ లా

అమృతసరములోని ఘోరకృత్యముల తరువాత లాహోరు, గుజ్రాన్‌వాలా, కాన్పూరులలో గూడ దౌర్జన్యములు జరిగెను. అంతట పంజాబులో మార్షల్ లా సైనికశాసనము ప్రకటింప బడెను. డయ్యరుసేనానికి మద్దత్తు చేయుటకు, మార్షలులా అవసరమని ఆనాటి పంజాబు గవర్నరు మైకేల్ ఒడ్వాయరు చెప్పిన మాటలను నమ్మి వైస్రాయి చెమ్సుఫర్డు సైనికశాసనమును ప్రయోగించి

నాడేగాని దాని అవసరమునైన విచారించి తెలుసుకొనలేదు. ఈసైనిక పరిపాలనలో అత్యాచారములు జరుగకుండా ఎట్టి జాగ్రత్తలను తీసికొనలేదు. శాంతిభద్రతల పేరున జరిగిన ఘోరాన్యాయములను గూర్చి కాంగ్రెసు విచారణసంఘము వారును హార్నిమనుగారును నిష్పక్షపాతముగా వర్ణించి యున్నారు. గాని ప్రభుత్వమువా రేర్పచిన హంటరుకమిటీవా రానాటి యన్యాయములకు వెల్లవేసి కప్పిపుచ్చినారు.

పంజాబులో జరిగిన ప్రతివిషయమును గూర్చియు జాగ్రత్తగా విచారించి తెలిసికొంటి ననియు ఇది చాలా సిగ్గుచేటుగను సమర్థింప వీలులేనిదిగను, క్షమింప వీలులేనట్టిదిగ నున్నదని సి. యఫ్. ఆండ్రూస్ గారు చెప్పియున్నారు. సర్ శంకరనాయరుగా రీయక్రమములను జూచి తమ లామెంబరు పదవికి రాజీనామా నిచ్చిరి. రవీంద్రనాథఠాకూరుగా రీయన్యాయములకు తమ దుఃఖమును తెలిపి అసమ్మతి సూచకముగా తమ సర్ బిరుదమును త్యజించిరి.

మార్షల్‌లా అమలులోనున్న రోజులలో భారతీయ స్త్రీపురుషులు అవమానింపబడి హింసింపబడిరి. ఒకవీధిలో పోవువారెల్లరును పురుగులవలె నేలపైన ప్రాకిపోవలెనని యాజ్ఞాపింపబడిరి. అట్లు పోవనివారిని చావగొట్టిరి. ఎంతటి మర్యాదస్థులనైనను బహిరంగముగా కొరడాలతో గొట్టుట, సలాములు చేయుడని నిర్బంధించుట, సాష్టాంగప్రణామముచేయుమని నిర్బంధించుట, వస్త్రవిహీనులుగజేసి అగౌరవించుట, తన్నుట, సర్వసామాన్యముగా జరిగినది. ఇద్దరు నేటివులు కలసి

తిరుగరాదు. తిరిగినచో దొరలకు కోపమువచ్చి శాంతికిభంగము చేయుదురట! (ఈసంగతిని కర్నల్ జాన్సను తనసాక్ష్యములో చెప్పినాడు.) గుజ్రాన్ వాలాలో పైనుండి ప్రజలపైన బాంబులు కురిపించిరి. చదువుకొను పిల్లల బోర్డింగుహౌసుపైన బాంబులు వేసిరి. భారత దేశప్రభుత్వమువారు డయ్యరు సేనాని పొరబాటు చేసెనని చెప్పి అతనిని మన్నించి యతని పింఛనుకు లోపము లేకుండ జేసిరి. ఆంగ్లేయు లతనికి బహుమతులిచ్చి గౌరవించిరి.

ఆకాలములో పంజాబురాష్ట్రమునకు గవర్నరుగానుండిన సర్ మైకేల్ ఒడ్వాయరు చేసిన ఘోరముల నెల్ల లాలా లజపత్ రాయిగారు తమకాంగ్రెసు అధ్యక్షోపన్యాసములో పూస గ్రుచ్చినట్లు వర్ణించి అతడుచేసిన నేరములకు విచారించి శిక్షింప వలెననికోరిరి. గాని అట్లు జరుగలేదు సరికదా ఈతని నాంగ్లే యులు బహూకరించి గౌరవించిరి. ఇత డింగ్లాండునకువెళ్ళిన పిదప గూడా భారత దేశక్షేమమునకు వ్యతిరేకముగా పాటుపడ జొచ్చెను. ఆనాడు ఒడ్వాయరుచేసిన అన్యాయములను లజపత్ రాయిగా రిట్లు వర్ణించియున్నారు:

1. "హిందువులను మహమ్మదీయులను విడదీసి పాలిం చుట కితడీ రెండు తరగతులకును సిక్కులకునుగూడ మిత్రభేద ములు కల్పించినాడు.

2. శౌర్యముగలవారని, విద్యావంతులని, గ్రామస్థు లని, పట్టణవాసులని, ప్రజలలో అనేక భేదములు కల్పించి పాలించినాడు.

3. ఐరోపా సంగ్రామముకొరకు, సైనికులను జేర్చుటకును యుద్ధవిరాళముల నిధులను యుద్ధఋణమును సేకరించుటకును తన అధికారము నుపయోగించినాడు. తన క్రింది యధికారు లిందుకొఱకు గావించిన అన్యాయములనెల్ల కప్పిపుచ్చినాడు.

4. తనకు లొంగనివారిని, ఏమాత్రమైన రాజకీయాభివృద్ధికావలెనని కోరినవారిని, స్వాతంత్ర్యబుద్ధి గలవారిని, అణచివేయుటకు శాసనధర్మముల నుపయోగించినాడు.

5. పంజాబులో 'మార్షల్‌లా' అవసరమని కేంద్రప్రభుత్వమునకు అబద్ధములు జెప్పి మోసగించినాడు.

సామాన్య రాజద్రోహనేరములనుగూడ సైనిక శాసనధర్మముక్రింద నిరంకుశముగా విచారణలు చేయించినాడు. తన యభిప్రాయములతో 'జనరల్ ఆఫీసర్ కమాండింగ్' ఏకీభవించుచున్నాడని అబద్ధములాడి కేంద్రప్రభుత్వమును మోసగించినాడు.

6. పంజాబులో నెట్టి తిరుగుబాటును లేకున్నను, ఎట్టి అశాంతియు మఱల కలుగునను నమ్మకము లేకపోయినను, కేవలము కక్ష సాధించి కసితీర్చికొని శిక్షార్థముగా శాస్తి చేయుటకు వీలుగానుండుట కొఱకు (మార్షల్‌లా) సైనికశాసనముయొక్క ప్రయోగమును అనవసరముగా పొడిగింపజేసినాడు.

7. ప్రత్యక్షముగాను పరోక్షముగాను స్వయముగా ప్రోత్సహించియు, హర్షించియు, పంజాబులో నాకాలమున

జారీచేయబడిన అన్యాయములైన ఉత్తర్వులకును అక్రమ శిక్షలకును అవమానములకును కారకుడైనాడు.

8. జలియనువాలాబాగు వధలు జరిగిన పిమ్మట తన చర్యలవలన దానికి సహాయభూతుడైనాడు. మఱియు తాను నిర్ణయించిన పద్ధతుల ప్రకారము జరుపబడిన అత్యాచారములకెల్ల బాధ్యుడైనాడు.

9. ఇతడు పంజాబు ప్రజలపైన కక్షగట్టి శిక్షార్థపు పన్నులను, జుల్మానాలను, విధింపజేసి వానిని క్రూరముగా వసూలు చేయించినాడు.

10. అమృతసరమున ఇంత అశాంతి, ఇన్ని దౌర్జన్యములు, అత్యాచారములు జరిగినను, ఇత డచ్చటికి పోయి ఏమి జరిగినదనియైన విచారింపలేదు.

11. తా నీ దేశము వదలిపోవునప్పుడు, తన అధికారమును, ప్రాపకమును వినియోగించి, తనపట్ల ప్రజలకు భక్తి విశ్వాసములు గలవని చూపుటకు తనకు వీడ్కోలువులు సమ్మానములు, వినతిపత్రములు నిచ్చునట్లు బలవంతము చేసినాడు. అందొక దానిలో కొన్ని సంగతులను దిద్ది ఇంగ్లాండులో తనను సమర్థించుకొనుట కుపయోగించుకొన్నాడు.

## IV

### స హా య ని రా క ర ణ ము.

పైన చెప్పబడిన ఘోరమైన అన్యాయములు విచారించి దుర్మార్గులను శిక్షింపకపోవుటయేగాక డయ్యారు చేసిన అకృత్యములను పొగడి వానిని గౌరవించుట చూడగా గాంధి మహా

త్మునికి మనస్తాపమును విషాదమును కలిగి బ్రిటీషుధర్మమునందు నమ్మకము పోయి ఆయన సహాయనిరాకరణము చేయనిశ్చయించెను. 1920 సెప్టెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెసులో నీపరిస్థితులెల్ల చర్చింపబడి నూతన రాజ్యాంగము తిరస్కరింపబడి రౌలటు చట్టమును రద్దు పరచుటకు ఖిలాఫతు విషయమున జరిగిన అన్యాయము మాన్పుటకును స్వరాజ్యము సంపాదించుటకును సత్యాగ్రహమే శరణ్యమని గ్రహింపబడి సహాయనిరాకరణ తీర్మాన మామోదింపబడెను. సమ్మెలు, హరతాళములు, నిరసన సభలు, దేశమెల్లయెడలను జరిగెను. క్రొత్తశాసనసభలకు 1920 అక్టోబరులో జరిగిన ఎన్నికలు బహిష్కరింపబడెను. జాతీయాందోళనము తీవ్రమయ్యెను. 1921 లో జరిగిన కాంగ్రెసులో సహాయనిరాకరణోద్యమ విషయమున మహాత్మునికి సర్వాధికారము లివ్వబడెను. తాను ప్రారంభింపబోవు త్రివిధబహిష్కారము (కోర్టులు, శాసనసభలు, పాఠశాలలు - బహిష్కరించుట) సహాయనిరాకరణము లను గూర్చి మహాత్ముడు రాజప్రతినిధియగు రీడింగు ప్రభునికి 1922 లో అంత్యసందేశము పంపెను. త్వరలోనే మహాత్ముడు బార్డోలీలో పన్నుల నిరాకరణము, శాసనోల్లంఘనము, నారంభింపదలచెనుగాని చౌరిచౌరాలో జనసామాన్యములోని కొందరు చేసిన దుండగములును ప్రాణిహింసయు జూచి దేశమింకను సిద్ధముగా లేదని తన యుద్యమము నాపివైచెను. ప్రభుత్వమువారు తత్క్షణమే మహాత్ముని పట్టుకొని రాజద్రోహమునకు 6 సంవత్సరముల శిక్ష వేసిరి. దేశములో తీవ్రనిర్బంధవిధాన

మును సాగించిరి. ఇరువదినాల్గువేలమందిని పైగా చెరకంపిరి. దేశములో గొప్పసంచలనము కలిగెను. అప్పుడు బొంబాయి గవర్నరుగానుండిన సర్ జార్జిలాయిడ్ 'కొద్దిలోతప్పిపోయినదిగాని మహాత్ముని యుద్యమము సఫలతగాంచి యుండెడిదే'యని తరువాత అంగీకరించినాడు. మహాత్ముని యుద్యమమందు శ్రీమంతులు,బీదవారు, స్త్రీలు,పురుషులు, త్యాగముజేసి చెరకేగి బాధలనుభవించిరి. చిత్తరంజనుదాసు, నెహ్రూ, మోతీలాలు,ప్రకాశం, రాజగోపాలచారిగార్ల వంటి గొప్ప న్యాయవాదులు ఆనాడే తమ వృత్తిని త్యజించి జైలుకేగిరి. కొంద రుద్యోగములుమానిరి. శాసనసభలు బహిష్కరించిరి. బిరుదులు త్యజించిరి. విద్యార్థులు పాఠశాలలు వదలిరి. మాంటేగూ సంస్కరణల శాసనసభలకు జరిగినఎన్నికలు బహిష్కరింపబడెను. 3వ వంతు మందికూడ ఓటుచేయ లేదు. అహింసాపద్ధతులతో శాంతిసమరము చేయుపద్ధతి భారతదేశమునకు క్రొత్తది. మహాత్ముని యుద్యమ మిట్లు జరుగుచుండగా మలబారులో మాప్లా తిరుగుబాటును ఆంధ్రదేశపు రంప ప్రదేశములందు అల్లూరి సీతారామరాజుగారి విప్లవోద్యమమును - స్వాతంత్ర్యముకొరకు చేయబడిన ప్రయత్నములు - తలెత్తి ప్రభుత్వము వారిచే ఘోరముగా అణచివేయబడెను.

ఈలోపుగా మాంటేగూ ఛెమ్సుఫర్డు సంస్కరణల రాజ్యాంగము అమలులో పెట్టబడెను. చిత్తరంజనదాసు మోతీలాల్ నెహ్రూ ప్రభృతులు జైళ్ళనుంచి వచ్చినపిదప తీవ్రముగా ఆలోచించి కాంగ్రెసులో స్వరాజ్యపక్షమును స్థాపించి

శాసనసభలందు ప్రవేశించి నూతన రాజ్యాంగ ప్రభుత్వ విధానమును భగ్నము చేయదలచిరి. శాసనసభలో వీరికి బలము చేకూరెను. మాంటేగూ రాజ్యాంగవిధాన మెంత బూటకమైనదో వెల్లడింపసాగిరి.

ఐ ద వ ప్ర క ర ణ ము.

## మాంటేగూ సంస్కరణల నాటకము

I

మాంటేగూ రాజ్యాంగసంస్కరణలయొక్క పరిపాలనా విధానములోని లోపములను మననాయకులు, ఉద్యోగులును కూడ చాలమారులు నిరూపించి యున్నారు. ఎన్ని లోపము లున్నను రాజ్యాంగధర్మనిర్వహణమున పరిపాలకవర్గ ముదార బుద్ధితో మెలగునెడల ప్రజలకు, కొంతగాకపోయిన గొంతవర కైన, లాభకారిగ నుండియుండునుగాని మన కట్టి భాగ్యము కలుగలేదు.

రాజ్యాంగ విధానమునందు ప్రజాభిప్రాయమును వృథ సేయగల అనియంత్రిత నిర్నిరోధ నిరంకుశాధికారములు గవర్నరు జనరలుకుండెను. ఈశక్తుల నాతడుపయోగించి నను, ఉపయోగింపక పోయినను సాధారణ పరిపాలనమునందు గూడ ప్రజాప్రతినిధుల శాసనసభవారి యభిమతమును ద్రోసి పుచ్చి ప్రభుత్వవర్గము తమ యిచ్చవచ్చినట్లు పరిపాలింప గల సందర్భములు నా పరిపాలనావిధానమునం దుండెను.

కార్యనిర్వాహకవర్గము అసెంబ్లీసభకు బాధ్యత వహింపని నిరంకుశ పరిపాలకవర్గముగ నుండెను. మఱియు నీపరి

పాలకవర్గము నసెంబ్లీ సభవారు తీసివేయజాలరు. అందు వలన వారికి ప్రజాభిప్రాయమువలన భయములేదు. నూటనలుబదిమందిగల అసెంబ్లీ సభయందు నలుబది మంది పరిపాలకవర్గమువారి ఉద్యోగులు, నియామకులునై యుండిరి. ఈ తాబేదారుల సమ్మతులుగాక, పరిపాలక వర్గము తన యధికారమువలన, ప్రాపకమువలన ప్రజాప్రతి నిధులలో నుండి తన వైపునకు దిగ్గ్యనగలవారి సమ్మతు లును గలసినచో పరిపాలకవర్గము తన యిచ్ఛవచ్చిన విషయ ములెల్ల అసెంబ్లీ సభవారిచేత తీర్మానింప జేయగలుగుటకు వీలగుచుండెను. అట్లే ప్రజల కత్యంతావశ్యములగు సంస్క రణములు, సహాయములను నిరాకరింపజేయ గలుగుచుండెను. అసెంబ్లీసభయందు తనకుగల బలమువలన పూర్వము బ్రిటీ షువారి లాభము కొరకే పరిపాలకవర్గ మెన్నివిధములుగ తోడ్పడుచుండెనో ఈనాడు నన్నివిధములుగ తోడ్పడ గలుగు చుండెను. కొన్ని విషయములందు పూర్వముకన్న నధికముగ తోడ్పడ గలుగుచుండెను. రాజప్రతినిధికిగూడ కొన్ని నిరం కుశాధికారము లివ్వబడెను. ఇట్లు 1923లో ఉప్పుపన్ను వల దని అసెంబ్లీవారు త్రోసివేయగా రాజప్రతినిధి దానిని సర్టి ఫికేషనుచేసి పన్ను విధించినాడు. పరిపాలకవర్గమువారు ప్రజల కపకారము చేసినప్పుడుగూడ శాసనసభలోని ప్రజాప్రతినిధు లేమియు చేయలేక పోవుచుండిరి.

ఈసంస్కరణ రాజ్యాంగము వచ్చినపిదప గూడ పరిపా లకవర్గమువారు చేయు సివిలుపరిపాలన వ్యయము సైనిక

వ్యయము నత్యధికముగనే యుండెను. ఐరోపాసంగ్రామ సమయమున తాత్కాలికముగ విధింపబడిన హెచ్చు పన్నులు చాలవరకు తగ్గింపబడక యట్లే యుంచబడినవి. అంతటితో పోవక క్రొత్తపన్నులు విధింపబడసాగెను. 1930 లో 5½ కోట్ల రూపాయలక్రొత్తపన్నులు విధింపబడెను. పూర్వముకన్న భారతీయులకు ఉద్యోగము లధికముగ నొసగబడుచున్నను నేటికిగూడ గొప్పగొప్ప వేతనములుగల యుద్యోగములెల్ల బ్రిటీషువారివే. వేతనములు తగ్గింపుడనిఎన్నివిధములుగ మొఱపెట్టినను తగ్గింపబడలేదు. మారకమును తమ యిచ్చవచ్చినట్లు నిర్ణయించి నందువలన 1900 మొదలు 1929 వరకును భారత దేశమునకు 140 కోట్లరూపాయిలు నష్టము వచ్చినది. చివరకు రూపాయికి 16 పెన్నీలుగ నుండిన మారకమును 18 పెన్నీలకు పరిపాలకవర్గమువారు హెచ్చింపదలపగ శాసనసభలోని ప్రజా ప్రతినిధులు పోరాడిరి గాని పరిపాలకవర్గము బలవంతముగ నా తీర్మానమును ముగ్గురి సమ్మతులతో గెలుపొందింప జేసిరి. దీనివలన నష్టము కలుగుచున్నదని ఎందరు మొరపెట్టినను పరిపాలకవర్గము పెడచెవిని బెట్టిరి. తుదకు పరిపాలకవర్గమువారి నిరంకుశబలము 1930 సంవత్సరపు ఆర్థికచట్టమున మఱియు విదిత మయ్యెను. సామ్రాజ్య లాభవిధానము ననుసరించి విదేశ వస్త్రములపై నధిక సుంకమును, బ్రిటీషు సామ్రాజ్య వస్తువులపైన తక్కువ సుంకములను విధించు ప్రణాళికను తయారుచేసి అసెంబ్లీ సభలో ప్రవేశపెట్టిరి. ప్రజా ప్రతినిధులు స్వదేశ పరిశ్రమల సంర

త్రుణ విధానము ననుసరించి అన్ని దిగుమతులపైన నొకేవిధ మగు హెచ్చుపన్ను విధింపదలచిరి. అంతట పరిపాలక వర్గము వారు,తమపార్లమెంటు లో శాసనసభ నిర్ణయమునకు దేమార్పును చేసినను తామంగీకరింప మని ముందుగనే స్పష్టముగ జెప్పివై చిరి! భారత దేశఅసెంబ్లీసభ కార్థిక స్వాతంత్ర్యము లేకపోయినను సామ్రాజ్య లాభవిధాన మునుగూర్చిన పద్ధతులు శాసనసభల యంగీకారము లేకుండగ చేయబడరాదను ఆర్థిక స్వాతంత్ర్యధర్మ మర్యాద (Fiscal autonomy convention) భారత దేశమునకుగూడ వర్తించు నని బ్రిటీషుమంత్రి పలికియుండియు నే డాధర్మము నిట్లు తృణీక రించిరి. అంతట నిట్టి యన్యాయములు జరుగు రాజ్యాంగ విధానమున తాము పాల్గొనమని మాళవ్యా పండితుడు మున్నగు జాతీయ నాయకు లెల్లరు సభనుండి వెడలిపోయిరి.

ప్రజలకును, పరిపాలకవర్గమునకును ప్రతి విషయము నను వైరుధ్యభావమే కలుగుచుండుట కేంద్రశాసనసభవారికిని పరిపాలక వర్గమునకును జరిగిన రాజ్యాంగ వివాదములందు స్పష్టముగా విదితమయ్యెను. నిరంకుశ పరిపాలకవర్గము తన యభిమతమును నెరవేర్చుకొనుట కవలంబించు వివిధ పద్ధతుల విషయమున నిష్పక్షపాతబుద్ధితో న్యాయ మొనరింపవలసిన అసెంబ్లీసభాధ్యక్షుడు సైతము ప్రతివిషయమునను తమపక్షాభి మానిగ ప్రవర్తింపవలయుననియే పరిపాలక వర్గమువారు కోరుచుండుటయు, అట్లు చేయని యధ్యక్షునికిగల బాధలను శ్రీయుత విఠలుభాయి పటేలుగారు తమపదవికి రాజీనామా నిచ్చునప్పుడు బయల్పరచి యున్నారు.

అవసరము వచ్చినప్పుడెల్ల గవర్నరు జనరలు తన పరిపాలకవర్గమునకే సాహాయ్యము చేయుచు, తన విశేషాధి కారములు, అవసర శాసన నిర్మాణాధికారములు ప్రయోగిం చుచు ప్రజా ప్రతినిధుల యభిప్రాయములను త్రృణీకరించు చుండును.

## II

## రాష్ట్రీయ పరిపాలకవర్గము

ఈ మాంటేగూ రాజ్యాంగమున రాష్ట్రీయ పరిపా లనమందు గవర్నరు యొక్కయు, పరిపాలకవర్గముయొక్కయు అధికారములు కేంద్రపరిపాలనము నందలి గవర్నరు జనరలు పరిపాలకర్గమువారి యధికారములవలెనే యున్నందున నిచ్చ టను ప్రజాప్రతినిధుల యభిప్రాయములు త్రృణీకరింపబడి, శాసనసభలు నిరుపయోగములై అధికారవర్గము నిరంకుశ ముగనుండెను. పోలీసు చర్యలు మున్నగు కొన్ని విషయము లందు శాసనసభవారు చేసిన అసమ్మతి తీర్మానము లెంత నిరుపయోగములైనవో సత్యాగ్రహోద్యమ చరిత్ర నెఱిగిన వారెల్లరకు దెలియును. ఏవిషయమునను మన రాష్ట్రీయ శాసనసభలు ప్రజల కుపకరింపజాలకుండెను. తుదకుభూమిశిస్తు హెచ్చించు విషయమున గూడ వీరి తీర్మానము త్రృణీకరింప బడినది.

కొన్ని విషయములు మంత్రులవశము చేయబడి వాని పరిపాలనకు సంబంధించినంతవరకు వారు శాసనసభలకే బాధ్యులుగ నుందురను నిబంధనలు రాజ్యాంగశాసనమున

నుండెను కాని ఆచరణమున నీమంత్రులు గవర్నరుకును,ఆయన పరిపాలకవర్గమునకును లోబడవలసివారై ప్రజాప్రతినిధుల యభిమతానుసారముగ ప్రవర్తింపలేకుండిరి. ఏలన మంత్రుల వశము చేయబడిన శాఖలకు వలసిన ధనసంచయమెల్ల గవర్నరు పరిపాలనమునందే యుంచబడినది. ఆదాయవ్యయ ప్రణాళికయు నాయనచేతిలోనే యుండెను. ఆయన కార్యనిర్వాహకవర్గమువారు మంత్రుల యభిప్రాయములను వృథ సేయగలుగుచుండిరి.

మంత్రులవశము చేయబడిన శాఖలందు సైతము ప్రాణాధారభాగములెల్ల గవర్నరు, పరిపాలకవర్గమువారి వశముననే యుంచబడినవి. అభివృద్ధిశాఖామంత్రికి అడవులపైన నధికారములేదు. పరిశ్రమల శాఖామంత్రికి కర్మాగారములపైనగాని, విద్యుచ్ఛక్తిపైనగాని, యంత్రములపైగాని, కార్మికులకు సంబంధించిన ఇతర విషయములందుగాని ఆవంతయు పలుకుబడిలేదు! వ్యవసాయమంత్రికి సాగుబడి, నీటిపారుదలపైన నధికారములేదు. ఇట్టి అధికారశూన్యులగు మంత్రులను నెలకొల్పుటలో బ్రిటీషువారి యుద్దేశ్యము గూఢముగ నున్నది. ఈమంత్రుల యశక్తతనుగూర్చి కొన్నాళ్లు చెన్నపురిమంత్రిగనుండిన శ్రీ కూర్మా వెంకటరెడ్డినాయుడుగారు 1923 లో ఒక ఉపన్యాసమున వెల్లడించియున్నారు. మనమంత్రుల యవస్థ ఇంతటితో తీరలేదు. వీరికింద కార్యదర్శులుగ ఆంగ్ల ఐ. సి. ఎస్. ఉద్యోగులు నియమింపబడి, వారు గవర్నరు పరిపాలకవర్గము వారి వశముననే యుండిరి. ఇట్టితరి మంత్రులకేమి

స్వతంత్ర శక్తులుండును? గవర్నరుతోను పరిపాలకవర్గముతోను కలిసి మెలసి మెలగవలసిన మంత్రు లాయన నాశ్రయింతు రేగాని శాసనసభలలోని ప్రజాప్రతినిధుల యభిప్రాయము నేల మన్నింతురు? ఇట్టివిధానము ప్రజల కేయుపకారము చేయలేకపోవుటలో నాశ్చర్యము లేదు.

ధర్మపరిపాలనావిధానము జూచినచో సిరంకుశ పరిపాలకవర్గమువారు ప్రజలహక్కుల నణచివైచుచు జేసిన వివిధ శాసనము లింక నమలులోనే యుండెను. వీనిని పురస్కరించుకొని న్యాయాధిపతియు ప్రభుత్వతాబేదారునగు మేజస్ట్రేటు ప్రజలను గడగడలాడించును. దేశమున అమలులో నుండిన రాజ్యాంగధర్మములను, శాసనములను బట్టి ఉన్నతన్యాయస్థానములు ప్రజలను రక్షించి ధర్మము పరిపాలింప జాలవను సంగతి గూడ రాజకీయ కేసులలో వెల్లడియయ్యెను. భారత దేశమునకు నిజమైన స్వపరిపాలనము నొసగుట బ్రిటీషువారికి నష్టకరము గనుక అట్టిది యొసగుటకు వారిష్టపడక మాంటేగూ రాజ్యాంగమును నిర్మించి యుండి ఒక కపటనాటకము నాడుచుండిరని వారి చర్యలవల్లనే స్పష్టపడినది.

## III

కాంగ్రెసుస్వరాజ్యపక్షమువారు శాసనసభయందు అత్యద్భుతముగా పనిచేసి దేశములో గొప్ప సంచలనము కలిగించి జాతీయోద్యమమునకు తోడ్పడిరి. 1919 రాజ్యాంగము రాష్ట్రములో నిర్మించిన ద్వంద్వపరిపాలనము సక్రమముగా నడుచుట లేదు గనుక వెంటనే అధినివేశస్వరాజ్యము స్థాపించుటకు

రాజ్యాంగచట్టమును సవరించవలెనను రాజకీయాభిప్రాయము దేశములో వర్ధిల్లెను. అంతట కేంద్రశాసనసభలో దానిని గూర్చిన తీర్మానము ప్రవేశపెట్టబడెను. అప్పుడు శాసనసభలోని కాంగ్రెసు స్వరాజ్యపార్టీవారు భారతదేశమునకు ఒకచిత్తు రాజ్యాంగపుబిల్లును తయారుచేయుట కొక రౌండు టేబిలు కాన్ఫరెన్సును సమావేశపరుపవలెనను సవరణను ప్రతిపాదించి గెల్చిరి. అంతట ప్రభుత్వమువారు ఏదోయొకటి చేయవలసివచ్చి రాజ్యాంగచట్టములో ఏమైన మార్పులుచేయుట అవసరమా యని విచారించుటకు మడ్డిమన్‌గారి అధ్యక్షతక్రింద ఒక కమిటీని నియమించగా 1925 లో నీ కమిటీవారు నివేదికను ప్రకటించిరి. 1919 సంవత్సరపు రాజ్యాంగచట్టములోని కొన్ని నిబంధనలను గూర్చిన సవరణలుచేయుట అవసరమని వారు సూచించిరి. ఈ కమిటీలో మెజారిటీవారు పెద్ద సంస్కరణము లెవ్వియు చేయవలెనని సలహా నివ్వలేదు. బాధ్యతాయుతపరిపాలనములో ఇంకను హెచ్చు అధికారము లివ్వవలసినదని గూడ సలహా నివ్వలేదు. రాష్ట్రములందు అడవులు రాష్ట్రియ గవర్నమెంటు రిపోర్టులు, ముద్రాక్షరశాలలు మంత్రుల వశము చేయవలసినదని మాత్రము సలహానిచ్చిరి. ఇంకను కొన్ని స్వల్పపు మార్పులు సూచించిరి. మైనారిటీలో నున్న జిన్నాగారు ఒక్క పోలీసు శాంతి భద్రతలు తప్ప తక్కిన అన్ని ప్రభుత్వాధికారములును మంత్రుల వశము చేయబడవలెననిరి. శివస్వామిఅయ్యర్, సప్రూ మొదలగు మితవాద ప్రముఖులు గూడ ప్రభుత్వపక్షమున చేరక మైనారిటీవారి రిపోర్టులోనే

సంతకము చేసిరి. ఈ కమిటీవలన నెట్టి ప్రయోజనము కలుగ లేదు గాని, దేశములోని జాతీయవాదులకు మితవాదులకు గూడ సత్వర స్వరాజ్య కాంక్షయున్నట్లు మాత్రము వెల్ల డింపబడెను. మఱియు ఏ రాజకీయ సమస్యనైనను పరిష్క రించుట కని చెప్పి ఒక బూటకవిచారణ సంఘమును నియ మించి కాలయాపన జేయు బ్రిటిషుప్రభుత్వ రాజ్యతంత్రపద్ధతి మఱియొకమారు వెల్లడియయ్యెను.

## ఆ ర వ ప్ర క ర ణ ము

## గాంధీసత్యాగ్రహము - ఇర్విన్ సంధి

### I

### అ ధి ని వే శ స్వ రా జ్య ము

బ్రిటిషుప్రభుత్వమువా రెంత తీవ్రమైన నిర్బంధ విధాన మును ప్రయోగించినను భారత దేశప్రజలందు స్వరాజ్యకాంక్ష నానాటికి ప్రజ్వరిల్లసాగెను. దేశములో కాంగ్రెసు చేయు చుండిన రాజకీయ ప్రబోధమేగాక ప్రపంచ పరిస్థితులుకూడ ప్రజలకు స్వాతంత్ర్యాభిలాషకు ప్రోద్బలము కలిగించు చుండెను. బ్రిటీషు సామ్రాజ్యమునందు ఇంగ్లాండుకు అధినివేశ రాజ్యములకుగల పరస్పర సంబంధములుగూడ భారతీయుల రాజకీయ ఆశయములకు దోహద మొసగసాగినవి. ఐరోపా సంగ్రామము మొదలు సామ్రాజ్యసభలందు సామ్రాజ్యము లోని కెనడా మొదలగు స్వతంత్రభాగముల ప్రతినిధులతో పాటు అస్వతంత్రదేశమగు భారతదేశ ప్రభుత్వ ప్రతినిధులు గూడ పాల్గొనుపద్ధతియు అంతర్జాతీయ మహాసభయగు

నాటి ఐరోపాసంగ్రామశాంతిని గూర్చిన సంధిసభలోగూడ భారత దేశప్రతినిధులు పాల్గొని సంధిపత్రముపైన సంతకము చేయుటయు 1919-21-23-1926 సంవత్సరములందు జరిగిన సామ్రాజ్యసభలందు పాల్గొనుటయు జరిగినందున భారత దేశమున కొక విధమగు అంతర్జాతీయ వ్యక్తిత్వమును గౌరవమును కలుగుట తటస్థించినది. బ్రిటీషు సామ్రాజ్యములో నింగ్లాండు కును, తక్కిన అధినివేశరాజ్యములకును గల సంబంధములు సామ్రాజ్యసభలందు చర్చింపబడు చుండెను. ఆ సందర్భమున సామ్రాజ్యమునందలి కెనడా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఐరిషుఫ్రీస్టేటు మొదలగు తక్కిన అధినివేశరాజ్యములు బాధ్యతాయుత స్వపరిపాలనమును ప్రజాప్రభుత్వ పద్ధతులను కలిగియుండుటయు వానికిగల గౌరవమును వెల్లడి యగు చుండెను. ఇట్టి స్థితిలో 1926 వ సంవత్సరమున జరిగిన సామ్రాజ్యసభలో నింగ్లాండుకు తక్కిన అధినివేశ రాజ్యములకుగల పరస్పరసంబంధముల విషయమున నొక తీర్మానము చేయుబడి "అధినివేశరాజ్యములు తమ ఆంతరంగిక వ్యవహారములందుగాని విదేశవ్యవహారములందుగాని ఒకదాని కింకొకటి లోబడక సామ్రాజ్యమున బ్రిటీషుదీవులతోపాటు సరిసమానములగు స్వతంత్రజనసమూహములే" యనుసూత్ర మంగీకరింపబడెను. ఇందువలన భారతీయులకుగూడ కొంతయాశగలిగెను.

1919 సంవత్సరములో పార్లమెంటువారు శాసించిన ఇండియా రాజ్యాంగ చట్టపీఠికలో భారత దేశ రాజ్యాంగ పరిణామముగా వారు చెప్పియున్న సంగతులను బట్టియే భారత

దేశమునకు గూడ ఎప్పటికైనను డొమినియను స్టేటసు ఒసగ బడునని రాజకీయ నాయకులు చాలామంది తలంచుచుండిరి. "భరతఖండము సామ్రాజ్యాంతర్భాగముగ బాధ్యతాయుత స్వపరిపాలనము పొందుటకొరకు స్వపరిపాలన సంస్థలను క్రమ క్రమముగ నెలకొల్పి యభివృద్ధిజేయుటయు భారతీయ ప్రభుత్వముయొక్క అన్ని శాఖలలోను భారతీయులు పాల్గొనుట కవకాశమిచ్చుటయు పార్లిమెంటువారి యుద్దేశమైనందునను, వృద్ధిక్రమానుగుణములగు మజలీలప్రకారమే ఈయుద్దేశమును నెరవేర్చుట యుక్తమైనందునను, అందుకొరకు కొన్ని ఏర్పాటు లిప్పుడు గావింపవలయును. ఎప్పు డెప్పు డేయే విధముగ అభివృద్ధి గావింపవలయునో పార్లమెంటువారే నిర్ణయింతురు. ఏలన, భారతవర్ష ప్రజలయొక్క క్షేమాభివృద్ధిభారము పార్లిమెంటు పైనే గలదు. ఈక్రొత్త యవకాశము లెవరికి కలుగ జేయబడుచున్నవో ఆ ప్రజల సహకారమును బట్టియు బాధ్యతలను నిర్వహించుటయందు వారికిగల శక్తిని బట్టియు పైన చెప్పబడిన విషయములను పార్లిమెంటువారు నిర్ణయింతురు.

భరతఖండమునందలి పరగణాలలో స్వపరిపాలనా సంస్థలు వృద్ధి చేయబడిన కొలదియు కేంద్రప్రభుత్వముయొక్క ప్రభుత్వకర్తవ్యములకు భంగకరములు కాకుండగ సాధ్యమైనంత హెచ్చు స్వాతంత్ర్యములు పరగణాల కీయబడును" అని 1919 సంవత్సరములో పార్లమెంటువారు చేసిన ఇండియా రాజ్యాంగ చట్టమునందే వివరింపబడి యున్నది. ఆరాజ్యాంగచట్టమును బట్టి బ్రిటీషు సార్వభౌముడు భరతఖండ వైస్రాయికంపిన రాజ

నిర్దేశ పత్రములో "మా యధినివేశరాజ్యములందు భరత ఖండము తన యర్హస్థానమును పొందుటకుగాను సామ్రాజ్యాంత ర్భాగమగు రాజ్యముగ వృద్ధిక్రమానుగుణమైన బాధ్యతాయుత స్వపరిపాలన సిద్ధికొరకు పార్లమెంటువారు సూచించిన విధాన ములు పరిపూర్ణత్వము నందుటయే మా యభిమతము" అనియు ఉదాహరింపబడినది.

అందువల్ల భారత దేశమున కెన్నటికైనను అధినివేశస్వరా జ్యము డొమినియన్ స్టేటసు సిద్ధింపగలదని భారత దేశ రాజకీయ నాయకులలో మితవాదులూరట లూరుచుండిరిగాని వీరియాశలు నిరాశలగునట్లు బ్రిటీషుసామ్రాజ్య రాజనీతిజ్ఞులలో చాలమంది భారత దేశ రాజ్యాంగ పరమావధి డొమినియన్ స్టేటసు కాద నియు ఇంకేదోయొకవిధమగు బాధ్యతాయుత స్వపరిపాలనము లేక రెస్పాన్సిబిల్ గవర్నమెంటు మాత్రమేయనియు వెల్లడింప సాగిరి !

## II

## సైమన్ కమిటీ భాగవతము.

భారతదేశము రాజ్యాంగచక్రము ఎట్లు తిరుగు చున్నదో పది సంవత్సరములైనపిదప విచారించి తరువాత తా మింకనేమైనను సంస్కరణములు ప్రసాదింప దలచినదియు లేనిదియు నిర్ణయింతుమని 1919 చట్టము చేసినప్పుడే బ్రిటీషు పార్లమెంటువారు ప్రకటించి యుండిరి. ఎట్టకేలకు ఆతరుణము వచ్చినది. భారత దేశ రాజకీయములనుగూర్చి విచారించి తమకు నివేదించుటకు "సైమనువిచారణసంఘము"ను నియమించిరి.

ఇండొక్క భారతీయునైనను నియమింపకపోవుటవలననే వారి యుద్దేశములపట్ల భారతజాతీయవాదుల కనుమానము కలిగెను.

కేవలము సోపానములుగ, కొంచెముకొంచెముగ సంస్కరణములు చేసిన లాభములేదనియు సరియైన స్వపరిపాలనమును ప్రసాదించు రాజ్యాంగప్రణాళిక తయారుచేయబడవలెననియు జాతీయవాదులు కోరుచుండిరి. భారతదేశ రాజకీయపక్షము లన్నిటిని చేరదీసి అందరకును సమ్మతమగు నొక స్వరాజ్య రాజ్యాంగమును తయారుచేయుటకు 1927 లోనే కాంగ్రెసు నిశ్చయించెను. ఆ ప్రకారము సమావేశమైన సర్వపక్ష సభ వారు నియమించిన నెహ్రూ కమిటీవారు "డొమినియన్ స్టేటసు" వంటి అధినివేశ స్వరాజ్య ప్రణాళిక నొకదానిని తయారుచేసియుండిరి. అఖిలభారత దేశ ప్రజలయొక్క కోరిక ననుసరించి ఒక సంవత్సరములో డొమినియన్ స్టేటసు నొసగనిచో సామ్రాజ్యముతో సంబంధములేకుండ సంపూర్ణస్వాతంత్ర్యమునే స్థాపించుటకు ప్రయత్నింతుమని 1928లో కాంగ్రెసు మహాసభ తీర్మానించెను.

సైమను కమిటీలో భారతీయులులేనందున దానిని భారతీయులు బహిష్కరింపవలెనని 1927 లోనే కాంగ్రెసు వారు తీర్మానించియుండిరి. అంతట 1928 ఫిబ్రవరిలో 'సైమను కమీషను' వారు ఓడదిగినది మొదలు దేశములో నెచ్చటికి పోయినను తిరస్కారమే ఎచ్చటికిపోయినను నల్ల జెండాల సన్మానమే జరుగసాగెను. వారు వెళ్లినచోటులందు హరతాళములు జరుగగా నిషేధములు, లాటీచార్జీలు ప్రయోగింపబడసాగెను.

ఇట్టి లాటీచార్జీలలో జవహర్లాలుగారికి దెబ్బలు తగులుటయు, లాలాలజపతిరాయిగారికి తీవ్రమైన దెబ్బలుతగిలి మంచముపట్టి చనిపోవుటయు అందరెఱిగినదే. దేశములో సీసైమనుకమిటీపట్ల తీవ్రవిరోధాభిప్రాయము కలుగగా రాజప్రతినిధియగు ఇర్విన్ ప్రభువు ఇంగ్లాండుకు వెళ్ళి దేశములోని ప్రజాభిప్రాయమును గూర్చి తెల్పి దేశములో కొంత శాంతి కలిగించి కొందరు రాజకీయనాయకులనైనను సంతృప్తిపరుపవలెనన్నచో బ్రిటిషు వారి ఉద్దేశములనుగూర్చిన అపోహలను పోగొట్టుట అవసర మని చెప్పి వారి సమ్మతితో 1929 అక్టోబరు 31వ తేదీన నొక ప్రకటనగావించి దానిలో "1917 వ సంవత్సరమున చేయబడిన ప్రకటననుబట్టి భరతఖండ రాజ్యాంగాభివృద్ధియొక్క సహజపరి ణామము అధినివేశరాజ్యాంగ పద్ధతియేయని బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వము వారి యభిప్రాయము" అని ప్రకటించెను. "ఈ ఉద్దేశము పరిపూర్ణముగ నెరవేరుటకు భరతఖండము లోని సంస్థానములకుగూడ రాజ్యాంగమున స్థానమొసగి ఒక విధమగు అఖిలభారత - ఐక్యతను కోరువారి యాశకు భంగము లేకుండా ప్రస్తుతపు రాజ్యాంగవిధానమునందలి వ్యవహార ములు జరుగవలయుననియు, ఇందుకొఱకు సైమను సంఘము వారు రాజ్యాంగ సంస్కరణములను గూర్చిన తమ నివేదికను ప్రకటించిన పిదప పైన చెప్పబడిన సంగతులు చర్చించి యాలో చించుటకును బ్రిటిషు - భారత రాజ్యాంగ సమస్యయు, అఖిల భారత రాజ్యాంగసమస్యయు చర్చించుటకు బ్రిటీషురాజ్యమునం దలి ప్రతినిధులును సంస్థాన రాజ్యమునందలి ప్రతినిధులును రౌండుటేబిలుసభ కాహ్వానింపబడుదురనియు ఈ మార్గమున

చర్చింపబడిన సమస్యలలో నా సభవారి ఆలోచనలయందు అధిక సంఖ్యాకులసమ్మతినిబడసిన విషయములు శాసనము చేయగలందులకు పార్లమెంటు వారికి నివేదింపబడును." అనియు రాజప్రతినిధి ప్రకటించెను.

## III

### పూర్ణస్వరాజ్య ప్రకటన; ఉప్పు - సత్యాగ్రహము

వైస్రాయిచేసిన ప్రకటనలు తృప్తికరముగా లేకపోయెను. మఱియు, మొదటినుండియు భారతదేశీయుల స్వరాజ్యాందోళనముపట్ల సానుభూతి కలిగియుండిన లేబరుపక్షమువారు ఇంగ్లాండులో ప్రభుత్వము వహించినందున వారు వెంటనే భారతదేశమునకు "డొమినియనుస్టేటసు" నొసగకపోవరని ఆశపడినవారందరకును ఇది ఆశాభంగము కలిగించెను. డొమినియనుస్టేటసు ఒసగబడునను వాగ్దానములేదు సరికదా సైమను కమిటీవారి విచారణ యనునది బాధ్యతాయుత స్వపరిపాలన రాజ్యాంగప్రణాళికను తయారుచేయుటకే యని యైనను ప్రకటింపబడకపోవుటవలన భారతీయులకు పూర్తిగా ఆశాభంగము కలిగెను. కాంగ్రెసువారు నిర్ణయించిన సంవత్సరము గడువు డిశంబరుతో పూర్తియగును. అంతట పూర్ణస్వరాజ్య ప్రకటన జేయవలసి యుండెను. ఈ లోపుగా ఏదైన సమాధానము కుదిర్చిన బాగుండునని కొందరు ప్రయత్నించి చూచిరికాని లాభము లేకపోయెను. నాడు కేంద్రశాసన సభలో కాంగ్రెసు ప్రముఖులుగా నుండిన నెహ్రూప్రభృతులను ఇర్విన్ ప్రభువు మర్యాదచేయుటతప్ప వారికెట్టివాగ్దానమును

చేయలేకపోయెను. అంతట 1929 వ డిశంబరు 31 వ తేదీ రాత్రి, కాంగ్రెసు మహాసభ బ్రిటిషువారితో సంబంధము లేకుండా పూర్ణస్వరాజ్యము లేక సంపూర్ణస్వాతంత్ర్యము సంపాదింపవలెనని తీర్మానమునుచేసెను. దానిని సంపాదించుటకు అహింసాత్మక సాత్విక నిరోధముతోడి సత్యాగ్రహామే సాధన మని కాంగ్రెసు నిర్ణయించి అందుకు వలసిన సన్నాహాము లను చేసి శాంతిసంగ్రామము నడుపుటకు గాంధిమహాత్మునికి సర్వాధికార మిచ్చెను.

1930 జనేవరు 26 వ తేదీన ప్రథమస్వాతంత్ర్య దినో త్సవము దేశములో నెల్లయెడలను జయప్రదముగా జరుప బడెను. భారత దేశదారిద్ర్యమునకును దాస్యమునకు బ్రిటిషు ప్రభుత్వమె కారణమని తీర్మానింపబడి దానినుండి విడిపోయి పూర్ణస్వాతంత్ర్యమును స్థాపించుటకు త్రికరణశుద్ధిగా ప్రయ త్నింప గలందులకు ప్రతిజ్ఞచేయు పూర్ణస్వాతంత్ర్య ప్రమాణము సభాముఖమున దేశ మెల్లయెడలను చేయబడెను.

అంతట గాంధీమహాత్ముడు, భారత దేశప్రజలకు నిజమైన రాజకీయ - హక్కులొసగదలచినచో దేశ దారిద్ర్యముమాన్పు టకు కొన్నిసంస్కరణములనైన ముందుగా చేయవలసినదనియు అవి చెల్లించనిచో బ్రిటిషువారిని విశ్వసింపజాలమనియు భారత దేశదారిద్ర్యవిమోచన కొరకును పూర్ణస్వాతంత్ర్యము స్థాపిం చుటకొరకును తాను ఉప్పుసత్యాగ్రహామును ప్రారంభింప దలచితిననియు రాజప్రతినిధికి మహాత్ముడు ముందుగా నొక లేఖను వ్రాసెను. అందులో మహాత్ముడుకోరిన సంస్కరణ

ములు కాంగ్రెసు పుట్టినదాది కోరబడుచున్న సంస్కరణములే. అవి యెవ్వియన:

1. తాగుడు పూర్తిగా నిషేధించుట.

2. రూపాయికి ఒకషిల్లింగు నాలుగు పెన్నీలుగ మారకపు విలువను తగ్గించుట.

3. భూమిపన్నులో నూటికియేబదివంతులు తగ్గించుట. పన్నులను వృద్ధిచేయు నధికారమును శాసనసభల కిచ్చుట.

4. ఉప్పుపైన పన్ను తీసివేయుట.

5. సైన్యము కొరకు చేయుచున్న దుర్వ్యయములో సగము వెంటనే తగ్గించుట.

6. ప్రభుత్వోద్యోగుల వేతనములు సగమునకు కాని, దేశాదాయమునకు తగినట్లుగ ఇంకను తక్కువకుగాని తగ్గించుట.

7. విదేశవస్త్రముల పైన పన్ను విధించుట.

8. భరతఖండతీరములందలి నౌకావ్యాపారమును గూర్చి ప్రజాప్రతినిధులు చేయగోరినచట్టము నంగీకరించుట.

9. హత్యచేసినట్లుగాని చేయ ప్రయత్నించినట్లుగాని కోర్టువారు తీర్మానించినవారిని తప్ప తక్కిన రాజకీయనిర్బంధితుల నెల్లరను విడుదలచేసి, ద్వీపాంతరవాసము చేయువారిని భరతఖండమునకు రానిచ్చుట.

10. రహస్యరక్షక (సి.ఐ.డి) శాఖవారిని రద్దుచేయుట లేక ప్రజాప్రతినిధులకు లోబరచుట.

11. స్వసంరక్షణకొరకు ఆయుధము లుంచుకొనుటకు అనుమతి పత్రములిచ్చుట.

ఈ ముఖ్య సంస్కరణములు గావింపుడని మహాత్ముడు బ్రిటిషుప్రభుత్వము వారిని కోరి విఫలుడై తన సత్యాగ్రహ మహాస్త్రమును బ్రయోగించి శాంతిసమర మారంభించెను. 1930 సం॥ మార్చి 12 వ తేదీన మహాత్ముడు 'ఉప్పు - సత్యాగ్రహము' చేయ బయలు దేరి ఏప్రియల్ 6వ తేదిన దండి గ్రామమున ఉప్పు-చట్ట తిరస్కారముజేసి శాసనోల్లంఘనము ప్రారంభించెను. మన దేశమునం దమితోత్సాహము కలిగెను. ఈ సత్యాగ్రహమున వేనకువేలు ప్రజలు పాల్గొనిరి. ప్రభుత్వము వారు తీవ్రనిర్బంధవిధానమును ప్రారంభించిరి. దేశముకొరకు బాధలందు నవీనపద్ధతితో శాంతిసమరము జరిగెను. 60 వేల మంది చెర కేగిరి. ఆగర్భశ్రీమంతులు ఘోషాస్త్రీలు కూడ ఉద్యమమునందు పాల్గొని కష్టము లనుభవించిరి. కేంద్రశాసన సభాధ్యక్షుడగు విఠల్ భాయిపటేలుగారుకూడ రాజీనామా నిచ్చి చెర కేగిరి. బ్రిటిషు వస్త్రబహిష్కారము జయప్రదముగా జరిగి బ్రిటిషువారి వర్తకము పడిపోయెను. ఈ సంగతి సత్యమని 1935 లో టారిఫ్ బోర్డుయెదుట సాక్ష్యమిచ్చిన లంకాషైరు వర్తకప్రతినిధులు ఒప్పుకొనిరి.

## IV

### మొదటి రౌండు టేబిలు సభ.

కాంగ్రెసువారు జైళ్ళలో మగ్గుచుండగా బ్రిటిషు ప్రభుత్వమువారు రాజ్యాంగ సంస్కరణములనుగూర్చి ఆలో

చనలుచేయుట కని చెప్పి లండనులో నొక 'రౌండుటేబిలు'సభ నేర్పాటుగావించి ప్రభుభక్తిపరాయణులగు భారతీయులనుకొందరనాహ్వానించి వేనకువేలుఖర్చుపెట్టి తాము నియమించినవారిని ఓడలలో తీసికొనివెళ్ళిరి. కాంగ్రెసువారు లేనిదే యీరౌండు టేబిలు సభచేయు తీర్మానముల కెట్టి విలువయు నుండదని బ్రిటిషుప్రభుత్వమువా రెరుగుదురు. కాని పట్టుదలకొరకు అది జరిపితిమని యనిపించుకోదలచిరి. ఆ సభయందు జరిగిన కార్యకలాపములు, చర్చలు, అందలి కార్యక్రమములు అన్నియు బ్రిటిషు రాజనీతిజ్ఞు లాడించినట్లే జరిగినవి. ఎట్టకేలకు బ్రిటిషు ప్రధానామాత్యుని ఆశీస్సులతో నాసభ ముగిసెను. రౌండుటేబిలు సభవారు భరతవర్షమునకు, కొన్ని మినహాయింపులతోను రక్షణలతోను బాధ్యతాయుత స్వపరిపాలనా రాజ్యాంగ మేర్పాటు చేయవలయుననియు, రాజ్యాంగము స్వరూపమున ఫెడరల్ విధానమునకు జెందినదిగా నుండవలయుననియు అట్టి ప్రకటనను బ్రిటిషుప్రభుత్వమువారు గావింపవలయుననియు తీర్మానించిరి. "మార్పుదల కాలమున పూచీ పడవలసిన కొన్ని సందర్భములకు వలసినట్టియు కొన్ని ముఖ్యపరిస్థితుల కావశ్యకములైనట్టియు ఏర్పాటులతోను మరియు అల్పసంఖ్యాకజనముల రాజకీయ స్వాతంత్ర్యములను గాపాడుటకు వలసిన పూచీలతోను భారతదేశప్రభుత్వముయొక్క బాధ్యతను ఆదేశ కేంద్రరాష్ట్రీయ శాసన సభలయందు నెలకొల్పుట యుక్తమని బ్రిటిషు సామ్రాజ్య ప్రభుత్వమువారి యభిప్రాయము."

"మార్పుదలకాలమునకావశ్యకములగు రక్షణలను శాసనములందు నెలకొల్పునప్పుడు అట్లు మినహాయింపు చేయబడు (reserved) అధికారములు క్రొత్తరాజ్యాంగము ద్వారా తన ప్రభుత్వమునకు భరతఖండమే సంపూర్ణబాధ్యతనువహించు రాజ్యాంగాభివృద్ధి కెంతమాత్రమును భంగకరములు గాకుండునట్లు నిర్ణయింపబడి అట్లే చలాయింపబడునట్లును చూచుట బ్రిటీషు సామ్రాజ్యప్రభుత్వము వారి ముఖ్యకర్తవ్యముగ నుండును." అని ప్రకటించుచు, రామ్సేమెక్డానల్డు ప్రధానామాత్యుడు "బ్రిటిషుప్రభుత్వమువారీ ప్రకటనమందు సూచించిన రాజ్యాంగము నాచరణలో పెట్టుటకు వలసిన కొన్ని ముఖ్య విషయములు నిశ్చయముగ సిద్ధాంతీకరింపబడి యుండలేదని ప్రభుత్వమువారెఱుగుదురు. అయితే ఈ రౌండుటేబిలు సభలో జరిగిన పనివలన ఆవిషయములన్నియు నొకమార్గమునకు తేబడినవి. ఇందువలన నీప్రకటన యనంతరము జరుగుకార్యాలోచనములు సఫలత గాంచునను ఆశకలుగుచున్నది." అని సభలో పలికెను. పైనచెప్పబడిన సూత్రములకు లోబడి రౌండుటేబిలు సభవారు సూచించిన రాజ్యాంగ సంస్కరణములు బ్రిటీష్ ప్రభుత్వమున కిష్టమే యనియు ఆరాజ్యాంగప్రణాళిక నింకను బాగుగ యోజించుటకు రౌండుటేబిలుసభ మఱల సమావేశమగుననియు అందులో కాంగ్రెసుపక్షము వారుకూడ పాల్గొని సహాకారముచేయుట కిష్టపడినచో బాగుండుననియు అందుకొరకు తగిన ప్రయత్నములు గావింపబడుననియు గూడ అతడు ప్రకటించెను. అంతట గాంధిమహాత్ముడును కాంగ్రెసు నాయకులును విడుదల గావింపబడిరి.

## V

## గాంధీ - ఇర్విన్ సంధి

గాంధీమహాత్మునకును ఇర్వినుప్రభువునకును జరిగిన సంభాషణలవలన 1931 మార్చి 5 వ తేదీన ఒకసత్యాగ్రహ విరామసంధి జరిగెను. కాంగ్రెసు సత్యాగ్రహము విరమించు నట్లును బ్రిటీషు సామ్రాజ్యప్రభుత్వమువారి యనుమతితో కేంద్ర రాష్ట్రీయప్రభుత్వములు కొన్ని రాజీచర్యలు జరిగించు నట్లును నిశ్చయింపబడెను. ఐరిష్‌ఫ్రీస్టేటువలెనే ఇచ్చటి ప్రభుత్వమునకును ప్రజలకును మధ్య నిట్టి సంధిజరుగుట ఒకగొప్ప సంగతిగనుండెను. ఆ సంధిపత్రముననే రాజ్యాంగవిషయమును గూర్చి ఇట్లు వివరింపబడెను: "రాజ్యాంగ సమస్యల విషయమున రౌండుటేబిలుసభలో ముందుజరుగబోవు చర్యలయొక్క ఉద్దేశము ఇదివరకు చర్చింపబడిన రాజ్యాంగప్రణాళికను మరింత చక్కగా యోజించుటకే యైయుండును. ఆ ప్రణాళికలో ఫెడరలు విధాన మొక ప్రధానభాగము. అట్లే భారతీయ ప్రజాప్రతినిధుల బాధ్యతయు నొక ప్రధానాంశము. మఱియు దేశరక్షణ (సైన్యము), విదేశవ్యవహారములు, అల్పసంఖ్యాక జనుల హక్కులు, భరతఖండము యొక్క ఆర్థిక - పరపతియొక్క బాధ్యతలను సరిగా నిర్వర్తించుట, మున్నగు విషయములందు భరతఖండముయొక్క క్షేమలాభములకొరకు వలసిన మినహాయింపులును రక్షణలునుగూడ ప్రధానాంశములే. ఈ స్టేట్‌మెంటు సామ్రాజ్యప్రభుత్వమువారి యనుమతితో చేయబడుచున్నది."

ప్రధానమంత్రి జనేవరు 19 వ తేదిన ప్రకటించిన ప్రకారము "ఇకముందు జరుగు రాజ్యాంగసంస్కరణప్రణాళిక చర్చలందు కాంగ్రెసుపక్షమువారి ప్రతినిధులు పాల్గొనునట్లు చేయుటకు తగుచర్య తీసికొనబడు"నని ప్రభుత్వమువారును ప్రకటించిరి. తరువాత రెండవ రౌండు టేబిలుసభ జరిగినది. దానిలో కాంగ్రెసు తరఫున ఏకైకప్రతినిధిగా వెళ్ళిన గాంధిమహాత్ముడు భారతీయుల కోరికలను స్పష్టముగా వెల్లడించినాడు.

## ఏడవ ప్రకరణము

### కాంగ్రెసు - అజ్ఞాతవాసము

రెండవ రౌండు టేబిలుసభ లండనులో జరుగుచుండగానే ఇంగ్లాండు దేశమునందలి రాజకీయార్థికపరిస్థితులందు కొన్నిచిక్కులు కలిగెను. ఇంగ్లాండు దేశమున బంగారపుకరవు వచ్చెను. వర్తకము పడిపోయెను. వారి బంగారునాణెమగు నవరసువిలువ తగ్గిపోయెను. ఆ దేశపు ప్రజలకు చాలభయము కలిగెను. అంతట నీ ఆర్థికవిపత్తునుండి బయలుపడుటెట్లాయని అందరు నాలోచింపసాగిరి. అటిస్థితిలో జరిగిన ఎన్నికలలో లేబరుపక్షము ఓడిపోయి నిరంకుశసామ్రాజ్య వాదులును భారతదేశ స్వాతంత్ర్యవిరోధులు నగు 'కన్సర్వేటివ్' పక్షమువారు పార్లమెంటులోనికి బహుసంఖ్యాకులుగా వచ్చిరి. అంతట కేవలము ఇంగ్లాండు క్షేమలాభముకొరకు పాటుపడుటకే కంకణము గట్టుకొన్న నేషనల్ గవర్నమెంటు రాజ్యమునకు వచ్చెను.

లేబరుప్రభుత్వములో ప్రధానామాత్యుడుగా నుండిన రామ్సే మేక్డొనాల్డు పేరునకు ప్రధానామాత్యుడుగా నిలువబడెను. గాని అతడు కన్సర్వేటివ్ నాయకులకు దాసుడయ్యెను.

గాంధీమహాత్ముడు ఇంగ్లాండునకు పోవుటకు ముందుగానే భారత దేశములో ఇర్విను ప్రభువుకు బదులుగా విల్లింగ్డన్ ప్రభువు వైస్రాయిగా నియమింపబడెను. ఇతడు నిరంకుశ సామ్రాజ్య తత్వవాది. గాంధీ - ఇర్విను రాజీనామా బ్రిటిషు వారి పరువుప్రతిష్ఠలకు భంగకరమని నమ్మినవారిలో నితడొక్కడు. అందువలన ఆ రాజీనామాషరతులప్రకారము ప్రభుత్వోద్యోగులు పనులు జరుపుటలేదని కాంగ్రెసు మహాసభవారు చేసిన ఫిర్యాదుల నితడు పెడచెవిని బెట్టి నిరంకుశముగా వర్తించుచుండెను. ఇతని తాబేదారులు నీతనియభిమతానుసారముగా నిరంకుశులై ప్రవర్తించుచుండిరి. ఇందువలన గాంధిమహాత్ముడు తుదివరకు ఇంగ్లాండుకు పోవునను నమ్మకమే లేదు. ఆయన ఇంగ్లాండులో అఖండగౌరవము లందుచుండగా గాంధీమహాత్మునికిని కాంగ్రెసునకును ఇంత పలుకుబడి, పరువుప్రతిష్ఠలు గలుగుట, భారత దేశములోని ఆంగ్లేయోద్యోగులకు బ్రిటీషు వర్తకులకు సహింపరానిదిగా నుండెను. అంతట యూరపియన్ సంఘమువారు కాంగ్రెసు కిట్లు ప్రభుత్వము లొంగిపోవుట బాగుగ లేదనియు, కాంగ్రెసు గర్వము మితిమీరుచున్నదనియు, ఇక ముందు సందు దొరికినప్పుడు కాంగ్రెసుయొక్క బలమును పూర్తిగా అణగద్రొక్కి లేవలేనట్లు చేయవలెననియు ప్రబోధము చేయుచు, ప్రభు

త్వము వా రవలంబింపవలసిన తీవ్రనిర్బంధనవిధానములనుగూర్చిన వివరములుగల ప్రణాళిక నొకదానిని ప్రకటించిరి.

బ్రిటీషుప్రభుత్వమువారు తమ అభిప్రాయములను స్పష్టీకరింపక అప్పటి కా రెవండ రౌండుటేబిల్ సభను ముగించిరి. 1931 డిశెంబరులో గాంధిమహాత్ముఁడు వెనుకకు తిరిగి వచ్చెను. ఈలోపున ఇంగ్లాండు దేశమున కన్సర్వేటివ్ ప్రభుత్వము రాజ్యములోనికి రాగానే, విల్లింగ్డన్ ప్రభువు యూరపియను సంఘము వారి సలహాప్రకారము కాంగ్రెసు నణచివేసి శాశ్వత కీర్తి నిగడింపదలచెను. అందువలన మహాత్ముఁ డింకను స్వదేశము నకుమరలి రాకమునుపే ఈవిల్లింగ్డన్ నిర్బంధవిధానములనుప్రయోగించుట మొదలిడెను. సంయుక్త రాష్ట్రములయందు జవహర్లాలు నాయకత్వమున పనిచేయుచుండిన కిసానులును, పశ్చిమోత్తర పరగణాలందు ఖాన్ అబ్దుల్ గఫూరుఖాను నాయకత్వమున పని చేయుచుండిన ఖుదాయి కిద్మత్ గార్లును, కాంగ్రెస్ కు మూలబలములై యుండుట చూచి ముందుగా వీరిపైన నితఁడు తన నిషేధపు టుత్తరవులు జారీచేయసాగెను. అంతటితో తృప్తిజెందక ఆ రెండురాష్ట్రములలోను తీవ్రనిర్బంధవిధానములతో ఆర్డినెన్సులను శాసించెను. వంగరాష్ట్రమున దారుణవాదుల నణచుటకను నెపమున తీవ్రమైన నిర్బంధవిధానములతో నింకొక ఆర్డినెన్సును శాసించెను. మహాత్ముఁడు దేశములో అడుగు పెట్టునప్పటికి జవహర్లాలును, ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖానును అరెస్టు చేయబడిరి. విల్లింగ్డన్ ప్రభుత్వము నిర్హేతుకముగా కాంగ్రెసు పైన దాడివెడల దలచెనని స్పష్టమయ్యెను. గాంధీమహాత్ముఁడు

బొంబాయిలో ఓడదిగగానే అచ్చట ఆయన కివ్వబడిన స్వాగతము ఏరాజప్రతినిధికిని, ఏచక్రవర్తికిని ఈయబడి యుండలేదు.

సంయుక్తరాష్ట్ర పశ్చిమోత్తర - పరగణాలలోని రాజకీయ విషయములనుగూర్చి మహాత్ముడు వైస్రాయితో మాటలాడదలచెను గాని దానినిగూర్చి మాటలాడుటకు విల్లింగ్డన్ ఈయనకు దర్శనమీయ నిరాకరించెను. ఇంతకన్న కాంగ్రెసు గౌరవమున కప్రతిష్ఠ వేరొకటిలేదు. ఇక శాంతిసమరము చేయక తప్పనిసరి యయ్యెను. కాంగ్రెసుమహాసభ సత్యాగ్రహ మారంభించెను. దీని నారువారములలోనే యణచివేసెద నని విల్లింగ్డను పలికెను. జనేవరు 1932 లోనే ముఖ్యమైన కాంగ్రెసునాయకుల నందరను చెర కంపెను. ఇక కాంగ్రెసు వారెట్టి ఆందోళనము గావింపకుండుటకు లాటీఛార్జీలు, తుపాకికాల్పులు ప్రారంభింపబడెను. పోలీసువారు కావించిన క్రూరకృత్యములకు, అత్యాచారములకు, న్యాయాధిపతులును, ఉద్యోగులును చేసిన అన్యాయములకును లెక్కలేదు. ఈ శాంతిసమరములో ఒక లక్షమంది చెరసాలకేగిరి. లాటీదెబ్బలుతిని కళ్లు, కాళ్లు పోగొట్టుకొన్నవారు, మరణించినవారు, సర్వస్వము పోగొట్టుకొన్నవారు, అసంఖ్యాకులుగా నుండిరి. కాంగ్రెసు సంస్థ లెల్ల అశాస్త్రీయములుగా చేయబడెను. దేశమునందు కాంగ్రెసువాది అనువాడు మసలుటకుకూడ వీలులేనట్లు నిర్బంధములు నిషేధములు చేయుటయేగాక కాంగ్రెసువారికి సహాయముచేయుట వారిపట్ల సానుభూతిచూపుటగూడ శిక్షార్హమగు నేరముగా చేయబడెను.

ఏ సైనిక శాసనమున గూడ ఇన్ని నిర్బంధములులేవు. దేశములో నెవ్వరును మాటలాడుటకు గూడ సాహసింపలేనంతటి తీవ్రమైన కఠినచర్యలను తీసికొనిరి. ఇట్లు దేశములో ప్రజాభిప్రాయమును అణచివేసి ప్రజలప్రాతిపదిక - హక్కులను గూడ నాశనము జేసిరి. ఇంకొక అన్యాయ మేమనగా కాంగ్రెసువారు జైళ్ళలో మ్రగ్గు చుండగా శాసనసభలందు ప్రవేశించియున్న బ్రిటిషుప్రభుభక్తి పరులు, విల్లింగ్డన్ ప్రభువు చెప్పిన ఆర్డినెన్సుల నెల్ల శాసనము లుగా జేసిరి. ఇట్లు తీవ్ర నిర్బంధవిధానముచేత దేశప్రజలను అణచియుంచి దేశములోని రాజకీయరంగము నొక మహాశ్మ శానముగాజేసి దీనికి శాంతి యని విల్లింగ్డను ప్రభువు పేరిడెను. కాంగ్రెసు మరల లేవలేకుండ అణచివేసితిననియు, ఇక నీదేశ మున బ్రిటిషుపరిపాలనమున కెదురుదిరుగ సాహసించువారె వ్వరు నుండరనియు, బ్రిటిషు సామ్రాజ్య ప్రభుత్వమువారికి నచ్చజెప్పెను. ఇట్లొకవంక ప్రజల స్వాతంత్ర్య స్వత్వము లెల్ల హరించి ఇంకొకవంక దేశప్రభుత్వమున రాజ్యాంగసంస్కర ణములను గూర్చిన విచారణల సింకను జరిపెదమని చెప్పి మరల మూడవమారు ఇంకొక రౌండుటేబిలుసభను జేసి బ్రిటీషు ప్రభుభక్తిపరులను గొందరను మరల దాని కాహ్వా నించిరి. ఈచర్చలకును ఆలోచనలకును అంతము కనబడుటలేదు. ఇందువలన గలుగు ఫలితమును గనబడుటలేదు. ఎట్టకేలకు 1933 సంవత్సరము మార్చిలో తాము చేయదలచిన రాజ్యాంగ సంస్కరణములను గూర్చిన చిత్తుచట్టమును పార్లమెంటులో ప్రవేశపెట్టగలందులకు ముందు గాబ్రిటిషుప్రభుత్వమువారొక

"వైట్ పేపర్" అనబడు రాజ్యాంగ సంస్కరణముల ప్రణాళిక కను ప్రకటించిరి. ఈ ప్రణాళికలో సూచింపబడిన రాజ్యాంగ విధాన మందరకును ఆశాభంగము కలిగించెను. దీనిని చర్చించి ఒక నివేదికను తయారుచేయుటకు పార్లమెంటువారొక జాయింటు పార్లమెంటరీకమిటీని నియమించిరి. దానికి లిన్‌లిత్గో ప్రభువు అధ్యక్షుడు. ఈ కమిటీవారు మరల భారతీయ ప్రముఖుల కొందర నాహ్వానించి విచారించి రాజ్యాంగ సంస్కరణములను గూర్చి చర్చలుజేసి వైట్ పేపరు నింకను వడపోసి అధికారములు తగ్గించి తుదకొక నివేదికను ప్రకటించిరి. దానిప్రకార మొక చిత్తుచట్టము తయారు చేయబడి పార్లమెంటులో ప్రవేశ పెట్టబడగా నది 1935 డిశంబరులో నేటి నూతన ఇండియా రాజ్యాంగముగా చేయబడినది.

## ఏనిమిదవ ప్రకరణము

## కాంగ్రెస్ ప్రభుత్వోదయము

### I

ఏబది యేండ్లనుండి భారతదేశ దారిద్ర్యవిమోచనము కొఱకును స్వాతంత్ర్యముకొరకును పాటుపడుచు బ్రిటిషుప్రభుత్వముతో ధైర్యముగ పోరాడి బాధలందిన జాతీయరాజకీయసంస్థ కాంగ్రెసు మహాసభ- సంస్థ యొక్కటే. తక్కినరాజకీయపక్షములు కేవలము బ్రిటిషుప్రభుత్వముతో మంచిచేసికొని వారి నాశ్రయించి బ్రతుకునట్టివో లేదా కేవలము మతాభిమానమును కులాభిమానమును పురస్కరించుకొని స్వార్థము నపే

క్షించు సంస్థలో కాబట్టి యివి జాతీయసంస్థలు కావు. ప్రజలలో నీ సంస్థలకును ఈరాజకీయ పక్షములకును ఎట్టిపలుకుబడియు లేదు. వీనికి వాక్శూరత్వముతప్ప కార్యశూరత్వము లేనేలేదు. దాన ప్రజలలో జాతీయోద్యమమును మేలుకొలిపి తీవ్రముగా పోరాడు కాంగ్రెసుసంస్థను అణచివేసినచో ప్రజలుఅసహాయులై బ్రిటిష్‌వారికి విధేయులై యుందురు. దాన బ్రిటిష్ రాజ్యతంత్రజ్ఞులు తమకిచ్చవచ్చినట్లు శాశ్వతముగా దేశము నేలవచ్చును. తమ కిచ్చవచ్చిన రాజ్యాంగవిధానమును స్థాపింపవచ్చును. ఇదియే బ్రిటిషు సామ్రాజ్యవాదుల యూహ. అందువలననే 1932 లో విల్లింగ్డను ప్రభువు కాంగ్రెసును ఆరువారములలో అణచివేసెదననగా సంతసించి అందుకొరకతడు అవలంబించిన క్రూరపద్ధతులను అత్యాచారములను బ్రిటిషు సామ్రాజ్యము వారామోదించిరి. విల్లింగ్డన్ ప్రయోగించిన తీవ్రనిర్బంధ విధానమువలన కాంగ్రెసువారు జైళ్లలో మ్రగ్గుచుండగా దేశములో 1933 సం॥ అంతమునాటికి, ప్రజాభిప్రాయ ప్రకటనము చచ్చిపోయినదని చెప్పవచ్చును. ప్రభుత్వముచేయుచుండిన అక్రమములను అన్యాయములను విమర్శించుటకుగూడ ఇతర రాజకీయపక్షములకు ధైర్యములేకపోయెను. కాంగ్రెసు - ఉద్యమము బహిరంగపద్ధతులను విడనాడి రహస్యకార్యక్రమమును ప్రారంభించెను. అక్రమసమావేశములు, సభలు, కరపత్రములు, ఇతర ప్రచారములు తీవ్రముగానే జరుగుచుండెనుగాని బహిరంగ ప్రచారము తక్కువగా నుండెను. అందువలన విల్లింగ్డను ప్రభువు కాంగ్రెసు బలము నశించినదనియు దానిని లేవకుండ అణచివేసితిననియు

బ్రిటిషు పార్లమెంటువారికి చెప్పివేసెను. ఇది నిజమని పార్ల మెంటు రాజనీతిజ్ఞులు విశ్వసించిరి. అతడు కాంగ్రెసు సంస్థలనెల్ల అక్రమసంఘములుగా ప్రకటించి ప్రజాభిప్రాయ ప్రకటనముల నణచివేసి ఆర్డినెన్సులమూలమున పాలింపసాగెను. ఇంతటితో తృప్తిజెందక తీవ్రనిర్బంధశాసనములనెల్ల శాసనసభలో ప్రవేశపెట్టి బలవంతముగా చట్టములుగా జేయించెను. అందు వలన దేశమెల్ల ఒకవిధమగు సైనిక శాసనముక్రింద నుండెనని చెప్పవచ్చును. ఇన్నినిర్బంధములు చేసియుంచి కాంగ్రెసులోని సామాన్యులను కారాగారములనుండి వదలినను ఇక భయము లేదని గ్రహించి అట్లుచేసి 'చూడు నా మహిమ' అని యనసా గెను. ప్రజలు లోలోపల బాధపడుచుండిరి. ఈదుస్థితినిచూడగా కాంగ్రెసువారికే చాల కష్టముగానుండెను. దేశపరిస్థితులను బట్టి కాంగ్రెసు బహిరంగ సత్యాగ్రహమును వదిలి రహస్య మార్గములను అవలంబించవలసివచ్చెనను సంగతి గాంధీమహా త్మునకు తెలిసెను. ఈ రహస్యపద్ధతులకు మహాత్ము డంగీ కరింపక సత్యాగ్రహము సత్యవ్రతమైనందున రహస్యమార్గ ములు పనికిరావనియు అట్లు బహిరంగముగా జరుపుటకు వీలు లేనిచో దాని నాపవలెననియు సలహానిచ్చెను. 1934 ఏప్రియ లులో సత్యాగ్రహము తాత్కాలికముగా విరమింపబడెను.

## II

1934 సంవత్సరం జనేవరి 15 వ తేదీన బీహారులో గొప్ప భూకంపముకలిగి చాలమంది మరణించిరి. ఆస్తిని గోల్పో యిరి. ఈ విపత్సమయమున రాజేంద్రప్రసాదుగారి నాయకత్వ

మున కాంగ్రెసువారు చేసిన సేవ యప్రతిమానముగా నుండెను. రాజేంద్రప్రసాదుగారు అనారోగ్యముగానుండికూడ నడుము కట్టి చాలశ్రమపడెను. ఆయన ప్రారంభించిన భూకంప నష్ట నివారణనిధికి ప్రభుత్వమువారినిధికివలె సంస్థానాధీశులు ధన వంతులుమాత్రమేకాక జనసామాన్యముగూడ విరాళము లొసగసాగెను. దీనివలన కాంగ్రెసు పట్ల ప్రజలకుగల భక్తి విశ్వాసములు వెల్లడియయ్యెను. నాటికింకను కాంగ్రెసు ప్రభుత్వముతో పోరాడుచున్నను, ఈవిపత్సమయమున ప్రభుత్వ ముతో కలసి పనిచేయుటవలన కాంగ్రెసుకు దేశప్రజల క్షేమము తప్ప ప్రభుత్వముతోడి విరోధము ప్రధానము కాదని వెల్లడి యయ్యెను. గాంధిమహాత్ము డారంభించిన హరిజనోద్యమము నందుగూడ కాంగ్రెసుసేవకు లత్యంతోత్సాహముతో పని చేసిరి. దేశమెల్ల యెడల అస్పృశ్యతా నివారణ ప్రయత్న ములు జరుగసాగెను. మహాత్మునిపర్యటనము ప్రజలలో నూతనోత్సాహము కలిగించెను. ఈ ఉత్సాహమును పలుకు బడిని చూచి ప్రభుత్వమువారు వెరగందిరి.

ఇంతలో కేంద్రశాసనసభలకు ఎన్నికలు వచ్చెను. ఈ సమయమునందు కాంగ్రెసు ప్రాతపద్ధతులను మార్చి శాసన సభలో ప్రవేసింపవలెనను అభిప్రాయము దేశములో వ్యాపించెను. వలన కాంగ్రెసువారు జైళ్ళలో నుండగా శాసన సభలో చేరిన ఆసాములు గవర్నమెంటు చేయుచుండిన స్వాతంత్ర్యనిరోధక - ఆర్డినెన్సులను అత్యాచారములను ఖండించి విమర్శింపక పోవుటయేగాక ఆ క్రూరనిబంధనలెల్ల శాస

సము లగుటకు తామే తోడుపడి దేశమునకు తీరని అన్యా యము చేసియుండిరి. ఇదిగాక భారతదేశ ప్రజలకు నష్టకరము లును బ్రిటిషుసామ్రాజ్యలాభ విధానమునకు తోడ్పడు నవియు నగు ఆర్థిక విధానములను కూడ ఆమోదించియుండిరి. ఇట్లు స్వాతంత్ర్యోద్యమమునకును దేశక్షేమమునకును అడ్డుపడు నట్టివారు శాసనసభలయం దుండుట దేశమునకు శ్రేయము కాదనియు కాంగ్రెసువారు ఈఅన్యాయపు నిర్బంధశాసనము లను రద్దుచేయుటకు ప్రయత్నించుటకును, వీలైనచో స్వాతంత్ర్య మునకు తోడ్పడగల శాసనములు తీర్మానములు చేయుటకును, క్రొత్తరాజ్యాంగమున కడ్డుపడుటకును, నిర్మాణకార్యక్రమము నకు తోడ్పడుటకును, శాసనసభలలో ప్రవేశింపవలయునని తీర్మానించిరి. కావున కాంగ్రెసు అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేయ నిశ్చయించెను. ఈ ఎన్నికలకొఱకు దేశములో గొప్ప ప్రచా రము జరిగెను. అసెంబ్లీలో నిదివరకుండిన బ్రిటిషుసామ్రాజ్య ప్రభు త్వాభిమానులు, ధనవంతులు, బిరుదులుగలవారు తమ అధికార బలమును ధనబలము నుపయోగించి పనిచేసిరి. అసెంబ్లీసభకు అధ్యక్షుడుగా నుండి సామ్రాజ్యాభిమానియగు సర్ షణ్ముఖం చెట్టిగారి అభ్యర్థిత్వమునకు ప్రభుత్వాధికారులనేకులు సాయము చేయజొచ్చిరి. విల్లింగ్డన్ ప్రభువు కాంగ్రెసు నణచెనో లేదో తెల్పుటకును కాంగ్రెసుకు పలుకుబడియున్నదో లేదో తెలుపుటకును ఇది యదనుగానుండెను. షణ్ముఖంచెట్టిగా రోడిపోయిరి. ఇటులు చాలమంది ప్రభుత్వాభిమానుల ఊరుపేరు

లూడ్చిపెట్టుకొనిపోయెను. కాంగ్రెసుకు అఖండజయము చేకూరెను. కాంగ్రెసు ఎన్నికలందు జయముగాంచి శాసన సభలో ప్రవేశించి రాజ్యాంగధర్మబద్ధమగు పోరాటము చేయ సాగెను. ప్రభుత్వమువా రనేకవిషయములందు ఓడిపోవసాగిరి. అనేక అడ్జర్న్‌మెంటు తీర్మానములు చేసి ప్రభుత్వముపైన తమకు విశ్వాసములేదని శాసనసభవారు ప్రకటించసాగిరి. ఆర్థికవిషయములందు బ్రిటిషుప్రభుత్వము గావించుచున్న అన్యాయములు "ఒటావా" ఏర్పాటు నిరసింపబడుటలో బయల్పడెను. కాంగ్రెసును అణచివేసితి నని విల్లింగ్డన్ పలికిన పలుకులు ప్రగల్భము లని తేలెను.

1935 వ సంవత్సరము భారతదేశ చరిత్రలో శాశ్వత ముగా స్మరింపదగినది. నాటికి కాంగ్రెసు పుట్టి 50 వత్సరములు. కాంగ్రెసు దేశమునకు చేసినసేవకు దేశీయులెల్లరు కృతజ్ఞులై భక్తి విశ్వాసములతో సువర్ణోత్సవము జరుప నిశ్చయించిరి. 1935 డిశంబరు 28 వ తేదీన అఖండ వైభవముతో సీయుత్స వము జరిగెను. భారతదేశములోను ప్రపంచములోను కాం గ్రెసుకుగల గౌరవమును పలుకుబడియు ఈ యుత్సవమువల్ల వెల్లడియయ్యెను. నలుముఖములనుండి అభినందనములు వచ్చెను. ఈ సువర్ణోత్సవసందర్భమున కాంగ్రెసుసభవారే ప్రకటించిన కాంగ్రెసు - చరిత్రను రచించు భాగ్యము ఆంధ్రుడగు డాక్టరు శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారికి కలిగెను. ఈసువర్ణోత్సవమువలన దేశము గొప్ప ప్రబోధమందెను. ప్రభుత్వమువారికి చాల ఆశాభంగము

కలిగెను. చచ్చిపోయిన దనుకున్న కాంగ్రెసు మరల జీవించు టయెగాక ద్విగుణీకృతమైన బలముతో తేజముతో పనిచేయ సాగెను.

## III

ఇట్టిస్థితిలో భారత దేశదాస్యమును శాశ్వతముగా నొనర్చు నూతన ఇండియా రాజ్యాంగచట్టము 1935 డిశంబరులో శాసనముకాగా దేశములోని రాజకీయపక్షములన్నియు ఈ క్రొత్త రాజ్యాంగమును తిరస్కరించుటలో కాంగ్రెసుతో నేకీభవించెను. కాంగ్రెసు కేవలము తిరస్కార-తీర్మానములతో తృప్తిచెందక ఈ అన్యాయపు చట్టమును భగ్నము చేయుటకు దీక్షవహించి అందుకొరకు పనిచేయసాగెను. బ్రిటీషు సామ్రాజ్యము వారీ నూతన రాజ్యాంగమును 1937 ఏప్రియల్ 1 వ తేదీనుండి రాష్ట్రములందు అమలులో పెట్టదలచి దానికి వలసిన సన్నాహములు చేయసాగిరి. సాధారణముగా కాంగ్రెసువారు ఎన్నికలలో పాల్గొనరనియు, పాల్గొనినను తాము నెలకొల్పిన ప్రత్యేక నియోజకవర్గములవల్ల జాతీయవాదులుగాక ఒండొరులతో వైరము కలిగియుండు జాతిమతవర్ణములవారియభిమానులే శాసన సభలలోనికి వచ్చి ఒండొరులతో కలహించి తమ్మాశ్రయించి యుందురనియు తమపరిపాలనావిధానమునకు అడ్డు కలిగింప జాలకుందురనియు వారి యాశ.

రాజకీయదాస్యమును, ఆర్థిక దారిద్ర్యమును చిరస్థాయిగా చేయుగల ఈరాక్షస రాజ్యాంగము నెదుర్కొనుటకును భగ్నము చేయుటకును కాంగ్రెసు తీవ్రముగా ఆలోచించి రాష్ట్రీయ

శాసనసభలను వశము చేసికొని రాజ్యాంగధర్మపద్ధతుల ప్రకారము పోరాడుచు పూర్ణస్వరాజ్యస్థాపనకొరకును, స్వాతంత్ర్య సమరమునందు ప్రజాశక్తికి హెచ్చు బలము కలిగించుటకును, ఆయధికార బలము నుపయోగించుటకును నిశ్చయించెను. ఆ ప్రకారము శాసనసభలందు ప్రవేశించి తాను చేయదలచిన కార్యములనుగూర్చి ఒక ఎన్నికల ప్రచారప్రణాళికను తయారుచేసెను. ప్రజా స్వాతంత్ర్య నిరోధక శాసనములను రద్దుచేయుట, రాజకీయ నిర్బంధితులను విడుదలచేయుట, ప్రజాస్వాతంత్ర్యములు, (సివిల్ లిబర్టీస్) కరాచీ కాంగ్రెసు తీర్మానించిన ప్రాథమిక పత్రిక - హక్కులు స్థాపించుట; ఆర్థికదుస్థితిని మాన్పి దేశ దారిద్ర్యమునుబాపుట; భూస్వామిత్వ పద్ధతులు శిస్తులవిధానములు సంస్కరించుట, ఋణభారమును తగ్గించుట, కార్మికులకు కర్షకులకు జీవనాధారములు కలిగించుట, వారికి క్షేమము కలుగు సదుపాయములు చేయుట; మద్యపాన నిషేధముచేయుట; హరిజనోద్ధరణమునకు తోడ్పడుట; ఖద్దరుకు గ్రామకుటీర పరిశ్రమలకు సహాయము చేయుట; కులములవారీగా నియోజనపద్ధతి (కమ్యూనల్ అవార్డు) రద్దు పరిపించుట, మొదలగు దేశక్షేమకరములగు సత్కార్యములు ఈప్రణాళికలో గలవు. ప్రజలు కాంగ్రెసుకు వోటునిచ్చినచో ఈకార్యక్రమమునకు వోటునిచ్చినట్లే. అనగా బ్రిటిషుసామ్రాజ్య తత్త్వము నాశ్రయించియుండు ధనవంతులకును జమీందారులకును బిరుదులుగలవారికిని ప్రజలు వ్యతిరిక్తులై యుండి కాంగ్రెసుకు తోడ్పడినట్లే. అందువలన నిజ

ముగా నీ ఎన్నిక దేశ స్వాతంత్ర్యపక్షమునకును బ్రిటిషు సామ్రాజ్య పక్షమునకును జరిగిన రాజకీయ సమరమని చెప్పవచ్చును. అందువలననే కాంగ్రెసుకు వ్యతిరేకముగా బ్రిటిషు సామ్రాజ్య ప్రభుత్వము వారును, వారి నాశ్రయించుకొని యున్న పైన చెప్పబడిన వివిధవర్గములవారును కలిసి, ఏకమై అతి తీవ్రముగా పనిచేయసాగిరి. దేశములో గొప్ప సంచలనము కలిగెను. 3½ కోట్ల నియోజకులకు ఎన్నికహక్కు కలుగుట యొక్కటే ఈ క్రొత్తరాజ్యాంగమునందలి మంచి లక్షణము. ఈ ఎన్నికహక్కులను ప్రజలెట్లు వినియోగింతురో తెలిసికొనవలసి యుండెను.

1937 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగెను. దేశములోని అధికారబలము, ధనబలము, పశుబలము, కలిసిన సామ్రాజ్యతత్త్వమునకు అపుడు గొప్పపరాజయము కలిగెను. పదునొకండు రాష్ట్రములలో ఏడు రాష్ట్రములందు కాంగ్రెసు అధికసంఖ్యాకులగు సభ్యులను శాసనసభలకంపకలిగెను. విజయము గాంచిన కాంగ్రెసు-అభ్యర్థులకు వారి ప్రత్యర్థులకన్న వేలకు వేలు హెచ్చువోట్లు వచ్చెను.

## IV

ఇటులు శాసనసభలు కాంగ్రెసుకు వశమాయెను. అపుడు 'మంత్రిత్వము స్వీకరింపవచ్చునా స్వీకరింపరాదా ?' అని కాంగ్రెసువారికి ఆలోచన కలిగెను. ఏలనగా రాజ్యాంగ చట్టమువలన గవర్నరుజనరలుకును గవర్నరులకును నిరంకుశములైన విశేషాధికారములు కలవు. వారు వాని నుపయోగించి

మంత్రిలను బొమ్మలవలె కూర్చుండబెట్టవచ్చును. ఇంగ్లాండు మొదలగు స్వతంత్ర ప్రజాప్రభుత్వము లందువలె ఈ దేశము యొక్క పరిపాలనమంతయు ప్రజాప్రతినిధులకు బాధ్యులగు మంత్రులవలన జరుగునట్టి రాజ్యాంగ మర్యాద యిచట లేదు. తుదకు సామాన్యపరిపాలనమైనను గవర్నరుజనరల్ గవర్నరుల యాటంకములు లేకుండా మన మంత్రులు జరుపగలుగు అవకాశములుకూడ లేవు. కావున నీ దేశముయొక్క సామాన్య పరిపాలనమైనను మంత్రుల యిష్టానుసారముగా జరుగునని బ్రిటిష్ ప్రభుత్వమువారు వాగ్దానము జేయువరకును లేదా అట్టి నమ్మకము కలుగజేయువరకును మంత్రిపదవులు స్వీకరింప వీలులేదని 1937 మార్చిలో తీర్మానింపబడెను.

బ్రిటిషుప్రభుత్వమువారు మొదట బెట్టుచేసి కొన్ని కీలుబొమ్మలను మంత్రులనుగా నియమించి తమ యేలుబడిని సాగించిరికాని ఈ విపరీతపు ప్రభుత్వ పద్ధతినిగూర్చి యీ దేశములోను ఇంగ్లాండులోనుకూడ గొప్ప అలజడికలిగి గాంధి మహాత్ముడును కాంగ్రెసువారును కోరునది న్యాయమేయను భావము ప్రజలలోను రాజ్యనీతిజ్ఞులలోను వర్ధిల్లగా కాంగ్రెస్ వారి అపోహలను తొలగించునట్లుగా నే గవర్నరులు ప్రవర్తింపగలరని బ్రిటిష్ ప్రభుత్వమువారు ప్రకటించిరి. అంతట 1937 జులైలో కాంగ్రెసు మంత్రిత్వము స్వీకరించెను. ఏడు రాష్ట్రములందు కాంగ్రెస్ మంత్రులధికారము వహించుటతో భారత దేశమున నొక నూతనయుగము ప్రారంభమైనదని చెప్పవచ్చును.

# సంవత్సరములవారీ చరిత్ర

1556 భారతదేశమున అక్బరు మొగలుసామ్రాజ్య చక్రవర్తియగుట.

1571 లెపాంటో యుద్ధమున స్పెయినురాజ్యము తురుష్క నౌకాదళము నోడింపగా ఐరోపావర్తకులకు తురుష్కులవలని బాధలుపోయి తూర్పుదేశములతో వ్యాపారాభివృద్ధికి మార్గము లేర్పడుట.

1579 ఆంగ్లనావికుడగు సర్ ఫ్రాన్సిస్ డ్రేక్ ప్రపంచముచుట్టు సముద్రయానము జేసిరాగా సముద్ర మార్గముల వ్యాపారము విజృంభించుట. ఇంగ్లాండులో తురుష్క వర్తకకంపెనీ స్థాపింపబడుట.

1580 సముద్రములం దంతవరకు బలవంతమైయుండిన పోర్చుగల్లు రాజ్యము స్పెయినురాజ్యమునకు లోబడి బలహీనమగుట.

1583 ఇంగ్లీషు తురుష్క వర్తకకంపెనీవారు హిందూదేశముతో వర్తకము జేయుటకు 'టైగర్' అను ఓడను పంపుట.

1588 స్పానిష్ ఆర్మడా వినాశనము. సముద్రమార్గములను చేజిక్కించుకొన్న స్పెయినురాజ్య నౌకాదళములను ఇంగ్లాండు విచ్ఛిన్నముచేయుట.

1599 తూర్పుఇండియా వర్తక కంపెనీ ఇంగ్లాండులో స్థాపింపబడుట.

1600 ఇంగ్లీషురాణియగు ఎలిజబెత్తు, తూర్పు ఇండియాకంపెనీవారికి భారత దేశమున వర్తకముచేసికొనుటకు పట్టా నొసగుట.

1603 ఇంగ్లాండు రాణియగు ఎలిజబెత్తు మరణము.

1605 అక్బరు చక్రవర్తి నిర్యాణము-జిహాంగీరు భారతదేశ చక్రవర్తియగుట.

1612 తూర్పుఇండియా కంపెనీ వాటాదారుల సంఘముగా చేయబడుట. ఇంగ్లీషు కెప్టెన్ బెస్టు, స్వాలీదగ్గరను ఇండియా పశ్చిమతీరమునను పోర్చుగీసువారిని ఓడించుట. సూరతులో నింగ్లీషు వర్తకస్థానము (ఫ్యాక్టరీ) స్థాపింపబడుట.

1615 సర్ తామస్‌రో ఇంగ్లాండురాజ్య రాయబారిగా మొగలు చక్రవర్తి దర్బారుకు వచ్చుట. (1615 మొదలు 1618 వరకు నితడు మొగలు దర్బారులో రాయబారిగ నుండెను.)

1620 ఇంగ్లీషు తూర్పుఇండియా కంపెనీవారు పోర్చుగీసువారి నోడించుట.

1628 షాజిహాను భారతదేశ చక్రవర్తియగుట.

1630 ఇండియాలో పెద్ద కఱవు స్వాలీదగ్గర పోర్చుగీసువారు ఓడుట.

1632 గోల్కొండనవాబు ఇంగ్లీషు వర్తక కంపెనీకి బందరులో సువర్ణ ఫర్మానా అనబడు వ్యాపారపట్టా నిచ్చుట.

1635 ఇంగ్లీషుకంపెనీకి పోర్చుగీసువారికి యుద్ధవిరామ సంధి జరుగుట.

1639 చంద్రగిరిరాజు ఇంగ్లీషుకంపెనీకి చెన్నపురిలో స్థలమిచ్చుట.

1641 మద్రాసులో ఫోర్టుసెంట్ జార్జికోట స్థాపింపబడుట.

1642 ఇంగ్లీషు తూర్పు ఇండియాకంపెనీవారికిని పోర్చుగీసువారికిని స్థిరమైన సంధి; ఇంగ్లాండులో అంతఃకలహములు, సివిలుయుద్ధము.

1649 ఇంగ్లాండురాజగు మొదటి చార్లెసు వధింపబడుట.

1652–54 మొదటి డచ్చియుద్ధము.

1652–58 మద్రాసు ఒకరాజధానిగా చేయబడుట.

1657 ఇంగ్లీషు ప్రభుత్వ సర్వాధికారియగు క్రాంవెల్ తూర్పుఇండియా కంపెనీకి వ్యాపారపట్టా నొసగుట.

1658 ఔరంగజేబు భారతదేశ చక్రవర్తియగుట.

1662 బొంబాయిని పోర్చుగీసువారు ఇంగ్లీషురాజగు రెండవచార్లెసుకిచ్చుట.

1668 బొంబాయిని చార్లెసురాజు ఇంగ్లీషుతూర్పుఇండియా కంపెనీ కిచ్చుట. ఫ్రెంచి తూర్పుఇండియా వర్తక కంపెనీ స్థాపింపబడుట.

1674 శ్రీ ఛత్రపతి శివాజీ స్వతంత్ర రాజుగా పట్టాభిషిక్తుడగుట.

1680 శ్రీ ఛత్రపతి శివాజీ నిర్యాణము.

1686 ఇంగ్లీషు తూర్పు ఇండియాకంపెనీ మొగలుసామ్రాజ్యముతో పోరుట. వంగరాష్ట్రమున కంపెనీ వర్తకస్థానములు నాశనమగుట.

1687 మద్రాసు ఒక 'మేయరు' క్రింద మునిసిపాలిటీగా స్థాపింపబడుట. ఇంగ్లీషు వర్తకకంపెనీవారు తమ ముఖ్యస్థానమును సూరతునుండి బొంబాయికి మార్చుట.

1690 కలకతా స్థాపింపబడుట.

1698 తూర్పుఇండియా కంపెనీకి పోటీ కంపెనీస్థాపింప బడుట.

1700 కలకత్తా ఒకరాజధానిగా చేయబడుట.

1702 ఇంగ్లీషు పోటీకంపెనీలు రెండును రాజీపడి ఏకమగుట.

1707 ఔరంగజేబు నిర్యాణము-బహదూర్ షా చక్రవర్తియగుట.

1712 ఫరుక్ షయ్యరు చక్రవర్తియగుట.

1713 బర్కుమహాశయుని జననము. (జనేవరు 1)

1714 మొగలాయి దర్బారుకు సర్మన్ రాయబారము.

1726 అన్ని రాజధాని నగరములందును 'మేయరుకోర్టు'లు స్థాపింపబడుట.

1727 పీష్వా మహారాష్ట్ర రాజ్యాధిపత్యమును వహించుట.

1739 మహారాష్ట్రులు మాళవమును జయించుట. పెర్షియా దేశమునుండి నాదిర్ షా దండెత్తివచ్చి ఢిల్లీని కొల్లగొనుట.

1742 ఫ్రెంచి రాజనీతిజ్ఞుడగు డూప్లే పాండుచేరికి గవర్నరగుట.

1744 ఆస్ట్రియా రాజ్య వారసత్వయుద్ధము.

1746 ఇంగ్లీషువారికి ఫ్రెంచివారికి హిందూదేశ తూర్పుతీరమున నౌకా యుద్ధము జరుగుట. ఫ్రెంచివారు మద్రాసును పట్టుకొనుట.

1748 ఇంగ్లీషువారు పాండుచేరిదగ్గర అపజయముగాంచుట. నైజాం ఉల్ ముల్కు మరణము; శివాజీ మనుమడగు షాహూ మరణించుట.

1749 'ఎయిక్సులాఛాపెల్' సంధివలన ఇంగ్లీషువారికి ఫ్రెంచివారికి రాజీజరుగుట. మద్రాసు ఇంగ్లీషువారికి వశమగుట. తంజావూరు రాజ్య వారసత్వ తగవులో ఇంగ్లీషువారు కలుగజేసికొనుట. కర్నాటకనవాబు మరణము. డూప్లే రాజ్యనీతి సఫలమగుట.

1750 దక్షిణ హిందూస్థానమున నైజాముయొక్కయు, కర్నాటక నవాబు యొక్కయు వారసత్వము విషయమున యుద్ధములు ప్రారంభమగుట. డూప్లే కర్నాటక పరిపాలకుడగుట.

1751 క్లైవు ఆర్కాటును సంరక్షించుట.

1752 ఫ్రెంచివారు తిరుచునాపల్లి ముట్టడిని మానుట. చందా సాహెబు ఉరిదీయబడుట.

1754 డూప్లేను ఫ్రెంచివారు వెనుకకు రమ్మనుట. ఫ్రెంచివారికిని ఇంగ్లీషు వారికిని దక్షిణ హిందూస్థానమున శాంతికలుగుట.

1756 ఏడేండ్లయుద్ధము ఐరోపాలో ప్రారంభమగుట. వంగరాష్ట్రనవాబు సురాజుద్దౌలా కలకత్తాను పట్టుకొనుట.

1757 ఇంగ్లీషువారు చందన్నగరమును పట్టుకొనుట. ప్లాసీయుద్ధము. మీర్జాఫరు వంగరాష్ట్రనవాబుగ చేయబడుట.

1758 బొబ్బిలియుద్ధము. ఫ్రెంచిసేనాపియగు లాలీ మద్రాసు పట్టుకొనలేక పోవుట. ఫోర్డు ఉత్తర సర్కారులపైబడుట.

1759 ఫోర్డు బిదెర్రా దగ్గర డచ్చివారి నోడించుట. షాఅలం చక్రవర్తియగుట.

1760 వాన్సిటార్టు వంగరాష్ట్ర గవర్నరగుట. దక్షిణ హిందూస్థానమున వందవాశి దగ్గర ఫ్రెంచివారు కడపటిసారి ఓడింపబడుట. మీర్జాఫరు బదులు వంగరాష్ట్రమున మిర్ఖాసీము నవాబుగ జేయబడుట.

1761 మూడవ పానిపట్టు యుద్ధమున మహారాష్ట్రుల ఆఫ్గనుల నోడించుట. పాండుచేరీపడుట హైదరాలీ మైసూరు పరిపాలకుడగుట.

1763 ప్యారిసుసంధి. ఏడేండ్లయుద్ధ మంతమగుట, మీర్ఖాసీము పాట్నాలో ఐరోపావారిని వధించుట. మీర్జాఫరు మరల నవాబుగచేయబడుట.

1764 మీర్ఖాసీము బక్సారుదగ్గర ఓడింపబడుట.

1765 మీర్జాఫరు మరణము. క్లైవు వంగరాష్ట్ర గవర్నరగుట. కంపెనీవారు మొగల్ చక్రవర్తివల్ల వంగరాష్ట్ర బీహారు ఒరిస్సాల "దివానిగిరీ"ని సంపాదించుట.

7767 హైదరాలీతో యుద్ధము. క్లైవు సీమకుపోవుట. వెరల్స్టు వంగరాష్ట్ర గవర్నరగుట.

1769 కార్టియరు వంగరాష్ట్ర గవర్నరగుట, మద్రాసు సంధివలన హైదరాలీతోడి యుద్ధ మంతమగుట.

1770 వంగరాష్ట్రమున ఘోరమైన కఱవు.

1772 వారన్ హేస్టింగ్సు వంగరాష్ట్ర గవర్నరగుట.

1773 రెగ్యులేటింగు ఆక్టు.

1774 రోహిలాయుద్ధము.

1774 వారన్ హేస్టింగ్సు మొదటిగవర్నరుజనరలగుట; కలకత్తాలో సుప్రీముకోర్టు స్థాపింపబడుట

1775 మొదటి మహారాష్ట్రయుద్ధము; నందకుమారుడు ఉరిదీయబడుట.
1776 అమెరికా సంయుక్తరాష్ట్రముల స్వాతంత్ర్య ప్రకటన (జూలై 7).
1778 ఫ్రాన్సుతో యుద్ధము, ఫ్రెంచివారి పట్టణములు పట్టుకొనబడుట.
1779 వార్గాను (Wargaon) కన్వెన్షను; మైసూరుతో యుద్ధము.
1780 పోఫాము గ్వాలియరును పట్టుకొనుట. హైదరాలీ కర్నాటకముపైకి దండెత్తివచ్చుట. బెయిలీసైన్యము నాశనము చేయబడుట.
1781 పోర్టోనోవో యుద్ధమున సర్ ఐర్ కూటు జయించుట. వారన్ హేస్టింగ్సు, కాశీరాజగు చెత్ సింగుపట్ల జరిపిన తంత్రము.
1782 వారన్ హేస్టింగ్సు, అయోధ్యబీగములను హింసించుట. మద్రాసుదగ్గర ఫ్రెంచివారి నౌకాదళములు విజృంభించుట. హైదరాలీమరణించుట.
1783 వెర్సెయిల్సు సంధి. ఫ్రెంచివారికి ఇంగ్లీషువారికి రాజీ.
1784 మంగుళూరు సంధి. టిప్పుసుల్తానుతో సంధి. పిట్టుచట్టము అనబడు ఇండియా రాజ్యాంగచట్టము శాసింపబడుట.
1785 వారన్ హేస్టింగ్సు గవర్నరుజనరలు పనిని మానుకొనుట. సర్ జాన్ మెక్ఫర్సన్ ఆక్టింగు గవర్నరుజనరలగుట.
1786 కారన్వాలిస్ ప్రభువు గవర్నరుజనరలగుట.
1787 మహాదాజీ సింధియాకును మహారాష్ట్రులకును అపజయములు కలుగుట.
1788 వారన్ హేస్టింగ్సుపైన నేరారోపణ; విచారణ.
1789 ఫ్రెంచిదేశములో విప్లవ ప్రారంభము.
1790 మూడవ మైసూరుయుద్ధము.
1792 శ్రీరంగపట్నము సంధి.
1793 వంగరాష్ట్రమున పర్మనెంటు సెటిల్మెంటు (శాశ్వతపైసలా). ఈస్టిండియా కంపెనీవారి వ్యాపారపట్టా మరల ఒసగబడుట.
1794 మహాదాజీసింధియా మరణము.
1795 సర్ జాన్ షోరు గవర్నరుజనరలగుట. వారన్ హేస్టింగ్సు నిర్దోషియని తీర్పు. రాణీ అహల్యాబాయి మరణము. బెనారసులో పర్మనెంటు సెటిల్మెంటు. మహారాష్ట్రులు నైజామును కార్డ్లాదగ్గర నోడించుట.

1798 లార్డు (మార్నింగ్ టన్) వెలస్లీ గవర్నరుజనరలగుట.

1799 నాలుగవ మైసూరుయుద్ధము. శ్రీరంగపట్నము నింగ్లీషువారు పట్టుకొనుట, టిప్పుసుల్తాను మరణము; సీరంపూరులో బాప్టిస్టు మిషనరీయగు క్యారీ క్రైస్తవ (ప్రచారసంఘము) మిషను స్థాపించుట.

1800 నానాఫడ్నవీసు మరణము.

1802 పూనాయుద్ధము. మహారాష్ట్రుల వ్యవహారములందు కంపెనీవారు కలుగజేసికొనుట. బెస్సీను సంధి. మద్రాసులో పర్మనెంటు సెటిల్మెంటు.

1803 రెండవ మహారాష్ట్రయుద్ధము, ఢిల్లీ, అస్సాయి, లాస్వారి, ఆగ్రానుల యుద్ధములు.

1804 హోల్కారుతో యుద్ధము. మాన్సన్ ఓడిపోవుట. డిగ్గు పట్టుపడుట. నెపోలియను ఫ్రెంచి సామ్రాజ్యమునకు చక్రవర్తియగుట.

1805 భరతపురము ముట్టడి వ్యర్థమగుట. వెలస్లీని కంపెనీవారు వెనుకకు రమ్మనుట.

1805 ఆగస్టు, సెప్టెంబరులలో కారన్వాలిసు ప్రభువు గవర్నరుజనరలగుట. అక్టోబరులో సర్ జార్జి బార్లో ఆక్టింగు గవర్నరుజనరలగుట.

1806 వెల్లూరులో సిపాయిల పితూరీ.

1807 మింటోప్రభువు గవర్నరుజనరలగుట.

1808 మాల్కంలం పెర్షియాకు, ఎల్ఫిన్స్టన్ కాబూలుకు, రాయబారులుగ పంపబడుట. తిరువాంకూరులో గొప్ప తిరుగుబాటు.

1809 రంజితసింగు దగ్గరకు మెట్కాఫ్ రాయబారిగ పంపబడుట. అమృతసరు సంధిజరుగుట. మద్రాసు కంపెనీయుద్యోగుల పితూరీ.

1810 మొల్యుక్కాస్ పట్టుబడుట.

1811 జావాద్వీపము జయింపబడుట.

1813 లార్డు హేస్టింగ్సు గవర్నరుజనరలగుట. తూర్పుఇండియా కంపెనీవారికి క్రొత్త అధికారములతో పట్టా ఇవ్వబడుట.

1814-16 నేపాళ యుద్ధము.

1817-19 పిండారీయుద్ధము. మహారాష్ట్రయుద్ధము.

1817 కర్కీ, సీతాబాల్డీ నాగపూరు, మహిద్పూరు, యుద్ధములు.

1817 డేవిడ్ హేర్, రామమోహనరాయిగార్లు కలకత్తాలో హిందూ కాలేజి స్థాపించుట. రామమోహనరాయల సంఘసంస్కరణ ప్రయత్నములు.

1818 కోరిగోన్, అష్టియుద్ధములు. వంగభాషలో మొదటి వార్తాపత్రిక. వంగరాష్ట్ర ప్రవాసముల 'III వ రెగ్యులేషను' శాసింపబడుట.

1819 మధ్యరాష్ట్రములందు శాంతి నెలకొల్పబడుట. సింగపూరు స్థాపనము. అయోధ్యనవాబు అయోధ్యరాజుగ ప్రకటింపబడుట.

1820 సర్ తామస్ మన్రో మద్రాసు గవర్నరగుట.

1821 నెపోలియన్ మరణము. మద్రాసులో రైత్వారీపద్ధతి పూర్తియగుట.

1823 (జనేవరు-జూలై మధ్య) జాన్ ఆడం, ఆక్టింగు గవర్నరుజనరలగుట.

1823 ఆగష్టులో అమ్హెర్స్టు ప్రభువు గవర్నరుజనర లగుట

1824 బర్మా యుద్ధము. బ్యారక్ పూర్ పితూరీ. హరిశ్చంద్ర ముఖర్జీ జననం.

1825 శ్రీ దయానందసరస్వతి - దాదాభాయి నౌరోజీల జననము.

1826 భరతపురమును కొల్లగొనుట. యండబూసంధి; బర్మాయుద్ధ సమాప్తి.

1827 సర్ తామస్ మన్రో మరణము. తెలుగున తొలిగ్రంథముద్రణము.

1828 విలియంబెంటింకు ప్రభువు గవర్నరుజనరలగుట. రామమోహనరాయలు కలకత్తాలో బ్రహ్మసమాజ ప్రార్థన మందిరమును స్థాపించుట.

1829 వంగరాష్ట్రమున సహగమన నిషేధము. థగుల నేరములు శిక్షార్హమగుట. ఏ. ఓ. హ్యూముగారి జననము. గ్రీసుదేశ స్వాతంత్ర్యము.

1830 మద్రాసు బొంబాయిలలో సహగమనము నిషేధింపబడుట. ఢిల్లీచక్రవర్తి తరఫున ఇంగ్లాండునకు రాజా రామమోహనరాయల రాయబారము. ఇంగ్లాండులో నాలవ విలియం రాజు పట్టాభిషేకము.

1831 మైసూరు రాజును పదచ్యుతునిగజేసి ఆంగ్లేయులు మైసూరును ట్రస్టీలుగా వశముజేసికొనుట. గవర్నరుజనరలు రంజిత్ సింగుల సమావేశము.

1833 రాజా రామమోహనరాయల నిర్యాణము (సెప్టెంబరు 27). తూర్పు ఇండియా కంపెనీకి రాజ్యాధికారపట్టా మరల నివ్వబడుట.

1834 శ్రీ రామకృష్ణపరమహంస జననము (ఫిబ్రవరి 20)

1835 సర్ చార్లెస్ మెట్కాఫ్ ఆక్టింగు గవర్నరుజనరల్-పత్రికలకు స్వాతంత్ర్యము. దోస్తుమహమ్మదు అఫ్గనిస్థానమునకు అమీరగుట.

1836 ఆక్లండు ప్రభువు గవర్నరుజనరలగుట

1837 విక్టోరియా ఇంగ్లాండు రాణియగుట. అయోధ్యలో విప్లవము రాకుండ కర్నల్ 'లోవ్' కాపాడుట. హిందూస్థానమున కఱవు.

1838 ఆఫ్గనురాజ్యము నాశించిన షా షుజాకును, రంజితసింగుకును తూర్పు ఇండియా కంపెనీకిని ఒడంబడిక. కేశవచంద్రసేను, క్రిస్టోదాస్‌పాల్, బంకించంద్ర చటర్జీల జననము.

1839 సింధు అమీరులపైన నొక క్రొత్తసంధి బలవంతముగా విధించుట. రంజిత్‌సింగు మరణము. ఆఫ్గనిస్థానములోనికి దండయాత్ర. ఘజినీని కాబూలులను పట్టుకొనుట. సతారారాజును పదచ్యుతునిజేయుట.

1840 దోస్తుమహమ్మదు లోబడుట. ఇంగ్లాండులో 'పెన్నీ' తపాల ఆరంభము.

1841 బరన్సు, మెక్నాటనులు హత్యచేయబడుట.

1842 ఎలెన్‌బరో గవర్నరుజనరలగుట. ఆఫ్గన్‌యుద్ధము - సంధి.

1843 సింధుదేశ ఆక్రమణము. మహారాజపురము పన్నియారుల దగ్గర గ్వాలియరు సేనల నోడించుట-బానిసత్వము నిషేధింపబడుట.

1844 సర్ హెన్రీ హార్డింజి గవర్నరుజనరలగుట.

1845 సిక్కుల సైన్యము సట్లెజినదిని దాటుట. మొదటి సిక్కుయుద్ధము.

1846 గాజుల లక్ష్మీనరుసుసెట్టిగారు, చెన్నపట్టణ స్వదేశసంఘమును-క్రిసెంట్ పత్రికను స్థాపించుట.

1847 శ్రీ అనిబిసెంటు జననము (1వ అక్టోబరు.)

1848 డాల్‌హౌసీ గవర్నరుజనరలగుట. రెండవ సిక్కుయుద్ధము.

1848 వీరేశలింగంగారి జననము. (ఏప్రిలు 16). సురేంద్రనాథ బెనర్జీ జననం.

1849 పంజాబును ఇంగ్లీషురాజ్యమున కలుపుకొనుట. మాప్లాల పితూరీ. సతారారాజ్యమును డల్‌హౌసీ కలుపుకొనుట.

1850 స్టేట్ ప్రిజనర్సు ఆక్టు.

1851 కలకత్తా బ్రిటిష్‌ఇండియన్‌సంఘము స్థాపింపబడుట.

1852 రెండవ బర్మాయుద్ధము. గోదావరి ఆనకట్ట పూర్తియగుట.

1853 సర్ జాన్ లారెన్సు పంజాబు చీఫ్ కమీషనరగుట. బొంబాయి తాణా రైల్వే తెరువబడుట. నాగపురమును కలుపుకొనుట. కంపెనీకి రాజ్యాధికారపట్టా మరల నివ్వబడుట.

1854 భారతదేశమున తంతివార్త ప్రారంభము. క్రిమియన్ యుద్ధము

1855 సంతాలుల తిరుగుబాటు. మద్రాసు టార్చర్ (హింసల) కమిషను.
1856 అయోధ్యను కలుపుకొనుట.
1856 క్యానింగు ప్రభువు గవర్నరుజనరలగుట. పెర్షియాతో యుద్ధము. శ్రీ లోకమాన్యతిలకు జననము (జూలై 23)
1857 ఆఫ్గనిస్థాన అమీరుతో సంధి. మీరతు పట్టణమున సిపాయి విప్లవము ప్రారంభమగుట (మేనెల). ఢిల్లీమరల పట్టుబడుట (సెప్టెంబరు). హ్యావలక్ లక్నో చేరుట (సెప్టెంబరు). సర్ సి. కాంబెల్ లక్నోను రక్షించుట (నవంబరు). స్టేట్ ఆఫెన్సెస్ ఆక్టు. కలకత్తా బొంబాయి మద్రాసు విశ్వవిద్యాలయములు స్థాపింపబడుట.
1858 ఝాన్సీరాణి మట్టడి (మార్చి) అయోధ్యను జయించుట. శాంతి ప్రకటన (జూలై). ఇండియా గవర్నమెంటు ఇంగ్లీషు రాజ్యమకుటమున చేర్చబడుట. విక్టోరియారాజ్ఞి ప్రకటన (నవంబరు 1.)
1859 క్యానింగు వైస్రాయిగ నియమింపబడుట. జేమ్సువిల్సను ద్రవ్యమంత్రిగ నియమింపబడుట. మద్రాసు ప్రవాసముల II వ రెగ్యులేషను-జిల్లా (ప్యూనిటివు) పోలీసు చట్టము
1860 పశ్చిమోత్తర పరగణాలలో కఱవు. ఇండియా శాసనసభల నిర్మాణ చట్టము. పీనలుకోడ్డు శాసనమగుట.
1861 అమెరికాలో సివిలుయుద్ధము. రవీంధ్రనాథ ఠాకూరు జననము (మే). రష్యారైతుల దాస్యవిమోచనము. శ్రీ మదన్ మోహన మాళవియ జననము.
1862 ఎల్జిన్ ప్రభువు వైస్రాయియగుట. హైకోర్టులు స్థాపింపబడుట. శ్రీ వివేకానందస్వామి జననము (జనేవరి 9). అమెరికాలో బానిసత్వమును మాన్పుట.
1863 దోస్తుమహమ్మదు మరణము.
1864 లారెన్సు వైస్రాయియగుట. భూటానుతో యుద్ధము. బందరు ఉప్పెన.
1865 అమెరికా సివిలుయుద్ధమంతమగుట. శ్రీ లాలా లజపతిరాయి జననము.
1866 ఒరిస్సారాష్ట్రమున కఱవు. శ్రీ గోపాలకృష్ణగోఖలే జననము.
1867 ఇంగ్లాండులో ఎన్నికలసంస్కరణము. (రిఫారంఆక్టు). భారతదేశమున ప్రెస్ అండ్ బుక్సు రిజిస్ట్రేషను చట్టము.

1868 పంజాబు భూస్వామ్య (టెనెన్సీ) చట్టము. శ్రీ గాజుల లక్ష్మీనరసుసెట్టి గారి నిర్యాణము. అంబాలానుండి ఢిల్లీవరకు రైలుదారి తెరువబడుట. షెర్ ఆలీ అఫ్ఘనిస్థాన అమీరగుట.

1869 మేయోప్రభువు వైస్రాయియగుట. షెర్ఆలీతో అంబాలా కాన్ఫరెన్సు. మహాత్మాగాంధి జననము (అక్టోబరు 2). సూయజు కాలువ తెరువబడుట. హరిశ్చంద్రముఖర్జి నిర్యాణము.

1870 ఫార్‌స్టర్ దొర విద్యాచట్టము. ఫ్రెంచి ప్రజాస్వామిక ప్రకటన.

1872 అండమానులలో మెయో హత్యచేయబడుట. నార్తుబ్రూకు ప్రభువు వైస్రాయియగుట. సీయిస్థాన్ సరిహద్దు తగాదా. శ్రీ అరవింద ఘోషు జననము (ఆగస్టు 15)

1873 రష్యావారు ఖైవు (Khive)ను పట్టుకొనుట.

1874 బీహారులో కఱవు. ఇంగ్లాండులో డిస్రేలీ ప్రధానామాత్యుడగుట.

1875 బరోడా గెయిక్వారు కేసు. ఏడవ ఎడ్వర్డు ప్రిన్సుఆఫ్‌వేల్సుగా ఇండియాకువచ్చుట. అమెరికాలో దివ్యజ్ఞానసమాజ స్థాపన. దయానంద సరస్వతిగారి ఆర్యసమాజము బొంబాయిలో స్థాపింపబడుట.

1876 ఇంగ్లాండురాజులకు ఇండియాచక్రవర్తి బిరుదమిచ్చు పార్లమెంటు చట్టము. లిట్టన్‌ప్రభువు వైస్రాయియగుట. ఖెలట్ సంధి; కఱవు.

1877 ఢిల్లీదర్బారు. ఇంగ్లాండురాణీ విక్టోరియా భారతదేశ మహారాజ్ఞిగా ప్రకటింపబడుట. భారతదేశమున కఱవు వ్యాపించుట.

1878 దేశభాషల వార్తాపత్రికల చట్టము. (Vernacular Press Act) భారతీయ పటాలములు మాల్టా కంపబడుట బెర్లిన్‌సంధి - రెండవ ఆఫ్గను యుద్ధము, బర్మారాజగు మిండన్‌మిన్ మరణము. ఆయుధముల చట్టము. (ఆరమ్సు ఆక్టు). హిందూపత్రిక మద్రాసులో వార పత్రికగ స్థాపింపబడుట.

1879 గండమాక్ సంధి. బర్మారాజకుమారి హత్య. కాబూలులో కావగ్నరీ హత్యచేయబడుట. కాబూలును మఱల నాక్రమించుట.

1880 రిప్పన్‌ప్రభువు వైస్రాయియగుట. మెయివాండ్ యుద్ధము. దక్షిణాఫ్రికాలో బోయరు యుద్ధము ప్రారంభమగుట. కాందహారునకు దండయాత్ర అబ్దుల్ రహమానును అమీరుగా అంగీకరించుట. గ్లాడ్‌స్టన్ మఱల ఇంగ్లాండు ప్రధానామాత్యుడగుట.

1881 ఫ్యాక్టరీల చట్టము. మైసూరును మఱల ప్రాతరాజున కిచ్చుట. ఈజిప్టులో అరబీచే పితూరీ.

1882 వివేకానందస్వామి శ్రీరామకృష్ణపరమహంసకు శిష్యులగుట. దివ్యజ్ఞానసమాజ కార్యాలయము అడయారులో స్థాపింపబడుట.

1883 ఇల్బర్టు బిల్లు. శ్రీ దయానంద సరస్వతి నిర్యాణము.

1884 రష్యావారు మెర్వ్ (Merv) ఆక్రమించుట రష్యా ఆఫ్గన్ కమీషను. రిప్పన్ ప్రభువు పనిమానుకొనుట. డఫ్రిన్ వైస్రాయియగుట. బ్రహ్మసమాజ ప్రధానాచార్యుడగు కేశవచంద్రసేను నిర్యాణము.

1885 మూడవ బర్మాయుద్ధము. అఖిలభారత కాంగ్రెస్ మహాసభ ప్రథమ సమావేశము. శాలిస్బరీ ఆంగ్ల ప్రధానామాత్యుడగుట.

1886 అప్పర్ బర్మాను కలుపుకొనుట. ఢిల్లీలో హిందూమహమ్మదీయ కలహము. శ్రీ రామకృష్ణపరమహంస నిర్యాణము. (ఆగష్టు 16)

1888 హజారా దండయాత్ర. లాన్సుడౌను ప్రభువు వైస్రాయియగుట.

1889 కాశ్మీరమహారాజు రాజ్యత్యాగముజేయుట. పండిత జవహర్లాల్ నెహ్రూగారి జననము. (నవంబరు 14)

1891 ఫ్యాక్టరీలచట్టము; యుక్తవయస్సుచట్టము. (Age of Consent Bill) మణిపుర పితూరీ.

1892 ఇండియన్ (శాసనసభల) కౌన్సిళ్ళ చట్టము. గ్లాడ్స్టన్ నాలుగవ మారు ఇంగ్లాండు ప్రధానామాత్యుడగుట.

1893 డ్యూరాండు కాబూలునకు రాయబారిగ పోవుట.

1894 ఎల్జిన్ ప్రభువు వైస్రాయి యగుట. నల్లమందు విచారణసంఘము. (కమీషను). బంకించంద్రచటర్జి నిర్యాణము (ఏప్రిలు 8)

1895 శాలిస్బరీ ఇంగ్లాండు ప్రధానామాత్యుడగుట చిత్రాలు దండయాత్ర.

1896 భారతదేశమున కఱవు. 'ఎక్సు రే' కనిపెట్టబడుట.

1897 బొంబాయిలో ప్లేగు (మహామారి). ర్యాండు, ఆయిర్స్టులు పూనాలో హత్యచేయబడుట. హిందూదేశ సరిహద్దులో తిరుగుబాటులు.

1898 లోకమాన్య తిలకును రాజద్రోహనేరమునకు 1½ సం॥ శిక్ష వేయుట.

1899 కర్జను ప్రభువు వైస్రాయియగుట. దేశమున కఱవు.

1900 పశ్చిమోత్తర సరిహద్దుపరగణా నిర్మాణము.

1901 హబీబుల్లా అఫ్గన్ అమీరగుట. విక్టోరియారాణి మరణము

1902 వివేకానందస్వామి నిర్యాణము (జూలై 4). మార్కోని తీగలేనితంతి.

1903 కర్జను దర్బారు. (ఎడ్వర్డు పట్టాభిషేకము)

1904 టిబెట్టు దేశమునకు దండయాత్ర. సహకార సంఘముల చట్టము. రష్యా జపాను యుద్ధప్రారంభము.

1905 అమీరుతో సంధి. వంగరాష్ట్రవిభజనము. 'వందేమాతరం' ఉద్యమము. మింటో ప్రభువు వైస్రాయియగుట. లిబరల్ పార్టీ ఇంగ్లాండులో ప్రభుత్వమువహించుట. మార్లే ఇండియారాజ్యాంగ కార్యదర్శియగుట.

1907 ఆంగ్ల రష్యను కమీషను. రాజద్రోహ మీటింగుల చట్టము. దక్షిణాఫ్రికాలో భారతీయులను ట్రాన్సువాలుకు రాకుండ నిషేధించుట.

1908 మణిక్తలా కేసు విచారణ. లోకమాన్య తిలకు రాజద్రోహమునకు శిక్షింపబడుట (6 సంవత్సరములు). న్యూస్ పేపర్ల చట్టము. ప్రేలుడు పదార్థముల చట్టము. క్రిమినలు లా సవరణచట్టము.

1909 మింటో మార్లే రాజ్యాంగసంస్కరణములు.

1910 హార్డింజి ప్రభువు వైస్రాయియగుట. ఇండియన్ ప్రెస్సు ఆక్టు.

1911 ఢిల్లీదర్బారు. భారతదేశమునకు ఢిల్లీ ప్రభుత్వ రాజధానిగా చేయబడుట. వంగరాష్ట్ర విభజనము మార్పబడుట. చైనాలో విప్లవము.

1912 బాల్కన్ యుద్ధము. చైనా ప్రజాస్వామికమగుట. హ్యూమ్ దొర నిర్యాణము.

1913 దక్షిణాఫ్రికా భారతీయులనుగూర్చి హార్డింజి ప్రభువు సానుభూతి.

1914 ఐరోపా మహాసంగ్రామము. (ఆరంభము ఆగష్టు 4)

1915 ఇండియా డిఫెన్సుచట్టము.

1916 చెమ్సుఫోర్డు ప్రభువు వైస్రాయియగుట. అనీబిసెంట్ గారు హోంరూలులీగు స్థాపించుట. లక్నో ఒడంబడిక (హిందూముసల్మానుల రాజీ ప్రణాళిక). కాశీ హిందూవిశ్వవిద్యాలయ స్థాపన.

1917 మెసపొటేమియా కమిషను రిపోర్టు. మాంటేగూ ఇండియారాజ్యాంగ కార్యదర్శియగుట. రాజ్యాంగసంస్కరణముల వాగ్దానప్రకటన. భారతదేశమునకు మాంటేగూ వచ్చుట. అనీబిసెంటు ఇంటరన్ మెంటు. దాదాభాయి నౌరోజీ నిర్యాణము (జూను 30). రష్యావిప్లవము.

1918 మాంటేగూ-చెమ్సుఫోర్డు రిపోర్టు. రౌలటుకమిటీరిపోర్టు (రాజద్రోహ విచారణ). ఐరోపా యుద్ధవిరామసంధి. (నవంబరు 11)

1919 రౌలటుబిల్లులు శాసనమగుట. హబిబుల్లా హత్యచేయబడుట. పంజాబులో జాలియన్‌వాలా బాగువధలు (ఏప్రిలు 13) మార్షల్‌లా. మూడవ అఫ్గనుయుద్ధము (మే). మహసుదులపై దాడి. మాంటేగూ రాజ్యాంగసంస్కరణచట్టమును గూర్చి ఆంగ్లచక్రవర్తి ప్రకటన. (డిశంబరు). వీరేశలింగంపంతులుగారి నిర్యాణము.

1920 హంటరుకమిషను రిపోర్టు. క్రొత్త శాసనసభలకు ఎన్నికలు. ఎషర్ కమిటీ (మిలిటరీ సంస్కరణలు) రిపోర్టు. శ్రీలోకమాన్యతిలకు నిర్యాణము. (జూలై 31). గాంధీగారి సహాయ నిరాకరణ ప్రారంభము.

1921 కన్నాటు ప్రభువు క్రొత్తశాసనసభలు ప్రారంభించుట. రీడింగు వైస్రాయియగుట. మాప్లా తిరుగుబాటు. ప్రిన్సు ఆఫ్ వేల్సు (ఎనిమిదవ ఎడ్వర్డు) ఇండియాకు వచ్చుట.

1922 చౌరీ చౌరా ఘోరములు; బార్డోలీ నిర్ణయములు. గాంధిమహాత్మునికి రాజద్రోహమునకు 6 సం|| శిక్ష. రంపపితూరీ. గురుఖాబాగ్ సంఘటనలు. ఐరిషుఫ్రీస్టేటుస్థాపన. ఇటలీలో ముసోలిని నియంతృత్వము.

1923 ఉప్పు పన్ను సర్టిఫై చేయబడుట. తురుష్క ప్రజాస్వామిక స్థాపన

1924 వంగరాష్ట్ర ఆర్డినెన్సు. స్వరాజ్య పార్టీ శాసనసభలందు ప్రవేశించుట. సోవియట్‌రష్యా స్థాపకుడగు లెనిన్ నిర్యాణము (జనేవరు 21)

1925 మడ్డిమను రాజ్యాంగసంస్కరణల విచారణసంఘ నివేదిక. చిత్తరంజనదాసు నిర్యాణము. శ్రీ అల్లూరి సీతారామరాజుగారి వధ.

1926 వ్యవసాయమునుగూర్చిన రాయల్‌కమిషను రిపోర్టు. కలకత్తాలో హిందూ మహమ్మదీయుల కొట్లాట. ఇర్విన్ ప్రభువు వైస్రాయియగుట.

1927 రూపాయి విలువ స్థిరపరచుచట్టము. సైమనుకమిషను నియమింపబడుట. పబ్లికు సర్వీసులనుగూర్చిన కమీషను.

1928 అఫ్గన్ అమీరగు అమానుల్లా పదచ్యుతి. భారతదేశమున సర్వపక్ష మహాసభ. సైమన్‌కమిషను బహిష్కరణము-లాఠీచార్జి-లజపతిరాయ నిర్యాణము. సోవియట్‌రష్యా పంచవర్షప్రణాళిక ప్రారంభము.

1929 ఇంగ్లాండులో లేబరు పార్టీ ప్రభుత్వము - వెడ్జివుడ్ బెన్ ఇండియా రాజ్యాంగ కార్యదర్శియగుట. అక్టోబరు 31వ తేదీన ఇర్విన్ ప్రభువు భారతదేశ రాజ్యాంగ పరిణామము అధినివేశ స్వరాజ్యమేయని ప్రకటించుట. లాహోరు కాంగ్రెస్ పూర్ణస్వాతంత్ర్య తీర్మానము.

1930 గాంధిమహాత్ముని ఉప్పు సత్యాగ్రహము; ఆర్డినెన్సుల పరిపాలనము. సైమను కమిషను రిపోర్టు. బర్మా పితూరీ. రౌండుటేబిలు కాన్ఫరెన్సు.

1931 మోతీలాల్ నెహ్రూ మరణము (ఫిబ్రవరి 6). గాంధీ ఇర్విన్ ఒడంబడిక (మార్చి 5). విల్లింగ్డన్ వైస్రాయియగుట. రెండవ రౌండు టేబిలుసభసమావేశము. ఇంగ్లాండులో లేబరు ప్రభుత్వముపోయి కన్సర్వేటివుల ప్రభుత్వము వచ్చుట. ఇంగ్లాండులో ఆర్థికక్షోభ కలుగుట.

1932 కాంగ్రెసు అణచివేయబడుట. మహాత్మా గాంధి చెరకంపబడుట. ఆర్డినెన్సుల పరిపాలన. మూడవ రౌండుటేబిలుసభ సమావేశము. గాంధి మహాత్ముని ప్రాయోపవేశము. పూనా ఒడంబడిక (సెప్టెంబరు 26) క్రిమినలు లా సవరణ (ఆర్డినెన్సుల) చట్టము.

1933 వైట్ పేపర్ ప్రకటన. జాయింటు పార్లిమెంటరీ కమిటీ విచారణ. జర్మనీలో నాజీపక్ష నాయకుడగు హిట్లరు సర్వాధికారియగుట. అనిబీసెంటు నిర్యాణము (సెప్టెంబరు 30)

1934 బీహారు భూకంపము (జనేవరి 15). రిజర్వుబ్యాంకు చట్టము.

1935 క్వెట్టా భూకంపము (మే). ఇంగ్లాండు ఇండియాల వ్యాపార ఒడంబడిక. నూతన ఇండియా రాజ్యాంగచట్టము (డిశంబరు).

1936 ఐదవజార్జి తదనంతరము ఎనిమిదవ ఎడ్వర్డు రాజగుట (జనేవరి 20) ఒరిస్సా సింధు రాష్ట్రముల ప్రారంభము. లిన్‌లిత్‌గో ప్రభువు వైస్రాయియగుట (ఏప్రిలు 18). ఎనిమిదవ ఎడ్వర్డు రాజ్యపరిత్యాగము (డిశంబరు 10). ఇటలీ అబిసీనియాను ఆక్రమించుట - హిట్లరు ఆస్ట్రియాను జేజిక్కించుకొనుట. స్పెయినులో యుద్ధము.

1937 రాష్ట్రీయ శాసనసభలకు ఎన్నికలు (ఫిబ్రవరి). ఇంటరిం మంత్రులు. కాంగ్రెసు మంత్రిత్వములు స్వీకరించుట (జూలై). ఫెడరల్ కోర్టు ప్రారంభము (డిశంబరు). చీనా జపానుయుద్ధము (జూలై).

1938 బీహారు సంయుక్తరాష్ట్రముల మంత్రుల రాజీనామా. (ఫిబ్రవరు 15.) 'రాజ్యాంగమర్యాద' ఏర్పడుట. హరిపుర కాంగ్రెసు (ఫిబ్రవరు 19)

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. 954.03 V55B    Acc. No. 28919

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 28919

Call No. 954 03 V55B

Author వెంకట రమణయ్య, బిక్కవోలు

Title భారతదేశమున (బ్రిటిష్ సామ్రాజ్య చరిత్ర)

**UNIVERSITY OF HYDERABAD**
**LIBRARY**
**HYDERABAD (A. P.)**

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**